UNIVERSAL LIBRARY
OU_204381
UNIVERSAL LIBRARY

181 T5(C1)
V28S
వరదరాజు, కట్టా
శ్రీరామాయణము. అరణ్య
కిష్కింధ కాండములు
1952

OUP—67—11-1-68—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No T81 V28S Accession No T5962

Author వరదరాజు, కటూ

Title శ్రీరామాయణము ఆరణ్యకాండము.

This book should be returned on or before the date last marked below

Vol 2 1952

MADRAS GOVERNMENT ORIENTAL SERIES

Published under the authority
of the
Government of Madras

General Editor
T CHANDRASEKHARAN M A, L T,
Curator, Government Oriental Manuscripts Library
Madras.

No. L. Vol. II.

శ్రీ రామాయణము

కట్టావరదరాజ కృతము.

(అరణ్య కిష్కింధా కాండములు)

TANJORE SARASWATI MAHAL SERIES No 62

SRI RAMAYANAMU

BY

KATTA VARADARAJU,

(ARANYA AND KISHKINDHA KANDAS)

CRITICALLY EDITED WITH INTRODUCTION

BY

Sri N. VENKATA RAO, M A,
Senior Lecturer and Head of the Telugu Department
Madras University, Madras

Published By

Sri S GOPALAN, B A, B L,
Hony Secretary, For the Administrative Committee
T M S S Mahal Library, Tanjore

Price Rs 7-0-0

Printed at the
Rathnam Press,
11, Badrian St, Madras-1

PREFACE

This publication contains the "Aranya" and "Kishkindha" Kandas of Katta Varadaraju's Dwipada Ramayanamu They are issued in continuation of our prior publication of "Bala" "Ayodhaya" Kandas issued last year We hope this publication will receive the same appreciation from the public and the press as the prior one has had

The subsequent Kandas are being printed and will soon be issued

Our thanks are due to the Editor, Sri N Venkata Rao, Head of the of Department of Telugu, University of Madras for his valuable services in editing the work and to Sri A Mahadeva Sastri and Sri V Sundara Sarma, the Telugu Pandits of our library for carefully going through the original and preparing a correct copy for the edition

We are grateful to the Government of Madras for their timely grants that have enabled us to publish this and other valuable manuscripts of this Library We must thank also the Ratnam Press, Madras, for the neatness and despatch with which they have executed the printing of this publication

3-1-1952
T M S S M Library,
Tanjore

S GOPALAN,
Honorary Secretary,
T M S S M Library Committee

పీఠిక.

మదరాసురాష్ట్రీయ ప్రభుత్వమువారి సమాదరణమునఁ బ్రథమమునఁ బ్రకటితమైన తెనుఁగు గ్రంథములలో 'వరదరాజ కృతియగు ద్విపద రామాయణము'నందలి బాల, అయోధ్యా కాండములుగల ప్రథమసంపుట మాంధ్రమహాజనులనెల్ల నాకర్షించినది. ఈ గ్రంథము తంజావూరి శ్రీ శరభోజీ సరస్వతీమహాలు గ్రంథాలయమువారి పక్షమునఁ బ్రకటితమైనది. అపూర్వాంధ్ర గ్రంథములకు పెన్నిధియగు తంజావూరిమహాలు గ్రంథాలయమువారి 'త్రిలింగకానుక''గా పత్రికలీ రామాయణభాగమును ప్రశంసించిన పరిశోధకులును పండితులును, భాషావాఙ్మయ విశారదులగు ప్రశస్తవిద్వాంసులెల్ల గ్రంథప్రకటనముఁ గొనియాడిరి.

ముందు తెలిపినట్లుగా ప్రథమసంపుటము ప్రకటితమైన తోడనే ప్రభుత్వసహాయమున నీ గ్రంథమున మిగిలిన కాండములను ముద్రించుటకుఁ బూనుకొని, తంజావూరి సరస్వతీ మహాలు గ్రంథాలయమువారు, అరణ్య కిష్కింధాకాండములొక సంపుటముగను, సుందరకాండ మొక సంపుటముగను, యుద్ధ కాండ మొక సంపుటముగను మొత్తముమీఁద నాలుగు సంపుటములుగా వెలువడఁజేయుటకు తీర్మానించిరి. వానిలో అరణ్య కాండ, కిష్కింధా కాండములుగల ద్వితీయసంపుట మిది. సుందర కాండ, యుద్ధకాండ సంపుటములు వెనువెంటనే వెలువడఁగలవు.

ప్రథమసంపుటమున పీఠికలో కవివంశవృత్తాంతము తెలుపుటచే నిందులో విడిచిపెట్టబడినది. ఈ రెండుకాండములలో గల కవితాభాషా విశేషములను మాత్రమేచూపుటకు నీ పీఠిక యావశ్యకమైనది.

ఆ మొదటి పీఠికలో నాంధ్రవిశ్వ విద్యాలయమువారు ప్రకటించిన రంగనాథ రామాయణములోని ప్రక్షిప్తభాగములకును, వరదరాజకృతిలోని భాగములకునుగల సంవాదములను చూపితిని (చూడుఁడు పుట 37) ఈభాగమునంపలి సంవాదములనునిందు చూపుచున్నాఁడను

రంగనాథరామాయణము. (అనుబంధము 1 పుట 678)

"నాయింట దాఁజనము లైదువేలు
పాయక మణిసు యాభరణముల్దాల్చి
యచ్చరలున్న వారతివ నిసేవ
కిచ్చెద నిమనసిమ్ము నాకిపుడు
విరిఁదోఁటలోఁ గల్పవృక్షంబులైదు
తరుణి! నీముడిపువ్వు దండలకిత్తు
అమరభూధర రోహణాచలమణులు
రమణి! నీకిత్తు నారతుల కేనిత్తు
ఆమీఁదకామధేన్వాధి ధేనువుల
భామిని! నీయింట పాడికేనిత్తు"

వరదరాజు రామాయణము (పుట 168.)

నాయింట దాసీజనము లైదువేలు
పాయక మణిమయాభరణముల్దాల్చి
యచ్చర సతులుగా నతివ నీ సేవ
కిచ్చెద నీమనసిమ్ము నాకపుడు
విరిదోఁటలోఁ గల్పవృక్ష పంచకము
తరుణి ! నీముడిపువ్వు దండలకిత్తు
అమరభూధర రోహణాచల మణులు
రమణి ! నీకెత్తు నారతులకేనిత్తు
ఆమీఁద కామధేన్వాది ధేనువులు
భామిని ! నీయింటి పాడి కేనిత్తు " (పంక్తి 3990-4000)

రంగనాథ రామాయణము పుట 204.

" పదియవస్థలుదోఁచి భాసిల్లుపగిది
పదితలల్ మణిజూట పంక్తులనొప్ప
నాయవస్థలగోర్కులవి యిన్మడింపఁ
బాయని గతినొప్పు బాహులిర్వదియు
పరగదివ్యాంబరాభరణైక కాంత
లరుదార

వరదరాజు రామాయణము. పుట 176

" పదియవస్థలుదోచు పగిది మస్తముల
పదియును మీఱంగఁబది యవస్థలును

౹

నినుమడించిన యట్టులిరువది చేతు
లనువుగా...............

....

దివ్యాభరణవస్త్ర దేదీప్యమాన (పంక్తి 4164-167 4175)

రంగనాథరామాయణము పుట 678

కొమ్మముప్పది రెండుకోట్ల చేరువలు
నెమ్మనం దొక్కొక్కనికి వేయివేయి
నానవబలపద్మమాత్తంబునాకు
దీనంబోగెలిచితి దేవతాధిపుల
ఆబలంబెల్ల నీయురుగుల గొలిచి
యోబాల! నిటమీఁద నుప్పొంగనేర్తు!

వరదరాజు రామాయణము (పుట 201)

కొమ్మ! ముప్పదిరెండుకోట్ల చేరువలు
నెమ్మనందొక్కొక్కనికి వేయివేయి
దానవసైన్యమాత్త బలంబునాకు
దీనిచే దేవతాధిపులగెల్చితిని
ఆబలంబెల్ల నీ యుదుగులగొలిచి
యోబాల! యిటమీఁద నుప్పొంగనేర్తు!

(పంక్తి 4798-4800)

రంగనాథ రామాయణము. (పుట 215)

హరిరాజ! కానవే హరి రాజమధ్య!
కరిరాజ! కానవే కరిరాజ గమన!

హరిణంబ కానవే హరిణాయతాక్షి

....

తిలకంబ ! కానవే తిలకాంచితాస్య

అలినీల కానవే ! యలినీలకచను

వరదరాజు రామాయణము పుట. 217

తిలకంబ ! కానవే తిలకలలాట !

నళులార ! కానరే యలినీలకచను

హరిరాజ కానవే హరిరాజమధ్య

కరివరకానవే కరివరగమన !

హరిణంబ ! కానవే హరిణాయతాక్షి ! (పంక్తి 5168 – 5174)

రంగనాథ రామాయణము (పుట 216.)

" కాకుత్స్థ ! నీవతికారుణ్యమతివి

లోకైక రక్షణలోల చిత్తుఁడవు "

వరదరాజు రామాయణము (పుట 284)

కాకుత్స్థకులదీప ! క్రమమేననేయ

కారుణ్యమూర్తివి కల్యాణనిధివి "

పైన వివరించిన సంవాదములను పరీక్షించిన, రంగనాథ రామాయణము వ్రాఁతప్రతులన్నియుఁ బరిశీలించినగాని యా గ్రంథముయొక్క నిజస్వరూపము గుర్తించుటకు వీలుకలుగదు. దానిలో పాఠభేధములను సంస్కరించుటకు వరదరాజు రామాయణము తోడ్పడును. వరదరాజునకుముందుగల ద్విపద రామాయణములలో సుప్రసిద్ధ సంకీర్తనాచార్యులగు తాళ్లపాక అన్న

మయగారి ద్విపదరామాయణము గలదు. ఈ రామాయణమును పరిష్కరించునపుడును, పైనిచూపినరీతిగా, సంవాదములను పరిశీలించినపుడును, అన్నమయ్యగారి రామాయణకృతిని పూర్తిగ గుర్తించుటకు నవకాశము కలుగునను యభిప్రాయము దృఢపడినది. పై రెండు సంవాదములలో లేనిభాగములన్నియు నన్నమయగారి కృతిలోనివేయని స్పష్టముగా నిరూపించుటకు తంజావూరి యందేకాక నామూలాగ్రముగా దేశమునం దుపలభ్యమగు రంగనాథరామాయణ ప్రతులన్నింటిని కూలంకషముగా పరిశీలింపవలసియున్నది. అట్లయిన రంగనాథరామాయణమును గూర్చిన సమస్యలుకూడ సుపరిష్కృతములగునని నాయాశయము

వరదరాజు రామాయణారణ్య కిష్కింధా కాండములను రంగనాథభాస్కర రామాయణములను పరిపోల్చిచూచిన వరదరాజెట్లు మూలమునననుసరించి కథారచనముగావించెనో తెలియంగలదు.

ఆరణ్యకాండము.

భాస్కర రామాయణము	రంగనాథ రామాయణము	వరదరాజ రామాయణము
1. రాముఁడరణ్యమును ప్రవేశించుట కలదు	రామునియత్రిమహాముని యాశ్రమ ప్రవేశము (ఇది మూలమున అయోధ్యాకాండాంతమునయున్నది.)	రాముఁడరణ్యమును ప్రవేశించుట. (మూలమున నిట్లే (యున్నది.

భాస్కర రామాయణము	రంగనాథ రామాయణము	వరదరాజ రామాయణము
2. విరాధుని తలిదండ్రుల పేర్లులేవు	జయుఁడు తండ్రి శతహ్రాద తల్లియనిగలదు	జయుఁడు తండ్రి-శతహ్రాద తల్లి (మూలమున నిట్లేయున్నది.)
3. జంబుమాలివృత్తాంతము కలదు	కలదు	(ఇందును మూలమునను లేదు)

కిష్కింధాకాండము.

1. వాలిభార్యయగు తార శ్రీరామచంద్రుని శపించినట్లు కలదు.	లేదు	లేదు (మూలములోను లేదు)
2. సంపాతి తనకుమారుఁడగు సుపార్శ్వుని జూచి లంకకుఁబోయి సీతనుకనుగొనిరమ్మని పంపుట	లేదు	లేదు (మూలమునను లేదు)
3. హనుమంతుని జన్మవృత్తాంతమునఁ గేసరి కథ గలదు.	లేదు	(మూలమునను లేదు)
4. హనుమంతుఁడు తనజనన వృత్తాంతముఁ దానే చెప్పుకొనెను.	జాంబవంతుఁడు చెప్పినట్లు గలదు.	జాంబవంతుఁడు చెప్పినట్లుగలదు. (మూలమునను నిట్లేయున్నది)

పై విభేదములను జూచిన రామాయణకథ యెట్టిమార్పు లను బొందుచుండెడిదియో తెలియఁగలదు

వరదరాజుమూలము నెట్లనుసరించినదియు తెల్పుటకు నొక్కొక్క కాండనుండి యొక్కొక్క యుదాహరణము నిచ్చు చున్నాఁడను.

ఆరణ్యకాండ. సర్గ 1. శ్లోకములు 18-20

"ధర్మపాలోజనస్యాఽస్య శరణ్యాంస్తం మహాయశాః
పూజనీయశ్చ మాన్యశ్చ రాజాదండధరోగురుః
ఇంద్రస్యైవ చతుర్భాగః ప్రజారక్షతిరాఘవ
రాజాతస్మాద్వరాన్భోగా న్భుంక్తేలోకనమస్కృతః
తేలయలభవతారక్ష్యా భవద్విషయవాసినః
నగరస్థోవనస్థోవాత్వంనో రాజాజనేశ్వర"
"రఘుపుఁడు దొరదేవ మండలికెల్ల
రఘువంశజులకెల్ల రాజువునీవు
లోకులకెల్ల నేలుటకునై నీవు
లోకంబుకు నల్లలోకేశుఁ డొకఁడు
చాలిన వారు దుర్జనుల నడంప
వాలాయమున మంచివారిఁ బోషింప
నీకెభారము మాటనిజము చెల్లింపఁ
జేకొని ధర్మమూర్జితము గావింప
న్యాయమార్గమ్మున నడవకయున్న
నాయవనీపతి నఘములువొందు
నడచినఁగీర్తి యనంతపుణ్యంబు
కడపట స్వర్గలోక సుఖంబుఁజెందు

సత్యమార్గంబున జగతిఁ బాలించు
నత్యంత ధార్మికుండైన భూపతికి
నతఁడేలు సీమలో యతివరుల్ సేయు
నతిశయ జపతపో యాగాదికముల
ఫలములనాలవపాలు ప్రాపించు
నిలయేలుపుణ్యుల కెల్లకర్మములు
శరణుఁజొచ్చితిమి మీ చరణాబ్జములకు
నెఱిఁగిప్రోవుము మాకు నెవ్వారుదిక్కు
రాక్షసబాధలు రాకుండమమ్ము
రక్షింపుకరుణాభిరామ! శ్రీరామ!

అరణ్యకాండ (పుట 20–21)

కిష్కింధాకాండ వాలివధ ఘట్టము (సర్గ. 17 శ్లో 34–46)

'రాజహాబ్రహ్మహాగోఘ్న శ్చోరప్రాణి వధేరతః
నాస్తికః పరివేత్తాచ సర్వేనిరయగామినః
ఆధార్యంచర్మమే సద్భిరోమాణ్యస్థి చ వర్జిమ్
అభక్ష్యాని చ మాంసానిత్వద్విధైర్ధర్మ చారిభిః
పంచ పంచనఖా భక్ష్యాబ్రహ్మక్షత్రేణ రాఘవ
శల్యకశ్శ్వావిధోగోధా శశఃకూర్మశ్చపంచమః
చర్మచాస్థిచమే రాజన్ నస్పృశంతి మనీషిణః
అభక్ష్యాని చ మాంసాని సోఽహంపంచనఖోహతః
త్వయానాథేన కాకుత్స్థ న సనాథావసుంధరా
ప్రమదాశీల సంపన్నా ధూర్తేన పతినాయథా
శఠోనైకృతికః క్షుద్రో మిథ్యాప్రశ్రిత మానసః
కథం దశరథే నత్వం జాతః పాపోమహాత్మనా
ఛయాదృశ్యేన తురణే హతోహందురాసదః

ప్రసు ప్తపన్నగే నై వనరః పానవళగతిః"
"క్రూరాత్మకుఁడు నాస్తికుఁడు పతితుండు
చోరుఁడు శఠుఁడు నీచుఁడు మద్యపాయి
రమణుల నావుల రాజులద్విజుల
సమయించు వాఁడు పాషండవర్తనుఁడు
గురుతల్పగమనుండు కొండీఁడు ద్రోహి
పరివేత్త యన్యాయపరుఁడు హింసకుఁడు
నిరయగాములు గాన నీకేఁటికయ్య
మీమాంస మీచర్మ మీదంతశల్య
రోమాదికంబుల రూపగుజంతు
రోయ రెవ్వరు వానరులధార్మికుండ
వీయపకీర్తి నీవేల నొంది తివి
పంచనఖంబులఁ బరగినజంతు
సంచయంబులనైదు చనుఁగాని మీకుఁ
గడమ వాటిని తినంగాదేమిఁదలఁచి
పడవేసితివి నీకు భక్ష్యంబె యేను
అంటుదురే కేలనైన వానరుల
యొంటిమాంసంబు నిన్నొకనిఁ జూచితిమి
పాపివి యన్యాయపరుఁడవల్పుఁడవు
ద్రోహివి శఠుఁడవు దుర్బుద్ధి వధమ
సాహసాత్ముఁడవు వంచకుఁడవజ్ఞుఁవు
అక్కట ! దశరథునంత రాజునకు
నొక్కటి సుతుఁడవై యీవుగల్గితివి"

(కిష్కింధాకాండ పుటలు 344-345)

పై వానినిబట్టి కొన్నిచోట్ల మూలములోని పదములనే యుపయోగించుచు, భావము నెంత విశదముగా వరదరాజు రచియించినదియు సువ్యక్తమగుచున్నది.

పూర్వకాండములందువలె నీ రెండు కాండములను వరదరాజుకవితానైపుణ్యమును విశదీకరించుచున్నవి. వర్ణనలు చేయుపట్టుల సంస్కృత సమాసములతో ననుప్రాసములతో వరదరాజు రచించును. ఇదియే తక్కిన వానికంటె యీ గ్రంథమునకు విశిష్టత చేకూర్చునవి.

మచ్చునకు - ఋష్యమూక వర్ణనము - ఆరణ్యకాండము

అవలోక మాత్ర నిరస్తశోకంబు
దివిజ భూమీదరాంతి ప్రవేశంబు
అపహృతాధ్వన్య శ్రమాతిరేకంబు
తపనేందు గణమణి స్థగితరోకంబు
అమరాపగా కృతాత్మాభిషేకంబు
యమదూత గదితనమోనువాకంబు
సారసినీ చరచ్చక్ర వాకంబు
తీరవనీ సముత్తీర్ణ పైకంబు
కందరాంతర వికంకట వనోకంబు
సందీప్తశృంగాను షంగినాకంబు
వేలాచరిష్ణు గంధేభ సాకంబు
తాలాది రసముత్కట వనీకంబు
ఋషికన్యకాకలావృత ప్రలాకంబు
విషయులోలాసరద్విషదభీకంబు
వాలిసంప్రాప్త భావవ్యలీకంబు

కాలాచరిత మోనిగణవరాకంబు
ప్రతిపన్నయతి పుణ్యఫలవిపాకంబు
శ్రుత ఋష్యనీకంబు ఋష్యమూకంబు
(పుట 271 పంక్తులు 6460-6479)

అట్లే కాసారవర్ణనము చూడుఁడు (31 పుట 700-710 పంక్తులు)

వాలివర్ణనము :—కిష్కింధాకాండము

రావణగర్వ నిర్వాపణశాలి
భావజాహిత పాదపద్మముదాళి
ఖరకరాత్మజ దర్పగహనోగ్రకేళి
గిరిచరవీరాగ్ర కీర్తనశీలి
తారాహృదంబుజాతనవీనహేళి
చారువిభూషణ సౌవర్ణమాలి
యమితశౌర్యనిరస్త హర్యక్షకేళి
సముదగ్ర బలజిత సామజపాళి
కనక ఘంటాసముత్కర భీమువాలి
యనుదిన విదితదేవాళి యవ్వాలి
(పుట 316. 976-986 పంక్తులు)

రసభావవిన్యాసమునకు ద్విపద మిక్కిలియనుకూలమగుట చేత వరదరాజు కరుణరసము ను, చక్కగా నావిష్కరించినాఁడు, శ్రీరాముఁడు సీతనుగానక ముల్లోకమును భస్మముచేయుటకు విల్లంది యామెను తానువిడిచిపెట్టినరీతిగా వర్ణివాసి తలుగ కుండ దెచ్చెదనని చెప్పిన ఘట్టము.

"పోయినఁద్రుంతునే భువనంబులెల్ల
నూరక తెచ్చిన నొప్పుకొనంగ

నేఱతునే ధరణీతనూభవను
ముడిచినపువ్వులు ముడిచిన మీఱ
తొడిగిన సొమ్ములు తొడిగిన కరణిఁ
గట్టినవస్త్రంబుఁ గట్టినయట్లు
పెట్టినతిలకంబు పెట్టినమాడ్కి
వేసినకీల్గంటు వేసినజాడ
చేసినవీడెంబు చేసినపోల్కి
నవ్వినసెమ్మోము నవ్వినరీతి
జవ్వని దెచ్చియుంచక మాననిపుడు

(232 పుట. 5525 5536)

శ్రీరాముఁడు పర్ణశాలయందు సీతనుగానక విలపించు ఘట్టమంతయు (216-221పుటలు) కరుణరసప్లుతమై యలరారుచున్నది.

కిష్కింధాకాండమున శ్రీరాముని విరహవేదనయందు శృంగారకరుణ రసప్రాచుర్యము గన్పట్టుచున్నది.

కన్నులనెఱిగించు కలయింగితంబు
చిన్నినవ్వులఁదెల్పు చిత్తాభిమతము
సిబ్బితిచేఁజూపు శీలగౌరవము
గబ్బిచన్నులనెఱుఁగంగఁ జేయువలపు
యలిగినేరగయుండదవలి మోమిడదు
తలపఁదెవ్వారిని చింతకులోనుగాదు
ఏనుగాసిలియున్న యెఱిగిహితోక్తి
దానూరడించి సంతాపంబుఁదీర్చు

నడవి యయోధ్యగా నన్నింటిమాటు
పడఁతిదానయినిల్చి పరితుష్టుఁజేయు
తలంచినట్లమెలంగు తనమదిడాప
దలయికఁ జూపదేమనివ సైరించు
నగుమోముతోఁజేరి నాచెంతనిలిచి
తగినమాత్రంబె మెత్తనిమాటలాడు
నట్టిసీతకుఁ బాయునట్టినన్నీవు
చుట్టుకఁదిరిగివే సుఖముఁ గాంచెదవు"
(282-88 పుటలు 182-198 పంక్తులు.)

పై సందర్భములను రంగనాథ రామాయణమున నాయా స్థలములలో సరిచూచిన వరదరాజు ప్రత్యేకరచనాసామర్థ్యము విశదమగును.

వ్యాకరణ విశేషములు

1. చేయుదును అనుటకు "చేతు" అని ప్రయోగించుట.
2. సరస్సునకు సరంబని ప్రయుక్తము.
   "మునియున్న యాసరంబునఁ బ్రవేశించి"
3. మణశబ్దము ఈకారాంతముగాఁ బ్రయోగము
   నీటిలో నొక్కమణిమయంబైన
4. అందుక చుట్టుక - మొదలగు ప్రయోగములు
5. క్త్వార్థకసంధి - వడఁకటునిటు - వడఁకి అటునిటు
6. బొక్కసమిండ్లు - బొక్కసపుటిండ్లనుటకు - (పుట 151)
7. కర్మమునకు కర్మువు అను ప్రయోగము - (పుట 293)
   పుట్టువును కాలమును కర్మువును

— ఛందో విశేషములు :—

యతులు

1. " నట్టడవినిఁ జిక్కినాఁడు నాచేత " ఇచ్చటహల్లునకు యతి శ్రీనాథుఁడు నైషధముననిట్లే " నముచిదమనుండు పుత్తెంచినాడు" అనిప్రయోగించినాఁడు ఇట్లే 'నారచీరలు గట్టినారు " అని మఱియొకప్రయోగ మిందేకలదు.
2. " రామచంద్ర ! వివేకురాలుమాతార." (పుట 344) ఇచట హల్లునకు యతి. చిన్నయసూరి సూత్రము ననుసరించిన నచ్చునకేయతి.
3 " ఒక్కొకటనదులు నవోఢలోయనఁగ " నవోఢ శబ్దములో స్వరయతి. (పుట 396)
4. " ఉండకదిగువం గూర్చుండివివేక " దేశ్యధాతువుల ప్రత్యయములకు స్వరయతి వీనికి వ్యంజనయతి నిర్దిష్టము (పుట 421)
5. "క్రూరకర్ముఁడు కృతజ్ఞుఁడసత్యపరుఁడు" (పుట 439) ఇచట క్రూ - జ్ఞ, అనునది విశేషయతి యని యప్పకవి. కాని యిట్టియతు లప్పకవికి ముందుగలవు.

అ. కర్మమధర్మ మజ్ఞానమాగడము, (పండితారాధ్యచరిత్ర)

ఆ. జ్ఞానికినుపదేశ విధిప్రకాశము సేయన్ (భారతముతిక్కన)

ఇ. జ్ఞానమునం గడవ మిగులఁ గల్మష మొందున్ (ప్రౌఢకవి మల్లన)

ఈ ఘ్యము . ... ..మిల భవదాజ్ఞాశక్తి (యథావాక్కుల యన్నమయ్య సర్వేశ్వరశతకము)

శబ్దవిశేషములు

1. కమలాకరము - సముద్రము

" ఇక్కమలాకరంబెంత దాఁటుటకు "

2. కమలధి – సముద్రము (పుట 519)

" ఇక్కమలధి దాఁటనెవ్వఁడున్నాఁడు. "

3. ఇనుఁడు – రాజు (పుట 523)

" ఏముకొల్చిన వారమినుఁడవు నీవు "

4 ఒడలు రూపాంతరము ఒళ్లు. (పుట 146)

5. గరువించుట– గర్వించుటయొక్క రూపాంతరము(పుట 195)

6. కర్మచండాలుఁడు పుట్టుకచేగాక పనులచేతచండాలుండైన వాఁడు (పుట 206)

7. చాడె – జడలేకకొప్పు. (పుట 228) (చన్నులవ్రేగున చాడె వ్రేగునను) అష్టమహిషీ కల్యాణము.

8 వైడూర్యము–వైడూర్యముయొక్క రూపాంతరము(పుట276)

వైడూర్యము – చూడ – ప్రాగ

9. కుపసము – కుప్పసము రూపాంతరము. (పుట 290)

10. విగ్రహించు – ఎదిరించు. (పుట 313) చూడుఁడు " శ్రీనాథుఁడు నైషధము." వేయికన్నులవానితో విగ్రహించి – వనిత ! యింకేమికానున్న వాఁడో మరుఁడు

11. దీవెన – దీవన రూపాంతరము (పుట 368)

" వీఁడె యంగదుఁడు దీవెనలిమ్ము "

12. విగణించు – పరిగణించు. ఉపసర్గవిశేషము. (పుట 378)

13. దిడ్లు – పల్లకీమీఁదపఱచెడు ముతుకగుడ్డలు. (పుట 386)

14. వరుషము – వర్షమునకు రూపాంతరము. (పుట 386)

ఆవరుషగుతు సమాగమంబునకు

15. ధనంజయుఁడు–అగ్ని– బూదినిండిన ధనంజయుఁడు(పుట390)

16 ఘర్మకరుఁడు – సూర్యుఁడు (పుట 391)

ఆఘర్మకరుఁడు దానాకాశమంది

17. హల్లోహలము. అల్లకల్లోలము. (పుట 316)

హల్లోహలంబుగా నట్టహాసంబు

(ఈ శబ్దమునుగూర్చి నేనురచించిన భాషాపరిశోధన ప్రయోగవిశేషములు. అనుగ్రంథము చూడఁదగును)

18. అవివేకపడు - అజ్ఞానము కలిగి (పుట 32/)

19. క్రమియించుట - గడచుట (పుట 471)

20. హనుమచ్ఛబ్దమునకు హనూమంతుఁడు అని రూపాంతరము నుడివినయట్ల హనూమంతుచేత (పుట 478)

జాతీయములు

1. ఆహిరిఁబాడిన యనువుగా నేడ్చి. (పుట 358)

చూడుఁడు'' రాజీవాననయేడ్చె ..కాంభోజి మేళవించికా రవ సుధాపూరంబు తోరంబుగాన్.'' వసు

2. చేతగాదనివాని చెవి మీలి పెట్ట ప్రోతు మే. (పుట 523)

3. సామజోత్తియము దీర్చఁగనై నపనిక (పుట 524)

నోమలుపూని పొందున కార్యసిద్ధి'' చూడుఁడు. సామజము చెఱకు మీసిన దోమలుపదివేలుచేరి తోమంగలవా? అడిదము సూరకవి చాటువు.

4. తద్దినములు పెట్టుట (పుట 87)

దైతేయులిద్దఱు తమపితరులకు తద్దినమ్ములు పెట్టుతలంపు

5 విడెములందుక రాజులు వెడలుట. వీరతాంబూలములు పుచ్చుకొని యుద్ధమునకు వెడలుట. (పుట 72)

6 గడితానెము - తానెము సలాము చేయుట.

గుజ్జరికేడము మున్నగు విజయనగరరాజ్య పారిభాషికములు.

అరణ్యకాండమున 6518 ద్విపదపంక్తులును, కిష్కింధా కాండమున 6248 మొత్తముమీఁద 12766 పంక్తులీ రామాయణ భాగమునగలవు మొదటి రెండు కాండములందువలె నిందలి రచనయు సరళమై, హృద్యమై, సర్వజనసులభ గ్రాహ్యమైయున్నది. మొదటి సంపుటము వలెనే యీ సంపుటమును నాంధ్రమహాజను లాదరించి, రామాయణ పఠనమువలన కృతార్థతఁ జెందెదరు గావుత.

ఈ రసవంతమైన ద్విపద వాఙ్మయమును ఆంధ్రలోకమునకు సమర్పించు పట్ల సానుభూతి చూపిన మద్రాసు ప్రభుత్వమువారికి ఆంధ్రలోకము కృతజ్ఞతా బద్ధమగుటలో వెనుకంజ వేయదు.

ఈ మహాగ్రంథమంతటికి సంపాదకునిగా నన్ను నియమించిన మదరాసు రాష్ట్రీయప్రభుత్వము వారికి, దీనికనుమతినొసగిన మదరాసు విశ్వవిద్యాలయమువారికి నామనఃపూర్వక కృతజ్ఞతా వందనములు. తంజావూరి గ్రంథాలయ గౌరవకార్యదర్శులు శ్రీ యస్. గోపాలన్‌గారికి నిరంతరస్మరణీయ ప్రణామాంజలు. ఈ గ్రంథము నామూలాగ్రమున ముద్రణదోషములను సవరించి, నాకు చేదోడు వాదోడుగానుండిన, చిరంజీవి శివ సుందరేశ్వర రావునకు నాయాశీస్సులు.

ఇతి శివమ్

ఖర సంవత్సర
మహాసంక్రాంతి
14-1-52

నిడుదవోలు వేంకటరావు
విద్యారత్న, శాస్త్రోపాధ్యాయ
మదరాసు విశ్వవిద్యాలయాంధ్ర
భాషాశాఖాధ్యక్షుఁడు.

తప్పొప్పుల పట్టిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
5	105	గద	గదల
10	220	మెచ్చఁగ కడ	మెచ్చఁగఁగడ
14	310	కృతుల	కృతులు
,,	315	యితడి	యితఁడి
15	323	తోఁడ	తోడ
,,	329	రాముడా	రాముఁడా
,,	334	నౌరత్త	నోరత్త
17	378	మీాఱు – యిదియె	మీాఱ – విదియె
22	510	కోసమ	బోసమ
23	525	మెలంగుడి	మెలంగుఁడి
40	932	చెచ్చవి	నెచ్చలి
44	1024	మక్షితం	రక్షితం
46	1071	మాతో	మాంతో
54	1262	ఫుల్లా	ఘుల్లా
55	1281	జటాయూవు	జటాయువు
,,	1290	దర్భ	దర్భల
63	1486	నంచ	చంచ
66	1547	దానిపై	దాసిపై
77	1807	బండ్లు	కండ్లు
102	2393	కింద్రుడి	కింద్రుఁడి
105	2477	దుఁదిగి	దుదిగి
112	2624	ఝుల్లవి	ఝుల్లని

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
195	సంఖ్య	3650	4650
210	5005	నుండయిప్పుడు	నుండనిప్పుడు
,,	5010	లంకెలి	నంకెలి
211	5020	యీడేర్చు	నీడేర్చు
,,	5029	యాప్రాణ	నాప్రాణ
,,	5030	నాప్రాణ	యాప్రాణ
,,	5031	నకుతోడునీడ	నకుం దోడునీడ
212	5057	యీమేని	నీమేని
,,	5058	యేమేని	నేమేమి
,,	5063	లక్కటా	నక్కటా
213	5066	యేమని	నేమని
,,	5068	మీఁద కడు	మీఁదఁ గడు
,,	5085	ఏమి	నేమి
214	5101	ఉన్న	నున్న
222	5299	యే తేపఁ	నే తేపఁ
,,	5300	సిట్లాంటి	యిట్లాంటి
223	5321	గొబ్బున	గొబ్బున
227	5422	బోఎపువ్వు	బోవఁ బువ్వు
231	5515	జేఁతు	జేతు
240	5734	టచ్చెరివు	ఓచ్చెరువు
243	5791	రథము యిదె	రథము నిదె
,,	5792	ములు	గములు
244	5810	రెండుయిల	రెండునిల
245	5850	హేతువుచెత	హేతువుచేత

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
,,	5853	స్నానంబు	స్నానంబు
248	5928	తెల్లిని	తెల్లని
249	5953	యాస	నాస
250	5967	వత్సలతను	వత్సలత
,,	5974	గారణంబుగ	కారణంబుగ
251	5086	తరుగుచునుండ	తిరుగుచునుండ
,,	5998	గుజగుజ లేల	గుజగుజలేల
,,	6003	అన తెల్విఁ	అనఁ దెల్విఁ
252	6028	యజ్జనకుని	మజ్జనకుని
253	6045	మూరిట్లు	మీరిట్లు
255	6091	యిక్కడ	నిక్కడ
256	6114	వారవ్వరు	వారెవ్వరు
257	6141	పేర్చియామూఁద	పెర్చియామీఁద
259	6194	ఐమతులెందరినైన	విమతులెందఱినైన
,,	6198	యినసూనుఁడు	నినసూనుఁడు
		నెఱుంగుయిల	నెఱుంగునిల
261	6285	వొక	ఒక
263	6270	బుష్పికా	బుష్పితా
264	6297	ఋంతకగాచల	మతంగాచల
,,	6315	బడయుండ	బడియుండ
267	6870	కొంచెదము	నెంచెదము
269	6408	జేరుచున్నవ విని	జేరుచునున్నవ
		యొంత	వనినెంత
270	6429	నొక్క	యొక్క

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
270	6434	మహేంద్రమహావళుల	మహేంద్రమహావళులు

కిష్కింధాకాండము

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
284	214	సాధింపగా	సాధింపఁగా
285	250	తనుగాచి	తనుఁగాచి
288	322	జూపట్టుయే	జూపట్టునే
289	331	పదములుకంద	పదములుగంద
,,	345	లేటికి	లేఁటికి
303	660	నముల దొరగు	నములఁదొరగు
306	752	డీతండు	డీతండు.
307	757	దొరక	ొరంగ
,,	780	చుట్టు	మట్టు
308	787	గాపున	గావున
,,	793	సతని	సతని
312	876	రమున	రమున
326	1229	చనినతల	చనినఁదల
,,	1231	దలపుచు	దలఁపుచు
328	1273	ననుచుతల	ననుచుఁదల
,,	,,	పారి	పాటి
,,	1275	ముమ్మ్యాటు	ముమ్మ్రాటు
331	1359	కర	శర
332	1384	నేదప్పు	నేఁదప్పు
333	1400	కొండంముతో	కొండలముతో

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
336	1463	సాదు	సాకు
338	1524	తలంచుసే	తలఁచునే
340	1576	సరవోర	సరివోర
342	1618	ఘుపుని	ఘువుని
,,	1620	టయు	టయుఁ
348	1770	మెఱుఁగగ	మెఱుఁగఁగ
350	1814	వనిమృగ	వనీమృగ
,,	1816	ఒఱవ కరుణ	బఱవఁగిరుణ
352	1863	కులంగిడుసు	కలంగుదును
,,	1868	నీకీలు	నీకేలు
353	1881	జాల	జాలఁ
357	1990	ప ఁ మొదలి	పై మొదలి
361	2092	సచ్ఛత్రుఁడ	సచ్ఛరిత్రుఁడ
362	2095	అల్లనవిచి	అల్లనవిచ్చి
,,	2112	కన్నట్ట	గన్నట్టి
363	2119	దప్ప	దప్పక
367	2231	రెక్కల	తెక్కల
369	2263	నంగంబు	నగంబు
371	2320	చూాత	భూతి
378	2475	బోఫ	బోధన
,,	2478	కానాధీ	నానాధీ
380	2535	నన	దన
381	2550	యించున	యించు
383	2595	బిలా	నీబిలా
388	2718	ఇచ్చట	నిచ్చట
393	2827	సింధురరీతి	సింధురమురీతి
401	3029	దీర్పనీ	దీర్పని

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
,,	3041	అతని	నతని
408	3183	రెక్కల	తెక్కల
411	3258	నట్లు	నట్టు
,,	3259	అరఁగ	లారఁగ
412	3287	ఊరక	నూరక
414	3374	సున్న	నున్న
432	3766	టయు	టయుఁ
,,	3767	కట్టెదుర	గట్టెదుర
445	39[illegible]7	వ్యారలు	వారలు
446	4597	ని తెలుఁగు	నిత్తెలుఁగు
469	4651	బంవుట	బంపుట
470	4695	యీాముద్దు	నీముద్దు
472	4723	గాఁగ	గాఁగ
474	4774	దీరునే	దీఱునే
476	4823	డెప్పుడు	ఎప్పుడు
,,	4824	సబయ్యె	సంబయ్యె
477	4849	ఎచ్చటి	ఎక్కడి
479	4900	జినుల	జనులఁ
480	4934	వాటి	పాటి
482	4973	లరేణు	లవేణు
496	5313	నోడ	నోడఁ
,,	5319	నాధిందు	సాధించు
514	5760	రాజ్యంటు	రాజ్యంబుఁ
519	5862	ధిశక్తి	ధీశక్తి

విషయానుక్రమణిక

ఆరణ్యకాండము

విషయములు	పుట
ఇష్టదేవతాస్తుతి	1
శ్రీరాముఁడు మునుల యాశ్రమముఁ జూచుట	,,
మునులకు శ్రీరాముఁ డభయప్రదానముఁ గావించుట	2
రాముఁడు విరాధునిఁ జూచుట	3
విరాధరామ సంభాషణము	7
రాముఁడు విరాధునితో యుద్ధముఁ జేయుట	8
విరాధుని శాపకథనము	11
శ్రీరాముఁడు శరభంగమౌని యాశ్రమముఁ జేరుట	13
రాముఁడు శరభంగుని దర్శించుట	15
శరభంగుఁ డగ్నిప్రవేశము చేసి బ్రహ్మలోకమున కరుగుట	17
దండకారణ్యములోని మునులకు శ్రీరాముఁ డభయదానమిచ్చుట	18
సుతీక్ష్ణాశ్రమ ప్రవేశము	22
శ్రీరాముఁడు మునులయాశ్రమముం జూడఁ బ్రయాణమగుట	24
సీత రామునితో రాక్షసులఁ జంపఁగూడదని మనవిచేయుట	25
సీతకు శ్రీరాముఁడు సమాధానముఁ జెప్పుట	29
పంచాప్సరసల సరోవర వృత్తాంతము	30
శ్రీరాముఁడు మరల సుతీక్ష్ణాశ్రమమునకు వచ్చుట	34
శ్రీరాముఁ డగస్త్యభ్రాతయాశ్రమమునకు వచ్చుట	36
అగస్త్యముని, వాతాపి యిల్వలులను జంపిన కథ	,,
అగస్త్యాశ్రమవర్ణనము	38
అగస్త్యమహర్షి మహిమాభివర్ణనము	39
శ్రీరామాగస్త్యుల సమావేశము	41
అగస్త్యమహర్షి శ్రీరామునకు వైష్ణవకోదండ తూణీరముల నిచ్చుట	44

విషయములు	పుట
అగస్త్యుఁడు గోదావరీతీరస్థపంచవటిం గూర్చి చెప్పుట	46
జటాయు సందర్శనము	47
జటాయువు వంశాను కథనము	48
జటాయుతో సహ శ్రీరామసీతా లక్ష్మణుల పంచవటీ ప్రవేశము	52
సౌమిత్రి పర్ణశాలను నిర్మించుట	55
హేమంతర్తు వర్ణనము	57
శూర్పణఖ పంచవటికి వచ్చుట	61
కాముకురాలైన సూర్పణఖ శ్రీరామునితో మాటలాడుట	62
రామశూర్పణఖ సంవాదము	64
శ్రీరామునిచేఁ దిరస్కృతయై శూర్పణఖ సౌమిత్రిని సమీపించుట	65
లక్ష్మణుండు సూర్పణఖ ముక్కు చెవులు గోసిపంపుట	67
ఖరుని ముందర శూర్పణఖ తన భంగపాటును చెప్పి రోదనము చేయుట	69
ఖరుఁడు పదునల్వురు రాక్షసులను శ్రీరామలక్ష్మణులపైఁ బంపుట	71
రాముఁడు రాక్షసులను సంహరించుట	73
శూర్పణఖ ఖరుని యెత్తిపొడిచి రోషమెక్కించుట	75
ఖరుని రణప్రస్థానము	76
ఖరుఁ డపశకునములఁ గాంచుట	78
ఖరాసురుని దంభోక్తులు	79
శ్రీరాముఁడు సీతను గాపాడు భారము లక్ష్మణున కప్పగించి యుద్ధసన్నద్ధుఁడగుట	81
శ్రీరాముఁడు పరాక్రమముఁజూపుచు ఖరుని సేనలతోఁ బోరుట	82
శ్రీరాముఁడు గాంధర్వాస్త్రమున రాక్షసులను గునుముట	87
దూషణ వధ	88
శ్రీరామ బాణములకు ఖరుని పన్నిద్దరు మంత్రులు బలియగుట	89
త్రిశిర సంహారము	90
ఖరాసురుఁడు రామునితో యుద్ధము చేయుట	93
రాముఁడు ఖరుని రథాది పరికరములఁ గూల్చుట	94
రాముఁడు ఖరునితోఁ జతురోక్తులఁ బరుషములాడుట	96
ఖరాసురుఁడు రామపురుషోక్తులకుఁ బ్రతివచనములు పలుకుట	98
ఖరుఁడు రామునిపై గదను బ్రయోగించుట	99

విషయములు	పుట
రాముఁడు ఖరుని జంపుట	101
దేవతలు శ్రీరాముని గీర్తించి పుష్పవృష్టిఁ గురియించుట	102
అకంపనుఁడు రావణుని సముఖమందు లంకలో శ్రీరామపరాక్రమ ముగ్గడించుట	104
అకంపనుఁడు రావణునితో రామునిగెల్వ నుపాయము సీత నపహరించుటయే యని చెప్పుట	108
శ్రీరామునిపైఁ బగఁ దీర్చుకొనుటకై రావణుని దండకారణ్య ప్రస్థానము	110
మారీచుని హితోక్తులు	112
రావణునియెదుట శూర్పణఖ ప్రలాపించుట	114
శూర్పణఖ రావణుని నీతిరాహిత్యము నధిక్షేపించుట	117
శూర్పణక శ్రీరామాదుల సౌందర్య పరాక్రమములు వర్ణించి, సీత నపహరించి, పగసాధింప బుద్ధిచెప్పుట	121
రావణుని ద్వితీయ దండకావన ప్రస్థానము	124
రావణుఁడు మారీచుని సంధించుట	127
రావణుఁడు సీతాపహరణమునకు మారీచునిసహాయముఁ గోరుట	128
మారీచుఁడీయకార్య కరణమందుండి రావణుని మఱల్పఁ బ్రయత్నించుట	130
పూర్వము శ్రీరామునిచేఁ దనకుఁగలిగిన భంగపాటును మారీచుఁడు రావణునకుఁ జెప్పుట	138
రావణుఁడు మారీచుని హితోక్తులకుఁ జెవిపెట్టి సీతాపహరణములో సహాయముచేయనిచో వానికిఁ దనచేఁ జావు సిద్ధమనిచెప్పుట	139
రావణుని మూర్ఖత్వమునకుఁ జింతించి మారీచుఁడు మఱల హితోపదేశముఁ జేయుట	142
రావణునితోఁ గూడిపోయి మారీచుఁడు మాయామృగమగుట	145
మారీచుఁడు బంగారు లేడి రూపమును ధరించుట	146
బంగారులేడి మారీచుని మాయయని శ్రీరామునితో లక్ష్మణుఁడు చెప్పుట	148
శ్రీరాముఁడు బంగారులేడిని పట్టుటకు బయలుదేరి దానినిఁజంపుట	152
ఆర్తనాదము విన్నసీత లక్ష్మణుని శ్రీరాముని సహాయమునకై వెళ్లుమనిచెప్పుట	154

విషయములు	పుట
సీతాదేవి లక్ష్మణునితోఁ బరుషోక్తులాడుట	157
సీతయొక్క దూషణవాక్యములు వినలేక లక్ష్మణుఁడామెనువిడిచి బయలుదేరుట	158
రావణుఁడు సన్యాసివేషమునఁ బర్ణశాలకరుదెంచుట	161
సీత తనవృత్తాంతమును రావణునికిఁ జెప్పుట	166
రావణుఁడు సీతకుఁ దన నిజరూపమును గనఁబఱచుట ; సీత దూషించుట	171
సీతాపహరణము	175
జటాయువు రావణు నడ్డి హితోపదేశముఁ జేయుట	180
జటాయువు రావణునితోఁ బోర నేలఁగూలుట	184
రావణుఁడు సీత నెత్తుకొని పోవుచుండ నామె యాభరణములు కొన్ని క్రిందఁ బడుట	192
సీత రావణుఁడుచేసిన పనికి నిందించుట	195
సీత తన యాభరణములు కొంగులో ముడిచి వానరులవద్ద విసరివైచుట	197
రావణుఁడు సీతకుఁ దనవైభవముఁ జూపుట	201
సీత రావణుని నిందించుట - సీతను రావణుఁ డశోకవనమున నుంచుట	205
రాముఁడు మారీచుని జంపి వచ్చుచు దుశ్శకునములఁ గాంచి వగచుట	209
రాముఁడు సీతనుగానక విలపించుట	210
రాముఁడు లక్ష్మణు నిరాకరుఁ గారణమడుగుట - లక్ష్మణుఁ డాసంగతి రామున కెఱింగించుట	213
పర్ణశాలయందు సీతలేకుండుటఁజూచి రాముఁడు దుఃఖించుట	216
లక్ష్మణుఁడు శ్రీరాము నోదార్చుట	221
రాముఁడు మఱల సీతనుగూర్చి విలపించుట	222
రామలక్ష్మణులు సీతను వెదకుచు త్రోవలో గుర్తులచే నెవరిచేతనో కొనిపోఁబడెనని యెఱుంగుట	226
సీత నెవ్వఁడో పురుషుఁ డెత్తుకొనిపోయెనని రాముఁడు సకల జగత్తుపైఁ గోపముఁ బూనుట	230
లక్ష్మణుఁడు రాముని శాంతింపఁజేయుట	233
లక్ష్మణుఁడు రామునకుఁ గర్తవ్యముం దెల్పుట	235
రామలక్ష్మణులు సీతను వెదకుచు జటాయువుంజూచి సీత వృత్తాంత మెఱుంగుట	239

విషయములు	పుట
జటాయు మరణము-శ్రీరాముఁ డాతని కగ్నిసంస్కారాదులు చేయుట	244
లక్ష్మణుఁ డయోముఖిని విరూపనుగాఁ జేయుట	246
కబంధ దర్శనము	248
రామలక్ష్మణులు కబంధుని హస్తములను ఖండించుట	251
కబంధుని పూర్వ వృత్తాంతము	252
కబంధుఁడు నిజరూపమునుబొంది తగిన మిత్రుని రామునికిఁ జెప్పుట	258
కబంధుఁడు శ్రీరామునికిఁ ద్రోవచూపి పోవుట	260
రామలక్ష్మణులు శబరిని చూడఁబోవుట	265
రామలక్ష్మణులు పంపాసరస్సునకుఁ బోవుట	269

కిష్కింధాకాండము

శ్రీరాముఁడు వసంతాగమశోభితమైన పంపాసరస్తీరమునుగాంచి సీతావియోగభరమును తాళఁజాలక లక్ష్మణునితోఁ దత్తీరవర్ణనఁ గావించి ప్రలాపించుట	275
ధనుర్బాణులగు శ్రీరామలక్ష్మణులఁగాంచి వాలిపంపినవారలుగా సుగ్రీవుఁడు చింతించి భీతిల్లుట, హనుమంతుఁడు సయుక్తికముగా దాని సంశయమును నివారించుట	285
హనుమంతుఁడు బ్రహ్మచారిరూపము దాల్చి రామలక్ష్మణులను సందర్శించుట	288
రామలక్ష్మణుల పంపాసరోవర ప్రాంతాగమన కారణమును విని హనుమంతుఁడు వారలను సుగ్రీవునియొద్దకుఁ గొనిపోవుట	293
శ్రీరామసుగ్రీవుల సమావేశము	297
సుగ్రీవుని సీతాన్వేషణ ప్రతిజ్ఞ - పాఱవేయఁబడిన సీతయొక్క యాభరణముల నాతఁడు శ్రీరామునకుఁ జూపుట	299
స్నేహితుఁడైన సుగ్రీవునికి శ్రీరాముఁడు వాలిని వధించెదనని ప్రతిజ్ఞఁ జేయుట	301
శ్రీరాముడు వాలిని వధించుటకు సుగ్రీవుఁడు ప్రోత్సహించుట	304
సుగ్రీవుఁడు వాలితోఁ దనకుఁగల్గిన వైరకారణముఁ జెప్పుట	308
శత్రువిజయానంతరము మఱలి వచ్చినవాలి, సుగ్రీవుని ద్రోహిగాఁ దలంచి రాజ్యమునుండి వెడలఁగొట్టుట	310

విషయములు	పుట
సుగ్రీవుఁడు వాలి పరాక్రమమును వర్ణించిచెప్పుట	314
శ్రీరాముఁడు సప్తతాళములను భేదించుట	321
శ్రీరాముని నిజశక్తి ప్రదర్శనము మెచ్చి సుగ్రీవుఁడు వాలిపై యుద్ధమునకు విడలుట	323
వాలి సుగ్రీవుల మొదటియుద్ధము	324
సుగ్రీవుని ద్వితీయరణ ప్రస్థానము సప్తజనాశ్రమ మహిమానువర్ణనము	329
వాలియుద్ధమునకుఁ బోవ ప్రయత్నింపఁ దారహితము చెప్పుట	334
వాలి రెండవమాఱు యుద్ధమునకు వెడలుట	339
శ్రీరాముఁడు వాలిని చెట్టుచాటునుండి బాణముతోఁ గొట్టుట	341
శ్రీరాముని బాణప్రయోగమునకు వాలి పరుషోక్తులాడుట	342
శ్రీరాముఁడు వాలికి ప్రత్యుత్తరమిచ్చుట	347
వాలితనమాటలకు పశ్చాత్తాపపడి శ్రీరాముని క్షమింపుమని ప్రార్థించుట	351
వాలి తనకర్తవ్యము రామునకుఁ దెల్పి పరలోకమునకేఁగు స్థితిలోనుండుట	353
రామబాణహతుఁడైన వాలి యవస్థగని తార విలపించుట	354
హనుమంతుఁడు తారనోదార్చుట - ముందుచేయఁగల కార్యములు తెలుపుట	359
హనుమంతునకు తార ప్రత్యుత్తరమిచ్చుట	361
మరణోన్ముఖుఁడైనవాలి తన కుమారుఁడైన యంగదుని, తన భార్య తారను సుగ్రీవుని కప్పగించి మృతిఁ జెందుట	362
వానరులు తారాసహితముగ వాలిమృతికై శోకించుట	365
వాలితేజము సూర్యమండలముఁ జొచ్చుట	368
తనయన్న వాలిమృతికై సుగ్రీవుఁడు శోకించుచుఁ దనకు రాజ్యమక్కఱలేదని విరక్తుఁడగుట	370
వానరులు తారను రామునియొద్దఁ దీసికొనివచ్చుట	374
తార రామునితో సంభాషించుట - తనభర్తతోఁగూడ దనుఁగూడఁ జంపుమని ప్రార్థించుట	375
శ్రీరాముఁడు ప్రత్యుత్తరమిచ్చి తారయొక్క కర్తవ్యముఁ దెలుపుట	377
శ్రీరాముఁడు తారకుఁ దత్త్వబోధనుగావించి వాలి యగ్ని సంస్కారమునకుఁ బ్రోత్సహించుట	378
వాలికి నగ్ని సంస్కారము	379

విషయములు	పుట
ఆంజనేయుఁడు శ్రీరాముని కిష్కింధకు రమ్మని ప్రార్థించుట	381
శ్రీరాముఁ డందుల కియ్యకొనకుండుట సుగ్రీవపట్టాభిషేకమున కనుజ్ఞ యిచ్చుట	383
సుగ్రీవుని పట్టాభిషేక మహోత్సవము	384
రామలక్ష్మణులు గుహయందు నివాసముచేయుట	386
గుహావర్ణనము. రాముఁడు సీతకై విరహము నొందుట	387
లక్ష్మణుఁడు శ్రీరామునికిఁ గర్తవ్యముఁ దెలుపుట	389
వర్షఋతు వర్ణనము	391
రామకార్యము చేయఁదగునని హనుమంతుఁడు సుగ్రీవునితోఁ జెప్పుట	400
సుగ్రీవుఁడు హనుమంతుఁడు చెప్పినప్రకారము సీతనువెదకుటకు నీలునికాజ్ఞాపించుట	403
శరదృతు సమాగమము - రాముఁడు సీతావియోగమునకై దుఃఖించుట	404
లక్ష్మణుఁడు శ్రీరామునోదార్చుటకు మాటలాడుట	405
శ్రీరాముని ప్రత్యుత్తరము - శరదృతు వర్ణనము	407
శ్రీరాముఁడు లక్ష్మణునితో సుగ్రీవుఁడు తమకార్యము మఱచి నాఁడని తెలిపి, కిష్కింధకుఁబోయి యాతనికి చెప్పవలసిన మాటలు చెప్పుమనుట	412
లక్ష్మణుఁడు సుగ్రీవునిఁ జూడఁబోవుట	415
లక్ష్మణుఁడు కోపముతోవచ్చుచున్నాఁడని యంగదుఁడు సుగ్రీవునకుఁ దెలుపుట	416
సుగ్రీవుఁడు లక్ష్మణుఁడు వచ్చినకార్య మడుగుట	421
హనుమంతుఁడు సుగ్రీవునకు హితముఁ జెప్పుట	422
అంగదుఁడు లక్ష్మణుని సుగ్రీవునియొద్దకుఁ దోడితెచ్చుట	424
కిష్కింధ వర్ణనము	425
సుగ్రీవుఁడు తారను లక్ష్మణునితో మాటలాడుటకుఁ బంపుట	427
తార లక్ష్మణునితో సంభాషించుట	429
లక్ష్మణుఁడు సుగ్రీవునిదూఱుట	433
లక్ష్మణునిమాటలకు తార ప్రత్యుత్తరముఁ జెప్పుట	435
సుగ్రీవుఁడు లక్ష్మణునితోఁ బ్రసంగించుట	438
లక్ష్మణుఁడు సుగ్రీవుని సమనయించుట	440
సుగ్రీవుఁడు తిరిగి సౌమిత్రితో సంభాషించుట సీతనువెదకుటకు వానరసైన్యము బంపుట	442
సౌమిత్రితో సుగ్రీవుఁడు శ్రీరామునిఁ జూడ నేఁగుట	445
రామసుగ్రీవ సంభాషణము	447

విషయములు | పుట

సీతను వెదకుటకు వానరనాయకులు తమతమ బలములతో వచ్చుట
సుగ్రీవుఁడు వానరనాయకులను నాల్గుదిక్కులను సీతను వెదకు 451
టకు నాజ్ఞాపించుట 456
వినతుఁడు తూర్పుదిశకు వెడలుట 460
అంగదాదులు దక్షిణదిశకు వెడలుట ,,
సుషేణుఁడు పడమటి దిక్కునకు వెడలుట 463
శతబలి నుత్తరదిశకు సుగ్రీవుఁడు పంపుట 466
హనుమంతుని సుగ్రీవుఁడు దక్షిణదిశకుఁ బంపుట 469
శ్రీరాముఁడు హనుమంతునకుఁ దన ముద్దుటుంగరమిచ్చుట 470
సుగ్రీవుఁడు రామునకు సీతను వానరులు వెదకిన విశేషములు చెప్పుట 474
స్వయంప్రభా వృత్తాంతము 483
సీతనువెదకి కనుగొనలేనందులకుఁ జింతిల్లి యంగదుఁడు ప్రాయోప
వేశముచేయ నిశ్చయించుట 489
తారుఁడు బిలములోనే యుండిపోదమని వానరులకు బోధించుట
వానరు లందఱు నంగీకరించుట 491
హనుమంతుఁ డంగదునికిఁ దారునిమాటలు వినవద్దని హితోప
దేశముఁ జేయుట 493
అంగదుఁడు తనకార్యము నిర్వర్తింపలేదని సుగ్రీవుఁడు కోపించునని
కిష్కింధకు వెడలకుండ ప్రాయోపవేశము చేయఁ బూనుట 496
అంగదునితోఁ బ్రాయోపవేశము చేయుటకు సిద్ధముగనున్న వానరులను
సంపాతి చూచుట 500
సంపాతి వానరులతో సంభాషించుట 501
అంగదుఁడు తమవృత్తాంతము సంపాతికిఁ జెప్పుట 502
సంపాతి తన వృత్తాంతమును జెప్పుట 504
సంపాతి సీతవృత్తాంతమును జాంబవంతునికిఁ జెప్పుట 510
అంగదుఁడు సంపాతిచెప్పినరీతిని సముద్రమును దాఁటుటకుఁ దగిన
వారెవ్వరో యని విచారించుట 519
వానరులు తమ తమ బలముల నంగదునికి దెల్పుట 521
సీతను వెదకుటకై జాంబవంతుఁడు హనుమంతుని ప్రోత్సహించుట 524
హనుమంతుని పూర్వజన్మవృత్తాంతము 525
జాంబవంతుని మాటలకు హనుమంతుఁ డుప్పొంగి సముద్రము దాఁటు
టకు నంగదు ననుజ్ఞ వేఁడుట 528

శుభమస్తు.

కట్టా వరదరాజకృతమగు

శ్రీ రామాయణము

(ద్విపద)

ఆరణ్యకాండము

—. ఇష్టదేవతాస్తుతి :—

శ్రీరాజితశుభాంగ! - చిరగుణసంగ
హారికృపాపాంగ! - యలమేలుమంగ
భావుక! శతకోటి - భానుసంకాశ!
సేవకాత్మనివేశ! - శ్రీవేంకటేశ!
అవధారు! కుశలవు - లా రామచంద్రు
డవధరింపంగ రా - మాయణం బిట్లు
వినుపించు తత్కథా - వృత్తాంతమెల్ల
కనుపించు నవ్వాలి - కథ యెట్టులనిన;

—: శ్రీరాముఁడు మునుల యాశ్రమముఁ జూచుట :—

అపుడు రాముఁడు దండ - కారణ్య భూమి
విపుల తేజమునఁ బ్ర - వేశంబుఁ జేసి

యరుగుచో నభమును - నర్కమండలము
కరణి భానురు లుండు - కందువఁ జేరి
వనమృగంబులకు ని - వాసమై సకల
మునివరాగమ నాద - ములఁ జెలంగుచును
గలిత నానావిహం - గమకలస్వనముఁ
గలిగి యాదిత్య రా - కాచంద్రముఖుల
నాటపాటలచేత - నమరు నికుంజ
వాటికలను స్రుక్స్రు - వమ్ములు దాల్చు
హోతలచేనొప్పు - హోమవేదికల
హేతులు వెలి విరి - యించు నగ్నులను
బలివిధానముల రం - భారసాలాది
ఫలమహీరుహములఁ - బద్మినీకుముద
జలజాకరముల భా - స్కరపావకులకుఁ
దులవచ్చు మానుల - తో విరాజిల్లు
నొక యాశ్రమముఁ జూచి - యుగ్రకార్ముకము
లోకరైన నెక్కిడ - నొల్లకఁ దమదు
భుజములఁ గీలించి - పోవు రాఘవుల
నజినోత్తరీయులై - నట్టి సంయములు
వెఱఁగంది కరుణతో - వీక్షించి చేరి
భరతాగ్రజునిఁ జూచి - పలికిరిట్లనుచు.

—: మునులకు శ్రీరాముఁ డభయప్రదానముఁ గావించుట :—

" అతిథివైతివి యస్మ - దాశ్రమంబునకు
నతివతోవచ్చి నీ - కర్చ లిచ్చెదము
అమరావతీపురం - బమరేంద్రుఁ డేలు

క్రమమున నిలకెల్లఁ - గ ర్తవు నీవు
వసియింపు మిచట మీా - వారము మేము
వసుమతీ సురల దే - వతలను బ్రోవ
భారకుండవు దైత్య - బాధలు మమ్ము
నోరామ ! యెన్నని - యుగ్గడించెదము
నినుఁజూచి ప్రాణముల్ - నిల్చెను మాకు
మునులమాటను శమం - బుల నోర్వవలసె
మాకుఁగ్రోధంబులు - మత్సరంబులును
కాకుండ నటుగాన - కలుషించి మేము
చేతనై యుండియుఁ - జేసిన తపము
పాతకుల శపింప - బఱసిపోవుటను
దాలియుండుము కన్న - తల్లి బిడ్డలను
బాలించు గతి నీదు - పాలిటనుంచి
శరణాగతుల మమ్ము - సభయుల నీదు
మఱుఁగున నుంచి నే - మములు చెల్లించి
కావు మీావని ఫల - కందమూలములు
కావలసినవెల్లఁ - గానుక చేసి
యులరింప వారికి - నభయ మొసంగి
లలనాలలామతో - లక్ష్మణుతోడ
నాదినంబెల్ల న - య్యాశ్రమ సీమ
మోదంబుతో రఘు - ముఖ్యుఁడు నిలిచె.

—. రాముఁడు విరాధునిఁ జూచుట :—

అపరదినంబున - నమ్మహీభుజుఁడు
తపనసంకాశులౌ - తాపసో త్తముల

యనుమతిఁ జెంత మ - హారణ్య భూమి
యనుజన్మ సీతాస - హాయుఁడై చొచ్చి
పులులును గారెను - పోతులు బందు
లెలుఁగులు దోఁడేళ్ళు - సేదులు లేళ్లు
గాక ఘూకంబులు - కంకగృధ్రములు
నేకడ నెడ మూక - యూగ్రమై మెలఁగు
నవి చూచుచుం బోవ - నట్టహాసమున
నవనియు నింగియు - నదికట్టు పడఁగ
నతిభయంకరమైన - యంజనాచలముఁ
బ్రతివచ్చు మేను భూ - భారంబు గాఁగ
తెఱచిన నోరుతో - దిగదిగ వెలుఁగు
మెఱుఁగు కోరలతోడ - మిణుగుఱు ల్రాల్చు
చూపులతో నుగ్ర - శూలంబుతోడ
జూపఱబెదర వ - చ్చు సురాపరాధు
నా విరాధుని విల - యాంతక నిభుని
భావి రావణవైరి - భావించి చూడ,
శీఘ్రవేగమున పి - చ్ఛలి నెత్తు రొలుక
వ్యాఘ్ర చర్మము మేన - వలెవాటు వైచి
నాలుగు సింహములే - నాలుగు పులులు
నాలుగుకొమ్ముల - నాగమస్తములు
పదికాఱుపోతు లి - ర్వది హరిణములు
పదియేను తోఁడేళ్లు - పందు లేఁబదియు
శూలాగ్రమున గ్రేలఁ - జొరఁ బాఱి తనదు
మ్రోలఁ గన్పట్టు రా - మునికడఁ ద్రోచి

జానకి కేల్పట్టి - చంకను వైచి
దానవుఁడపుడు రౌ - ద్ర రసంబు మెఱయ
గడగడ వడఁకు రా - ఘవు దేవితోడఁ
గడకేఁగి నిల్చి బిం - కమున నిట్లనియె.
"ఎవ్వరురా! మీర - లిమ్మహాటవిని
గ్రొవ్వుతోఁ జక్కని - కోమలి తోడఁ
బోటు బంటులఁబోలి - భుజముల విండ్లు
హాటకపుంఖంబు - లైన బాణములు
కైదువులును బూని - గ్రాసమై నాకు
మీఁ దెఱుంగక వచ్చి - మీరు చిక్కితిరి
మాయావులై మీరు - మౌని వేషముల
నాయెదురను జడల్ - నారచీరలును
దాలిచి వచ్చినం - దప్పునే మౌని
జాలంబె కాదె భో - జనము నాకిపుడు
తలఁచ నీతలఁపు సుం - దరి తెకదేర
గలిగె నూరికె నాకుఁ - గామాతురునకు
దీని వివాహమై - తెరువాఁగి మిమ్ముఁ
బోనీకఁబట్టి యి - ప్పుడె మ్రింగువాఁడ
నేవిరాధుఁడ నాకు - నీ యరణ్యంబు
తావలంబ"ని పల్కు - దానవు మాట
విని దైన్యమున మోము - వెలవెలగాఁగ
దనపెదవుల నొకిం - తయుఁ దడిలేక
జానకీవిభుఁడు ల - క్ష్మణు మోముఁజూచి
దీనుఁడై తనపెంపుఁ - దెలియక పల్కె.
"కంటివే లక్ష్మణ! - గాలిమైఁ గడల

నంటివో యననొప్పు - నవనీతనూజ
చెఱఁబట్టువడి వెఱ - చెనుఁ బ్రాణభీతి
నెఱుఁగక వచ్చితి - మిట్టి మార్గమున
మనము చూచుచునుండ - మన వెంటవచ్చు
వనిత నెత్తుకపోయి - వాఁడున్న వాఁడు
కైక తలంచు సం - కల్ప మంతయును
చేకూడెఁ గౌసల్య - సేయు పాపమున
ధరణియొక్కని కిచ్చి - తండ్రినిం జంపి
తరుణినిం గోల్పోయిఁ - దన వివేకమున
నా చెట్టవట్టి మా - నముఁ దూలపోవ
నోచె నీజనకత - నూజ యేమందు!
ఏమి సేయుదు"? నన్న - నెంతయు నలిగి
రామునితో సుమి - త్రా సుతుండనియె.
"దేవ! యిట్లందురే - దేవతావిభుని
లావునం గెల్చి ఖే - ల ప్రతాపుఁడవు
కావలెనన్న లో - క త్రితయంబు
నీ విశిఖాగ్నిచే - నీఱు సేయుదువు!
నేను నీ బంట నుం - డియు నింకలోన
దీనుని వలె నేల - ధృతి మాని పల్క?
వీఁడన నెంత! నా - వివిధాస్త్ర కోటి
వాఁడిమిచే భూమి - ప్రయ్యలు సేతు!
భరతుని మీఁది నా - పగయెల్ల నేఁడు
పరిలించి యొకకోల - మర్దింతు వీని
పిడుగు గొట్టినయట్టి - పృథివీధరంబు
వడువున నెమ్మేను - ప్రయ్యలుగాఁగ

నాచేతి యొకతూఁపు - నాటించి దనుజ
నీచుని గూల్చెద - నిమిషమాత్రమున !
విపినమండలమెల్ల - నీనిరక్తమున
నిపుడె నదిశ్రేణి - నెనయంగఁజేతు !
నంచిత పరమక - ల్యాణిని సీత
నుంచెదఁదెచ్చి మీ - యొద్ద నీక్షణమె !
ననుఁజూడుఁ"డని పల్క - నగుమోముతోడ
దనుజుఁడు భీతి యిం - తయులేక పలికె.

— విరాధరామ సంభాషణ :—

“ ఎట్టివారలు మీర - లీవాళికముల
నట్టడవినిఁజిక్కి - నారు నాచేత
మీరు వోయెదమన్న - మిన్నకపోవఁ
దీరునే విధి మిమ్ముఁ - దెచ్చెనా కడకు ”
నను మాటలకు రాముఁ - డా నిశాచరుని
గనుఁగొని “ ఏము భా - స్కర వంశజులము
దశరథరాజనం - దనులము , శంద్రి
యశమెంచి యతని స - త్యము నిల్పఁదలఁచి
వనులను జరియింప - వలసి యిచ్చోటి
మునికోటి ప్రార్థనం - బులఁ జరించెదము. ”
అన్న మాటలకు వాఁ - డా రాజసుతుల
నెన్నక మదిగర్వ - మెచ్చ నిట్లనియె.
“ రాజనందనులార ! - రాక్షస వంశ
రాజైన జయుని పు - త్రకుఁడను నేను
శతహ్రదయందురు - జనయిత్రి నాకు

నతిబలుండ విరాధుఁ - డందురు నన్ను
దేవతాఖచర దై - తేయ కింపురుష
లావణ్యవతుల నె - ల్లను విచారించి
తగినట్టి చక్కని - దాని నెచ్చోట
జగతిని వెదకి యీ - జలజలోచనను
నిచ్చోటఁజూచితి - నీయింతి మీరు
తెచ్చి కానుక చేసి - తిరిగాన మిమ్ముఁ
గాచితి నీయింతిఁ - గని నామనంబు
లోచనంబులును మే - లునకుఁ బాల్పడియె!
కమలజుఁ జేత సం - గరములో నొరులు
తెమలింప రానట్టి - ధృతిఁ గన్నవాఁడ
నాయుధాహతులచే - హానిలేక యుండ
నా యజునివరంబు - లందిన వాఁడ!
జనుఁడు మీయిచ్చకు - సరిపోయినట్టి
యనువునఁ బ్రతుకుల - యాస కల్గినను,
ననుభవించెదరు కా - దనుచు నేమైన
నని యిట్టులట్లు మ - ల్లాడితిరేని
పొండన్న" నాగ్రహం - బున విరాధునకు
వెండియు నారఘు - వీరుఁ డిట్లనియె.

—. రాముఁడు విరాధునితో యుద్ధముచేయుట :—

"ఓరి! విరాధ! నా - యుగ్ర బాణముల
నీరీతి ననరాని - యీమాటలాడు
నిన్ను ఖండించెద - నేఁడు నీచేత
మున్నుఁగాసిలియున్న - మునులఁ గాచెదను"

అని యేడు దూపుల - నద్రియుంబోలు
దనుజుని యురము ర - క్తంబులఁ దొరుఁగ
వ్రేసిన నవి దూరి - వీపునే వెడలి
భాసుర పావక - ప్రభలు గప్పుచును
పుడమి నాఁటిన మహీ - పుత్రినం దొక్క
యెడనుంచి తనశూల - మెత్తి యార్చుచును
వదనంబుఁ దెఱచి పై - వస్వాతుఁగరణిఁ
గదియ రాఁజూచి రా - ఘవులుఁగోపించి
యిరువురు నిరుగడ - నిషుపరంపరలు
గురిసి దానవుమేన - గుదిగ్రుచ్చి నిలుప
నతఁడు మైజాడింప - నమ్ములన్నియును
క్షితిమీఁద రాలినఁ - జెదర కయ్యసుర
శూలంబుఁద్రిప్పి యా - ర్చుచు మీఁదవైవ
నాలంబులో నది - యాలంబు గాఁగ
రెండు దూపులచేత - శ్రీరామవిభుఁడు
ఖండింప పటువజ్ర - ఘాతనిర్భిన్న
సముదగ్ర కాంచనా - చలశిలాశకల
సమతఁజెందుచును ర - సా స్థలింబడినఁ
బోయిన శూలంబుఁ - బోవనిమ్మనుచు
నాయతాత్మీయ బా - హాయుగళమున
రామలక్ష్మణులఁ జే - రఁగనేఁగి పట్టి
యేమి దలంచెనో - యిరుభుజంబులకు
నెక్కించుకొని పోవ - నినకులోత్తములు
" చక్కనిత్రోవనే - చనుచున్న వాఁడు

మనమేఁగవలసిన - మాత్రంబెయేఁగి
తునుముద మట మీఁద - దోశ్శక్తి నితని
పోవనిమ్మని వాని - భుజముల మీఁదఁ
బోవువారలఁజూచి - భూపుత్రి వగచి ,
" ఏలకో వీనిచే - నిమ్మహాశౌర్య
లాలంబులోఁజిక్కి - రసమర్థులగుచుఁ
గావలసిన వీని - ఖండింపలేరొ
లావున నింక నే - లాగు నాతెఱఁగు ! "
అని వెంటఁబోవుచు - నార్తి నొందుచును
వనమృగంబులకు భా - వమున భీతిలుచు ,
" ఓరిదానవ ! మది - నోడక యేల
నీరాఘవులఁ బట్టి - యేఁగెద విట్లు ?
పోవచ్చునే నీవు - బోయిన నేలఁ
బోవనిత్తురె పట్టి - పొలియింప కిపుడు
మనువంశ విభులను - మావారి డించి
చనుమన " విలపించు - జానకి మదికి
హితముగా ఖడ్గంబు - లిరువురుఁదిగిచి
దితిసుతు భుజములుఁ - దెగవ్రేయుటయును
వానిచేతుల వెంట - వసుమతి వ్రాలి
జానకిచూచి మె - చ్చఁగ కడ నిలువ
నావిరాధుండు మ - హా రావమొప్ప
లావెల్లఁ బొలసి యి - లాస్థలిఁ బడినఁ
గత్తుల నఱికియు - గాఁజాల కుట్ల
తిత్తిగాఁ బొడిచియుఁ - దీసియిట్టట్టు
వెలికిలఁ బొరలంగ - వ్రేసి మోకాళ్ళ

నలియంగఁ బొడిచి య - న్నయను దమ్ముఁడును
దలయుఁ గాళ్లునుఁ బట్టి - దానవు నెత్తి
యిలమీఁదఁ గొట్టియు - నెమ్ములన్నియును
బొడివొడి సేసియుఁ - బొందుగఁ ద్రొక్కి
మెడనులిమియు గ్రుడ్లు - మిఱుకరింపఁగఁ
బిడికిళ్ల గ్రుద్దియు - భీమరాక్షసుని
మడియింపనేరక - మల్లాడి యలసి,
"వింటివే లక్ష్మణ! - వీఁడిట్లు బడియు
నొంటనుఁ జావులే - కున్నాఁడు ధాత
వరముచే నటుగాన - వసుమతిఁ ద్రవ్వి
బొరియలో నీద్రోహిఁ - బూడ్చి చంపుదము
త్రవ్వుమిచ్చో"నను - దశరథసుతుని
యవ్వాక్యములకు వాఁ - డాపన్నుఁడగుచు
శరణాగతత్రాణ - సద్ధర్మపరుని
ధరణిజారమణు న - త్తఱిఁ జూచి వలికె.

— విరాధుని శాపకథనము —

"స్వామి! నీచరణముల్ - శరణంబు నాకు
యీమానిని యె సీత - యీవు రాముఁడవు
యితఁడు లక్ష్మణుఁ డని - యెఱిఁగితి నిపుడు
మతిమిమ్ముఁ గనలేక - మాఱ్కొంటి నేను
బాధింపకుము దీన - బాంధవ! సకల
సాధు రక్షణ విచ - క్షణుఁడవు నీవు
వినుము నాతెఱఁగు నే - విబుధేంద్రు చెంతఁ
జనుమానమున నుండు - సంగీత నిధిని

తుంబురుండనుచు నం - దురు పేరు, రాజ
సంబున గంధర్వ - జాతినుత్తముఁడఁ
గామాంధకారంబు - కన్నులఁదొట్టి
కామించి రంభతోఁ - గలసి క్రీడింపఁ
దనకొలువునకు ని - తఁడు వేళఁగాచి
కనుఁగల్గి యుండఁడు - గర్వించి యనుచు
దనుజుఁడవై నీవు - ధరణిపైఁబుట్టు
మనుచుఁ గుబేరుఁడ - త్యాగ్రహావృత్తి
శపియింప వెఱచి యం - జలిచేసి చాల
కృపణత్వమున నుండఁ - గృపయుంచి యతఁడు
మీరాకయును నాకు - మీతోడి రణము
కారణంబున ముక్తి - గలుగు చందంబు
వివరింపఁగిన్నర - విభుని శాపమున
నవనిపై నిట్టి ఘో - రాకృతిఁబుట్టి
సరిచూచితిని నాఁటి - శాపంబునకును
దరియాట యభయప్ర - దానంబుఁజేసి
రక్షింపుఁడిక సంగ - రంబునం బడిన
రాక్షసులను మహి - ద్రవ్వి పూడ్చుటయె
ధర్మంబుగా నటు - దలఁచిన యట్టి
కర్మంబు సేయుఁడే - గనియెద ముక్తి.
దయఁజూడఁ డిచ్చోటు - దరలి యీప్రొద్దె
పయనమై దక్షిణ - భాగంబు నందుఁ
జను వోట నర్థయో - జనమాత్రనొక్క
ముని శరభంగ నా - మునిఁగాంచఁగలరు.
అందుచే శుభములు - నందుదు రేను

బొందుదు నిట్లూర్ధ్వ - పుణ్యలోకములు
పాలింపుఁడను''నుమాటఁ - బరమ కారుణ్య
శాలి యా జానకీ - జాని యాలించి
పెఱుఁగును దాల్మి వి - వేకంబుఁగరుణ
దొరయంగ సౌమిత్రి - తోడ నిట్లనియె.
"వింటిమి లక్ష్మణ - వీని చందంబు
మంటిలోఁబూడ్చక - మరణంబు లేదు
వీనికి నొదము - విధమునం బెద్ద
యేనుఁగ పొడవుతో - నిపుడొక్కగుంటఁ
ద్రవ్వు మీ''వని చెంతఁ -'ద్రవ్వించి వాని
నవ్వేళఁగుత్తుక - యంఘ్రిచేఁద్రొక్కి
యిరువురు పాఁతర - కీడ్చి పొర్లించి
శిరము క్రిందుగ రొద - సేయుచుఁ ద్రెళ్ల
బడఁద్రోచి దానవు - పై రాళ్లు గుండ్లుఁ
బడవైచి మ్రాకులా - పై నిండవైచి
గడ్డలు దుమ్మునుఁ - గప్పిధారుణికి
నొడ్డుగాపై దిన్నె - యునిచి యవ్వెనుక
జానకి నోరార్చి - శరచాప హస్తు
లై నిబిడంబైన - యడవిలోఁజొచ్చి
నభమున సూర్యచం - ద్రములనుఁ బోలి
శుభమూర్తులై వచ్చు - చో రామ విభుఁడు

—: శ్రీరాముఁడు శరభంగ మౌని యాశ్రమమును జేరుట :—

సీత నప్పుడు తన - చెంతకుఁదివిచి
ప్రీతితోఁ దమ్మునిఁ - జేరొక్కని పలికె

"అతిఘోరమైన యీ - యడవి దాఁటితిమి
హితముగాఁగ విరాధుఁ - డెఱిఁగించి నట్టి
శరభంగమౌని యా - శ్రమముఁ జేరితిమి
పరికింపు మిచటి వి - ప్పుల మహీరుహము
నారావిచెంతనా - నామరుల్ గొలువ
స్వారాజు వచ్చి యి - చ్చట నున్నవాఁడు
శింజాన కంకణ - శ్రేణి నచ్చరలు
వింజామరలు జెంత - వీచుచున్నారు
తెల్లని హయముల - తేరునఁగట్టి
యుల్లసిల్లుచునున్న - యొక సహస్రంబు
యిరువదే నేఁడుల - యొలజవ్వనంపు
దొరలు పసిండిక - త్తులుఁ బరిజించి
కుండల కోటీర - కోటితో దివ్య
మండనంబులు దాల్చి - మన్మథాకృతుల
జుట్టునుం గొలువ న - చ్చో నుర్వి మీఁద
మెట్టని పదముల - మిహిర తేజమున
నున్నవాఁడింద్రుఁ డ - యోధ్యలోఁదొల్లి
విన్నట్టి యందఱ - వేషముల్ చూచి
యితరులు సురలని - యితఁడింద్రుఁ డనియు
మతిదోఁచె శరభంగ - మౌని చెంగటికి
వచ్చియున్నాఁడు నే - వారి సేవించి
వచ్చెద నీపుణ్య - వనసమీపమున
జానకి చెంత ని - చ్చట నుండు మీవు
మౌనివరేణ్యుతో - మనమూట గాఁగ

యీచాయఁగాఁజూచి - యేమేమొ కొన్ని
చేచాఁచి యింద్రుండు - చెప్పెడి నిపుడు
వేగఁబోవలెనని - వినయంబు తోఁడ
సాగి మున్నగ రామ - చంద్రుండు రాఁగ
గొబ్బున ననిపించు - కొని వాహనములఁ
దబ్బిబ్బుగా సుర - తతి యెక్కి కదలఁ
దాను రథంబెక్కి - ధరణీ ధరారి
యానిలింపులఁజూచి - యప్పు డిట్లనియె.
"అదె వచ్చె రఘురాము - డాయన చేతఁ
బ్రదుకులు మనకెల్లఁ - బదిలమై యుండు.
రావణాది నిశాచ - రశ్రేణి నెల్ల
యీవీరవరుఁడు జ - యించిన వెనకఁ
బొడకని మరికాని - పొసఁగ దేమియును
నుడివి యిట్లసిపల్కి - నోరెత్త రాదు
కనిపించు కొనువేళ - గాదు రండనుచు"
మనసులో మ్రొక్కి య - మ్మాతలి తేరు
నడపింప వినువీధి - నాకంబుఁ జేర
గడియలో నరుగ రా - ఘవశేఖరుండు
సీతయు సౌమిత్రి - చెంతల రాఁగ

—రాముఁడు శరభంగుని దర్శించుట :—

జాతహర్షంబుతో - శరభంగుఁ జేరి
యతనికిఁ బ్రణమిల్లి - హస్తముల్ మొగిచి
హితమతి నిల్చిన - నీక్షించి మౌని
దీవించి యొక్క ప్ర - దేశంబుఁ జూప

నావీరవరుఁడు సు - ఖాసీనుఁడగుచు
శరభంగ మౌనితో - శతమఖు రాక
మరలిపోయిన యాగ - మంబు వేఁడుటయు
నామహామహుఁడు ప్రి - యంబు రెట్టింప
రామునిఁజూచి స - ర్వము నిట్టులనియె.
"శ్రీరామ! యెవ్వరి - చేత సాధింపఁ
గారాని సత్యలో - కము నాతపమున
సాధించుటనుఁ జేసి - జలజసంభవుఁడు
బోధింప నింద్రుఁడి - ప్పుడు వచ్చి నన్నుఁ
బిలిచిన తోడనే - ప్రియహితాలాప
ములువల్కి నినుఁజూచి - ముచ్చటదీరి
మఱిపోవువాఁడనై - మదినీదు రాక
యరసి జంభారిఁ బో - మ్మని పనిచితిని
యిదినిమిత్తంబుగా - నింద్రుండు వచ్చె
నదినీకుఁ దెల్పితి - నవనిజారమణ!
నీకు హితంబెద్ది - నిర్జరరాజ
లోకమైనను సత్య - లోకంబైయైన
నితరలోకములైన - నే దపోమహిమ
జితము చేసినవాఁడఁ - జేకూర్తు నీకు
నడుగు" మీావన మునీం - ద్రాగ్రణిఁ జూచి
యడుగ నొల్లక రాఘ - వాగ్రణి వల్కెఁ
"అయ్య! మీాకరుణచే - నన్నిలోకములు
నెయ్యడవలసిన - నేనె సాధింతు
నవి నాకు నెంత మీా - యనుమతి చేత
నవనిపై నొక్కర - మ్యప్రదేశమున

నుండఁగోరెద మాకు – నొకయెడ నాన
తిందు వసింప నెం – దే విచారించి ”
యనిన రామునిఁ జూచి – యామునిరాజు
మనసులో నలరి క్ర – మ్మర నిట్టులనియె.

—: శరభంగుఁ డగ్నిప్రవేశముఁ జేసి
బ్రహ్మలోకమున కరుగుట :—

“ అనఘ రాఘవ ! ఇమ్మ – హాశ్రమంబునకు
ననతిదూరము సుతీ – క్ష్ణాశ్రమం బొప్పు
నమ్మౌని కడ కేఁగి – యతనితో మీర
లిమ్మన్న కడ కేఁగి – యిమ్ము మీకిచ్చు
చని వేఁడుఁ డొకయింత – సయిరించి నన్నుఁ
గనుఁగొని తరవాతఁ – గదలుఁడు మీరు
యిదియె మందాకిని – యియ్యేటి తీరఁ
గదలి యమ్మునిఁగన్న – గాంతురు శుభము !
ఇప్పుడే చనియెద – నేనని యతఁడు
కుప్పసంబూడిన – కొదమ త్రాచనఁగ
కరలెడు హోమాగ్ని – కీలల మేను
దరికొల్పి యంగంబు – దహనునకిచ్చి
యతఁడిచ్చు నొక కొమ – రాకారమంది
జతఁగూడు పావక – జ్వాలలు వెడలి
యనఘ పుణ్యులు నాహి – తాగ్నులు దివ్య
మునులును దేవతా – ముఖ్యులు నుండు
లోకంబులెల్ల నా – లోకించి మించి
యాకడ బ్రహ్మలో – కావాప్తి నతఁడు

చతురాననునకు నం - జలిఁ జేసి నిలిచి
యతఁడు సేమము వేడ - నరలేక పల్కి
యాలోకమున నిశ్చ - లానంద సౌఖ్య
లోలుఁడౌ మౌని నా - లోకించి మెచ్చి
యున్నవో నయ్యాశ్ర - మోపాంత వనుల

—: దండకారణ్యములోని మునులకు శ్రీరాముఁ
డభయదానమిచ్చుట :—

నున్నట్టి మౌనులు - యోగిపుంగవులు
పలుగురా ల్పొడిచేసి - భక్షించువారు
నిలివెఁడు నీటిలో - నెలకొనువారు
కొరుకుడు ధాన్యముల్ - గొనిమనువారు
కరువలి తమమేఁత - గానున్నవారు
పుడమి మోవని దేహ - ములనుండు వారు
పడివట్టి పాటుగాఁ - బడియుండు వారు
యెత్తిన చేతుల - నేయుండు వారు
బిత్తరిం జలికోర్చి - పెనుపొందువారు
కలఁగక తలక్రిందు - గానుండు వారు
వెలుఁగు వహ్నులలోన - వెలుఁగొందువారు
పిడికెడు తిండిచేఁ - బేర్కొల వారు
పుడిసిటి మాత్ర మం - బులుగ్రోలు వారు
కందమూలముల నాఁ - కలి దీర్చువారు
నందితజీర్ణ ప - ర్ణము లాను వారు.
గరికెవ్రేళ్లు మెసంగి - క్రమియించు వారు
ఘురఘుర చిదిపిరాల్ - గ్రోలెడు వారు

నందఱు గుమిగూడి - యాశరభంగు
కందువఁ జేరి రా - ఘవుల దీవించి
యొక్కమాటగ వార - లొండొరు మీఱి
త్రొక్కులాడుచు రాము - తోడ నిట్లనిరి.
"మఘవుఁడు దొర దేవ - మండలికెల్ల
రఘువంశజుల కెల్ల - రాజవు నీవు
లోకుల నెల్ల నే - లుటకునై నీవు
లోకంబునకు నెల్ల - లోకేశుఁ డొకఁడు
చాలినవారు దు - ర్జనుల నడంప
వాలాయమున మంచి - వారిఁ బోషింప
నీకె భారము మాట - నిజము చెల్లింపఁ
జేకొని ధర్మమూ - ర్జితముఁ గావింపఁ
బితృవాక్యమొనరింపఁ - బృథివిపైఁ గీర్తి
యతిశయింపఁ బ్రతాప - మభివృద్ధి సేయ
గుణములచే నెల్లఁ - గోటికి నెక్క
గణుతింప నీకెయే - కడఁ జెల్లుచుండుఁ
గావున మాకు నొ - క్క ప్రయోజనంబు
గావింప వలయు నొ - గాములు మాని.
రాజులు పుడమి నా - అఱవయొక పాలు
భూజనమ్ముల చేతఁ - బుచ్చుక వారి
కన్నట్టి బిడ్డల - క్రైవడిఁ జాల
మన్నించి ప్రోవ ధ - ర్మంబటు గాన
న్యాయమార్గంబున - నడవక యున్న
నాయవనీపతి - నఘములు వొందు
నడచినఁ గీర్తి య - నంతపుణ్యంబు

కడపట స్వర్గలో - కసుఖంబు నొందు
సత్యమార్గంబున - జగతిఁ బాలించు
నత్యంత ధార్మికుం - డైన భూపతికి
నతఁడేలు సీమలో - యతివరుల్సేయు
నతిశయ జపతపో - యాగాదికముల
ఫలముల నాలవ - పాలుప్రాపించు
నిలయేలు పుణ్యుల - కెల్ల కర్మములు
రామ! నీయంతటి - రాజు గల్గియును
సామాన్యులైన రా - క్షసులచే బాధ
నేమెల్లఁ బొరయంగ - నెంత లేదనుచు
నేమియు ననకుండ - నెట్లగు నీకు ?
ఈచిత్రకూట మ - హీధరప్రాంత
వాచంయములకు ని - ల్వఁగ యాములయ్యె.
మందాకినీతీర - మౌనిబృందంబు
డెందంబులకు నివ్వ - టిల్లె భయంబు
పంపాతరంగిణీ - ప్రాంతమౌనులకు
మంపిల్లఁదొడఁగె న - మ్మదిలోన భీతి
యితరాశ్రమంబుల - యీ ఋషివరుల
వెతలెల్లఁ గతలుగా - వినిపింపవలయు
మముఁజూడు మిప్పుడు - మాశరీరముల
క్రమముఁ జూచినఁ దెల్పఁ - గాఁ బనిలేదు
మాయాపదలు మాన్చి - మహిసుతాప్రాణ
నాయక! అభయదా - నంబుఁ గావింపు!
శరణుఁజొచ్చితిమి మీ - చరణాబ్జములకు
నెఱిఁగి ప్రోవుము మాకు - నెవ్వారుదిక్కు

రాక్షసబాధలు - రాకుండ మమ్ము
రక్షింపు కరుణాబ్ధి - రామ ! శ్రీరామ ! ”
అనుచు దైన్యంబుతోఁ - బ్రార్థింపుచున్న
వనవాసులకు రఘు - వర్యుఁడిట్లనియె.
చూచితి మిమ్ము మీ - చొప్పెల్ల వింటిఁ
గాచితి నవధులె - క్కడి వింక మీకు
పితృవాక్యమొనరించు - పేరిట మిమ్ముఁ
బ్రతినచే రక్షింపఁ - బనిపూని నాఁడ
నెక్కడి వాపద - లింక మీఁద మీకు
నిక్కడ మిముఁగావ - నే వచ్చినాఁడ
మీ రేమిచెప్పిన - మీరక చేసి
ఘోరరాక్షసులఁ బై - కొని త్రుంచువాఁడ
నావనవాసంబు - నకు ఫలంబైన
మీవాక్యములు జేసి - మేలందు వాఁడ
బట్టుగా మిమ్ముఁజే - పట్టిన వాఁడ
గట్టితి దనుజ శి - క్షా కంకణంబు !
నను వేఁడుకొననేల - నానావిధాస్త్ర
ధనువులెన్నటికిఁక - దాఁచనివాఁడ
నిందఱి కభయమే - నిచ్చితి మీరు
మందిరంబులను నె - మ్మది నుండుఁడింక !
అప్రతిమంబైన - యస్మత్ప్రతాప
దీప్తానలంబు దై - తేయకాననము
దహియించు నప్పుడం - దఱుఁ జూచినన్ను
బహుమాన మొనరింపఁ - బ్రార్థి మించెదరు ”

—: సుతీక్ష్ణాశ్రమ ప్రవేశము :—

అని నమ్మికలొసంగ - నామునీశ్వరులు
తనవెంటరాఁగ సీ - తా సమేతముగ
ననుఁగు సోదరుఁగూడి - యపుడా సుతీక్ష్ణ
మునివరాశ్రమము రా - ముఁడు ప్రవేశించి
యచట జటావల్క - లాంబరధరుని
సుచరిత్రు నాసుతీ - క్ష్ణునిఁ జేరఁబోయి
యామునికెఱఁగి తా - నంజలి సేసి
"రాముఁడందురు నన్న - రణ్య భూములకు
వచ్చి మిమ్ములఁజూడ - వచ్చితి" మనిన
మెచ్చి యాముని రాజు - మిగుల దీవించి
చెంత నాసీనునిఁ - జేసి రామునకు
నెంతయుఁ గరుణతో - నిట్లని పల్కె.
"అన్న రాఘవ! మిమ్ము - నన్నదమ్ములనుఁ
గన్నుల వడిదీరఁ - గనుఁగొంటి నిపుడు
సేమమే కద? ఇంద్రు - చే వింటినిపుడు
భూమినంతయుఁగైక - పుత్రునకిచ్చి
చిత్రకూటనగంబు - చేరి యావెనుక
నత్రిని దర్శించి - యనసూయఁ గొలిచి
శరభంగమౌని యా - శ్రమము చేరుటలు
హరిహాయుచేత నీ - యాగమనంబు
వినియున్నకతన నే - వేరె యొక్కెడకుఁ
జనువాఁడనై నీదు - సందర్శనంబు
జేసి లోకాంతరా - శ్రితుఁడనై పోదుఁగఁ
తాపమువట్టి యి - ప్పుడు నిల్చినాఁడ

వింటిని మున్ను మీ - వృత్తాంతమెల్ల
కంటిని మీశుభా - కారముల్ నేఁడు"
అని పల్కి రఘు వీరుఁ - డా తపోనిధినిఁ
గనుఁగొని సంతోష - కలితుఁడై పలికె.
"పావకనాత్మక ! నీ ప్ర - భావమంతయును
భావించి మును శర - భంగుఁడు దెల్ప
వీనుల విందుగా - వినియున్న వాఁడ
నేనెలవుల నుందు - నెఱిఁగింపు" మనిన
నాయనుగ్రహమున - నాతియు నీవు
నీయాశ్రమముల మీ - యిచ్చకు వచ్చు
క్రేవలనుండుఁడీ - కెలన నానామృ
గావళి యావలి - యధికమై యుండు
నంతమాత్రమె కాని - యన్యంబులైన
చింతలిచ్చట నున్నఁ - జేర వెవ్వరికి
నేమఱిక మెలంగు - డిచ్చోట ననిన
నామౌనిఁజూచి యి - ట్లనియె రాఘవుఁడు.
"ఎచ్చరికయ కాక - యేము కానలకు
వచ్చి యొంటిఁ జరించు - వారమే యెడల
జతనమ్ము మఱితుమే - సజ్య కోదండ
యుతులమై యస్త్రమ - యూఖముల్ వెలుఁగ
నుండుదు" మని పల్కు - చుండఁ గైసేసె
పుండరీకాప్తుండ - పుడు పశ్చిమాద్రి
సాయంతనములైన - సంధ్యాది విధులు
పాయక తీర్చి శు - భ ప్రదేశమున

నారేయి వసియించి - యమ్మౌని యొసఁగు
చారు సపర్యల - సంతుష్టి నొంది

—: శ్రీరాముఁడు మునులయాశ్రమముం
జూడఁ బ్రయాణమగుట :—

ఉదయావసరమున - నుత్పల గంధ
సదమల శీతాంబు - సరమునఁ గ్రుంకి
నేమముల్దీరిచి - నెలఁతతోఁగూడి
ప్రేమసోదరునితో - శ్రీరామవిభుఁడు
మరల సుతీక్ష్ణాశ్ర - మముఁ బ్రవేశించి
హరిచింతన మొనర్చు - నయ్యోగిఁగాంచి
"ఓ మహాత్మక! సుఖ - మొంది యీరేయి
నీమహాశ్రమములో - నిదురపోయితిమి.
మావెంట వచ్చిన - మౌనివరేణ్యు
లావలఁ బోవుద - మనుచున్నవారు
పయనంబులో నెండఁ - బడకొక్కచోటు
రయమునఁ బోయి జే - రఁగఁదలంచెదము
అనుమతి యిండన్న" - నారాము మాట
మనసురంజిల విని - మౌని యిట్లనియె.
"రామ! యీదండకా - రణ్యంబులోన
భూమిజ నీడయుఁ - బోలివర్తింప
విహరింప నీవుఁ బ్ర - వేశించి యచటి
విహగస్వనంబుల - వీనులు చొక్క
సౌమ్యంబులగు మృగ - సంఘముల్ వెలఁగు
రమ్యప్రదేశముల్ - రంజిలఁ జేయు.

మీఁకు నింపొసఁగు భూ - మీరుహచ్ఛాయ
యా కెలంకులచంద - నానిలంబులను
నచటి తమ్మికొలంకు - లందు నెంతయును
రుచిపుట్టు నీరంబు - గ్రోల నింపెసఁగు
నావనగిరి కంద - రాంతరంబులను
దేవియుఁ దాము మో - దింతురుగాక !
చలువచప్పరముల - జాడ రసాల
విలసితచ్ఛాయల - వేడుకసేయు
నావనంబునఁగాని - యన్యంబులైన
తావు మీరుండఁగ - దగదు పొండ "నిన
ఆమౌనివరునకు - నంజలిజేసి
రామలక్ష్మణులు ధ - రాతనూజయును
వలగాఁగ వచ్చియా - వల సాగి తమ్మ
వలఁగొని మునులు న - ల్వంకల రాఁగ
నెక్కువెట్టిన విండ్ల - నిరువుర నడిమి
చక్కి జానకి నుంచి - చనుచున్న యపుడు
ఆరమణీమణి - యాత్మఁ జింతించి
శ్రీరామచంద్రు నీ - క్షించి యిట్లనియె.

— సీత రామునితో రాక్షసుల జంపమానుఁడని
మనవిఁ జేయుట —

" అయ్య ! యిమ్మునినాథుఁ - డాడిన మాట
యిట్టియెడ హితమని - యేఁగ నేమిటికి ?
వసుధఁ గాముకులగు - వారికి నిట్టి
వ్యసనముల్ తగుఁగాక - వలవదు మీకు ;

కామమోహితులకుఁ - గల్లలాడుటలు
నేమిహేతువు లేక - యీసు లెంచుటలు
పరకామినులకుఁబైఁ - బడి మెలంగుటలు
ధరణిపైఁదగుఁగాక - ధర్మమార్గమున
నతిజితేంద్రియుండవై - యాడినమాట
ప్రతినతోఁ జెల్లించు - పరమకల్యాణ
శాంతమూర్తికి నీకుఁ - జనునయ్య ? వీరు
మంతనంబులు విని - మారాడలేక
మొగమాటచేత యీ - మునులకై లేని
పగ నంతరించుక - ప్రతినలు వలుక
చాలింపుడేఁటికి - శపథముల్ జగడ
మేలయ్య ? యీమాను - లెటువోయి రేని
కయ్యముల్ వలవ ద - కారణద్వేష
మియ్యడవులలోన - నేఁటికి మనకు ?
పుడమి యొక్కరికిచ్చి - పొమ్మన్న నురకె
యడవుల బట్టి యి - ట్టనదలమగుచు
నుండువారము మన - మొక్కరి కొఱకు
దండకాటవిలోన - దైత్యుల తోడఁ
బోరాడనేఁటికి ? భుజముల విండ్లు
మీరలెక్కిడఁ జూచి - మేనిలోనాకుఁ
బ్రాణముల్ నిలువకఁ - బల్లటిల్లెడును
ప్రాణనాయక ! డిందు - పడదు చిత్తంబు
దండకాటవి యేల - తగవేరిచోట
నుండినఁ దీరక - యున్నదే మనకు ?
నాకిది సరిపోయి - నతిగాదు మదిని

మీకెట్లు దోఁచెనో - మీచిత్తమింక !
కాదని పోయినఁ - గలహముల్ పుట్టు
నాదండకాటవి - నసురులతోడ
రాజులకును ధను - ర్బాణముల్ కట్ట
రాజివహ్నికి బల - ప్రదములౌఁగాన
మునులమై వచ్చిన - మూలలయందు
నునుప యీవిండ్లను - నుగ్రబాణములు
తెచ్చిన దోషమీ - తీరున హాని
వచ్చుటకును హేతు - వాదమైయుండె
మున్నొక్కముని తపం - బున నెంతవారి
నెన్నక లోకంబు - లెల్ల సాధింప
నది యింద్రుఁడెఱిఁగి చా - యలకత్తి నొకటి
బదను తూలికఁదెగి - పారంగఁదెచ్చి
నీవశంబున నిది - నిలుపుక యుండు
మీవ వచ్చువఱకు - నేమర వలదు "
అని చేతికిచ్చి తా - నమరావతికిని
జనునంత నమ్ముని - శాతకృపాణిఁ
జేతనుఁబట్టుక - చెంతల వనుల
నీతరి మెలఁగుచో - హేతి హేతువున
పోఁటు చింతలు గెల్చు - బుద్ధులు సాహ
సాటోపమును హింస - లాచరించుటయుఁ
జాలఁగఁగలిగి తా - సందియ జపము
వేళలు దప్పించి - వేలిమి మాని
తప ముజ్జగించి చిం - తకురిత్తబుద్ధి
విపరీతమై మాని - వృత్తిఁబోనాడి

నాసించి వేఁడిన - యర్థంబు పూని
చేయుటగాకవి - శేషంబు గలదె ?
ఐనఁగాకున్న నే - నాడినమాట
పూని నిర్వర్తింత్త - పోఁడెందు నైన
నటమీఁద ద్విజులతో - నాడిన మాట
యెట్టులైనఁ జెల్లింప - కేల మానుదును!
తననైన నీసుమి - త్రాపుత్త్రునైన
నినునైన వర్జింతు - నిలుపుదు మాట
మించి పల్కిన మాట - మేలాయె ననుచు
నెంచక నిటులాడ - నెట్లగు నీకు
నాకు మేలెంచి క - న్న తెఱంగు హితము
వాకొంటిగాన భా - వమునఁ దాళితిని
కాచితి నీతప్పు - కలవాణి తలఁచి
చూచిన నన్ను ని - చ్చో నిట్లు బలుక
కొఱఁతగాదిది నీదు - కులశీల ధర్మ
గరిమంబులకు నలం - కారంబుగాని!"

—: పంచాప్సరస సరోవర వృత్తాంతము :—

అని పల్కి చేవిల్లు - నమ్ములుఁదాల్చి
వెనుక సీతయు సీత - వెనుక లక్ష్మణుఁడు
కదిసిరా భీకర - గహన మార్గమున
నదులును గిరులును - నలినాకరములు
పొదలును గారెను - పోతులు పులులు
మదపుటేనుఁగులు జి - హ్మగములు గారు
చూచుచు గడచిరా - సూర్యబింబంబు
గోచరంబై క్రుంకి - కొండఁ జేరుటయు

నావేళ నొక రోజ - నాయతంబైన
వ్యావల్గ దండజ - వ్రాత తీరంబు
స్వాదు ప్రసన్నతా - స్వాద్యనీరంబు
రోదసివ్యాప్తమ - దుత్కిశోరంబు
చారుమరాళికా - కతవిహారంబు
వారిజ మధు పూర్ణ - వారిపూరంబు
చారణయుత దివ్య - చంద్రాననప్ర
చారంబునైన కా - సారంబుఁజూచి,
ఆచాయనొక మ్రోఁత - యది యిట్టిదనుచు
గోచరింపక దిశల్ - ఘూర్ణిల్లి మొరయ.
నలుదిక్కులనుఁజూచి - నలినాప్తకులుఁడు
దెలియనేరక చెంతఁ - దిరుగుచు నున్న
ధర్మభృతుండను - తాపసనాథుఁ
బేర్మితోఁ జేరంగఁ - బిలిచి యీరవము
యెక్కడజనియించె? - యెవ్వరింగాన
మిక్కడ నన మౌని - యిట్లని పలికె.
"అనఘ! యీకొలను పం - చాప్సరంబండ్రు
మును దీని నిర్మించె - ముని మాండకర్ణి
ఆ మాండకర్ణి యీ - యబ్జాకరమునఁ
దామరగుంపులోఁ - దపము సేయుచునుఁ.
బదివేలు దేవతా - బ్దములు వసింప
నదిచూచి బెగడి వా - తాహారుఁడగుచు
నీముని మదిలోన - నెవ్వరి మేలు
గామించి యో యిట్టి - గతి నుగ్రతపము
సేయుచున్నాఁడని - చిత్తంబులందు

నాయమర ప్రభు - లందఱు దలంచి
యింద్రుని కెఱిఁగింప - నెంతయుభీతి
చంద్రాస్యలైన య - చ్చరల నేవురిని
దనకొల్వులో నున్న - తరుణులలోన
నెనలేని వారిఁగా - నేర్చి తాఁబిలిచి
"చూతము నేఁడు! మీ - సొలపులచేత
నాతని తపమెల్ల - నారడిఁబుచ్చి
రండని పనిచిన - రంభాదులెల్ల
నుండంగ తముఁబిల్చి - యుర్వీధరారి
పనిచినాఁడని వారు - పయనమై యపుడె
మునియున్న యాసరం - బునఁ బ్రవేశించి
తమ యాటపాటలఁ - దమవిలాసములఁ
దమిరేచి మునినియో - దమునఁ ద్రోయుటయుఁ,
గాముని విరియంపఁ - గములకుఁ దగిలి
యాముని గిలిగింత - లటు పుట్టఁజూచి
మరలి పోరాకుండ - మాయచే నీటి
తెరఁగట్టి యుంచి తా - తెఱవలఁ బిలిచి
లాలించి యనురూప - లావణ్య మహిమ
యాలంకరణముల - నందంబు పూని
నీటిలో నొక్కమ - ణీమయంబైన
హాటక దివ్య గే - హంబుఁగల్పించి
యైదుగురికి మేడ - లైదు నిర్మించి
యాటత్యకాంతల - నందుల నునిచి
వారికి వలసిన - వస్తువులెల్ల
స్వారాజ్యమున లేని - సకల భోగములు

గలిగించి వారలఁ - గలసి తపంబు
ఫలియించి యున్న యా - పములతోఁ బొలఁగి
పంచసాయకబాణ - పంచకంబునకుఁ
బంచేంద్రియములు బా - ల్పఱచి యయ్యువతి
పంచశరలీలా ప్ర - పంచ సర్వస్వ
వంచిత నియమాది - వర్తనుం డగుచు
నామాని యున్నవాఁ - డతని సన్నిధిని
రామల మణినూపు - ర ఝళం ఝళముల
నతఁడుఁ గన్గొనఁగ నా - ట్యము వినుపించు
నతివల గీత వా - ద్యముల రావంబు
లమ్ముని నటనశా - లాభ్యంతరమున
ధిమ్మనునట్టి మ - ద్దెలల మ్రోఁతయును
కళఁగూడి శ్రవణసుం - గళముఁగాఁగొలను
వెలపల మీకెల్ల - వినవచ్చె నిపుడు!"
అన విని కడు మెచ్చి - యాధర్మభృతుని
వనమున కేఁగి భూ - వర కుమారకులు
నతని చేతను బూజ - లంది యవ్వెనుక
నితరతపోనిధు - లెల్లనర్చింప
నట నిల్చి శరభంగుఁ - డాదియైనట్టి
జటిపురందరుల యా - శ్రమముల లోన
నెలయు రెన్నెల్లు మూ - న్నెల్లును నాల్గు
నెలలైదు నెల్లాఱు - నెలలును నేడు
నెల లెనిమిది నెలల్ - నెలలు తొమ్మిదియు
నెలలొక్క పదియుఁగా - నిలుచుచు వచ్చి;
ఎచ్చటెచ్చట నుండ - నె న్నాళ్లు ప్రీతి

నెచ్చునచ్చట నెల్ల - యిచ్చట నుండి
చరియింప విపిన వా - సము నాఁటి వఱకుఁ
బరికింప మితిలోనఁ - బదియేండ్లు గడచె.

—: శ్రీరాముఁడు మఱల సుతీక్ష్ణాశ్రమమునకు వచ్చుట :—

తరవాత సీతయుఁ - దమ్ముఁడు గొలువ
మరల సుతీక్ష్ణాశ్ర - మముఁ బ్రవేశించె
నచ్చోటిమునులెల్ల - ననురాగ మెచ్చ
వచ్చి పూజించి ర - వ్వనములోపలను
కొన్నాళ్లు వెనుక ర - ఘుప్రవీరుండు
మున్నువోలె సుతీక్ష్ణ - మునిఁజేర నేఁగి
ప్రణమిల్లె, మునిరాజ - పట్టభద్రుండు
క్షణమాత్రము సమాధి - సంపన్నుఁ డగుచుఁ
గనువిచ్చి చూచుచోఁ - గదిసి రాఘవుఁడు
మునితోడఁ గేలుఁ ద - మ్ములు మోడ్చిపలికె
"అనఘ! యగస్త్య మ - హా మౌని యిచటి
వనములలో నున్న - వాఁడని పలుక
వినియుందు మిది మహా - విపినంబుగానఁ
గనిపింపఁ డీజన - కతనూజఁగూడి
కొలువ వేడుకయయ్యె - కుంభసంభవుని
నెలవానతిచ్చి మ - న్నింపుఁడు నన్ను"
అనిపల్కు రఘుపతి - యాననాబ్జంబుఁ
గని సుతీక్ష్ణముని శి - ఖామణి పలికె
"జానకీరమణ! ప్ర - శ్నముచేసి నీవు
పూని యగస్త్యునిఁ - బొడగందు ననుచు

వడిగిరి సేనమ్మ - హా మానిచంద్రు
కడకేఁగు మనితెల్పఁ - గాఁబూని యుంటి
నిరువురి తలఁపులు - నేకమై యిపుడు
సరివచ్చె నామాన - సము ప్రీతి నొందె
చక్కఁగా నిచటి యా - శ్రమము దక్షిణపు
దిక్కున రెన్నాళ్లు - తెరువు పైనమునఁ
జనుచోట మీరగ - స్త్యభ్రాత యనెడి
మునివరు సేవించి - మువ్వురునచట
నతని యాశ్రమములో - నాప్రొద్దు నిలిచి
హితమతితో నమ్మ - నీశ్వరుండనుప
నావని చెంగట - నామటి మేరఁ
బోవుచో నుత్తుంగ - పూగపున్నాగ
నారంగజంబీర - నారికేళామ్ర
పారిజాతాశోక - పనస భూరుహము
కైరవనీరజః - కల్హారచక్ర
సారస భాసుర - జలజ కరంబు
వాణివేయాది స - వనకర్మ నిరత
యాజక స్వాహాస్వ - ధాభిరావంబు
జటివరశాపాయు - శాటికాకలిత
కుటశిఖాశాఖాగ్ర - కోటి భాసురము
నానాగమాభ్యాస - నతమూపార
మానికుమార ర - మ్య ప్రదేశంబు
నైనయగస్త్యాశ్ర - మా వాసమునకు
నానందమునఁబోయి - యమ్మునిఁజూచి
రండుపొంద" నవుఁడు - రామలక్ష్మణులు

పండియుఁ బ్రణమిల్లి - వీడుకోలంది
తనకు నమ్మునిచెప్పు - దారినే వచ్చి
యనుజునితో రాముఁ - డప్పుడిట్లనియె.

—: శ్రీరాముఁ డగస్త్యభ్రాత యాశ్రమమునకు వచ్చుట :—

"ఇదె యగస్త్యభ్రాత - యిరవుగాఁ బోయి
నదె పిప్పలాక్షాదు - లాచయంబు దోఁచె
శైత్య మాంద్యముల వా - సనలతోఁ గూడి
యత్యంత మృదు పవ - నాంకురం బెసఁగె
వినవచ్చుచున్నవి - వేద ఘోషములు
కనుపట్టె శుకశారి - కా విహంగములు
వలనొప్పె దర్భలు - వైడూర్యరుచులు
తొలకరించెను హోమ - ధూమముల్ చదల
స్నానముల్ దీర్చి పూ - జావిధానముల
మానులిచ్చు ప్రసూన - మాలికల్ మెరసె!
అందుచే నమ్మౌని - యాశ్రమంబగుట
సందియంబేల యి - చ్చటనున్న వాఁడు
మున్నగస్త్యుఁడు లోక - ముఁ నెల్లఁ బ్రోవ
నెన్ని వాతాపిని - యిల్వల వధియించి
దాన మృత్యువుఁ గెల్చి - తపసులఁ గాచెఁ
గాన నమ్మౌనీంద్రు - కథనమచ్చెరువు!

—: అగస్త్యముని వాతాపియిల్వలులను జంపినకథ :—

వాతాపియనఁగ ని - ల్వలుఁడన వెలయు
దైతేయు లిరువురు - తమపితరులకు

తద్దినమ్ములు వెట్టు - తలఁపుచే నిట్టి
బుద్ధి నేర్చక ద్రోవఁ - బోవుచున్నట్టి
తపసుల నియమించుఁ - దావిప్రుఁడగుచు
నపుడిల్వలుండు మ - హామునీశ్వరుల
చాలనర్చించి భో - జనమిడు వేళ
పోలుగ వాతాపి - పొట్టేటిఁ జేసి
దాని వధించి త - త్పలలంబు వెట్టి
వానిఁ బేర్కొని "రమ్ము - వాతాపి" యనిన
భుజియించు విప్రుల - పొట్టలు జించి
నిజవర గర్వంబు - నివ్వటిల్లంగ
వెలువడి నిలుచుండి - విప్రులనెల్లఁ
దలవట్టి మ్రింగు పి - శాళ్ళతోఁ గూర్చి
బలవంతుఁ డై క్రొవ్వి - పలలభోజనుఁడు
కలశజుఁ డాత్రోవఁ - గా నొక్కనాఁడు
సురలెల్ల నీరాక్ష - సులు పసిపట్టు
ధరణీసురులు కోట్ల - తరములు గలరు !
అట్టి పాపాత్ముల - నడఁచి రమ్మనుచు
గట్టిగా తగుబందు - కట్టిన వచ్చి
గహనమార్గమున రాఁ - గని యిల్వలుండు
బహుమానమునఁ బిల్చి - బ్రాహ్మణార్థంబు
నేమించి యప్పటి - కొప్పటివంట
లామతించిన యగ - స్త్యమునీశ్వరుండు
భుజియించి వార్చిన - ప్పుడు సహోదరుని
కుజనాత్ముఁడు బిల్వ - విని కలశజుఁడు

వాఁడు జీర్ణించి నై - వస్వాతు పురికి
నేఁడేఁగె! వచ్చునే - నీవు పిల్చినను ?
" ఓరి! జగద్ద్రోహి! - రౌద్రశ మునుల
నీరీతిఁ జంపితి - రిన్నాళ్లు మీరు!
అట్టి పాపములెల్ల - ననుభవింపంగఁ
గట్టడి చేసితిఁ - గడతేర్తు నిన్ను
ననవిని వాఁడాగ్ర - హంబుతోఁ గదియ
మునిశిఖామణి బొమల్ - ముడిగొనుచుండ
గోపించినఁ గుప్పఁ - గూరగాఁ బడియె
నాపాపమతి భస్మ - మై నిమేషమున
నామాడ్కి నిల్వలు - నడచిన యట్టి
యామహాత్ముని భ్రాత - యాశ్రమంబునకు
వచ్చితి" మనునంత - వనజబాంధవుఁడు
వచ్చెను బశ్చిమ - వనధి చెంగటికి
నావేళ వారగ - స్త్య భ్రాతఁ జేరి
సేవించి యమ్మౌని - చేఁ బూజలంది
యతని యాశ్రమమున - నారేయి యెల్ల
క్షితిసుతతో నిద్ర - చేసి వేకువను
నిత్యకృత్యంబు ల - న్నియుఁ దీర్చి పరమ
సత్యసంధుండు దా - శరథి యావేళ
నాయగస్త్య భ్రాత - యనుమతి నతఁడు
చేయి చూపినత్రోవ - సీత తోడ్కొనుచుఁ

—: అగస్త్యాశ్రమ వర్ణనము :—

జనిచని భల్లాత - సరటిటుగవయ
వనచరశరశిరి - వ్యాఘ్రపంచాస్య

జంబుకహరిణ మా - ర్జాల గండకక
దంబభాసుర వనాం - తరములు గడచి
సుందరఁ జూతక్ర - ముకనారికేళ
చందనపనసర - సాల జంబీర
వాసంతి కాకుంద - వరఫలప్రసవ
వాసనావాసిత - వాతపోతముల
జాతివైరంబు లె - చ్చట లేని జంతు
జాతంబులను బర్ణ - శాలల మీఁద
నారవైచిన యట్టి - యరవిరి నార
చీరల హోమముల్ - సేయంగ నెగయు
పొగలను మౌనీంద్ర - పుత్రులు జదువు
నిగమంబులును స్వాదు - నీరంబు లొప్పు
కమలాకరంబులుఁ - గల తపోవనముఁ
గమలాప్తకులుఁడు ముం - గలఁ జూచి పలికె.

—: అగస్త్య మహర్షి మహిమాభి వర్ణనము :—

"కనుఁగొను మెదుట ల - క్ష్మణ! చూడఁజూడఁ
గనుపండువయ్యె! జ - గద్ధితంబైన
తన చరిత్రమ్ముచేఁ - దనరు నగస్త్య
మునివరాశ్రమము సన్ము - ని సేవితంబు!
ఈ యగస్త్యుఁడె సుమీ - యెల్ల దానవుల
మాయించి సురలకు - మనికిఁ గల్పించె
నీతఁడె కాఁడె జ - యించి మృత్యువును
వాతాపి నడఁచి యి - ల్వలుఁ బొడిచేసె
నీమునిగద! భానుఁ - డిట్టట్టు మెలఁగ

రామిగా వింధ్యప - ర్వతము మిన్నంద
మహిఁగ్రుంగఁద్రొక్కి - హి - మనగంబుఁదాను
వహియించుకొని జనా - వళి నుద్ధరించె
నీశాంతమూర్తి యే - హిమవన్నగమున
కీశుఁడు పెండ్లికి - నేఁగిన యపుడు
సురలెల్ల నుత్తర - క్షోణికి నేఁగ
ధరణి మొగ్గతిలంగ - దక్షిణంబునకు
నందఱికిని దుల - నై తాను వచ్చి
పొందుపాటుగ నిల్పె - పుడమి యాఁతయును
నీపుణ్య నిధి వార్ధి - తేడునుఁబట్టి
యాపోశనంబుగా - నరచేత నుంచె !
నితఁడు లోపాముద్ర - యిల్లాలు గాఁగ
నతిశయ పరమశ - ల్యాణంబు లందె !
నీ యాశ్రమంబులో - నింద్రాదిసురలు
సేయు పూజలొసంగు - చింతితార్థములు
నిమ్మౌని యనుమతి - నెట్టివారైన
తమ్మిచెచ్చెలిమేని - ద్వారంబు దూరి
లాలించు దేవతా - లలనలఁగూడి
యే లోకమునకైన - నేఁగఁ జాలుదురు;
ఇచ్చోట నుండిన - నిఁకమన వెతలు
ముచ్చటల్ దీఱ యి - మ్మునిరాజుఁ గొలిచి
మన పట్టణమున నె - మ్మది నున్నయట్టి
జనకజకుఁ బ్రియంబు - నమకూర్పవచ్చు
ముందర నేఁగి యి - మ్మునితోడ మనల
చందంబు జానకి - సహితంబుగాఁగ

యేను వచ్చుటయు నీ - వెఱింగింపు" మనుచు
నానతి యొసంగిన - నటుల లక్ష్మణుఁడు
నాకుంభజుని శిష్యు - నచ్చోటఁ జూచి
వాకొన్న సౌమిత్రి - వచనసంగతికి

—: శ్రీరామాగస్త్యుల సమావేశము :—

ఆచార్యసన్నిధి - కరిగి యో దేవ!
" రాచవారిద్దఱు - రమణి యొక్కతెయు
భానువంశజులఁట ! - పరికింపఁదమకు
జానకిరామల - క్ష్మణులఁట ! పేళ్లు
దశరథసుతులఁట ! - తమతండ్రి పనుపఁ
గృశియించి వనులఁ జ - రింపుచు మిమ్ము
సేవింపఁదమకు వ - చ్చిరఁట ! లక్ష్మణుఁడు
నావచ్చినాఁడు నీ - నారఘువరులు
కడనున్నవారఁట ! - క్రమ్మఱ యేమి
నుడువుదు ? నానతిం - డు మహాత్మ ! " యనినఁ
" గ్రక్కునం బిలువు మె - క్కడ నున్నవాఁడు ?
నిక్కము నేరాము - నిం గనవేడి
యెదురులు చూచితి - మిన్నాళ్లు నట్టి
సదయావలోకుఁ గా - సల్యాకుమారు
దశరథతనయు నీ - రామనోహరుని
శశివదనుని రామ - చంద్రుఁ దో తెమ్ము
పొ''మ్మన్న శిష్యుఁ డ - ప్పుడువచ్చి కరత
లమ్ములు మొగిచి యా - లక్ష్మణుఁ జూచి;
" ఎక్కడనున్నాఁడో - యిపుడు మీ యన్న

యుక్కడికేఁగి మా - యాచార్యునాజ్ఞ
నోడి తెత్తము రమ్ము - తోడనే రాముఁ
జూడ వేడుక నగ - స్త్యుఁడు నన్నుఁ బనిచె"
అన లక్ష్మణుఁడు దాను - నాశ్రమద్వార
మున కప్పుడేఁగి రా - ముని కవ్విధంబు
వివరించి పిలిచిన - వెలఁదియుఁ దాను
రవివంశమణి తదా - శ్రమములోఁజొచ్చి
యచ్చెర తపసియి - ల్లాండ్ర కెంగేలుఁ
దమ్ములు బ్రాలేయ - తండుల చయము
గ్రసియించుటకు వేళ - గాంచియిట్టట్టు
నసియాడు పోషిత - హరిణడింభములుఁ
గనుఁగొనుచును జన - కతనూజ తోడఁ
గనుసన్న సేయుచుఁ - గదియఁగా నెదుట
హాటకగర్భుఁడౌ - నలబ్రహ్మయుండు
చోటును పావకు - చోటును శౌరి
చోటును శతముఖు - చోటును భాను
చోటును సోముని - చోటును శివుని
చోటును విప్రుల - చోటు కుబేరు
చోటును వాయువు - చోటుననంతు
చోటును గాయత్రి - చోటును యముని
చోటును వసువుల - చోటును వరుణు
చోటును స్కంధుని - చోటును ధర్ము
చోటునుఁగనుచు న - చ్చో నవంతరమున
నెదురుగా శిష్యుల - సేవలు గొల్వ
నుదయార్క బింబ స - ముజ్జ్వలుం డగుచు

వచ్చు నగస్త్యుఁ డా - వనుఁ బుణ్యశీలు
వచ్చోట జూచి సీ - తాంగనా విభుఁడు
సాగిలి మ్రొక్కి య - జలి చేసి భక్తి
యోగంబుచే నేమి - యునుఁబల్కలేక
యూరక నిలుచున్న - నురుతపోధనుఁడు
గారవంబొప్ప రా - ఘవులఁ దీవించి
యట నిల్వుమని తన - యావాసమునకు
జటులు వెంబడిరాఁగఁ - జని వీతిహోత్రు
నారాధనముఁ జేసి - యతిథికోటులను
వాదుల మానుల - పంక్తు లమర్చి
యుండఁట వేర్వేర - నర్ఘ్యపాద్యములఁ
జందనాక్షతములఁ - జాల నర్చించి
భోజనాదులను తృ - ప్తులఁజేసి మౌని
రాజు ప్రక్కనట వచ్చి - రామునిఁ జూచి
తాదండ నొక కుశా - స్తరణంబు నందు
నాదరంబున నుంచి - యప్పుడిట్లనియె.
"వరనాథతనయ! వా - నప్రస్థులైన
వరమయోగీంద్రులు - పావక క్రియలఁ
దీరిచి చేసిన - తెరవరులకును
నీరమన్నమునిచ్చి - నెగులు వారింపఁ
దలఁపని యధముండు - దబ్బరసాక్షి
వలికిన నీచుఁడు - వదు నారకముల
తాఁబడి తనమేను - తాన భక్షించి
లోఁబడి వాఁడధో - లోకమ్ము వొందు"
నని ధర్మశాస్త్రంబు - లందుఁ దెల్పుటను

నినుఁ బూజసేయుట - నీతంబు మాకు!
కందమూలఫలాది - కములు మాచేత
నంది తృప్తుఁడవుగ - మ్మ"ని యర్చలిచ్చి

—: అగస్త్యమహర్షి శ్రీరామునకు వైష్ణవ కోదండ తూణీరముల నిచ్చుట :—

"శ్రీరామ! తొల్లి రా - జీవలోచనుఁడు
భూరికాంచనమయం - బును సునాభంబు
నతివజ్రసారంబు - హరిదాన వేంద్ర
శతమును దేవతా - సౌఖ్యకారణము
వనితరసాధ్యంబు - నాహవవిజయ
జనకంబు భానుతే - జస్సమన్వితము
నక్షయదివ్యశ - రాస్త్ర తూణీర
మహితంబజహార - శ్లాఘనీయంబు
నగునట్టి వైష్ణవం - బైన కోదండ
మగి వైరి వశముగా - నపుడుంచెఁ గాన
నతఁడవి తెచ్చి నా - యాశ్రమసీమ
జతనంబుగా నుంచి - చనియె గావునను
నేమది పూజించి - యెదురులు చూడ
రామ! వచ్చితివ కా - రణ బాంధవుఁడవు!
హరినందకము నీకే - యసి జోడు కాదె!
హరిహయుం డొసఁగంచె - నావింటితోడ
యీవిల్లు నీయమ్ము - లీనిషంగంబు
లివాలు నిచ్చెద - నీవు గైకొనుము!"
అనిపైఁడి యొరతోడి - యడిదంబు నంప

దానయుతుఁ విల్లూఁది - ద్రోఁడ నొరంగ
శ్రీరామ! యలసి వ - చ్చినవారు మీరు
లారామశీత ర - మ్యప్రదేశముల
వసియింపుఁడీసీత - వసివాళ్లు వాడి
కనుగంది మునితోఁ - గాసిల్లె మిగుల
సన్నుతుఁడనలమట - లెఱుఁగదీసాధ్వి
యిన్నిపాటుల కోర్చి - నేమనవచ్చు!
వనులకుఁ బతిదైవ దై - వంబుగా నెంచి
నినుఁగూడి వచ్చెనీ - నిత్యకల్యాణి!
మగని మేలునకోర్చి - మనసిచ్చి నడచు
మగువలెకాక భూ - మండలియందు
నిటువంటి సతిగల - దే! వధూమణులు
కుటిలమానసులు పే - ర్కొన నెల్లవారు!
చపలాలతలవంటి - చంచలత్వంబు
నెపుడు నమ్ములతోడ - నెనయు వాఁడియును
గరుడవాయువులకుఁ - గలుగు వేగంబు
తరుణులకెందుఁ జి - త్తములందుఁ గలదు!
మాన్యయీసీత నీ - మానిని గాన
ధన్యవర్తన నరుం - ధతియునుఁ బోలి
యుత్తమగుణముల - యునికి పట్టైన
యుత్తలోదరిఁ గూడి - యుదట నీరాత్రి
నావనంబెల్ల ధ - న్యంబును లోక
పావనంబును గాఁగఁ - బవళింపుఁడనిన
నమ్ముని యనుమతి - నచట మువ్వురును
నెమ్మితోఁ శయనించి - నిదురించి లేచి

తెలవాఱఁ దగువిధుల్ - దీర్చి మువ్వురును
కలశ సంభవుని చెం - గటఁ జేరవచ్చి
కరములు మొగిచ రా - ఘవు మోముఁ జూచి
కరుణదైవార న - గస్త్యుఁడిట్లనియె.

—: అగస్త్యుఁడు గోదావరి తీరస్థపంచవటినిగుఱించి చెప్పుట :—

"శ్రీరామ! యీరేయి - సీతతో నిచటి
యారామమున నిద్ర - నంది సౌఖ్యమున
దినకృత్యములు దీర్చి - తే నీకు నేఁడు
పనియెద్ది? వివరించి - పలుకుమా" యనిన
"మునినాథ! యెచ్చోట - మువ్వుర మేము
వనవాస మీడేర్చి - వసియింప వలయు
తగిన చోటిది యని - తలఁచి మాతోడ
విగణింపు" మనిని న - వ్విమల మానసుఁడు
నొకకొంత సేపు తా - నూరకె తలఁచి
సకలజ్ఞుఁ డగు నగ - స్త్య మునీంద్రుఁ డనియె
"జననాథ! రెండుయో - జనముల మేర
వనము చెల్వగు పంచ - వటియను పేర
నొక్క రమ్యస్థలం - బున్నది మీకు
నక్కడఁ గలుగుని - ష్టార్థంబు లెల్ల
మీరెంచి దశరథు - మీఁది నెయ్యంబుఁ
బాలించి యచటికిఁ - బనిచెద మిమ్ము.
మాయభీష్టము నీవు - మాయాశ్రమమున
జాయతో వసియింపఁ - జాల సమ్మతము;
అటులయ్యు మీపాద - యముల వర్తనము

నిటమీఁది కార్యంబు - నేయోగదృష్టి
భావించి చూచితిమీ - పలికిన యట్లు
యీవనంబునకుఁ బొం - డని పంపవలసె
పంచవటీవనీ - భాగంబు లనుస
రించి యాగోదావ - రీ సమీపముల
వలయు వన్యములైన - వస్తువుల్గొనుచు
కొలఁగుఁ డిచ్చటికి స - మీప మచ్చోటు
యేకాంతమది మీకు - ఋషులనందఱిని
చేకొని వారి ర - క్షింపుఁ డచ్చోట
గనుఁగొంటిరే మధూ - కవనంబు పొన్న
పొన నల్లనైనతోఁ - పు రఘుప్రవీర !
యా తోఁపునకు నుత్త - రాశగాఁ బోవఁ
బ్రీతిఁ బుట్టించు మ - త్తిమోకందు చెంత
నామత్తి పడమటి - యందనే యొక్క
భూమీధరంబు చూ - పుల విందుసేయుఁ
బడమర యచటి కా - పావనాశ్రమము
పొడ గానవచ్చు గుం - పుగ నైదుచెట్లు"
అనిత్రోవ వివరించి - యపుడగస్త్యుండు
పనిచిన నమ్మౌని - పదముల వ్రాలి
యయ్యాశ్రమముఁగాచు - నజమారాదులకుఁ
జెయ్యెత్తి మ్రొక్కి ద - క్షిణముగా వెడలి
ధనువుఁ దూపులు నంది - తమ్ముఁడు సతియు
వెనుకరా నతిఘోర - విపిన మార్గమునఁ

—: జటాయు సందర్శనము :—

బంచవటికిఁ బోవు - పయనంబు నందు
నంచితశాఖావృ - తాకాశ యగుచు

నీడలతో నొప్పు - నొక పెనుమఱ్ఱి
జాడగా వచ్చి యా - శాఖముఖ్యులను
వసియింపుచో నొక్క - వలనైన కొమ్మ
నెసఁగుజటాయువు - నీక్షించి యలరి
" ఎవ్వఁడవీవు నీ - యిరవెద్ది ? తండ్రి
యెవ్వఁడు నీకుఁ జే - రెయ్యది " యనిన
" నీతండ్రి చెలికాఁడ - నే జటాయువును
సీతతో నీవు వ - చ్చినఁ జూడగంటి
మనఁగంటి నేనన్న " - మాటకా రాముఁ
డనఘమానసుని జ - టాయువుఁ జూచి
యేరీతి మాతండ్రి - కీవు నెయ్యుఁడవు
మారాజునకు నీకు - మచ్చికయైన
కతమెట్టు " లనిపల్క - ఖగవతంసంబు
క్షితిసుతారమణు నీ - క్షించి యిట్లనియె.

— జటాయువు వంశాను కథనము: —

" సదయాత్మ ! బ్రహ్మ వం - శజులము మేము
తుదిమొదల్ దెలియ నీ - తో వివరింతు
కృతముఁగర్దముఁడు వి - కృతుఁడు శేషుండు
నతని డాసిన సంశ్ర - యాఖ్యుండు వీర్య
వంతుండు బహుపుత్ర - వరుఁడు స్థాణుండు
నంత మరీచియు - నత్రియుఁ గ్రతువు
నావెనుకఁ బులస్త్యుఁ - డాంగిరసుండు
నావరసఁ బ్రచేత - సాఖ్య పులహులు

దొరసి దక్షువివస్వ - తు లరిష్టనేమి
బెరసిరి ధాతకు - బ్రియపుత్రులగుచు
నృపశేఖర! యరిష్ట - నేమియన్ వాఁడె
యపుడు కాశ్యప భూపుఁ - డనవన్నె కెక్కె
నజుని మానసపుత్రు - లగు వీరియందు
సుజనవందితుఁడు ద - క్షుఁడు తనూజులను
కోరి యర్వదిలెక్క - గనుగాంచె నట్టి
వారిలో నేనమంద్రు - వనితల నిచ్చె
ననఘు కాశ్యపునకు - నదితియు, దితియు,
దనువు, కాళికయునుఁ - దామ్రయుఁ, గ్రోధ
వశ, మను, వనలయన్ - వారల నట్టి
శశిబింబముఖులఁ గా - శ్యపుఁడు వరించి
యారమణులఁ జూచి - యలివేణులార!
కూరిమి తనయులఁ - గోరుండు మీర
లిచ్చెదనని" పల్క - నింతులు గొంద
ఱిచ్ఛగించిరి కొంద - ఱేమియు ననక
నురకుండి రదితికి - నుదయించి రప్పు
డరయముప్పది మువ్వ - రాదిత్య వరులు
నేనమంద్రు వసువులు - నినులు పన్నిద్ద
రును బదునొక్కండ్రు - రుద్రులశ్వులును
నిరువురుగా వార - లిద్ధతేజముల
ధరణిపై వెలసి, రా - తరవాత దితికి
నసురులు జన్మించి - రానిశాచరులు
వసుధఁ బాలించి త - వార్య శౌర్యమున
దనువను నతివ గం - ధర్వులం గనియెఁ

గనియెను గాళిక - కాలకాముడని
నరకాసురునిఁ దామ్ర - నందనీమణులఁ
బొరసె పక్షులజాతి - పొదల నేవురను
నవిక్రౌంచి యన భాసి - యన శ్యేని యనఁగ
రవివంశ! శుకిధృత - రాష్ట్రియు ననఁగ
నందులో గూబల - నలక్రౌంచి గాంచె
నందను బాతుల - నాభాసిభాస
శ్యేనిగృధ్రములఁ గాం - చెను ధృతరాష్ట్రి
కానుపు హంస చ - క్రద్వయంబయ్యె
శుకిగాంచె నతను నా - సుందరివినత
నొకతేఁ గాంచెను మరి - యును క్రోధవశకుఁ
గలిగిరి పదువురు - కన్యలు మృగియు
నల మృగమందయు - హరి భద్రమదయు
మాతంగి శార్దూలి - మరి కద్రురోమ
శ్వేతయు సురసయు - క్షితి సురభియును
నను పదువురియందు - నల మృగజాతిఁ
గనియెను మృగి రిక్ష - గణచమరముల
మృగమంద గనియె నె - మ్మని భద్రమంద
నెగడు నిరావతి - నితనూజఁ గనియె
నాయిరావతి గాంచె - నైరావతంబు
నాయెడ హరిగాంచె - హరులు గోఁతులను;
శార్దూలగవయాది - సంతతినెల్ల
శార్దూలి గనియెను - సామజంబులను
మాతంగి గనియెను - మరి శ్వేతగాంచె
ఖ్యాతిగా నష్టది - గ్గజ వరంబులను

సురభి రోహిణియును - సుదతి గంధర్వి
నిరుపురం గనియె రో - హిణికి నావులును
గంధర్వి యనునట్టి - కన్యకు సుతులు
గంధర్వాలను వారుం - గలిగిరి వరుస
సురసకు నాగరా - జులు సుతులైరి
గరిమతోం గద్రువు - గాంచెం బన్నగుల
మనువను భామ బ్ర - హ్మక్షత్రవైశ్య
జనశూద్రులను గాంచె - జాతులేర్పడంగ
ననలకుం గలిగె మ - హా భూరుహములు
వినత యాశుకియును - వెలందికిం బుత్రి
సురసకుం గద్రువు - చూడంగ చెలియ
లరయం గద్రువుగాంచె - నలశేషు మొదట
నతండు సహస్ర ఫ - ణావళి చేత
క్షితిం దాల్చుం దాలిమి - చే నల్లనాండు
వినతకనూరుండు - విహగవల్లభుండు
జనియించి రందుజ్యే - ష్ఠ కుమారుండైన
యట్టి యనూరిని - యందు సంపాతి
పుట్టె నాయనతోడం - బుట్టిన వాండ
నన్ను జటాయువ - నంగ వంశమున
నెన్నికం గనువాండ - నేనైననన్ను
నాసించి యడిగిన - యర్థంబుం దెచ్చి
యీ సమర్థుండ జుమ్ము - నీకు నిచ్చుటకు
నడవిలో నాసహా - యత మీకు నలయు
నిడుమలపాలు గా - నేను తోడైన
నిచటి దైత్యులబాధ - నుంతని నీకు

వచియింతు! మీరొంటి - వచ్చిన వార
లదిగాక సీతాస - హాయులై మీకుఁ
దుదిలేని యనుదిన - దుఃఖకారణముఁ
గావున నీవు ల - క్ష్మణుఁడు వేరొక్క
తావుల కేఁగిన - ధరణిజ నేను
కాచి యుండఁగశక్తిఁ - గలిగిన వాఁడ
నాచేతఁ దీరు నెం - తటి కార్యమైన
వస్తునే!" యన రఘు - వరుఁ డట్టిమాట
చిత్తంబులోన మె - చ్చి ప్రసన్నుఁడగుచు
నాలింగనము జేసి - యర్చ్యలొసంగి
చాలంగ మధురభా - షణములు పల్కి

— జటాయువుతోసహా శ్రీరామ సీతాలక్ష్మణుల పంచవటీ ప్రవేశము :—

తరుణితోఁ దనవెంట - తమ్ముఁడు పక్షి
వరుఁడును రాఁ బంచ - వటి కేఁగు నపుడు
దానవశలభముల్ - తనదివ్యాస్త్ర శి
ఖానల జ్వాలల - నణఁగుఁగాకనుచు
మదిఁ దలఁపుచుఁ బోవు - మార్గంబునందు
నది చూదుముని రాముఁ - దనుజుతోఁ బలికె
"సౌమిత్రి! తృణకాష్ఠ - జలసమృద్ధంబు
భూమికి నెల్ల వి - భూషణంబైన
యీ పంచవటీ జూడు - మిది యగస్త్యుండు
చూపి చెప్పినయట్టి - చోటు గావునను
నెందైన మనకొక - యిలుగట్టియుండ

నందుకుఁదగిన చో - టది విచారించి
రమ్మని" పల్కిన - రాముని మాట
సమ్మతంబగుట ల - క్ష్మణుఁ డిట్టులనియె
"దేవ! మీచిత్తమే - తీరున నుండె
నావిధి మెలఁగ స - మర్థుండగాక
తనకేమి దెలియునే - తఱిఁ బర్ణశాల
యొనరింపఁ దగునని - యూహించి పలుక
నేవేళ నయ్యెడ - నేమి కార్యంబు
కావలసినఁ బిల్చి - కట్టడచేసి
పనిఁగొనఁ దగుఁగాక - బంటనై యున్న
ననువేఁడనేల మీ - నగరి కార్యములు"
అనవిని "లక్ష్మణ! - హరిణాది వివిధ
వనజంతువులకు ని - వాసమిచ్చోటు
యిందుల సెలయేరు - లిసుకదిన్నెలును
గందరంబులు సార - కాసారములును
గదలికా మాకంద - ఖర్జూరనింబ
బదరిరసాల రం - భా బిల్వపనస
కేతకీ కుందకం - కేళీలవంగ
జాతిలతా సమం - జస మంజరులును
నేదాకనంటుల - నెండిన పొరల
పీడిరానులుగాఁగ - విపిన మార్గములఁ
బలకలై తొరఁగిన - పచ్చకప్పురపు
తెలిదుమారము రేచు - తెమ్మెరల్ గనుము!
గుడిసెలగతి నొప్పు - గొజ్జంగ పొదల
వడియుఁ బన్నీటి కా - ల్వల కెలంకులను

చలువలీనెడుఁ జాలి - చలువల మృగము
దాలఁగి పోలేక ని - ద్దుర బోవు వేళ
మడువు కట్టిన నాభి - మదరక్తధార
పుడిసిలించుక చెంచు - ప్రోయాండ్లు దెచ్చి
మునిమూఁగ శాలల - ముంగిలులలికి
చనుట జూచితివె ల - క్ష్మణ! పంచవటిని
నల్ల గోదావరి - నళికదంబములు
పుల్లాంబుజములపై - పూఁదేనియలను
నసియాడి ఘుమ్మని - యంచల మొరయు
బిసములు మెసవక - బెదరు చూపులనుఁ
గలహంస చక్రవా - క ప్రముఖములు
మెలఁగక యున్నవి - మేలిమి తెరల
నీయేటి తేటనీ - టించుకఁ గ్రోలఁ
గాయంబు శ్రేయోని - కాయమై యుండు
జానకి యీనికుం - జముల వసించి
మానునయోధ్యపై - మమత యుల్లమున
సవరపు మెకము లి - చ్చటి రేవులందు
నవతరించి జలంబు - లాని క్రమ్మరిన
వాలచామరములు - వాతూల వలన
లోలవల్లరుల న - ల్లుక ముళ్లు వడిన
తప్పించుకొన కేర్లు - దాఁటి యట్టిట్టు
కుప్పించి యపుడురి - గోలలం బడిన
తీరున వదనముల్ - దెంచి యొచ్చటికిఁ
బోరాక దిగులుచే - బోరలల్లాడ
కలఁగు చందము మాని - కన్నులు చూచి

కెలనికిఁ జేరి వె - గ్గలనీక దుర్వా
యాదిక్కు లెడలింప - నవిదాఁటి మఱలి
చూచుచుఁ బారెడు - సొబగుఁ జూచితివా!
యీజటాయువుఁ గూడి - యిచ్చోటి మాని
రాజులకెల్ల నూ - రట చేసి యుండు

—: సౌమిత్రి పర్ణశాలను నిర్మించుట :—

వసియింత" మని పల్కి - వడి నొక్కచోటి
కనువెల్లఁ బోఁజెక్కి - గాఁతముల్ త్రవ్వి
జమ్మిమ్రాకులను గుం - జలునిల్పి యిప్ప
కొమ్మల దూలముల్ - గొట్టి యమర్చి
ముదురులై చక్కనై - ములు జీరనట్టి
వెదురు బొంగులు దెచ్చి - వెసఁగయిలెత్తి
నిడుపాటి వేఁప పెం - డెలుగట్టి మీఁద
పొడువాటి దర్భఁ - ప్పుడు వాసపోసి
మొగదల నాయుధం - బులశాల హోమ
జగతియు నిర్మించి - చలువచప్పరము
విప్పుగా నైచియా - వెలిములుకంప
గొప్ప యేనుఁగ పొదు - గున పొంకపఱచి
గావలిగుడిసె రాయి - కట్టి తా వసింపఁ
క్రేవల నునిచి వా - కిటఁ దల్పులునిచి
సన్నజాజులును గొ - జ్జంగి తామరలు
పన్నీరు పుష్పాలు - పాదిరి విరులు
కలువలు సంపెఁగల్ - ఘుమ్మను తావి
వలపు దండలు గట్టి - వడిఁదీర్ఘమాడి

నారికేళపు టాకు – న నమర్చి దళ్లి
నేరాళముగ పువ్వు – లెత్తులు గట్టి
కురువేరు వటివేరుఁ – గూర్చిన జల్లు
లిరవుల వాసింప – నిండెల్ల విరుల
మేలు కట్టులు గట్టి – మేదినియూడ్చి
పాళెలు నరఁటి కం – బములు నమర్చి
చెఱకు కోలలు నాఁటి – సిరము కప్పురము
పఱచి ముగ్గులు దీర్చి – పడకింటిలోనఁ
బువ్వుఁ బానుపు చెంత – బుగబుగ తావి
నివ్వటిల్లఁగ ధూప – నికరంబమర్చి
వచ్చి యన్నకు మ్రొక్కి – వనజాక్ష! రామ!
విచ్చేయుఁడింటికి – విడిది యేర్పడియె"
నని తోడుకుని పోయి – యాపర్ణశాల
గనిపించు కమ్మని – కందమూలములు
పనసరసాలాది – ఫలములు కానుక
యునిచి చెంగట నిల్చి – యున్న సౌమిత్రిఁ
గనుఁగొని సంతోష – కలితుఁడై మెచ్చు
గనిపింప రఘుకులా – గ్రణి యిట్టులనియె.
"అన్న! లక్ష్మణ! యోగ్య – హాంబు నిర్మింపఁ
గన్నట్టి మెచ్చు బ్రిం – గఁగరాదు నాకు!
హైన నేమిచ్చెద – నాలింగనంబె
కాని నీకని" చేరి – కౌఁగిటం జేర్చి
యోచమత్కారమా – విన్నాణ్మ నెందు
డాఁచితి? ధర్మజ్ఞుఁ – డవు కృతజ్ఞుఁడవు
భావజ్ఞుఁడవు! తండ్రి – పరలోకముననుఁ

బోవు విచారమి - ప్పుడు నీకె కాక
నినువంటి తమ్ముఁడుం - డినయట్టినాకుఁ
బనియేమి! తండ్రినా - పాలిటున్నాఁడు!"
అనుచుఁ గ్రమ్మరఁ జేరి - యక్కునఁ జేర్చి
జనకజఁగూడి యా - శాలాంతరమున
నింద్రభోగము మది - నెంచక రాము
చంద్రుఁడు గొన్నాళ్లు - సంప్రీతినుండె

—: హేమంత వర్ణనము :—

మఱియొక్కనాడు హే - మంతకాలమున
కుఱకుఱ సోనచి - న్కులు కురియంగ
సౌమిత్రిచేఁ గల - శముఁగొని రాఁగ
రాముఁడు జానకీ - రమణియుఁదాను
గోదావరినిఁ గ్రుంకఁ - గోరి ప్రాహ్ణమున
నీఁదుకు జడియక - యేఁగ వీక్షించి
సన్నపు మంచు పై - జడిగొన నేఁగు
నన్నతో లక్ష్మణుం - డప్పుడిట్లనియె
"అయ్య! యీ యడవినీ - హారంబు మించె
నెయ్యెడ పంటల - నెసఁగ ధరిత్రి
చలువలగ్గలమయ్యె - జలముల నెల్ల
వెలుఁగక పొగసూరె - వీతిహోత్రుండు
ఘనులైనవారలా - గ్రయణేష్టిచేసి
తనియించి పితృదేవ - తలఁ బుణ్యులైరి
పల్లెలన్నియుఁ గూడి - పంటలచేత
నుల్లసిల్లుచుఁ జాల - నుప్పొంగె నిపుడు

రాజుల దండయా - త్రల తరియయ్యె
రాజీవహితుఁడు పు - త్రకు దిక్కుఁజేర
దక్షిణాయనమైన - తరి నుత్తరాశ
వీక్షింపఁ దపనుండు - వెలియైన కతనఁ
దిలకంబు లేనట్టి - తెలివయుం బోలి
విలసన శ్రీలచే - విలసిల్లదయ్యె
దూరమై దినమణి - దొలఁగి చరింప
బీరెండకాఁకలఁ - బెడఁబాయు కతన
మంచుగుబ్బలిని హి - మాని మించుటయు
నంచితంబయ్యె య - థార్థనామంబు
బడలికల్ దోఁచక - పగలయ్యె నెండ
యుడివోయి సంచార - యోగ్యమై యలరె
నీటిలోపలియందు - నీడలయందు
పాటించి చేరఁజొ - ప్పడ దెవ్వరికిని
నిలవరములు చేసె - నిశల వేల్పెటను
తొలఁగె తారకములు - తుహినంబు నిండి
రాత్రియామములు దీ - ర్ఘంబులై మించె
చిత్రంబు చంద్రునీ - క్షింప నియ్యెడల
మనుజుల యూర్పుల - మాసి యద్దంబు
పొనఁగినగతి హిమం - బునఁ గెంపుఁదఱిగి
యొండకొట్టునఁ గందు - నీసీత మాడ్కి
నుండె చంద్రిక యిప్పు - డొరపెల్ల మాని
యలుగులు రా వారి - యనువునఁజాల
వలిమీరి నుత్తర - వాయువుల్ విసరె
గోధూమసస్య సం - కులములై వనము

లాధూమములు గప్ప - నటులఁ గప్పట్టి
పసిఁడి నిగ్గులు దేఱు - పంటల నొఱఁగి
మొసఁగె రాజనపు చె - ల్వోసీత ముందు
సాంద్రతేజము లేక - సవితృ మండలము
చంద్రమండలముతో - సరివచ్చె నిపుడు
పచ్చిక గల్గిన - పట్టుల మంచు
తెచ్చె నీరెండల - నీ ప్రభాతమున
నీరాశఁ జేఁబోయి - నీరు తుండములఁ
బూరింప విడె గజం - బులు చలిచేత
పిఱికివా రని కేఁగ - భీతిలినట్లు
సరసులఁ జేరదీ - జలపక్షి కులము
పూయుకవనము లి - ప్పుడు నిద్రవోవు
చాయ నున్నదిగంటె - సవరణ లేక
హిమవారిఁ దోఁగిన - యిసుక దిన్నెలును
దెమలక పాతెన - దీప్రవాహములు
నెండలఁ గ్రాఁగక - హిమవారి నెనసి
యుండుట జాలించి - యున్నవంబువులు
కొలఁకులఁ దామర - కులములఁ దూండ్లు
నిలువఁ బువ్వులమాట - నిర్నామమయ్యె
నీకాలమున నిన్ను - నెనసిన తపముఁ
గైకొని భరతుఁడే - గతి నున్నవాఁడొ!
మనరీతి భరతుండు - మానినైయె మెట్లు
చనువాఁడొ యావేళ - స్నానంబు సేయ!
గుణవంతుఁ డగుకైక - కొడుకు సమస్త
మణిభూషణంబులు - మాని యిప్పుడు

తలఁపుచుండుటఁ జేసి - తాను జయింపఁ
గలఁడు స్వర్గాదిలో - కంబులన్నియును
తల్లుల నడకలు - దలఁచి యూఁదింతు
రెల్లరు నతఁడొక్కఁ - డే తండ్రిఁబోలె
నట్టి లోకోత్తరుం - డైనట్టి మగఁడు
నిట్టి సద్గుణముల - కిరవైన సుతుఁడు
కలిగియు నేలకో - కైకకు నిట్లు
కులమెల్లఁ జెఱచు దు - ర్గుణము వాటిల్లె!"
అను మాట కడువేఁడి - యై చెవిసోఁక
విని సహింపక రఘు - వీరుండు పలికె
"నిందింతురే కైక - నీవు నాయెదుర
నందంబు కాదు గు - ణాఢ్యుఁడైనట్టి
భరతునినోపికం - బలుమారుఁ బొగడ
నరలేని భరతుని - యందు నామనము
కరఁగుచునున్నదే - కడఁగలనైన
మఱపురా వాయన - మాటలిప్పుడును!
ఎన్నఁడొకో మన - మింక నొక్క నాఁటి
కన్నదమ్ములమొక్క - టై నలువురము
నొండొరులనుఁ జూచు - చుండు కోరికలు
పండిన భాగ్యసం - పదలు చేకూడు!"
అని పల్కుచును జన - కాత్మజ వెంటఁ
జనుదేర మువ్వురుఁ - జనిరమ్యమైన
గోదావరీ నదీ - కూలంబుఁ జేరి
స్వాదు జలంబుల - స్నానంబుఁ జేసి
నిత్యకర్మంబు ల - న్నియుఁ దీర్చి పరమ

సత్యప్రకాశాచార - సంపన్నుఁడైన
రాముఁడు నంది పా - ర్వతులతోఁ గూడ
నామేరు కోదండుఁ -డనఁ బెంపుఁగాంచి
మఱలి నిజాశ్రమ - మందిరంబునకుఁ
బరమసంయములు సం - భావింప వచ్చి
యచ్చోట సౌమిత్రి - యందు నెయ్యమున
ముచ్చట లాడుచు - ముదితాత్ముఁడైన
ధరణిజఁగూడి చి - త్రాసమేతముగ
హరిణాంకుఁ డున్నట్టి - యందంబు మీఱ
ననురాగరసలోలుఁ - డై తగినట్టి
యనువున వర్తించు - నాసమయమున

— శూర్పణఖ పంచవటికి వచ్చుట —

రావణు సోదరి - రాక్షసి దుర్గు
ణావృత లోకభ - యంకరాకార
పాపి శూర్పణఖ యా - పర్ణశాలా స
మీపమ్మునకు వచ్చి - మిహిరసంకాశు
నాజానుబాహుఁ జం - ద్రానను వికచ
రాజీవలోచను - రఘుకులోత్తముని
మత్తేభగమనుఁ గో - మల నీలవర్ణు
నుత్తమగుణుఁ గృత - యుగభాగధేయు
వరపుణ్యనిధి జటా - వల్కల కలితు
శరణాగతత్రాణు - జానకీ రమణు
రామచంద్రుని మహో - రాజలక్షణునిఁ
గామించి దుర్ముఖ - గదిసి యిట్లనియె,

—: కాముకురాలైన శూర్పణఖ శ్రీరామునితో మాట్లాడుట :—

" మౌనివేషంబున - మానినిఁగూడి
కానలలో నుండఁ - గారణంబేమి ?
యెవ్వారు మీరు పే - రెఱిఁగింపు " మనిన
నవ్వీరవరుఁడు ని - శాటినిఁ జూచి
కలయర్థమెల్ల ని - క్కము కాని బొంకు
పలుకఁడుగాన డా - పల సీత యునికి
యందుపై మునివృత్తి - నలరుట నున్న
చందంబె కాఁగ డాఁ - చక యిట్టులనియె.
" భానువంశజుల మీ - బాల నారమణి
జానకి పేరు ల - క్ష్మణుఁడందు రితని
తమ్ముఁడితఁడు నేను - దశరథ సుతుఁడ
రమ్మ నాపేరు శ్రీ - రామచంద్రుండు
దానవివలె నున్న - దాన వెవ్వతెవు ?
నీనెలవెయ్యది ? - నీకుఁ బేరేమి ? "
యనిన శూర్పణఖ మ - హారాజతనయుఁ
గనుఁగొని మదినిఁ గొం - కక యిట్టులనియె.
" నే దానవిని నాకు - నెలవీవనంబు
నాదు నామము శూర్ప - ణఖయందు రెందు
నాశ్రమస్వేచ్ఛావి - హారిణి నేను
వైశ్రవణుండు రా - వణుఁడు నాయన్న
లోకభీకరుఁడు త్రి - లోక సంహారి
యాకుంభకర్ణుఁడా - యన సోదరుండు

ఖరదూషణాది రా - క్షసులు నాదైత్య
వరునకుఁ దమ్ముల - వార్య విక్రములు
పైఁ గోడు మా విభీ - షణుఁడందులోన
సాధువర్తనవాఁడు - సత్పురుషుండు
నిందఱి తోఁబుట్టి - యిచ్చట వచ్చు
చందానఁగామ సం - చారిణి నగుచుఁ
జరియింతు నీసీత - చక్కఁదనంబు
సరిగాదు నీదివ్య - సౌందర్యమునకుఁ
గాంతలయందుఁ జ - క్కని దాననేను
కంతునిఁ జేటుకు సిం - గాణికి లోఁగి
నినుఁజూచి మదినిల్వ - నేరక వలచి
యనురాగ రసవార్ధి - యందుఁ దేలితిని !
కొఱమాలినట్టి యా - కొంకిబికి సీత
బరిహరింపుము నాదు - పలుకియ్యకొనుము
నీచెలువును నీదు - నిండుజవ్వనముఁ
జూచు వారలుసీతఁ - జూచియేమంద్రు
కాంచనరత్న సం - గతి నన్నువంటి
చంచలేక్షణ నీకు - జతఁగూడ వలదె !
వలసిన చోటి కేఁగి - వలసిన రూప
ములనుందు నీమది - ముచ్చటఁదీర్తు
నీ లక్ష్మణుని సీత - నిప్పుడే మ్రింగి
వేళంబెనీకు నే - విలఁదినయ్యెదను !
ఈవనంబులయందు - నీగిరులందు
నీవేడ్కఁ జెల్లింప - నేర్తు నిన్నటను

ననుమతి యిమ్మన్న" - యానిశాచరినిఁ
గని నవ్వి రఘుకులా - గ్రణి యిట్లులనియె

—: రామ శూర్పణఖల సంవాదము :—

" ఐనదైనను గాని - దైన నాకొక్క
మానినియున్నది - మాత్రంబె చాలు!
జడలు వల్కలము లి - చ్చటఁదాల్చి యొంటి
నడవులలో మౌని - నై యున్న నాకుఁ
బరిచర్య లొనరింప - బలుకుతోడునకుఁ
దరుణిమాత్రమెచాలు - తాజితేంద్రియుఁడ
నెచ్చోట సరిలేని - యింతివి గాన
నిచ్చోట సవతిపో - రేఁటికి నీకు ?
ననుఁబాయనేరదీ - నాతి యీరమణిఁ
గనుఁబ్రామి యెడఁబాయఁ - గాజాల నేను
మనసొక్క కడనుండ - మఱివేఱె చక్కఁ
దనము లాసింప రెం - తటి మగవారు
మెలఁత! యింతేల నీ - మీఁదటి యాస
గలుగదు నాకుఁ బొం - కముగాదు నీకు
సౌందర్యశాలి వి - చ్చట నంటు లేదు
సుందరులను వేడ్కఁ - జూచి కామించు
కొమరుఁ బాయపువాఁడు - కోరిన నీకు
నమరు సౌమిత్రిపై - నాసించి చేర
మేరువుపై నంటు - మిహిరుని దీప్తి
తీరున నతనిఁ బొం - దినఁ దగు నీకు
నాలు లేని విచార - మతని చిత్తమునఁ

జాల నున్నది పొమ్ము - జాగేల! యిచట
నొంటిగా నచ్చోట - నున్నట్టి వాఁడు
కంటిబొట్టుగ నీదు - కండెలు నుండు
నతని యిల్లాలిపై - యక్కరల్ దీరి
జతఁగూడి యుందుము - సమరాగములను
జనుమని" పలుక ల - క్ష్మణుఁ జేరఁబోయి
దనుజ కామాంధయై - తమకించి పలికె

—: శ్రీరామునిచేఁ దిరస్కృతయై శూర్పణఖ సౌమిత్రిని సమీపించుట :—

"తగినట్టి దాన నీ - తరివచ్చి యిట్టి
పొగరు జవ్వనము న - బ్బురపు చెల్వంబుఁ
గలిగి యొంటిగ నిట్లు - కానలోపలనుఁ
జెలువెల్ల నడవిఁగా - సిన జ్యోత్స్న కరణి
తెకతెరఁదోప చే - టికిఁ దారకితిని!
సుకుమార మూర్తివి - చ్చోనొంటి గాఁగ
నారి లేకిట్లు స - న్యాసియుఁ బోలి
నారచీరలుగట్టి - నవయ నేమిటికి?
నను వరియించిన - నానాఁటి కీవుఁ
గననేర్తు వింద్రభో - గములిట్టి మేనఁ
గాఁగిలి యాసించి - కదియఁ జేరంగ
లోఁగిన దను దయా - లోకమాలికలఁ
గను" మన్న వెగటు బిం - కంపు లేఁతనవ్వుఁ
గనుపింప నతఁడు ర - క్కసికి నిట్లనియె.
"ఏలిక లటులుండ - నెందు దాసులకుఁ

బోలునే యిటువంటి - భోగభాగ్యములు !
యేను రాముని బంట - నెఱుఁగక వచ్చి
మానిని ! బేలవై - మందలించెదవు !
వారు చెప్పిన పనుల్ - వడి రేవగల్లు
నూరట లేక యే - నొందుచుఁ జేసి
యధమ జీవనుఁడనై - యరవిరి గుడిసె
నధిక భయంబుతో - నణఁగి యున్నట్టి
యేనెడ నీపెక్క - డంతకు నంత !
మానినీమణి ! నాకు - మగువ వైనపుడె
దానిపై సీత క్రిం - దట నూడిగములు
జేసుక యాయమ్మ - చెప్పిన యట్లు
నడవనేర్తువె నీవు ! - నాకేమి పోదు !
పడఁతులతోడ సం - భాషింపరాదు
అకట ! కురూపిణి - వైన యాసీత
నొకనాఁడు చేరఁగ - నొల్లఁడా ఘనుఁడు !
నినుఁజూచు కన్నుల - నెలఁతను వేఱె
కననేర్చునే యలం - కారనాయకుఁడు !
అతనికి నీవు చి - న్నారివై యున్న
నతిశయ సౌఖ్యంబు - లందఁజాలుదువు
తరవాత సీతఁ జం - తకుఁ జేరనీక
పరిహరింతువు నిన్నుఁ - బాయలేఁడతఁడు
నాబుద్ధి విని రాము - నకు దేవివైన
నో బాల ! రాముఁడ - యోధ్యకుఁజనిన
లేదు ! అందఱికినే - లికసాని వగుచు
నీమకు లేనట్టి - సిరులఁ బొందెదవు !

పొమ్మ" న్న మటలి యా - పొలదిండి ముద్దు
గుమ్మ యామాటని - కుక్కవముగా నెంచి
తూర్ణమై ఖరి జగ - ద్రోహిణి యపుడె
పర్ణశాలను సీతఁ - బాయక యున్న
రాముని కడకు చే - రఁగనేఁగి మిగుల
గామిడితనముతో - గద్దించిపలికె
" ముసలిది చెలువంబు - మొదటనే లేదు
రసికురాలును గాదు - రామ! నీవేల?
యీసీతఁ జేపట్టి - యిటునటు నన్ను
గాసిఁబెట్టెద వెఱుం - గవు రసస్థితులు!
మంచితనంబుతో - మనసిచ్చి పలుక
కించవై నను నుడి - కించ నెంచితివి?
ఇది యేల! సవతిపో - రేఁటికి నాకు
మదిమది నుండినీ - మదిఁ గాననైతి
గ్రక్కున నీసీతఁ - గబళించి మ్రింగి
యొక్కతెనై యున్న - నొంటిగా నీవు
నిలుపోపలేక మ - న్నించి ప్రార్థించి
పిలిచిన రాక నే - బిగియుదుంగాన "!

—: లక్ష్మణుండు శూర్పణఖ ముక్కుచెవులు గోసిపంపుట :—

అని లేటి చూపుల - నట్టిట్టు బెదరి
కనుచున్న సీతఁ జెం - గటికి నా జంత
కొఱవలవంటి చూ - డ్కులను రోహిణికిఁ
గఱకఱ నెదురు ను - ల్కయకో యనంగ
మృత్యువవలె నోరు - మిక్కిలి తెఱచి

యత్యుగ్రగతి వచ్చు - నాసురిఁ జూచి
భూమిజ వడఁకఁ గొ - బ్బునఁ జేర దిగిచి
రాముఁడు లక్ష్మణ! - రమ్మని పిలిచి
" మందెమేలమ్ములాడ - మన కేల ? దీని
చందంబుచాలు దు - ర్జాతి యీనాతి
మంచిమాటలఁబోదు - మదిలోన దామ
సించక తగునాజ్ఞ - సేయుము దీని
మత్తురాలిది " యన్న - మాటలోఁ జేతి
కత్తి నెలమి నొరఁ - గ్రక్కునఁ దిగిచి
రక్కసిం బట్టి యు - ర్వరఁబడ వ్రేసి
ముక్కునుఁ జెవులును - మొదలంటఁ గోసి
పొమ్మని విడిచిన - భోరన రోద
నమ్ము సేయుచునది - నాసిక లేక
కూయుచుఁ జేగురుఁ - గొండయో యనఁగ
హా! యని పొడవుగా - హస్తంబులెత్తి
యేఁగుచో పండ్లు నీ - రెండలుగాయ
నీఁగలు దొనదొన - నిండందుమూఁగ
నలిచి నిరోష్ఠ్యంబు - లైన మాటలను
మొఱయిడు నపశబ్ద - ములు నింగి ముట్ట
నెత్తురుల్ వర్షించు - నీరదంబనఁగ
నత్తరి నల్లని - యంగంబు నిండి
చిమ్మనఁ గ్రోవుల - చిమ్మిన యట్లు
గ్రమ్మిన రక్తధా - రలు ప్రవహింపఁ
జలము మానక జన - స్థానమార్గమునఁ
దలయుఁ జీరయు వీడ - దానవురాలు

— ఖరుని ముందఱ శూర్పణఖ తనభంగపాటును
జెప్పి రోదనముఁ జేయుట :—

అడవిత్రోవన పోయి - యన్నయాఖరుని
యడుగులం బిడుగున - య్యానఁ బడినట్లు
వ్రాలి యాదండకా - వనములో జాన
కీ లక్ష్మణులఁగూడి - క్రీడించుచున్న
రాముని తెఱఁగు సే - రని పని చేసి
తాముక్కుఁ జెవులునుఁ - దఱిగించు కొనుట
దన యవమానమం - తయు నేర్పఱింప
విని యాఖరుఁడు క్రోధ - వివశుఁడై పలికె.
" ఏల ధరణింబడి - యేడ్చెద ? వింత
చాలును లేలెమ్ము - సైదోడు నీవు !
ఎవ్వఁడు నీకింత - యెగ్గు గావించె
నెవ్వఁడు నిదురించు - నెడ పాముఁ జెనకె
నెఱుఁగక యిటుచేసి - యెవ్వఁడా దండ
ధరపాశములు మెడఁ - దగిలించు కొనియె
నెవ్వఁడీ చిలివిషం - బిటుచేసి విషముఁ
గ్రొవ్వునఁ ద్రావి క్రమ - గ్గుచునున్నవాఁడు !
కామరూపంబులు - గలనిన్నుఁ జెనక
నాముఘువుఁడు దక్క - నన్యులోపుదురె ?
వాని ప్రాణములు నా - వాఁడి బాణముల
చేనేఁడె హరియింతుఁ - జింత యేమిటికి ?
పాలుసీరునుఁ గూర్ప - పాలుమాత్రంబె
క్రోలుహంసయుఁ బోలి - కుంభినీ తలము
వానిపై నెత్తురుల్ - వరదలువాఱఁ

బాణంబుఁజేసి తా - పము దీర్తుఁగాక!
వాని మేదోమాంస - వసలు భూతంబు
లానిక మెసవి గ - ర్జనఁ ద్రేఁవుఁగాక!
ఇలవాఁడు బడియుండ - నీడ్చి గోమాయు
కులము లంగకములఁ - గొనిపోవుఁగాక!
ఏను చంపెదనన్న - నెవ్వారలైన
వానిఁగావఁగనున్న - వారె లోకముల?
నేనేడ దేరి వా - నినెఱుంగఁ బల్కు-
నాసాహసముఁజూచి - నను మెచ్చు మవుదు"
అన విని ఖరునితో - నాచుప్పనాతి
మనుజాశినియుఁ గ్రోధ - మహిమ నిట్లనియె.
"అన్న! యిప్పుడు దండ - కాటవిలోన
కన్నుల పండువై - కనుపట్టువారు
చిఱుతపాయపు వారు - చిత్తజునేలు
మురిపెంపు నెమ్మేని - మురువుల వారు
పెడఁద రొమ్ముల వారు - వెలిఁదామరలను
కడఁద్రోయు చక్కని - కన్నులవారు
నగుమొగంబులవారు - నలువునఁ బసిమి
నిగుడు నిర్వరమేని - నిగ్గులవారు
నెక్కడపో దార - లెత్తుక వచ్చి
జక్కవచంటి న - చ్చరవంటి దానిఁ
దాము తెచ్చినవారు - దశరథ సుతులు
రామ లక్ష్మణులను - రాజ నందనులు
నారచీరలు గట్టి - నారు కోదండ

ధారులై తలజటల్ - దాల్చినవారు
ధీరులు నిర్జితేం - ద్రియులైన వారు
శూరులు చూపరఁ - జొక్కించు వారు
నాకపర్ణశాలలో - నుండనేఁబోయి
వెకలినై మనుజులో - వేల్పులో యనుచుఁ
జేరఁగ నేనేఁగి - సీతయనంగ
వారి చెంగటనున్న - వనిత నిచ్చటికి
నెలయింప నొంటిగా - నేకాంతమాడు
పొలుపు వారెఱిఁగి నొ - బ్బున నన్నుఁ బట్టి
యీవిరూపముఁ జేసి - యిపుడున్నవారు
నీవు వారలఁద్రుంప - నేవారి మేని
నెత్తురుల్ ద్రావక - నెంజిలి దీరి
క్రొత్త మానిసిఁగాను - కోర్కె చెల్లింపు"

— ఖరుఁడు పదునల్వురు రాక్షసులను
శ్రీరామలక్ష్మణులపైఁ బంపుట :—

అని విని హుమ్మని - యాగ్రహం బొప్పఁ
దనచుట్టముల దండ - ధగులనుఁబోలు
రాక్షసేంద్రుల నతి - రథుల సంగ్రామ
దక్షుల సాహసో - ద్ధతుల రప్పించి
పదినల్వురను వేగ - పయనంబుఁ జేసి
"ఇది వేళవచ్చె మీ - రిద్దఱుఁగూడి
దండకాటవి కేఁగి - దశరథాత్మజులఁ
జెండాడి రంతు నా - చెలియలి చేత
విన్నాఁడ" నని వారి - వేషముల్ గుఱుతు
లన్నియు వివరించి - యనుచు నవ్వేళ

"మీరంగ వారలు – మిముఁజూచినపుడె
పారిపోవుదురు శూ – ర్పణఖ కోపంబు
తీరదు గావునఁ – దెఱవలు గట్టి
వారిఁ బోనీయక – వసుధపైఁ గూల్చి
వారింటిలో నున్న – వనజాక్షిఁ బట్టి
యేరాక్షసుఁడు దెచ్చె – నేవాని మెచ్చి
యడిగిన నిత్తుఁ బొం" – డని పంప వారు
విడెములందుక తమ – వెంట శూర్పణఖ
మార్గంబు గనుపింప – మారుతాహతిన
నర్గళంబుగ వచ్చు – నభములసంగ
వడిమీర వచ్చిరా – వహుతాశనార్చు
లడవియేనుఁగలు డా – యఁగలేని యట్లు
శ్రీరాము తేజో వి – శేషంబు జూచి
యారాక్షసులు చేర – నసమర్థులగుచుఁ
ద్రొక్కుడు పడుచుండఁ – దోడనే చేరి
ముక్కిడి రక్కసి – మూఁకల నడువ
నదిచూచి రఘురాముఁ – డాసీత వినఁగ
మదిలెక్కఁగొనక ల – క్ష్మణుఁ జూచి పలికె
"వారెవచ్చిరి కంటి – వా! దైత్యవరులు
ధీరులై చుప్పనా – తికి వహించుకొని
యీ నిశాచరులనే – నిలఁగూల్చి వత్తు
జానకిఁగాచి యి – చ్చటనుండు మీవు
నీపర్ణశాలలో – చింత యేమఱక
కాపాడు" మనిన ల – క్ష్మణుఁడట్ల చేయు

—: రాముఁడు రాక్షసులను సంహరించుట :—

శరమేర్చి చేవిల్లు - జ్యావల్లిఁగూర్చి
సురవైరి వీరులఁ - జూచి యిట్లనియె
" మునులకై వడిఁగంద - మూలముల్ మెసవి
వనభూములను జటా - వల్కలశ్రేణిఁ
దాల్చి శాంతియు - దాంతియుఁబూని
మూలల నొదిఁగి యే - ము చరింపుచుండ
నేమి దలంచి మీ - రిద్దఱుఁగూడి
నామీఁద దండెత్తి - నారకారణము
వలదు పొండటుగాన - వాలాయముగను
కలనుపై వేడుకఁ - గలదేని మీకు
నాచేత విల్లును - న్నది మీరు వచ్చి
గోచరించితిరి మీ - కోరిన యట్లు
ననుభవించెదరన్న" - నసురులు రాముఁ
గనుఁగొని కడునొడుఁ - గఱచి యిట్లనిరి
" ఖరుఁడు మాదొర పంపఁ - గా వచ్చినార
ముదుశక్తిచేత ని - న్నుక్కణంపంగ
నిందఱితోడ నీ - వెదిరించి పోర
నందుకు శక్తిలే - దని జేసితేని
నీవిల్లు ఖండించి - నీక్రొవ్వు మాన్చి
పోవుదుమిఁక దాఁచి - పోరాదు నీకు "
నని తమచేతి మ - హాశూలసమితి
దనుజులంకించి యం - దఱు మీఁదవైవ
నన్నిబాణంబుల - నన్నిశూలములు
మున్నాడి తునిమి రా - ముఁడు భీముఁడగుచుఁ

చక్కఁగా నీజన - స్థానంబు మీఁద
నెక్కడ వచ్చునో - యింక రాఘవుఁడు ?
ఈచోటు నీకొమ్మ - నిఁక వేఱెదిక్కు
చూచుకొమ్మది యేలఁ - జొరుము లంకకును
కాకున్న మననీఁడు - కాకుత్స్థకులుఁడు
నీకుఁదోఁచిన జాడ - నేఁడె వర్తిలుము
అన్నకన్న మహోగ్రుఁ - డైనట్టి వాఁడు
నన్ను నీరీతి మా - నముఁ గొన్నవాఁడు"
అని రొమ్ము గడుపునం - దంద కరంబు
లను మోఁదుకొనుచుఁ బ్ర - లాపింపఁజూచి

—: ఖరుని రణప్రస్థానము :—

తానాగ్రహంబుతో - దనుజులు వినఁగ
దానితో ఖరుఁడు ప్ర - తాపింప పలికె.
"నీ యవమతిచేత - నీరధివోలి
నా యాగ్రహము శూర్ప - ణఖ! మిన్ను ముట్టె
నెవ్వాఁడు నిన్ను నేఁ - డిటు జేసె వానిఁ
గ్రొవ్వాఁడి తూపులఁ - గుంభినిఁ గూల్చి
యారక్తధారల - నాఁకలి దప్పి
తీరుతు నీకు నా - దిత్యులు బెదర"
అన విని మదినమ్మ - యది సమాళింపఁ
గనలుచు దూషణుఁ - గాంచి వాఁడనియె
"అనుకూలురై నాకు - నాప్తులై చేయఁ
గనియున్న ఘోరరా - క్షసుల నేర్పఱచి
పదునాల్గువేలను - బలిసి నావెంటఁ
గదిసి కొల్వఁగఁ బిల్చి - కలనికిఁ బనుపు

తేరాయతముఁ జేసి - తెప్పింపు ఖడ్గ
నారాచశక్తికుం - తశరాసనములు
జోడింప నేమున్న - చూచెదరాము
తోడి సంగరమన్న" - దూషణుఁడపుడు
కదలివచ్చె నొకట - కాంచనాచలము
కదలునే యదియిది - కనకరథంబు
లనుచుఁ జూపఱు మెచ్చ - నపరంజి బండ్లు
నెనయు వైడూర్యంపు - టిరుసులు వజ్ర
మయమైన నొగయును - మణిగణప్రభల
దిగదిగమని నర - తిర్యగాదిత్య
పక్షి పన్నగలతా - ప్రసవభూమీజ
యక్షరాక్షసముఖా - నంతచిత్రములు
రణజయకారణ - రాహుధ్వజాగ్ర
రణదురుఘంటికా - రావంబు మొరయ
బహువిధసాధన - ప్రబలార్కదీప్తి
రహి మాప శబల వ - ర్ణంబులై పొలుచు
హయములఁ బూన్చిన - యరదంబుఁ దెచ్చి
జయశాలియైన దూ - షణుఁడు నిల్చుటయు
నారథంబెక్కి తూ - ర్యంబులు మొరయ
సారథంబచరించి - జయభేరు లులియ
ముందర బహుసైన్య - ములు గొల్వ ననికి
స్యందనంబెక్కి దూ - షణుఁ డాప్తబలము
పజ్జలరా నేఁగఁ - బదునాల్గువేలు
రజ్జులాడుచుఁ బైఁడి - రథములవారు

పరశు పట్టిసకుంత - పాశకృపాణ
శరచాపతోమర - చయభిండివాల
ముసలచక్రగదాస్త్ర - ముద్గరప్రముఖ
లసమానసాధనో - ల్లాసులై కదల
ఖరుఁ దరదముఁ దోలి - కాలాంతకార్క
వరతేజమునఁ జేర - వానికి మునుపె
సమరభీషణుఁడు దూ - షణుఁడు సైన్యంబుఁ
దమకించి సెలవిచ్చి - దండకాటవికిఁ
జేరుచో దిక్కులు - చెవుడు పడంగ
ఘోరున రథచక్ర - ముల రవంబెసఁగ
నది గర్జితంబుగా - నభ్రమై యుండ
గుదులను బిడుగుల - గుతియఁజేరుటయు

—: ఖరుఁడపశకునములు గాంచుట :—

నావేళ వానిపై - నశుభకారణము
గా వినువీధి ర - క్తంబులు గురిసె
రథవేగనిహతిఁదు - రంగంబు లలసి
పృథుగతి మ్రొగ్గి ధ - రిత్రిపైఁబడియె
గురువిభాదూరమై - కౌరవులతోడి
పరివేషమునఁదోఁచె - భానుమండలము
టెక్కెంబు మీఁద నుం - డెను బంతగ్రద్ద
వెక్కసంబుగఁ గూసె - విహగకులంబు
దిక్కులఁ జీకట్లు - తెరలుగా ముంచె
నక్కలు వాపోయె - నలుదెసలందు
చదల నెల్లెడఁ దోఁచె - సంజకెంజాయ

గదురు నెత్తురులు వ్ర - గత్రేణి గ్రక్కె
కంకగృధ్రంబు లిం - గలముల నుమిసె
యంకిలిఁ జేసె మ - హారోదనములు
చండాంశుకెలన మ - స్తకములు లేని
మొండెంబు లాకసం - బునఁ గనుపట్టు
గ్రహణముల్ దోఁచెన - కాలంబులందు
మహినిండెను బ్రచండ - మారుతౌఘములు
జలజలంబగలు న - క్షత్రముల్ డుల్లె
కొలఁకుల జలము గ్ర - క్కున నింకిపోయె
గాలిలేకయు ధూళి - క్రందుగా నెగసె
రాలును బిడుగులు - రాల్చె మేఘములు
వడవడఁ గంపించె - వసుమతి యెల్ల
యెడమ మూపులు చలి - యించె దైత్యులకు
ఖరుని కుత్తుకఁబట్టె - కాకుస్వరంబుఁ
బొరసె మహోత్పాత - ములు సేనలోన
నది చూచి సరకుసే - యక నవ్వి ఖరుఁడు
మదిఁగ్రొవ్వి తనయాప్త - మంత్రులకనియె

— ఖరాసురుని దంభోక్తులు —

" భావింపఁడెన్నియు - త్పాతముల్ వుట్టె
నీవేళ కలనికే - నేఁగు నాయెదుర
నెటులైన రాము జ - యింపక మాన
నటమీఁద మృత్యువు - నైన జయింతు
చుక్కలు రాలింతు - సూర్యమండలము
బ్రక్కలింపుదు శర - వ్రాతంబుచేత

జానకీపతిఁ జంపి - సౌమిత్రిఁ ద్రుంచి
కాని నేఁడూరక - క్రమ్మరరాను
తోడఁ బుట్టినదాని - తుందుడుకార్చి
వేడుకఁ ద్రావింతు - విమతరక్తములు
నైరావతము మీఁది - యలవజ్రినైన
పోరిలోన జయించు - పూనికి నాది
యని నన్ను వీక్షింపుఁ" - డన మృత్యుపాశ
మునఁజిక్కు పోలదిండి - మూఁకతోఁగదల
నపుడు చారణసిద్ధ - యక్షగంధర్వ
తపనేందు ఋషిదేవ - తాసంఘమెల్ల
నవరత్నభాసమా - న విమానములను
దివినుండి రాఘవు - దీవించి పొగడె
నెందు గోబ్రాహ్మణ - హితముగా దైత్యు
లందఱు నని నశి - యింతురు గాక!
వీరల మర్దించి - విజయంబుఁగాంచి
యీరాముఁ డిలయెల్ల - నేలెడుగాక!"
అని పోకఁ జూచుచు - నాకాశమార్గ
మున దేవతావళి - ముసగసలాడ
ననికి ఖరుండు రా - నల శ్యేనగామి
యను విహంగమదుర్జ - యులు మేఘమాలి
కరవీర నేత్రుఁడు - కాలకార్ముకుఁడు
పరుష మహామాలి - పలల భోజనులు
రుధిరాశనుఁడు సుపా - ర్శ్వుఁడు యజ్ఞశత్రు
పృథుకంధరులునను - పేళ్లచే వెలయు
ద్వాదశముఖ్య ప్ర - ధానులు చుట్టు

ద్వాదశాదిత్య ప్ర - భావులై రాఁగ
దూషణు రథము చ - తుర్దిశలందు
భీషణాకారుల - భేద్య విక్రములు
స్థూలాక్షుఁడు ప్రమాథి - సారిది మహాక
పాలుఁడు త్రిశిరుఁడు - పాయక కొలువ
నలువురితోడ ముం - దరఁ జతురంగ
బలములఁ బురికొల్పి - పైవచ్చునపుడు ,
ఖరుఁడు దూషణుఁడును - గ్రహమాలికాను
సరులైన చంద్రభా - స్కరులనుఁ బోలి
ధరగ్రక్కుతిల్ల ను - ద్ధతిఁ దమ మీఁదఁ
బలితెంచు రాక్షస - బలము నీక్షించి
చదలపై మహిఁ దోఁచు - శకునంబు లరసి
మదిరాముఁ డలరి ల - క్ష్మణుఁజూచి పలికె.

— శ్రీరాముఁడు సీతను గాపాడు భారము లక్ష్మణున కప్పగించి సన్నద్ధుఁడగుట. —

"ఖరుని మూఁకలువచ్చె - గహనమార్గమునఁ
బరికింపు మచట ను - త్పాతముల్ వొడమె
పొగలు గప్పెట్టె ని - ప్పుడు మదస్త్రముల
మొగిడి నూరకె నాయ - మోఘ కార్ముకము
నీచెంత వనపక్షు - లెలుఁగించు జాడఁ
జూచిన మనకు ని - చ్చోఁగయ్యమంది
బలవంతమై ప్రాణ - పర్యంతమునకుఁ
గలుగు సన్నలు దోఁచెఁ - గంటివే యిపుడు
నావలభుజము మి - న్నక యదరెడును
గావున మనకు ని - క్కము గెల్పు గలదు

కలనికి నేఁగుచోఁ - గడుమోమునందుఁ
గళగల్గియుండినఁ - గడవారి నోర్చు
మిగులఁ బ్రసన్నత - మించె నీ మోము
మగఁటిమిచే గెల్పు - మనకు సిద్ధించు
నదె వింటివే కాహ - ళాదిరవములు
నదయుద్దైతేయ వీ - రాట్టహాసములు
వినవచ్చుచున్నవి - వేళ నేమఱక
ధనువెక్కుఁబెట్టి య - స్త్రము లేరుపఱచి
జానకిఁ దోడ్కొని - శైలకందరము
లోన వసింపు మీ - లువుఁగావు మిపుడు
తగదన్న నాడుమీఁ - దటియాన నీకుఁ
బగవారి నణఁగించు - బహుళవిక్రమము
నీకుఁగల్గిన దైత్య - నికరంబు నెల్ల
మాకు వేడుకబుట్టె - మదమడంచుటకు
మాఱాడకు" మటన్న - మాటకు నతఁడు
శ్రీరాము నానతి - శిరమునఁ జేర్చి

— శ్రీరాముఁడు పరాక్రమముఁ జూపుచు
ఖరుని సేనలతోఁ బోరుట. —

సీతఁ దోకొనిపోవఁ - జిత్తంబు వొదల
హేతులు వెదచల్లు - నేసుటమ్ములను
నారోపితమహోశ - రాసనం బంది
దారుణంబగు తను - త్రాణంబుఁదొడిగి
శింజినీక్వణనంబు - సేయుచు దనుజ
భంజనంబునకుఁ జా - ల్పడి నిలుచున్న

రామునిఁగని సుప - ర్వమునీంద్రులెల్ల
"నీ మహోమహముఁ ఢాకఁ - డిందఱితోడ
జగడ మేక్రియఁ జేయఁ - జాలునో యితఁడె
పొగడొందుఁగాక! తె - ల్వునకుఁ బట్టగుచు
నాదివిష్ణువు దాన - వావళినెల్ల
మోదంబుతోఁ జక్ర - మున గెల్చినట్లు
లెటు వైరులనుఁ బోలి - యించునో! యితని
దిటముఁ జూతమటంచు - దృష్టింపుచుండ
ననికి సన్నద్ధుఁడౌ - నవనిజారమణుఁ
గని భూతకోటులు - గంపించి బెదుగ
విలయావసర రుద్ర - వేషంబుతోడ
నలవోకగా రాక్ష - సాళిఁజూచుటయు
నప్పుడు సింహనా - దాభీలమగుచు
నుప్పొంగి దానవ - వ్యూహంబుఁ గెరలి
కార్ముకజ్యావల్లి - కాఝాంకృతములు
దుర్మథాంధత దిశా - స్తోమంబు నిండ
వచ్చుచో రఘుకుల - వరుఁడొక్క వాఁడి
చిచ్చఱ నమ్మేర్చి - చేతఁగీలించి
కాలాగ్ని కల్పుఁడై - కన దక్షయాగ
శాలలో వెలుఁగు నీ - శ్వరుని చందమునఁ
జెనుపొందు ననుఁజూచి - భీతిచే నచటి
వనదేవతలు భూత - వర్గంబు వెఱచి
నలుదిక్కులనుఁ బోవ - నాళీకమిత్ర
కులమణి యున్నచోఁ - గోదండ బాణ
కేయూర కటక కిం - కిణికా కిరీట

సాయక కుండల - జాజ్జ్వల్యమాన
వరవిభావటలంబు - వనజాప్తదీప్తి
కరణి పైఁబొదువు మే - ఘంబులో యనఁగ
నిండినసేనలో - నిలిచి ఖరుండు
చండాంశతేజుఁడై - సారథి కనియెఁ
"గడపుము రథము రా - ఘవులపై నిపుడు
పడనైతి వారి నా - బాణఘాతతిని
దానవావళికి సం - తసముఁ గల్పింతు
మానుల యడియాస - మానుదు నిపుడు
చేరఁబట్టుక వత్తు - సీత సీతకుణాను
పరిహరింపుదును శూ - ర్పణఖ ఖేదములు"
ననపల్కి విని వాఁడు - నట్లసేయుటయుఁ
దన యిరుగడవీర - దానవశ్రేణి
నడచుచోఁ జుక్కల - నడుమఁ గన్పట్టు
కడునుగ్రుఁడైన యం - గారకు కరణిఁ
గనుపట్టుచుఁ బ్రచండ - కాండవర్గంబుఁ
గనుచెదరంగ రా - ఘవు మీఁదఁగురిసి
ఘర్జించుటయుఁ దక్క - గలయోధులెల్లఁ
దర్జించిశూలము - ద్గరకరవాల
కుంతతోమరగదాం - కుశభిండివాల
సంతతు లందంద - జడివట్టి ముంచి
యరదముల్వ్రరపి వా - హముల పైఁదరథి
కరుల ఢీకొలిపి భీ - కరులై చెలంగి
జగడింప వారేయు - శరపరంపరలు
నగముపైఁ గురియువా - నఘుఁబోలి కప్పు

నాసాధనము లెల్ల - నాపగాశ్రేణి
యాసముద్రుని లోన - నణఁగిన యట్లు
పనిగొనలేవయ్యె - బాణపాతములఁ
దనమేన బహురక్త - ధారలు దొరఁగ
నతిశోణసాంధ్య రా - గారుణజలద
శతపరిచ్ఛన్న భా - స్కరుఁడకో యనఁగ
వెలుఁగొందు నాతఘు - వీరునింజూచి
కలఁగుచు దివిజసం - ఘము వినువీథి
"అక్కట ! యీ రాక్ష - సావళి మట్టె
నొక్క యీ శ్రీరాము - నుక్కడంచెదరు
ఇతఁడెట్లు వోరు వీ - రిందఱి తోడ
కృతపుణ్య ! శ్రీరామ ! - గెలుతువుగాక !"
అనుచుండఁ బరిమండ - లాయతోద్దండ
కనకకోదండ ని - ర్గత హేమపుంఖ
కాండప్రకాండ తి - గ్మకరకరాళ
చండప్రభానిర - స్త నిశాటసైన్య
నిబిడాంధకారుఁడై - నీడలు వడఁగ
ప్రబలదానవసేన - పడలు వడంగ
నని సేయు , భగ్నంబు - లైన తేరులును
తునిసి మావంతుల - తో వ్రాలు గరులు
నడ్డంబు నిడుపునై - హయములమీఁద
నొడ్డగిల్లిన వ్రుగ్గు - నుగ్రసాదులును
ఖండిత కంకణాం - గదభుజాలతలు
నొండొండ ధరణిపై - నొరలు మస్తములు
డొల్లు కిరీటముల్ - దుల్లు దంతములుఁ

ద్రెళ్లు కాయమ్ములుఁ - దెగిన కంఠములు
జీరాడు కేశముల్ - చెదరు హారములుఁ
బాఱు నెత్తురునదుల్ - పడు కేతనములుఁ
బొడియైన శరములుఁ - బొరలు గాల్బలము
మడియు సారథులు దు - మారమౌ విండ్లుఁ
బగులు కేడెమ్ములు - బరియలై చినుఁగుఁ
బొగరు దైత్యులకడు - పులు వేగ మురియు
ముక్కులు విఱుఁగునె - మ్ములుఁ జెక్కలైన
చెక్కులు నజ్జులౌ - చెవులు తుండించు
కాళ్లును నలియు న - క్కలునురుమైన
వ్రేళ్లును వ్రయ్యలౌ - వీపులుఁ గలిగి
శతసహస్రములైన - సంఖ్యల దైత్యు
లతిమాత్ర చిత్రరా - మాస్త్ర ఘాతములఁ
బడుగుఁ బేకయునుఁగాఁ - బడిన వెండియును
పుడమియల్లుఁడు వింటఁ - బూన్చి వికర్ణి
నాళీక నామబా - ణ ప్రయోగములఁ
జాల నెండిన వన - జాలంబు నేర్చు
దహనుని రీతి దై - త్య శ్రేణి నెల్ల
దహియింప గరుడచ్ఛ - దసమీరణముల
నిలమీఁద వ్రాలు మ - హీరుహశ్రేణి
పోలుపున దనుజుల - ప్పుడు గూలుటయును
చెదరినల్లడ హత - శేష సైన్యంబు
మదమేది ఖరదైత్యు - మఱుఁగుఁ జొచ్చుటయు
మున్నాడి యాహవం - బున దూషణుండు
వెన్నాఁగి తనవారి - వెఱవకుండనుచు

శర మేర్చి శమనుండు - శంకరునెదురు
కరణిఁ గోపించి రా - ఘవు ధిక్కరించి
నిలిచినఁ బోవక - నిలిచిన సేన
బలదర్పమున వాని - బలమాత్మ నమ్మి
సింహనాదముతో - శిలలురువృక్ష
సంహతియును మహిఁ - జలియింపవైచి
యుగ్రశస్త్రములఁ బ్ర - యోగింప రాఘ
వాగ్రణి వారిపై - నాగ్రహంబునను

— శ్రీరాముఁడు గాంధర్వాస్త్రమున రాక్షసులఁదునుముట :—

గాంధర్వమగు తూపుఁ - గైకొని వింట
సంధించి వేసిన - జగమెల్ల బెగడఁ
దనయందు దివ్యశ - స్త్రములు మిన్నెల్లఁ
జినుకుటింగలములుఁ - జిందసీనుచును
రాఁజుచు నమ్మహా - స్త్రము తమ మీఁద
రాఁజూచి సమరంబు - రాము శౌర్యంబు
శరముఁ బూనుటయు న - స్త్రము రాకఁజావు
నెఱుఁగక దిగులుచే - నిన్నియు మఱచి
రివ్వాలు విఱిగి పా - ఱి తొలంగు బుద్ధి
నెవ్వరికిని లేక - యెట్లున్న వారు
నటులె యుండఁగ నేత - దస్త్రసంభూత
చటులాస్త్రములు ధరా - చక్రంబు వొదివి
బలమెల్ల సమయింప - బలులైదు వేల
బలము దూషణుఁడంపఁ - బటుపరాక్రములు
వారు రామునిపై న - వార్యరోషమున

ఘోరాస్త్రకోటులు - గోలుగాఁగురియ
వారి యమ్ములు తన - వాలంపుగముల
వారించి జానకీ - వరుఁడు గోపించి

—. దూషణవధ .—

యాదూషణుని మీఁద - నతని సైన్యంబు
మీఁద నాదిత్యులు - మేలని పొగడ
దూషణుండేసిన - తూపులు భీమ
రోషభీషణుఁడౌచు - రూపఱ నేసి 2070
వాని సారథిఁద్రుంచి - వానియశ్వములఁ
జానేసి చే శరా - సనము ఖండించి
మూఁడు దూపుల నుర - మ్మున రక్తధార
లోడికల్ గట్టమ - హోద్ధతి నెనయ
విరథుఁడై యమ్ములు - విల్లును లేక
ధరణిపై నొకకొండఁ - దరలించినట్లు
నపరంజికట్లచే - నళనిసన్నిభముఁ
జపలాలతా ప్రకా - శములైన శత్రు
జనపాల రక్తమాం - సములాని విజయ
జనకమై దివిజభీ - షణమయి పొల్చు 2080
నొక పరిఘముఁబట్టి - యురవడి రాఁగఁ
జకచకల్గల యర్ధ - చంద్రబాణములఁ
జేతులు రెండునుఁ - జెదిమి వైచుటయు
భూతలం బద్రువ న - ప్పుడు దూషణుండు
కొమ్ములుఁ గొట్టిన - కుంభిని మీఁదఁ
గమ్ముగఁ బడిపోవు - గంధేభ మనఁగ

నారక్కసుఁడు వడ్డ - నఖిలభూతములు
శ్రీరామవిభుఁ బ్రశం - సించి రుల్లముల
నతని బాంధవులు మ - హాకపాలుండు
నతిశౌర్యధనుఁడు స్థూ - లాక్షుఁడన్ వాఁడు
మత్తచిత్తుండు ప్ర - మాథియు ననఁగ
నత్తరి ముగ్వురు - నసికుంత ముసల
సాధనమ్ములు వైవ - జానకీవిభుఁడు
సాధులౌ నతిథులం - జని కాంచినట్టు
లెదురేఁగి రండని - యేర్చిన యమ్ము
పదను జూడ మహాక - పాలుని శిరము
ఖండించి స్థూలాక్షు - కన్నులు రెండు
రెండు తూపులఁ గ్రుచ్చి - త్రెళ్ళంగ నేసి
మఱియొక్క కోల ప్ర - మాథిఁ గీటడఁచి
వెరఁజి తక్కిన యైదు - వేలరాక్షసులఁ
బోనీక చంపున - ప్పుడు ఖరుం డలిగి

— శ్రీరామబాణములకు ఖరుని పన్నిద్దరు మంత్రులు బలియగుట —

తాను పన్నిరువురఁ - దనమంత్రివరులఁ
బనిచిన వారలు - పన్నిరువురును
మొనసేయఁ జూచి రా - ముఁడు భీముఁడగుచుఁ
గాండమొక్కట శ్యేన - గామినిఁ ద్రుంచె
రెండు తూపులఁ బృథు - గ్రీవునిఁ దునిమెఁ
జంపె నొక్కటయజ్ఞ - శత్రువుం బట్టి
యంపెఁ గాలుని వీటి - కావిహంగముని

జతగూర్చి పనిచె దు - ర్జయు వానితోడ
నతని వెంబడిఁగూర్చి - యంపెను పరుషు
వడిఁగరవీరాక్షు - వానితోఁ గూర్చి
కడతేర్చి తానంపెఁ - గాల కార్ముకుని
లీలగా మేఘ మా - లిని బలిపెట్టి
యాలంబులోన మ - హామాలిఁ గూల్చె
యనిపె సర్పాశ్యుని - యమ్ము సంధించి
యనలకల్పుని రుధి - రాశనుఁగూల్చె
సైన్యశేషమునెల్ల - సమయించు రాము
జన్యరంగమున రా - క్షసులెల్లఁ బడిన
నాదైత్యకేశంబు - లాహవ యాగ
వేదికి దర్భలై - విలసిల్లె నపుడు
రణయాగశాలకు - రాక్షసశస్త్ర
గణములన్నియు నుప - కరణంబులయ్యె
నగ్నులయ్యె మణీమ - యాభరణంబు
లగ్నిసమాన రా - మాస్త్రసంహతుల
జానకీపతి పాద - చారియై యొకఁడు
దానవవరచతు - ర్దశ సహస్రముల
నొకముహూర్తంబులో - నుక్కణఁగింప
నొక త్రిశిరుండుతా - నొద్దికయగుచు

— త్రిశిరసంహారము —

ఖరునికి నూరట - గానిల్చి యుగ్ర
శరచాపహస్తుఁడై - శౌర్యదర్పములఁ

దనవెంటరాఁగ ర - థంబుపై వజ్రి
యనువున ఖరుఁడు దు - రాగ్రహుఁడగుచుఁ
దేరువోనిచ్చుచోఁ - త్రిశిరుఁడా ఖరునిఁ
జేరి యుద్ధము నిల్చి - "శ్రీరాము మీఁద
నేఁటికి జనియెద - వేగల్గి నన్నుఁ
జాటుఁగునే యిట్టి - సమరంబులకును
తేరిచూడుఁడు నన్ను - దేవరవారు
పోరాడ నీతఁడ - ప్పుడు పురందరుఁడె ?
మనుజుండు వీఁడెంత - మడియింతు నన్నుఁ
గనుము చంపుదుఁబట్టి - కాకుత్థ్సకులుని
నా యాయుధము తోడు - నాకితండెంత?
నీయాన ! వధియింతు - నేఁడె రాఘవుని
నతనిఁ జంపుటయొండె - నతనిచేఁ దనకు
మృతియొండె కాకేల - మిక్కిలిమాట
యేను జయించిన - నీజనస్థాన
మేనాఁడు నెమ్మది - నేలుము నీవు!
కాకయుండిన రమ్ము - కలని కవ్వనుక"
నని పచారించివాఁ - డరదంబుఁ దోలి
పెనుభేరి మొరయించు - పెక్కువ నార్చి
శిరములు మూఁడును - శిఖరముల్ మూఁడు
ధరణీధరంబుపైఁ - దనరిన యట్లు
గాత్రంబుపైఁ దోఁపఁ - గాండవర్షంబు
చిత్రంబుగా మొగుల్ - చినికిన యట్లుఁ
గురియుచో రాముఁడుం - గోపించి దివ్య
శరముల మేను జ - ర్జరితంబు సేయ

రాఘవత్రిశిరుల - రణకేళి యస్త్ర
లాఘవంబును సుర - శ్లాఘనీయముగ
హరియునుఁ గరియుఁ గ - య్యముసేయుసరణిఁ
బురణింప త్రిశిరుఁ డ - ప్పుడు కోపగించి
రాము నెన్నుదురు నా - రాచముల్ మూఁడ
చేమఱువక వ్రేయఁ - జిఱునవ్వు దొలఁక
నాకసంబున వేల్పు - లచ్చెరువంద
కాకుత్స్థకులుఁడు రా - క్షసుని కిట్లనియె.
"మేలుమేలు! నిశాట! - మిక్కిలి బంట
వాలంబు నీవునే - యంగ నేర్పరివి
శరము లేసితివో? య - బ్జంబు లేసితివో?
మెఱుఁగ రాదిట్లని - యించుకసైన
నాచేతిశరముల - నాఁటిన వెనుకఁ
జూచెదవది సరి - చూచుకొమ్మ"నుచు
నెన్ని లోకంబుల - కేఁగినఁద్రుంతు
నన్నట్లు పదునాలుఁ - గమ్ములు దొడిగి
యురము నొవ్వఁగ నేసి - యురువడినాల్గు
శరములచే రథా - శ్వంబులఁగూల్చి
సారథి నెనిమిది - సాయకమ్ములను
సూరాత్మజుని పీడు - చొరఁద్రోలి యొక్క
తూపున టెక్కెంబుఁ - దునియలుచేసి
కోపించి మఱియుఁ బె - క్కు శిలీముఖములఁ
దనువు నాటించి య - స్త్రంబులు మూఁటఁ
దునిమె దానవుశిరో - ధులు మూఁడు వరుస
పులిఁజూచి పసమృగం - బులు పాఱినట్లు

కలఁగి రాఘవుఁజూచి - కలన రాక్షసులు

—: ఖరాసురుఁడు రామునితో యుద్ధముచేయుట :—

పరువెత్తి త్రిశిరుని - పాటు ఖేదమున
ఖరునితోఁ దెల్పినఁ - గడునల్గి యతఁడు
చంద్రుపై రాహువు - చనినట్లు రామ
చంద్రుపై నలిగి య - స్త్రమ్ములు గురిసె
తన తేరు చెంతకుఁ - దరమి యా నముచి
యనిమిషేంద్రునిఁ జేరు - నట్టిచందమునఁ
గదిసి పుంఖాను పుం - ఖములుగా దిశలు
చదలును దారుణా - స్త్రచయంబు గాఁగ
నురువణించిన రాముఁ - డుగ్రసాయకము
లురుశక్తి వైచి య - త్యుగ్రతేజమునఁ
దపనుని దీప్తియుం - తయుఁగానవీక
యపుడు నభంబెల్ల - నాక్రమించుటయు
నాళీకములఁ జిల్కు - నారాచములను
జాల దైత్యుఁడు రామ - చంద్రుని మేను
నంకుశాహతిఁ గరి - నలయించు రీతి
నంకిలి నొందింప - నపుడు వేలుపులు
గాలాంతకుఁడు వీఁడె - కాఁబోలు ననుచుఁ
జాల రాముని గెల్పు - సంశయింపంగఁ
బెక్కండ్రతోఁ బోరి - బెలుకురి యలసె
చిక్కె రాఘవుఁడని - చింతించె ఖరుఁడు
సింగంబు మృగముఁ జూ - చినరీతి రాచ
సింగంబు ఖరునిఁ జూ - చెతృణంబు గాఁగ!

శలభంబు వహ్నినెం - చక డాసినట్లు
ములుచదానవుఁడు రా - ముని లెక్కఁగొనక
చలము మీరఁగ నర్ధ - చంద్ర బాణమున
విలుఁదునియఁగ నేసి - వెసఁ బెనువాఁడి
మరియు నేడమ్ముల - మహిసుతా విభుని
యురమును కవచ మో - హో! యనఁ ద్రుంచి
వేయమ్ములను రెప్ప - ప్రేయుక మునుపె
కాయమ్ము నిండారఁ - గాయముల్ చేసి
పూచిన మోదుగు - పోలుపునఁ గువల
మేచకాంగము రక్త - మిళితంబుగాఁగ
గెలిచితినని విశం - కితుఁడైన ఖరునిఁ
గలుషించి చూచి రా - ఘవ శేఖరుండుఁ

— రాముడు ఖరుని రథాది పరికరములఁ గూల్చుట —

దనకుఁదొల్లి యగస్త్య - తాపసుఁడొసఁగఁ
గను విష్ణుదైవలో - కంబైన ధనువు
చేనంది శితశర - శ్రేణిచేఁ గ్రుచ్చి
దానవు జర్ఝరి - తశరీరుఁ జేసి
యొకబాణమున వాని - యున్నత ధ్వజముఁ
జకచక ప్రభలీన - జగతిఁ ద్రెళ్ళించి
మించిన దనుజుఁడే - మియు సడ్డచేసి
యెంచక ములుకుల - నేనుఁగు మేను
నాఁటించుకై వడి - నాల్గు బాణముల
నాఁటించి నొప్పింప - నవరక్తధార

నెమ్మెన నిండఁబూ - నిన సప్తసాయ
కమ్ముల ఖరుని యం - గము నొవ్వనేసి
శిరముపై నొకతూపు - చేతుల రెండు
శరముల మూఁడర్ధ - చంద్రబాణముల
నురముపై నాఁటించి - యొక పదమూఁడు
దురుసుటమ్ములను నె - త్తురు చిందనేసి
కాఁడిమానొక విశి - ఖమున నాల్గింట
బోఁడిమి చెడహయం - బులఁ దూపులాఱు
నిగుడించి సారథి - ని శరత్రయమున
నొగలును నిరుసు రెం - డు మహాస్త్రములను
ద్వాదశాస్త్రములచే - ధనువు మేనఁ ద్ర
యోదశాస్త్రము లేసి - యుబ్బడఁగింప
సారథి వ్రాలిసి య - శ్వంబులు మడిసి
తేరు చెక్కలువోయి - దేహంబు వ్రస్సి
టెక్కెంబు విఱిగి ఖం - డితములై వింటి
చెక్కలు మహిఁగెడ - సినఁదేరి చూచి
యిలకు లంఘించి యెం - డేమియు మదినిఁ
దలఁప కాయసగదా - దండంబుఁ దాల్చి
యెదురుగా నిల్చిన - ఋషులు దేవతలు
"నదిరయ్య! రాముబా - హా పరాక్రమము!"
అనివిమానములపై - నంజలి చేసి
కనుచుండ కోసల - కన్యకాసుతుఁడు
ఖరుని తెంపును భుజా - గర్వంబుఁ జలము
గరువంబుఁ దెలివియుఁ - గాంచి యిట్లనియె.

—: రాముఁడు ఖరునితో జతురోక్తులుగఁ బరుషము లాడుట :—

“చతురంగ బలములు - సరస రా నీవు
ప్రతివ్రాని నిలిచి నీ - పాపంబు చేత
నందఱు బొలిసిన - నటు నిటుఁజూడ
నెందు నెవ్వరు లేక - యేకాకి వగుచు
నిలిచితివింక నే - నెలవు జొచ్చెదవు
చలమేల! తొలఁగు మి - చ్చటికైనఁ బ్రతికి
క్రూరకర్మము సేయు - కుచ్ఛితుఁడెల్ల
వారలచే నప - వాదంబునొందు
జెడు నెంతవాఁడైనఁ - జెడక యుండుదురె!
కడు ద్రోహులైన రా - క్షస కులాధములు
నీచకర్మము సేయు - నెడవానిఁ బాముఁ
జూచినగతిఁ జంపఁ - జూతురందఱును
కామ లోభాదులఁ - గలుషముల్ సేయు
పామరు నట్టి పా - పంబులే చెఱచు
తెలియక వడగలు - దిని యందుచేత
నలికిరి పాములు - నశియించినట్లు
నిన్నాళ్లు నీవని - నెల్ల మౌనులను
వెన్నాడి చెఱచిన - వృజినంబు నీకు
ననుభవింపఁగ దరి - యయ్యె నందేమి
యొనఁగూడె లాభ మ - య్యోవారిఁ జెఱుప?
నేరెండివోయిన - వృక్షంబు వడిన
మేర నీ మేను భూ - మిని వ్రాలఁగలదు
ఋతు ధర్మములనెల్ల - వృక్షముల్ ఫలము

లలితమయముగఁ గాంచు - నట్టి చందమునఁ
జేసిన కర్మరా - శికిఁ దగుఫలము
లాసన్న గతిఁబొందు - నవి కాలవశత
జనుల విషాన్నభో - జనమునుఁ బోలి
చెనఁటి కర్మము చంపు - శీఘ్రకాలమునఁ
బుడమికి నప్రియం - బులు చేసినట్టి
జడమతులనుఁ బట్టి - సంహరించుటకు
రాజనై యట్టి భా - రముఁబూని మాని
రాజఁబోషింప దీ - రక వచ్చినాడ ?
కలితసౌవర్ణ పుం - ఖంబులైన వింట
వెలువడు నట్టి నా - విశిఖరాజములు
పుట్టలోఁ బాములు - పోయెడు రీతిఁ
నెట్టుక నీమేన - నేఁడు దూరెడును
మున్ను నీచేఁదుది - ముట్టినవారు
చన్న త్రోవనె నీవు - చనుదువుగాక !
నీవె చంపిన మాని - నిచయంబు మింటి
త్రోవ విమాన పం - క్తుల నేఁగు వారు
పడుమంచు నరకకూ - పంబుల నీవు
పడఁజూచి యందఱు - పకపక నవ్వి
మూరు మోములు వెట్టి - మూలనిఁజూచు
మేరఁ గేడింప ని - మ్మాయిఁ జేతుఁగాక !
తొలఁగ నీయక యొక్క - తూఁపుచే నీదు
తల తాఁటి పంటిచం - దంబున ధరణి
డొల్లక మునుపె తో - ట్రోడఁ జేయమ్ము
వెళ్లక మునుపె వే - వేగ నీచేత

నైన మాత్రము చూడు" - మనిన ఖలుండు
జానకీరమణు నెం - చక యిట్టులనియె

—: ఖరాసురుఁడు రామ పరుషోక్తులకుఁ
ప్రతివచనములు పలుకుట :—

"చిల్లరగాండ్లు వ - చ్చి దురంబులోనఁ
ద్రెళ్ళిరి నీచేతఁ - దేఁకువ మాలి !
యంతమాత్రనె బంట - వై ప్రల్లదంబు
లెంతయుఁ బ్రోది నీ - వేల పల్కెదవు ?
జగతి క్షత్రాచార - సంపన్నులగను
దగువారె తమ పోటుఁ - దమరె వాకొనఁగ
క్షత్రియాధములు లో - కమునందు తమరె
శత్రులనందఱి - జంపుదు మనుచుఁ
బరవకూఁతలు గూసి - పగవానిచేత
దురిములో మానంబుఁ - దూలపోవుదురు
యెవ్వడు సంప్రాప్త - మృత్యుఁడౌ నతఁడు
ద్రొవ్వనఁ దన్ను న - ల్గురిలోనఁ బొగడి
హాతుఁడగుఁ బగరచే - నగ్నివర్ణమున
క్షితి నెట్టనై యున్న - శిలకాల్పఁగలదె ?
వడిగలతనము నీ - వంటి వానికినిఁ
బొడమునే ? నిను నొక్క - పోటరి వనుచు
నెన్నువానికి భయం - బింతియే గాక
నిన్నుఁ బేర్కొనిన దా - నవుఁడేల వెఱచు ?
నీవాడు మాటలె - నీదు లాఘవము

నీవగ నలుగురు - నెఱుఁగ బల్కితివి !
పర్వతంబునుఁబోలి - పటుగదాదండ
ధూర్వహాభుజుఁడనై - తోఁచి నీయెదురఁ
గదలక యముఁడున్న - గతి నిల్చునన్నుఁ
బదరి చూచియునిట్లు - భాషింపఁదగునె ?
పలుమాటలిక నేల - బవరంబులోన
గెలిచి చంపుదు నిన్నుఁ - గేవలశక్తి
నినుఁడు గ్రుంకిన మన - యిర్వురి పోరు
కొనసాఁగి కనరాదు - కొబ్బున నిపుడె
జయమందు వాఁడ నీ - సమరంబులోన
భయమేది యణఁగిన - పదునాల్గువేలు
దానవులకు వారి - తరుణులు హితులు
దీనులై శోకింపఁ - దేఱ కన్నీరు
నినుఁజంపి యూఱార్చి - నిలుపుదుఁజూడు "

—: ఖరుఁడు రామునిపై గదను ప్రయోగించుట :—

మని యుఱుముక వచ్చు - నశనియె పోలు
చేగదయెత్తి యూ - ర్చి యణంగుమనుచు
వేగంబె త్రిప్పి బ - ల్విడిఁ బ్రయోగింప
నది వచ్చి వనభూరు - హశ్రేణి నెల్ల
నదమదంబుగఁ గొట్టి - చరముక పాఱి
పైరాఁగ నొకకొన్ని - బాణంబు లేసి
యారాముఁ డదిపొడి - యైపోవఁజేయ
మంత్రౌషధముల సా - మర్థ్యంబుచేత

సంత్రాసమతి వ్యాళి - సమసిన యట్లు
గద వడిపోవనో - గద యనిదైత్యుఁ
డెద వఱఁకటునిటు - నీక్షింపఁజూచి
చిఱునవ్వు మొగముఁగై - సేయఁజేచాఁచి
ఖరునితో వీరశే - ఖరుఁ డిట్టులనియె
"ఇదిగదా! యాస్తి నీ - కిప్పుడు నిట్టి
గదపోయె, శక్తియె - క్కడిది పోరాడ!
ఈపాటివాడ వి - ట్లేల గర్వోక్తు
లీపౌరుషపుమాట - లిపుడు వల్కితివి
చచ్చిన వారల - సతుల కన్నీరుఁ
దెచ్చిన మాన్పఁగఁ - దీఱనే నీకు!
కల్లలాడుదురె? రా - క్షసులెందునైన!
చెల్లరే! కులమెల్లఁ - జెఱచితి నీవు!
నీచుఁడవైతివి - నీదు ప్రాణములు
నాచేతి శరములుం - డఁగనీయ విపుడు!
అమృతంబు గరుడఁడు - హరియించినట్టి
క్రమమునఁ బోనీక - కైకొనుఁగాక!
నీతల ఖండింప - నిగుడురక్తమున
భూతకోటులనుఁ దృ - ప్తులఁజేయు వాఁడ!
చక్కని జవరాలి - సందిటిలోన
జొక్కి రతిశ్రమ - సుఖపరవశత
నిదురించుగతి నస్త్ర - నిహతిచేఁబెద్ద
నిదురఁగైకొన ధాత్రి - నినుఁద్రెళ్లనేతు!
ఆమీఁద నీయాత్ర - మా వాసులకును
సేమంబు లొసఁగి మా - సీమఁజేరుదును

ఏను జనస్థాన - మింకఁ బాడుచేసి
మానుల కిచ్చిన - మాట నిల్పుదును
దనుజకామినుల రో - దనములు వినుచుఁ
గనుగన్నగతిఁ బారఁ - గాఁ దఱుముదును
నీకులకాంతలు - నీమీఁద వ్రాలి
శోకింపుచుండనేఁ - జూచుచుందుదును!
క్రొవ్వి బ్రాహ్మణకంట - కుఁడవైన నీకు
నెవ్వరు వెఱతురో - యిన్నాళ్లు నిచట
నట్టివారల యజ - నాది కర్మములు
నెట్టుక నీడేర్ప - నిన్నువధింతు!
పోయెదవన నెందు - పోనిత్తు? నెటకుఁ
బోయెద"వని పల్క - బొమముడితోడఁ
గిటకిట యన పండ్లు - గీఁటుచు నలిగి
కటములు మిగుల ను - త్కటముగా నదుగఁ
బొడవైన యొక మహా - భూజంబు వెఱికి
యదుగుల ధారణి - యల్లాడ నడఁచి
"చావుపొమ్మని" వైవ - జానకీరమణుఁ

— రాముడు ఖరునిఁ జంపుట :—

డావంతయుఁ దలంక - కాసుగంబులనుఁ
బొడిపొడిచేసి యా - భూమీరుహంబు
నడుమనే తునిమి క - న్గవ జేగురింప
వేయు తూపుల దైత్య - వీరుని యురము
గాయముల్ సేయ ర - క్తంబులు దొరుగ
సెలయేరులనుఁ బోల్చు - జేగురు కొండ

యలవున గదుకు కం - ఠమురులం దరుమ
నెదురుగా రాఁగస్పై - నెగయు దుర్గంధ
మెద నేవగించి మ - హీసుతా విభుఁడు
వెనువెనుకకుఁబోయి - వీతిహోత్రునకు
నెసవచ్చు తనకింద్రు - నిచ్చినయట్టి
బ్రహ్మాండశిఖనుప్ర - భావమౌ నొక య
జిహ్మాగంబున రొమ్ము - చినుఁగ వ్రేయుటయు
హరునిచేఁగూలిన - యముని చందమున
హాహాయ ఘోరవ - బ్రాహతిఁబడిన
బలవృత్ర నముచుల - పగిది నద్దనుజుఁ
డిల మీఁద వ్రాలిన - యెడ బ్రహ్మముఖులు

—: దేవతలు శ్రీరామునిఁ గీర్తించి
పుష్పవృష్టి గురియించుట :—

రాజర్షి వరులను - రణభూమి జాన
కీ జానిఁ గనుఁగొని - కీర్తనల్ చేసి
శ్రీరామ! వీఁడు చే - సిన యుపద్రవము
లోరువలేక యిం - ద్రోపేతముగను
నేమెల్ల శరభంగు - నింటికి వచ్చి
యీమాట లాడుచో - నింతియు నీవుఁ
దమ్ముఁడు దాఁజూచి - తత్తిగాదటంచు
నహ్మానియును మేము - నాలోచనములు
జేసి యింద్రునితోడ - శీఘ్రవేగమునఁ
బాసిపోయితిమి పు - ష్పకముల మీఁద
మునులెల్ల నిది కార్య - ముగ నెలయించి

నిను దెచ్చి రిచటికె - న్నేయుపాయముల
మాయాపదలు దీరె - మౌనుల కెల్ల
నీ యాశ్రమములందు - నిడుములు మాని
నీదండకాటవి - నెల్ల మౌనులును
వేదోక్తకర్మముల్ - వెలయఁ జేయుదురు "
అనునంత జడివట్టె - నరుల వాన,
తనియించెఁ జెవులుగం - ధర్వగానములు,
తులకించె దివిజదుం - దుభినాదంబు,
విలసిల్లె నచ్చర - విరిఁబోండ్ల యాట,
మలసెఁ జందనశైల - మారుతాంకురము
పొలిచెను విల్లెత్తు - పొడవుచే ధరణి;
అపుడు వేల్పులు రాము - నాశీర్వదించి
కపటదైత్యులు మాఁడు - గడియలలోన
నీరాముచే ద్రుగ్గి - రెల్లరు! నాది
నారాయణుఁడయి మా - నవమూర్తిఁ దాల్చి
యితఁడయ్యెఁగాఁబోలు - నిఁక మంటి మనుచుఁ
గ్రతుభుజులెల్ల స్వ - ర్గమునకుఁబోవు
నావేళ లక్ష్మణు - డనలగహ్వరముఁ
దావెలువడి మహీ - తనయఁదోకొనుచు
నారాహవాసులై - నట్టిసంయములు
జేరి వెంబడి రాఁగ - శ్రీరాముఁజూచి
సౌమిత్రి సంతోష - సహితుఁడై పొగడ
భూమీసురస్తుతుల్ - పుడమిపై నిండ,
" మునులనుఁ జేపట్టి - మొనలకు నడచి
దనుజులఁ దునిమియెం - తటిధన్యుఁడయ్యె!

కనుచాటు లేక సౌ - ఖ్యంబుతో నెపుడు
మనుఁగాక నాస్వామి - మహి నెల్ల నాఁడు!"
అనుచు సిబ్బితితోడఁ - బ్రాణేశువదన
వనజంబుఁజూచి భా - వము పల్లవింపఁ
జేరి కౌఁగిటఁజేర్చి - శ్రీరాము మరియుఁ
దేరి కన్గొనుచు నెం - తే మదిమెచ్చి
యతిమానుషంబైన - యాత్మేశు శౌర్య
మతిశయంబని మెచ్చి - యడుగుల వ్రాలి
లేచి క్రమ్మరఁగ నా - లింగనసౌఖ్య
వీచులఁ దేలి య - వేల ప్రమోద
వారాశి నోలాడు - వసుమతీతనయఁ
జేరనక్కునఁ జేర్చి - శ్రీరామవిభుఁడు
మానులఁ బనిచి ల - క్ష్మణుఁడును దాను
నానందరసమగ్నుఁ - డై యున్నయంత

— అకంపనుఁడు రావణుని సముఖమందు
శ్రీరామ పరాక్రమము నుగ్గడించుట —

అప్పు డకంపనుఁ - డనెడి రాక్షసుఁడు
"చుప్పనాతిని ముక్కు - సోణాలఁదాఁకఁ
జెక్కి దానికి వహిం - చికొని పోరాడు
రక్కసులను ద్రుంచి - రాక్షసప్రభుల
ఖరదూషణాదుల - ఖండించి నపుడె
సురవైరులకుఁ దల - చూపరాదిచట
నిజనస్థానమిం - కెవ్వ రేలుదురు!
రాజన్యునిఁగాఁగ - రావణాసురుఁడు

నియమించుకోపోయి - నేఁడెల్పుకున్న
పయికార్యమతనికే - ర్పడియుండ" దనుచు
లంకకు వీతక - లంకకు వాఁడుఁ
గొంకుచు దశకంఠు - కొలువున కేఁగి
"దనుజేంద్ర! మనజన - స్థానంబు లోని
దనుజులందఱు రణ - స్థలములోఁ బడినఁ
దప్పించుకొని నీప - దమ్ములుఁ జూడ
నిప్పుడొంటిగ డాఁగి - యేను వచ్చితిని
చిత్తంబులో వల - సినయట్లు జూడుఁ
డిత్తరి" యనుమాట - యెప్పుడు వినియె
నప్పుడే కోపించి - యాపంక్తిముఖుఁడు
రెప్పవేయక వాని - దృష్టించి పలికె
"చాలించురోరి! పి - శాచప్రచార!
యేలదబ్బరలాడ - నిట్లు నాయెదుర?
పట్టుచుఁ బట్టుక - పాడయ్యె నంటి
వెట్టుజనస్థాన - మిందఱు వినఁగ ?
అదియేల నిట్లయ్యె? - నసురలనెల్ల
వెదకి చంపిన యట్టి - వీఁడెవ్వాఁడు?
వానికెవ్వఁడు దిక్కు? - వాఁడు ప్రాణముల
తోనెట్టులుండు నిం - దుఁదిగిన యపుడె?
బ్రదుకనొల్లక యింత - పనిసేయువాని
బ్రదికింపనేర్తురే - బ్రహ్మాదిసురలు!
నాకప్రియముఁ జేసి - నలినాక్షుఁడైన
నాకేశుఁడైనఁబి - నాకి తానైన
ధనదుఁడైనను యము - ధర్మరాజైన

మన నెట్లు నేర్తు నే - మఱుమొగంబిడినఁ
గాలునికిని నేను - గాలుండ! కీలిఁ
గీలికి! మృత్యువుఁ - గెడపమృత్యువను!
తనప్రతాపంబుచేఁ - దరణిఁ బావకులఁ
బొనిగింతు! వాయువుఁ - బోలి క్రమ్మరుదు!
నిజమాడు మేఁటికి - నీమది భీతి?
రుజచేతఁగల్లలా - రోపించి పలుక!"
అన నకంపనుఁడు ద - శాననుఁజూచి
వినయపూర్వకముగా - వినుమంచుఁబలికె.
"దశరథసుతుఁడు ప్ర - తాపభాస్కరుఁడు
శశిబింబవదనుఁడా - జానుబాహుండు
జితవైరివీరుండు - సింహసంహననుఁ
డతిలోకుఁడఖిల క - ల్యాణశీలుండు
రాముఁడు దండకా - రణ్యంబులోన
నేమిటికో వచ్చి - యెందఱింజంపి
యచలుఁడై యున్నవాఁ - డతనితో నెదుర
నచలధన్వియునోపఁ - డని తోఁచె నాకు!"
అని పల్కనంత గ - లాహియుఁబోలి
కినిసి రోజుచు "నుడి - కించెదనన్న!
రాముఁడెవ్వఁడు? వాఁడు - రణమెట్లుచేసె?
రాముని వెంబడి - రాదుగా నేఁడు
నాయింద్రముఖ్యనా - నామర శ్రేణి
యీ యక్షమంతయు - నెఱఁగింపు మనిన
ముమ్మాఱుగా దశ - ముఖుఁ దేఱిచూచి

క్రమ్మరఁ జేరి య - కంపనుఁ డనియె.
"విలువిద్యయందుఁ బ్ర - వీణుఁడు రాముఁ
డలఘుసాహసుఁ డింద్రు - నంతటి వాఁడు
కారుణ్యశరధి య - కల్మషాత్మకుఁడు
సారసాక్షుఁడు సర్వ - సముఁడు ప్రాజ్ఞుండు
నతని తమ్ముఁడు నస - మాధిక శౌర్యుఁ
డతని లక్ష్మణుఁడని - యందురు పేరు.
అన్నతో సరియైన - యతిబలశాలి
యన్నిట మేటి దే - వావళికన్న
ననిలునితోఁ గూడు - నగ్ని చందమునఁ
దన సహోదరుని ప్ర - తాపంబు చేత
రాముఁడున్నట్టి గ - ర్వముఁ జూచి యింక
నేమిటి పౌరుషం - బెట్టి వారలకు ?
అతఁడు జనస్థాన - మారడిఁ బుచ్చి
నతనిచే హతులైరి - యఖిల దానవులు
రామునికిని సంగ - రంబునఁ దోడు
హేమపుంఖశరంబు - లింతియె కాని
కడమవారలఁ జూచి - కానమవ్వేఁట
వెడలు తూపులు వహో - విషభుజంగములు
నెంతెందు చూచిన - నెల్లరాక్షసుల
ముందఱ నోఁచురా - ముఁడు సమరమున
నింతటివానిచే - నీజనస్థాన
మంతయుఁ బాడయ్యె - నసురులు వడిరి."
అనిన రావణుఁడు దు - రాగ్రహంబొదవ

నని కేఁగి శ్రీరాము - నవనిఁగూల్చెదను
నిపుడెపోయెద నన్న - యెడ నకంపనుఁడు
కుపితాత్ము దశకంఠుఁ - గూర్చి యిట్లనియె.

— అకంపనుఁడు రావణునితో రాముని గెల్చు నుపాయము సీతనపహరించుటయే యని చెప్పుట —

"రాముని బలపరా - క్రమశక్తు లింత
సామాన్యమే! నీవు - శపథముల్ వలుక
శరములచే నదీ - సలిలప్రవాహ
ములనైన నొకక్షణం - బునిల్పగలఁడు!
అవని నక్షత్రగ్ర - హావళినైన
దివియైనఁగినిసి భే - దించు నమ్ములను!
పాతాళమునఁగ్రుంగి - పడిపోవునట్టి 2540
భూతలంబైన ని - ల్పును కరాగ్రమున!
జలములు లేకుండ - జలధులింకించు
జలముల నించుని - ర్జలవారినిధుల
నిల మిన్ను గావించు - నిల సేయు మిన్ను
నెల నినునిగఁజేయు - నెల సేయు నినుని
పగలురేలును రేలుఁ - బగలును జేయు
జగతిపై నతనిక - సాధ్యముల్ గలవె?
తలఁచిన విశ్వమెం - తయు వినిర్మించి
మలఁగించు విశ్వంబు - మాట మాత్రమున
నరికట్టు వాయువు - నల్లాడకుండ 2550
గురిపెట్టు జముని ము - క్కున మషీరేఖ!
ఇటువంటి రఘువీరు - నెదుర నీవొంటి

నెటుల పోయెదవంటి - నెఱుఁగలేకుంటి !
సాటియే శ్రీరాము - చంద్రుతో నీవు
మాటలేఁటికి హస్తి - మశకాంతరంబు !
పోయితివే మోస - పోదువు ఖరుఁడు
వోయినట్లనె కాని - పోయి రారాదు !
పోరాదు నీకునేఁ - బోరానివాఁడె ?
తీరని పనిగాన - తెలుపఁగా వలసె.
పాపకర్ములకు సు - పర్వలోకంబు
ప్రాపింపనటుల యా - భానువంశజునిఁ
జెనకిన వారికిఁ - జేకూడనేర
వనుపమ జయకీర్తు - లాపదల్ గాక
యాదండకావని - యందు కుండలిత
కోదండపాణి ర - ఘుశ్రేష్ఠుఁజూచి
యెదురింప నీవేల - యీజగత్రయముఁ
బొదివిన నొకక్షణం - బున నీరు సేయు
నతని గెల్వఁగ నుపా - యము వేఱె కలదు
క్షితితనూజాత యా - సీత రామునకు
దేవేరి వెనువెంటఁ - దెచ్చుకొన్నాఁడు
దేవగంధర్వదై - తేయకామినుల
సరిలేరు జానకి - సౌందర్యమునకు
నరభామినులఁ దగు - నా సాటిసేయ
మదుని సమ్మోహన - మంత్రాధిదైవ
మరవిందభవుసృష్టి - నంటని ప్రతిమ !
లోచనానందక - ల్లోలవారాశి
యాచంద్రముఖి చెల్వ - మలవియే పొగడ

జానకీదేవి వం - చన మీఁదఁ బట్టి
తేనోపుదేని యం - తియె చాలు నీకు !
నాయింతి వేఱైన - యపుడె రాఘవుఁడు
బాయ నేరక మేనఁ - బ్రాణముల్ విడుచు
నాకిది సరిపోయి - న తెఱంగు మీఁద
నీకు నే క్రియ దోఁచె - నేఁడట్లు చేసి
పగఁదీర్పు" మన విని - పంక్తి కంధరుఁడు
"తగు నీదు బంధుహి - తంబిది నాకు
నటుల సేయుద"మని - యంగీకరించె
నటునటు నాదినం - బంతయుఁదీర్చి

— శ్రీరామునిపైఁబగ దీర్చుకొనుటకై రావణుని
దండకారణ్య ప్రస్థానము.—

వేగినంత పటాణి - వేసడంబులను
వాగెలు గుదియించి - వలుదపగ్గముల
నొగల బిగించి ప - న్నుక నూతుఁడెదుర
గగనయానరథంబుఁ - గ్రక్కునఁదేర
నాతేరిపై నెక్కి - యరుగ నారథము
శీతాంశుఁడంబుజ - శ్రేణిఁగన్పట్టు
తీరున వినువీధిఁ - దిగదిగ వెలుఁగ
మారీచదైత్యాశ్ర - మముఁబ్రవేశించి
యతనిచేతను బూ - జలంది వాఁడిచ్చు
నతిశయభక్ష్యభో - జ్యాదులఁ దనిసి
వానితో నొకఘడ - వసియించి కొన్ని

లేని నెయ్యములుగ - ల్పించి భూషించి
యున్నాడ రావణు - నుల్లంబులోన
నున్నకీ లెఱుఁగక - యొంటిగా నితఁడు
తనయింటి కేపనిఁ - దలఁచియో వచ్చె
నని యెంచి మారీచుఁ - డతనికిట్లనియె.
" యేమిగార్యముగ నా - యింటికివచ్చి
తీమీర ననుచరు - లెవ్వారులేక ?
ఏమి సేయుదు నీకు - నేమి కావలయు
నేమి తలంచితి - వెఱిఁగింపు మనిన "
మారీచుకూరిమి - మాటల కలరి
యారావణుఁడు విన - యమున నిట్లనియె.
" ధరణీసురలకహి - తంబులు గోరు
ఖరదూషణాది రా - క్షసవీరవరులఁ
దడవుగా మనజన - స్థానంబు నందు
గడితాణెముగ నుండఁ - గట్టడ జేసి
యున్నది యెఱుఁగుదు - వో లేదొ ? యిట్టు
లున్నచో నిన్ననే - నొకవార్త వింటి
రామచంద్రుఁడు దశ - రథపుత్రుఁడొక్క
కామినితో దండ - కావని జేరి
కదనంబులోపల - ఖరదూషణాది
మదమత్తదనుజకు - మారవర్గమును
నారాచములఁగూల్చి - నాఁడందుకతన
నారాఘవుని దేవి - నపహరించెదను
అందుకు నీ సహా - యము మదిఁగోరి
నందునవచ్చితి " - నని యుష్ణ వలికె

నప్పుడెగుండె ఝ - ల్లని తెల్విఁదప్పి
దప్పితో నాలుకల్ - దడిలేక భ్రమసి
పెదవులుఁ దడవుచు - భీతిచేఁజాల
నెదవడి మారీచుఁ - డిట్లని పలికె

—: మారీచుని హితోక్తులు :—

"సీతను దెమ్మని - చెప్పిన పరమ
పాతకుఁడెవ్వఁడా - పాలసబుద్ధి
వినియేల చెడనీకు ? - వేగంబె వానిఁ
గినిసి దండించినఁ - గీడొంద వీవు !
అవని యరాక్షసం - బై పోవనిన్ను
నవివేకిగాఁ దన - యాత్మలోనెంచి
యెవ్వఁడింతకుఁదెగి - యెను ? వానిఁదెల్పు
మివ్వేళఁ దగునాజ్ఞ - నేన సేసెదను !
పాముకోఱలఁ గేలఁ - బట్టుమన్నట్లు
పామరుఁడెవ్వఁడీ - పనికి నిన్ననిచె ?
మిగులవేడుక గొమ్మ - మీఁదఁగేలునిచి
తగ నిద్రవోవు నీ - తలఁగాలఁ దన్ని
యెవ్వఁడుబోధించె ? - నెవ్వఁడు నీదు
క్రొవ్వఱ మృత్యువు - కోఱలఁ ద్రోసె !
నాభిజాత్యంబను - నట్టి తుండంబు
నాభీలవిక్రమం - బనునట్టి మదము
గంధసింధురము నొ - క్కఁడు జేరి దుర్మ
దాంధుఁడై చెడిపోవు - నాతఁడున్నాఁడె !
ధానవమృగములఁ - దరమి వధింప

దానఁ బొల్పడి శస్త్ర - తతి గోళ్లుగాఁగఁ
గోఱలస్త్రములుగా - గుఱుశౌర్యదేహ
సారంబుతో నొప్పు - జానకీరమణ
పురుషసింహము నిద్ర - వోవఁగ నెవ్వఁ
డురక మేల్కొలిపి మృ - త్యువుచేతఁ జిక్కు
విల్లను మకరంబు - విశిఖంబులను క
రళ్లను శౌర్యదు - ర్వారపంకంబు
వలనొప్పు సమరప్ర - వాహవేగంబు
నలరు రాముని పేరి - హ్రదములోఁ జొచ్చి
సుడిఁజిక్కి యెవ్వఁడు - సుడివడఁజూచు
నడలని కాలపా - శములకుఁ జిక్కు ?
కావున నీబుద్ధి - కాదయ్య నీకు !
రావణ ! కులమెల్ల - రక్షింపు మీవు
ఎందఱు లేరు నీ - కింతులు ! వారి
యందాల రమియింపు - మఱుగుము మఱలి
రాముని దేవి ధ - రాపుత్రి మనుజ
భామిని నీకేల - పతితోడఁగూడి
దండకావనుల ఖే - దంబులు దీఱ
యుండగానిమ్ము మీ - యూరికిఁబొమ్ము
నామాట విను" మన్న - నమ్మికచుట్ట
మీమేరఁ బలుకుటల్ - హితమని యెంచి
యప్పుడే మఱలి మ - హారథంబెక్కి
యప్పురంబునఁ దాల్మి - యుల్లంబుఁ జేర్చి
తనదు లంకారాజ - ధానికిఁజేరి
దనుజులు భజియింపఁ - దానున్న యంత

—: రావణుని యెదుట శూర్పణఖ ప్రలాపించుట :—

అపుడు శూర్పణఖ మ - హారోదనంబు
విపుల చలింపఁ గా - వింపుచు వచ్చి
దనుజుల నెల్ల నిం - తటి వేగిరమున
దునుమునే ! యమునిపై - దోడైనవాఁడు
రాముఁడీతని పరా - క్రమము దానవుల
దోమలఁబోగ వోలి - త్రుంగించె నిపుడు
నిది తమయున్నతో - నెఱిఁగింతు ననుచు
నదివచ్చి లంక భ - యంకరవికృత
రూపిణియై చొచ్చి - రుచిరసింహాస
నోపరి దేవేంద్రుఁ - డున్న చందమున
భానుమండల విభా - భాసురదివ్య
నానామణి విభూష - ణములు రాణింప
ననుపమబలులు ప్ర - హస్తాదులైన
యెనమండ్రు మంత్రులు - హితవృత్తిఁగొలువ
దిగదిగ వెలుఁగుచు - దీప్తార్చు లడరఁ
బొగలేని వహ్నిపెం - పుననున్నవాని
పాకారి ముఖ్య ది - క్పతు లాహవమున
డాకొని తేరిచూ - డఁగరాని వాని
శతకోటి తద్భుజ - స్థలముపై నాఁటు
కతమునఁ జీరయా - గాయంబు వాని
తనమేన నైరావ - తము కుమ్ముకత్తి
పెనుగంటు పైసరుల్ - పెనఁగొన్న వాని
పదితల లిరువది - బాహువుల్ దిశలు
పదియునుఁ గబళింపఁ - బనిగొన్న వాని

వెళుపైన యురముపై - వేల్పుమిటారు
లలఁదిన కుంకుమ - యసలొప్పు వాని
లలితమహారాజ - లక్ష్మణచిహ్న
ముల నొప్పు నవయువం - బుల మీఱు వాని
బారుదీరిన యట్టి - భానుబింబముల
తీరెచ్చు కోటీర - దీప్తుల వాని
గురుతరవైడూర్య - కుండలప్రభల
మెఱుఁగుఁ జెక్కులు జాజు - నెఱయించు వాని
నంజనాచల నిభం - బైన గాత్రమున
గంజకెంజాయ వ - స్త్రముఁదాల్చు వాని
కలనిలో విష్ణుచ - క్ర ప్రహారముల
గళములయందు రే - కలు మించు వాని
కులశైలపంక్తి ను - గ్గుగఁజేయ సప్త
జలరాసులు గలంపఁ - జాలిన వాని
తనపేరు విన్నబ్బం - దారకశ్రేణి
మునముల మనునాగు - మాన్చిన వాని
వడిగలవాని చే - వలన ధర్మములఁ
జెడఁజూచువాని నూ - ర్జితశక్తి వాని
నమరగంధర్వ వి - ద్యాధరయక్ష
రమణులఁ దెచ్చి కా - రల నుంచు వాని
పరకామినుల మీఁది - బాళిచే నొక్క
తఱినైనఁ దనివి నొం - దకయుండు వాని
జపము లధ్యయనముల్ - సవనముల్ ఘోర
తపములుఁ జేయుచిం - తమెలంగు వాని
భోగవతీనామ - పురికేఁగి భయద

నాగలోకముల ను - న్న ఫణీంద్రవరుల
వాసుకితక్షక - వ్యాళులఁ గెలిచి
యాసున దక్షకు - నిల్లాలి దెచ్చి
డక్కఁ బెనంగి వా - టకశాలలోనఁ
జొక్కటాటలు నేర్చి - చూచినవాని
కైలాసమున కేఁగి - కలనఁ గుబేరుఁ
దోలి పుష్పకము నె - త్తుకవచ్చువాని
పృథుశక్తిఁ దరువులు - వెఱికించి చైత్ర
రథము నందనముఁ జూ - ఱలు పుచ్చువాని
తరణిచంద్రగ్రహ - తారకావళులఁ
గలములఁ బట్టి న - ల్గడ వ్రేయు వాని
పదివేలవర్షముల్ - బ్రహ్మనుఁ గూర్చి
మది నదరక శిరో - మాలికల్ దునిమి
హుతవహులో వ్రేల్చి - యూర్జితస్థితులు
నతిశయ వరములు - నందినవాని
మనుజులు దక్క నే - మగవానిచేతఁ
దనకు నాశము లేని - తపమూనువాని
బ్రహ్మవిద్యానిధిఁ - బరమసాహసుని
బ్రహ్మణ హింసలఁ - బాల్పడు వాని
క్రూరుని కఠిను మూ - ర్ఖుని దురాచారు
ధీరుఁ గృతఘ్ను నా - స్తికు మదోన్మత్తు
దయలేనివానిఁ గ్రో - ధమునుఁ గామంబు
నయిదోళ్లుగా ధాత్రి - జల్లించువాని
దిగధీశులనుఁ జెక్కి - తీర్చిన చరణ
యుగళమంజీరంబు - లొప్పెడువాని

బృందారకేంద్రు సూ - రించు నమూల్య
చందనవస్త్ర భూ - షల మించువాని
చంద్రప్రభాచాక - చక్యంబు దోలఁకు
చంద్రహాసము కేల - సవరించు వాని
లోకభీకరునిఁ ద్రి - లోకకంటకుని
ప్రాకటజయశీలుఁ - బౌలస్త్యు నుగ్ర
భావను మయసుతా - ప్రాణవల్లభుని
రావణు లోకవి - ద్రావణుఁ జూచి
సిగ్గెఱుంగక ముక్కు - చెవులునుఁ బోయి
బొగ్గువంటి శరీర - మున, బీటలెత్తి
తులకించి రొంపిని - త్తురు గాలుచేతఁ
గాలువువారెల్ల ము - క్కులు మూసికొనఁగ
గద్దరియై మంత్రి - గణములోఁ బెద్ద
గద్దియ నున్న రా - క్షసరాజుఁ బలికె

—. శూర్పణఖ రావణుని నీతి రాహిత్యము నధిక్షేపించుట :—

" అసురనాథ ! భో - గాసక్తిచేత
నాసన్నమృత్యుభ - యంబుఁ గల్గియును
మత్తుండవై మేను - మఱచి యేమియును
జిత్తగింపక యుపే - క్షించి యున్నావు !
గ్రామ్యంబులైన భో - గంబులఁ దవిలి
సామ్యవర్తనల మిం - చక యుండెనేని
యతని నెల్లరు స్మశా - నాగ్నియె పోలె
హితుఁడని యెంచక - యెడసి పోవుదురు
తగునట్టి కార్యంబుఁ - దగినట్టి వేళ

తగఁదీర్పఁడేని యా - ధరణిపాలకుఁడు
గార్యహాని యొకఁడె - కాక తానందు
నార్యులు నిందింప - నల్పుఁడై సమయు
తానస్వతంత్రుఁడై - ధర యేలునట్టి
వాని రాజనుచు న - వ్వరుఁ జేరఁబోక
గజములు బంకసం - కరపల్వలమును
త్యజియించుగతి పాయఁ - దలఁతురల్లముల !
తనప్రభుత్వమునకుఁ - దాఁగర్తగాని
మనుజనాథుఁడు వార్ధి - మధ్యంబునందుఁ
బడియున్న శైలంబు - పగిది రూపేరు
పడక మెల్లన పద - భ్రష్టుఁడైపోవు !
దేవతలెల్ల "నెం - తే యల్పుఁడయ్యె"
రావణుఁడన నెట్లు - రాజ్యమేలెదవు ?
బుద్ధిలేదేని ప్ర - భుత్వంబును నీకు
సిద్ధింపనేర్చునే - శిథిలమా కాక ?
భండారమును మంత్రి - బలము చారులును
మండలాధీశ్వరు - మనసు వెంబడిని
నడవకుండిన వారి - నరపతిత్వంబు
లడవిగాసిన వెన్న - లై పొల్లుపోవు !
దూరపు కార్యముల్ - తోఁచుట నృపులు
చారులచే దీర్ఘ - చక్షువులైరి !
అట్టియోజనలేని - యధముఁడు ధరణి
యెట్లు బోషించు ? వాఁ - డేమిటిరాజు !
నీకిట్టి ధరణీశ - నీతిమార్గంబు
లేకున్నకతనఁగ - ల్గెను వంశహాని

నీజనస్థానంబు - నీదు సోదరులు
రాజమాత్రునిచేత - రణభూమిలోన
పాడఱి హతులైన - పట్టునఁ దేఱి
చూడకయది చెవిఁ - జొనుపకయున్న
దిక్కు లేదనుచు దై - తేయుల నొకరిఁ
జిక్కకుండఁగ సుర - శ్రేణి దండించు
దశరథసుతుచే - దండకావనము
కుశలంబు నొంది నీ - క్షోణికి నెల్ల
హానివచ్చిన కార్య - మది నీకుఁ దెల్పు
మానిసి కరవుగా - మహిఁ యేలినావు!
అదిగాక యిట్టి కా - ర్యము నీవు వినియు
నెదవడి నీచేత - నేమియుఁగాక
యున్నావొ! నాకేమి - యను మదిఁదోఁచి
యున్నకార్యంబుగా - దొక మాట వినుము
చెడుబుద్ధివాని కొం - చెపుటీవివాని
జడుని లోభిని దుర్వ్యా - చారుని శఠుని
రాజని మెంచరు - ప్రజలు దుర్నీతి
రాజమాత్రులు ప్రజా - రంజన పరులె!
గణుతింపఁ బ్రజపట్టు - గలుగని రాజు
తృణమాత్రుఁడతనిచే - తికి నెట్టి పనులు
చేకూడనేర్చునే! - చిల్లపెంచులను
పాకంబు చెడి యెండఁ - బారుకాష్ఠములు
గరికిపోచలు వాయు - గతి మహీరజము
పరిజనంబులను చే - పట్టని దొరయు
నొక్కచందమె కాన - నొక కార్యమునకు

నెక్కడ గురిసేసి - యెంచ రెవ్వరును
ముడిచిన పువ్వులు - మునుముట్టఁగట్టి
విడిచిన మైలయు - విడిచిన యట్లు
మొదట సమర్థుఁడై - మున్నట్టి పెంపు
వదలిన రాజునె - వ్వరు వదలుదురు
ధర్మశీలుండు కృ - తజ్ఞుండు వైరి
మర్మభేదనుఁడు క్ష - మాసత్త్వధనుఁడు
నగునట్టి రాజు సే - యకయుండి సేయు
తగవుగా సకలయ - త్నములు జేకూడు
యోగనిద్రారతి - నుండు నీశ్వరుఁడు
జాగరూకతఁ బ్రపం - చముఁ బ్రోచినట్టు
లీగుణంబులు గల్గు - నృపుఁడు పూజ్యుండు
వేగులచే నెల్ల - వృత్తాంతములునుఁ
దెలియక మందబు - ద్ధిని ధాత్రియేలఁ
దలఁచిన నీకు ప్ర - తాప మెక్కడిది "!
అని శూర్పణఖపల్కు - నామాటలెల్ల
విని రావణుఁడు చాల - విన్ననైయుండి
వంచిన తలలెత్తి - వదరెడుదాని
కించు వాక్యములాల - కించి యిట్లనియె.
" రాముఁడెవ్వఁడు? ఘోర - రణమెట్లు చేసె?
నేమిటికై వచ్చె - నీయడవులకు?
నేరీతిఁ గెలిచె? నె - య్యేవి సాధనలు?
వేరువేరుగ నాకు - వినిపింపు" మనిన
దానవి పంక్తికం - ధరుఁజూచి యెల్ల
దానవుల్ వినుచుండ - తానిట్టులనియె.

—: శూర్పణఖ శ్రీరామాదుల సౌందర్య పరాక్రమములను వర్ణించి, సీతనపహరించి పగసాధింప బుద్ధి చెప్పుట .—

ఆజాను దీర్ఘబా - హాయుగళుండు
రాజీవనేత్రుఁడు - రవికులోత్తముఁడు
నారచీరలుగట్టి - నాఁడు చెల్వమున
మారునితో మారు - మసలెడు నాఁడు
దశరథరాజనం - దనుఁడు రాఘవుఁడు
శశివదనుండు రా - క్షసుల మర్దింప
బంగరు కట్లచే - బలునారి మెఱయు
సింగాణి విల్లు ప - సిండి పుంఖముల
మీఱు లకోరీల - మిఱుమిట్లు గొనఁగఁ
గ్రూరసర్పంబుల - గొమరగ్గలింపఁ
గరముచాచుట నిషం - గంబుఁ దూపులునుఁ
దొరగించుటయు వింటఁ - దొడుగుట పగర
గుఱిసేసి వ్రేయుటఁ - గోరి వీక్షింప
నెఱుఁగఁగ రాకయు - నేక బాణములు
యిలయు నింగియు నిండి - యింద్రుండు గురియు
శిలలు సస్యంబులఁ - జెఱచిన యట్లు
దనుజుల నొక ముహూ - ర్తంబులోఁ దునిమి
మనజనస్థానంబు - మహిఁ బాడుచేసె !
జానకీపతి పాద - చారియై తిగ్మ
భానుని కైవడి - పదునాల్గు వేల
దనుజ వీరులనుఁ జే - తడి యాఱకుండ
దునిమి ఖరాదిదూ - షుల సంహరించి
చెక్కు చెమర్పక - చింతిల్లుచున్న

చక్కడి మానుల - కభయంబు లిచ్చి
యాఁటదానిని దీఱి - హాతము సేయంగ
నేఁటికీ వలదని - యిటుసిగ్గు చెఱిచి
విడిచి పొమ్మన్న నీ - వేదిక్కు గాన
వెడలి వచ్చితిసురల్ - వీక్షించి నగఁగ !
అన్నిగుణంబుల - నాయన తమ్ముఁ
డన్నకు సరివచ్చు నట్టి - యుత్తముఁడు
తమ్ముఁడు చెలికాఁడు - దాసుఁడు హితుఁడు
నమ్మిన వాఁడాయ - నయొ రాఘవునకు
ననుకూల శీలయా - నాయన భార్య
తనరు సీతయనంగ - దరలాక్షి యొకతె !
చక్కని నెమ్మోము - జాబిల్లి రేక
నొక్కలు దిద్దునె - న్నుదురును మేల్మి
బంగరు నిగ్గులు - పచరించుమేను
సింగపునడుము రా - జీవపత్రముల
నిరసించు కన్నులు - నెఱివంక బొమలు
గరువంపు నవ్వు ను - త్కటకటీరంబు
జక్కవగుబ్బలు - సంపంగి టెక్కు
ముక్కను వలమురి - ముకుదైన గళము
తుమ్మెదకురులు చే - తుల సోయగంబు
కెమ్మోవి చెలువందు - కిసల హాస్తములు
కెందమ్మి యడుగులు - గిలగిల మొరయు
నందెలు మణికంక - ణాంగదంబులును
జెలునొప్ప నాసాధ్వి - శ్రీమహాలక్ష్మి

పొలుపున గిరిరాజ - పుత్రివై ఖరిని
వనదేవత యనంగ - వారిజాసనుని
వనితకై వడి జగ - ద్వర్ణిత యగుచు
నెక్కడి సురకాంత - లేడయప్సరస
లెక్కడి యహికన్య - లెందుకువారు !
వారిసౌందర్యమ - వ్వనజాతి కాలి
గోరునకైనఁ ద - క్కువ నిక్కువంబు !
తగు నీకు సీత నీ - తకు నీవు దగుదు
వగణిత భోగభా - గ్యాకారములను !
అటువంటి సతి యింద్రు - నంతటి వాని
కెటువలె దొరకు ! న - య్యుగురాకుఁ బోఁడి
నరుని వెంబడిగవ - నంబుల వెంటఁ
దిరుగునే ! యనితోడి - తెచ్చినే నీకుఁ
గానుకఁ జేసి నే - గలిగిన ఫలము
నీ నెమ్మదికి నింపు - నెలకొల్ప వలయు
నని యెంచి పర్ణశా - లాంతరంబునను
జనకజతోఁ డబ్ర - సంగంబు జేసి
యేకాంతమున నీయ - హీనశౌర్యంబు
నీకల్మియును వితీ - ర్ణియుఁ జెలువంబు
మరులు పుట్టఁగఁ బల్కి - మదినీయు కొలిపి
తరుణినే దెచ్చు మం - త్రము భిన్నమైన
నారామసోదరుఁ - డరికట్టి నన్ను
పారిపోవఁగనీక - బ్రతిమాలుచుండఁ
జెవులును ముక్కుఁగో - సెను ! నీనిమిత్త
మవమానములనెల్ల - నాలయంబైతి !

సీతను నీవు చూ - చిన వలరాజు
హేతికి లోనుగా - కెట్లు దాఁగుదువు !
అమానవతి మీఁది - యాస గల్గినను
తామసంబేల నీ - తనిఁగుడికాలు
ముందుగానడపుము - మూఁకలఁగూర్చి !
సందడి సేయకు - సన్నకుసన్న
మాయావివై పోయి - మఱలినగాని
నీయత్నమంతయు - నిష్ఫలంబగును !
నీ వొక్కఁడే యేల - నినువంటివారు
వేవేలు గూడిన - విల్లందెనేని
రాముని ఘోరనా - రాచదావాగ్ని
చేమాడి పోకేమి - సేయంగ వచ్చు !
నిదుర వేళలనైన - నీవు శ్రీరాము
నెదురక మాయచే - నెలయించియైన
నొంటరిఁగానున్న - యుర్విజఁబట్టి
యింటికిఁ దెచ్చుకొ - మ్మిది బుద్ధినీకు
నీదుశక్తి యెఱింగి - నేఁడేఁగి రాము
పైఁదలిఁ గొనివచ్చి - భార్య సంపదల
నాకొమ్ము నీకు ని - ల్లాలుగా సుఖము
జేకొమ్ము ! నీకుఁదోఁ - చినయట్లు పొమ్ము ”

—: రావణుని రెండవమాఱు దండకావన ప్రస్థానము :—

అనవిని రావణుఁ - డౌఁగాక యనుచుఁ
జనియొదనని యాన - శాలకు నరిగి
యేకతంబున నమ్మ - లెఱుఁగక యుండ

రాఁగొట్టి తగినసా - రథిఁ జేరఁ బిలిచి
రథమిచ్చుటికిఁ గొని - రమ్మన వాఁడు
పృథువేగమొప్ప ని - ల్పినఁ దేఱి చూచి
కామగంబును మణి - గణవిభాదివ్య
ధామంబు దనుజన - క్త్ర ఖరాన్వితంబు
నగు తేరిపై నెక్కి - యర్ధరాత్రము న
గగనమార్గంబునఁ - గదలి శీఘ్రమున
ధవళాతపత్రంబు - దశశిరోభాగ
రవిభాసమాన వ - జ్రకిరీటములును
నెఱితావిదిశల నిం - డిన పారిజాత
సరములఁ బోలుచు వి - శాల వక్షంబుఁ
జకచక ల్వైదచల్లు - చలువదువ్వలువ
నకళంకరుచి చంద్ర - హాసంబు మెఱయ
మెఱుపులు గల నీల - మేఘంబు వోలి
ధరణికి డిగ్గి యా - దశకంధరుండు
నెడనెడనున్న మ - హీధరావళియు
నుడివోని ఫలముల - నొప్పు వృక్షములఁ
జలువనీటి నెసంగు - జలజాకరముల
నలరెడు మానుల - యాగవేదికల
నారికేళరసాల - నారంగవకుళ
భూరుహానీరంధ్ర - పుణ్యాశ్రమములుఁ
బన్నగగంధర్వ - పక్షికింపురుష
కిన్నరమిథున సం - కీర్ణకుంజములు
వాలఖిల్య మరీచ - వైఖానసౌజ
లాలితపర్ణశా - లా ప్రదేశములు

వీణాది సంగీత - విద్యలచేఁ బ్ర
వీణలౌ నచ్చర - వెలఁదుల గుంపు
చలువముత్యపు సరుల్ - చందనప్రసవ
ములు దాల్చు దేవతా - ముగ్ధాజనములుఁ
గలహంస బకచక్ర - కారండవాది
జలపక్షికల కలాం - చత్రటాకములు
విచ్చలవిడిఁ జెంత - విహరింప నిలకుఁ
వచ్చిన దేవతా - వర విమానములు
తీరంబులకుఁ దెచ్చి - తెరలు వైచుటయు
నారజల్లిన యట్ల - నలరు ముత్తెములుఁ
గరడులచే లవం - గములు తెప్పలుగఁ
దరిఁజేర వెరఁజు వ - ర్తకుల మొత్తంబు
మోసులైన ప్రవాళ - మూలకందములు
రాసులై దేరుతీ - రలతాగృహములు
మిఱియపుఁ బొదరిండ్ల - మీఁద ఘుమ్మనుచుఁ
దిరుగుచు నసియాడు - తేఁటి దాఁటులును
వెండి బంగారముల్ - వెలలేని మణులు
నిండిన గనులనె - న్నిక కెక్కు చరులు
తళుకుగాఁ బెరుగు చిం - దంపు తిప్పలును
గరిమముల్ మించిన - కరపట్నములును
గజవీరభట తురం - గమ రథంబులును
విదయకరణములై - వెలయు కోటులును
చల్లనై మెల్లనై - చాలనెత్తావు
లెల్లెడ వెలివిరి - యించు గాడ్పులును
గలిగిన జలధి చెం - గటి విభవములు

కలయఁ జూచుచుఁ దశ - కంధరుం డరిగి
కట్టెదురను దొల్లి - గజకచ్ఛపములఁ
బట్టుక కొనివచ్చి - పక్షిపుంగవుఁడు
కొమ్మపై వ్రాలు వేఁ - గునవది విఱుగ
నమ్మహీ శాఖఁ బా - యక వాలఖిల్య
మునులుండ నెఱిఁగి తా - ముక్కునఁ గఱచి
కొని హిమాచలముపైఁ - గొమ్మఁ దానునిచి
యందుండు మానుల - నవ్వలి కనిచి
యందుపై గజకచ్ఛ - పాహారి యగుచు
దాన సత్త్వము హెచ్చి - తల్లి ఖేదంబు
మానుపఁ దలఁచి య - మరపురిఁ కేఁగి
సురరాజ గుప్తమౌ - సుధ గొనివచ్చె
గరుడి నిందుకుఁ దాళి - గగనంబు మోఁచి
శతయోజ నాయత - శాఖల చేత
నతిశయించి తపోధ - నాదరమైన
ధర్మమూలము సుధ - ద్రంబను మఱ్ఱి
దుర్మదాంధుఁడు ప్రోవు - త్రోవలోఁ జూచె.

— రావణుఁడు మారీచుని సంధించుట —

ఆ చెట్టు గడచి వాఁ - డవ్వలఁ జనుచుఁ
జూచె మారీచర - క్షోవరాశ్రమము
నందు జటావల్క - లాదులతోడ
నిందుశేఖరు మది - నెపుడు భావించి
యొప్పు మారీచుఁడా - నొయ్యన జేరి

యప్పుడు రావణుఁ - డానిశాచరుఁడు
దనకిచ్చు పూజలఁ - దనిసి యున్నంత
గనుఁగొని వాఁడు రా - క్షసరాజుఁ బలికె.
"ఇప్పుడే వచ్చితి - విటమున్న పోతి
విప్పుడు మరలిరా - నేఁటికి నీకు ?
మీకందఱికి సుఖ - మే కద ? యేమి
వాకొన వచ్చి రా - వణ ! చేరినావు ?
మదిఁగలఁగెడు నాకు - మాటక తెలుపు
మిది" యన్న విని దాన - వేశ్వరుఁ డనియె.

— రావణుఁడు సీతాపహరణమున మారీచుని సహాయముఁ గోరుట —

"ఓయి ! మారీచ ! నీ - వొకఁడ వేకాక
యేయెడ వెదకిన - నేఁ బ్రాపుఁగాన !
ఖరదూషణాది రా - క్షసుల నందఱను
నరుఁ డొక్కఁ డెదురుగా - నక సంహరించె
జడియక మన జన - స్థానంబు చెఱిచి
'కడులావుతో దండ - కావనంబునను
బదునాల్గువేలైన - పలల భోజనులఁ
జిదిమి వైచితిని - మీచింతలుదీరె"
ననుచు బీరములాడి - యుండలిమునులు
తనుమెచ్చ తమ్ముఁడు - దాను నున్నాఁడు
అందుపైఁ దనకది - యాలని యొక్క
సుందరిఁ దెచ్చియుం - చుక యున్నవాఁడు
రాముఁడు మిగుల దు - ర్జనుఁడు మూర్ఖుండు

సోమరి యింద్రియ - సుఖపరవశుఁడు
కఠినుఁడు క్రూరసం - కల్పుఁడు లోభి
శఠుఁ డధర్మపరుండ - సత్యవాదుండు
ముష్కరుఁ డధముఁడు - మూఢుఁడజ్ఞాని
నిష్కారణంబుగ - నేఁడు శూర్పణఖ
చేరిన ముక్కును - జెవులును గోసి
యారయ మనకెల్ల - నపకీర్తిఁ జేసె
నందుకు బదులుగా - నతని యిల్లాలి
నందఱు మెచ్చఁగ - నపహరించినను
మనమైలవాసి నె - మ్మది నుండవచ్చు
దనుజుల కెల్లనుఁ - దలయెత్తఁ గలుగు!
నాయన్న దమ్ములు - నన్నుగా నీవు
హాయత గల్గిన - యట్లైన నాకు
నెదురింప నేర్తురే - యింద్రాదులైన
యదిగాక నీవు మా - యాబలంబునను
జతురుండ వగుట నా - సాహాచర్యంబు
మతి నెంచి వచ్చితి - మనవిఁ జేపట్టి
కనక మృగంబవై - కలధౌతరేఖ
లను మీరి రత్నవా - లంబుఁ ద్రిప్పుచును
సీతముందఱ నటిం - చినఁ జూచి మెచ్చి
యాతన్వి పట్టితె - మ్మని వేఁడ నేని
రామసౌమిత్రులా - రామనుఁ గాన
నేమది వచ్చిన - నెలయింపు మీవు!
రాహుగ్రహంబు చం - ద్ర ప్రభఁబట్టు
నూహఁజే నాసీత - నొడిచెద నేను!

ఇటులఁ జేసితిమని - యింతిని బాసి
దిటదప్పి రాముఁడా - త్రిని మృతినొందు।
సులభమార్గంబిది - చూచితి రాము
గెలుచు నుపాయమే - క్రియ మఱిలేదు
రమ్మని ప్రార్థింప - రావణు మాట
రిమ్మవట్టింప మా - రీచుఁ డిట్లనియె

—: మారీచుం డీయకార్య కరణమునుండి
రావణుని మఱల్పఁ బ్రయత్నించుట :—

జగతిపై దొరలకి - చ్చకము గావలసి
మొగమోడి ప్రియవాక్య - ములు వల్కువారు
గలిగి యుందురు గాని - కడతేర్చు హితము
దలఁచి యెప్పటికి హి - తంబైన మాట
నుడువు వారలు లేరు - నూటవేయింట
నుడివిన వినువారు - ను ధరిత్రి లేరు.
ఇంద్రుని గుణముల - నెచ్చిన రామ
చంద్రుని భుజశక్తి - శౌర్యదర్పములు
వేగుల వారిచే - వినిన దోషమున
వేగనీయని యావి - వేకంబుఁ గప్పి
నెఱుఁగక యున్నాఁడ - వింతకోపించి
శరము రాముఁడు వింట - సంధించె నేని
చాటి చెప్పెదను రా - క్షసులను నట్టి
మాటయే లేకుండ - మహిఁ జుల్కఁ జేయు।
సీతనిమిత్తమై - చెడఁగోరితేని

సీతతోడ నాతోడ - నే చల్లఁగాను
శ్రీరాము కోపాగ్ని - చే విశ్వమెల్ల
నీరయి లంకతో - నెఱివేఱుఁగాని!
రావణ! నినువంటి - రాజును గొల్చి
చావనేమిటికి రా - క్షసు లకారణము!
నినువంటి కాముకు - నికి రాజ్యమేల?
తనవారి నావారి - తన మెంచనేర
నైనట్టి పని యయ్యె - నాగ లీడేరి
హానిఁజెందిన మంచి -దని యెంచెదేని
చెడిపోవుటయుగాని - సీత పేరైనఁ
దడవిన యపుడనీ - తలలుర్విఁగూలు
రామదూషణము లూ - రక నీవు చేసి
కామహాత్ముని నల్గి - రైన నాడుదురె!
కైకకు లొంగిన - కన్నట్టి తండ్రిఁ
జేకొని నిజమరిఁ - జేయంగఁ దలఁచి
వనులకు వచ్చిన - వాఁడట్టి పరమ
మునివేషధారి రా - ముని మీఁద లేని
గుణములారోపించి - కొన్ని దోషములు
గణుతించి పలికెదా - కాకుత్స్థకులుని
రాముఁడు పరమధ - ర్మస్వరూపకుఁడు
రాముఁడు సత్యప - రాక్రమశాలి
యాయన దండను - న్నట్టి జానకిని
నీయట్టివాఁడుఁ దే - నేర్చునే బ్రదికి
మనయిరువురికిని - మంచికార్యంబు
మనసున దలఁచి యీ - మాటలాడితివి!

భానుఁడుండఁగఁబట్టి - ప్రభఁదివియంగఁ
బూనుదురే! ఇట్టి - బుద్ధులు గలవె?
బాణాసనాదుల - పారకాష్ఠములు
బాణముల్ జ్వాలికా - పటలంబుగాఁగ
రణమను నీరసా - రణ్యంబులోనఁ
దృణముగా వీరదై - తేయసైన్యంబు
నేర్చు రాఘవవహ్ని - యేగతిఁజేసి
యోర్చెదు మిడుతపై - నురికిన యట్లు?
చాపపాశము పూని - శత్రులందునుహాఁ
గోపించి యముఁడు మా - ర్కొని వచ్చినట్లు
వచ్చురామునిఁజేర - వశమె యొక్కనికి!
పిచ్చుక యెట్లు గు - ప్పించు వారిధిని?
యతని కోదండ స - హాయంబు గలుగు
క్షితి తనూజాతఁ దె - చ్చెదనందురయ్య?
సింహావక్షుని దయా - సింధునిఁబురుష
సింహుని శ్రీరాముఁ - జేరి యాసీత
ప్రళయానలశిఖా ప్ర - భావంబుచేత
వెలుఁగొందకీవెట్లు - వీక్షింపఁ గలవు?
అకట! ఇట్టివృథా ప్ర - యత్నమేమిటికి?
సుకరంబు గాదు నీ - చూచినచూపు
రామునిఁ గినిపిన - రాలేవు మఱలి!
భూమి యేలుక సుఖం - బుననుండుమీవు
మనవిభీషణునితో - మంత్రులతోడ
మనసులోఁ గల - యట్టి మర్మమేర్పరపి
యతనికి మనకు బ - లాబలంబులును

స్థితులును గుణదోష - చింతలు నరసి
వారలు చెప్పిన - వైఖరి నడవు
మారాముఁ జెనకి ద్రో - హము సేయనేల ?
హిత మహితంబు న - వెంచక జనక
సుతఁదెత్తునని చెడఁ - జూచెదవేల ?
నీవు గల్గినవట్టి - నెలఁతలు నీకు
వేవేలు గలరేల - విడువు మీతలఁపు

— పూర్వము శ్రీరామునిచేఁ దనకుఁ గల్గిన భంగపాటును
మారీచుఁడు రావణునకుఁ జెప్పుట :—

ఇదిపరమార్థంబు - హితము నామాట
మదిఁజేర్చి లంకకు - మఱలి పొమ్మీవు.
దనుజేంద్ర! తొల్లిభూ - ధరము చందమునఁ
దనువెత్తి యయుతవే - దండ సత్త్వమునఁ
గుండల మాణిక్య - కోటీరదివ్య
మండనంబులుఁ దాల్చి - మదగర్వరేఖ
దండకాటవిఁ గేఁగి - తాపసోత్తముల
కండలుదిని దావుఁ - గడుఁగ్రొవ్వు దొట్టి
యున్నచో గౌశికుఁ - డొదిగి నావలన
జన్నంబుఁ దాఁజేయ - శక్తుఁడు గాక
నాదశరథుఁ జేరి - యవనీశ ! పలల
ఖాదులు నాదు యా - గము సాగనీరు.
అందుకు మీరాము - నంపుము దనుజు
లెందరు వచ్చిన - నితఁడు దండించు
ననవిని గాధేయు - నాదశరథుఁడు

గనుఁగొని "తగునె రా - క్షసులతోఁ బోరఁ
బదియునాఱేండ్ల యీ - బాలకునంప
నది యేటిమాట! య - స్త్రాభ్యాసశక్తి
చాలదు వీనికే - సైన్యంబుఁగూడి
తోలుదు దానవా - దుల సంగరమునఁ
జలమేల" యనిన వి - శ్వామిత్ర మౌని
యలుక తోడుత నమ్మ - హారాజుఁజూచి
"మారీచుఁ జంపనో - మనువంశ తిలక!
శ్రీరామునకె కాక - శివునకుఁ దరమె?
ఎవ్వనిచేఁ దీర - దితనిచే వాని
క్రొవ్వడఁగింతు నీ - కుఁదరంబు గాదు
బలవంతుఁడవు శౌర్య - పరుఁడవు కయ్య
ములను రాక్షసబలం - బులు ద్రుంచినావు.
అందులో నొకఁడుగా - డల తాటకేయుఁ
డందుపై రావణు - ననుచరుఁ డతఁడు
అతులతేజస్వి ని - యాత్మజుఁ డొకఁడె
యతనికి మృత్యువా - యనవచ్చునేని
నాజన్న మీడేరు - ననునమ్మి వెంట
నో జనవర! పంపు - ముఱక రాఘవుని."
అనితోడి తెచ్చితా - యజ్ఞంబుసేయ
ధనువంది రాముఁడ - త్తరిఁ గాచియుండ
నితనిసత్త్వ నమ్మి - యిచ్చిరి మునులు
హుతవహునందు నా - జ్యోపహారంబు
లాపొగలేఁ జూచి - యాఁపఁ గారాని
కోపంబుతోఁ గౌశి - కుఁడు మొఱవెట్ట

బాలుఁడీతండని - పదరి యయ్యాగి
శాలలో రక్తమాం - సంబులు గురియఁ
జంపనొల్లక యొక్క - శరముచేఁదన్ను
గొంపోయి జలధిలోఁ - గూలంగవైచె!
తలక్రిందుగాఁ బడి - తామూర్ఛవోయి
విలవిల దన్నుక - వెసఁ గన్నుఁదెఱచి;
శరమిట్లు నూరుయో - జనములు దెచ్చి
శరనిధిలోవైచి - చంపకపోయె!
అదియౌర! రామాజ్ఞ - యౌర! రామాస్త్ర
మిదియౌర! తనపుణ్య - మింతియేచాలు
నవిలంకఁ జేరితి - నట్టి శ్రీరాముఁ
గినిసి మేల్కొలిచి యేఁ - గీడు సేయుదునె!
కాదనియేమైనఁ - గనిపించుకొనిన
లేదు ప్రాణంబు దా - ల్చిపురంబుఁజేర!
సుకసుఖంబుననుండి - చూపోపలేక
యకట! యీకీడు సే - యఁదలంచి నపుడె
లంకయుఁ జెడు దైత్యు - లకు హానివచ్చు
శంక యేమిటికి ని - జంబె పల్కితిని!
పామున్నమడుగులోఁ - బక్షీంద్రుచేత
నామీన సంఘంబు - హాని వొందినట్లు
రామాపకారంబు - రావణ! నీవు
కామించిచేసి రా - క్షసులఁ జంపెదవు
నీవు చూచుచునుండ - నీవారలెల్ల
రావణ సంగ్రామ - రంగంబులోనఁ
బడిపోవ శోషించు - పాటుఁబోతులను

వెడమతినై చూచి – విలపింపఁ గలవు.
ఆలంకలోని గే – హములు బాణాగ్ని
కీలల భస్మమై – కెడయఁ జూచెదవు
రావణ ! యన్యదా – రపరిగ్రహంబు
నీవె పాపముల కె – చ్చైనాలయంబు
నీ కులసతులతో – నిత్యసౌఖ్యములు
జేకొని రమియింపు – సీత యేమిటికి ?
సతుల ప్రాణములు రా – జ్యము గోరితేని
మతిఁ దలంపకుము రా – మద్రోహమీవు
కాదని సీతపై – గమనంబు నీకు
ప్రాదుర్భవంబైనఁ – బడుము దుఃఖముల.
వినుమింక నొకటి యా – విలుకాండ్రమేటి
వనవాస మీడేర్ప – వచ్చిన వెనుక
దానవుల్ వెంటని – ద్దఱు తోడుగాఁగ
యేను వారును వింత – మృగరూపములను
మెఱుఁగుఁ గోఱలు గబ్బ – మేనులు మెఱయఁ
జరియింపుచును మహా – శ్రమములఁ జెఱచి
మునులను జంపి య – మ్ములుజిక్క మెసవి
వనములు నుగ్గాడి – వచ్చితొల్లింటి
తపసగవారి మీఁ – దట నున్న కతన
జనకజరాముల – ఖ్మ్ణులపైఁ గదియ
నారాఘవుండు మూఁ – డమ్ముల నొక్క
పారిగాఁ దొడఁగి మా – పరువులు జూచి
పడవేయఁ బూనినఁ – బాఱిపోవుటకుఁ
బడుపాట నాకుఁ దె – ల్పఁగరాదు నీకు !

మన్న రామునిమ_త్త్వ - మును బాణశక్తిఁ
గన్నట్టివాఁడనై - గ్రక్కునఁ దొలఁగి
వచ్చి రోషమున స - ర్వంబును రోసి
యిచ్చోట సన్యాస - మేను గైకొంటి
నందుచే నీకు దక్కి - ప్రాణంబు లనుచుఁ
దుందుడుకారి యిం - దువసించినాఁడ
కడమ యిర్వురును రా - ఘవుని బాణములఁ
గడతేరి యమపురిఁ - గాఁ పున్నవారు!
ఏచుట్టు చూచిన - నిరువురు వయసు
రాచబిడ్డలు నొక్క - రమణియుఁ గూడి
ముని వేషములను నా - ముందఱ నిల్చి
ధనువులతోడ న - స్త్రములు సంధించి
యంతకునట్లు పా - యక యున్నవారు
చెంతకు నీవు వ - చ్చిన వేళనుండి
మున్ను నేఁగాన రా - ముని విశ్వరూప
మెన్నండు నీరాక - నిపుడుగన్పట్టె
రామమయంబై ధ - రాచక్ర మెల్ల
నామదిఁదోఁచె ని - న్నటి కలలోన
వెఱచి నేఁబాఱ నా - వెంట రాఘవుఁడు
తరుముకరాఁ గాంచి - తల్లడించెదను
అదినిమి_త్తముగ ని - ట్లాడితి వీవు
బ్రదుకనిత్తువె యెంత - ప్రాలుమాలినను ?
నాకు రకారాది - నామముల్ భీతిఁ
జేకూర్చె రాముని - చేఁ జిక్కినట్ల
రమ్మనకుము నన్ను - రథము పై నెక్కి

పొమ్మనకుము రత్న - పు మృగంబవగుచుఁ
బొంకుపుమంచనకుము - విను రావణాఖ్యుఁ
బిలిచినఁ బలుకక - ప్రేమ దశాస్య
నామధేయముఁ బూని - నాచెంత మెలఁగు
మేమఱియును రాము - నీకఁ దలంపకుము!
నేవెఱచిన యంత - నీవును వెఱతు
వావల వెఱతురిం - ద్రాదిదేవతలు
బలినముచులనైన - బాణజాలములఁ
బొలియించువారలి - ప్పుడు మారుకొనిన!
ననుఁబ్రోచి నీదు మా - నంబుఁ బ్రాణంబు
మనికియు వేఁడిన - మాను మీమాట
యొకరినిఁ జెఱచుట - యుత్తమపురుషు
లకునెల్ల లోకంబు - లకు హానిగాన
హితముఁ దెల్పెదఁ దగ - వెంచి యీమాట
మతియించి యిఁకనైన - మాను మీచలము
బ్రదికియుండినఁ జాలు - పదివేలు వచ్చె
నిదిమాకు నేలనీ - వెటువోతివేమి ?
నీవెంట రానొల్ల - నినుఁ జేరనొల్ల
నీవాఁడగా నిది - నేనెంచి కాదె
సన్యాసినైతి మ - చ్చరమేల నాకు
నన్యాయపరుని వా - క్యము లేలవిందు
నాచుప్పనాతికై - యఖిలదానవులుఁ
జూచు నంతటిలోనఁ - జూర్ణమై పడిరి!
అదివచ్చి బోధింప - నని కేఁగి ఖరుఁడు
నెదప్రవయ్యె బ్రోలెమ - హీస్థలియందు

నీవు నాముక్కుఁ – డి నిర్భాగ్యురాలి
చేవలందవిలి యీ – చేటు కోర్చితివి
వలసిన వినుమట్లు – వలదేని ఖరుఁడు
పొలిసినగతి నీవుఁ – బొలియుదు వచట"

—: రావణుఁడు మారీచుని హితోక్తులకుఁ బెడచెవిఁబెట్టి సీతాపహరణములో సహాయముచేయనిచో వానికి తనచేఁ జావు సిద్ధమని చెప్పుట :—

అనియిట్లు మారీచుఁ – డాడిన మాట
తనకు రోగికినౌష – ధంబునుఁ బోలి
పథ్యంబుగాఁ గణిం – పక వాని బుద్ధి
మిథ్యగానెంచి న – మ్మికలేక పలికె
"చవుటి నేలలయందుఁ – జల్లిన బీజ
నివహంబుక్రై వడి – నీమాటలెల్లఁ
బనిఁ గొనసేరవి – ప్పటికి నాయెడల
నని యేలరాముతో – ననిపల్కనేల?
తలిదండ్రులకుఁ గాక – తన సీమ విడిచి
కలిగిన బంధువ – ర్గము పొత్తువాసి
తప్పుకయొక యాడ – దాని మాటలకు
నిప్పుడీ యడవుల – నిడుమల కోర్చి
పాపియై చెడి చెట్లఁ – బట్టినవాని
ప్రాపున మన్నట్టి – పరదేసి పడుచుఁ
బట్టిన యంత నా – పడ వచ్చెనేని
యిట్టి పాటి విభుత్వ – మేఁటికిఁ దనకు!
లేక యేమాన థా – శ్రీతనూజాత

నీకార్యమింద్రున - కేని గాదనఁగ
వచ్చునే? నీతియె - వ్వరు తెల్పువార
లచ్చోట లేరని - యడుగ వచ్చితిన?
మేలైనఁ గీడైన - మేలు నీవట్టి
యాలోచనలు మాను - మాత్మలో నేను
సీతను దెచ్చుట - సిద్ధంబు తనదు
నీతి పరస్త్రీల - నెమకి పట్టుటలు
రాజు వేఁడిన మంత్రి - రాచకార్యములు
తేజంబు విభునకుఁ - దే వేఁడి యైన
నుపచారములు పల్కి - యొదుఁగుచుఁ దగిన
యపుడు మెల్లని మాట - లాడినట్లాడి
మఱి యొక్కతఱి తన - మతముగా విభుని
మఱలించుకొని తన - మాటఁ జెల్లించి
నడచినఁ దగుఁగాక - యప్రయాసంబు
తడవక హృదయమిం - తయుఁ గాన లేక
వెగటుగాఁ బల్కిన - వినినఁ బూజార్హుఁ
డగు రాజు సైరించు - నా వెఱ్ఱివాఁడ!
అనలుని వేఁడిమి - యమరేంద్రు శౌర్య
మునుఁ జంద్రుని ప్రసాద - మును బాశపాణి
దండశక్తియు భాను - తనయుని సమత
నిండార విభునికి - న్ని గుణంబులునికి
రాజులు మహినెల్ల - రకుఁ బూజ్యులగుట
యోజింపనేరకి - ట్లాంటి నీకడకు
వచ్చినవాని దు - ర్వచనముల్వాలుక

వచ్చునే యెఱుఁగని - వాని చందమున ?
నినుఁ గార్యమడిగితి - నీచేతనైన
పని నీవొనర్పుము - పసిఁడి మెకంబు
మేనెత్తి నీతోస - మీపవనంబు
లోనఁ గ్రుమ్మరిన నా - లోకించి సీత
పట్టి తెమ్మని రాముఁ - బనిచిన నతఁడు
పట్టఁ జేరినఁ దగు - ల్పడక కేడించి
దూరంబుగాఁ బోయి - తోడ రాఘవుని
శారీర మున్నట్లు - జానకి వినఁగ
"హాసీత హాలక్ష్మ - ణా" యనిపలుక
నాసద్దువిని రాము - సరయు మీఁవనుచుఁ
బనుపు లక్ష్మణుఁ బిల్చి - పనిచిన నతఁడుఁ
జను నొంటిగాఁ బర్ణ - శాలలోనున్న
సీతనప్పుడు జేరి - చెఱవట్టి మఱల
నే తెంతు శచిఁదెచ్చు - నింద్రునిరీతి
నీకార్య మీఁడేర్ప - నెల్లరాజ్యమున
నీకు సగంబిచ్చి - నే మెచ్చియుందు
కదలు మిప్పుడె దండ - కావనంబునకు
నిదె రథంబెక్కి యే - నే తెంతు వెనుక
జగడంబులకుఁ బోక - జానకి నురక
తగిలించుకొని కృతా - ర్థతనుందువాఁడ
నిటుసేయవేని యే - నిప్పుడ నిన్ను
నటునిటుఁ బోనీక - యసిఁ ద్రెవ్వనేతు !
పలిన దారతోడ - నెదురాడు వాఁడు
మేలొందనేర్చునే - మేదిని యందు ?

మృగమవై యిపుడ పో - విడ్మావు వోయినను
బగఱచేఁ జావును - బ్రదుకు సందియము
వోవలేననిన ని - ప్పుడెనాడు చేతఁ
జావు సిద్ధము నీకు - సరిపోయినట్లు
నను" మన్న రాజు నే - నను నహామికను
దను వీఁడు కాదన్న - దండింతుననియె
నిందుకు బెదరుదు నే - యని తలఁచి
క్రిందు మీఁదరసి మా - రీచుఁడిట్లనియె

— రావణుని మూర్ఖతకుఁ జింతించి మారీచుఁడు
మఱల హితోపదేశము చేయుట —

" రావణ ! పుత్రమి - త్రకళత్ర సహిత
మీ వేళ నినుఁ ద్రుంప - నిచ్చలోఁ దలఁచి
యెవ్వఁడు బోధించె - నీబుద్ధి నీకు ?
నెవ్వఁడు పాపాత్ముఁ - డిట్ల నీమేలు
చూపోపఁ జాలక - చొరరాని చోటు
లీపగిదినిఁ ద్రోవ - నిచ్ఛకంబాడె ?
నీకు మృత్యువును స - న్నిహితంబు చేసి
యీకీడు దలఁచువాఁ - డెవ్వఁడున్నాఁడు ?
నిను మించిన బలుండు - నీబలం బడఁప
మనసున నెంచి యీ - మరులుపుట్టించె !
మర్యాద మీఱుచో - మంత్రులు తగిన
కార్యమాలోచించి - కన్నయర్థంబు
నిలువనాడక యున్న - నిగ్రహింపంగ
ఫలయుఁగావున నట్టి - నైవు చింతింపు !

రాజైనయతఁడె మ - ర్యాదఁ దప్పినను
భూజను లెట్లు కా - పురము సేయుదురు ?
దొరమంచివాఁడైనఁ - దోఁచినమాట
వెలువక మంత్రులు - విన్నవింపుదురు.
అతిశయింపఁగ నీతి - యవనిఁ బాలించి
నతని వే సుమ్ము ధ - ర్మార్థకామములు
నీతిలేదేని వా - నికి నేమిలేదు
హేతువౌ నతఁడుర్వి - నెల్లఁ జెఱుప
రాజమూలంబు ధ - ర్మముగాన మంత్రు
లేజాడఁ బతియందు - హితులు గావలయు
క్రూరుఁడై తాప్రతి - కూలుఁడై నీతి
దూరుఁడౌ నతని కెం - దును మేలు రాదు
ఒరకంబులను రథం - బుర్విపైఁగడలు
తరిఁజూచి చక్కని - దారిగాఁ గడపు
సారథిగతి మంత్రి - సన్మార్గమునకు
భూరమణుల చిత్త - ములఁ ద్రిప్పుకున్న
నిరువురకును హాని - యేకాన నీకుఁ
బరమధర్మంబు నా - పలుకు సేయుటలు
కానివాఁడొక్కఁడొ - క్కప్రయోజనంబుఁ
దాను సేయ ననేక - ధార్మికావళికి
నవరోధములు పుట్ట - నధిపతి నేర
మవనీ జనులకెల్ల - నాపదల్ సేయు !
నక్క వాకిలి గాచి - నమృగంబు లేమి
యక్కరల్ దీరి సౌ - ఖ్యము లందఁగలవు ?
తెలియక యటుల యిం - ద్రియ పరుఁడైన

యిలఁపతిచేఁ సౌఖ్య - మెవ్వ రొందుదురు ?
కాకతాళన్యాయ - గతి ఘోరమైన
నికీడుతలఁపు హా - నికి మూలమయ్యె !
పోయినయపుడె చం - పును మృగరూప
మాయావిఁ దన్ను రా - మశిలీముఖంబు
తనుమాత్రమునకు నీ - తాకాంతుఁ జేరఁ
జని చూచినంతలోఁ - జావు సిద్ధంబు
సీతను నీవుదె - చ్చితివేని వెనుక
నీతోడ లంకతో - నిమిషమాత్రమున
దానవులెల్ల హ - తంబు గాఁగలరు
మాను మీతగని కా - మము దానవేంద్ర !
హితము నాపలుకని - యెంచవు దైవ
గతిచేత నవసాన - కాలంబుచేరె
అట్టివానికి నేల - యాస్తని మాట
పట్టియుండును ? చల - పట్టుటేకాక
నీవు చంపెదనన్న - నీచేత నేల
చావఁగావలయు ! న - చ్చటనెయాఁగాక !
నీచేతి చావుచే - నిరయంబు రాముఁ
జూచి వచ్చినమాత్ర - సుఖమును గలుగుఁ
యమగదా దండమై - యకట ! యీబుద్ధి
సమకూరె నీకు నా - సలు దీఱెనాకు
పోదము రమ్మని గో - బ్బున మున్నుగాఁగ
నే దండకాటవి - నేఁడె చేరెదను
మించనాడితి నీకు - మేలవుఁగాక
యుంచితివే నను" - నంచు బల్కుటయుఁ

—: రావణునితోఁ గూడిపోయి మారీచుఁడు
మాయామృగ మగుట :—

కాఁగిలించుక దశ - కంధరుం డలరి
యాఁగాక యని వాని - కప్పు డిట్లనియె.
" పరమాప్తుఁడవు శౌర్య - పరుఁడవు దైత్య
వరులెందఱైన నా - వారు గల్గియును
నింతవాఁడని నిన్ను - నెంచి యిట్లొంటి
నింతదూరము వచ్చి - యేవేఁడుకొంటి
నెవ్వఁడవో మైత్రి - నింతపర్యంత
మివ్వేళ నిన్ను నీ - వెఱిఁగి పల్కితివి
రత్నమయంబు నా - రథమెక్కి కదలి
యత్నంబు గనుము మా - యామృగాకృతిని."
అని రథారూఢుఁడై - యతఁడును దానుఁ
జని చని కొన్ని దే - శంబులు గడఁచి
దండకావనము చెం - తకు నేఁగి యచట
నుండి కాంచనరథం - బొయ్యన డిగ్గి
తాను మారీచు హ - స్తముఁ గేలఁ గూర్చి
వానితోఁ బ్రణయ పూ - ర్వకముగాఁ బలికె
" ఆపొన్న పెనుమట్టి - యండనే యున్న
యీపొన్న గుంపుల - కీవలిచాయ
నరఁటితోఁటకుఁ దూర్పు - నందు రాఘవుఁడు
చరియించునది పర్ణ - శాల వీక్షింప
సీత యిచ్చోట వ - సించు నిందులకు
సీతలంచిన యట్ల - నీవేఁగు" మనిన

—: మారీచుఁడు బంగారులేడి రూపము ధరించుట :—

మారీచుఁ డపుడాత్మ - మాయాప్రపంచ
మారావణుఁడు మెచ్చ - యవునని పొగడ
మరకతమణిభాస - మాన శృంగములు
నరుణోత్పలచ్ఛాయ - లమరు మొగంబు
నీలనీలప్రభా - న్విత కర్ణములును
జాలఁ గాంచనరుచుల్ - చల్లుకంధరయు
నింద్రనీలపుముక్కు - హీరమరాళ
చంద్రసన్నిభమైన - శాతోదరంబు
గొప్ప వైడూర్యముల్ - గూర్చినయట్ల
యిప్పపూవులచాయ - నెసఁగువాలంబు
గోమేధికంబులు - గొరిజలు వెండి
కామలవలె సోయ - గములైన కాళ్లు
ముత్తెపుఁబొడలు కెం - పుల మూపురంబు
లత్తుకచ్ఛాయఁ జె - లంగు కందంబు
కురువింద నయనముల్ - క్రొవ్వాఁడి చూపు
లరుదు మీఱఁగ మృగం - బై పొడసూపి
చెట్టులకెగఁబ్రాకి - చివురులు మెసవి
గుట్టలు చంగు చం - గునఁ జౌకళించి
సీతముందఱ వ్రాలి - చిత్రమృగంబు
ధాత వ్రాసిన వ్రాఁత - తను నెచ్చరింపఁ
బోవుఁ గ్రమ్మరఁ జూచుఁ - బోవక మఱలు
తావులాస్వాదించు - దాఁటు నట్టిట్టు
మెల్లనే నడచు భూ - మిని బొడల్ వెట్టు
నొల్లు జాడించు మే - నూరక విఱుచు

సెలవులఁబచ్చిక - క్షితిమీఁద రాల్చుఁ
దెలియక తననీడ - దృష్టించి బెగడు
మృగముల వెన్నాడు - మింటికి నెగయు
జగతిపైఁ బవళించు - జవమునఁ బఱచు
వెనుకొని మృగిఁజేరి - వెనుకఁ జక్కట్లు
తన మోము చాచి యెం - తయు మూరుకొనుచు
దివిఁ జూచు చూచి నల్ - దిక్కులుఁ జూచుఁ
గవియు నుంకించు నే - కడ కాలుఁద్రవ్వ
మొకముపైఁ బాళిచే - మేపు వర్జించి
రొంక వింతరవముతో - నుఱుకవాచఱచు
మారీచుఁ డీరీతి - మాయలుఁ జేసి
యారామమున నిట్టు - నట్టు మెలంగ!
పువ్వులుఁగోయుచు - భూమితనూజ
దవ్వుల వనదేవ - తయుఁబోలి మెలఁగఁ
గనిపించుకొనిన నా - కపటమృగంబుఁ
గనుఁగొని యాశ్చర్య - కలితయైయుండ
నవు డింద్రధనువు నా - యను మేను మెఱయు
విపులపై నూరక - వేడంబు వెట్టి
కొఱవిఁ ద్రిప్పిన మాడ్కి - గుజరాతికెంపు
మొఱుఁగులు నెమ్మేన - మిన్నులఁ బొదువ
మఱియుఁ జెంతకు వచ్చి - మాటకు నేఁగి
వెఱచినగతిఁ బారి - పొఱవకఁ జేరి
మెలఁగుచో జానకి - మృగశాబకంబు
చెలువంబుఁ జూచిమె - చ్చి ముదంబు వొదల
భామాశిరోమణి - రామలక్ష్మణులఁ

బ్రేమఁ గొబ్బునఁ జేరఁ - బిలిచిన వారు
వచ్చి యామృగముచె - ల్వమునుఁ జేష్టలునుఁ
బచ్చని మెఱుఁగునుఁ - బరికించి చూచి
కన్నుల విందుగాఁ - గని మెచ్చునట్టి
యన్నతోఁ సౌమిత్రి - యపుడిట్టులనియె.

—: బంగారు లేడి మారీచుని మాయ యని శ్రీరామునితో లక్ష్మణుఁడు చెప్పుట :—

"మృగము కాదదియు మా - రీచుని మాయ
యగునని దోఁచె నా - యంతరంగమున
వేటలాడుచు వచ్చి - వీఁడాచరించు
బూటకంబులఁ జిక్కి - పొలిసినయట్టి
రాజులు గదు నపా - రము వీని జాడ
లీజటివరులెల్ల - నెన్నికొనంగ
వినియుందు నిటుఁవంటి - వింత మృగంబుఁ
గనినట్టివార లె - క్కడనైనఁ గలరె?
ఇది వాని మాయయౌ - నేల సందేహ
మది యేల మనకు రం - డని" పల్కుటయును
విని యెఱుంగక విధి - విహితమౌ బుద్ధి
తనుఁజెడ రేఁప నీ - తాకాంత వలికె.

—: బంగారు లేడిని పట్టి తెమ్మని సీత శ్రీరాముని వేఁడుట .—

"స్వామి! రాఘవ! యిట్టి - చక్కని మృగము
సీమలన్నియునుఁ జూ - చితి నెందు లేదు!
ఇది మనోహర రేఖ - నింపు పుట్టించె

నుదికిఁ బట్టుకరమ్ము - మనవిఁ జేకొమ్ము
పట్టణంబెడవాయుము - పదియునూఱేండ్ల
కిట్టి వేడుక నాకు - వీక్షింపఁగలిగె!
సతతంబు మన పర్ణ - శాల ముంగిళ్ల
నితర వన్యమృగాళి - నెల్లఁ జూచితిని.
ఏనాఁడుఁ జూడలే - దిది నవరత్న
నానావిభాసము - న్నతమై చెలంగె
తనుగూపలక్ష్మిచే - తనుజూడఁ జూడఁ
గనుపండువయ్యె నీ - కాంచనమృగము
వింటిరే! చెవులకు - విందులై నులుల
నంటిన దీనిసో - యగమైన పలుకు!
కడమ రెండొక్కటిఁ - గ్రమియించి యచటఁ
దడయక మనమయో - ధ్యాపురిఁ జేరి
పడకయింటికి నెల - పలి చప్పరమున
సడలని యుపరంజి - సరిపెణఁగట్టి
పెంచఁగోరెదను చం - పిన గాదు దీని
వంచించి పట్టితే - వలయునుమీరు.
అచటి యత్తలు భర - తాదులుఁ జూచి
యచలితానందంబు - ననుభవించెదరు.
దీని ప్రాణములతోఁ - దెచ్చు మార్గంబుఁ
గానకుండిన చంపి - కవచంబుఁ దిగిచి
యాయజినంబుపై - నాసీనుఁ జేసి
నాయభీష్టంబులె - న్నటికిఁ జెల్లింప
నీరీతిఁ బతులతో - నింతులు పలుక
శూరగాఢైన నీ - మృగముపై మిగుల

నాసక్తి గలిగియు - న్నది” యని చలముఁ
జేసి పొమ్మని పల్క - సీతపైఁ గరుణఁ
దనకును వేడుక - దానిపైఁ గలిగి
యునికిచే శ్రీరాముఁ - డొకమాట వలికె.
“ లక్ష్మణ! చూచితే - లలితవిలాస
లక్ష్మలచేతఁ దొ - లఁగ కీమృగమ్ము
నందన వనములో - నను చైత్రరథము
నందులో నట్టి సా - రంగంబు లేదు
కనకరోమంబులు - గల యీమృగంబుఁ
గను మావలించినఁ - గనుపట్టు నాల్క
సురుచిరరత్నరిం - ఛోళి చేఁబొలిచె
మెఱుపు మేఘములోన - మెఱసిన యట్ల
నిగనిగ మనునింద్ర - నీలంపు బరణి
మొగముగాఁదగఁగ సొం - పు వహించె మృగము
కమనీయ శంఖము - క్రాంతినిభం బగుచు
రమణీయమగు నుద - రంబు దీనికినిఁ
జెలువొప్పఁ బట్టితె - చ్చెదు గాక యన్న
విలుకాండ్రు రాజులు - వేఁటమార్గముల
వెలువడి మనసుల - వేడుకల్ దీర
పొలనుగావలసి చం - పుదురు జంతువులఁ
గాంచన రత్నాది - కంబులు సంత
రించుటకై ఖని - శ్రేణిఁ ద్రవ్వుదురు.
అందుచే బొక్కస - మధికమై వృద్ధిఁ
బొందునానాఁట నె - ప్పుడు వినలేదె!
తనమది శుక్రుండు - దలఁచిన యంత

ధనము బొక్కసమిండ్ల - దఱుగక యుండు
కైవడి నొక్కచోఁ - గలదు లేదనెడు
యావిచారము మాని - యత్నంబు సేయ
నది సఫలం బగు - నని యర్థశాస్త్ర
విదులైన యట్టి కో - విదులు వల్కుదురు.
ఈ మనోహరమైన - మృగమునుజూచి
భూమి నెవ్వరికైనఁ - బొడమదె యాశ!
ఈచర్మమున వసి - యింప నీసీత
యాచించెఁ జూచిన - యప్పటినుండి
కాదనకుము తెత్తుఁ - గదలి మృగంబుఁ
గాదిది ప్రియ కియం - గాదు ప్రవేణి
యనుమృగోత్తమముగా - దానికి ననుఁగఁ
దనరునట్టిదిగాదు - తలఁప నీమృగము
నవి దీనితో సాటి - యనరాదు నేఁడు
దివినుండి చంద్రుని - దేహంబు విడిచి
వచ్చెనో! రాక్షస - వరులు మాయావు
లిచ్చోటి కీరీతి - నేతెంచినారొ!
అటులైనఁ జెయ్యిగా - యక తిత్తియొలిచి
యిటుఁదెచ్చి జనకజ - కిత్తు నీక్షణము
మారీచుఁ డంటివి - మాయావి రాచ
వారల మును వీఁడు - వధియించినాఁడు
కావున వీని వే - గమె యాజ్ఞచేసి
నేవత్తు నిచ్చోట - నీవుండు మిపుడు
వాతాపి ఋషులకు - వంటయై వారి
నేతరి తాఁ బొలి - యించి మించుటయుఁ

దాను జాలుగ నక్కి - తరియను దాని
దానిగర్భంబు వి - దారించినట్లు
మును హింసనొనరింప - మొనసి యగస్త్య
మునివాని దనతేజ - మునఁజంపినట్లు
వనము లీఁ జెనఁటిని - మారీచు నీచుఁ
దునుముదు సీతనా - తోనేమి వల్కు
నట్టి గార్యము సేయు - నదియ నాపూన్కి
పట్టి తెత్తును దీనిఁ - బడనేసియైన
దీని చర్మము గొని - తెత్తు నేమఱక
జానకిఁ గావుమి - చ్చట మనకెపుడు
నతఁడును నీవుఁ బ్ర - యత్నంబుచేత
క్షితిసుతఁ గాచిర - క్షింపుఁ డేమఱక ”

— శ్రీరాముఁడు బంగారులేడిని పట్టుటకు బయలుదేరి దానింజంపుట —

అనుచుఁ గట్టడిచేసి - యారఘువీరుఁ
డనుపమ ఖడ్గబా - ణాసనాస్త్రములు
కైకొని కదలినఁ - గని యామృగంబు
పోక దవ్వుగఁ జెంతఁ - బొడచూపి కడసి
యేమఱి నటులుండె - హెచ్చులులేక
తామాయమై పోయి - తగులక యనుచు
తిరిగిరాఁజూడ నం - తికమునఁ జెట్టు
మఱుగుఁ జేసుక నిల్చి - మఱియుఁ జేరుటయు
నల్లంటు వడదాఁటి - యావల పోక
మళ్ళిపోవఁగనీక - మరులు పుట్టించి
యమ్ము నందింతునో - యని యెంచు రాము

నెమ్మది యెఱిఁగిఁక - నీకాననముల
నెక్కడికో పోయి - యీమాటలోనఁ
గ్రక్కునఁ జెంగటఁ - గనుపించి దాఁటి
చేతి కందినక్రియ - జిక్కఁ బోమ్మనఁగ
యేతరిఁ గనరాక - యెలయింపఁ జూచి
యిది దానవులమాయ - యేతప్పదనుచు
మదినెంచి ప్రకుపిత - మానసుండగుచు
దీనిఁజంపుదునని - తెలివితోఁ ద్రోవఁ
బూని చేచాఁచి యం - బుజమిత్ర కిరణ
సన్నిభంబగు నొక్క - శరమేర్చి తివిచి
కన్నుఁదామరల చెం - గావి గీల్కొనఁగఁ
దిన్నగా వింట సం - ధించి వేయుటయు
మిన్నంది బ్రహ్మాని - ర్మితమైన శరము
మాయామృగంబైన - మారీచహృదయ
మాయెడ రెండు వ్ర - య్యలుగాఁగ విరియఁ
బిడుగుకైవడి నాఁటి - భేదింప వాఁడు
పొడవుగా నొకతాటి - పొడవున కెగసి
కూయుచు నిలఁబడి - ఘోరరూపమున
మాయామృగాకృతి - మాని రావణుఁడు
తనకుఁ జెప్పినమాట - తలఁచి రాఘవుని
యనుపమస్వరముతో - నన్నిశాచరుఁడు
"హాసీత! హాలక్ష్మ - ణా"! యని యవని
నాసురాకృతిఁ బడి - ప్రాణముల్ విడువ
మణిభూషణములు హే - మకిరీటవరము

మిణుఁగురుల్ రాల్చును - న్మీలితాక్షులును
మెఱుఁగుఁ గోఱలుఁగల్గి - మేదినిమీఁద
హరిహయుచేతి వ - జ్రాయుధాహతినిఁ
బడిన కొండయుఁ బోలి - పడియున్నవాని
జడుని మారీచరా - క్షసుఁ దేరి చూచి
సౌమిత్రి మున్నె యె - చ్చరికగాఁ దెలుపు
నామాట నిజమని - యాత్మలోఁ దలఁచి
"హా సీత! హా లక్ష్మ - ణా! యనురవము
చేసి కూలెను వీఁడు - సీత యామాట
విని యేమియయ్యెనో - విన్న సౌమిత్రి
తనమది నేమని - తలఁచునో యకట!"
అని యెంచి మదిలో భ - యమ్ము దుఃఖమునుఁ
బెనఁగొనఁ జానకీ - ప్రియుఁడా కృత్రిమమృగము
చంపి తదీయ మాం - సంబరఁటాకు
చింపి లోఁ బొటిలంబు - చేసికైకొనుచుఁ
దమ యాశ్రమము త్రోవఁ - దడయక వచ్చు
సమయంబునందు న - చ్చట మహీతనయ
విననైన తనప్రాణ - విభుపోయి నెలుఁగు
చెనఁటిదానవునిచేఁ - జెవిసోఁకుటయును
విని గుండెలవియ న - న్నాలఁది సౌమిత్రిఁ
గనుఁగొని మైవడఁ - కఁగ నిట్టులనియె

—ఆర్తనాదము విన్నసీత లక్ష్మణుని శ్రీరాముని సహాయమునకై వెళ్లుమని చెప్పుట—

"సౌమిత్రి! యిప్పుడు స్వ - స్థానముల్ దప్పి

నామేనిలోనఁ బ్రా - ణములు చలింపఁ
దనపతి యార్తనా - దము వినవచ్చె
నినువంటి తమ్ముఁడుం - డియు నిట్టులయ్యె
నీవేళ మాయన్న - నీవురక్షింపు
మావల నొకదైత్య - హర్యక్షమునకుఁ
జిక్కెను వృషభమై - శ్రీరామచంద్రుఁ
డొక్కఁడు కానలో - నురక పొమ్మంటి
శరణుఁ బొందిన యన్న - చాలఁ జేపట్టి
కరుణతో రక్షింపు - కదలి పొమ్మిపుడ"
ననుచు నాపన్నయై - యడలంగ వినియు
విననట్టియున్న భా - వించి లక్ష్మణునిఁ
గనుఁగొని సహింపఁ - గాలేక జనక
తనయ నిష్ఠురభంగిఁ - దానిట్టులనియె
" ఇట్టిచో లక్ష్మణ ! - యీవు బోనపుడె
గట్టిగా హితుఁడవు - గావు శత్రుఁడవు !
ననువేఁడి నాప్రాణ - నాథుని చావు
మనసులోఁ గోరి యీ - మాడ్కి నున్నావు !
రాముని మేలుఁ గో - రకయున్న నిన్ను
నేమి వల్కఁగ నేర్తు - నెటువలె నోర్తు ?
నినువంటి వానికి - నేఁడిట్టిబుద్ధి
చనదు పొమ్మనిన ల - క్ష్మణుఁ డిట్టులనియె.
" ఓయమ్మ ! యిటులాడ - నుచితమే నీకు ?
మాయన్న నవిలోన - మారొఁకని నిల్వ
యక్షరాక్షసదాన - వామరవరులు
లక్షించి యతని యా - లముఁ జూడఁగలరె !

నరమృగపశుపక్షి - నాగవల్లభులు
దురములో రాముని - దుర్కొనఁగలరె ?
నన్ను నిట్లేల మా - నము తూలిపోవ
మన్ననఁ దప్పి యీ - మాటలాడెదవు ?
వలదమ్మ ! నీ ప్రాణ - వల్లభుతోడ
కలనిలో నెదురింపఁ - గానెవ్వఁడోపు
నీవెన్ని వలికిన - నిను నొంటిడించి
పోవరాదేను ద - ప్పదు నె రామాజ్ఞ !
మూఁడు లోకములు రా - ముని మీఁదఁ దమకుఁ
దోడుగా శతమఖా - దులఁ గూడివచ్చి
విల్లందియున్న నీ - విభుని కట్టెదురఁ
ద్రుళ్లడంగక సమ - ర్థులె యెదురింప ?
మానుమీచింత యీ - మారీచు నెలుఁగు
గాని రాఘవుమాట - గాదేను వింటి
మారీచుఁ జంపి నీ - మగఁడదే వచ్చు
నారాతునుండు మా - యాబలాన్వితుఁడు
రాముని శరముచే - వ్రయ్యలై పడుచు
నీమాట దానాడె - నిది నిక్కువంబు
నీకుఁ గావలియుండ - నియమించి నన్ను
నీకడనుంచి తా - నేఁగె రాఘవుఁడు
నట్టిచో నిను డించి - యన్నసన్నిధికి
నెట్టుపోవుదు నేల - నెఱుఁగ కాడెదవు ?
ఖరుని గీటడఁచి రా - క్షసుల మర్దించి
శరవహ్నిచే జన - స్థానంబుఁ గాల్చి
పేరుఁడ్డై యున్న యా - విభునిపై దనుజు

లీరసంబునఁ గల - హింసఁ గోరుదురు!
అసురలతోఁ బగ - యయ్యెను మనకు!
కనుఁగందకున్న రా - ఘవునిపై వలిగి
దనుజులు నానావి - ధముల వంచనలు
కనుపించుకొని సేయుఁ - గాఁ దలంపుదురు
వారిమాయలు రఘు - వర్యుని యెదురఁ
దీరునే నీవు చిం - తిలనేఁటికమ్మ?
ఉరకుండుమన" నాగ్ర - హోపేత యగుచు
ఘాటియు నాసీత ల - క్ష్మణుఁ జూచి పలికె

—. సీతాదేవి లక్ష్మణునితోఁ బరుషోక్తులాడుట .—

" కులపాంసనుండవు - క్రూరచిత్తుఁడవు
కలుషమానసుఁడవు - కామాంధమతివి
రామునికిని హాని - రాఁ బ్రమోదించు
తామసాత్ముఁడ వీవు - దాయాది వగుటఁ
దరిచూచుకొని కీడుఁ - దలఁచిన నిన్ను
బరమపాతకుని నా - పతి నమ్మి వచ్చె!
మొదటనే యీవనం - బుల కేము రాఁగ
మది నేమి దలఁచి వెం - బడివచ్చినావొ?
కాక యేమని బందు - కట్టెనో భరతుఁ
డాకైక యేఁటికి - నంపెనో నిన్ను!
తమ్ముని భరతుని - దండనే యునిచి
నమ్మించి నాపెండ్లి - నాఁటనుండియును
నిందుకే కాచినా - వేమొ? రాఘవుని
సుందరి నొకఁడు నే - ర్చునె తేరిచూడ!

అకట ! రామద్రోహి - వగుదు గాకేమి !
నికట శాత్రవుఁడవై - నిలుతుగాకేమి !
తుల్లకంబులుసేయఁ - జూతుఁ గాకేమి !
యుల్లంబులో విషం - బుంతుగాకేమి !
ఇందీవరశ్యాము - వినవంశతిలకు 3730
మందరాచలధైర్యు - మన్మథాకారుఁ
గమలపత్రాక్షు రా - కాచంద్రవదను
శమదమ సంపన్ను - సత్యసంకల్పు
శ్రీరామ విభునిఁ బా - సిన నిమిషంబు
నేరతునే మేన - నిలుపఁ బ్రాణములు
నన్యులాసించిన - యందాక ధరణి
కన్యయుఁ బ్రతుకునే - కనలేవుగాక !
తృణమైన నీకు నోర్వఁ - జాల నీయెదురఁ
దృణముగా రాఘవుఁ - డెచ్చోటనున్న
నతనికిఁ బ్రీతిగా - నర్పింతుఁ బ్రాణ 3740
మతిమానుషంబైన - యాత్మశీలంబు
చూచి నీతలఁపు మం - చునుఁ బోలి విరిసి
నీచులు చనుగతి - నీ వెసంగుదువు" !
అని పరుషోక్తులి - ట్లాడినఁ జెవుల
విని కటకటఁబడి - వేదనంబొంది
యంజ నుండఁగ రోసి - యట్టట్టు వోయి
యంజలిచేసి రా - మానుజుండనియె.

—సీతయొక్క దూషణవాక్యములను విన లేక లక్ష్మణుఁ డామెనువిడిచి బయలుదేరుట :—

"నీవు నాపాలిట - నిలిచిన యిష్ట

దైవంబు నామీఁద - తల్లివినాకు
నేఁటివంటివాఁడనే - నైనధరిత్రి
యెటుమోచుఁ బటపట - నిరుపాయఁగాదె!
బంటనై సుతుఁడనై - పాయక నమ్మి
వెంట వచ్చిననన్ను - వినరానియట్టి
యీ వేఁడి మాటలి - ట్లేమిటికమ్మ
నీవాడెదవు మాకు - నిన్నాడఁదగునె ?
ఇంతులకు స్వభావ - మీమాటలైన
నింతటి సతివి న - న్నిటుఁగ కాదుదువె!
కర్ణశూలంబులు - గాఁ బుణ్యపాప
నిర్ణయంబులులేని - నీవాక్యములకు
నీవనదేవత - లిందరుసాక్షి
దైవముల్ పంచభూ - తంబులుసాక్షి!
యనరాని మాటలి - ట్లాడిన పాప
మనుభవింపఁగఁ బాత్ర - మగు నీవెసాక్షి!
మనవంశమునఁ గైక - మగనిఁ బుత్రకుల
ననుపమదుఃఖంబు - లందించెఁగాని
నీవలె నీకీడు - నినుముంచు కొనఁగ
నీవాక్యములు వల్కె - నేచెడఁగోరి
యేమైన నేమినీ - వెటుపోయితేమి?
రామునిఁజేరనే - రము లేదు నాకు
పోయెద నిపుడె యీ - భూదేవి నిన్నుఁ
బాయక రక్షింపఁ - బాల్పడు గాక!
వనదేవతలు సహా - వాసలై నీకుఁ
గనుచాటు కాకుండఁ - గాతురుగాక!

ననునొవ్వనాడు న - నంత పాపంబు
నిను ముంచుకొనక మా - ని తొలంగు గాక!
మానినీ! నీకు సే - మము గల్గుగాక!
తా నేఁగుచున్నాఁడ - తడకట్ట తొణఁగెఁ
దడయక దుర్నిమి - త్తములు మాయన్న
కడకేఁగి మఱలి యి - క్కడి కేమువచ్చి
నినుజూచునట్టి పు - న్నము సేతుమేమొ
కనఁజాల మిక్కిలి - కలఁగె నామనసు.''
అన సీత యేడ్చుచు - నరలేని మఱఁదిఁ
గని యశ్రులు దొలంక - గా నిట్టులనియె.
"ఓలక్ష్మణా! యెఱుంగ - కురక పల్కెదవు
చాలింపు నాకై వి - చార మేమిటికి?
తాలసించెదవేల - తనప్రాణవిభుని
సేమంబుఁ దలంచి రాఁ - జింతింప కిపుడు?
గోదావరీనదీ - కూలముల్ నిండ
లేదో, శైలబిలంబు - లేదో, దావాగ్ని
లేదో, విషంబింత - లేదో! కూపంబు
లేదో, యాయుధమైన - లేదో, చచ్చుటకుఁ
జూడు మీవనుచు గా - జులు పైకిఁద్రోచి
పిడిన కీల్గంటు - వెపఁ జక్కముడిచి
చుట్టఁ బైఁట చెఱంగుఁ - జుట్టిరాఁ జెక్కుఁ
బెట్టిన కమ్మల - బిగువంటి చూచి
రంగైన పైరాణి - రవికబిగించి
యింతం బెకిఁగించి - మెలుఁగు రాపడఁగ
నగవెక్కి యేడ్చుచు - నిటునటు జూచు

మగువ కీలెఱిఁగి ల – క్ష్మణుఁ దూరడించి
యాయమ్మపదముల – కవనతుండగుచు
నోయమ్మ యిదె పోవ – నున్నాఁడ ననుచుఁ
దిరిగి చూచుచు మదిఁ – దేఁకువ మాని
యరిగెను సౌమిత్రి – యా రాముఁ జూడ.

—: రావణుఁడు సన్యాసివేషమునఁ
బర్ణశాల కరుదెంచుట :—

ఎప్పుడు లక్ష్మణుఁ – డెడవాసి చనియె
నప్పుడే రావణుఁ – డచటికి వచ్చి
చెంద్రిక పూవల్వ – చెంగావి గాఁగ
చంద్రహాసము కర – స్థగిత దండముఁగ
గుజ్జరికేడెంబు – కుండిక గాఁగ
సజ్జిక పూసరి – జపమాల గాఁగ
సైంహికేయ పతాక – ఛత్రంబు గాఁగ
సింహాదిమృగములు – చెదరి పాఱంగ
గొడుగుపావలు మెట్టి – గొడుగు పీతేర
వెడవెడ జపము గా – వింపుచు ముసలి
సన్యాసియై పర్ణ – శాలలో నున్న
సన్యాసిని విషాద – పతియైన నారి
శశిభాస్కరులు లేని – సంధ్యచీకటియు
శశిఁ బాయు రోహిణీ – సతిఁ బరగ్రహము
లాఁచినగతి రామ – లక్ష్మణుల్ దొలఁగఁ
జూచి చేరఁగవచ్చు – చో దశాననునిఁ
గనుఁగొని చల్లని – గాడ్పు రావెఱచె,

వనమహీరుహములు - వడవడ వడఁకె,
తరలక నిల్చె గో - దావరీ తటిని,
హరిణాది మృగములా - హారంబులుడిగె,
రాముఁ డచ్చోటికి - రాకున్న యతని
భామిని డాఁజేరి - పట్టెద ననుచుఁ
గడిమి చిత్రాకారఁ - గదియంగఁ జాయ
కొడుకు చేరిన యట్లు - కుటిలాత్మకుండు
గఱిక గప్పిన నూతి - కైవడిఁ గపట
మెఱుఁగనీయక చేరి - యిందీవరాక్షి
గుణవతిఁ గురువింద - కోరకవదన
తనుమధ్యఁ గమలప్ర - తానుతనయనఁ
చపలాలతాగాత్రి - చంద్ర బింబాస్య
విపులాతనూభవ - వెతలఁ జింతిలఁగ
నాదుష్టబుద్ధి కా - మాంధుఁడై చూచి
వేదంబుఁ జదువుచు - వినయాయుక్తముగఁ
గదియంగఁ బోయి యా - కార్యంబుఁజూచి
మదినుబ్బి పరమాదు - ర్మార్గుఁ డిట్లనియె.
" వెలఁది! తామరయిల్లు - విడిచి యిచ్చోట
మెలఁగఁగ వచ్చు ల - క్ష్మీవధూమణివో!
శ్రీయను పేరింటఁ - జెలఁగి క్షీరాబ్ధి
శాయినిఁ బాయని - శక్తివో నీవు!
వలరాజు నెడవాసి - వనభూములందు
మెలఁగ వచ్చిన రతి - మీనలోచనవో!
యజగలోకముఁ బాసి - యవనిఁ గ్రీడింప
విజయంబు చేసిన - విబుధకామినివో!

అచ్ఛోటఁ దగిన నా - యకుఁడు లేకున్న
వచ్చిన యచ్చర - వనితవో నీవు!
ముదిత! హ్రీదేవతా - మూర్తివో! కీర్తి
మదవతివో! భూత - మానినీమణివో!
ఎవ్వరిదానవే - యింతి నీ నిండు
జవ్వన మదనుని - సామ్రాజ్యపదవి!
నిగనిగమను డాలు - నిగుడించు సోగ
మగరాల చాలు నీ - మంచి పల్వరుస!
తరళతారకముత్తె - తమ్మిఱేకులనుఁ
గరిసించి మీఱు నీ - కన్నులతీరు
జగతినెల్లడ నింద్ర - జాలంబుఁ గప్పి
నిగ నిగ లీను నీ - నిడుదపెన్నెఱులు!
అరచందురుని చంద - మరసి యానంద
మిరవు కొన్నదిగదె - యింతి నీనుదురు!
తళతళమనుచు చి - త్తరములు చూపు
వలరాజు తూపు జ - వ్వని నీదు చూపు!
పులినమై మెఱసి రొ - మ్పులకుప్పయయ్యె
జలజాతనయన నీ - జఘన మండలము!
పదియాఱుకళలొప్పు - పరిపూర్ణచంద్రు
నెదురు కోల్గొనియె - నీ యెలనవ్వుమొగము!
కళుకులు చల్లు బం - గరు కలశముల
గొలిపించుకొని మేనిఁ - గులుకు పాలిండ్లు!
బంగరు ననఁటి కం - బములచెల్వమున
సింగారమయ్యె నో - చెలియ నీ తొడలు!
కెంజిగురాకులఁ - గేలిసేయుచును

రంజిల్లె నీపాద - రాజీవయుగళి!
ఎంతపుణ్యము చేసె - నీ ముత్తెసరము
లింతి! నీ గుబ్బల - నెడవాయువెపుడు!
ఎటువలె నుండునో - యిగురాకుబోణి!
అటునిటు నడయాడు - నప్పుడు నీవు!
ఏ మాడ్కినుండునో - మొలనవ్వు సొలపు
చేమించు నపుడు నీ - చెక్కుటద్దములు!
ఏవేడ్కసేయునో - యేకాంతవేళ
నీవు గారాపు చి - న్నెలఁ బల్కునపుడు!
ఏరు వాఱఁగ దరి - యిడిసిన యట్లు
నారి! నిన్నిటు జూచి - నామది కరఁగె!
యక్షగంధర్వ వి - ద్యాధరదివిజ
రాక్షసభామినుల్ - రారు నీసాటి!
ఇటువంటి జవరాల - వీపర్ణశాల
నిటు లొంటి నున్నచో - నేఁ దేరి చూచి
యోరిచి యూరక - యుందునే నిన్ను
నూరి కేఁ గొనిపోవ - నూహ చేసితిని.
పూఁబోణి! రాక్షస - భూయిష్ట మగుటఁ
బ్రాఁబడి యుండదీ - పట్టు నీ కిపుడు
నీవు కాఁపురములుం - డిన నివాసములు
నీవు ధరించు మ - ణిభూషణములు
నీవు కట్టిన రమ - ణీయ వస్త్రములు
నీవు పూసిన యట్టి - నెమ్మేని పూఁత
నీకొప్పులోన వ - న్నియ గన్న విరులు
నీకేలుదమ్మిఁ బూ - నిన వలయములు

నీదు చన్నులమీఁద - నెలకొన్న సరులు
నీదండనుండువ - నీ మృగశ్రేణి
పొంది నిన్ను రమించు - పురుషరత్నంబు
నందందు ముఖ్యంబు - లని తలంచెదను
దేవతలకునైన - దృష్టింపరాని
యీవని సింహాది - మృగములఁ జూచి
వెఱవక యేరీతి - విహరించె దిట్లు ?
తరుణి ! నీవెవ్వరి - దానవేర్పఱుపు
మేమి నిమిత్తమై - యిచటికి వచ్చి
తేమి గావలసిన - నేనిత్తు నీకు
పలుకవే పలుకేమి - పచ్చకప్పురమె !
తలయెత్తి చూడు మెం - తటి సిగ్గునీకు
నెవ్వరు లేరిందు - నేనొక్కరుండ
జవ్వని ! నీవు ని - చ్చట నొక్కరితవు "
అనిన నట్టి దురాత్ము - నతిథిగా నెంచి
తన యొంటిపాటు నా - తని ప్రల్లదములు
దిక్కులేమియుఁ జూచి - దీమసంబూని
యొక్కకై వడి వీని - కూరట సేయఁ
దనవారు వచ్చినఁ - దగపాదపూజ
లొనరింతురని మది - యోజన చేసి
కపట సన్యాసిని - గాంచి యాసీత
యుపలపింపఁ దలంచి - యప్పుడిట్లనియె.
" భావింపుఁ డివె యర్ఘ్య - పాద్యాదికములు
కావలసిన భిక్షుఁ - గైకొనుఁ డిపుడు
అయినది వంట చ - ల్లారక మునుపె

ప్రియముతో భుజియించి - తృప్తివహించి
వలసినగతి తరు - వాత వర్తింపుఁ
డలమితో వేగిర - మేల మీకిపుడు ?
అంగీకరింపుఁ డీ - యాతిథ్య "మనిన
యంగనామణిమాట - లాత్మఁ గైకొనక
తాను మృత్యువుఁ బొంద - దలఁచిన యట్ల
జానకి నెత్తుక - చను బుద్ధి నెలమి
వేగిరపడు దైత్య - విభు తమకంబు
జాగుఁ జేసినఁ బోని - జాడయుఁజూచి
యెప్పుడు వత్తురో - యేర్పడరాదు
తప్పెఁ గార్యంబు పా - తకువాతఁ బడితి
రామలక్ష్మణు లేల - రారైరి ? వార
లేమిర నున్నారొ ? - యేమిసేయుదును ?"
అని యెదురులు చూచి - యతివేషధారి
తనతోడఁ బలుకంగ - తా నూరకున్న
శపియించునోయని - చాల శంకించి
యపుడప్రసక్తి పూ - ర్వానులాపముల
మఱల నెమ్మోము దా - మర మరలించి
జరపులఁ బెట్ట మృ - షాయతి కనియె.

—: సీత తనవృత్తాంతమును రావణునికిఁ జెప్పుట :—

" జనక మహారాజు - జనకుండు నాకు
తనపేరు సీత యా - దశరథసుతుఁడు
రామచంద్రుండు నా - ప్రాణవల్లభుఁడు
సౌమిత్రి మఱఁది యి - చ్చట వసింపుదుము

తనయింట వారింట - ద్వాదశవర్ష
దినములు నేబొంది - తిని వైభవముల
పదియుమూఁడవ యేఁడు - ప్రాపింపఁ దనదు
మదిలోన దశరథ - మనుజనాయకుఁడు
శ్రీరాముఁ బట్టాభి - షిక్తునిఁ జేయ
గోరి యుద్యోగింపఁ - గోపించి కైక
రాముఁ గానల నంచి - రాజ్యంబు భరతుఁ
గామించి యేలింపఁ - గా వరంబడుగ
మా మామ యిచ్చిన - మది నట్లసేయ
నేమించి తండ్రికి - నిజము నిల్పుటకు
మునివృత్తి సవతి త - మ్మునిఁ గూడి యేను
వెనుకొనిరా వచ్చె - విపిన భూములకు
మావారు వేఁటాడి - మాంసముల్ దేర
నీవనంబుల కేఁగి - యెంత ప్రొద్దాయె
రారైరి! వచ్చు ప - ర్యంతంబు నిచట
మీరుండుఁ డింతేల - మీకు వేగిరము?
ఏమరణ్యము లకు - నేతేర నాదు
స్వామికిఁ బంచవిం - శతి హాయనములు
పదునెనిమిదియేండ్ల - ప్రాయంబు తనకు
నిది తుది పదియు మూఁ - డేండ్లవ వచ్చె
నినువంటిపెద్దల - నే చూచి రెని
తనుశక్తి దాఁపకెం - తయునుఁ జేకొద్ది
యాశలు దీర నీ - యగఁ గడఁదేర్ప
దాశరథులకు నెం - తయు నైజగుణము.
ఎందుండి వచ్చితి - వెచటికిఁ బోవె

దిందు రాగతమేమి - యేర్పడఁ బల్కు"
మనరావణుండుభ - యంబు జనింప
తన తెఱఁగెల్ల నీ - తను జూచి పలికె.
"గంధేభగమన ! రా - క్షస యక్షచార
గంధర్వసురభయం - కరుఁడ రావణుఁడ !
నీచక్కఁదనము క - న్నియ ! చూచి మెచ్చి
నోఁచి పెండ్లాడు మం - డోదరి ప్రముఖ
కులకాంతలను రోసి - కోరియు వేఁడి
వలచి వచ్చితిని నీ - వాఁడనై యిటకు !
ఎల్ల దిక్కులు గెల్చి - యెల్లలోకములఁ
జెల్లుగా నాముద్ర - చెల్లఁగనేలి
వరియించు నారాణి - వాసంబులెల్ల
సరసిజానన ! నీదు - చరణముల్ గొలువ
నేలికసానివై - యెందునెవ్వరికి
భూలోకముల నేలి - పోఁడుముల్ గనుము !
ఇంతిరో ! పట్టంపు - టిల్లాలవైన
కాంతవు నేఁడె లం - కా పట్టణంబు
కమలాబ్ధి చుట్టున - గడ్తయై యుండ
నమరు త్రికూటాచ - లాగ్రంబు నందు
నున్న లంకాపురి - నోచకోరాక్షి !
నన్నుఁగూడి సుఖంబు - న మెలంగుమీవు
నాయింట దాసీజ - నము లైదువేలు
పాయక మణిమయా - భరణముల్దాల్చి
యచ్చర సతులుగా - నతివ నీసేవ
కిచ్చెద నీమన - సిమ్ము నాకిపుడు

విరిబోఁటలోఁ గల్ప - వృక్ష పంచకము
తరుణి! నీముడిపువ్వు - దండలకిత్తు!
అమరభూధర రోహ - ణాచల మణులు
రమణి! నీకిత్తు యా - రతులకే నిత్తు
అమిూఁద కామధే - న్వాది ధేనువులు
భామిని! నీయింటి - పాఁడికే నిత్తు!
కల్యాణి! నాదు లం - కారాజ్య మెల్ల
మూల్యంబు వీడియం - బునకు నేనిత్తు
తరుణులలో నీవె - తరుణివి జగతి
పురుషులలో నేనె - పురుషుఁడ నిజము
అనుమతింపు" మఁటన్న - యాసీత వానిఁ
గనుఁగొని నెమ్మేను - గజగజ వడఁక
తెలివిఁ దెచ్చుక చాల - దిటముతో రామ
కులసతి వానిఁ జే - రకని యిట్టులనియె.
"హరుఁడెక్కు వెట్టని - యమరభూధరము
కరుఁడు గలంకయుఁ - గనని వారాసి
అకళంక చంద్రుఁడా - హవనరేంద్రుండు
సకలసద్గుణగణై - శ్వర్య పూర్ణుండు
అట్టిరాముని దేవి - నన్యుఁ డొక్కరుఁడు
జట్టన ప్రేల్చాఁచి - చూపశక్తుండె?
ఆమహాబాహుఁడై - నట్టి రాఘవుని
భామిని నతఁడు చే - పట్టినదాన
సత్యసంధుఁడు రామ - చంద్రుండు నన్నుఁ
బ్రత్యాశ గలిగి చే - పట్టిన దాన
పూర్ణచంద్రాననాం - బుజాక్షైన యాను

పర్ణసాయకుఁడు చే - పట్టినదాన
పట్టైయిన ధర్మంబె - పట్టిన రాజ
పట్టభద్రుండు చే - పట్టినదాన
కోదండపాణియై - కొమరొప్పరాము
పాదపద్మములు చే - పట్టిన దాన
క్షుద్రనిశాచరి - స్తోమంబు దునుము
భద్రేభగమనుఁ జే - పట్టిన దాన
సాహసనిధిఁ గృపా - జలధి నాజాను
బాహుని కరుణ చే - పట్టిన దానఁ
గోరఁ జెల్లని సింహ - కులసతి నక్క
గోరిన చందానఁ - గోరితి వీవు
కాంచన వృక్షముల్ - గనినట్లు కాల
వంచితాత్మకుఁడవై - వాకొంటి విట్లు
ఆఁకొని యున్న సిం - హము కోఱపల్లు
వీఁక చే దివియ భా - వించెద వీవు
విషయాతురుండవై - విషమవాక్యములు
విషముఁద్రావిననీకు - విషమింపకున్నె
నాలుక నసిధార - నాకినయట్లు
పోలనూదిని కన్ను - పొడుచుకొన్నట్లు
మెడరాయి కట్టుక - మీఁరివారాశి
బడినట్లు రవిఁ గేలఁ - బట్టినయట్లు
కాలాగ్నివడి నడి - గట్టుకొన్నట్లు
శూలాగ్రముల నేఁగఁ - జూచిన యట్లు
రాముని దేవిఁ జే - రఁగఁ దలంచెదవు!
రామసాత్వికనీదు - తలవ్రయ్యునిపుడె

జలరాశి యెంత తు - చ్ఛపు నదియెంత ?
కులశైల మది యెంత - గొగ్గిరాయెంత ?
కల్పవృక్ష మదెంత - ఖాదిరం బెంత ?
అల్పమానస ! రాము - నంతటివానిఁ
జెనకెదు బంగారు - సీసంబు నెట్టు
లెనయు ? రామునితోడ - నీడురాఁగలవె !
గరుడునితో మాల - కాకి యేరీతి
సరివచ్చు రాముని - సాటివే నీవు !
రాముఁ డుజ్జ్వల ధను - ర్బాణ సన్నాహ
భీముఁడై యుండనం - బేదనుబోల
ననుబట్టి మేనఁ బ్రా - ణంబులు డాపఁ
గనుకల్గి యేతల్లి - కడుపు మెచ్చెదవు ?
యాఁగబియ్యంబని - యత్త్రి వజ్రంబు
మూఁగి మ్రింగిన జీర్ణ - మున కేలవచ్చు !
నిపుడె వచ్చెదరు వో - యినఁ బోతివింక
కపటాత్మ ! నిలిచినఁ - గడకుఁ బోలేవు
రాముని బాణప - రంపరల్ బొదివి
నీమేను దహియించు - నిమిషంబులోన !"
అని భీతిచే సీత - యాడినమాట
లనునయాలాపంబు - లను లెక్కఁగొనక
కావరంబున దశ - కంధరుండలిగి
యావధూమణి తోడ - నప్పుడిట్లనియె.

—: రావణుఁడు సీతకు నిజరూపంబును గనఁబఱచుట ;
సీతదూషించుట :—

"తొయ్యలి ! ధనదుండు - తోఁబుట్టునాకు

నియ్యాన జగము ల - న్నియు నాకు వెఱచు
జనులు మృత్యువు గన్నఁ - జలియించు రీతి
ననుఁజూడ సురలప్రా - ణములు చలించు
దానవ గంధర్వ - దైత్యకింపురుష
మానవసురసిద్ధ - మండలియెల్ల
వెఱతురు, తల్లులు - వేరైన యన్న
నరవాహనుఁడు గాన - నాకు నాతనికి
నొక కారణంబుచే - యుద్ధంబుఁగలుగ
సకలుపాత్మీయ మ - హా ప్రతాపమునఁ
బాఱఁద్రోలిన యక్ష - పతి యందు నిలువ
నేరక ముక్కంటి - నెయ్యుఁడు గాన
కైలాసమునఁ దలఁ - కకయుండె నిట్టు
లాలంబు నేగెల్చి - యతని పుష్పకముఁ
గైకొంటి నది కామ - గమనయోగ్యంబు
నాకు వేడ్కనుసేయు - నాఁడు నేఁటికిని
అందుమీఁదఁ జరింతు - లఖిల లోకముల
నిందీవరేక్షణ! - యింద్రాది సురలు
నా పేరు వినిననె - న్నఁడు దమ యిండ్లఁ
గాఁపురంబులు చేసి - కనుకూర్కరెపుడు!
చల్లగా నారతి - శ్రమ మార్ప గాని
వెల్లావిరిగ గాలి - విసరఁగ వెఱచు
మదినాకు హితమైన - మార్గంబె కాని
గదిమి భాస్కరుఁడెండఁ - గాయంగ వెఱచుఁ
గలఁగఁగ స్వాదూద - కములచేఁగాని

బలువిడి వాహినుల్ - ప్రవహింప వెఱచు
సేనాజ్ఞ సేయక - యెవ్వారికైనఁ
బూని యయ్యముఁడు చం - పుకఁ బోవ వెఱచు
నెచ్చోట నాయిచ్చ - నేకాని తాను
విచ్చలవిడి నగ్ని - వెలుఁగఁగ వెఱచుఁ
బూయని తరువులఁ - బువ్వుల నిత్తు
కాయని వృక్షముల్ - కాయఁ జేయుదును
కురియింతు వానలు - కోరినయపుడు
భరియింతు సకలభూ - భారంబు నేను!
నావీడు జలధికి - నడుచక్కి లంక
రావణుఁ డందురు - రామ! నాపేరు
అచట వజ్రమయంబు - లైన కోటలును
నిచితముక్తాఫలా - న్వితగోపురములు
గోమేధికపు పిల్ల - కోటలు రజత
హేమాది ధాతుస - మేత సౌధములు
చతురంగ బలపూర్ణ - సామగ్రిరత్న
చతురంతయానాది - సకల వస్తువులు
తలఁచినప్పుడు పండు - తరువుల వనము
లలరు నన్నియుఁ బూచు - నట్టి పూఁబొదలు
కలఁగి భేరీమృదం - గములు మిన్నంద
నలరెడు లంకామ - హాపట్టణమున
ననుఁగూడి క్రీడించి - నరుఁడైన రాము
మనసున దలఁతువే - మఱికొంత లేక
కొఱఁగాని వాఁడని - గుణహీనుఁ డనియుఁ
గరుణ సేయకచూచి - కన్నట్టితండ్రి

యడవుల తిరిమించి - యాజ్ఞ సేయించు
గడసరి మగఁడనం - గానేల నీకు ?
సిగ్గు కాకేమని - చెప్పెదు రాము
నగ్గించి నాదుస - మత్సంబు నందు
నీపుణ్యవశముచే - నిన్ను గామించి
నాపాటి దొరవచ్చు - నా ? కానలేవు !
ఎఱుఁగ వింతయు కాక - యేకడ కేఁగ
తరుణి ! కూలుదువు చిం - తాసముద్రమున
ననుఁజూచు నట్టిమా - నవతీల లాము
మనమున నితరుని - మఱు చేరఁగలదె ?
జగడంబులో నన్ను - జనకజ ! నీదు
మగని నాయెడఁదృణ - మాత్రుగాఁదలఁపు !
అట్టినే నీవు భా - గ్యము నేయు కతన
గట్టిద నట్టిమం - గళసూత్ర మిపుడు
రా లేచి రమ్మన్న - రాముని దేవి
జాలిచే మదినిఁగొం - చక యిట్టు లనియె.
" ఇంద్రుని సతిఁదెచ్చి - యిముడుకోవచ్చు
చంద్రుని సతిఁబట్టి - సైరింప వచ్చు
శ్రీరాము నిల్లాలిఁ - జెనకి యొక్కరుఁడు
నేరుచునే మేన - నిలుపఁ బ్రాణములు ?
బ్రదుకనొల్లక యిట్లు - వలికిన నిన్ను
బ్రదుకనిచ్చునె రఘు - ప్రవరు బాణాగ్ని
యాదె వినవచ్చె రా - మానుజు మాట
ఇదెవచ్చు నాస్వామి - యెటకుఁ బోయెదవు ? "
అని బెదిరింప ఘో - రాకారుఁ డగుచుఁ

గనలుచు "నా పెంపుఁ - గనలేవు నీవు
యిలఁగాలు మోపక - యేమింట నిలచి
యిలనెల్ల నొక్కవేల - నెత్తఁ జూచెదవొ !
వనధులేడును హస్త - వనజంబులోన
నునిచి ప్రుక్కిటఁ బట్టి - యుమియ నెంచెదవొ !
పెనుమృత్యువుఁ బట్టి - యిట్టట్టు జాఁగి
పోనీక చంపినఁ - బొందు సేసెదవొ !
చంద్రసూర్యుల నొక్క - సరిగాఁగఁబట్టి
చంద్రాస్య ! యొకముద్ద - సలుప నడ్డెదవొ !
ఇలయు నింగియుఁగూర్చి - యేకంబుఁ జేసి
చెలఁగి యెక్కడ నిల్వఁ - జేరవచ్చెదవొ !
కామరూపము మించు - కామరూపమున
నేమది యలరింప - నెయ్యముంచెదవొ !
వలచివచ్చినవాఁడ - వట్టిమాటలను
తొలఁగిపోవుదునె ? యె - త్తుక పోదుఁగాక !"

—: సీతాపహరణము —

అని కన్నుదోయి సూ - ర్యాగ్నుల రీతిఁ
గనకన వెలుఁగ నం - గంబు జాడింప
నెటువలె దాఁచెనో - యిందాక నసఁగ
కటికి కాటుకకొండ - గతిమేను మెఱయ
నెందుండి తెచ్చెనో - యీదశాననము
లందుపై నిరువది - హస్తంబు లనఁగఁ
గరమొప్పి కామాంధ - కారంబురీతిఁ
గరకప్పు మేనితోఁ - గడు విరహమున

బదియవస్థలు దోఁచు - పగిది మస్తములఁ
బదియును మీఱఁగ - పదియవస్థలును
నినుమడించినయట్ల - యిరువది చేతు
లనువుగా నవి శాఖ - లై చిగురించు
కరణి హస్తంబులఁ - గనుపింప నవ్వి
విరుల ఫలంబుల - విలసిల్లు నట్లు
శరశరాసనకుంత - చక్రగదాసి
పరికరంబులఁ దాల్చ - బల గర్వరేఖ
భామిని వెలుఁగంద - బలిచెంతఁ బెరుగు
వామనుండన దైత్య - వరుఁడు మిన్నంది
కంకణకుండలాం - గద కిరీటములు
సంకులచ్ఛాయ దం - ష్ట్రలు శోభిలంగ
దివ్యాభరణవస్త్ర - దేదీప్యమానఁ
భవ్యవిగ్రహుఁడయి - బాలకట్టెదుర
నిలిచి "నన్నెఱుఁగవే - నిర్జరప్రభుని
బలిమి నోడించిన - పంక్తి కంధరుఁడ!
అలివేణి! నీవునా - కనుకూలవైన
గొలిచెద నీతులా - కోటి నవీన
నిరుపమమణివిభా - నీరాజితాంఘ్రి
సరసిజయుగళదా - స్యమునిర్వహించి!
బిగిసెదవేల నే - బేలనే నీకు?
మగువ! యల్పాయువుల్ - మనుజులందఱును
వారిలో నధముఁడీ - వల పదభ్రష్టుఁ
డీరాఘవుఁడు శౌర్య - మింతయు లేదు
నీకు వానికి నేఁటి - నెయ్యంబు చాలు

నాకు దక్కితివి మా - ఱంబు దాచెదవు
నీవుదాల్చిన సేసు - నిలుపోపఁ జాల
భావజు చిగురు టం - పవు కోఁతలకును
చేయిమ్ము నాకని" - సీత కెంగేల
దాయఁగఁ జేరి యా - డ్డము లేక పట్టి
యీడిచి బుధుఁడు రో - హిణిఁ బట్టి నట్టి
జాడగా జఘనపా - ర్శ్వము క్రింద నొక్క
కరమొయ్యఁ జూచి రా - ఘవు దేవిఁ దెచ్చి
మొఱసేయు మాయచే - మొలిపించి నట్టి
రథముపై తన మనో - రథము చేకూడి
పృథుశక్తి నందుపై - పృథివీతనూజ
నునిచి తానాచెంత - నుండగఁ జూచి
వనదేవతలు భీతి - వగచి కలంగి
నలుదిక్కులకుఁ బాఱ - నానామృగములు
కలఁగిపోవఁగ లేక - కన్నీరురాల్ప
వదలింపుచును సీత - నంజక తిట్టి
బెదరింపుచును బ్రాణ - భీతిచేఁ గలఁగ
నూరడింపుచును తన - యూరువులందుఁ
జేరిచి పడనీక - చేతులు బాదివి
"హా రామ! హా రామ - హా! సుమిత్రాకు
మారక!" యనుచుఁ బ - ల్మారు కూయిడఁగఁ
బన్నగాంగనరీతిఁ - బలవింపుచున్న
కిన్నరరమణి పో - ల్కిని ప్రాణభీతి
గజగజ వడఁకుచు - కన్నీరురాల
నజరులు బ్రదుకుఁడీ - యని తెల్పఁ బోవు

కై వడి నాతేరు - గగన మార్గమునఁ
బోవుచో దిగులుచే - భూమిజ వణఁక
"హా లక్ష్మణా! హా ద - యానిధి! రామ!
పాలింపు" మని విధిఁ - బలవించె నిట్లు
"మఱచితిరే నన్ను - మదిఁ గ్రొవ్వివీఁడు
చెఱపట్టుకొనిపోయి - చెడఁ గోరినాఁడు!
ఈ యధర్మంబు మీ - రేమియు నెఱుఁగ
రీ యధముని చేత - నే జిక్కువడితి
మేనులు సుఖము భూ - మియు ధర్మమునకు
మానువారలు నన్ను - మఱచి యున్నారు!
కాలంబు వచ్చిన - కలుగు సస్యములు
చాలఫలించిన - జాడ వీనికిని
కర్మానుభవసిద్ధ - కాలంబుఁ జేరి
దుర్మార్గుఁ డగుచు న - ధోగతిఁ బడగఁ
దలఁచె, కై కతలంపు - దైవయత్నంబుఁ
దులతూగి యదినేఁటి - తోఁ గడతేఱె!
ఓ జనస్థానంబ! - యూహించు నీవు
రాజన్యమణియైన - రామునితోడ
నీరాక్షసునిరాక - యిట్టి నా తెఱఁగు
కారుణ్యమునఁ దెల్పి - కాచి రక్షింపు!
కనుఁగొంటిరే కర్ణి - కారంబులార!
దనుజుఁడెవ్వరు లేని - తఱినన్నుఁ బట్టి
కొనిపోవుచున్నాఁడు - కోరి మీరైన
ననుదెల్పుఁ డారాము - నకు వచ్చుగాని
చనవయ్య నీవుప్ర - శ్రవణ శైలంబ!

ననుఁదెల్పు శ్రీరాము - నకు దయఁదలఁచి !
అమ్మ ! గోదావరీ ! - యకట ! నీవైన
నమ్మించి మారాము - నకుఁ దెల్పవమ్మ !
వాకొనవే పంచ - వటి ! కరుణించి
నీకు దండము రాము - నికి నా తెఱంగు !
ఓర్వలేదని నన్ను - నోపర్ణశాల !
సార్వభౌముని రామ - చంద్రు రమ్మనుము
తెలిపోవకవన - దేవతలార !
చాలవేగమె రామ - చంద్రు రమ్మనుఁడు !
మృగసమూహములార ! - మీకు మ్రొక్కెదను
మొగమాటపూని రా - ముని తోడి తెండు !
శరణు జొచ్చెదఁ బక్షి - జాతంబులార !
కరుణించి వేగ రా - ఘవుఁ దోడి తెండు !
చాలనమ్మితి వన - స్పతులార ! యిపుడె
కాలూఁదనీక నా - కాంతుఁదోతెండు !
ఈలోకమున నున్న - నీమేనుఁ దొఱఁగి
యేలోకముల నున్న - నే నమ్మియున్న
మనువంశ తిలకంబు - మఱలంగ నన్ను
గొనిరాక తానేలఁ - గొదవ రానిచ్చు !
నమ్మితి రావయ్య - నాప్రాణనాథ !
నమ్మితినే లక్ష్మ - ణా ! నినుఁజాల !
అనరానిమాట ని - న్నాడిన ఫలము
తనకేల మాను యిం - తకుఁ జుట్టుకొనక !
ఏఁటికిఁ బొమ్మంటి - నేనిన్ను ? రాము
నేటికిఁ బనిచితి - నెఱుఁగంగలేక !

అని పోవుచోట ని - న్నరికట్టు నొక్క
పెను మట్టికొమ్మపై - పృథుశక్తినున్న
యాజటాయువుఁ జూచి - యార్తులఁ దొరఁగ
భూజాత యాసీత - పొక్కుచుఁ దనదు
నెలుఁగు రాపడనాల్క - నెడఁదడిలేక
కలఁగుచు నోవిహం - గవరేణ్య ! తండ్రి !
కావవే ! దనుజుఁడొ - క్కఁడు దిక్కులేని
కైవడి నెత్తుక - గగనమార్గమునఁ
జనుచున్నవాఁడు ల - క్ష్మణుతోడనైన
ననునేలు శ్రీరాము - నకునైనఁ బోయి
యెఱుకలు గలవాఁడ - విప్పుడే యెగసి
యరుగుము నమ్మితి - ననికూయుచుండ
ఖగవంశమౌళి యా - కస్మికంబైన
జగదేకమాత యా - జానకిమాట
విని చెఱఁగొని పోవు - విబుధారి వలని
ఘనమైనయూరుప్ర - కాండ పీఠమున
జలదమాలికలోని - చంచల లతిక
వలెభీతి గడగడ - వడఁకు భూపుత్రిఁ
గనుఁగొని మిగుల నా - గ్రహముతో విహగ
వనికబాంధవుఁడు రా - వణున కిట్లనియె

—: జటాయువు రావణునకు హితోపదేశము చేయుట :—

“ఓరి ! దశానన ! - యుచితమే నీకు
శ్రీరాము కులకాంతఁ - జెఱఁగొని పోవ ?
సత్యపరాక్రమ - సద్ధర్మ పరుఁడ

భృత్యుఁడ రామున - కెప్పుడు నేను
సకలము నేలంగఁ - జాలి యింద్రాదు
లకునైనఁ జేరి యీ - లము సేయరాని
శ్రీరాము నిల్లాలి - సీతనుఁబట్టి
యేరీతిఁ గొనిపోయె - దెటు పోవనిత్తు ?
సద్ధర్మ పరుఁడైన - జననాయకునకు
బుద్ధియే పరకాంత - పొందలాసింప ?
పరుఁడను మాత్రమే - భాస్కరవంశ
శరనిధి సంపూర్ణ - చంద్రుఁ డుత్తముఁడు !
అట్టి రాముని భార్య - ననదనుఁబోలి
పట్టితి మృత్యువుఁ - బట్టిన యట్లు !
కనుఁగొంటి నిన్ను నా - కన్నుల యెదుర
జనకజ కింక వి - చారమేమిటికి ?
విడువు మీ కల్యాణి - విడవేని యిపుడు
విడిపింతు నీమేన - వేగఁ బ్రాణములు !
ధర్మార్థకామముల్ - ధరణీశులాది
ధార్మికులకె గాని - తలఁప నన్యులకుఁ
గాటిల్లునే పుణ్య - పాపంబులెల్ల
పాటకంబగుట రా - జాధీన మింతె !
చపలాత్ముఁడవు దుర్వి - చారుఁడ వెపుడు
కపట మానసుఁడవు - కామాంధమతివి
యిట్టిదురాత్మున - కేరీతిఁ గలిగె
నిట్టి మహైశ్వర్య - మెన్న నచ్చెరువు !
గుణహీనులకు గాము - కుఁడు చాల హీన

గుణుఁడందురట్టి దు - ర్గుణ పరాయణుఁడు
చిరకాల మెట్లు లూ - ర్జితముగా బ్రదుకు!
ధరమీఁద నీకిట్టి - తలఁపెట్లు గల్గె?
రాముఁడు సేయు నే - రము నీకునెద్ది?
ఏమిటికి ద్రోహ - మెంచితి వీవు?
ఆ చుప్పనాతి మ - హాపాతకంబుఁ
జూచి కానఁగలేక - శూరుల మనుచు
ఖరదూషణాది రా - క్షసు లెదిరించి
దురములోఁ బడిరని - తోఁచెనే నీకు?
పొడవచ్చిన వారిఁ - బొడుతురు గాక
విడుతురే యెందైన - వీరశేఖరులు?
నిరపరాధుని రాము - నీవిట్లు చెనకి
ధరణిజఁ గొనిపోవ - ధర్మమార్గంబె!
రాముని ఘోర నా - రాచముల్ పిడుగు
భూమీధరంబులఁ - బొడిసేయునట్లు
మేను వ్రయ్యలు చేసి - మీవంశమెల్ల
హానిఁ బొందింపక - యవి యేలమాను!
వజ్రంబు వృత్రుని - వధియించునట్లు
వజ్రసారము రఘు - వరుని బాణంబు
తఱుముకవచ్చి నీ - తల లుర్విమీఁదఁ
దొరలించు, నీవేగఁ - దొరలేది యపుడు?
భూమిజ యొడిలోని - భోగీంద్ర రమణి
కామాంధ! మెడఁజుట్టు - కాలపాశంబు!
తెలియక కొనిపోవఁ - దీరునే నీకుఁ
జలమేల? సీత ని - చ్చట డించిపొమ్ము

భరియింపఁ దగుమోవు - భరియించి వోవ
నరిగించుకొనిన నా - హార మింపగును!
కాక మితంబెఱుం - గని వానికెందు
రాకుండునే హాని - రాక్షసనాథ!
తనకు హానిజనించు - తలఁపు దలంచు
చెనఁటి యెందైన నీ - క్షితి నున్నవాఁడె ?
అఱువదివేలేండు - లాయెను నాకు
ధరణి నీయంత పా - తకుఁ జూడలేదు!
వయసుఖాఁడవు నీవు - వార్ధకంబగుటఁ
బయిసేయ కున్నాఁడఁ - బదరి నీమీఁద
నధమరాక్షస! నీకు - నాయుధశ్రేణి
యధికంబు నే రిక్త - హస్తుండ నిపుడు
ఐనను నీకులో - నయ్యెడి తలఁపు
మాను మీచింతనా - మదిలోన లేదు
ఎట్లైన మేలునే - నీక్షింపుచుండ
కటకట ! సీతనా - కన్నుల యెదుర
చెఱవోవఁ బ్రాణమా - సింతునే ! నిన్ను
నరికట్టి రామున - కర్పింతు నిపుడె !
హేతువాదంబుల - నెల్లవేదములు
భూతలంబునఁ దన - బుద్ధికిందఱలు
నారీతి నీసీత - యుబ్బదు నీకు
కారాని పనిసేయ - గానెట్లు వచ్చు ?
తనతో ముహూర్త మా - త్రం బెదిరించి
యనిసేయు మైనటు - లయ్యెడు నిపుడు !
ఖరుఁడు రాఘవసాయ - కములచేఁ బడిన

హరువున వజ్రసా - రాత్మీయ నఖర
నారాచములచేఁ దృ - ణంబుగా నిన్ను
జేరదఁ జట్టలు - చింతు నీపొట్ట
రామలక్ష్మణులు దూ - రము వోయిరనుచు
నీమదిఁ దలఁచితో - నీవు వాటెదవు ?
రామునికిని దశ - రథునకు హితము
నామదిఁ దలఁచి ప్రా - ణములైన విడుతు
విడువనీ జానకి - వేఁడి యాతిథ్య
మడిగితి నాతోడ - నవి సేయు " మనుచు
" పండును తొడిమెతోఁ - బాపినయట్లు
భండనంబునఁ దల - వడవేతు నిన్ను "

—జటాయువు రావణునితోఁ బోరి నేలఁ గూలుట :—

అన రావణుఁడు కన్ను - లందుఁ గెంజాయ
జనియింప నట్టహా - సము సేసి నిలిచి
తేరు మఱల్చిన - దిగ్గునపక్షి
వీరుఁడాగ్రహముతో - వృక్షంబు విడిచి
రెక్కలతోడ ధా - త్రీధరంబనఁగ
గ్రక్కున నెగసి రా - క్షసనాథుఁడాఁకి
పోరాడుచో మహా - ద్భుత చండవాత
ధారలఁ బెనగొన్న - ధారాధరముల
నుద్దులై వారితో - డుఱువుల నాఁగి
అద్దిరా ! వీరి బా - హాగర్వ మనఁగ
వదలక పోర రా - వణుఁడాగ్రహించి
కదిమి నాళీకవి - కర్ణి బాణముల

నాజటాయువుసేయ – నంతజస్వామి
తేజంబుతోడ పం – క్తిగ్రీవు నదిరి
భిదురసారములైన – పెనుగోళ్ళ వాని
యెదురొమ్ము నెత్తురు – లెగయఁగఁ గోటి
వ్రయ్యలు చేసిన – వాఁడల్గి వెనుక
తియ్యక విహగేంద్రుఁ – డెగుము పొమ్మనుచు
దండధరోద్దండ – దండప్రకాండ
చండిమ ద్వాదశా – స్త్రములు సంధించి
యేసిన నవి తన – యెఱకలు గాడి
దూసిపోయిన నల్క – తోఁ బక్షివిభుఁడు
మహనీయ మౌక్తిక – మాలికాస్తబక
మహితమౌ నతని భీ – మ శరాసనంబు
పైఁబడి వ్రేల్మనఁ – బరియలు గాఁగ
తాఁబూని విఱిచిన – దశవదనుండు
వేరొక్కవిలుఁ గొని – విశిఖవర్షంబు
వారిదంబును బోలి – వాఁడు వర్షించి
శరపంజరముఁ జేసి – చదలనట్టిట్టు
నరుగరాకుండ త – న్నరి కట్టుటయును
గూడు వెల్వడు పులు – గును బోలి చూడ
నీడజోత్తంసుఁడ – న్నిశితాస్త్రకోటి
తెక్కలచే నద – ల్చి నిశాటు దాఁకి
యుక్కు ముక్కున ధను – వొడిసి రాఁదిగిచి
మున్నుట్టివడి ద్రుంచి – మున్నాడి మేన
నున్నట్టి జోడు తా – నుఱువడఁ జించి
పాఱఁగవైచి ప – ర్వంబునఁ జేరి

వారువంబులదైత్య - వదనముల్ గలుగు
వాటి పీఁచమణంచి - వాని సారథిని
దోఁటిముక్కునరెండు - తునియలు చేసి
ధరణిపైవైచి ర - త్నమయంబుఁ గనక
గిరి సమానంబుఁ గిం - కిణీరాన్వితంబు
నగుచు నొప్పుచు సీత - యందుపై నుండు
గగనయానరథంబు - గ్రక్కునఁ దన్ని
పొడిసేసి చంద్రునిఁ - బోలిన తెల్ల
గొడుగు చింపులు చేసి - కుంభినివైచి
టెక్కెంబు విఱిచి పం - టించి తాలెక్క
ముక్కాడనీయక - ముక్కునఁ బొడిచి
జేవురుఁ గొండగాఁ - జేసి గర్వింప
రావణుఁ డపుడు ధ - రాసుతఁ బట్టి
యిలఁ బాదచారియై - యేమియు లేక
నిలుచు నప్పుడు భూత - నివహంబు మెచ్చ
బలదర్పములనున్న - పక్షిపుంగవుని
బలహీనుఁడగు దైత్య - పతిఁ జేరి చూడ
గందిట గట్టిగా - జానకి నుంచి
యందఱు వెఱఁగంద - నాకాశవీథి
దానవవిభుఁడేఁగ - దానువెంబడిని
" పోనీను పోనీను - పోకుము పోకు !
నిలునిలు మీరాము - నెలఁతను డించి
తొలఁగుము పావని - త్తుమ కాది నిన్ను !
అతివజ్రసారది - వ్యాఘ్రురాఘవుని
యతివను గొనిపోవు - నది కారణముగ

దానవకులమెల్ల - దగ్ధమై నీవు
హాని బొందుదువు కా - మాంధుఁడ వగుచు
సీతఁ బట్టితివేలఁ - జెడగోరి దప్పి
చేత విషంబు మ్రు - చ్చిలి త్రావు వాఁడు
బ్రదుకనేర్చునె? కాల - పాశముల్ నిన్ను
వదలక కట్టి యీ - వైఖరిఁ దెచ్చె!
గాలంపుటెఱ్ఱలఁ - గని చేరి మ్రింగి
పోలేక తగులు నం - బుధి మీన మనఁగ
వలవనిట్టి దురాశ - వలదురా! నీకు!
ములుచదానవ! యేల - మోసపోయితివి?
ఈరావణుఁడు శౌర్య - హీనుఁడై వెఱచి
చోరకృత్యమునకుఁ - జొచ్చినాఁ డనుచు
నవ్వరే నిన్ను బృం - దారకులెల్ల?
దవ్వుగావు యశః ప్ర - తాపముల్ నీకు
వీరధర్మము మాని - వెన్నిచ్చి పఱచి
దూరి! రావణ! పోవ - నుచితమే నీకు?
కాని కార్యము లంత్య - కాలంబు లందు
పూని చేసినవాఁడు - పొలసిన యట్లు
యిట్టి దుష్కర్మ మీ - విప్పుడు చేసి
కట్టఁ జిక్కితివేల - కాలపాశముల?
ఖలుఁడు సేయఁగరాని - కార్యముల్ చేసి
పొలియుఁ గావున నిన్ను - బొరిగొందు నిపుడు!
అనిమిత్త వైరంబు - నధిక పాపంబు
వనజగర్భుఁడు చేసి - వర్ధిల్లఁ గలఁడె?
విడువు జానకి " నంచు - వీపుపై దుమికి

కడువాడియైన వం - కరగోళ్ళచేత
పిక్కలఁ గాల్మీరి - పెరిగి మత్తేభ
మొక్కటియును బోవ - నోడక నిలిపి
యలుగు కొద్దిని డిగ - నంకుశంబొత్తి
వలదేరి నుఱుకు మా - వంతుని రీతి
వ్రయ్యలుగాఁ గొట్టి - వాని మస్తములు
పయ్యాడి ముకుటముల్ - పదియు డొల్లించి
తలవెంట్రుకలు కట్టి - తానీడ్చి తెచ్చి
యూలయించి ముక్కున - నంగముల్ బొడిచి
చాలఁ బీడింప శా - కునచక్రవర్తి
యాలోన భయకంపి - తాత్ముఁడై జడిసి
గట్టిగా నెతము చం - కను సీత నుంచి
కొట్టెను వలకేల - కొట్టఁ బక్షీంద్రుఁ
డాకొట్టువడి యుండ - జాధీశుఁ డలరి
పోక రావణు కరం - బులఁ జంచువులను
పదియును నఱికినఁ - 'బడిపోవు కరము
లది లేదు బొంకని' - నట్లు పెండియును
పుట్టలోఁ బన్నగం - బులు వచ్చినట్లు
నెట్టుక మొలిచిన - సిజ్జరారాతి
సీత నొక్కెడనుంచి - చేతులఁ గాళ్ళ
చేతను బొడిచినఁ - జేయుట లేక
యా విహగోత్తముఁ - డతి బాహుశక్తి
రావణుతోఁ బోర - రామకార్యమునఁ
దెగి ప్రాణముల యాస - దీరిపోనీక
జగడించు ఖగకుల - స్వామి కీలెఱిఁగి

చండించి తనచేతి - చంద్రహాసమున
రెండుగాళ్లను రెండు - రెక్కలు దునియ
నఱికినఁ బెద్ద కొం - డయుఁ బోలి ధరణి
బొరలు జటాయువుఁ - బొగులుచు చూచి
'తన నిమిత్తముగ నిం - తటి పక్షిరాజు
దనుజునిచేత నిం - తకువచ్చె' ననుచు
చేరఁగఁ బోయి యా - సీత కన్నీరు
ధారలుగాఁగ నం - తయు నేడ్చుచుండ
నారఁబోరినయట్టి - యగ్నియుఁబోలి
ధారుణిపై నీల - ధారాధరంబు
చెలువైన దేహంబు - సితకరద్యుతిని
తెలుపైన యుదరంబు - దీర్ఘతుండంబు
గలుగు జటాయువుఁ - గాంచి రావణుఁడు
'గెలిచితి నిట్టి ప - క్షివరేణ్యు' ననుచు
నలరుచో, సీత జ - టాయువు మీఁదఁ
గలఁగుచుఁ బడి - యార్తిఁ - గౌఁగిటఁ జేర్చి
జనకుని జూచి వి - షాదంబు నొందు
తనయకైవడి నేడ్చి - తాలిమి లేక
యంతంతఁ దనకైన - యపశకునములఁ
జింతించి యువికీడు- సేయుగా యనుచు
"ఓరామ! యెఱుఁగవే - కున్నావు! నన్ను
నీరాక్షసుఁడు పట్టి - యేగెడి, జూడ
నామొఱయాలించి - నానాద్విజంబు
లీమృగంబులు నీకు - నెఱిఁగింపవేమొ!
నాకు నష్టమువచ్చె - నాదురదృష్ట

మీఁకీడు పొందఁగ - నిట్లున్నకతన
దానవు నెదిరించి - తనభుజాశక్తి
నైనమాత్రంబు జ - టాయువుఁ జూచి
మృతినొందె రక్షింప - వే! రఘురామ!
హితమూని ప్రోవరా - వేలసౌమిత్రి!
అని చాల విలపించు - నవనిజఁ జూచి
దనుజనాయకుఁడు - చెంతకుఁ జేరఁబోయి
చేపట్టిదిగిచిన - శ్రీరామ! రామ!
కావవే! యనుచు వృ - క్షముఁ గౌఁగలించు
వల్లికయును బోలి - వదలక పెనఁగి
వల్లాడ, విడక కా - మవికార మొదవ
కేరడంబులు పల్కి - కీల్గంటు పట్టి
మారు మోమిడ నీడ్చి - మహిఁ బడవైచి
కరిచేతఁ జిక్కిన - కమలిని యనఁగ
తెరలి గాసికి నోర్చి - దిగులుచేఁ బొగల
మృతికి హేతువు సంత - రించుకొన్నట్లు
వెతఁబెట్ట నీపాటు - వీక్షించి పొరలి
సచరాచరంబైన - జగతిఁజీకట్లు
పచరించె, రావయ్యె - పవనాంకురములు
మాసె నభోమణి - మమత రోదనము
చేసె భూతావళి, - సీతపాటునకు
నావేళ నెంతయు - నబ్జసంభవుఁడు
భావంబులోఁ జూచి - "బ్రతికితి నిపుడు
దేవతావళికెల్లఁ - దీర విచార
మీవసుధాభార - మిఁకఁ గడతేరె!"

అని తలంపఁగ దండ - కాటవి నున్న
మునికోటి "తమతప - ములు కొనసాగు
రావణుఁడిఁకఁ జచ్చు - రణములో" ననుచు
భావించి యానంద - భరితులైరపుడు!
తనభుజాంతరమున - ధరణితనూజ
నునిచి దశాననుం - డుప్పరం బెగసి
పోవుచో దివ్యవి - భూషణ ద్యుతుల
నావిశ్వజనని వి - హాయస వీథి
మెఱుఁగు వెట్టుచుఁ బోవ - మేదినీతనయ
ధరణీధరముఁబోలు - దనుజగాత్రమున
దావానలార్చి చం- దంబున వెలిఁగె!
ఆవేళఁ గనకాంబ - రాంచితయైన
సీత బాలాతప - శ్రీసంఘటించె
వైతేయ వరవారి - ధరరాజమునకు!
శ్రీరాము నెడవాయ - సీతనెమ్మొగము
చారువికాస ల - క్షణములు లేక
నాళంబుతోఁ బాయు - నాళీకమనఁగ
చాలఁగ వాడి తే - జము మట్టుపడియె!
పగలింటి చంద్రబిం - బమురీతి సీత
మొగము కన్నీటిచే - మురువెల్ల మాసె
జనక భూవరతనూ - జనుచంక నిఱికి
చనువేళ వానివ - క్షంబు చెల్వమరె!
చదల నుర్విని దిగి - సాగుమై సిరుల
నుదిరి మచ్చును బోలు - నొరగంటి రీతి
మణిమయ మేఖలా - మంజీరకటక

ఝణఝణ ధ్వనులొప్ప - జానకితోడ
పెళపెళ నురుములు - పెల్లుగ నురుము
జలదంబు చనురీతిఁ - జనియె రావణుఁడు !

—: రావణుఁడు సీతనెత్తుకొని పోవుచుండ నామె యాభరణములు కొన్ని క్రిందఁబడుట :—

జానకీసతి వెంట - జనుచోట వదలి
వేనలిలో రాలి - విరులు నల్లడల
దనుజేంద్రుఁ గనుఁగొని - తలఁకుచు రాల
మినుకు చుక్కలతోడి - మెఱవడిచూపె ?
సీత పాదాబ్జ మం - జీరంబు జారి
భూతలంబునఁ బడు - పోలుపుఁ జూపట్టె
దనుజేంద్రు మరణని - దానమై మింటఁ
గనుపట్టు నట్టి యు - ల్కాపాత మనఁగ
గగన మారుతముచేఁ - గదలి పయ్యంట
జగతితనూజ భు - జంబుపైఁ దొలఁగె
దశకంఠకీర్తిము - క్తామయధ్వజము
దశరథాత్మజునిచేఁ - దలఁగు నన్నటుల !
కొఱవిపోలిక మీఱు- కువలయతనయ
సురవైరి గొనిపోవు - చో భూషణములు
వ్రాలెను వీరరా - వణునకుఁ గీడు
వేళ గ్రహంబు లు - ర్విని బడినట్లు
ధరణితనూజ ము - క్తామణిసరము
పెరిగి యుర్వికి వచ్చు - పెంపుకన్పట్టె
నరుదుగా నప్పుడె - యువనికి డిగ్గ

గరమొప్ప నాకాశ - గంగయా ననఁగ ।
చండవాయువులచేఁ - జలియించి కూయు
చుండుపక్షుల మ్రోఁత - లొప్పు వృక్షముల
'మీరె వీనివధించు - మేదినీ తనయ
శ్రీరాముఁ డీఁకనని - చెప్పిన కరణి
దనుజుఁడు గొనిపోవు - ధరణితనూజఁ
గనుఁగొని వెన్నాడి - కదిసిపోలేక
మిన్నుల దాటి భూ - మికి వ్రాలె ! కాల
మన్ను ద్రవ్వుచు మింటి - మార్గంబుఁజూచి
కన్నీటితోడ మొ - గంబులు వాచి
విన్నఁబాటున నీడ - వీక్షించి యదియె
జనకజగా నెంచి - సడలిపోలేక
కనుచుండె నానామృ - గశ్రేణియపుడు !
సెలయేరు కన్నీరు - చీదంగ శిఖర
ములవేరి తమకరం - బుల మీఁదఁజాఁచి
'ఓయమ్మ ! జానకి ! - మోడకు మీవు !
మాయావి దనుజుని - మదమడఁగించి
వాఁడె నీపెనిమిటి - వచ్చెను పోవ
నీఁడన్న' గతి గిరు - లెల్లఁ జూపట్టె
'తన వంశజుని కాంత - దనుజుఁడు వట్టు
కొనిపోవఁ గని మాన్పఁ - గోరని యట్టి
యీజీవనంబేల - నిఁకఁ బక్షిమాత్రు
నీజటాయువుతోడ - నెనయలేనైతి !'
అని యెంచి యొయ్యన - నర్కమండలము
తన తేజముడివోయి - ధవళిమం బూనె !

‘ఈ రాఘవుని దేవి - నీ రావణుండు
పోరేది పట్టుక - పోవుచున్నపుడె
యొక్కడి ధర్మ మిం - కెక్కడి సత్య
మెక్కడి యార్జవ - మేటి శౌర్యంబు’
అని సర్వభూతంబు - నాహా నినాద
ఘన రోదనముల భూ - కంపంబుచేసె
వనమయూరంబు లా - వసుమతీతనయఁ
గనుఁగొని పొగులుచుఁ - గన్నీరు రాల్చె
పలుమారు ప్రాణేశుఁ - బలవరింపుచును
విలపించు జానకి - విధమాలకించి
‘హా! పోయెదవె! జన - కాత్మజా!’ యనుచు
వాపోయె విపిన దే - వతల మొత్తంబు!
కలఁగిన తెలివితో - కన్నీరుసోన
జలజలఁ గురియు లో - చనములతోడ
వదలిన కొప్పుతో - వదనాంబుజమునఁ
జెదరిన కురులతో - చెమటచేఁ గరఁగు
తిలకంబుతో వాడు - దేటిన వదన
జలజంబుతో రాలు - సరిములతోడ
“సత్యసంకల్ప! కా - సల్యాకుమార!
అత్యుదార! జగజ్జ - నాధార! రామ!
కరుణింపవే దిక్కు - గావె! సమస్త
శరణాగతత్రాణ! - సౌమిత్రి!” యనుచు
శోకింప రావణా - సురుఁడు లోకైక
భీకరుఁడొక్కయుం - బేదయుఁ బోలి
రాముని పట్టపు - రాణివాసంబు

నామేర గొనిపోవ - నలుక జనింపఁ
గనుఁదామరల కెంపు - గనుపింప సీత
దనుజేంద్రు నీక్షించి - దర్పించి పలికె.

—: సీత రావణుఁడు చేసిన పనికి నిందించుట :—

"తగునె రాత్రించరా - ధమ! కానిపనులు
తెగిసేయ? దీనఁ జెం - దెడు లాభమేమి?
ఒంటిగానుండు న - న్నోడక పట్టి
బంట నేననుకొన్న - పౌరుషంబగునె!
కనరైరి గాక రా - ఘవులు నీ తలలు
తునిమివైవరె యొక్క - తూపుసంధించి!
సిగ్గమియును లేక - చెప్పెదు బలిమి
యెగ్గెఱుంగక దొంగ - కే నోరు గనము!
నా నిమిత్తంబుగా - నాప్రాణవిభుని
కానల కెలయించి - కపటమృగంబు
కలిగించి యటు బందు - కట్టి లక్ష్మణుని
తొలఁగించి నన్నునె - త్తుకపోవఁజూచి
యరికట్టినట్టి జ - టాయువుఁ దునిమి
గరువించనేల? యీ - ఖగరాజు తోడి
వృద్ధునితోఁ బోరు - వేళ నీదైన
యుద్ధంబు భుజశక్తి - యును గాననయ్యె!
పరకాంత నెవ్వాఁడు - బలిమిచేఁ బట్టి
వరియింపఁ బొంచును - వాఁడధోగతుల
నిందుకు రోసెద - వే నీ ప్రతాప
మందఱు వినినవే - యాఁడు దుర్మతివి

తగదోరి! యిట్టి య - ధర్మవర్తనము
మగనాలి నాసింప - మర్యాదగాదు
కాదను పనిసేయ - గా దేఁగు నవుడె
నీకు శౌర్యముకాల్ప - నే జగద్ద్రోహి!
ఇంత వేగమున నీ - విటు వాఁకుకున్న
కాంతుఁడు వచ్చి రా - ఘవులు పోనీరు
కాఱుచిచ్చున పక్షి - గమలినయట్లు
శ్రీరాము బాణాగ్ని - చేఁ ద్రుంగ గలవు!
ఇదపథ్యముగ నెంచి - యిప్పుడే నిన్ను
వదలి పొమ్మను మేల - వలవని కీడు
నన్ను దక్కించుకొ - నంగ లేవిదిను
కన్నయర్థము చచ్చి - కనులాభ మేమి?
ఐన గానిమ్మను - నడియాస లేల?
మాను మొక్కనిమేష - మాత్రంబులోన
రాముఁ జూడకయున్న - బ్రాణముల్ నిలువ
నీమేనిలో నెంత - నేమి సేయుదువు?
మృత్యువు నెడరింప - మించి నామాట
నత్యంత హితమని - యాత్మఁ గైకొనవు
నురవైరి నీమెడఁ - జుట్టినమృత్యు
సరములు కాలపా - శములుగాఁ దలఁపు
మింక నేఁడది నీకు - నేలెదనన్న
లంకాపురంబు కా - లపురంబు గాక
వైతరణీనది - వహ్నులఁ దేలి
యాతరిఁ దరిలేని - యసిపత్రవనము
చిగురించు కత్తుల - చేత నీమేను

పొగరెల్లఁ దీరి య - ప్పుడె పోవఁగలవు!
పసిఁడిపూవులు నుక్కు - బలువుఁడు పచ్చ
మిసిమిరాకులు గల్గి - మించు బూరుగను
గనక భూరుహమును - గాంతువు గాక
తునిసి యాసన్న మృ - త్యుఁడవైన నీవు!
రామునియెడఁ జేయ - రానట్టి కీడు
తామసాత్మకుఁడవై - తలఁచితి గాన
తడవుగా నింక నీ - తనువేల నిలుచు?
పుడమి వ్రేఁగడఁగి యి - ప్పుడె పడగలదు
విల్లంది పదునాల్గు - వేల రాక్షసుల
బల్లిదుఁడై తృణ - ప్రాయంబుగాఁగ
నొక ముహూర్తంబులో - నుక్కడగించు
నకలంక విక్రముఁ - డైన రాఘవుని
నిశితాస్త్ర కోటిని - నీవనంబెంత
నిశి చరాన్వయ మెల్ల - నీకు గాఁగలదు!
పోనీయఁ డెత్తుక - పోయిన నిన్ను
దానవాధమ! నన్ను - ధరణిపై డించి
పనుపుము రాఘవు - పాలికి నెందు
జనినఁ బోనీయఁ డి - క్ష్వాకువంశజుఁడు."
అనుచు కన్నీటితో - నడలుచు బలుకు
జనకజ నెత్తుక - చనుచు రావణుఁడు

— సీత తన యాభరణములు కొంగులోముడిచి వానరులవద్ద విసరివైచుట —

అంతరిక్షంబున - నరుగుచోఁ దమరు

మంత్రనంబున నున్న - మర్కటాధిపులు
నేవురు నొక్కమ - హీధరాగ్రమున
నావేళ వసియింప - నవనిజ గాంచి
"వీరైన నిచటికి - విచ్చేయునపుడు
మారాఘవునకు నా - మాట దెల్పుదురు"
అని యూహ చేసి ప - య్యంట చెఱఁగు
కొనఁగొంత చించి యా - కొంగున దనదు
మేనిసొమ్ములు గట్టి - మేదిని మీఁద
దానవనాథు నిం - తయుగాననీక
కపులచెంగట నైవఁ - గ్రక్కున వార
లపుడాకసంబుపై - నరిగెడు తన్నుఁ
గనుఁగొని యిట్లని - కనలేక యుండ
దనుజనాయకుఁడు మఁ - దాకిని దాఁటి
పంపాదినదుల న - పారశైలముల
సంపూర్ణకాముఁడై - చను వేళ గడచి
కొదమ త్రాఁచును బోలు - గుణవతి సీతఁ
గుదురుగ తొడమీఁద - గూర్చుండ చేసి
కరడుల మిన్నంది - ఘళఘళారావ
భరితదిశానభో - భాగమై, లుళిత
మీనమై, నక్రస - మ్మిళితమై, తరళ
ఫేనమై, యలఘుగం - భీరమై, గుప్త
శైలమై, యతులవి - శాలమై, సప్ర
వాళమై యుప్పొంగు - వనవీధి దాఁటి
సిద్ధులు వీనికిఁ - జెడుకాల మగుట
సిద్ధంబు జానకిఁ - జెఱవట్టి తెచ్చె

ననుచు నాలోచింప - నమరులుప్పొంగ
తనరాజధాని యు - త్తరిఁ బ్రవేశించి
యా లంకలోఁ దన - హర్మ్యంబుఁ జేరి
నీలవైడూర్య మా - ణిక్య సౌవర్ణ
ధామమైనట్టి యం - తఃపుర సీమ
నామానవతి మయుఁ - డాసురమాయ
నునిచిన గతి సీత - నునిచి విశాల
వనితలఁ జుట్టుఁ గొ - ల్వఁగ నియమించి
యారమణులఁ జూచి - యవనిజ వినఁగ
గారవంబున దశ - కంధరుండనియె.
' ఈరమణీమణి - యేలికసాని
మీరెల్ల నుడిగంపు - మెలఁతలీ చెలికి
యేసొమ్ము లేచీర - లెట్టిభోజనము
లే సంపదలువేఁడె - నెడపక తెచ్చి
యప్పుడ చేకూర్పుఁ - డతివ నాసొమ్ము
కప్పురగంధి కేఁ - గడు విధేయుఁడను
నెవ్వరు సీతకు - నెగ్గుగానడచి
రవ్వేళఁ దెగవ్రేతు - నాత్మజులైనఁ
గని కొల్వుఁడనుచు వే - గమ పడకిల్లు
దనుజనాయకుఁడు సం - తసముతో వెడలి
కొలువు సావడి కేఁగి - కోరిన కోర్కి
ఫలియించె ననుచు నా - ప్తముఁ దెల్పవేఁడి
తడయక యెనమండ్రఁ - దన ప్రధానులను
కడువేడ్కఁ జూచి రా - త్రిచరనాథుఁ డనియె.
" శ్రీరాము నావలి - చే జనస్థాన

మూరడి నొంది పా - డైయున్నదిపుడు
నెలకొని మీఁదు తా - ణెము వోయి యచటఁ
దలఁగక యుండుఁడు - దైత్యులఁ గూడి
ఖరదూషణాదులఁ - గదనంబులోన
నఱికిన దశరథ - నందనుఁబట్టి
త్రెగవేసి యాసూడు - ద్రిప్పకయున్న
మగతనం బేడది - మజ్జాతికెల్ల
నిద్దుర వోవుదు - నేరాముఁజంపి
గద్దలకాతని - కండలునైచి
యూఱడు నందాక ? - యుర్వపైఁ బేద
యూరికేఁగగ నిధి - యొదవుచందమున
నెంత సంతోషింతు - నీరాము గెల్చి
చింతఁ దీఱినయట్లు - సేయక నాకు
రాముఁడు నడచు వా - ర్తలునాఁడు నాఁట
నేమఱకేఁ కనైన - నిడి వేగువారి
చేత నెప్పుడు నడ - చిన కార్యమపుడె
నాతోడ నెఱింగింప - నాల్గుమూనాళ్లు
నొక కొమ్మ వనిచి - మీఁరుండుఁ డెచ్చరిక
నొకట నేమఱక సే - యుఁడు నాకు హితము
నేరూపమునప - యీఁడెర్చి రాముఁ
బోరిలోపల జయిం - పుఁడు మోస వోక
మీ వడిగల తన - మేకదా నాకు
సేవల వజ్రాంగి - యేకార్యములకు
ఇట్టి నమ్మికఁ జేసి - యేగడి నుండఁ
గట్టడిఁ జేసితిఁ - గదలి పొండిపుడు.”

అని పల్కుటయు వార - లసురేంద్రు నాజ్ఞఁ
జనిరి యప్పుడె జన - స్థానంబుఁ జేర.
బలవద్విరోధ మీ - పని రఘువీరుఁ
డలిగిన మిక్కిలి - హానియౌ దనకు
నని తలఁపక చిక్కె - నవనితనూజ
తనకుఁ దక్కెను కామి - తములు చేకూడె
ననుచు నిశ్చింతత - నద్దశాననుఁడు

— రావణుఁడు సీతకుఁ దనవైభవముఁ జూపుట :—

జనకజ యున్నట్టి - సౌధంబుఁ జేరి
యాడుకుక్కలలో భ - యంపడు లేడి
పోఁడిమి శోకాగ్ని - పొగసూరి చుట్టుఁ
బనులు వూని పిశాచ - భామలున్నట్టి
జనకజఁ గేల్వట్టి - చయ్యనఁ దిగిచి
రమ్మని యంతఃపు - రంబులో వెల్పు
కొమ్మలు కోటాన - కోటులు కొలువ
నవరత్నభాసమా - నములైన దనదు
భవనముల్ కలుగు సం - పదలను జూపి
యాసపుట్టింతు నే - నని రామురాణి
వాసంబుతో దైత్య - వరుఁ డిట్టులనియె.
"కొమ్మ! ముప్పదిరెండు - కోట్ల చేరువలు
నెమ్మి నందొక్కొక్క - నికి వేయివేయి
దానవసైన్యమా - ప్రబలంబు నాకు !
దీనిచే దేవతా - ధిపుల గెలిచితిని.
అబలంబెల్ల నీ - యడుగులు గొలిచి

రోషాల! యిటమీఁద - నుప్పొంగుగాక!
ఈనగరి వసించు - నింతుల నీకుఁ
గానుకగా నూడి - గమున కిచ్చితిని
నూతన ప్రీతి న - న్నుఁబరిగ్రహించి
శీతాంశుముఖ! కటా - క్షింపుము నన్ను
నొప్పకయుండి నే - నోడఁబాటు సేయు
నప్పుడు మనసిచ్చు - నతివ నామెచ్చు
యింపుమీఱఁ బరిగ్ర - హింపుము నన్ను
చంపకగంధి! వి - చారమేమిటికి?
నీవు గాదన్న నీ - నీరధి నడిమి
దీవి లంకాపురి - తేరిచూడంగ
నింద్రాదు లొప్పుదు - రే! యేల పూర్ణ
చంద్రబింబాస్య! వి - చారమేమిటికి?
కాదంటివేని జ - గత్రయి నాదు
కోదండమునకు మా - ర్కొన నెవ్వఁడోపు!
ఇలఁ గోలుపోయి తా - నిడుమల నాకు
నలములు దిని మౌని - యై కొఱమాలి
యున్న రాముని మీఁద - నూరక యేల
కన్నిడి భాగ్యంబుఁ - గడకుఁ ద్రోచెదవు?
నేఁటికిఁ గలనీదు - నిండుజవ్వనము
పాటలాధర! చింత - పాలు చేసెదవు?
దేవతారమణివె? - తిరుగ నివయసు
చేవ నీమేన నూ - ర్జితమె యెప్పటికి?
మనసుదాఁచగ నేల? - మదిలోన నిట్టి
యనుమానమేల? నా - యక్కఱలఁ దీర్పు.

ఏను గావలెనన్న - యిగురాకుబోణి
మానసంబున వేఱె - మగనిఁ గైకొనునె?
పురుషుల మనములు - పొక్కించి సరస
మెఱుఁగని నిను ధాత - యేల పుట్టించె?
కరువలి నురికోలఁ - గట్టి తేఁగలరె?
తరలింప వచ్చునే - దహనుతోఁ గీల?
నాచేతఁ జిక్కియు - న్న మిటారి నొకఁడు
చూచి తెచ్చెదనన్న - శూరుఁడున్నాఁడె?
అలివేణి! ఎంతపు - ణ్యముఁ జేసినావొ
యెలమితో నీలంక - నేలుము నన్ను
నేలుము రతికేళి - నేలితివేని
వేలుపుల్ నినుగొల్వ - విహరింపఁ గలవు!
వలసిన భూషణ - వసన సుగంధ
ములుఁ దాల్చి నావెంట - ముల్లోకములనుఁ
జరియింపు మిట్టి పు - ష్పకముపై నన్ను
వరియించు మారునీ - వలకుఁ దప్పించి
దాసుఁడ నీదు పా - దములకు వినతిఁ
జేసెద హస్తరా - జీవముల్ మొగిచి."
అన రెండు చేతుల - నవనిజ వదన
వనజంబు వాదివిభా - వము పల్లటిల్ల
హా! యని యెలుఁగెత్తి - యొగరాకు మెసవి
గోయిల యెలుగెత్తి - క్రోల్చినరీతి
యొగవెక్కి యేడ్చిన - నీసుతో మఱల
జగతితనూజపైఁ - జాలఁ గోపించి

యేమియు నవ్వుగాము - లెఱుఁగఁగ లేక
కామాంధుఁడై దశ - కంధరుఁడనియె.
"అలివేణి! ఇది దైవ - యత్నంబు చేత
తలఁచని తలఁపు నా - దానవై నావు
నీభాగ్యమెంత యె - న్నిన నంతచెల్లు
నోభామ! ఇదినాకు - నుచితకృత్యంబు
కాని కార్యంబునఁ - గానేల మేము
దానవులముగాన - ధర్మమెయుండు
యవని రాక్షసవివా - హంబిది నీకు
నవ్వుమోము విన్నద - నంబును మాని
కంటవెల్వడు నీరు -క డకోసరించి
బంటనైనట్టి నా - పలుకీయ కొనుము
సిగ్గు నీకేఁటికి - చిగురుంగటారి
కగ్గము సేయక - యండకు రమ్ము
శ్రేణిగా నాదు కి - రీటనవీన
మాణిక్యకోటి తా - మరలనుఁబోలు
నీపాదములసోఁక - నేఁడెంత కంటి
నో పంకజేక్షణ! - యోర్చుకొమ్మిపుడు
ఇట్టి దైన్యంబుచే - నే యెలనాఁగ
చిట్టకంబులకు సై - చె దశాననుండు
పదిశిరంబులు సోఁక - పదముల వ్రాలె
నిది నీవెఱుంగ లే - వింతియేకాక
తఱితీపు లేల? బి - త్తరి! కౌఁగిలించి
మరుకేళి లాలించు - మా" యని పలుక

— సీత రావణుని నిందించుట - సీతను రావణుఁడశోక వనమున నుంచుట —

మదిరోసి తనదు స - మక్షంబునందు
చిదిమి తృణంబు వై - చి శిరంబు వాంచి
వానిఁజూడక కల - స్వనము రాయంగ
జానకీదేవి కోం - చక యిట్టులనియె.
సద్ధర్మపరుఁడు దా - శరథి ప్రాజ్ఞుండు
సిద్ధసంకల్పుఁ డూ - ర్జితపరాక్రముఁడు
రామచంద్రుండు నా - ప్రభువునుఁ బ్రాణ
మా మీఁద దైవంబు - నఖిలప్రదాత
యట్టి రాముఁడు సుమి - త్రాత్మజుఁగూడి
చుట్టాలనాప్తుల - సుతులతోఁ బట్టి
ఖరదూషణాదుల - ఖండించినటుల
దురములోపల నిన్ను - ద్రుంపక పోఁడు
నీ వెన్నినట్టి యీ - నీచరాక్షసుల
భావింపఁ దార్క్ష్యుచేఁ - బాములు బోలి
కోదండదీక్షాది - గురుబాణవృష్టి
నేవంకయును లేక - యిపుడ మ్రగ్గెదరు
గంగాతటాంబు భం - గములును బోలి
సంగరంబున నీవి - శాలగాత్రంబు
కాంచనపుంఖరా - ఘవశరశ్రేణి
చించి వ్రయ్యలుచేసి - క్షితిమీఁదఁగూల్చు
నీవు సురాసుర - నికరంబు చేత
చావు లేదని క్రొవ్వి - చదరులాడెదవు
వారిలో నొకఁడె నా - స్వామి యారాము

చే రణంబున నీకు - సిద్ధంబు చావు
నాశహేతువునీకు - నా ప్రాణవిభుఁడు
దాశరథియె నీకు - దండధరుండు
వశమె యూపమున బ - ల్విడి కట్టువడిన
పశువు తప్పించుక - బ్రదుక నెంచఁగను?
రాముఁడు నిన్ను నే - రఁగఁ దేటి చూడ
నేమేర బ్రదుకుదు - వెఱుఁగవుగాక
వలసిన నాకునై - వనజారినైన
నిలఁగూల నేయు న - య్యినకులోత్తముఁడు
జలధులింకించు భా - స్కరు నడ్డగించు
తలక్రిందుగావించు - ధరణీమండలము
పొడిసేయు మేరువు - పోనీఁడు నన్ను
నెడవాయఁ జాలఁడో - క్కించుక తడవు
నీయాయువును నీదు - నిఖిలరాజ్యంబు
నీయశంబునుఁ ద్రుంగె - నేఁటితో నిజము
పతిఁ బాయఁజాల నీ - పడఁతులఁ బాపు
నతిశయంబగు పాప - మది రిత్తవోదు
దైవబలంబు చే - దశరథాత్మజుఁడు
నీవారితో నిన్ను - నిర్జింపఁ గలఁడు
మృత్యువు పెడరేప - మేలని నన్ను
దైత్యాధమాధమ - తగదు తెచ్చితివి
యొనరంగ స్రుక్స్రువ - ద్యుపకరణములు
వినుతింపఁదగుయాగ - వేదికఁ జేర
చండాలుఁడర్హుఁడే - జానకిఁగన్న
చండాల! నీకెట్లు - చను నాస చేయ?

అరవింద సరసిలో - హంసంబుఁ గూడి
చరియించు హంసి తు - చ్ఛపుఁబల్వలములఁ
గదలనేరని నీరు - కాకిపై నేల
మదినిల్పు ? నాకు నీ - మాట లింపగునె ?
రాముని(బాసియుఁ - బ్రాణాశ యింక
నేమిటి కిటమీఁద - నెట్లైన మేలు
త్రుంపుము దండింపు - తునియలు సేయు
మింపగుగానియూ - హింపకన్యముగ"
అని పరుషోక్తు లి - ట్లాడిన జూచి
కనలి క్రోధించి లం - కానాయకుండు
సీత నెమ్మోము వీ - క్షించి నెమ్మదికి
భీతి పుట్టంగ ద - ర్పించి యిట్లనియె.
"అతివ ! నీకొక్కయే - డాత్మశోధింప
మితము చేసితి నందు - మీఁద సైరింప
యాలోన మనసిచ్చి - తేని నీచేత
నేలింతు లంకతో - నెల్లలోకముల
కాక యీ చలముతో - కడతేరుదేని
యాకడ నిను వండి - యటికలనుంచి
తెత్తురు నాకు నెం - తే నువారంబు
బిత్తరుల"ని చాల - బెదరు పుట్టించి
యా చుట్టునున్నదై - త్యాంగనశ్రేణిఁ
జూచి యావైదేహిఁ - జూపి యిట్లనియె.
'మదిఁగ్రొవ్వినది సీత - మట్టుకురాదు
మదమణంపక నాదు - మాటగైకొనదు
బుద్ధిరాఁజేసి యి - ప్పుడు దారి పడగ

దిద్దు కొండ"ని యుప - దేశించు నంత
వారలా సీతను - వలగొని చుట్టి
దారుణగతిఁజూప - దశకంఠుఁడనియె,
"రండు కామినులార ! - రమణిని తోడుక
పొండశోకవనంబు - పొంతకు మీరు
నయము భయంబును - నానాఁట జూపి
ప్రియములు పలికి యొ - ప్పింపుఁ డుల్లమున
నడవిలో నున్నట్టి - హస్తినిఁదెచ్చు
కడక నేర్చిన చెంచు - కన్యలరీతి
నెలయించుకొని నాకు - నీ సీతఁగూర్చి
యలఘువైఖరి మెచ్చు - లందుఁడు మీరు
కదలిపొండ"నుచు నే - కతమునఁ బల్క
మదిరారుణేక్షణ - మదహస్తులగుచు
నందఱు నాసీత - నలముక దనుజ
సుందరుల్ గదలి య - శోకవనంబు
సకలర్తు ఫలపుష్ప - జాలజాలకము
మకరాంక కారోప - మానసమన్వితము
చేరి యానడు చక్కి - సీత నశోక
భూరుహచ్ఛాయ న - ప్పుడు నిల్పి తమరు
చుట్టును వసియింప - నూరెల పులులు
పట్టుకపోఁజేర - బలువలఁ దగిలి
వెతలఁ బొల్పడు లేడి - విధమున దనదు
కృతమెంచి పగలు ది - క్కెవ్వరు లేక
ధారాళముగఁ గంటఁ - దడివెట్టి యపుడు
శ్రీరామునెమ్మదిఁ - జేర్చి చింతిలుచు

నెందు నూరటలేక - యొందునారడియు
నందు చింతాక్రాంత - యై యున్నయంత

—: రాముఁడు మారీచునిఁ జంపి వచ్చుచు దుశ్శకున
ములఁ గాంచి వగచుట :—

అచ్చోట రఘువీరుఁ - డామాయ లేడి
చిచ్చర యమ్ము పై - చి వధించి మరలి
వచ్చుచో వరదులు - వాపోయఁ జుట్టి
వచ్చె నానామృగ - వ్రాత మేడ్చుచును
ఈ యపశకునంబు - లేలకో పొడమె ?
మాయావి దనుజుఁడు - మహిఁ గూలునపుడు
నాడిన మాటచే - నవనిజ కొక్క
కీడును లేక సు - ఖించు గావుతను ! 4980
ఇది లక్ష్మణుఁడు విన్న - నిప్పుడే వచ్చు
నది సీత విన్న హా - మ్మనిపించు నతని
దనుజులా జానకిఁ - దమరు హరింప
ననువుగానక యీమృ - గాకారుఁడైన
దనుజుని బెడరేఁచి - తను నెలయించి
కొనిపోవఁ జూచిరి - కోరి జానకిని !
'హాసీత ! హాలక్ష్మ - ణా' యనివీఁడు
చేసిన రావంబు - చేవచ్చు హాని
నాదు సోదరుని జా - నకిని దొలంగి
ఖేదముల్ మాని సు - ఖింతురుగాక ! 4990
దనుజులతో జన - స్థానంబు కొఱకు
పెనుపగఁ గొంటిని - పెరుగక పోదు

కాని నిమిత్తముల్ - గనిపించెదికల
దీనికి హేతువే - తీరుగాఁగలదొ "
అని జాలినొంది ర - యంబుతో వచ్చు
జనకజాభర్తల - క్ష్మణుని దూరమున
వెలవెలఁ బాఱుచు - వెతలచే నెదురఁ
దలవాంచి కొనివచ్చు - తమ్మునిఁజూచి
వలకేలు బట్టి పో - వక నిల్చియార్తిఁ
గలఁగుచు జలజల - కన్నీరురాల

—: రాముఁడు సీతనుఁగానక శోకమున విలపించుట :—

" సీతనేమి నెపమ్ము - చే డించివచ్చి
తీతఱి నిఁక సీత - యేడది మనకు ?
సౌమిత్రి ! మనపర్ణ - శాలలోపలను
భూమిజ నుండ యి - ప్పుడు చూడఁగలమె ?
ఎక్కడ సీత ది - క్కెఱుఁగక పొలియు
టొక్కటి చెఱవొవ్వు - టొక్కటి ఖలులు
మెదలనీయక పట్టి - మ్రింగుట యొకటి
యిదిదప్పదిప్పుడు - యెడమ కన్నదరె !
ఇంకొకమరి చూతు - మే వోయిసీత !
అంకిలినొందె నా - యాత్మ చలించె !
నీకు నొప్పనసేసి - నేవచ్చినాఁడ
చాకుండఁ దోతెమ్ము - జానకి యేది ?
సకలభోగములు ని - స్సారంబు చేసి
యొకతెయు నావెంట - నుగ్రాటవులకుఁ
బాయక వచ్చియీ - పట్టున నన్ను

మాయామృగము గోరు - మన సీతయేది ?
నాసుఖదుఃఖముల్ - నాతోడ నంతు
చేసుక యనుభవిం - చియు చింతలేక
ముదమొందుచును నాదు - ముచ్చటలెల్ల
మదిలోన యీడేర్చు - మన సీత యేది ?
ఏచెలి నెడవాసి - యేనోర్వఁజాల
నాచంద్రబింబాస్య - యగు సీత యేది ?
సీతతో నెడవాసి - చేపట్టనొల్ల
భూతల సామ్రాజ్య - భోగంబులైన
నాయింద్ర సామ్రాజ్య - మైననాప్రాణ
నాయకి యగునట్టి - నాసీత యేది ?
మాటున నుంచి నా - మనసు చూచెదవె
మాట నేమిటికన్న - మనసీత యేది ?
యీప్రాణములకన్న - నాకు హెచ్చైన
నాప్రాణ వల్లభి - యగు సీత యేది ?
నావనవాసంబు - నకు తోడునీడ
కావలెనని నమ్మి - కామించి తెచ్చు
పూనికె నెరవేర్చ - పూని యున్నట్టి
మానవతీమణి - మనసీత యేది ?
కైక పూనిక చెల్లెఁ - గానోపు సీత
కాకుత్స్థ కులమెల్లఁ - గడతేర్చునేమొ ?
కొడుకుఁ గోడలిజంపు - కొనిన కౌసల్య
యిడుములఁ బడికైక - నిఁకఁ గొల్చునేమొ?
సీతచచ్చినఁ జావు - సిద్ధంబు తనకు
నీతరి నన్ను నీ - వెడఁబాతువేమొ !

జానకి గలిగిన - సకలంబు గలుగు
వానిగా నెంచి దై - వము నోర్వదేమి?
ఎడవాయునప్పు డ - య్యేలనాఁగ మోము
కడపటి చూపుగాఁ - గనుఁగొంటినేమొ!
ఇప్పుడు మనయింటి - కేఁగుచో నాదు
చప్పుడు విని పర్ణ - శాలలో వెడలి
నగుమోముతో వచ్చి - ననుఁబైఁట చెలఁగు
నగము జాఱంగ ము - చ్చట గాఁగిలించి
నిలిచిన ప్రాణముల్ - నిలుచు నామీన
తొలఁగిన నటమున్న - తొలఁగు నాక్షణమ!
మత్తుఁడవై నీవు - మదిఁ గ్రొవ్వియింటి
నుత్తమగుణవతి - నుర్విజనుంచి
వచ్చినవాఁడవు - వాకొనరాదె
చచ్చెనో బ్రదికెనో - జానకి వార్త!
సుకుమారగాత్రి మం - జులవాణి సీత
నొకనిచేఁ దగిలి కు - య్యోయంచుఁ బోవ
యీమేనితో నుండి - యిట్టి నీకతన
యేమేమి దుఃఖంబు - లేనందఁ గలనొ!
ఆదురాత్ముని మాట - యాలించి సెవికి
వేదుఱుట్టఁగనిట్లు - వెడలి వచ్చితివి
వత్తురే యెటులైన - వనితను డించి
కత్తులబోనైన - గహనంబులోన
అక్కటా! పరులకు - నవకాశమిచ్చి
యొక్కింతయైనమో - మోటవో విడిచి
నామాటయును మీఱి - నా వట్టినిన్ను

యేమని యందు నిం - కేమి సేయుదును ?
ఖరుని జంపినయాది - గా దైత్యులెల్ల
కరకరి మవమీఁద - కడు పగవూని
యుందురు గావున - నొక్కఁడు జనక
నందను బట్టి మి - న్నక క్రింగి పోయె !
ఆలిఁ గోల్పోయిన - యధముఁడనైతి
పాలుమాలిన యట్టి - పలుకు లేమిటికి ? ”
అనుచుఁ గన్నీటితో - నాపన్నుఁడైన
యనుజుని గదునొవ్వ - నాడి రాఘవుఁడు
వడిఁ బర్ణశాలకు - వచ్చుచో వచట
పుడమి పట్టియుఁ దాను - ప్రొద్దుపోకలను
మొలఁగు చోటులఁజూచి - మిక్కిలి మదిని
కలఁగుచుఁ దమ్మునిఁ - గని యిట్టులనియె.

—: రాముఁడు లక్ష్మణుని రాకకుఁ గారణమడుగుట
లక్ష్మణుఁడాసంగతి రామున కెఱింగించుట :—

“ సీతను డించి వ - చ్చెదనను బుద్ధి
నీతలంపునఁబుట్టు - నేదైవ గతిని
ఎట్టి యెన్నికచేత - నీవు జానకిని
నట్టడవిని డించి - నమ్మివచ్చితివి !
సీతను డించి వ - చ్చిన నిన్నుఁజూచి
సీతోడు నాగుండె - నెగ్గుపఁ బగిలె
ఏమి వక్కానుసీత ! - యేలవచ్చితివి !
ఏమి హేతువులు ? ని - వీఁక దాచనేల ?
ఆమాట వినిదొమ్మ - నల్లడీలుంగ

సౌమిత్రి!" యనిన ల - క్ష్మణుఁ డిట్లు వలికె.
"స్వామి! నాయిచ్చ ని - చ్చటికి రాలేదు
మీమాటగాఁగ భూ - మిజ విన్నకతన
ననరాని దుర్భాష - లాడినఁ జెవుల
వినలేక యిచ్చోటు - వెడలి వచ్చితిని
ఆయమ్మ ననువిడ - నాడిన మఱియు
నోయమ్మ! నీకిట్టి - యుపతాపమేల?
శరణాగతులఁ బ్రోవఁ - జాలు మాయన్న
శరణు వేడున యల్ప - జనులనీరీతి?
ఎవ్వఁడో దానవుఁ - డిట్లువంచించి
యివ్వాక్యములు వల్కె - నింతియె కాక
నీనాయకుఁడు నాడు - నే యిట్టిమాట?
మానవతీమణి! - మాను మీవగవు
ఉన్నవారిఁక వుట్ట - నున్నట్టివారు
నన్నిలింపులు మహేం - ద్రాది దిక్పతులు
శ్రీరామచంద్రుని - చేత విల్లున్న
పాఱిపోవక నిల్చి - బ్రదుక నోపుదురె!
ఇదె వచ్చు నీనాథుఁ - డేమిటి కమ్మ
మదిలోన దాలిమి - మాని వల్కెదవు?
అనినఁ గోపించి యా - యమ్మ మీతోడ
వినిపింప రానట్టి - వేఁడి పల్కులను
'ఓరి! పాపాత్మ! న - న్నోడక పొందఁ
గోరి యీరాత్రియు నెచ్చుఁ - గుందులాడెదవు
మీయన్నఁ జంపి నా - మీఁదటియాశఁ
బాయలేకిట్టి య - బద్ధముల్ వలుక

నీకు లోనౌదాన - నే ? యీతలంపు
నీకౌనగూడదు - నిష్ఫలంబగుదు
భరతుఁడు నిన్ను బం - పఁగ ద్రోహచింత
విరసమేర్పడనీక - వెంటవచ్చితివి
అజ్జ చూచుక యుంటి - వన్నకు వెఱచి
సజ్జను గతిఁ బట్టి - జంపించి తిపుడు
నీవుచూడఁగ నేఁడె - నీకిత్తుఁ బ్రాణ
మావలఁ బొమ్మని - రాళ నూరికిని. '
అని పల్కనీవెట్టు - లయినఁ గమ్మనుచు
జనకజ డించి యి - చ్చటికి వచ్చితివి
ఏమిసేయుదు ? " నన్న - నీసుతో వినియు
నామాట వినక " యె - ట్లైన నోఁగాక
యేమన్న నేమి ? రా - నెట్లగు నీకు ?
భూమిజ యేమైనఁ - బోవనిమ్మనుడు
నేరంబు నీమీఁద - నిలిచె హితంబుఁ
గోరక నన్నింత - కొదవ చేసితివి
ఆటది యనుమాట - లాగురి యిట్టి
పాటి యన్యాయంబు - పరగు నేసేయు ?
నీకోపమే చూచి - నేనన్నమాట
యాకడఁ ద్రోచితి - వల్పుఁడవైతి
వెఱుఁగని జానకి - యేమన్న నేమి ?
ఎఱఁగి యెఱింగి నీ - కెట్లు రావచ్చు ?
అమ్మనేఁ దొడిగిన - యపుడె మాయామృ
గమ్ము చందముమాని - కపటదానవుఁడు
పడువేళ నీరీతి - పలుకుచు వాఁడె

పడియున్న వాఁడు నా - బాణపాతమున."
అని వచ్చి పాడైన - యాపర్ణశాలఁ
గనుఁగొని శోభావి - కాసంబు లేక
హేమంతమునఁ దప్పి - నెఱవాసి యొప్పు
తామరకొలని యం - దము మించుదాని
సీత లేదని తెల్పు - చెలువునఁ బత్తి
జాతనానామృగ - స్వనములదాని
చెదరిన దర్భలు - శీర్ణపాత్రములు
ప్రిదులు నాసనములు - బెదరు నేణములు
తలఁగిన వనదేవ - తలు రాలువిరులుఁ
గలిగిన తమయిల్లు - కలఁగుచుఁ జొచ్చి
జానకిఁ గానక - శాలాంతరంబు
లోన నాలుగు దిక్కు - లునుఁ దేఱిచూచి

—— పర్ణశాలయందు సీత లేకుండుటఁ జూచి
రాముఁడు దుఃఖించుట :——

యెదవడి" లక్ష్మణ ! - ఏమిరో సీత
వెదకినఁ గానము - వెడలిపోయినదో ?
దనుజులు మ్రింగిరో ? - తాను నామనసుఁ
గనవేడి దాఁగెనో ! - కానమేమియును
మృతినొందెనో భీతి ? - మేలిమి విరులు
లతలు గోయ వనంబు - లకుఁ బోయినదియొ !
నీటికేఁ గెనో ! యక్క - నెలవున నైనఁ
దాటలాధర గాన - బడదేమి సీత ?"

అనుచుఁ గన్నీటితో - నడలి యున్మత్తు
ననువునఁ జాలఁగా - నాతురుండగుచుఁ
బోద బోద గవి గవి - పొలము పొలంబు
నది నది వని వని - నగము నగంబు
చూచి హా! సీత! హా - శోభనాకార!
హా! చంద్రబింబాస్య! - హా! చకోరాక్షి!
పలుకవే! యేను నీ - పాలిటివాఁడ
నిలుపోపలే నీఁక - నిమిషమాత్రంబు
నినుఁ బాసి ప్రాణముల్ - నిలువవు మేన ”
అని మేను మఱచి ‘ యు - ష్ణాని ’ వెచ్చ నూర్చి
“ తిలకంబ! కానవే - తిలకలలాట
యళులార! కానరే - యలినీలకచను?
హరిరాజ! కానవే - హరిరాజమధ్యఁ?
కరివర! కానవే - కరివరగమన?
హరిణంబ! కానవే - హరిణాయతాక్షి?
గురివింద! కానవే - కురువిందరదన?
లతలార! చూపరే - లతికాలతాంగి?
శతపత్రమా! ఏది - శతపత్రగంధి?
మల్లిక! కానవే - మల్లికానఖరఁ?
బల్లవమా! చూపు - పల్లవాధరను?”
అని వెదకుచుఁ బోయి - “ యువనిజ! నీదు
కనకచేలముఁ గంటిఁ - గంటినే ”యనుచు
“ నీవశోకము చెంత - నిలిచియు రమణి!
కానవే నన్నుఁ గో - కము మ్రుంచె ”ననుచు
“ ఓయి! లక్ష్మణ! సీత - యున్నదా యిర

పోయి తోతెమ్ము గో - బ్బున జేర "ననుచు
"నినువంటి చక్కని - నెమ్మోము దాని
జనకజం దోతెమ్ము - చంద్రా! "యటంచు
"వినవన్న లక్ష్మణ! - వెదకి రాక్షసుఁడు
చనియె సీతనుమ్రింగి - చలపట్టి "యనుచు
"ఇంక నాతో నెయ్య - మేఁటికి నీకు
శంకింప కెంద్రైనఁ - జనుము నీ "వనుచు
"జిలిబిలి నవ్వులు - జింకచూపులును
పలుచని చెక్కులు - పాటలాధరము
నెలవంక బొమలు క్రొ - న్నెలఁబోలు నుదురు
తళుకు కన్నులును కుం - తలవిలాసంబు
తిలకంబు వలుద ము - త్తియపు ముంగరయు
తిలపుష్ప నాస హా - త్తిన పలువరుస
శ్రీకారములు నేలు - చెవులును మించు
రాకేందు నిభమైన - రమణి నెమ్మొగముఁ
గానక నేనర - గడిదియైనఁ దాళ
లేను లక్ష్మణ! సీత - లేదేమి సేతు?
కమనీయ శంఖమం - గళమైన గళము
గమగమ మను పచ్చి - కస్తూరి తావి
మిక్కుటంబుగమూరు - మెడపెట్టి కఱచి
రక్కసుఁడా సీత - రక్తపానంబు
సేయునప్పుడు దలఁ - చెనో సుమీ నన్ను!
కూయుచు "రఘువంశ - కుంజరా "యనుచు
సీత యొక్కతెయు వ - సింపుచోఁ గెంపు
రాతిచొక్కపుటుంగ - రములు నీలంపు

గాజులు వజ్రాల - కడియముల్ రత్న
రాజికంకణములు - రంజిల్లు కేలు
తగులనీయక తా వి - దర్చికొనంగఁ
దెగిపట్టి విఱుచుకఁ - దినియెనో యసుర
నిన్ను శృంగారించి - నిలిచి రాక్షసుల
వెన్నాడి తిరుఁడని - విడిచిపోయితిని !
కానవే నీవైనఁ - గమలాక్షి సీత
తానెందున్నదో - తమ్ముఁడ ! వెదకు
హా ! సీత ! పోయితి - వా ? నన్నుఁ బాసి
హా ! సుమిత్రాకుమా - రా ! సీత యేది ?
హా ! దైవమా ! యంచు - నరగన్ను మొగిచి
పోదమా వెదక నా - పొదరింటిచాయ ?"
అని రెంటి బరువెత్తి - యటనిల్చి మఱలి
మునువున్న కడకుఁ ద - మ్ముఁడు దాను మఱలు
చూచిన చోటులే - చూచుఁ గూర్చుండు
లేచుఁ గూర్చుండు తా - లిమిలేక పొరలు
చరులలో వెదకును - సానువులెక్కు
గిరులు సాధించు తీ - గెలుద్రిప్పి చూచు
దోనలు పరీక్షించు - తోఁటలు దిరుగు
వనములు వెదకు శై - వలిను లీక్షించు
మేను బ్రమ్మాన్పడి నిల్చు - మిన్నక నవ్వుఁ
దానూరకేపల్కు - తలయూఁచి వగచు
కన్నీరు రాలుచుఁ - గరయుగళంబు
మిన్నక పొదవెత్తి - " మేదినీతనయ
జానకి " యని పల్కి - సొల్కు వచ్చి

తానందుఁ బడి ముహూ - ర్తము మూర్ఛనొంది
తెలిసి కన్దెఱచి న - ల్దిక్కులు జూచి
వెలవెలనై తల - వ్రేలంగవైచు
"అక్కటా! లక్ష్మణ! - యువనిజ యేఁడు
నెక్కడ వెదకుద - మేమి సేయుదము?
ఎందు వోవుదు మింక - నెవ్వారు దిక్కు?
కందునే సీత చ - క్కని మొగంబింక!"
అనుచు దిగ్గన లేచి - "యదె సీత వచ్చె"
అని "కౌఁగిలించెద" - నని గమకించి
కామునివలఁ జిక్కి - కళవళంబంది
యేమియుఁ దెలియక - "ఏమి! లతాంగి!
పాలయల్క లెంతయుఁ - బ్రొద్దునీకేల?
అలిగి మోమటుఁద్రిప్పు - నగునె యిందాక?
పరిహాసమునకై నఁ - బాసి యుండుదురె!
తరుణి! నాచెంతఁ గై - దండగా రాదె?
దగ్గరిరమ్ము చి- ట్టకముల లేని
సిగ్గుల మరుమోము - చేసి యుండుదురె!
నీవు పెంచిన మృగీ - నివహంబుఁ గంటె
నావలె నిన్ను గా - నక కలంగెడును
కన్నియ! కన్నీరుఁ - గార శోకింపు
చున్నవి దయఁజూచి - యూరార్పు మిపుడు
పద్మలోచని సీతఁ - బాసిన వెనక
లక్ష్మణ! నాకు నే - ల శరీరమింక!
పోవుచున్నవి ప్రాణ - ములు నిమిషమునఁ
గావవే జానకిఁ - గన్నులఁ జూచి

యేనింద్ర పదమున - కేఁగిన యపుడు
తానందు వచ్చి మా - తండ్రి కోపించి
'పదునాలుగేండ్లు నా - ప్రతినఁ జెల్లించి
తుదిరాక యిటకు వ - త్తురె నట్టనడుమ
హానిఁ జేసితివి నా - యాజ్ఞకు భ్రష్ట
వై నీవు దబ్బర - లాడిపోయితివి
వ్యర్థజీవనుఁడవై' - యనుగదా! నన్ను
నర్థించి యింద్రాదు - లందఱు వినఁగ
నేల పోవుదు దివి - కేఁ బోక యెచట
నేల నిల్తును సీత - నెడబాసి నపుడె?
హీనమానవు కీర్తి - యెడవాసి నటుల
జానకి ననుడించి - చనియె సౌమిత్రి!
జలకేళి కేఁగెనో? - జానకి పోవఁ
దలఁపదెన్నడు నొంటి - దానెంట బోక."
అనుచు దిగ్గనలేచి - యదెపర్ణశాల
వెనక చాయను సీత - విధమునఁ బోయె
సౌమిత్రి! పొమ్మ"న్న - జని యందు వెదకి
యామేర లేదని - యతఁడు వల్కుటయు
విలపించు నెడ రఘు - వీరునిఁ జేరి
కలఁగుచు సౌమిత్రి - కన్నీరుఁ దుడిచి

—లక్ష్మణుఁడు రాము నోదార్చుట:—

"స్వామి! యాబలిచేతి - జగతిఁ గైకొనఁడె
తామున్న శౌరి సీ - తయునట్ల నీకుఁ

చేకూడు నేటికి - చింతిల్ల నింత
మీఁకు నాపదలు క్ర - మించు ధైర్యమున
నోరుపు గలిగిన - నొచ్చెంబు లెల్ల
దీరు నెవ్వరికైన - ధృతి వదలుదురె ?"
అని వేడుకొనుచుండ - "హా! సీత!" యనుచుఁ

— రాముఁడు మఱల సీతనుఁగూర్చి విలపించుట —

బనువుచు వెలికిలి - పాటుగా నొరిగి
చేతులధరమోపి - శిరమెత్తి యార్తి
"సీత! సీతా! సీత! - సీతా!" యటంచు
కామమోహితుఁడయి - కన్నులు మొగిచి
'వామాక్షి నాచెట్ట - వట్టిన ఫలము
నడవుల నిన్నాళ్లు - నలమట లొంది
కడపట నీరీతిఁ - గడతేఱవలసె"
అని కన్నుదెఱచి "య - ల్లదె వచ్చె వచ్చె
జనకజ యిపుడు - లక్ష్మణ! బ్రతికితిమి
ఎటు వోయితివి సీత! - ఇందాఁక నన్ను
కిటుకులఁ బెట్టి యీ - గేలి సేయుదురె!
తెరవునాకును నీవ - దిక్కింతె కాని
మఱివేరె లేదని - మదిఁ గానవైతె
ఈ శోకవారాశి - యేతెపఁ గడతు?
ఓ శశివదన! ని - ట్లొంటి నేఁగుదురె?
ఏల పాడుగఁ జేసె - దీ పర్ణశాల?
బాల! ప్రవేశింపు - భద్రమాఁగాక"
అని కంటె లక్ష్మణ! - యాసీత నన్నుఁ

గని యేడ్చుచుండగఁ - గరుణింపదయ్యె
సీత యేడది? కైక - చెల్లించుకొనియె
వేతరి నాయమ్మ - వేనోములైన
పురుషార్థముఁడు వీని - పుట్టువు సకల
దురితకారణము వ్య - ర్థుఁడు వెతగాక
యిల్లాలిఁ గోల్పోయి - యేమని వచ్చె
చెల్లరె యితఁడెంత - సిగ్గరి యనుచుఁ
బురికి నేఁగినఁ జూచి - పొడిచి యాడుదురు
నరులెల్ల నీకలక్ష్మ - ణా! ఏది బుద్ధి
హా! కైక! హా! లక్ష్మ - ణా! యేను జనక
భూకాంతుఁ జూచి న - ప్పుడు సీతనడుగ
నేమందు? నీ మాట - యించుక వినిన
నామహేశుడు వాయు - ప్రాణంబు లపుడె
తమ్ముఁడ! నేఁడు నీ - తనుఁ గడగాంచి
సమ్మతించిన కీర్తి - చాలదే నీకు?
ఇట మీఁద నిలిచితి - వేని నాచంద
మెటులౌనొ యాదుఃఖ - మేల చూచెదవు?
పొమ్ము గొబ్బున పురం - బునకు భూజనుల
సమ్మతిఁ బాలింప - సద్ధర్మ నిరతు
భరతుని తోడనా - పలుకుగాఁ దెలిపి
ధరణిఁ బాలింప బో - ధనుఁడవుగమ్ము
కైకసుమిత్రలఁ - గౌసల్యఁ జూచి
వాకొను మందంద - వచనసంగతులు
మెల్లనే తనపాటు - మేదినీతనయ
చెల్లిపోవుటయునుఁ - జెప్పనేర్పరివి

అమ్మలఁ బోషింపు - మని భరతునకు
ముమ్మాఱుగాఁ దెల్పు - ము కుమార! నీవు!"
అనుచు నేడ్చుచుఁ బల్క - నారామచరణ
వనరుహమ్ముల మీఁద - వ్రాలి లక్ష్మణుఁడు
"హా! రామ! హా! జన - కాత్మజా!" అనుచు
భోరున గన్నీరు - పొరలి పాఱంగ
శోకించు లక్ష్మణుఁ - జూచి యేమియును
వాకొన నేరక - వాలెట యొండ
వదనంబువాడ "న - వ్వారె? యువ్వాఁడైన
మదిఁగ్రొవ్వి క్రూరక - ర్మంబులు చేసి
యాపాపముల నెవ్వఁ - డైన నీపాటి
యాపదలకు నోర్చు - నాయనే కాక
పాపముల్ చేసిన - పరిపాటి తనకు
నాపదల్ దొంతర - లై చుట్టుకొనియె
రాజతండ్రి నిజంబు - రాజ్యంబు విడిచి
భూజనంబులఁబాసి - భోగముల్వదలి
యడవులు పట్టి యి - ల్లాలిఁ గోల్పోయి
చెడితోడు చేటులఁ - జేకొనవలసె
నిన్నాళ్లు నీసీత - నెడవాయకుండి
యన్నియు మఱచితి - నన్నిదుఃఖములు
మూట గట్టుక యెట్లు - మోవనోపుదును?
చాటి చెప్పెదఁ దన - చావు సిద్ధంబు!
మఱచితిమోయి లక్ష్మణ! మనచేత
కొఱమాలి చెవులు ము - క్కును బోవనాఁడు
బంతరక్కసివచ్చి - జానకిఁ బట్టి

యింత వేగిరమున - నిటుమ్రింగిపోయె
ఆముక్కుఁడి నిశాటి - యవనిజ నెక్కు
లేమిని చంకఁగీ - లించి పోయినదో ?
తామరసానన - దామరసాక్షి
తామరల్ గోయఁ గో - దావరీనదికి
జనియెనో ! చూతము - సౌమిత్రి ! మున్ను
తనుఁబాసి యొంటిగాఁ - దరలదెచ్చటికి
లోకంబులెల్ల నా - లోకింతు వీవు
లోకలోచనుఁడవు - లోలాక్షి సీత
యెక్కడ నున్నదో - యెఱిఁగింపవయ్య ?
మ్రొక్కెదమిదె కేలు - మోడ్చి మార్తాండ !
ఇలయెల్లజరియింతు - వెప్పుడు నీవు
మలయసమీరణ ! - మా సీత యేది ?
ఆకాశవాణి ! నీ - వైన భూపుత్రి
యేకడ నున్నదో - యెఱిఁగింపవమ్మ !
నీపట్టి యెటువోయె ! - నీవైన సీతఁ
జూపవే కరుణతోఁ - జూచిభూదేవి ! ”

అనునంత సౌమిత్రి - యంజలి చేసి
యనఘాత్మ ! విపదిధై - ర్యమునఁగ వినరె
సకలయత్నముల ను - త్సాహంబె మనుజు
లకు సకలార్థ ఫా - లములండ్రు బుధులు.
సర్వప్రయత్నద - క్షత మదిఁ బూని
యుర్విజ వెదకను - ద్యోగంబు సేయ
జానకి యెటువోవు - జగతిపై లేక
మానునే ? యుండిన - మనకు దాఁగెడినె ?

ఇదివచ్చు వైదేహి - యేమిటికయ్యె
మదిలోన నింతయు - మ్మలికింప మీకు !
చాలింపుఁడని " పల్కు - సౌమిత్రిమాట
నాలకించియు నాలి - యందు విరాళిఁ
దాలిమి లేక " గో - దావరీ సలిల
కేళికి సీత యేఁ - గినదేమొ పోయి
చూచి రమ్మని " పల్కఁ - జూచెద నంచు
నేచాయ నచ్చోటి - యిరుకెలంకులును
వెదకి లేదని వచ్చి - విన్నవించుటయు
మది నమ్మలేక ల - క్ష్మణుఁడును దానుఁ

—: రామలక్ష్మణులు వెదకుచుఁ ద్రోవలోఁగనఁబడిన గుఱుతులచే సీత కొనిపోవఁబడెనని యెఱుంగుట :—

బోయి " గోదావరీ - పుణ్యస్రవంతి !
ఓయమ్మ ! మాసీత - యున్నట్టి చోటు
తెలుపవే ! యన వన - దేవతల్ నదియుఁ
దెలిపెదమనిపూని - దిగులుచే వెఱచి
రావణభయము కా - రణముగా వార
లీవిధం బనకున్న - నినవంశకులుఁడు
'కనమైతి మోయి ! ల - క్ష్మణ ! యింకమీఁద
మనమయోధ్యకుఁ బోవ - మనవారలెల్ల
యేమన్ననేమి ! తా - నింటికి వచ్చి
యామిథిలాధీశు - నతివ మాయత్త
" శ్రీరామచంద్ర ! మా - సీత మీవెంట
నీరాజ్యభోగము - లెల్లనుమాని

వచ్చె, నెచ్చట నుంచి - వచ్చితి ?" రనిన
నచ్చోట నేమందు - నాసాధ్వితోడ !
అన్నింటి మాఱు నీ - యవనిజ చెంత
నున్నఁజాలు నటంచు - మారట చేత
నమ్మివచ్చితి లక్ష్మ - ణా ! నాకు నింక
నెమ్మియిఁ దెలవాఱు - నేమి సేయుదును ? "
అనుచు నట్టటు వోవ - హరిణాది వివిధ
వనమృగంబుల రఘు - వర్యుఁడు చూచి
" మృగశాబకములార ! - మృగశాబనేత్ర
జగతీతనూజ యి - చ్చట నున్నదనుచు
నెఱిఁగింపరే ! యన్న - నెల్ల జంతువులు
బఱువుతో దక్షిణ - భాగంబు నడచి
మఱలి తోడనె నభో - మార్గంబు చూచి
ధరణిపైఁ బొరలి యెం - తయు విలపించి
మృగిఁ బట్టి యందొక్క - మృగమీడ్చి యెత్తి
గగనవీథికిఁ బోవ - గమకింపఁ జూచి
యవుడింగితజ్ఞుఁడై - నట్టి రాఘవుఁడు
" చపలాక్షి నెత్తుక - చనియె రాక్షసుఁడు
దక్షిణంబుగ " నని - తపన బింబంబు
దక్షిణాయనముగాఁ - దరలిన యట్లు
రవితేజుఁడై నట్టి - రవివంశ తిలకుఁ
డవనిజ వెదకుచు - నటఁ బోవఁబోవ
పువ్వుబెత్తులు గొన్ని - పుడమిపైనుండ
దవ్వులఁ జూచి సీ - తాసహాయుండు
"ఇప్పువ్వుదండ తే - నీప్రొద్దె సీత

కొప్పులోఁ దురిమిన - గుఱుతు చూచితిమి
వాడనీయక భూమి - వాయువు రవియుఁ
జాడలోపల నివి - సవరించినారు !
చూచితివే ?" యని - చూపుచు నచట
ప్రాచియాదిశను ప్ర - స్రవణశైలంబుఁ
గనుఁగొని "మాసీతఁ - గానవే" యనుచుఁ
జినుఁగు మృగంబుపై - సింహంబురీతి
గద్దించి "నీవెఱుఁ - గక నేఁడుసీత
ముద్దియ నేర్చునె - మూలల డాఁగ ?
నీవె దాఁచితివి కం - టిని దొంగనిపుడు
వేవేగ దేవిని - విడువుము నిన్ను
నిర్ఝరంబులతో వ - నిశ్రేణితోడ
జర్ఝరితములుగా - శరపరంపరల
నిన్నుఁ జూర్ణము చేసి - నీయందుఁ గాంచి
యున్న మృగంబుల - నొకట మర్దించి
వైచెదనని రఘు - వర్యుండు మఱలి
చూచి, "లక్ష్మణ ! వీఁడు - సులభుఁడు కాఁడు
గోదావరీనది - గ్రుచ్చి యింకించి
యీదుష్టశైలంబు - నినుముగాఁ దునిమి
పొడిపొడి చేసిన - ప్పుడుగాని వీఁడు
పుడమిజ దెచ్చి చూ - పుదురె వేఁడినను ?"
అన విని శైలేంద్రుఁ - డాదశాననుఁడు
తనమీఁదఁ గోపించి - దండించు ననుచు
నేమియు ననలేక - యురుసులు విఱిగి
ఘుమ్ఘూలనో తన - ఘురకటంబులను

జరులలోఁ బడిన కాం - చన రథాద్యములు
ధరణిజారమణు ముం - దటఁ బడవైవ
నాతేరుఁ గనుఁగొని - యటునిటు జూడ
సీత రావణుఁడు దె - చ్చినవేళ నచట
తరువుతోఁ బెనఁగు పా - దంబుల జాడఁ
బరికించి యూచెంతఁ - బడియున్న యట్టి
టెక్కెంబు గొడుగు కే - డియమును వింటి
చెక్కులు హరులు జ - చ్చిన సారథియును
జోడును నెత్తురుఁ - జూచి రాఘవుఁడు
జోడైన దమ్మునిఁ - జూచి యిట్లనియె.
"కండలు నెత్తురు - గంటివే యిచట ?
ఒండొండు కనుఁగొను - ముజ్జ్వలప్రభల
వైడూర్య కవచమె - వ్వనిదియో చినిఁగి
యీడ నున్నది చూడు - మీటెక్కెయంబు
బంగరుగొడుగిది - పడియున్న దొకటి
ముంగలను పిశాచ - ముఖములతోడి
ఖరములు కాంచన - కవచితాంగములు
తెరలి యున్నవి చూచి - తే ? సూతునతని
చేతనున్న తరంటు - చేత నేయుండ
నీతఁడు ద్రెళ్లినాఁ - డిదె గనుఁగొమ్ము !
మాణిక్యమయములై - మహిఁబడియున్న
తూణీరములు పైఁడి - తూపులు గనుము !
హేమచామరయుగం - బిరువుర వ్రాని
యేమేరఁ బడినవా - రిదె విలోకింపు !

—: సీత నెవ్వఁడో పురుషుఁ డెత్తుకొనిపోయెనని రాముఁడు
సకలజగత్తుపై కోపముఁబూనుట —

ప్రాణనాయకి సీత - పట్టున నాకు
ప్రాణపర్యంతమా - పగ గల్గెనిపుడు !
మనసీత యడుగులు - మఁగవాని యడుగు
లెనసియున్నవి కంటె - యీప్రదేశమున
మ్రింగెనో చంపెనో - మేదినీతనయఁ
బొంగిలి నెత్తుక - పోయెనో వాఁడు
నాతోడి పగవాని - నమ్మి ప్రాణములు
పాతకుఁ డెట్లు డాఁ - పఁగ నెంచెనొక్కొ ?
దయచేత సకలభూ - తము లందు నేను
చెయిగాచి యుండుట - చింతింపలేక
యెంతురో యింద్రాదు - లీతనిచేత
నింతయు గారని - హీనసత్త్వునిఁగ !
ధార్మికాగ్రణియయ్యు - తలమోఁచి యేను
ధర్మంబె చేపట్టి - దయఁగల్గి మెలఁగ
నట్టిధర్మమువచ్చి - యడ్డంబుగాక
పట్టియిచ్చెను సీతఁ - బగవానిచేత !
ఇప్పుడే విల్లంది - యెల్లలోకములఁ
జప్పుడు గాకుండ - క్షణములోపలను
హరిహయబ్రహ్మరు - ద్రాదులతోడ
శిరపరంపరలతోఁ - జమరివై చెదను !
వనపర్వతద్వీప - వలితమైన వసుధఁ
దునిమివై చెద నొక్క - తూపు సంధించి
మూఁడులోకంబుల - మొనచేసి యెదురు

వాఁడు గల్గునె? త్రుంప - వలచితినేని!
చంద్రాస్యకై యింత - శరమేర్చి యిపుడె
చంద్రసూర్యాగ్నులఁ - జక్కు చేసెదను!
గ్రహతారకాది న - క్షత్ర కోటులను
మహిఁ గూలనేసి దు - మారంబు సేతు!
కులపర్వతము లేదు - గుదిగ్రుచ్చి యిపుడె
తొలఁగక పొడిచేసి - దుమ్ములు రేతు!
ఏడు వారాసుల - నింకించి పెద్ద
బీడులుగాఁ జేసి - పెల్లగించెదను!
పదునాల్గులోకముల్ - భస్మీకరించి
యిదియది యనకుండ - నేకంబు సేతు!
గ్రక్కునసృష్టి చీ - కట్లు గ్రమ్మించి
చక్కాడి వైచెద - సచరాచరాచరముల
దరికొల్పి సప్తవా - తస్కంధములును
శరవహ్నిచేత వీఁ - చమడంచివైతు!
స్థావరజంగమా - త్మకమైన విశ్వ
మీవేళఁ గోపాగ్ని - కిత్తునాహుతిగ!
ఇలనింగియును నింగి - యిలయును జేతు
తెలియనీయక రెండు - దెరల సేయుదును!
ఇందఱు జానకి - నిప్పుడే నాదు
ముందఱ తమకరం - బులు ముకుళించి
యునిచిన నుంచిరి - యునుపక యున్న
దునిమివైచెదను దొం - తులతోడఁ గూల!
దేవగంధర్వ దై - తేయకింపురుషు
లీవేళ మనసీత - నప్పటికట్లు

వేగంబె నాచేత - విల్లందు మునుపె
జాగుసేయక పర్ణ - శాలలోనుంచి
బోయినఁ బోయిరి - పోకున్న నెటకుఁ
బోయినఁద్రుంతు నే - భువనంబులెల్ల
నూరక తెచ్చిన - నొప్పు కానంగ
నేరుతు మీ ధర - నీతనూభవను!
ముడిచిన పువ్వులు - ముడిచినతీరఁ
దొడిగిన సొమ్ములు - తొడిగిన కరణిఁ
గట్టిన వస్త్రంబు - గట్టినయట్లు
పెట్టిన తిలకంబు - పెట్టినమాడ్కి
వేసిన కీల్గంటు - వేసినజాడఁ
జేసిన వీడెంబు - చేసినపోల్కి
నవ్విన నెమ్మోము - నవ్వినరీతి
జవ్వని దెచ్చియుం - చక మాననిపుడు!"
అని జడల్ సారించి - యమరంగముడిచి
తన చీరములు కటి - స్థలి బిగ్గఁజుట్టి
నుదురు చెమర్పఁ గ - న్నులు జేవురింపఁ
బెదవులు గదలఁ ద - ద్దించి కరాబ్జములు
ముడివడ మును పురం - బులమీఁద నలుక
వొడమ నిల్చిన చంద్ర - భూషణుండనఁగ
"తే విల్లు" తెమ్మని - తీసి సౌమిత్రి
చేవిల్లు చైకొని - శింజినిఁగూర్చి
తనయంపపొదినుండి - తలచూపునొక్క
పెనుఁద్రాఁచు వంటి య - భేద్యశరంబు
వలకేలఁ బట్టి య - వార్య రౌద్రమున

నిలపట్టికై రాముఁ - డిట్లని పలికె.
వినుము "లక్ష్మణ! నాదు - విశిఖరాజంబు
ధనువుతోనిపుడు సం - ధానంబుసేయ
జనులకు ముదిమియుఁ - జావునుఁ బుట్టు
వును గాలమును గర్మ - మును దప్పనట్లు
తప్పదు చూడ మి - త్తరి పర్ణశాల
యిప్పుడున్నదొ లేదొ - యింటిలోసీత!
తోడుగగునే నాదు - తూపని" పలికి
కడునల్కతో లయ - కాలాగ్నిరీతి
పగలింటి సూర్యుని - పగిది నున్నట్టి
జగదేకవీరు కౌ - సల్యాకుమారు
రామచంద్రుని పాద - రాజీవయుగళిఁ
దా మౌళిఁ గీలించి - తలఁకి వేలేచి
యమ్ము సంధించిన - యన్న కేల్పట్టి
సమ్మతపఱప ల - క్ష్మణుఁ డిట్టులనియె.

—: లక్ష్మణుఁడు రామచంద్రుని శాంతింపఁజేయుట :—

"స్వామి! కృపాపర - జలధివి, శాంత
భూమికుండవు, సత్య - బోధాత్మకుఁడవు,
సకల సంరక్షణ - శాలివి, నీకు
నొక సీతకై యిట్టి - యుగ్రభావంబు
తగునయ్య? ఏనిమి - త్తముగఁ గోపించి
జగతి జీవులనెల్లఁ - జంపఁ బూనితివి!
చంద్రుని చలువ భా - స్కరుని వేడిమియు
నింద్రుశౌర్యంబు మ - హిమమా గుణము

నీయందు నీకీర్తి - నిజముగా నెపుడు
పాయ నేర్చునె? యేల - పదరెదవిపుడు!
నేరమొక్కఁడు సేయ - నిఖిలలోకములు
నోరామ! పాలియింప - నూహసేయుదురె?
గుఱుతులు మనమొక - కొన్ని చూచితిమి
వెఱచి పాఱిన నేల - విడుతుము వాని
నెచటికిఁ గొనిపోవు - నీసీత నొకరుఁ
డచలుఁడై మెల్లనే - యరయుదమిపుడు
జానకికై యొంటి - జగడమివ్వోట
నైనది యెవ్వఁడో - యుద్ధంబు వచ్చె!
తెలియుద మిది నీడు - దేవేరి నొకఁడు
ములుచయై కొనిపోవ - మూఁడులోకములు
నీకేమి సేసె? దీ - నికి నింత తెగువ
కాకుత్థ్సకులదీప! - క్రమమానె సేయ?
కారుణ్యమూర్తివి - కల్యాణనిధివి
నీరామ కెవ్వఁడు - నేఁడింత కీడు
దలఁచెనో యట్టి పా - తకు ద్రోహిఁ బట్టి
తలఁద్రుంపుమిది రాజ - ధర్మమై యుండు
భూమిజ వెదకె ని - ప్పుడు చింత యేల?
ఈమానులున్నవా - రేనున్నవాఁడ!
క్రోధింత వెందైనఁ - జొచ్చి జానకిని
సాధింత మింకవి - చార మేమిటికి?
పోఁబడి దెలిసియుఁ - బోనీయ మనము
ఛీ! బీదలమె! యెందు - సీతలేకున్న
సురలవేడుదమట్టి - సురలును సీత

తెరవు చెప్పక యున్నఁ - దీఱని పనికి
నేను గల్గియు మీకు - నేల చింతిల్ల?
జానకిఁ దెచ్చి యీ - శాలాంతరమున
నిలుపుదు వజ్రస - న్నిభములౌ బాణ
ములచేత జగము ని - ర్మూలంబు సేతుఁ!
గాక యీమాటకుఁ - గల్లలాడినను
మీకుఁ దమ్ముఁడనుగాను - మీరల్గ నేల?"
అనుచు వెండియును సా - ష్టాంగప్రణామ
మొనరించి శాంతుఁ జే - యుదునని పలికె.

—. లక్ష్మణుఁడు రామునకుఁ గర్తవ్యమునుఁ దెలుపుట .—

"తపములు గావించి - దానంబు లిచ్చి
జపములు సేయించి - శాంతులు నడిపి
యజ్ఞంబులొనరించి - యమరులఁ గొల్చి
ప్రాజ్ఞుఁడు దశరథ - పార్థివోత్తముఁడు
నోఁచి కన్నట్టి స - న్నుతపుణ్యమూర్తి
వాచక్రవాళ వి - శ్వావనియందు!
ఏ తండ్రి పుత్రకు - నెడవాసిపోలిసె
నోతండ్రి! నీతండ్రి - యొక్కఁడేకాక!
అట్టి యనంత క - ల్యాణగుణంబు
లిట్టిమూర్తి వహించు - నీవల్లఁ దగునె?
నీకు దాసుఁడగాన - నేనన్నమాట
చేకొనఁ బాడి మీ - చిత్తంబులోన
నీవు దలంచు పూ - నికచేత దండ
కావనిలోపలఁ - గల మునీంద్రులకు

నభయమిచ్చిన పూన్కి - యుడియునుఁ దప్పి
సభయులై వారెల్లఁ - జిత్తురీక్షణము!
అందాకనున్నదె - యటు మనవార
లందఱు నిపుడయో - ధ్యాపట్టణమునఁ
బురముతోడుత గ్రమ్మగ్గి - పోదు, రామున్న
భరతుఁడుం జచ్చు కో - పము చెల్లునయ్య?
కోపంబుచేత మీ - కు యయాతిపాటు
ప్రాపించు నిపుడు నా - పలుకు గాదనిన
మన కులగురుఁడు తా - మరసూలి పట్టి
ఘనుఁడు వసిష్ఠుఁడు - కన్నబిడ్డలను
కోపంబుచేత నె - కోల్పోయెఁ గాన
పాపంబుఁ దెచ్చు కో - పము రామచంద్ర!
గ్రహములచేపీడ - గ్రహరాజులైన
యహిమాంశుఁడును జంద్రుఁ - డనుభవించియును
దాళిరి గాక చే - తను గాక శక్తి
చాలక యుండిరె - జానకీరమణ!
దైవయత్నంబె ప్ర - ధానంబటంచు
దేవ! నాతో నాన - తి యొసంగువారు
పని లేదు మీకిట్టి - పలుకు, దైవంబె
యనుకూలమైన నీ - యాపదల్ గలవె?
ఎప్పుడు నింద్రాదు - లేనియు నలిగి
తప్పింప నేర్తురె - దైవయత్నంబు?
దైవయత్నంబుచేఁ - దలఁగిన సీతఁ
గావలెనని యెంత - తపియించినను
వచ్చునె? రావని - వసుమతి నెల్ల

చిచ్చుఁబడియమ్ములఁ – జడిమివై చెడవె ?
మన యదృష్టంబుచే – మాఱలిన మాఱులె,
జనకజ రాకున్నఁ – జచ్చిన వారి
తోడి పాటగుఁగాక ! – తొయ్యలి కొఱకు
మూఁడులోకముల ని – ర్మూలింప నగునె ?
ఈ వియోగమునకు – హేతువు లేక
పోవునె ? సీత య – ల్పుని భార్యకరణి
స్వామి ! ప్రాకృతునికై – వడి శోకమోహ
తామస వృత్తులఁ – దల్లడింపుదురె ?
పడుచుఁ వాఁడాడిన – పలుకని నీవు
కడవఁద్రోయక వివే – కము దెచ్చుకొనుము.
ప్రాజ్ఞుఁడ వెఱుఁగుదు – వాత్మలో నిట్టి
యజ్ఞాన మితరుని – యట్ల పొందుదురె ?
నూరోత్తములు శుభా – శుభకరములు వి
చారించి చేసిన – సౌఖ్యమొందుదురు !
అవుగాములెఱిఁగి హి – తాలోచనములఁ
దవులని వారలు – తలఁచి కామించు
క్రియలు ఫలించునె ? – కీడాచరింప
నియతమె భుజశౌర్య – నిర్వాహకులకు ?
చేతనానని మీరు – సృష్టిలోఁ గలుగు
భూతకోటుల నెల్లఁ – బొలివుచ్చఁ దగునె ?
ఎంతటి పనియిది – యెవ్వాఁడు మనకు
నింతద్రోహము చేసె – నెటులైనఁ గాని
వెదకి వాని వధించి – వెలఁదిని మఱల
బ్రదికించి సాధించి – పగఁ దీర్చుకొనుము !

అయ్యా! బృహస్పతి - మైనను మిమ్ము
నియ్యెడ బోధింప - నెంతటి వాఁడు!
మిమ్ము మీరెఱిఁగి భూ - మిజఁ దెచ్చు బుద్ధి
నమ్మతింపుఁడు శౌర్య - సమయంబు గాదు
దేవతలకుఁ గల - దే! శక్తి మీదు
భావ మిట్లని యెఱు - పఱచి కానంగ
నతశౌర్య! దేవమా - నుష పరాక్రమము
లతిశయంబుగఁ గల - వని మిమ్ము నెఱిఁగి
రాణివాసద్రోహి - రాక్షసుఁ బట్టి
ప్రాణముల్ గొనుట ద - ర్పంబవుగాక
వట్టి పాపంబు జే - వశ్రేణి నేలఁ
బట్టి చంపుదురె మీ - పాటి ధార్మికులు!
వదలుము శోకంబు - వాయువు చేత
గదలునే మేరువు? - గాన సైరింపు
చాలించి నాకు ప్ర - సన్నులై మహికి
మేలెంచు" మనిన నే - మియు ననలేక
పరమకారుణ్యుఁడై - భవసాగరుండు
ధరణిజఁ బాయు ఖే - దమున నాగ్రహము
రానీక నిలిపి సా - రగ్రాహి గాన
జానకీపతి మహా - సారాంశమైన
తమ్ముని మనవి చి - త్తమ్మున నునిచి
యమ్ము ద్రేలఁగవైచి - యల్లైన వదలి
మీఁదటి కార్యమే - మియుఁ గానలేక
సోదరు నెమ్మోముఁ - జూచి యిట్లనియె.
"ఏమి సేయుదు నింక - నెచటికిఁ బోవ

నే మందు వేచంద - మింతిఁ దెచ్చుటకు?
నాతోడ నాలోచ - నముచేసి పలుకు”
నాతోడనన లక్ష్మ - ణుకుమారుఁ డనియె.
“ రాజీవలోచన ! - రఘురామ ! చూత
మీా జనస్థానంబు - నీ పంచవటియు
వెదకుద మిచ్చోట - విపినభూములను
నదులునుఁ బొదరిండ్లు - నగములు గుహలు
చరులును బిలములు - సానువుల్ తావి
విరులతోఁటలు నిండు - వెదుకంగఁ గలదు,
ఇందులఁ గ్రీడింతు - రెప్పుడు నమర
సుందరుల్ కిన్నర - శోభనాంగులును
రమ్ము పోద” మనంగ - రాజాస్య నన్న
దమ్ములు వెదకుచు - ధనువులమ్ములను
జతనమ్ములుగఁ బట్టి - శత్రులఁ దునుము
యతనమ్ముఁ గని చాయ - నై వచ్చి వచ్చి

—రామలక్ష్మణులు సీతనువెదకుచు జటాయువునుజూచి సీత వృత్తాంత మెఱుఁగుట :—

ముందటఁ గన్నులు - మూసుక వ్రాలు
మందరగిరి వోలి - మాంసర క్తములఁ
దొప్పఁ దోఁగిన మేని - తోడ జటాయు
వప్పుడు బడియుండ - నల్లంతఁ జూచి
కంటివే మనజన - కతనూజ యింట
నొంటి యుండగఁ బట్టి - యొడకమ్రింగి
కొరళుక గుటిక మ్రిం - గిన సిద్ధుఁడగుచు

నరిగించు కొనఁగ సా - ఖ్యమున నున్నాఁడు!
మాయామృగమురీతి - మతియొక్క దైత్యుఁ
డీయెడ గృధ్రమై - యిటులున్న యపుడె
తలఁద్రెవ్విపడ నిశా - తశరంబు చేత
చులకగా నేసెఁ - జూడు" మీవనిన
నోటిలో నిండిన - నురుగు నెత్తురులు
మాటాడ సత్తువ - మాని గ్రక్కుచును
మెల్లనే యొకనేర్పు - మీఁ గన్నుఁదెఱచి
చల్లగాఁ గని రామ - చంద్రుతోఁ బలికె.
"అన్న! నీకెపుడు దీ - ర్ఘాయువౌఁగాక!
నిన్నుఁ జూచిన దాఁక - నిలిచెఁ బ్రాణములు!
శ్రీకరంబైన సం - జీవినీలతికఁ
జేకూడ వెదకుచుఁ - జేరినయట్లు
యేయింతిఁ గోల్పోయి - యిటకుఁ జేరితిరి
యాయమ్మ నొకరావ - ణాసురుఁడనెడి
దనుజుఁడెత్తుకపోయె - దక్షిణదిశకు
తనప్రాణములతోడఁ - దగఁ బెనవైచి
వానిచేఁ జచ్చియి - వ్వసుమతిఁ బడిన
వానిఁ జంపఁగమీరు - వచ్చుటచ్చెరవు!
చచ్చినవానినే - జంపెద ననఁగ
వచ్చునె? యోరఘు - వర! జటాయువను!"
అనిసీతతోఁ గూర్చి - యాడినమాట
విని శోకమోహముల్ - ద్విగుణితంబైన
చేతులనున్నట్టి - సింగాణి విండ్లు
భూతలంబునవైచి - పొక్కుచుఁ గదిసి

యిరువురు పైఁబడి - యేడ్చి "హా" యనుచు
మరుగుచుఁ "బోయెదే - మాతండ్రి" యనుచుఁ
గౌఁగిలి వదలక - కన్నీరుమీని
పైఁగాలువలు వాఱఁ - బక్షీంద్రుమీఁది
మమతచే శోకించి - "మరణమిట్లేల
సమకూడె పక్షిరా - జా!" యంచునడిగి
"ధరణి యొక్కనికిచ్చి - తండ్రిఁబోనాడి
యురకె కానలువట్టి - యొంటిగా వెంట
నమ్మి వచ్చినయట్టి - నాతిఁ గోల్పోయి
యిమ్మీఁద నినువంటి - యాప్తబాంధవుని
చావు చూచితి మన - స్తాపదావాగ్ని
యేవెంట నారునే - నెందులోవాఁడ
దహియించు నన్నియు - దహనుఁడా దహను
దహియించు నాదు సం - తాపానలంబు!
ఇంకించు వారాసు - లేనియు కలుష
పంకాత్మకుని నన్ను - భంగించుటెంత!
నాకొఱకీవు ప్రా - ణంబు లిచ్చితివి
నీకుఁ బ్రత్యుపకృతి - నేఁ జేయఁగలనె?
పటుశోకవాగుర - పాశంబుచేత
నిటు గట్టువడి పార - మెఱుఁగక యున్న
ననువంటి భాగ్యహీ - నజనుఁడు జగతి
వనధి పర్యంత మె - వ్వఁడు గల్గనేర్చు
మాతండ్రి కీవు స - మానమౌవయసు
చేత మించుటెకాదు - చెలికాఁడ వీవు
నాపాపకర్మంబు - నాదైన యట్టి

యాపదవేళకు - నడ్డంబురాఁగ
నిను బడవైచె దీ - నికి నేమి సేతు ?"
అని జటాయువు మేని - హస్తాంబుజముల
నివురుచుఁ బక్షీంద్రు - నెత్తురులంట
కవుఁగలించుక "యన్న ! - ఖగసార్వభౌమ !
ఏమాయె మాసీత - యెక్కడ బోయె !
ఏమంట యెత్తుక - యేఁగినవాని
నెవ్వఁడు ? వాని యా - రెయ్యెడ" దనుచు
నవ్వేళ మఱుమాట - లాడలేనట్టి
యా జటాయువుఁజూచి - "హా ! పక్షిరాజ !
హా ! జానకీ !" యని - యవనిపైఁ బొరలి
క్రమ్మర లేచి యా - ఖగరాజుఁ జూచి
తమ్ముఁడు విన రఘూ - త్తముఁ డిట్లులనియె.
"నీపాటుఁ జూడక - నేస్వకార్యముగఁ
బాపంబులకు నోర్చి - పలుకరించెదను !
ఇట మీఁద నినువేఁడ - నేమియు సీత
నెట వలెఁ గొనిపోయె ? - నించుక పలికి
యురకుండు "మన విహ - గోత్తముఁ డొయ్య
మఱలంగ రఘువంశ - మణికి నిట్లనియె
"ఏరీతిఁ దెచ్చెనో - యెఱుఁగ రావణుఁడు
మీరమణీమణి - మింటి మార్గమునఁ
దేరుపై నుంచుక - దిక్కేది పోవ
"హా ! రామ ! హా ! రామ !" - యను నార్తరవము
చెవిసోఁకి యడికట్టి - చేసితిఁ గయ్య
మవి వాని తురగంబు - లది వాని రథము

యిది టెక్కె మిది గోదు - గిది తనుత్రాణ
మిది శరాసనము సూతుఁ - డితఁ డూడిగములు
చామరహస్తు లి - చ్చటఁ బడి యున్న
చామనచాయ రా - క్షసు లిరువురును
నివి వాని హస్తంబు - లేనిట్లు ఘోర
జవము సత్త్వంబును - సన్నమాటయును
తనఁ బడనఱికి యా - తఁడు సీతఁగొనుచు
ననుపమాత్మీయ మా - యాబలప్రౌఢి
నొకమబ్బు నొకవాన - యొకగర్జితంబు
నొకగాలి కల్పించి - యొక్కఁడు నందు
నవ్వారిఁ గననీక - యేఁగె వాఁడెటుఁగఁ
డవ్వేళ విసగడి - యలఁ బట్టినాఁడు
ఆముహూర్తము వింద - యందురుగాన
భూమిజ నిను వచ్చి - పొందు నిక్కముగఁ
బదిగడియలకైనఁ - బదినాళ్లకైనఁ
బదినెలలకునైన - పైఁ బనిలేదు
రామ! ఈవేళ సూ - ర్యస్వరం బొదవె
కామితసిద్ధి ని - క్కముగ నీకొదవు!
కాలంబునకుఁ జిక్కు - గండెయుఁ బోలి
కాలునిచేవశం - గతుఁడయి వాఁడు
పోయెను దక్షిణం - బుగఁ గుబేరునకు
దాయాది యనఁగ వా - తను క్రొవ్వుదొట్ట!
ఆవిశ్రవసుపుత్రుఁ - డఖిలకంటకుఁడు
రావణుఁడన" నోట - రక్తంబు గ్రక్కి
"యేమేమి యెటకుఁ బో - యె"? నటంచు నాగ

రాముఁడు హస్తసా - రసములు మొగిచి
యెదుగఁగా బిరబిర - నశ్రులు ద్రిప్పి

—: జటాయువు మరణము - శ్రీరాముఁడాతని కగ్ని సంస్కారాదులఁ జేయుట :—

విడిచెఁ బ్రాణంబు లా - విహగనాయకుఁడు !
తల వ్రేలగిలవైచి - తనకాళ్లు రెండు
యిలఁ జక్కగాఁ జాచి - యెఱకలు వదలఁ
బడిన జటాయువు - పైఁబడి రాముఁ
డడలుచో లక్ష్మణుఁ - డటులపై వ్రాలి
"నీకు నీక్రియ వచ్చె - నే మూర్తి !" యనుచు
శోకింపఁ దమ్మునిఁ - జూచి రాఘవుఁడు
"వినుము సౌమిత్రి ! యీ - విపినంబులోన
దనుజుల నింతయుఁ - దాలెక్కగొనక
వీరుఁడై యరువది - వేలేండ్లు బ్రదికి
యీరాక్షసునిచేత - నిలమీఁదఁ గూలె !
సీత నేఁడొక్కని - చెఱఁ జిక్కిపోవ
సీతఁడడ్డమువచ్చి - యిచ్చెఁ బ్రాణములు
జానకిఁ బాయువి - చారంబదెంత !
ఈ నిర్మలాత్ముఁ డ - నేక పక్షులకు
రాజటు విహగ సా - మ్రాజ్యంబు మాని
యాజిలోఁ బడియె నా - యవసరంబునను !
వృద్ధుఁడు దశరథ - విభునితో మొదల
బద్ధ సఖ్యము జేసి - పరమాప్తుఁడగుచు
నున్నమాత్రమె కాక - యొక్కఁడు నెదిరి

వెన్నీక రణములో - విడిచె బ్రాణములు !
శూరులు ధార్మికుల్ - సూనృతపరులు
ధీరులు నున్నారు - తిర్యగాత్ములును
నితని దహింపుద - మిపుడని'' కాష్ఠ
వితతి యమర్చిపై - విహగేంద్రు నునిచి
మథనాగ్ని వేగ ల - క్ష్మణుఁడు దెచ్చుటయు
వ్యథనొందుచును రఘు - వర్యుఁ డిట్లనియె.
"పక్షిపుంగవ ! నీకు - పరమధార్మికులు
దీక్షచే యాగముల్ - దీర్చుపుణ్యులును
ఆహితాగ్నులు కామి - తార్థదాతలును
సాహసాధికులును - చనునట్టిగతికి
నాయనుగ్రహముచే - నాచేత నైన
యీయగ్నిసంస్కార - హేతువుచేత
నీవు వొందుదువని" - నీడజస్వామి
నావేళ దహియించి - యచ్చోటినదిని
స్నానంబు గావించి - తర్పణక్రియలు
పూనికఁ దీర్చి యా - పురుషరత్నములు
మమతతో వనమృగ - మాంసపిండములఁ
గ్రమమున నిడి మచ్చి - కను బ్రీతుఁ జేసి
క్రమ్మఱ మునిఁగి రా - ఘవులు శోకించి
యమ్మేరఁ బాసి వా - రవ్వలఁ జనగ
నాయెడ బంధు కృ - త్యంబుగా వారు
సేయు సంస్కార వి - శేషంబు వలన
నమరత్వమునఁ బొంది - యచ్యుతపదవి
నమరె జటాయువ - య్యర్కవంశజులు

నాకత్రోవఁ జనుచు నిం - ద్రోపేంద్రులనఁగ
నికటాటవిని ధర - ణిజఁ జూతమనుచుఁ
బడమరగాఁ గొంత - పయనంబునడచి
యడవిలోపల దక్షి - ణాశగాఁదిరిగి
శరచాపహస్తులై - సన్నమానడవి
తెరువునఁ బోవుచో - తెరువేరుపడక
కాలుమోపఁగరాని - కఱకురానేలఁ
గాలిద్రోవైనను - గానక పొదలు
కోరింద పొదలును - గుంపెనగచ్చ
యీరంబులును శమీ - వృక్షముల్ తుమ్మ
మ్రానులు చంద్రలు - మద్దులొద్దులును
రేనులుఁ బెనఁగి దూ - రియుఁ బోవరాక
పాములు గాములుఁ - బందులు పులులు
చీమలు దోమలు - జీంద్రుమనంగ
నట్టికాఱడవిలో - నర్ధయోజనము
పట్టునఁ గ్రౌంచాఖ్యఁ - బరగుకాననము
చేరి యయ్యడవిలో - సీతనువెదకి
వారుగాసిక కొంత - వడివడదీరి
బరవసంబున మూఁడు - పరువులనేల
యఱిగివారలు మతం - గాశ్రమంబునకుఁ
జనుబుద్ధితో నడు - చక్కిఁ జీకట్లు
పెనఁగొన్న యొకశైల - బిలము వీక్షించి

—: లక్ష్మణుఁ డయోముఖిని విరూపనుఁ గాఁజేయుట :—

చేరి యాచెంగటఁ - జీరాడుకడుపు
కోఱలు నెట్టవి - గుండ్లనువీఁచు

తలవెంట్రుకలు క్రూర - దంతముల్ గదురు
వలచుమేనట్టల - వంటిచన్నులును
బిల్లకాళ్లును మొద్దుఁ - బిక్కలు పెద్ద
పల్లముముక్కు చ - ప్పటయైన పిఱుదుఁ
గలిగిలక్ష్మణుఁజూచి - కామాంధయగుచు
వలకేలు వట్టియా - వలవచ్చి రాము
సడ్డసేయక "నీకు - చాలలోనైతి
వెడ్డువెట్టినసిన్ను - విడిచి పోఁజాల
నీపుణ్యఫలమిది - నేనయోముఖిని
వీపుపై నినుఁదాల్చి - విహరింపనేర్తు
నెటువలెయుంటివో - యిన్నాళ్లుగొంటి
నిటమీఁదననుఁ గూడి - యెల్లకాలంబు
రాజునువలెఁ గాపు - రము సేయుమీవు
నాజవ్వనంబు మా - నంబు నీసొమ్ము
కౌఁగిలిమ్మనిపల్కుఁ" - గన్నెఱ్ఱఁజేసి
తాఁగత్తిజళిపించి - తలపట్టివంచి
చెవులునుముక్కునుఁ - జండ్లు పోఁగోసి
రవణంబుఁజెఱిచి పా - ఱంగఁ దోలుటయు
నతిభీతిచేఁ బారె - నామడమేర
నతిగని రఘువీరుఁ - డలఁతినవ్వొలయ
నావలజను చోట - నపశకునములు
భావించి యన్నతోఁ - బలికె లక్ష్మణుఁడు
భూమిజారమణ ! యి - ప్పుడు మదిఁగలఁగె
నేమిటోయదరెడు - నెడమభుజంబు

యెప్పుడు నాకైన - యీనిమిత్తములు
తప్పవేక్రియ నుపద్ర - వములందెదమొ ? ”
అనియొక నాలుగై - దడుగులమేరఁ
జనునంత నట్టహా - సము నింగిముట్ట
నొకమ్రోఁత వినవచ్చె - నురుమునుఁబోలి
యొకదుమ్ముతో గాలి - యునుఁ జుట్టుకొనియె.
విని యాటదోయను - వేళ వంజులక
మనుపక్షియొక్క మ - హాశాఖనుండి
యెలిచిరొప్పినఁ గంటె - యీపైఁడికంటి
గెలుపుచెప్పెడి నేమి - కిటుకురాఁగలదొ ?
యన్నియుఁగనుఁ గొంద - మనుచు సౌమిత్రి
యన్నతోనాడియు - నాడకమునుపె

—: కబంధ దర్శనము —

యేమ్రోఁతవినవచ్చె - నెందుండియెచట
నామ్రోఁతలో పర్వ - తాకారుఁడొకఁడు
కాటుకబలుఁ గొండఁ - కైవడి పెద్ద
మోటురీతిని నురం - బున తలమొఱయ
పచ్చనై మండుచుఁ - బటువైనకొమ్మ
బొచ్చులో తెల్లని - పునులు జాఱంగ
పెనుబొమ్మ పైనొఁడ - భీమదృష్టులనుఁ
గనుపట్టు నొక పెద్ద - కంటఁ జూచుచును
పంది కొమ్ములవంటి - బలుకోఱలమర
కందినమై చాయ - కడలిర్లు కొలప
వెడలుపౌ బొందితో - వెంట్రుకల్మైన

పొదువాటి దబ్బనం - బుల చాయనిక్క
సెలవులు నాలుక - చేనాకి కొనుచు
బలియుఁడౌ యోజన - బాహుకబంధుఁ
జేతులఁ జిక్కిన - సింహాదిజంతు
జాతంబు మెసవురా - తనుఁ దేటచూచి
తలలేని మొండెమై - తమపోవు త్రోవ
తొలఁగి రాకుండ చే - తులు బారఁజాఁచి
యుండు దానవుఁజూచు - చుండుచోనాఁడు
చుండు నేలనె యుండి - యొడిసి హస్తముల
పరువు నేలనె తమ్ముఁ - బట్టుక తివిచి
పిరువీకుడులు చేసి - భీతివుట్టించి
యెక్కుడునట్టి వీం - డ్లిందుకో కాని
చిక్కరి పొమ్మని - చేరఁద్రోయంగ
ధైర్యంబు వదలక - తల్లడ పడక
శౌర్యసహాయుఁడై - జానకీ విభుఁడు
యేమియు ననకున్న - నెట్లకోయనుచు
సౌమిత్రి చాలవిచా - రంబు నొంది
యొక్కడనైతిమి - యొడిచి మ్రింగెడును
దిక్కెదియని గుండె - దిట దప్పి చెదర
బాలుఁడు గావున - బ్రదుకుపై యాస
చాలంగఁ గలిగిల - క్ష్మణుఁ డిట్టులనియె
" అన్న ! చిక్కితిమి గ - దయ్య ! యీయసుర
నిన్ను నన్నునుఁ బట్టి - నేఁడు మ్రింగెడును
యిరువురి శోనియుఁ - డెట్లైన వీని
చెఱకు నన్నొప్పన - చేసి నీవారి

తప్పించుకొనిపొమ్ము - తనవంటివార
లిప్పుడుంచిననుం బో - యిన నేమిఫలము ?
నీవుగల్గినఁజాలు - నీదేవిఁ గూడి
దైవంబు తోడుగా - ధరణి యేలుచును
సాకేతనగరిలో - జనకజతోడ
వాకొని యొకమాట - వచ్చిన యపుడు
ననుఁ దలఁపుఁడు గాద - నఁగ నేలమీకు
మనమిర్వరముఁ గూడి - మడిసిపో నేల ? ”
అనిన వత్సలతను ద - యాజలరాశి
మనసు గలంగి ల - క్ష్మణున కిట్లనియె
“ ఏలయింత విచార - మింకటి పనికి
బాలక ! నీకిట్లు - వలుక ధర్మంబె ?
యేనుగల్గఁగ నని - యీమాట వలుకు
లోనుగా వాఁడు శా - లుని రీతిమండి
మీరలెవ్వరు ? పేరు - మీకెద్ది ? యేమి
గారణంబుగ నిట్టి - కంటకాటవికిఁ
జేరితి రాఁకటి - చేనున్ననాకు
మీర లాహారమై - మించితి రిపుడు
కైదువుల్ నట్టి శృం - గములతో నొప్పు
పీదిలోపలి మహా - వృక్షంబు లనఁగ
పోలిక నాముఖం - బునఁ బడినారు
చాలింపుఁడిఁక నాకు - చావు సిద్ధంబు ”
అనిన మాటలు విని - యాస్యంబువాడఁ
గని తమ్ముఁజూచి రా - ఘవుఁ డిట్టులనియె
“ అక్కటా ! మనము రా - జ్యమునకుఁ బాసి

యిక్కడ నొకఁడింతి - నెత్తుకపోవ
నరయుచుఁ గడలేని -యాపదనొంది
తిరుగుచునుండ న - దృష్ట మీరీతి
వచ్చునే మనవంటి - వారికి నెందు
నెచ్చోట నెవ్వారు - నెఱుఁగనికీడు
కాలంబు దొడ్డది - గావునదాని
వేలుపులకు గెల్చు - విధమేఱు పడదు
దైవంబునకు హెచ్చు - తక్కువ లేదు
కా వడ్డములు వివే - క పరాక్రములు
యిసుముకట్టలు నది - నేరీతినాఁగు
పొసఁగవు వ్యర్థమై - పోవునంతయును"
అనిసత్య ధర్మ ప - రాక్రమశాలి
జనకజాభర్త యో - జన సేయుచుండఁ
జూచి కబంధుఁ ''డి - చ్చోనాకుఁ దగిలి
యీచాయ గుజగుజ - లేల పోయెదరు ?

— రామలక్ష్మణులు కబంధుని హస్తములను ఖండించుట .—

విధిపడనీ పని - విధమునఁ దనకు
నదనుకు దొరికితి - రాహార మగుచు
రండు కూర్చుండుఁ డూ - రక తామసింప
నుండలేఁడు కబంధుఁ - డోర్చియూఁకటను''
అన తెల్విఁ దెచ్చుక - యన్న నెమ్మొగముఁ
గనుఁగొని యులికి ల - క్ష్మణుఁ డిట్టులనియె.
''చేతులే వీని యా - స్తి మ రేమి లేదు

హేతిచేఁ దెగవ్రేత - మిరువుర మెదిరి
వీరి వారినిగెల్చు - విధమున మనల
నూరక దిగమ్రింగ - నూహించె వీఁడు
యూపంబు చెంగట - నూరకయుండు
నాపశువులఁ బోలి - యల్పులరీతిఁ
జచ్చుట నిజమయ్యెఁ - జంకలకత్తు
లెచ్చుట నేరని - కింక డాఁచెదము ?
చేతనైనట్లు చూ - చినఁ గాక తీర
దీతఁడనని హేతి - నెడమ భుజంబు
ధరఁగూలఁదా నేయ - దక్షిణ భుజము
నరకె సీతాప్రాణ - నాథుఁడు దునియ
నెప్పుడు తనచేతు - లిలమీఁదఁ ద్రెళ్లె
నప్పుడే బలుకొండ - యనకబంధుండు
కూఁతలచేత ది - క్కులు పెల్లగిల్ల
రోఁతపుట్టఁగ నెత్తు - రులు మేననిండ
గదలక మెదలక - కడు దైన్యవృత్తి
సదయాత్ముఁడగు రామ - చంద్రున కనియె

—: కబంధుని పూర్వవృత్తాంతము :—

" ఓరాజ సుతులార ! - యుగ్రహాసాహసులు
మీరెవ్వరయ్య ! యే - మిటికి వచ్చితిరి ?
వినవలతును చేరి - వినిపింపుఁడనిన
దనుజునిఁగని సుమి - త్రాపుత్రుఁ డనియె
" ఏముదాశరథుల - మితఁడు రాఘవుఁడు
సౌమిత్రినేను య - జ్ఞనకుని యాజ్ఞ

వనులనుఁ గ్రీడింప - వచ్చితి మిచట
జనకజ సీరాము - చంద్రుని దేవి
వంచించి నేఁడురా - వణుఁ డనువాఁడు
పొంచి యెత్తుక పోవఁ - బోనీకమేము
వెనుకొని సీతను - వెదకుచువచ్చి
నినుగంటి మెయ్యది - నీదు చందంబు
పరమొండె మునుఁబోలి - పదములులేక
శిరమురంబునఁ జాల - చేతులుఁజాఁచి
యాకతంబుననుండ - నెవ్వఁడ వనిన"
కాకస్వరమున రా - ఘవుల కిట్లనియె
"మీకునిప్పుడు సేమ - మే ? యన్నలార !
నాకుమున్నింద్రుఁడా - నతి యిచ్చుమాట
కలివచ్చె రామల - క్ష్మణు లాదరిపుడు
తఱివచ్చె దనకుఁ నిం - తయు నిక్కవంబు
పుడమిపై వెదకుచుఁ - బోయెడి తెవె
యడుగిలఁ దగులుకొ - న్నట్టి చందమునఁ
దన పుణ్యమున కర - ద్వయము నూఱిల్లి
తునిమి వైచితిరి క - త్తుల చేతనరికి
తనకిట్టి వికృతగా - త్రంబు ప్రాపించు
ఘనమైన హేతువు - గలదెట్టు లనిన
నాదికాలంబున - నాదిత్యులందు
నాదిత్య చంద్రాన - లాభ తేజమున
మీఱుచు దారిలో - మేటినై సత్య
సారంబుచేఁ గ్రొవ్వి - చాలగర్వమున
నిట్టి వాళికముతో - నెల్లర వెతలఁ

బెట్టుచు వెఱపించి - బెదరింపుచుండ
చెంతకు నొకస్థూల - శిరుఁడనుమౌని
యంత నింతటవచ్చి - యతిఘోరమైన
వేషంబు తోడ నన్ - వీక్షించి వెఱచి
కాషాయ వస్త్రంబుఁ - గటి సీమఁ జాఱఁ
గందమూల ఫలాది - కంబులు భీతి
నందుఁ బాఱఁగ వైచి - యార్తిచేఁ బరవఁ
గనియేను నన్వీనఁ - గాంచి " యమ్మౌని
ననుఁగానెఱింగి మా - వనములో నలిగి
యిట్టిభూమిక తోడ - నిందుండు మనుచు
దిట్టి శపించినఁ - దీఱనివగల
నడలుచు నమ్మౌని - యడుగులవ్రాలి
కడు వేఁడుకొన్నచోఁ - గరుణించి యతఁడు
రామ లక్ష్మణులీ య - రణ్యంబులోన
నీమీఁద నలిగిన - నీదు కేల్దోయి
తునిమి మేను దహింపఁ - దోడనే ముక్తి
గనియెదవని " భావి - కార్యమూహించి
ననువీడుకొని పోయి - న యనంతరంబ
దనువను వానికిఁ - దనయుఁడ నగుచుఁ
దమ్మి చూలినిఁగూర్చి - తపమాచరించి
కొమ్మని యతఁడు నా - కు వరంబులొసఁగ
నావరగర్వ మ - హానుభావమునఁ
గావరంబున బల - గర్వంబు దొట్టి
పాకశాసను తోడ - 'బవరంబుసేయ
చేకొద్ది వజ్రంబు - చేతన శిరము

నరికిన తలఁద్రెవ్వి - నరములతోడ
నురముపై వ్రేలాడు - చున్న నేవెఱచి
శరణన్న నింద్రుఁడు - జలజసంభవుని
వరముతోఁ బాలించి - వధియింపఁడయ్యె
యెన్నినాళ్లిటులుండు - నేనంచు నడుగ
తన్నుఁగన్గొని యిట్లు - తలయుండఁజేసి
కడుపులో నోరిచ్చి - కరయుగళంబు
నిడుపుగాఁ బాలించి - నీదు చేతులకు
దొరకినయట్టి జం - తువుల మ్రింగుచును
చరియింపు మని పల్కె - సౌమిత్రితోడ
శ్రీరాఘవుఁడు వచ్చి - చేతుల హేతి
ధారచే ఖండించి - దహియించునప్పుడు
గాంతువుముక్తి యి - క్కడననిపోవ
నింతగాలంబునే - నీగహనమునఁ
జేతికి లోనైన - సింహాదిజంతు
జాతంబు నిన్నాళ్లు - చలపట్టి మ్రింగి
వచ్చితి నేను మీ - వదనముల్ గంటి
నిచ్చోటనాకోర్కె - లీడేరె నిపుడు
నమరేంద్రుఁడును కల్ల - లాడెఁగా యనుచు
మిముఁ గన్నదనుకన - మ్మిక చాలదయ్యె
రామలక్ష్మణులు మీ - రలె నిక్కువముగ
సామాన్యుఁడ కవై - శ్వానరుఁ దెచ్చి
తనమేను మీరలు - దహియింపు డందు
ననుపమవాక్ సహా - యంబు చేసెదను
నామాట మీ రెన్ను - నములకు హితము

సేమంబునియ్య నే - ర్చినది గావునను
కావింపుఁడట్లు" నఁ - గని రఘువరుఁడు
భావించి ప్రీతిఁ గ - బందునకనియె
"ఏము లేనట్టిచో - నింటిలోనున్న
భూమిజఁ జెఱఁగొని - పోయె రావణుఁడు
యింతమాత్రంబె మే - మెఱుఁగుదు మతని
నింతటి వాఁడని - నిది నెలవనియు
నెఱుఁగ మేరీతివాఁ - డెచ్చటనుండు
పరిజనం బెంతయే - పట్టణంబునికి
మా సీత యేమయ్యె - మఱినీవెకాని
యీసుద్ది దెలుపువా - రవ్వరు లేరు
యేమనాథలము ది - క్కెఱుఁగక వెతల
సీమాడ్కి నడవుల - నెటుబోదు మనుచు
చేబారలిడుచోటఁ - జేసినపుణ్య
మీబాంధవునిఁదెచ్చి - యిచ్చెనుమాకు
నోయయ్య! తెలుపవే - యొకమాట యనిన
వాయెత్తి యిట్లని - వచియింపలేక
సింధురగమనుఁడా - శ్రీరాము ప్రాణ
బంధుఁడైనట్టి క - బంధుఁ డిట్లనియె
"సీతకార్యము మీకుఁ - జెప్పెద దహన
హేతిలో వైచి ద - హింపుము నన్ను
అంటిది దహియించి - నప్పుడుగాని
యంటదు నాకు ది - వ్యజ్ఞానశక్తి
యిట్టిపాపంబుల - కిరవైన మేన
నెట్టు దెల్పుదుమీర - లెంచిన తలఁపు

రావణు నెఱుఁగ కా - రణమేమినాకు
దేవత్వమునఁగాని - తెలివిడిగాదు
కపటాత్మఁగానన్నుఁ - గననేలమీకు ?
నిపుడొక్క యుపకార - మేను చేసెదను
సేయుఁ డొక్కనితోడఁ - జెలిమి వాఁడెఱుఁగు
నీ యఖిలావనీ - వృత్తమంతయును
లోకంబులెల్ల నా - లోకించినాఁడు
మీకుఁగావలయున - మేయసాహసుఁడు
అతనివర్తనము మీ - కాద్యంతములుగ
హితమతితోఁ దెల్ప - నిపుడేఱుపడదు
కరుణతోనగ్ని సం - స్కారంబుచేసి
పరిశుద్ధుఁ జేయుఁ డీ - పట్టున"ననిన
బిలములోఁ బడద్రొబ్బి - పేర్చియామీఁద
బలువైనకట్టులు - వఱచికాల్చుటయు
నేతిముద్దయుఁ బోలి - నిర్జరవైరి
వీతిహోత్రములోన - వెలుఁగుచు దీప్తి
యుతుఁడైన యట్టి యా - హుతవహునందు
నతిశయజ్వాలా స - మన్వితంబగుచు
నొక్కతేజమువోయి - యుడు వీథినుండి
చక్కని యచ్చర - సతులుఁ గొలువ
నవరత్నమయవి మా - నంబెక్కి దాన
దివిజుఁడై భూషణ - దీప్తులు వెలుఁగ
నిలిచి రాఘవుఁజూచి - నీరదనినద
విలసనధ్వనితోడ - విభుఁడిట్టులనియె,

—: కబంధుఁడు నిజరూపమునుఁ బొంది తగిన
మిత్రుని రామునకుఁ జెప్పుట .—

" రామ ! షడ్గుణములు - రాజులకెల్ల
భూమిఁ బ్రశస్తమై - పొలుచు నందులను.
అమరదు సంధి ము - న్నగు నైదునీకు
నమరు నిప్పటికి స - మాశ్రయంబొకటి
బలవంతుతోడ తాఁ - బగవూను హీన
బలుఁడు వేఱొక్కని - బలవంతుతోడ
చెలిమిసేయుట యొప్పు - చెలిమికి నతఁడు
బలియుతోఁ బగదీలు - పడియున్నవాని
పొసగదు కొంచియుం - బున వానికైన
దొసఁగుఁ దీఱిచి వాని - తోడ్పాటువలనఁ
దన ఘనకార్యమం - తయుఁ దీర్చికొనఁగ
ననువగుఁగాన మీ - కతఁడుగావలయు
నాయన సహవాస - మబ్బకయున్న
నేయర్థములు మీకు - నేల చేకూడు ?
వాఁడెవ్వఁడన్న ది - వాకర సుతుఁడు
వాఁడిమిఁగలవాఁడ - వార్యదోర్బలుఁడు
అగ్రణి బహువాన - రానీకమునకు
సుగ్రీవుఁడందు రె - చ్చో వానిపేరు
వాలిచే నిల్లాలి - వసుమతి నతఁడు
కోలుపోయినవాఁ డొ - కండు నున్నాఁడు
పంపాసరోవర - ప్రాంతంబునందు
ముంపుభీతిని ఋష్య - మూకశైలమున

నలువురు మంత్రులం - దనుఁ గొల్వనచట
తొలఁగక యున్నాఁడు - దుర్జయుఁ డతఁడు
సత్యసంధుఁడు ప్రతి - జ్ఞాపాలకుండు
దైత్యపన్నగ దేవ - తాగణ సిద్ధ
చారణాదులకు న - సాధ్యుఁడ నేక
వీరవానరులు సే - వింతురాఘనుని
రావణుఁ డెంత శ్రీ - రామ! మీ రేమి
గావింపఁదలఁచినఁ - గడతేర్చు నతఁడు
తా నట్టి వాఁడో యా - తలి వాఁడునట్లు
కానిచో వారికెక్కడివి - నెయ్యములు?
అరకమిగొన్న వాఁ - డాఁకటివాఁడు
దొరయైనవాఁడు నెం - దున బీదవాఁడు
నెవ్వఁడు వాఁడు చిం - తనుఁ బొందువాఁడు
చివ్వకాఁడును చెల్మి - చింతించువాఁడు
జతగూడ నేర్తురే - జగతినట్లగుట
నతనికి నీకు స - ఖ్యము సేయుటొప్పు
నట్టి భానుతనూజు - నంతటివాఁడు
చుట్టమైననుఁ జాలు - చూపినపనులు
సమకూర్చునీకు ద - శగ్రీవుఁడంటె
విమతులెందరికైన - వేఁటాడగలవు
రామ! యాతఁడు ఋక్ష - రాజునిసుతుఁడు
భూమిపై నౌరస - పుత్రుఁడురవికి
నినుడెంత పర్యంత - మెఱుఁగునో జగతి
యినసూనుఁడు నెఱుంగు - యిలయెల్లఁజూచి

సీతనీకతఁడు దె - చ్చియొసంగఁగలఁడు
నీతోడు సుగ్రీవు - నికి కార్యకారి
వెదకించుగవుల చే - విశ్వమంతయును
వెదకుమాత్రమె కాదు - వెతకి సాధించు
నీసులు లేకుండ - యిరువురుఁగూడి
బాసచేసికొనుఁడు - పావకుముట్టి
యాయుద్ధంబులు గొట్టుఁ - దరలేకయుండ
పాయకన్యోన్యంబు - పనులుఁదీర్చుటకు
ధరణిపై సప్తపా - తాళంబులందు
సరసిజగర్భుని - సదనంబులోన
సీతను డాఁచి యుం - చినఁ జూడనేర్తు
రాతనిఁగొలిచిన - యగచరోత్తములు
యెచటనున్నాఁడని - యెంచితిరేని
యిచటికిఁ బడమర - నిదె చక్కఁజాయ
పొన్నతోపున్నది - పొందు మీరచట
నున్నవిశేషంబు - లూహించి కనుఁడు

— కబంధుఁడు రామునకుఁ ద్రోవఁజూపి పోవుట :—

నచ్చోటఁ గలవు మీ - కమృతఫలంబు
లిచ్చవచ్చినయవి - యెల్లగైకొనుఁడు
ఆరమ్యవనములో - నలఁతలన్నియునుఁ
దీఱి యుత్తరకురు - దేశంబులనఁగ
వాసవు నందన - వనమున విరుల
వాసించునొక పుష్ప - వనమున్నదవల

భూరుహంబులు దానఁ - బుట్టినవెల్ల
వారికిఁ గోరిన - వస్త్యంబులిచ్చు
ఫలములందుల నుండి - పడి తోనెయవిసి
యిలఁ దేనెకాలువ - లీనుచునుండు
బుతువు లన్నియునందు - నెప్పుడుయాత్మ
రతిసిచ్చునది చైత్ర - రథముచందమునఁ
బాదపంబులు ఫల - భారంబుచేత
మేదినిఁ జీఱుచు - మెచ్చులఁదెల్పు
నొకకొన్ని యచలంబు - లున్నట్లుమెఱయు
నొకకొన్ని జలదంబు - లోయనఁదోఁచు
నోరామ! యిచ్చోట - నున్న వృక్షములు
మీఱిచూచిన మఱి - మీఱిపోలేదు
ఇట్టివనంబు ల - నేకంబు లచటి
చుట్టునఁ గలవవిఁ - జూచుచుఁబోయి
వొకకొన్ని శైలంబు - లొకకొన్ని నదులు
నొకకొన్ని వనములు - నొకకొన్నిచరులు
కనుఁగొని యవ్వాలి - కడకేఁగియుర్వ
రునుఁ బొంతు పంపాస - రోవరంబునకు
నచ్చోటమొరపతా - లడుసు పల్లములు
రొచ్చులు ముండ్లు జి - రుకులును లేవు
యే రేవుచూచిన - నిసుమును తేట
నీరునుఁగలిగి కం - టికి విందుసేయు
మునులు నిచ్చలు స్నాన - ములుచేసిపోవ
ననయుంబుఁ గ్రీడించు - నలవాటుకతన

గనకుఁ బారవుమిమ్ముఁ - గని నీడజములు
కడు నమ్మిచేరి చెం - గట నుండుగాని
వెన్నముద్దలరీతి - వింతయెఱుంగ
కున్న పక్షులఁబట్టి - యొక్కటిరెండు
కమలించి ముక్కునుఁ - గాళ్లుఁబోవైచి
చమరుగారఁగ భక్తి - సలుపుఁడుమీఱు
వంపుముక్కులఁ జేర - వచ్చు వాలుగుల
నంపకోలను గ్రుచ్చి - యనుజుఁడు దెచ్చి
కాఁచుచోమాడిచి - గనియలుచేసి
నీచెంతనిడఁ దృప్తి - నీవందు మచట
సౌమిత్రి ! యచటికా - సారంబులందు
తామరపాకులఁ - దలఁకకయుండ
తేటలై చల్లనై - తియ్యనై వలచు
నీటికి దోయిలి - నీవొగ్గి త్రావి
పహరింపు మాసరో - విమలజలంబు
మహిఁగ్రోలు వారికి - మానురోగములు
పండు లాకెలఁకుల - బలుపెక్కునేతి
బిందెల వలెఁ దరుల్ - పెల్లగింపుచును
విచ్చలవిడిఁ బోవ - వేఁటాడితూపు
లుచ్చిపోవైచి బి - ట్టురువడిఁ గూల్చి
హత్తి కారగ్గుల - యందుఁబొరల్చి
కత్తిరాలనుఁ జివ్వి - కమరించి కడిగి
వాలిచి కరకుట్లు - వాచవిపుట్టఁ
గాలిచి నికు ల - క్ష్మణుఁ డియ్యఁగలఁడు

పువ్వులు చుట్టిన - పురుషులఁబోలు
నవ్వనంబునఁ బుష్పి - కావనీజములఁ
జల్లనినీడలఁ - జందనానిలము
మెల్లనే రామేన - మించినయట్టి
శ్రమమెల్లఁదీర న - చ్చట శయనించి
క్రమియింపుఁ డెండల - కాఁకల పగలు
శ్రీరాముఁడాదులు వెం - చినవిగా నచటి
భూరుహంబులు గొడ్డు - వోవందు నొకటి
"యొండవృఫలము లే - యే వేళఁగలిగి
యొండు నందులనిండి - యుండుదు రెపుడు"
"మునిచంద్రులు మతంగ - మునిశిష్యకోటి
దినము వారాచార్య - దేవపూజకును"
పువ్వులు ఫలము లె - ప్పుడుఁ గొని తెచ్చు
నవ్వేళ యతుల శ్ర - మాంబు బిందువులు
చినుకొక్కటిగ మొల - చిన యవిగాన
ననుపమానముల మ - హావృక్షకోటి
చేరియచ్చట వారి - సేవించి యావల
మీఁజుచో నచటి స - మీపమ్మునందు
శ్రమణి తపస్విని - శబరి కిరాత
రమణి యొక్కతె మీఁదు - రాకఁగామించి
యున్నది యాయింతి - నూరార్చియాపె
విన్నవించిన మాట - విని చిత్తగించి
పంపాసరోవర - పశ్చిమదిశను
చంపక పనసర - సాలహింతాల

నారికేళాశోక – నారంగవకుళ
పారిజాతతమాల – పాటలప్రముఖ
ధరణీరుహములచే – తను దివ్యమగుచు
ధరణిఁ జెన్నమరు మ – తంగవనంబు
పావనికిని మంతం – గాచలకరులు
రావెఱచును మాని – రాజశాపమున
దాని తూర్పున మెచ్చఁ – దగు ఋశ్యమూక
మానగం బొకని శ – క్యముగాదు పొగడ
నెక్కు రా దొరులకు – నేనుఁగగున్న
లక్కడ భయము లేక – భివృద్ధి నొందు
నజునినిర్మిత మది – యచ్చటఁగన్న
నిజమాను కలలెల్ల – నిర్దోషులకును
నానగం బెక్కిన – నగుఁగాక నీచ
మానవుల్ చేరిన – మాతంగశక్తి
చంపిపోవుదురు రా – క్షసు లందునుండి
గుంపులై యెలుగించు – కొదమ యేనుఁగలు
మదమేనుగులకున్నై – మాని పుంగవులు
కొదమ యేనుగులఁ గై – కొని తోలితెచ్చి
పోకపాశెల నీరు – వోసి పోనీక
యాఁకలిచేసి పా – యక ప్రోతురచట
పోషిత వనమృగం – బులు బహుశీత
పాషాణముల విజృం – భణ వృత్తి మెలఁగు
బలురాయి తనవాతఁ – బడయుండ నొక్క
బిలమన్న నగము న – భేద్యమైయుండు

దానికిఁ బ్రాగ్దిశా - ద్వారంబునందు
నూనుచల్లని నీట - నొకదోన గలదు.
ఆదోనకును దక్షి - ణాశ నానాఫ
లాదులతోఁ దోఁట - యందమైయుండు
నాతోఁటఁ గ్రొమ్మావు - లందు నీడలను
బ్రీతి వసించు సు - గ్రీవుఁ డెప్పుడును
నట్టిసుగ్రీవుని - యాప్తులౌమంత్రు
లెట్టిచోఁ దనుఁగాచి - హితవృత్తి మెలఁగ
నొకవేళ బిలములో - నొకయెడ వనుల
నొకతరి గిరి మీఁద - నొకత్రోవఁ దరుల
గ్రీడించు నచటి కేఁ - గిన నానరేంద్రుఁ
జూడఁగాంతురు మీకు - శుభమగుఁగాక
పోయెదనని" దివ్య - భూషణద్యుతులు
తోయద ద్వారంబుఁ - దోరణకట్ట
బంధంబుఁ దీఱి క - బంధుండు దీన
బంధుఁడౌ రఘుకుల - ప్రవరుఁ డంపుటయు

—: రామలక్ష్మణులు శబరిం జూడఁబోవుట :—

గంధర్వుఁడై పుష్ప - కము తోడఁజనిన
బంధుఁడౌ నతఁడు చె - ల్వఁగ విన్నసరణి
పంపకుఁ జక్కని - పడమటిత్రోవ
గుంపులౌ వనులు గ - న్గొనుచు రాఘవుల
తారు సుగ్రీవ సం - దర్శనాపేక్షఁ
జారువైఖరివచ్చి - శబరియాశ్రమము

చేరినఁ గాంచియా - చిగురాకుఁబోఁడి
శ్రీరాముభక్తి న - ర్చించి పూజించి
కందమూలముల నాఁ - కలిదీర్పదాని
విందుల వికచార - విందలోచనుఁడు
రాముఁడు మెచ్చి కి - రాతభూమికిని
సేమంబు దెలియ నీ - క్షించి యిట్లనియె
" లెస్సలే నీకు పు - ళిందవధూటి!
గుస్సహాశక్తిఁ జే - తువె తపఃక్రియలు ?
నియమంబు కొనసాగు - నే నీకు మాకు
జయము సంధిల్లె నీ - సందర్శనమున
నీగురు శుశ్రూష నీ - మనోజయము
సాగుచున్నదియె యౌ - చ్చంబునులేక
అనిన తపస్విని - యంజలిచేసి
మునివృత్తి నున్నరా - ముని కిట్టులనియె
" అయ్యా నీకరుణచే - నన్ని కార్యముల
నెయ్యెడలఁ గొఱంత - యేఁటికిఁ గలుగు
నాదుతపంబు మి - న్నక ఫలియించి
యో దేవ! మిముఁ దెచ్చి - యునిచెఁగట్టెదుర
నేధన్యనైతి నా ని - యమంబులెల్ల
సాధువాదముఁగాంచె - జన్మమీడేరె
నిపుడు మీచరణంబు - లేఁబూజచేసి
యపవర్గ సౌఖ్యంబు - లందఁబాలైతి
చిత్రకూట నగంబు - చేరిన మీ చ
రిత్రంబు సన్ముని - శ్రేణినాతోడ

దివికి నేగుచుఁబల్కె - తెరువులుచూచి
రవివంశతిలక ! - నీరాకఁగామించి
నున్నాఁడ నను బ్రోవ - నోస్వామి ! మీర
లన్నఁదమ్ములు వచ్చి - యర్చలందితిరి
మిముఁగనుఁగొని సంయ - మివ్రాతమెల్ల
నమరలోకమునకు - నరుగుచుఁదనకు
నింతయుఁ జెప్పితా - రేఁగినకతన
నింతసంతోషము - య్యెను నేఁటిదినము
అనఘ ! మీకనుచు వ - న్యంబులుడాఁచి
యునిచిన దానఁ గొం - డుపహారముగను
ననుఁగటాక్షింపుఁ" డ - న్న కిరాతిమీఁద
కనికరంబునిచి రా - ఘవుఁ డిట్టులనియె
"మాకుహితంబెంచె - మన్ననతోడ
నాకబంధుఁడు దెల్పె - నప్పటనుండి
యెప్పుడు వోవుదు - మెప్పుడుచూతు
మెప్పుడు భాషింతు - మేమనియెంచి
వచ్చినవారమో - వనిత ! నీమహిమ
మిచ్చట జూడఁగ - నిచ్చ యెంచెదము
నీసేయు పూజలం - దితిమని పలుక
దాసినేనట్లచి - త్తంబు రానడతు
ననివారిఁ దోడ్కొని - యవ్వనసీమ
మునఁగల్గిన వి శేష - ములు చూడుఁడనుచు
నిదిమతంగాశ్రమ - మిచట మద్గురుడు
త్రిదశ సంప్రీతిగాఁ - దీర్చుహోమంబు

నిది దేవపూజ చో - టిది యాగశాల
యిది జపమొనరించు - నిరవనిచూపి
శ్రీరామ! యిమ్ముని - శ్రేష్ఠుని మహిమ
నీరమ్య దేశంబు - లిపుడుఁ జూచితిరె?
శోభనరమ్య తే - జోవిశేషముల
సౌభాగ్య కరములై - చాలనొప్పెడును
అలమౌని తన కేల - యాయాసమనుచుఁ
దలఁచిన యంతస - ప్త సముద్రములును
వచ్చియమ్మౌనిఁ గా - వలసిన కోర్కు
లిచ్చిక్రమ్మర నవి - యేఁగు నాఘనుఁడు
ఆరఁగట్టిన యట్టి - యానారచీర
లారవార్ధంబులై - యవె భూరుహముల
నామౌని పూజించు - నలరు లింతయును
రామ! వాడకయవె - రాసులై యొప్పె
నతఁడు చరించు న - య్యడుగులజాడ
లతిపావనములు క - టాక్షింపుమీవు
యీవనమహిమంబు - లివిమిమ్ముఁజూచి
పావనినై తినేఁ - బనివినియెడను
చనియెద నాచార్య - సన్నిధి కిపుడె
ననుఁజూడుఁడ" నిన నెం - తయు వెఱఁగంది
"పూజచేసితి మమ్ము - పొలఁతిసీవేమి
యోజించినావో సే - యుదువు గాకటుల
ననరాము వలఁగొని - యాచెంచువనిత
కనఁగన వెలుఁగు నింగ - లము లోపలను

మేను దేలిచి దివ్య - మృగ నేత్రయగుచు
తా నేఁగె గురుసన్ని - ధానంబుఁ జేర
నివ్వెఱతో తమ్ముఁ - ని మొగంబుచూచి
యవ్వేళ సీతాస - హాయుఁ డిట్లనియె
"చూడుమిచ్చో మృగ - స్తోమంబులెనసి
కూడియున్నవి - వైరగుణములులేక
యిచటివృక్షములు గం - టే! ఫలభార
రుచిరంబు లగుచు జీ - గుచున్నవవిని
యెంతవాఁడు మతంగుఁ - డేడువారాసు
లింత కొంచెపు - పనియే రమ్మనంగ
నవియెల్లఁ దీర్ఘంబు - లై యున్నవిచట
నవిరళ వారిపూ - రాంబనులగుచుఁ
దానంబు లొనరించి - తర్పణక్రియలు
పూనితీర్చితి మెంత - పుణ్యవాసరమొ
యీదినంబు కిరాతి - నీక్షించిచాల
మోద మందితిమిది - మొదలుగా మనకు
సకలకల్యాణముల్ - సమకూడునింక
నొకటయు గొదవలే - కుండు గార్యముల
నామది నిండియు - న్నతెఱంగుచూడ
భూమిజ వచ్చుగాఁ - బోలుఁ గ్రమ్మఱను
వదెఋష్య మూకము - న్నది యందుసీత
వెదకిన నుందునో - వీక్షింతమనుచు"

— రామలక్ష్మణులు పంపాసరస్సునకుఁ బోవుట —

ననుమతించిన సుఖ - భ్రాత్మజుం గూడి

చనిచని కొన్ని యా - శ్రమములు గడచి
ముందఱ వనమృగం - బులు పులుగులును
సందడిసేయు న - చ్చట రమ్యమగుచు
నమరు మతంగనా - మాబ్జిని గాంచి
తమరందు మునిఁగి యా - దండనేయున్న
నొక్కరమ్యస్ఫటి - కోపల ప్రభల
నక్కజంబగు నీట - నమరిచూపట్టు
పంపాసరోవర - ప్రాంతంబుఁజేరి
సంపూర్ణ జలపక్షి - చయకలస్వనము
పూచిన మల్లెపూఁ - బొదలునుఁ దరుల
నేచిమిన్నందు మ - హీరుహావళుల
పుష్పొదుల్ మ్రుగ్గుల - పోలిక రాలి
విప్పుగాఁ బఱచిరో - విపిన మార్గములఁ
బైపయి రత్నకం - బళములనంగ
జూపట్టు నెడలు మె - చ్చుచు నికుంజముల
మాటుచుం గనరాక - మహిసుతఁబోలి
చాటుననున్న కా - సారంబు చూచి
రాజగేహంబు లా - రాణివాసంబు
నోజఁదానున్నచో - టొకరి కేర్పడక
యున్న పంపాతటం - బొక్కెడఁజేరి
వెన్నుగాచుకవచ్చు - వీరలక్ష్మణుని
గాంచి సీతావియో - గంబుచేఁదాల్మి
యుంచనేరక రాముఁ - డొక మాటవలికె
“యీ పంపగనుఁగొంటి - వే ? యనిమేష

కోపనాపుంభావ - కూజికాభ్యసన
చతురపారావతి - శారికాకీర
కృతకలారావ వ - ర్ధిష్ణు మనోజ
సంగరరసలోల - శబరాంగనాను
షంగిలతాగృహ - సంచరన్మలయ
పవమాన విగళిత - ప్రసవోపచార
నివహానిమోదిమా - నిగణంబు" దాని
నెంతి వేడుకచేసె - నీ సరోవరము
కాంతలతోడ నీ - కాసారసీమ
జలకేళి యొనరించు - జనులకేమిటికిఁ
దలప నందనవనాం - తర విహారములు ?
చెంగటఁ దేటి చూ - చితివే సమస్త
మంగళప్రదమహా - మహిమముల్ గాంచు
నవలోకమాత్రని - రస్తశోకంబు
దివిజభూమీధరాం - తి ప్రవేశంబు
అపహృతాద్యన్య త్ర - మాతిరేకంబు
తపనేందుమణిగణ - స్థగితరోకంబు
అమరాపగాకృతా - త్మాభిషేకంబు
యమదూతగదితన - ఒమోనువాకంబు
సారసినీచర - చ్చక్రవాకంబు
తీరవనీ సము - త్తీర్ణపైకంబు
కందరాంతర విశం - కటవనోకంబు
సందీప్తశృంగాను - షంగినాకంబు

హేలాచరిష్ణుగం - ధేభపాకంబు
తాలాదితరసము - త్కటవనీకంబు
ఋషికన్యకాకరా - హృత ప్రలాకంబు
విషయలోలాశర - ద్విషదభీకంబు
వాలిసంప్రాప్త భా - వవ్యళీకంబు
కాలాచరితమాని - గణసరాకంబు
ప్రతిపన్నయతి పుణ్య - ఫల విపాకంబు
శ్రుతఋష్యనీకంబు - ఋష్యమూకంబు
యీకొండ చేరఁగ - నేఁగి సుగ్రీవుఁ
జేకొందమందు వ - సించియున్నాఁడో ?
ఆఋక్షరజు కుమా - రాగ్రణితోడ
నూరక యేరీతి - నొనఁగూడుఁ జెలిమి
నీవేఁగుమే సీత - నిమిషంబుఁజూడ
కేవగంబ్రాణంబు - లిఁక బూనియుందు "
ననుచుఁబంపాతీర - మల్లనం జేరి
తనసహోదరుఁగూడి - తగ విశ్రమించి
విలసిల్లెనని వేద - వేద్యుని పేర
నలమేలు మంగాంగ - నాధీశుపేర
నంచితకరుణా క - టాక్షుని పేరఁ
గాంచనమణిమయా - కల్పుని పేర
వేదవేదాంతార్థ - వినుతుని పేర
నాదిత్యకోటి ప్ర - భాంగుని పేరఁ
గంకణాంగద రత్న - కటకుని పేర
వెంకటేశుని పేర - విశ్వాత్ము పేర

సంకితంబుగ వేంక - టాధీశచరణ
పంకజసేవాను - భావమానసుఁడు
హరిదాసమణి కట్ట - హరిదాసరాజు
వరదరాజు నితాంత - వరదానశాలి
రచియించు వాల్మీకి - రామాయణంబు
ప్రచురభక్తిని మదిం - జాటించి వినినఁ
జదివిన వ్రాసిన - సభలఁ జేర్కొనిన
మదిఁదలఁచిన నెట్టి - మనుజులకైన
ధారుణి మీఁద సీ - తారామచంద్ర
పారిజాతదయా ప్ర - భావంబువలన
హయమేధరాజ సూ - యాదిమయాగ
నియతఫలంబులు - నిరతాన్నదాన
సుకృతంబు నిత్య య - శోవైభవములు
నకలంక తీర్థయా - త్రాది పుణ్యములు
సత్యవ్రతపదంబు - సకలసౌఖ్యములు
నిత్యమహాదాన - నిరుపమశ్రీలు
కలికాలసంప్రాప్త - కలుషనాశనము
కలుములు హరిభక్తి - గౌరవోన్నతులు
శత్రుజయంబును - స్వామిహితంబు
పుత్రలాభంబును - భోగభాగ్యములు
ననుకూలదాంపత్య - మంగళాశ్రయము
ధనదాన్యపశువస్తు - దాసీసమృద్ధి
మానసహితము ధ - ర్మ ప్రవర్తనము
నానందములు ఖేద - మందకుండుటయు

నలఘువివేకంబు - నతుల గౌరవము
వలయుకార్యములుకై - వశములౌటయునుఁ 6510
భావనత్వము దీర్ఘ - పరమాయువులును
కైవల్యసుఖము ని - క్కమ్ముగాఁ గలుగు
నెన్నాళ్లుధారుణి - యెన్నాళ్లుజలధు
లెన్నాళ్లు రవిచంద్రు - లెన్నాళ్లుగిరులు
యెన్నాళ్లు నిగమంబు - లెన్నాళ్లువిశ్వ
మన్నాళ్లు నీకథ - యలరు నార్షంబు
నాదికావ్యంబర - ణ్యాఖ్యకాండంబు
వేదసమానమై - విలసిల్లుఁగాత 6518

* శ్రీ రామార్పణమస్తు *

కట్టా వరదరాజకృతమగు

శ్రీ రా మా య ణ ము

(ద్విపద)

కిష్కింధాకాండము

శ్రీరాజితశుభాంగ! - చిరగుణసంగ
హారికృపాపాంగ! - యలమేలుమంగ
భావుక! శతకోటి - భానుసంకాశ!
సేవకాత్మనివేశ! - శ్రీవేంకటేశ!
అవధారు కుశలవు - లారామచంద్రుఁ
డవధరింపంగ రా - మాయణంబిట్లు
వినుపించు తత్కథా - వృత్తాంతమెల్లఁ
గనుపించు నవ్వాలి - కథ యెట్టులనిన

—: శ్రీరాముఁడు వసంతాగమ శోభితమైన పంపాసరస్తీర
మునుగాంచి, సీతావియోగభరమును తాళఁజాలక లక్ష్మణునితోఁ
దత్తీరవర్ణనఁగావించి ప్రలాపించుట :—

ఆ రాఘవుఁడు పంప - నందముల్ నింప
చేరికన్ గొని తన - సీతావియోగ 10

విరహావేదనలచే - వేగి యా సరసిఁ
దరసి యా దరిసీమఁ - దమ్మునిఁజూచి
యచటి వినోదంబు - లాత్మకింపొసఁగ
నుచితవైఖరితోడ - నొక మాట వల్కె
"వైడూర్యనిర్మల - వారిపూరంబు
చూడఁ జూడంగ మె - చ్చులు పాదు కొల్పె!
చేతోవికాస ల - క్ష్మీ నిధానంబు
ఈతీరవనభూము - లీక్షింపు మిపుడు!
ఒక కొన్ని శిఖరస - మున్నతశైల
నికరంబులనఁగ వ - న్నియఁ గాంచె తరులు!
భరతవియోగంబు - భామావియోగ
మిరువాగు జతఁగూడి - యేకీభవించి
మన విచ్చునే యీద్రు - మచ్ఛాయలందు!
అనుపమ ప్రసవ ప - ర్యంకపాళికలు
నీవోటి పుష్పితా - నేకవృక్షములు
నీచాయ మలయమ - హీధరానిలము
నీవేళఁ బ్రాపించు - నీవసంతంబు
భావంబులోనఁ దా - పము మించఁ జేసె
జలదముల్ వడగండ్లు - చల్లినరీతి
నలరులు రాల్పు ల - తాళిఁ జూచితివె!
చరులందు వాయువ - శంబుచేఁ దొరఁగ
విరులకొటారులై - విలసిల్లె నిచట!
రాలియు రాలుచు - రాలక నిలుచు
నీలతాంతములచే - నిచటి భూజములు
ఫలమానమృదుగంధ - వాహావినోద

విలసనంబులు దెల్పు - విధముఁ జూచితివె!
ఎలతెమ్మెరలచేత - నీకొమ్మగుంపు
చలియింప ఘుమ్మని - చంచరీకములు
విలసిల్లె మకరాంక - విజయగానములు
సొలయుచు వినిపించు - సొబగుఁ జూపట్టు
నట్టువఁడై తరుల్ - నటియింపఁ జేసి
గట్టుల చరులకు - గానముల్ నేర్పి
గాయకుఁడై యనో - కహాలతాంతములఁ
బాయని పుప్పొడి - బలువసంతములు
చల్లు కుమారుఁడై - జాడలయుండుఁ
జల్ల తావుల వీచెఁ - జందనానిలము!
తరువులతోడ ల - తాశ్రేణిఁ బెనచి
పురుషులతోడుతఁ - బొలఁతులఁ గూర్చు
నెడకాఁడు తానయై - యూకోడె గాద్పు
కడవఁ బల్కెడు విహం - గమ కలధ్వనుల!
ఈ కొండగోఁగుల - నేకముల్ పసిఁడి
కోకలు గట్టు లో - కులను గేరెడును!
ఈ వసంతమునందు - నీవనిలోన
నేవిధంబున సీత - నెడవాసి యుందు?
ఉండిన నోరిచి - యుండఁగ నీఁడు
మండలీకృతచాప - మహితుఁడై మరుఁడు!
సీత యెలుంగుతోఁ - జేరంగఁ బిలిచె
నీతరిఁ గల కంఠి - యిదె పంచమమున
నత్యూహమును బుద్ధి - నను గలఁగించె!
నత్యంతమును నీ రఘు - రాంబుపూరమున

వెనుకటి కీపక్షి - వింతగాఁ బలుకఁ
గని మదిలో మెచ్చఁ - గలకంఠి సీత
యీ పక్షి మిథునంబు - లెల్ల వృక్షముల
నాపోని రతి నోల - లాడఁ జూచితివె!
కోకపారావత - కూజితావళులు
నాకుఁ గల్పించెఁగం - దర్పతాపంబు
పూచినమోదుగు - పువ్వులు వహ్ని
యీచిగురాకులు - హేతిమాలికలు
చిటచిటల్ భ్రమరికా - శ్రేణీరవముగ
నటు జూడు మదప్రతా - పాగ్నియుఁ బోలె!
ఈ తుమ్మెదలగుంపు - నెనయు ముంగురుల
సీతఁ బాసిన దన - జీవనంబేల?
జానకిఁ గూడి వ - సంతకాలముల
నేనిన్నినాళ్లు నే - యేవినోదములఁ
జరియించినాఁడనో - సౌమిత్రి! తనకు
మఱపు రాదేల? యా - మని వచ్చె నిపుడు!
మనసులోననె యుండు - మదనాగ్ని యేల
పెను చిచ్చుగా రాఁజఁ - బెట్టె నీగాలి?
ఒక మయూరముఁ గాంచి - యొక నెమ్మికొమ్మ
వికసిల్లఁ బింఛంబు - వేడుక నాడ
స్ఫటికోపమగవాక్ష - పాళిక యట్ల
యటఁజూడుము కలాప - మమరుచందంబు
నీమయూరి నొకండు - నెత్తుకపోక
తామసించిరదేమొ - దానవాధములు!
అటుగాన మగనితో - ననఁగిపెనంగి

యిటు నన్ను నడికించె - నేమి సేయుదము!
ఈ వసంతము మర్త్య - లే యేల యెల్ల
జీవకోటులకు సం - జీవనౌషధము
తనవంటి కల్మషా - త్మకున కొక్కనికిఁ
దనువునఁ బ్రాణవే - దన సేయుఁగాక!
నను బాసి మేనఁ బ్రా - ణంబులతోడ
జనకజ యిందాఁక - సైరింపఁ గలదె?
అడవినిఁ గాయు చం - ద్రాతపంబగుచు
పుడమి నూరక యేల - పువ్వులురాలె?
నే నెంత కలిగెద - నీవనిలోనఁ
దానంత శోకించుఁ - దమ్ముఁడా! సీత
పట్టుకపోయిన - పట్టునసీత
యెట్టులున్నదొ కదె - యేమిసేయుదుము!
ఇరువురకును మతు - లేకమై యునికి
నెఱిఁగి యుండుదు సీత - హృదయంబు నేను
జనకజ యున్నచోఁ - జల్లనై యుండి
తనకిప్పుడీ గాలి - దహనుఁడై తోఁచె
మన యాశ్రమమున ది - మ్మరి కాకి కాకు
నినదంబుతోఁ గూసి - నెలఁతను బాసి
యిపుడుఁ జూడఁగ వచ్చె - నీ వాయసంబు
చపలబుద్ధిని పక్షి - చండాలమగుట
నెడమ దిక్కున నుండి - యిపుడు గూయుచునుఁ
గడకుఁ బోదిప్పుడు - కాకా యటంచు!
తిలకగుచ్ఛము మీఁదఁ - దేఁటిఁ జూచితివె
వలపు నెచ్చెలి మీఁద - వ్రాలినట్లమరె!

బూచివాళికమును - బోలి నింబారఁ
బూచి యశోక మి - ప్పుడు వెలిపించె!
సుమితరసాలముల్ - చూడుము మీన
నమరు సొమ్ములతో జ - నావళిం బోలెఁ
బంపాసరోవర - ప్రాంతకుంజములఁ
గింపురుషద్వంద్వ - గీతముల్ మొరసెఁ
గిన్నరుల్ మీటుచుఁ - గిన్నరాంగవలు
కన్నిబోయుతలతోఁ - గలసిపాడెదరు!
ఇందున వికసించు - నెత్తిదామరలు
చెందొవరేకుల - చెలిమి సేయుచును
బాలభాను విభా వి - భాసితరాగ
కేళిచే మదనాగ్ని - కీలలై వెలసె!
కప్పుఁగల్వల మీఁదఁ - గలమూఁగు తేఁటి
కప్పు సీతాకటా - క్షములతో నెనసె
రేవుల సింధుర - శ్రేణితుండములఁ
ద్రావెడు గళగళ - ధ్వనుల నంబువులు
కలహంస చక్రవా - క క్రౌంచముఖ్య
జలపక్షి నివహంబు - సందడిఁ గనుము!
ఇవి చూచి తాళుదు - నే ధరాతనయ
యవలంబనము లేని - యర్థగాత్రుఁడను.
ఈతావి కరువలి - నేనయించి యూర్పు
లీ తేఁటి దాఁటున - కిచ్చి ముంగురులు
యీవల్లికావళి - కిచ్చి కేల్దోయి
యీవనజంబుల - కిచ్చి నెమ్మొగము
యీకల్వబాలున - కిచ్చి లోచనము

లీకలహంసల - కిచ్చి లేనడువు
లీబేడిసలచాలు - కిచ్చి దృగ్గాల
మాబాల సీత యెం - దరిగెనో నేఁడు!
పంపకు దక్షిణ - భాగంబునందు
నింపు మీఱినయట్టి - ఋష్యమూకంబు
జేవురుల్ నిండి పూ - చిన మోదువులకుఁ
దావలంబగుచు కం - దర్పప్రతాప
దావాగ్నిరాశి చం - దమున వీక్షింప
భావంబునకు భీతిఁ - బాదుకొల్పెదును!
ఒకకొమ్మపైఁ గాంత - యొకకొమ్మఁదాను
నొకచాయగానిల్చి - యొయ్యనవీచు
ముక్కు తెమ్మెరలచే - ముక్కును ముక్కుఁ
జక్కగాఁ గూర్చివా - చవిఁ గొసరుచును
బికములు క్రీడింపఁ - బెరిగిన తరువు
లకట! నామదికిఁ బా - యనిచింతఁ జేసె!
ఇది చూపి వలరాజు - నీవసంతుండు
కదిమి చించిరి ధైర్య - కంచుకంబిపుడు!
ఒక పువ్వులోనుండి - యొకపువ్వుమీఁద
మొకిరి తేఁటులగుంపు - ముఱవు చూచితివె!
తరువులు లతలఁ బొం - దఁగఁ బిల్చెననఁగ
వరపక్షి కలకల - స్వనమాలకింపు!
కారండవమ్ములు - గలసి క్రీడించి
మారుని వేఁట దీ - మంబులై తోఁచె!
ఏటికిఁ బెగడుదు - రెఱుఁగకఁ బంప
పాటిదియే మరా - ళగ పద్మిణముల

నేమియు నేనొల్ల – నింకొక్కమాటు
భూమిజఁ గనుపట్టి – పుణ్యంబుచాలు
ఈవనజంతువు – లీపంపలోని
జీవనజంతువుల్ – చింతపాల్జేసె
మనల కింకొకనాఁడు – మలయుచుందుదుమె
జనకజగూడి యీ – సానుభాగముల?
పంపాసరోవరో – పవనంబు లనుస
రింప మువ్వురము జ – రింపుదు మొక్కొ!
గలుగునే యొకనాఁడు – కలకంఠి సీతఁ
గలసి వినంగనీ – కలకంఠ రవము!
కందునే యొకనాఁడు – కమలాయతాక్షి
సందిటిలోన ము – చ్చటఁ దీఱఁ బెనఁగ?
దొరకునే యొకనాఁడు – తొయ్యలిఁ గూడి
సరససల్లాప ప్ర – సంగముల్ నడప?
కాంతునే యొకనాఁడు – కనకాంగితోడఁ
గంతుకేళిఁ గరంగి – కరఁగింపుచుండఁ
జూతుమే యొకనాఁడు – చుక్కలరాజు
రీతినున్న తలోద – రిముఖాంబుజంబు!
అబ్బునే యొకనాఁడు – హరిణవిలోక
బిబ్బోకమునకునేఁ – బ్రీతివహింప?
నావెంటవచ్చు జా – నకి వెంటఁ బోక
యేవెంట బ్రాణంబు – లింకనిల్పుదును!
కన్నుల నెఱిఁగించు – కలయింగితంబు
చిన్నినవ్వులఁ దెల్పు – చిత్తాభిమతము

సిబ్బితిచేఁ జూపు - శీల గౌరవము
గబ్బిచిన్నెల నెఱఁ - గఁగఁ జేయువలపు
యలిగియుండఁగ నేర - దవలి మోమిడదు
తలఁప దెవ్వరినిఁ జెం - తకులోను గాదు
యేను గాసిలియున్న - యెఱిఁగి హితోక్తి
దానూరడించి సం - తాపంబుఁదీర్చు
నడవి యయోధ్యగా - నన్నింటి మాఱు
పడఁతి తానయి నిల్చి - పరితుష్టుఁ జేయు
తలఁచినట్ల మెలంగుఁ - దనమది దాప
దలయికఁ జూప దే - మనినసైరించు
నగుమోముతోఁ జేరి - నాచెంత నిలిచి
తగినమాత్రం బెమె - త్తని మాటలాడు
నట్టి సీతకు బాయు - నట్టి నన్నీవు
చుట్టుకఁ దిరిగియే - సుఖము గాంచెదవు ?
వలదన్న లక్ష్మణ ! - వలసినట్లాడుఁ
దలఁప నేమిటికింకఁ - దడవకనన్ను
భరతునింజేరి యా - పదలెల్లఁ దీరి
మఱవక మమ్ము నె - మ్మది నుంచు మీవు !"
అని యనాథుని రీతి - నాపన్నుఁడైన
తనయన్నఁ గని సుమి - త్రాసుతుం డనియె
" దేవ ! మీయంత సు - ధీనిధు లెందు
భావింప కీదీన - భావమొందుదురె ?
తడిసెనేనియు వత్తి - తైలసంగతిని
పొడవడంగిన యట్టి - పోలికచేతఁ

దనవారిపై నింత - దయఁ బూంచువారు
మనసులోఁ జివికి నే - మము నొందలేరు
విడువు మింతటి యాశ - వెలఁదికై యేల
యడలెద విల్లుధై - ర్యముఁబోవనాడి ?
ఎందు వోయెడు సీత ! - యొత్తిఁగి రావణుని
గందువ సాధింప - గా శక్తి లేదె ?
సీత నొప్పింపక - చెడిపోవవాన
కీతరి తలఁద్రావఁత - యే త్రుంగిపోవ ?
జానకితోఁ గూడఁ - జని దితికడువు
లోనఁ జొచ్చినను గా - లుఁదమ బాణాగ్ని !
ధైర్యంబు వదల నీ - తమె దక్షునకును ?
గార్యభాగంబు లోఁ - గాములుగలవె ?
యత్నవంతున కసా - ధ్యము లెందుగలవు ?
యత్నంబె సేయు మ - య్యహితునిఁ దునుమ
నుత్సాహపరుఁడవై - యూహించి కపట
మాత్సర్యపరులను - మర్దింపు మీవు
మది జిక్కఁబట్టి నీ - మహిమంబుఁ దలఁచు
వదనెఱుంగక యేల - యార్తిఁ గ్రుంగెదవు ! ”
అని యన్నఁదోకొని - యాపంపఁ దాఁటి
చనుచు శ్రీరాము నె - చ్చటికఁ గాచుచును
జతనంబు యతనంబుఁ - జాలంగఁ గలిగి
ప్రతి పదంబున సీతఁ - బరికించి కొనుచు
గిరికందరంబులఁ - గ్రీడించు వారిఁ
ధరణితనూజుఁడు - ధర్మ్యులఁ గాంచి

—: ధనుర్బాణులగు శ్రీరామలక్ష్మణులఁగాంచి వాలిపంపిన వారలనుగా సుగ్రీవుఁడు చింతించి భీతిల్లుట ; హనుమంతుండు సయుక్తికముగా వాని సంశయమును నివారించుట :—

భీతిల్లి యార్తిచే - బెదరి కలంగ
నాతరి నితరులై - నట్టివానరులు
వెఱచి పాఱిన కపి - వీరుఁడు దేవ
గిరి సమానుండు సు - గ్రీవుఁడు నిలిచి
యాజాను బాహుల - నలఘు విక్రముల
రాజీవనేత్రుల - రవివంశమణుల
విజితేంద్రియుల ముని - వేషధారులను
గజగమనులను రా - కాచంద్రముఖులఁ
జక్కని వారిని - జతయైన వారి
నెక్కడ కనివిని - యెఱుఁగని వారి
బాణబాణాసన - ధర్మకృపాణ
పాణుల సత్వసం - పన్నుల రామ
సౌమిత్రులను జూచి - చాల శంకించి
తామగసాప్తనం - దనుఁడుచలించి
వెఱచిన వాఁడౌట - వింతచూపగుట
హరియాట నిలిచిన - యచ్చోట నిలక
మనసు నిల్కడ లేక - మలయుచో నెల్ల
తనుగాచి వెంట ప్ర - ధానులు రాఁగ
హితులైన తన వాన - రేంద్రులఁ జూచి
కృతనిశ్చయమున సు - గ్రీవుఁడిట్లనియె.

“ కపులార! మీరు రాఁ - గారణం బేమి!
కపటాత్మకులు వాలి - గడివారు వీర
లతఁడు నాపైఁ బంప - నజ్ఞయైనట్టి
యతివేషముల ధను - రస్త్రముల్ దాల్చి
వచ్చిన వార లా - వాలి రావెఱచు
నిచ్చోటి కటుగాన - నిమ్మహాభుజులు.”
అని యానగంబున - నవ్వాలి శిఖర
మున కేఁగి యనుజీవి - ముఖ్యవానరులు
కడురా పదాఘాత - ఘట్టనంబులను
పొడిపొడులై శృంగ - ములు దుమ్ము లెగయఁ
బ్రత్యంత శైలముల్ - బలువిడినడవ
నత్యంతనిమ్నోన్న - తాయాతి మాన
మేని పోఁకులను భూ - మీరుహశ్రేణి
తోనఁ గూఁకటి వేళ్ళ - తోఁ బెల్లగిల్ల
గతిరయాయత మరు - త్కాండముల్ నిండి
ప్రతిపదాంచిత గహ్వ - రములు ఘూర్ణిల్ల
నినతనూజునిఁ జేరి - యిరుకెలంకులనుఁ
గనుగల్గి దిక్కులు - కలయఁగన్గొనుచు
నందఱు వసియింప - నాంజనేయుండు
ముందఱ నిలిచి కే - ల్మోగిచి యిట్లనియె.
“ ఏటికి వెఱచెద - విది మలయాద్రి
కూట మనుష్యులకు రాఁ - గూడ దిచ్చటికి
వాలినిఁ జూడ మ - వ్వాలి కిచ్చటికిఁ
బోలదు చేర నా - ప్పాన యింత బెదర?
ఆవాలి మొద నీభ - యంబున కేల

నీవింతవాఁడవై - నీకపిత్వంబు
వదలవైతివి మహీ - వల్లభులకును
మదిలోన నిలుకడ - మఱిచాలకున్న
దొరయుండురే వాని - దొరకుఁ గావలదె
వెరవును నడనడ్వ - వేళ గౌరవము ?"
అనుమాట విని పవ - నాత్మజుఁజూచి
సునిశితబుద్ధి నా - సుగ్రీవుఁడనియె.
"ఆయుధపాణులై - యలఘు తేజముల
నాయమరకుమారు - లన జోడుగూడి
వీరల రాఁజూచి - వెఱవక నిలుచు
వీరులెవ్వరు పృథి - వీస్థలిలోన?
ఏ వెఱచుట యెంత - యిది యేటిమాట
పావని! నాగుండె - పట్టిచూచితివె!
తటతట నదరెడు - తప్పదువార
లిటు చూచెదరు వాలి - యే పంపనోవు
రాజులు దిక్కుల - రాజులతోడ
యోజించి చెలిమి సే - యుదు రట్లు చేసి
తమచేతఁ గాని య - త్నము వారిచేత
సమకూర్చు కొందురు - జాడవారలకు
పైకొని వంచనో - పాయముల్ తమరు
చేకొని నమ్మిన - చెఱుపక పోరు
బలవంతుఁడును నీతి - పరుఁడునై వాలి
దలఁచు నీరీతి మా - త్సర్యగార్యములు
పగవారి లెటులైన - బట్టి సాధింపఁ
దగుఁగాన నతనికిఁ - దగు నిట్టి తెఱఁగు

మనమేమఱక బుద్ధి - మంతులమగుచుఁ
జను వానిఁ బనుప యో - జన సేయవలయుఁ
గావున నీవ య - క్కడి కేఁగి మేని
లావు గానఁగనీక - లఘువృత్తి తోడఁ
గొంచపు మేనితోఁ - గొంకుచుఁ జేరి
యంచల నిల్చిన - యాలాప సరణి
వారల రాకయు - వారిచిత్తములు
వారి వాక్యములు స - ర్వంబునుఁ దెలిసి
నా దృష్టి పథమున - నాకు నౌగాము
లీదృగ్విధంబది - యేఱుపడంగ
నిలిచి పల్కుము పొమ్ము - నీవని " పనుపఁ
దలఁచి తాఁ బోవుట - తగవని యెంచి

—: హనుమంతుఁడు బ్రహ్మచారి రూపముఁ దాల్చి రామ లక్ష్మణుల సందర్శించుట :—

యా కొండపై నుండి - యలఁతిరూపమున
రాకుమారకులఁ జే - రంగఁదాఁ దాఁటి
సన్నగావుల బ్రహ్మ - చారియై సిగయు
జన్నిదంబును ముంజి - సరము దండమును
మెఱయ రాఘవుల స - మీపంబుఁ జేరి
చరణపద్మములకుఁ - జాగిలి మ్రొక్కి
లేచి యంజలి చేసి - లెక్కసేనైతి
మీ చెల్వు దివ్యుల - మేరఁజూపట్టు
నే నిమిత్తమున మీ - రీవనిలోన
భానుసన్నిభ దివ్య - బాణతూణీర

కోదండపాణులై - క్రుమ్మరవలసె
నీదండ మృగముల - నెల్లఁ జంపుచును ?
నయనిధులు సువర్ణ - నాభులు నిరత
జయకీర్తిశాలు లా - జానుబాహువులు
కమలపత్రాక్షులు - కరుణాభిరాము
లమరసన్నిభులునై - నట్టి ధార్మికులు
పదములు కంద పం - పాసమీపమున
వెదకుచు నెయ్యది - వేఁడివచ్చితిరి ?
వేఁడుక నేనుఁగు - వేఁటాడవచ్చు
గోడె సింగములనఁ - గొంకులు దేఱి
చక్కని మేను లి - చ్చట వసివాడ
నెక్కడి కేఁగెద - రెవ్వారు మీరు ?
కరికరోపమ కమ్ర - కరములు నరుణ
చరణముల్ సరిపూర్ణ - చంద్రాననములు
హరివలగ్నములు బిం - బాధరంబులును
సరసిజపత్ర వి - శాలనేత్రములు
పీనవక్షములు గం - భీరయానములు
మేనుల తేజంబు - మెఱుఁగుఁ జెక్కులును
కల మీరు రాజల - క్షణలక్షితాంగ
విలసనశ్రీల నీ - విశ్వమంతయును
నేలఁ జాలిన వార - లేటికి కొండ
ఱూలంబుఁ జేరితి - రో యయ్యలార !
జగతికి డిగు సూర్య - చంద్రులరీతి
మిగుల రాణించు మీ - మేనుల చాయ

యీవను లీశైల - మీ నికుంజములు
పావనశోభాభ్ర - భావముల్ గనియె
సకలవిభూషణో - జ్జ్వలులుగాకేల
యకట ! యీ మునిచర్య - లందివచ్చితిరి ?
కుపసమూడ్చిన త్రాఁచు - కొదముల రీతి
నవరంజి కత్తులా - యతకరాగ్రములఁ
బూనుక యమ్మహా - భోగులవంటి
నానాస్త్రములతో దొ - నల్ సవరించి
యెక్కువెట్టిన విండ్ల - నిక్కడి కేమి
యక్కఱఁగలిగి మీ - రరుగుదెంచితిరి ?
ఆనతీగదరన్న ! - యప్పటనుండి
యేనెంత వేఁడిన - నేమియుననక
యురకయుండెదరేల - యో తండ్రులార !
అరసేయ కొకమాట - యానతియిందు
జలజాప్తసుతుఁడు నా - స్వామి సుగ్రీవుఁ
డలఘుతేజుఁడు నన్ను - నంపినవాఁడు
ఆ భానునందనుఁ - డన్నయా వాలి
చే భార్యఁ గోల్పోయి - క్షితియెల్ల నొసఁగి
యని నోడి యీకొండ - యండగానుండి
తన వెంట నల్వురు - త్తమసత్త్వనిధులు
యేను మున్నుగఁ గొల్వ - నిచ్చోట వాలి
రాని చోటని యెంచి - రాయిడిలేక
నెమ్మదితో నుండి - నేఁడిందువచ్చు
మిమ్ము విలోకించి - మిగుల శంకించి
'యెవ్వరో వీరు నీ - విప్పుడే పోయి

యివ్విధంబని వారి - నెఱిఁగిరమ్మ'నుచు
మీతోడిచెలిమి తా - మిగుల నాసించి
ప్రీతిఁ బంపిన వాఁడు - పెంపెల్ల మాఁటి
వచ్చితి నిట కేను - వాయునందనుఁడ
నచ్చుగా హనుమంతుఁ - డందురు నన్ను
పవమాననమానస - పదవిజిగీషు
జవసత్త్వశాలిని ని - చ్ఛావిహారుఁడను 38
కామరూపము నందఁ - గలవాఁడఁ గాన
నీమేన సుగ్రీవ - హితమతి నగుచు
నే వచ్చినాఁడ నా - యెడఁ గృప యునిచి
యీ విధంబని మిమ్ము - నెఱిఁగింపుఁడనిన
నామాటలకు మది - నలరి యుప్పొంగు
సౌమిత్రితో రాము - చంద్రుఁడిట్లనియె.
"ఎవ్వానితోఁ జెల్మి - యిచ్చలోఁ గోరి
యివ్వనభూముల - కే తేరవలసె
నట్టి సుగ్రీవుని - యనుచరుండితఁడు
చుట్టమై వచ్చె ని - చ్చోనపూర్వముగ? 39
మంచిమాటలు పల్కి - మనసిచ్చి యాద
రించుము మది నల - రించె నిందాక
చాల ఋగ్వేదంబు - చదువని వాఁడు
పోల యజుర్వేద - ము పఠింపనతఁడు
సామవేదమున వా - సనలేని వాఁడు
నామీఁద నాథర్వ - ణానభిజ్ఞుండు
నేర్చునే యీరీతి - నిలిచిమాటాడ
నేర్చువ్యాకరణమీ - నిపుణమానసుఁడు

పునరుక్తులపశబ్ద - ములు లేక నుదుట
కనుబొమలను నాసి - కను జూపులందు
మొగమునందు వికార - ములు లేక మాట
నగము వల్కకయప్ర - సక్తముల్ గాక
వెనకయు ముందట - వెదుకక జోలి
వెనచక వినిన తె - ల్విడి గనుపింప
కొదుకుదు వడక శ్రో - త్కుడుపాటు లేక
యెదనుండి కుత్తుక - నెనసి మోమునకు
నవరనగా వచ్చు - శబ్దముల్ చెవికిఁ
నవి పుట్ట మధ్యమ - స్వర శేషమున
దుడుపరించక యింపు - దులకింప చిక్క
వడనీక త్రిస్థాన - భావ్యంబులైన
పరమకళ్యాణ సు - భాషితావళులు
సరళంబులగుచు ర - సస్థితుల్ గలుగ
నిటువలెఁ బలికిన - నెత్తిన కత్తి
యటువైచి నతిశౌద - నని వచ్చినట్టి
పగవాఁడు నేఁటికి - బద్ధుఁడు గాఁడు?
మగసిరి మంగలీ - మాటలన్నియును
నిట్టి యాప్తుఁడు లేని - యెడమహీపతుల
కెట్టు చేకూరు వా - రెంచిన పనులు ?
తగినట్టి యొక్కప్ర - ధాని గల్గినను
జగతీశునకుఁ గల్గు - సకలభాగ్యములు!
ఇంతటివాని న - య్యినసూతి యెట్లు
సంతరించెనొ పుణ్య - సంపదచేత!
ఇతఁడు గల్గిన వాని - కెల్లకార్యములు

కతమిచ్చు కొంగు బం - గారముల్ గావె?
ఘూటాడు" మనిన ల - క్ష్మణకుమారకుఁడు
పాటించి పవనసం - భవున కిట్లనియె.
"నీచేత సుగ్రీవు - ని తెఱంగు మాకు
గోచరించెను చెల్మిఁ - గోరి వచ్చితిమి.
అతనితో నీవాడి - నట్టి చందమున
హితమాచరించెద - మినకుమారునకు
మానుతు ఇంట మీఁద - మదివిచారములు
భానునంగనుఁ డాప్త - బంధుండు మాకు."
అని పల్కుటయుఁ దన - యధిపతి కార్య
మనుకూలమయ్యె కృ - తార్థుఁడనైతిఁ
జెలిమికి నగు చింత - సేయుదు ననుచుఁ
దలఁచి యాపవమాన - తనయుఁడుప్పొంగి

—: రామలక్ష్మణుల పంపాసరోవర ప్రాంతాగమన కారణమును విని హనుమంతుఁడు వారలను సుగ్రీవుని యొద్దకుఁ గొనిపోవుట :—

"చేకూడె వీరితోఁ - జెలిమి నాస్వామి
కే కార్యమో వీర - లీడేర్పఁదలఁచి
చెలిమి యాశించి వ - చ్చిరి వీరలొక్క
బలవంతుతోఁ జాలఁ - బగఁ గొన్నవారు.
అదియుఁ దీర్చెదమని" - యాత్మభావంబు
ముదితాత్ముఁడగుచు రా - మునికి నిట్లనియె.
"అయ్య! యీ ఘోరమై - నట్టి కానలకు
నియ్యెరువురు మీర - లేల వచ్చితిరి

యానతిం"డని వల్కు - హనుమంతు మాటఁ
దానందుకొని సుమి - త్రాపుత్రుఁడనియె.
"దశరథుఁడను నయో - ధ్యానాయకుండు
దిశలెల్ల బాలించు - దినకరాన్వయుఁడు
ధార్మికాగ్రణి యజా - తవిరోధి సత్య
ధర్మపాలకుఁడు మా - తండ్రియవ్విభుడు.
మొదట యగ్నిష్టోమ - ముఖ్యయాగములు
పదిపదులును జేసి - బ్రహ్మను బోలి
తా సర్వసమవృత్తి - ధరయేలు నట్టి
వాసవ సన్నిభు - వరపుత్రుఁడితఁడు
పరమకల్యాణుఁడా - పద్మాంధవుండు
శరణాగతావన - జాగరూకుండు
సర్వలక్షణగుణ - సంపూర్ణుఁడఖిల
నిర్వాహకుఁడు సత్య - నియతమానసుఁడు
జనకుని యనుమతి - జానకిఁ గూడి
నను దోడుకొని గహ - నములకు వచ్చె
శ్రీరాముఁ డీరాజ - సింహుఁ డీయనకుఁ
గూరిమి తమ్ముఁడ - గొలిచిన వాఁడ
దాసుఁడ సౌమిత్రి - తనపేరు సౌఖ్య
భాసురుఁడౌదార్య - పరుఁడు ప్రాజ్ఞుండు
సూనృతవాది య - శోధనుఁడఖిల
దీనసంరక్షణ - దీక్షావినోది
సత్యపరాక్రమ - సంపన్నుఁడుచిత
కృత్యుఁడు పూజ్యుఁడ - క్లిష్టకర్ముండు

ధన్యుండు సర్వభూ - తహితుండు లోక
మాన్యుండు నైనట్టి - మాయన్న దేవి
యేమిర్వురము లేని - యెడఁ బర్ణశాల
భూమిజ యసహాయ - మునసున్న వేళ
నెవ్వఁడో రాక్షసుఁ - డెత్తుక పోవ
నవ్వామలోచన - నరయుచు వచ్చి
త్రోవలోపలఁ గబం - ధుని గాంచ వాఁడు
దేవత్వమున మింట - దివ్యయానమున
నిలిచి మీసుగ్రీవు - ని తెఱఁగు మమ్ముఁ
జెలిమి చేసిన మాకు - సీత చేరుటయుఁ
బగఁ దీర్చుటయుఁ దేట - పఱచివాఁడేఁగ
జగతీతనూజ ని - చ్చట వెదకుచును
నినుఁగంటి మిదియ మా - నిర్ణయంబిట్టి
యనఘుఁడు సకలలో - కైకనాయకుఁడు
రామచంద్రునియంత - రాజు సుగ్రీవుఁ
గామించి యాతనిఁ - గర్తగా నెంచి
కొలిచి యాయన కను - కూలుఁడై యతని
వలయు గార్యములఁ గై - వశుఁడై మెలంగ
శరణంబు వేడి యి - చ్చట మీదువలన
తరణినందనుని వ - ర్తన మెల్లఁ దెలిసి
వసుధ దివ్యులకు నె - వ్వనియనుగ్రహము
పొసఁగకుండిన సౌఖ్య - ములు లేక యుండు
నట్టి మాయన్న మీ - యర్కనందనుని
పట్టు చిత్తమున చే - పట్టినవాఁడు!
ఆసించు వారి స - హాయుఁడౌ స్వామి

మీసహాయంబు గా - మించినవాఁడు!
ఆపన్నుఁడగుచు సై - న్యములతో మీరు
ప్రాపుగావలసి మీ - పాలికిఁ జేరె!"
అనుచుఁ గన్నీటితో - నడఱు లక్ష్మణుని
గని వాయుతనయుఁడు - క్రమ్మఱంబలికె.
"నరవరులార! య - నంతకల్యాణ
పరమసద్గుణగణ - పరిపూర్ణుఁడైన
శ్రీరామచంద్రుని - చెలిమి గల్గుటను
మారాజుభాగ్యసం - పద నెన్నఁదరమె!
సుగ్రీవుపాలిటి - సుకృతంబు ధార్మి
కాగ్రణులైన మి - మ్మరలేక తెచ్చె
నాయన రాజ్యంబు - నాలిఁ గోల్పోయి
పాయని వెతలఁ బా - ల్పడి యున్నవాఁడు
బలవంతుఁ డాతఁడీ - పట్టున సీతఁ
జలపట్టి యెటులైన - సాధింపఁగలఁడు
ఏమెల్లఁ గలుగ న - య్యిన సూనుచేత
నేమి దలంచిన - నీ డేరు మీకు!
చూతురు రంతు మీ - సుగ్రీవు" ననిన
నాతరి సౌమిత్రి - యన్న కిట్లనియె.
"ఇతని మాటలు వింటి - రే భానుతనయు
కతమున సాధింపఁ - గలము జానకిని
వాయుపుత్రుఁ బ్రసన్న - వదనభాషణము
లీయెడ సత్యంబు - లితవగు మనకు
బోవుద మనిన" య - ప్పుడె బ్రహ్మచారి
తావానరాకృతిఁ - దాల్చి మైపెంచి

తన వీపుపై రఘూ - ద్వహుల నెక్కించు
కొని మదోత్కట భద్ర - కుంజరంబనఁగ
వినతనూజుని చెంత - కేఁగి యాకెలని
వనములో వారల - వసియింపఁ జేసి
వారల రాక స - ర్వమును సుగ్రీవుఁ
జేరి తానంజలిఁ - జేసి తెల్పుటయు

— శ్రీరామ సుగ్రీవుల సమావేశము —

ననఘాత్ములని పూజ్యు - లనియు శరణ్యు
లనియు విశ్వసనీయు - లనియుఁ దానమ్మ
వానరరూపంబు - వదలి భానుజుఁడు
మానుషాకృతిఁ దాల్చి - మణిమయాహార
కోటీర కంకణ - కుండలకనక
శాటీవిభా చక - చకలు రాణింప
జానకీరమణుని - సంధించి కొన్ని
కానుకలునిచి యా - కపివరుండనియె.
"ధరణీశ! సకలభూ - తహితుండవనియుఁ
గరుణాకరుఁడవు వి - క్రమనిధివనియు
సత్యసంధుఁడవని - సద్గుణైశ్వర్య
నిత్యుఁడవనియును - నీప్రభావములు
మా వాయుసుతుఁడు ప - ల్మారు వాకొనఁగ
దేవ! నేనలరి సం - ధించితి మిమ్ము
యిట్టి నాకేఁటికి - యీవనచరుల
చుట్టరికంబని - చూడక వచ్చి

నన్ను మన్నించుట - నాదువంశంబు
వన్నియఁ గాంచెఁ బా - వనుఁడ నేనైతి
నాతపంబు ఫలించె - నాపుణ్యవాస
నాతిశయంబుచే - నబ్బె నీ చెలిమి
కరముసాచితి నన్నుఁ - గరుణించి నెయ్య
మరమర లేక నే - యఁగ నెంచె దేని
వలకేలొసంగి నా - వాఁడవీవనుచుఁ
బలుకుము నమ్మించి - పని గొమ్ము నన్ను!"
అనుటయు దక్షిణ - హస్తంబొసంగి
జనకవిభుండు భా - స్కరకుమారకునిఁ
గౌఁగిట నిండారఁ - గదియించి కంట
నాఁగినప్రముద బా - ష్పాంబుపూరముల
నోలనాడంగ వా - యుజుఁడు మథించి
కీలిఁ జేకొని తెచ్చి - కెలన నుంచుటయు
నిరువురు వలవచ్చి - యింధనవహ్ని
పరమసాక్షిగ మాట - పట్టుగైకొనుచు
నన్యోన్యవదన స - మాలోకనముల
ధన్యులై యిరువురు - తమ కార్యములకు
నోరవారలు వోక - యొద్దిక యగుచుఁ
దీరుచుఁ గనునట్టి - తేఁకువల్ గలిగి
సామీరి యునుచు కే - సరపుష్పవర్ణ
కోమలంబగు నేపె - కొమ్మపానుపున
సరిగాఁగ వసియింప - చందనశాఖ
కరువలిపట్టి ల - క్ష్మణునకు నిడఁగ
నతఁడందు మీఁద స - మాసీనుఁడైన

శతపత్ర హితతనూ - జాతుఁ డిట్లనియె.
" అయ్య ! మీరాడిన - యప్పుడే నాదు
తొయ్యలి చేకూడెఁ - దునిసెను వాలి
కలిగెను రాజ్యంబు - కడతేరె చలము
ఫలియించెఁ గోరికల్ - బంటనే నైతి
నేగులన్నియు మాని - సిలుగులు దీఱె
వేగె నాపాలికి - విరిసెఁ జీకటులు
వికసిల్లె మనము ప్ర - వేశించె శుభము
సకలేశ ! నీకటా - క్ష ప్రభావమున

సుగ్రీవుని సీతాన్వేషణప్రతిజ్ఞ-పాఱవేయఁబడిన సీతయొక్క యాభరణముల నాతఁడు శ్రీరామునకుఁ జూపుట :—

శ్రీరామ ! మీరు వ - చ్చిన రాక విపిన
చారులౌటయుఁ బర్ణ - శాల నుండుటయు
మీరు లేనట్టిచో - మీదేవి నొకఁడు
చోరుఁడై యెత్తుక - జుణిఁగిపోవుటయు
హనుమంతుచే వింటి - నవనిజఁ దెచ్చు
పనియెంత యదినాదు - భారంబు గాదె!
పోయిన శ్రుతిఁదెచ్చు - పోలిక నీదు
జాయను జేకూర్చఁ - జాలుదు నేను
యేలోకముననున్న - నేఁదెత్తు సీత !
పాలసుఁడై విష - పానంబుఁ జేసి
బ్రదుకునే నరుఁడు ? సు - పర్వనాయకుఁడు
తుదిముట్టునే నీదు - తొయ్యలిఁ బట్టి ?
అసురనాథుఁడు సీత - నాకాశవీథి

దానఁగులఁ బెట్టుచుఁ - దోకొని పోవఁ
గనుఁగొంటి వాని యం - కములపై 'రామ!
నను గావవే! లక్ష్మ - ణా! యడ్డపడవె!'
అనుచు నేడ్చుచుఁ బోవు - నది మీరు తెలుప
విని తలఁపున వచ్చె - వీరునల్వురను
నేనొక్కఁడను గూడి - యిచ్చోట నుండఁ
దా నాగకన్య వి - ధంబున సీత
యుత్తరీయములోన - నొకకొంత చించి
యత్తరిఁ దనమేని - యాభరణముల
నిచ్చోట బడవైచె - నేనవి తెచ్చి
యిచ్చెద గుఱుతుగా - నీక్షింపుఁ" డనుచు
బలికిన నవ్వి యా - భరణము లవ్వాడ
వలయుఁ దెప్పింపు నీ - వారిచే ననిన
తన గుహలో నొక్క - తావున డాఁచి
యునుచు సొమ్ముల మూట - యున్నట్ల దెచ్చి
సముఖంబు నందు నుం - చఁగఁ రఘువరుఁడు
తమిఁ జూచి యామూటఁ - దనకేల నంది
విప్పిన దిగదిగ - వెలుఁగుచు సీత
నప్పుడు చూచిన - యట్లు భ్రమించి
నెమ్మోము మంచు నిం - డినఁ దల్వి మాయు
తమ్ముల పగర చం - దమ్మున వాడ
"హా! సీత! హా! సీత! - యని కన్ను మొగిచి
యా సుమిత్రాకుమా - రాదులు గలఁగ
ధరణిపై వ్రాలి యం - తనె తేఱి తొడవు
లురముపై నుంచి తా - నుసురసురనుచు

"చూచితే లక్ష్మణ! - సుగ్రీవుకెలని
వైచెను జానకి - వరభూషణములు!
ఏరీతి వదలుచు - నేఁగెనో?" యనుచు
సూరాత్మజుని మోముఁ - జూచి యిట్లనియె.
"భానుజ! యేరీతిఁ - బలవరింపుచును
జానకి వోయె? నే - జాడఁ జూచితివి?
ఎవ్వఁడింతకు దిగి - యెత్తుక చనియె?
క్రొవ్వి వాఁడేటికిఁ - గూలక యుండు?
ఇంతపాతకుని నీ - వెఱిఁగింపు మిపుడె
యంతకు వీటికి - ననుపుదు వాని!"

—స్నేహితుఁడైన సుగ్రీవునికి శ్రీరాముఁడు వాలిని వధించెదనని ప్రతిజ్ఞఁజేయుట :—

అనిన గద్గద కంఠుఁ - డై భానుసుతుఁడు
మనువంశమణికిఁ బ్ర - మ్మర నిట్టులనియె.
"దేవ! వాఁడేఁగిన - తెఱువెఱుంగుదును
రావణనామ మా - త్రము విన్నవాఁడ
నతని యూరును లావు - నతని వర్తనము
నితర మేమియును నే - నెఱుఁగ నేమిటను
నిజము వల్కెద నవ - నిజ నెట్టులైన
నజరులు మెచ్చ నే - నర్పింతు మీకు
రావణుఁ బుత్ర పౌ - త్రయుతంబు గాఁగఁ
గావరం బణఁచి యె - క్కడనున్నఁ ద్రుంతు!
పొగడొందు మీకు నీ - బుద్ధి లాఘవము
తగవు కాదేటికి - ధైర్యంబువదల?

నింత చింతిలుదురే - యోఁ గల్గియుండ
నెంతటి ఘనులైన - నెటు గాకమాను
నిటు జూడుమయ్య! ప్రా - కృతవానరుండ
నెటువంటి దుఃఖంబు - నెంతలేదనుచు
నున్నవాఁడను! మహీ - శోత్తంస! నీకుఁ
గన్నీరుఁ దెచ్చుట - గాదు పల్మారు
బలవంతమై ప్రాణ - పర్యంతమైన
వలమట వచ్చిన - నతిధీరమతులు
తమలోన తాల్మిచేఁ - దాలుకొనంగ
వమరుగాకిట్లు దై - న్యంబుఁ జెందుదురె?
తెలియక మూఢుఁడై - ధృతిలేనివాఁడు
కలము భారమున సా - గరములో మునుఁగు
కైవడి శోకసా - గరములో మునుఁగుఁ
గావునఁ జలియింపఁ - గాదెట్టియెడల!
మ్రొక్కెద మీపాద - ములకు దీనసము
చిక్కఁబుట్టుము చింత - చేఁ గుందవలదు
సుఖవిగమ్మిప్పుడు - శోకించి నరుఁడు
సుఖమందలేఁడు తే - జోహానిఁ జెందు
ననఘ! యేనింత వ - యస్యభావమునఁ
జనవిచ్చుకతన, మీ - చల్లదనంబు
మది నమ్మితోఁచిన - మాటలాడితిని
సదయాత్మ! యిదిమీరు - సహియింప వలయు
ననుమీను సేయు మ - న్ననకఁ దార్కాణ
గనుపింప సైరణఁ - గనుఁడని" పలుక

రాముఁడు నారచీ - రచెఱంగు చేతఁ
దామరసదళాయ - తవిలోచనముల
దొరగు కన్నీరు వోఁ - దుడిచి సుగ్రీవుఁ
బరమాప్తుగా మది - భావించి పలికె
" చెలికాని తనము మ - చ్చికయును దలఁచి
పలికిన సీహిత - భాషణంబులను
మనను రంజిల్లె సే - మంబుఁ గాంచితిని
నినుఁబోలు నింకొక్క - నెయ్యుఁడున్నాఁడె ?
సీతను వెదకింపఁ - జేయుము యత్న
మాతతాయులఁ బట్టి - హతము సేయుదము
రావణవధకుఁ గా - రణమైన పూన్కి
యీవిధంబని మది - నెంచి హత్కొనుము
తొలుకరియందు వి - త్తులుమంచి నేల
ఫలియించుక్రియ నాదు - పలుకులన్నియు
నియందు ఫలియింప - నీడెందమునకు
చాయమై తోఁచిన - జాడ వర్తిలుము
నాసత్యమాన యె - న్నడు నాడి తప్పఁ
జేసినట్టి ప్రతిజ్ఞఁ - జెల్లింతుగాని !
కడమ యేఁటికి నాదు - కార్యభారంబుఁ
గడతేర్ప నీచేతఁ - గాక చొప్పడదు
నాదు ప్రాణాభిమా - నములు రక్షింప
నేదిక్కు చూచిన - నీఁక వేరులేదు
నేరమిట్లని పల్క - నీచేతిలోని
వారము వలయుకై - వడిఁ బనిగొనుము "
అనిన భానుజుఁడు త - దాప్తులుఁ జాల

మనముల నుప్పొంగి - మారాడ వెఱవ
నితరేతరము నిట్టు - లేకాంత వేళ
హితభాషణములాడు - నేత త్క్షణంబ
సీతను సాధించి - శ్రీరామవిభుని
చేతికందిచ్చిన - చెలువగ్గలింప
సౌమిత్రి యరల భా - స్కర కుమారకుఁడు
రామచంద్రునితోడఁ - గ్రమ్మఱఁ బలికె. 690

—: శ్రీరాముఁడు వాలిని వధించుటకుఁ బ్రోత్సహించుట :—

"శ్రీరామ! నినువంటి - స్థిరశౌర్యశాలి
కూరిమి వెనుచు నా - కు హితుఁడుగాన?
నాకుఁ గావలయు మా - నస హితార్థములు
చేకూరెనని దలం - చితి నిక్కవముగ
నీవు చేపట్ట ని - న్నింటికేని తగుదు
నీవాఁడనైన నే - నిఖిలపూజ్యుఁడను
సాధింతు నింద్రుని - సామ్రాజ్యమైన
నీధాత్రి సాధించు - టెంత నీకరుణ!
ఇనవంశమణులతో - నిటవానరులకు
ననుపమ స్నేహ మి - ట్లబ్బిన కతన 700
మావారిలో నస - మాన గౌరవముఁ
బావనత్వమును సం - భావించె నాకు
నన్నునేఁ బొగడు కొ - నంగరాదనుచు
నెన్ని మీతోడ నొం - డేమియుఁ బలుక
నాఁడు నాఁటికి నాదు - నడకల నింత
వాఁడని చిత్తంబు - వచ్చుఁ గార్యములఁ

బలుకుటేల ? మహాను - భావులతోడి
చెలిమి సామాన్యమే - చేసెద మనఁగ
నీతోడ నెయ్యమ - నేక కార్యముల
హేతువుల్ కోరిక - లీడేర్చుటకును
జ్ఞానాధికుని మది - చలియింపనట్టి
పూనిక నిర్విఘ్న - ములు కామితములు
కలిమిని లేమి నొ - క్కసమంబె కాని
తొలఁగింప రాద్యులు - తోడ్పడువారి
చేపేదమైన నొ - చ్చిన దీలుపడిన
ప్రాపున నమ్మిన - పరమాప్తజనుల
విడువక తమసౌఖ్య - విభవరాజ్యములు
విడుతురు సజ్జనుల్ - విమలకీర్తులకు ''
అన విని యిటుల యగా - నని సమ్మతించు
జనకజారమణల - క్ష్మణులఁ దోకొనుచు
నవ్వాలి వనికేఁగి - యచ్చోటనొక్క
పువ్వులతో సాల - భూరుహశాఖఁ
గొనివచ్చి తావైచి - కూర్చుండ రాము
నునిచి తా చెంగట - నొయ్య వసించి
యొకకొమ్మ పవనుజుఁ - డునుప సౌమిత్రి
యొకఁడు దాన వసింప - నుచితవాక్యముల
శ్రీరాముఁజూచి సు - గ్రీవుఁడు వినయ
గౌరవముకులిత - కరుఁడౌచుఁ బలికె.
'' వాలిచేఁ గులసతి - వసుధయు నిట్లు
కోలుపోయి వహించు - కొనువారులేక

నా చేతఁ గాక మి - న్నక చెట్టుపట్టి
యేచోటఁ దలయెత్త - నీక బాసి నను
నున్న వానికి నాకు - నో తండ్రి! యిట్టి
ఖన్నంబుఁ దీఱని - పదములుఁ గంటి
మఱుఁగుఁ జొచ్చిన నన్ను - మన్నించి బ్రదుకుఁ
దెఱవు చూపఁగ నీవె - దిక్కయినావు
రక్షింపు" మనిన ధ - ర్మజ్ఞుండు ధర్మ
రక్షకుఁడును నగు - రఘువీరుఁ డనియె
" ఉపకారమొనరింప - నుచిత మాప్తులకు
నపకారమొనరించు - నది శత్రువిధము
గావున నీవైరిఁ - గడ తేర్ప లేక
యీవిండ్లు నమ్ములు - నేల పూనితిమి?
అపరంజికట్టు మ - హాశాతశల్య
నిపుణంబులును గరు - న్నిచయ ఝూంకృతులు
రత్నపుంఖములు వ - జ్రప్రతిమములు
నూత్నశిలాశాఖి - నుకములు నైన
శాతప్రకాండ ప్ర - కాండముల్ గ్రోల
నాశించె వాలి ప్రా - ణానిలంబులను
చూడు! మీ వను" మాట - సుగ్రీవు మదికి
వేడుకయును జాల - వెతయుఁ గావింప
"దీనుఁడనగు నాకు - దిట దెచ్చి ప్రాణ
దానంబుఁ జేసిన - ధన్యుఁడీతండు
ఇతని కార్యమునకే - నిత్తుశరీర
మతి మానుషంబులీ - యన చరిత్రములు
బ్రదుకఁ గంటి" నటంచుఁ - బలుకంగఁ బోయి

కొడుకుడు వడుచుఁగొ - ల్కులవెంట జాలి
కన్నీరు దొరుఁగ గ - ద్గదకంఠుఁడగుచు
విన్నపంబని రఘు - వీరుతోఁబలికె
"శ్రీరామ! యేను కి - ష్కింధఁ గొన్నాళ్లు
స్వారాజ్య మింద్రుని - జాడ నేలితిని
ఆ వెన్క మావాలి - యతి బలశాలి
తా వచ్చి యిల్లాలిఁ - దగఁబట్టి యేలి
యవనియుఁ గైకొని - యదలించి త్రోచి
యవమతిచేసి న - న్నటు తాఱఁదరిమి
తిగిచి నావారి బం - దిగములవైచి
నొగిలించి కొండఱ - ను ద్రోలంగఁద్రోలి
యిచ్చోటనేనున్కి - యెఱిఁగి కొండఱను
ముచ్చిలి పొడిపింప - మూఁకలనంప
వారి నేఁ బోనీక - వధియించి తనకుఁ
దీఱనిపని గానఁ - దెగిచంపలేక
తానిందు రారాక - తక్కినవారి
చేనన్ను గెలిపింప - చేతనుఁగాక
యూరట చాలక - యున్నాఁడుగాన
మీరాక చూచి న - మ్మిక చాలనైతి!
వాలి పంచినయట్టి - వారిగా నెంచి
యోలక్ష్మణాగ్రజ! - యోడి పాఱితిమి
బలవంతులును నీతి - పరులును బుద్ధి
గలవారు నగుటయే - గద నన్నుగాచి
యీనల్వురనుఁ జెంత - నెడవాయలేక
సూనుల క్రియఁగాచి - చుట్లునుండుదురు

వలువురు దనకు ప్రా - ణసమానులగుట
యలమటలకు నోర్చి - యణఁగి యుండితిని !
జగదీశ ! నాదు వి - చారముల్ దీఱి
పగయణఁగదు వాలి - వడఁజూచికాని
సుఖదుఃఖ సమయముల్ - చూడక ప్రాణ
సఖులతోఁ దనదు ము - చ్చటలెల్లఁ దెలుప
వలయుఁ గావున మీరు - వగపుతోనున్నఁ
దెలుపఁ గావలసె నా - తెఱఁగెల్ల మీకు
రక్షింపుఁ" డనిన పూ - ర్ణదయాసముద్రుఁ
డీక్షించి సుగ్రీవు - నిట్లని పలికె.
"వాలికి నీకును - వైరంబు వచ్చె
నేల యింతటిపగ - కేమి కారణము !
అతని బలంబును - నతని పౌరుషము
నతని వృత్తాంతమే - నరసిన వెనుక
వానకాలము నది - వలెఁ జాలవేగ
మైనట్టి నాకోప - మతనిపైఁ జూపి
తునిమెద నీకు ని - త్తును గోర్కులెల్ల
నేనుమానములు మాని - యది తెల్పుమనిన"
ఆనమాటకు వాన - రాగ్రణి యలరి
యానమాధిక రహి - తాత్ముతోఁబలికె

—: సుగ్రీవుఁడు వాలితోఁ దనకుఁగల్గిన వైరకారణ
మునుఁ జెప్పుట :—

"శ్రీరామ ! మున్ను కి - ష్కింధఁ బాలించు
శూరుఁడౌ ఋక్షర - జుఁడగచరుండు

ఆవానరాధీశుఁ - డగ్రకుమారుఁ
డౌవాలి కతఁడిచ్చె - నఖిలరాజ్యంబు
నాయన చెప్పిన - యట్టికార్యములు
సేయుచు నేను గొ - ల్చినవాని కరణి
నరమర లేక భ - యంబు భక్తియును
దొరయ నేఁగాచిన - దొరయగాట వాలి
నాయఁడు తనదు ప్రా - ణములట్లప్రీతి
సేయుచు చనవిచ్చి - సిరులుపాలించి
మెలఁగుచో నొకనాఁడు - మిన్నక క్రొవ్వి
యలుకతో దుందుభి - యనెడు రాక్షసుఁడు
చలపట్టి యొక్కఁడు - నరిప్రొద్దువేళ
బిలమువాకిట నిల్చి - పేర్వాడి పిలిచి
కలనికి రమ్మన్నఁ - గ్రక్కున వాలి
యలిగి కయ్యము సేతు - నని యిల్లువెడల
వలదని యవ్వాలి - వనితలు నేను
నిలిపిన క్రోధంబు - నిలుపక వాలి
యారేయి నను వల - దని యింటనునిచి
ధీరుఁడై యొకఁడు దై - తేయుపైఁ బోవ
మనసు నిల్వక యేను - మాయన్నవెంట
నని సేయ వెడలితో - డైవచ్చునంత
మమ్ము నిద్దఱఁ జూచి - మల్లాడ వెఱచి
యమ్మదాంధుండు భ - యంబుచేఁ బాఱి
తఱుముక నేము ని - ద్దఱము రా వాఁడు
ధరణి బిలంబు కొం - దలముతోఁ జొచ్చి
పోయిన నన్నునా - పొంతఁగావునిచి

మాయన్న యతని వెం - బడి గుహఁజొచ్చి
యైరావతంబను - నమ్మహాబిలము
ఘోరాంధకార సం - కులమైన కతన
వెదకి దానవుఁబట్టి - విడవకయొంటి
కదనంబు సేయ న - క్కడ యేడు గడచె.
వాలిదుందుభుల రా - వంబులు రెండు
నాలకించితి నంత - నాగహ్వరమున
నిండారు నురువుల - నెత్తురుఁ గాల్వ
కండలతోడ న - క్కజముగా వెడలె
నది చూచి దానవుఁ - డక్కటా! వాలిఁ
గదనంబులోపలఁ - గడ తేర్చె ననుచు
నవనీధరంబా మ - హాబిలాభీల
వివరంబులో వైచి - విన్నఁబాటొదవఁ
బురికి నేతేర న - ప్పుడు మంత్రులెల్ల
దొరఁజేసి నన్నని - ర్దోషుగా నెంచి
పట్టంబు గట్టినఁ - బ్రజలనాప్తులనుఁ
జుట్టంబులను దయఁ - జూచి బ్రోచుచును
నున్నచో నవ్వాలి - యురుసత్వశాలి
యన్నిశాచరుఁద్రుంచి - యటకుఁ జేరుటయు

—: శత్రువిజయానంతరము మఱలివచ్చిన వాలి, సుగ్రీవుని ద్రోహిగాఁదలంచి రాజ్యమునుండి వెడలఁగొట్టుట :—

నెదురుగా నేనేఁగి - యేడ్చుచు వాని
పదములపై వ్రాలి - బాష్పాంబు లురుల

"అన్న! వచ్చితివె! నీ - వని కేఁగు నపుడు
తన్ను నా గహ్వర - ద్వారంబు నందు
నునిచి నీవేఁగిన - నొక యేఁడు గాచి
వెనక మీయిర్వుర - వీరనాదములు
వింటి నావెంబడి - వివరమార్గమునఁ
గంటి సఫేనర - క్తప్రవాహంబు
నది చూచి వెఱచి నే - నచలంబుఁ దెచ్చి
వదలక యాబిల - ద్వారంబు మూసి
వచ్చితి నిటకేను - వలదన్న వినక
యిచ్చిరి సామ్రాజ్య - మీమంత్రివరులు.
కాచితి నిన్నాళ్లు - కడఁక మీసొమ్ము
నీ చేత కిచ్చితి - నీదు సేవకుఁడ
నివె బీగముద్రలు - హితులును బంధు
నివహముల్ వీరె మ - న్నింపు మిందఱను
నిదె ధవళచ్ఛత్ర - మిదె చామరంబు
నదియె కిష్కింధ మీ - రర్థిఁ గైకొనుఁడు
నను గావుమెపుడు ను - న్న తెఱంగుతోడ
నినుఁ గొల్చియుండెద - నీచిత్తమునకు
రాకున్న వెడలి య - రణ్యముల్ చేరి
యాకలములు దిని - యైన నుండెదను
ద్రోహిని గాను మీ - దు పదంబులాన!
యూహింపుఁడని మఱి - యును బ్రణమిల్లి
లేవక యున్న వా - లి దురాగ్రహమున
దీవింప కనరాని - తిట్టులు తిట్టి
పదముల ననుఁద్రోచి - బంధులఁజూచి

"ఇది గంటిరే! వీని - నెటులోర్వవచ్చు?
నేను దానవునితో - నెక్కటిఁ బోరఁ
దానొక్కనగము కం - దరమున వైచి
వచ్చియున్నాఁడేను - వాని వధించి
వచ్చిమున్ వచ్చు త్రో - వయుఁగాన లేక
నుడిగొని సుగ్రీవ! - సుగ్రీవ! యనుచు
వెడలఁ గానక వీఁడు - వేసిన యట్టి
బిలము వాకిట కొండ - బిట్టుగా పాద
తలమునఁ బొడిగాఁగఁ - దన్ని యాత్రోవ
వెలువడి వచ్చితి - వీని దుష్కర్మ
ఫలమేల యనుభవిం - పక పోవఁడీఁడు!"
"అని నాప్రధానుల - నందఱఁ బట్టి
పెను సంకెలలువైచి - పీఁచంబు లడఁచి
వారిండ్లు ముద్రించి - వారి ద్రవ్యములు
చూఱలు గొని నన్ను - నుడియఁగనీక
వెడలి పొమ్మన నూరు - వెడలి ప్రాణములు
పిడికిట బట్టుక - భీతిచేఁ బఱచి
యెదుట నిల్వఁగ నీడ - యెఱుఁగకయిట్టి
యచలంబుపై వీర - లరసి పోషింప
వాలికి రారాని - వసతి గావునను
యీలీల నుండితి - నిన్నినాళ్లకును
గనుఁగొంటి మీపాద - కంజముల్ చేర
మనుగంటి తీఱె నా - మది విచారంబు
తనరాజ్యభోగముల్ - తానుఁగైకొన్నఁ
జనుగాక పొమ్మనఁ - జను నయ్యా! నన్ను

వెడలిపొమ్మనుగాక - విగ్రహించినను
పడఁతి నేమని చెఱ - వట్టి మాయన్న
తొలఁగుబావతనంబుఁ - దొలఁగి యావాలి
యెలమితో మఱఁదలి - నేలుచున్నాఁడు ?
వేయేల ? యీచెఱ - విడిపించి తన్ను
జాయాసమేతుగా - సదయుండవగుచుఁ
గావింపుమన లేన - గవు మోముతోడ
నావానరేంద్రున - కనియె రాఘవుఁడు.
“ చెలిమి నాతోడఁ జే - సియు నింతదింత
గలదె సుగ్రీవ ! యిం - కవిచార మేల ?
వాలిఁ జంపుదు నే న - వశ్యంబు నిన్ను
నేలింతు కిష్కింధ - నింతితోఁ గూర్తుఁ
గడతేర్తు శోకసా - గరమెల్ల నీకు
గడియలోపల నెంత - గలదిది నాకు !
పని గొమ్ము నన్ను”ని - పలుకు శ్రీరాముఁ
గనుగొని వానరా - గ్రణి యిట్టులనియె.
“ జగదేకవీర ! కౌ - సల్యాకుమార !
అగణితగుణధామ ! - అయ్య ! శ్రీరామ !
నీవు విల్లందిన - నిర్జరప్రభుఁడు
లావుల నెదుర నే - ల తలంప నేర్చు ?
దేవాళియును నిన్ను - దృష్టింపఁ జాల
రీవాలి యెంత నీ - యేటున కోర్వ ?
పిన్న విన్నపము నే - బెదరిన వాఁడ
దన్ను ముంచినది గ - దా సముద్రంబు
వాలిని వడిగల - వాఁడని యెంచి

చాలఁగ నోడి యి - చ్చట నున్నవాఁడ!
ఏమి పల్కిన వినఁ - డెఱిఁగించి మీర
లామీఁద ననిన వా - క్యము నాకు హితము.

—. సుగ్రీవుఁడు వాలి పరాక్రమమును వర్ణించిచెప్పుట :—

వానరబలవైరి - వాలి నిద్రించి
తాను నిత్యము ప్రభా - తంబుల లేచి
పడమటి వారాశిఁ - బదములఁ గడిగి
వడిఁ దూర్పుకడలి క్రే - వలఁ దీర్థమాడి
దక్షిణ వార్ధిచెం - తనుఁ గర్మవిధులు
దతుతఁ దీర్చి యు - త్తర సాగరమున
హరునిఁ బూజించి జా - మైనచో మఱలి
పురికి నేతెంచు న - ద్భుతజవశక్తి!
డాక నుప్పొంగి కొం - డలు పెల్లగించు
నాకంబు పొడవు మి - న్నక దాఁటి మఱలు
కుజముల మేని సోఁ - కునఁ గూల గెడవు
విజయార్థి యగుచు ది - గ్విభులఁ దిరుగు
నెదురెవ్వరును లేక - యెదురులు చూచు
కదియ మృత్యువునైనఁ - గబళింపనోపు
నతిశయమదసింధు - రాయతబలుఁడు
నుతికెక్కినట్టి దుం - దుభి యనువాఁడు
మహిషరూపము గల్గు - మనుజాశనుండు
మహనీయశారీర - మదవికారమున
జలధిచెంతకుఁ బోయి - సమరంబు సేయఁ
బిలిచినఁ గంపించి - భీతిల్లి వార్ధి

“ ఓయి ! దానవనాథ ! - యోడితి నేను
మాయందు నేటికి - మచ్చరంబిపుడు ?
హరునికి మామ మ - హాశైలరాజు
గిరిజకుఁ దండ్రి తె - క్కింపఁడెవ్వరిని
యాహిమవంతుని - యంతవాఁడైన
నూహింప నీతోడ - నుద్దియాఁగాక
కడమవా రెందఱె - క్కడ నిన్ను బోరఁ
బుడమిపై నచటికిఁ - బొమ్మని ” పలుక
నతఁడంపకోల రి - వ్వనఁ బాఱు కరణి
నతివేగమునఁ దుహి - నాచలంబునకుఁ
బోయి యట్లనె కయ్య - మునకుఁ బిల్చుటయు
నాయద్రి యతుల భ - యాతురుండగుచు
వెలఱు వాఱిన మబ్బు - విధమునఁ గొండ
తలమీఁద నిలిచి హ - స్తంబులు మొగిచి
“ యసురనాయక ! నిల్చి - యని సేయ వెఱతు
ననమర్థుఁడను మదీ - యాధిత్యకాగ్ర
గండోపలములేల - కదలించి తన్ని
పిండి చేసెదు మాని - బృందంబు చాల
నాయందు నున్నార - నంతంబు రాఁవు
సేయరాదిచట వ - సింతురు మునులు
వెఱచిన వారిని - వెంటాడ వీర
వరుల దరము గాదు - వదలు మాగ్రహము ”
అన “ నోరి ! హిమవంత ! - యనిలోన నన్నుఁ
గినిసి మార్కొను విశం - కితపరాక్రముఁడుఁ

గలిగిన జూపుము - కాకున్న నిన్ను
గులగులల్గాఁదన్ని - కూల్చెదమాన ! ”
అనిన దుందుభిఁజూచి - యచలనాయకుఁడు
తనలోన దలఁచి యా - దనుజున కనియె.
“ విను మసురాధీశ ! - విబుధనాయకుని
తనయుండు కిష్కింధఁ - దానేలు రాజు
రావణగర్వని - ర్వాపణశాలి
భావజాహితపాద - పద్మమదాళి
ఖరకరాత్మజ దర్ప - గహనోగ్రకీలి
గిరిచరవీరాగ్ర - కీర్తనశీలి
తారాహృదంబుజా - తనవీనహేళి
చారువిభూషణ - సౌవర్ణమాలి
యమితశౌర్యనిరస్త - హర్యక్షకేళి
సముదగ్ర బలజిత - సామజపాళి
కనకఘంటాసము - త్కర భీమవాలి
యనుదిన వినుతదే - వాళి యవ్వాలి
వాలిన బలముతో - వడినిన్ను దీఁటి
యాలంబు సేయఁ బొ - మ్మని ” పల్కుటయును.
ఆకాఱుఁబోతు మా - యావిరక్కసుఁడు
కేళ నజాండంబు - గిటగిట వణఁక
కేళ్లు దాఁటుచునుఁ గి - ష్కింధకు వచ్చి
హాల్లోహలంబుగా - నట్టహాసంబు
సేయుచు వాలి వ - సించు గహ్వరము
హో యని ఘూర్ణిల్ల - నుద్ధతి నార్చి
గుబ్బఁ గొమ్ములఁ దఱల్ - గోరాడి గోరజ

విజ్ఞున దన్నియు - వ్వివరంబుఁ గూర్చి
కనకకవాటముల్ - ఖండించు మించు
తనరాక వాలి చి - త్తంబునఁ దెలిసి
తారకాన్వితుఁడైన - ధవళాంశుఁడనఁగ
తారాదికులసతుల్ - తనుఁజుట్టు కొలువ
నమరాంగనలఁ గూడి - యుల్లన వచ్చు
తమ తండ్రియున బిల - ద్వారంబు వెడలి
" దుందుభి! నీకిట్టి - దుండగం బేల ?
ఇందురావచ్చునే - యేనింద్రసుతుఁడ !
వాలిని వానర - వంశవల్లభుఁడ
నేల క్రొవ్వున వచ్చి - యిచటఁ ద్రుంగెదవు ? "
అనిన నిశాచరుం - డయ్యింద్ర సుతునిఁ
గనుఁగొని బెడిదంబు - గానిట్టులనియె.
" ఇంతుల నీచుట్టు - నిడుకొని వట్టి
పంతంబులాడిన - బంటవయ్యెదవె ?
ఏ నుండి నీవుండి - యెందుకు నేఁడు
లేనికోపము మాట - లే పోటులగునె ?
వెఱచిన పగవాని - వెన్నిచ్చువాని
శరణుజొచ్చినవాని - సతులలోవాని
నిదురించువాని మ - న్నింప శూరులకు
వదలని ధర్మమై - వరలు గావునను
దాళితి నేఁటికిఁ - దన చేయిగాంచి
వాలి ! వీటికిఁ బొమ్ము - వలదు కాచితిని !
నీయంతివానిగా - నిలువు పట్టమున
నేయుము ప్రీతి నీ - చెలులకందఱికి

రమియింపు ప్రీతితో - రమణులఁ గూడి
యమలిన రత్నమా - ల్యములు దాలుపుము
వడకకొలంది దా - నము చేసికొనుము
తడవి ముద్దాడుము - తనయులఁబిల్చి
యీ రాత్రియేకాని - యిఁకమీఁద లేవు
నీరాజ్యసుఖములు - నీశరీరంబు
తప్పదు దుందుభి - తాను నమ్మించి
యిప్పుడు పులినాకి - యిటు నిన్నువిడిచెఁ
బొమ్మన్న" వాలియు - ప్పుడు కోపగించి
రమ్మని తారాది - రమణులఁ బిలిచి
నగరికి ననిచి వా - నరవజ్రపాణి
నగుమోముతోడ య - న్నరభోజిఁ బలికె
"లోలాత్మ! యేను స్త్రీ - లోలుండఁగాను
వాలితో నినువంటి - వాఁడు నిట్లనునె?
నినువిధి పెడ రేఁప - నేఁడు నామీఁద
గినిసి వచ్చితివి ప - ల్కితివి నేరుపులు
పోక నిల్వు"మటంచు - పురుహూతుఁడిచ్చు
శ్రీకరకాంచనాం - చితపద్మసరముఁ
దాలిచి వాని ను - ద్ధతితోడఁ గదిసి
వాలి చేతులు చాచి - వాని శృంగములు
మెదలనీయక పట్టి - మెడ మలిపెట్టి
చదికిలిపాటుగా - జగతిపైఁ ద్రోచి
పట్టిన పట్టుతో - బలువడి నీడ్చి
పొట్టపై మోకాలు - బొడిచికుదించి
ఫెళికలఁ బడవ్రైచి - వీపెల్లనలియఁ

బలువైన ఖురపరా - ఘట్టులఁ గొట్టి
బోరగిల్లఁగ నూకి - బొందుగాఁ ద్రొక్కి
నోరను జెవులను - నుఱుగు నెత్తుఱులు
మెదడును వెదలంగ - మిడిగ్రుడ్లు వడఁగ
సతమదంబుగఁ ద్రొక్కి - చంపి మా యన్న
నెత్తురెల్లను మహి - నిండంగ రిత్త
తిత్తిగా విదిలించి - దిర్దిరం ద్రిప్పి
కొమ్ములఁ బొడిచిన - గ్రుద్దినకాల
రెమ్మన చెట్లచే - వ్రేసిన తాను
వానికి లోఁగాక - వధియించి కొండ
తో నుద్దియైన యా - దుందుభిమేను
విసరి యామటఁబడ - వేసిన వాని
యసలు నెత్తుఱు మతం - గాశ్రమభూమి
మునులపై దొఱగ న - మ్మునిరాజుఁ గినిసి
తనయోగదృష్టి నిం - తయు విచారించి
వాలికృతంబుగా - వగచి యాలోనఁ
గాలాగ్నియును బోలి - గ్రక్కున మండి
యెప్పుడు వాలి దా - నిచటికి వచ్చె
నప్పుడే పొలియుగా - కని శపియించి
వానిఁ గొల్చిన యట్టి - వారెవ్వరైన
నీనగంబులఁ గల - యిచ్ఛాఫలములు
మెసవిన యప్పుడే - మేనులు వాసి
వసుధఁ బాషాణ భా - వముల నుండుదురు !”
అనుచు నాజ్ఞాపింప - నాతఁడీమాని
ఘనుకంప నొంద స - మర్థుండు గాక

యదిమొదల్ ఋష్యమూ - కాద్రికి రాక
మదిఁ గొంకి యుండ నె - మ్మదిగల్గె మాకు
దూరంబు లేదదె - దుందుభి కాయ
మోరామ! బలుఁగొండ - యో యన మించెఁ
గనుఁగొమ్ము వాలి యి - క్కడి కొండ మీఁదఁ
దనరిన యీసప్త - తాళంబులందు
నొకతాళపర్ణంబు - లొక నిమేషమున
నొకటి చిక్కక యుండ - నురుశక్తిఁ దునుము!
ఇది వాలి విక్రమం - బిందుకు మీరు
మదిఁ దలంపుఁడు నన్ను - మనుచు మార్గంబు"
అన విని లక్ష్మణుఁ - డలఁతి నవ్వొలయ
వనజాప్తసుతుని భా - వ మెఱింగి పలికె.
"ఎందుచే నమ్మదు - వీరాము శక్తి
యందుచే విశ్వాస - మందుము నీవు
నీవు వల్కిన వాలి - నిజశక్తిగరిమ
లావంతయును మెచ్చ - లైతోఁచ లేదు
శ్రీరాముఁడు వినంగఁ - జెల్లునే పలుక
కూరుచిగాఁ జంద్ర - జూటు నేవియును?
వాలికి వెఱచిన - వాఁడవై యెంత
జోలి చెప్పితివి హె - చ్చులు గావు మాకు
దేవదానవనర - తిర్యగాత్మలకు
నేవలనఁ దలంప - నిట్లనరాని
శౌర్యంబు గలిగిన - జానకీరమణు
మర్యాదఁ దెలియని - మాటలాడితివి!"
అన విని సుగ్రీవుఁ - డంజలిఁ జేసి

—: శ్రీరాముఁడు సప్తతాళములభేదించుట :—

తన సందియముఁదీఱఁ - దలఁచి యిట్లనియె.
" ఈతాఁటిమ్రాఁకులం - దేక వృక్షంబుఁ
జేతులఁ దావంచి - చిదుము పర్ణములు
వాలి యారఘుకుల - వర్యుఁడం దొక్క
సాలమొక్కనిశాత - శరముచేఁ దునిమి
పాదాగ్ర నిహతిచేఁ - బలువిడి జిమ్మి
యా దుందుభికబంధ - మిన్నూఱు విండ్ల
నేల యవ్వలఁ బడ - నేఁడు మీటంగఁ
జాలిన వాలిని - సమయింపఁ జాలు!"
అని పల్కె మఱియు దా - నాత్మఁ జింతించి
యిన తనయుఁడు రాము - నీక్షించి పలికె.
" దేవ! మీశక్తి శో - ధింపఁ దలంచి
యేవ వుట్టంగనే - నిటు వల్కలేదు.
ఆవాలిశక్తి యే - నరసినవాఁడ
గావున మీకెఱుఁ - గఁగఁ దెల్పవలసె
వెఱపింపలేదు మీ - విక్రమచర్య
లరయ భస్మచ్ఛన్న - మగు నగ్నిరీతిఁ
దెలియకున్నది గాన - దెలుసుకోవలసి
పలికితిఁ దప్పుగాఁ - బాటింపవలదు!
ఆకారమున దోఁచు - నఖిలంబు మహి వి
నేకుల కట్టి వి - వేకమెక్కడిది
కపులకు? నేనట్లు - గాన మీతోడఁ
జపలబుద్ధిని పరీ - క్షయొసంగు మంటి!"

అని దరహాస ము- ఖాంబుజుఁ డగుచు
మనువంశుఁ డర్కజు - మారుతో ననియె.
"కపట మెఱుంగవు - గాన సుగ్రీవ!
యిపుడు నీవచనంబు - లింపగు మాకు
బలియుని తోడుతఁ - బగవూని యొరుల
చెలిమిఁ దానెఱుఁగక - సేయుటల్ దగునె?
పగగెల్చునే హీన - బలునితోఁ గూడి?
తగవె చేసితివి సం - తసమయ్యె మాకు
కొదఁ దీర్తు"నని పదాం - గుష్ఠంబుచేత
పదియోజనంబుల - పాటి దూరమున
దుందుభికాయంబుఁ - దొలఁగ మీటుటయు
నందుకు సుగ్రీవుఁ - డలరి యిట్లనియె.
"నాఁటికి నిక్కబం - ధము రక్తమాంస
పాటవంబున మించుఁ - బలుగొండ వోలి!
ఇపుడు వానల నాని - యెండల నెండి
విపులమై కాష్ఠంబు - విధమునఁ జివికి
నిస్సారమైన దీ - నిని మీఁటి నంత
దుస్సహసత్త్వమిం - దునఁ దేట పడదు
ఈ మహాతాళమ - నేకపతుండ
భీమబాహాదండ - భీకరకాండ
సంధానమున మహీ - స్థలిఁగూల్చి దీన
బాంధవ! నాశంకఁ - బాపుము నీవు!
అటులైన విలుకాండ్ర - యందుల నీవు
పటుతర మృగములఁ - బంచాననంబు
ధరణిఁ దేజములందుఁ - దపనబింబంబు

ధరణీధరముల బ్రం - దారకాచలము
నసమవిగ్రహులని - యాత్మలో నెంచి
కొసరులన్నియుఁ దీఱి - కొలిచియుండెదను
సత్యమీమాట నీ - చరణంబులాన
నిత్యకల్యాణ ! మ - న్నింపు నన్ననిన

—: శ్రీరాముని నిజశక్తిప్రదర్శనముమెచ్చి సుగ్రీవుఁడు వాలిపై యుద్ధమునకు వెడలుట .—

ఆమాటలోనఁ బ్ర - త్యాలీఢచరణ
తామరసుండయి - దండపూనికను
కలగుండువడఁగ జ - గంబులన్నియును
విలు గుణధ్వని జేసి - విశిఖంబుఁ దొడిగి
వ్రేసిన నాతాళ - వృక్షంబులేదు
దూసి కుంభినిఁ గూల్చి - తొలుచుకఁ గొండ
యావల వెలువడి - యవని నాఁటుటయు
భావించి వానర - పతి వెఱఁగంది
గజగజ వడఁకి రా - ఘవుని పాదముల
నిజమౌళి సోఁకఁ బూ - నికఁ బ్రణమిల్లి
లేచి హస్తములు గీ - లించి నెమ్మొగము
చూచి యుప్పొంగుచు - సుగ్రీవుఁడనియె
'శరమొక్కటేర్చి యీ - సప్తతాళములు
నఱికి యుర్వరఁగూల్చి - నగము భేదించి
భూమి వ్రయ్యలుసేయు - భుజశౌర్యనిధిని
స్వామి ! నిన్నేమని - సన్నుతించెను
నాకవాలి యననేల - యుష్మచ్ఛక్తి వింట

నీకకోలఁ దొడిగి ప్ర - యోగించితేని
యమకేంద్ర దిక్పాల - కావళినైన
సమయింపనేర్తువు - క్షణములోపలను
సకలోన్నతంబైన - శౌర్యంబు గలుగు
నీక నీదు చెల్మి నా - కొనరిన కతన
నాకోర్కు లీడేరె - నాకన్యమేల
నీకు దాస్యము పూని - నిల్చికొల్చెదను
మ్రొక్కెద" నను గపి - ముఖ్యుఁ గౌఁగింట
నొక్కి సౌమిత్రి వీ - నులు చెలరేఁగ
కెలన నున్నట్టి సు - గ్రీవునిఁ జూచి
కలఁకఁ దీఱంగ రా - ఘవుఁ డిట్టులనియె
"పొమ్ము సుగ్రీవ! యీ - ప్రొద్దె కిష్కింధ
కమ్మెర వాలి నీ - వనికి రమ్మనుము."
అని పల్కి యతని ము - న్ననిచి యావెంటఁ
జని యిర్వురును పుర - సవిధకుంజముల
తరువుల మాటునఁ - దమ్ము గాననీక
మఱపు నేమఱపు నె - మ్మది లేకయుండ

—: వాలిసుగ్రీవుల మొదటియుద్ధము :—

కేలప్పళించి కి - ష్కింధాగుహాంత
రాళంబు మోఁసల - రవికుమారకుఁడు
కయ్యంబు గావింపఁ - గదలి రమ్మనుచు
నయ్యెడ భయదాట్ట - హాసంబుఁ జేసి
వాలినిఁ బిలిచిన - వరభుజాగర్వ
శాలియై తమ్ముని - సద్దుగానించి

పడమటికొండకు - భానుండు చేరు
వడువున సుగ్రీవు - వలనికిఁ జేరి
పొడిచిన యిరువుర - భూరి యుద్ధంబు
పుడమి చలింప న - ద్భుతకరంబయ్యె!
కలను గావించు నం - గారకబుధుల
పొలువున నిరువురు - భుజవిక్రమముల
పిడికిటి పోట్లచేఁ - బృథివీధరములఁ
బిడుగులు వడియొడి - పెక్కువఁ దోఁపఁ
బోరుచో వారి న - ప్పుడు దేరి చూచి
శ్రీరామలక్ష్మణుల్ - చిత్తంబులందు
నాశ్వినేయులనంగ - నాహవభూమి
శాశ్వత శౌర్యులై - జగడింపుచున్న
వాలిసుగ్రీవుల - వైపుల చూచి
వాలి వీఁడితఁడు ది - వాకరాత్మజుఁడు
నని నేర్పఱచు నుపా - యము వాలినేయు
ననువును గానక - యటునిటు జూచి
యూరక చేకాచి - యుండ సుగ్రీవుఁ
"డా రాఘవుల నమ్మి - యనికివచ్చితిని
నను దెచ్చి వాలి ముం - దఱ నొప్పగించి
కనుపించుకొనక చ - క్కఁగ నేఁగినారు
తనువెల్ల నొగిలె నీ - తని ప్రహారముల
తను జంపు వాలి యిం - తటఁ జాఱకున్న"
ననుచు వచ్చిన త్రోవ - నతిజవశక్తి
వెనక చూడక పాఱె - వీఁడంచు వాలి
నగుచుండ మునుపున్న - నగమున కేఁగి

మొగమెల్లఁ బగుల నె - మ్ములఁ దిరుగంగ
కదుములు గట్టి ర - క్తములుమైనిండ
నదరులవారలా - నడుగడుగునకుఁ
గుట్టూర్పులుచ్చి మూ - ల్గుచు నింకనొక్క-
పెట్టుచే సుగ్రీవు - పీఁచమణంతు
నని వెంబడించి తా - నటుఁజేరరామి
మనసులో నలిగి క్ర - మ్మఱవాలి చనిన 1229
తలపట్టి చూచుక - తనదు భంగంబుఁ
దలపుచు నొకచెంత - తరణినందనుఁడు
చేరుచోఁ బావని - చెంతరా నృపకు
మారకుల్ భాను కు - మారునిఁ జేరి
నిలుచున్న శ్రీరాము - ని మొగంబు జూచి
తలఁకుచు వంచిన - తలయెత్తి పలికె.
"అనలుండు సాక్షిగా - నరలేని చెలిమి
యొనరించి యడిగిన - యొడబాటు లిచ్చి
సత్తువల్ చూపి బా - సలనునమ్మించి
కత్తులు దాఁటి సం - గటివచ్చినిలిచి 1230
వాలితో హత్తించి - వానికిఁ దనకు
నాలంబు దురుసైన - యట నిల్వవెఱచి
యొదిగి యెచ్చట నుంటి - రో! యన్నలార!
ఇది యేమి చేసితి - రెఱుఁగ లేనైతి
నిటువంటి వాఁడని - యెఱిగింపలేదొ?
పటుశక్తి మాకు జో - ప్పడదని మీరు
వాకొన్న నేరము - వచ్చునో యెందు?
రాకొమారులు స్వకా - ర్యంబు లేమఱరు

వాని నేఁ గెలిచిన - వచ్చి నాచేత
జానకి సాధింప - సమకట్టినాఁడు.
అది తప్పి నాచేత - నయ్యెడిదేమి ?
మదికిఁదోచినయట్టి - మార్గంబుఁ గనుఁడు
పదివేలువచ్చెఁ జం - పక పోవరేము
కొదవగల్గినఁ బేరు - కొనుఁడు చేసెదను.”
అను మాటలకు సిగ్గు - హాస్యంబుఁ బొడమ
జనకజారమణుఁడి - చ్చఁ గలిగి పలికె.
“ఏల కోపించెద ? - వేనమ్ము దొడిగి
వాలినేయని హేతు - వచనంబు వినుము
రూపులు నడపులా - రూఢముల్ బలము
చూపులు పలుకులు - సొబగులంగములు
నొక్క రూపము కాని - యొకరందు నెచ్చు
తక్కువల్ వెదకియు - తడవుచింతించి
యూహింపఁ జాలక - యుంటిమింతటికి
నీహనుమంతుండు - నెఱిఁగియున్నాఁడు.
ఏము ద్రోహము సేతు - మే ? నీకు నెఱుఁగ
లేమైతి మపుడు వా - లిని నిన్నుజూచి
నాయమోఘాస్త్ర సం - ధానంబు చేసి
చేయి గాయక యున్న - సీమకు లేని
యపకీర్తి మాకునై - హాని నీకైన
నపుడేమిసేయుదు - వది యెన్నవైతి
నీకొక్క కీడైన - నేము చింతించి
యాకడ మఱిసేయు - నది యేమి గలదు ?
అవివేకపడుచుఁ గా - ర్యము చేసెననుచు

నవనీజనులు నన్ను - నాడకుండుదురె ?
నమ్మించి నినుఁజంపి - న యనంత దురిత
మెమ్మెరఁ గడతేరు - నెఱుఁగవుగాక !
శరణంబు నీవు ల - క్ష్మణునకు నాకు
ధరణిజకును మన - స్తాపమేమిటికి ?
ఒక గుఱుతేనీకు - నునిచెద నింక
నొకపరి వాలితో - యుద్ధంబు చేసి
మఱిచూడు మాత్మీయ - మానుషచర్య
లరమరల్ దీరి పో - మ్మని సేయ వలదు
ఇలువెడలిన వాలి - నిలఁగూలె ననుచు
తలఁపుము చూచి నం - తనెపారి పొమ్ము
ముమ్మాటు మమ్ము న - మ్ముము నాదు చేతి
యమ్ము నీమదిలో భ - యమ్ము వారించు"
నని పల్కి "లక్షణ ! - యల్ల దే పూచి
కనుపట్టె వనములో - గజపుష్పలతిక !
అది తెచ్చి సుగ్రీవు - నఱుతఁ గీలించి
కదియింపు వాలితోఁ - గదనంబు సేయ."
అన్నచో సౌమిత్రి - యన్న వాక్యములు
మన్నించి గజపుష్ప - మాలిక దెచ్చి
సుగ్రీవు మెడను వై - చుటయు నాఁడయ్యె
సుగ్రీవుఁడతఁడు తే - జోవిలాసముల
విపరీతమున నుడు - వీథిలో సూర్య
నుపమింప నవ్వాన - రోత్తంసుఁడలరె !
చదలున సంధ్యావ - సర వారిదంబుఁ
గదియు బాలార్కు రే - ఖను మించినట్లు

లక్ష్మణార్పితపుష్ప - లతికానవీన
లక్ష్ముఁడై బలగర్వ - లక్ష్ములఁదనరి
రామునితో వాన - రకులోత్తముండు
సేమంబు దలఁచి కి - ష్కింధకు నేఁగ

— సుగ్రీవుని ద్వితీయ రణప్రస్థానము, సప్తజనాశ్రమ
మహిమాను వర్ణనము —

విల్లెక్కు వెట్టి యా - వెనుక రాఘవుఁడు
భల్ల మొక్కటి యేర్చి - పట్టి యావెనుక
నలనీలతారాంజ - నానందనులును
గొలువ మార్గమునందుఁ - గువలయకముల
లలిత మృణాళడో - లాసంచరిష్ణు
కలహంస చక్రవా - కక్రౌంచమిథున
కేళీవిలాససం - కీర్ణంబులగుచు
రోలంబమాలికా - రుతిపీనులలర
సుమహిత వైడూర్య - శోభావిభాసి
కమలపలాశరే - ఖలు శోభిలంగ
వెలయు తటాకముల్ - వీక్షించి వచ్చి
కల మచ్చికల కురం - గములఁగన్గొనుచు
గిరిమేఘ నిభములై - ఘీంకృతుల్ సలుపు
కరులను కిరులను - కాసరంబులను
జెదరిపోఁద్రోలుచు - సీతావిభుండు
కదిసిన సుగ్రీవుఁ - గాంచి యిట్లనియె
"ఎవ్వరి నెలవిది ? - యిచ్చోటి కావి
పువ్వుఁదోఁటలును గ - ర్పూరపుటనఁటి

గుంపులు పండిన - గుజ్జుమామిళ్లు
సంపెగల్ మదికింపు - సమకొల్పె నిచట
వినిపింపు" మన రఘు - వీరునిఁ జూచి
యినకుమారుఁడు భక్తి - నిట్లని పలికె.
"రామ! యీపావనా - శ్రమము మనోభి
రామమై స్వాదునీ - రంబుల గలుగు
కొలఁకుల విహగసం - కులముల నమృత
ఫలముల విలసిల్లు - పాదపంబులను
చాలమీఱును సప్త - జనులను మౌని
జాల మిచ్చటి జలా - శయముల యందుఁ
దలక్రిందుగా నుగ్ర - తపములు చేసి
తలయెత్తి సప్తరా - త్రములకు నొక్క-
నాఁటి కందఱు పవ - నంబు భక్షించి
నీటిలో మఱల ము - న్నిటిచందమున
శయనింపుచును శత - సంవత్సరములు
నియమంబుగా నిట్లు - నిండిన పిదప
బొందులతో దివం - బులకు వారేఁగి
రిందు నయ్యాశ్రమం - బిది చిత్తగింపు
మిపుడు వారలయాజ్ఞ - నీమహాసాల
విపులమహాశాఖ - వృత్తగౌరవముఁ
దేఱిచూడఁగరాదు - దివిజులకైనఁ
జేర నేర్చునె మృగ - శ్రేణి చెంతలకు?
వినవచ్చుచున్నవి - వేదఘోషములు
సనుపమ స్వాహాస్వ - ధానులాపములు
తుదకొమ్మలను హోమ - ధూమమాలికలు

గదియుచో నిచటి న - గశ్రేణి యెల్ల
ఘనసమాకలితన - గశ్రేణి యనఁగఁ
గనుపండువయ్యె రా - ఘవ! విలోకింపు
చొరవచ్చుఁగాని యీ - శోభనారామ
మరుదెవ్వరికి పున - రాగమనంబు
శింజానకనకకాం - చీరత్నకటక
మంజీరనినద సం - పదలాలకింపు!
వినవయ్య! యీవన - వీథులయందు
ననుపమ నృత్తవా - ద్యాదిరావంబు!
రాసి నాసావివ - రప్రీతిగాఁగ
వాసన వలిగాలి - వచ్చునిచాయ!
నాహవనీయాది - హవ్యవాహనస
మాహిత జ్వాలిక - లవె విలోకింపు
మివియన్నియును నమ్మ - నీంద్రుల మహిమ
లవని జాగిలి మ్రొక్కు - మనుజుఁడు నీవు
వారలఁ దలఁచి యె - వ్వారు మ్రొక్కినను
శ్రీరామ కలుగు న - శేషసౌఖ్యములు!"
అన విని యభిముఖు - లై రఘువరులు
మునుల నుద్దేశించి - మ్రొక్కి ప్రార్థించి
యలరుచు సప్తజ - నాశ్రమ స్థలము
తలఁగి కిష్కింధచెం - తకుఁ జేరఁబోయి
యావాలిపాలితం - బైన పట్టణము
క్రేవఁదమోవని - శ్రేణులయందు
కరిచాపహస్తులై - శతముఖతనయ
చరణిత సంగర - స్థలిఁ జొచ్చి యుండ

రవికుమారుఁడు ముంద - ఱను వెన్కఁగడలఁ
బవనజాదులు చాల - బలిసి సేవింపఁ
జట్టులు తాఁదేటి - చూచుచుఁ జెలఁగి
యట్టహాసమున బ్ర - హ్మాండంబుఁగదల
బహుయంత్ర చిత్రాత - పత్రధ్వజాంశు
మహితమహా వాలిధా - మము విలోకించి
సమ్మతపడఁ బల్కె - శాత్రవుఁ దునుమ
నమ్మించు జానకీ - నాయకుఁజూచి
వెఱచినవాఁడయ్యె - వెఱవక నిలిచి
తరణితనూజుఁడు - ద్ధతి నిట్టులనియె.
"వచ్చితిమిదియె మా - వాలినివాస
మిచ్చోట మీరు నా - కిచ్చిన ప్రతిన
మఱవకుండని" పల్కె - మహిసుతాప్రియుఁడు
కరుణించి సుగ్రీవుఁ - గాంచి యిట్లనియె.
"నీ కంధరాస్థలి - నిలిపిన తీవె
మాకు నేర్పడ వాలి - మార్కొను మీవు.
ఎప్పుడు చూచితి - మింద్రకుమారు
నప్పుడె హతుఁడయ్యె - నని యెన్నికొనుము !
ఒకతూపె కాని యొం - డొకతూపుఁ దొడుగ
నొకయంతఁ దీర్తు నీ - యుపతాపమెల్ల !
తెలిసియుఁ దెలియక - దిట దప్పి నన్ను
పలుమారు నమ్మక - పలుక నేమిటికి ?
భయసంభ్రమములేల ? - పలికిన పలుకు
నియతి నేదప్పుదు - నే ! యెట్టియెడల

శతమఘుం డవని స - స్యములు ఫలింప
మఱియించుగలేఁ డెమ్మొ - మఘవనందనుని
వెనుకటి శోకనాఁడు - విజయుంబె కాని
యనిలోన నీకు లో - నగువాఁడుఁగాఁడు !
అదిగాక సతులస - మక్షంబునందు
మదగర్వములు హెచ్చు - మదినెల్లఱకును
నీమహోధ్వని విని - నిలువక వెడలి
రామున్నొ వోలె యు - ద్ధముసేయు వాలి
యంతట నాయమో - ఘాస్త్రంబుచేత
నంతకు వీటికి - ననుపుదు ”ననిన
పెళపెళ నార్చి కు - ప్పించి కిష్కింధ
జలదరింపంగ గ - ర్జానినాదమున
రాజసోషమునఁ జే - రక కులకాంత
లేఁజాడఁ బఱువెత్తు - నెన్నికరోఁప
నావుల మందలు - నచ్చోట నిలక
తావులు దప్పి కొం - దంముతోఁ బఱవ
రణములో విఱుఁగు తు - రంగంబులనఁగఁ
దృణభక్షణము మాని - మృగములు చెదర
సడలిన పుణ్యావా - సన వారిఁ బోలి
సుడివడి యెల్లప - క్షులు మహిఁబడగ
దారుణ పవమాన - ధారాభిహతిని
భోరనఁ గలఁగు నం - బుధిబ్రమోఁత యనఁగ
దట్టించి సింహనా - దము సేయ వాలి
పట్టణంబున మహో - త్పాతంబు పుట్టె

— వాలియుద్ధమునకుఁబోవఁ బ్రయత్నింపఁ దారహితము చెప్పుట —

ఆగర్జితము విని - యప్పుడువాలి
తాగహ్వరమునఁ గాం - తా మధ్యమమున
రాహువు వట్టిన - రవిరీతిఁ దనదు
దేహకాంతి యొకింత - తెఱఁగు మాయంగ
కలితమృణాళ ప్ర - కాండకాసార
కలనఁ గోఱలతో ము - ఖంబు శోభిల్ల
తరుణసంధ్యా రాగ - తను కాంతి నిలయ
గిరి గహ్వరమునఁ దీ - గెలు సాగి వెడల
గమన వేగమున వ్ర - క్కలుగాఁగ ధరణి
సముద్రగాఢ ప్ర - చండకోపమున
వచ్చు మహావాలి - వాలినిఁ గాంచి
మచ్చిక గల్పించి - మదిభయంబుంచి
యనునయాలింగన - మాచరింపుచును
వినయంబుతోఁ దార - విభున కిట్లనియె
" వల్లభ ! సిగనున్న - వాడినపువ్వు
లొల్లక మఱునాఁటి - యుదయకాలమునఁ
దోలఁగవైచినగతి - దుస్సహంబైన
యలుక యేఁటికి మాను - నదిగార్యసరణి
యీరాత్రి జగడింప - నేఁటికి తెల్ల
వాఱిన సుగ్రీవు వధి - యింపుమీవు
రాక్షసులకెకాని - రాత్రియుద్ధములు
లక్షింప మీాబోఁటు - లకు మేరగాదు

యిందుచే నీకై రి - కెచ్చును నీకు
గుందును లేచుకై - కొనుము మామనవి
దురమున నిప్పుడు - దురదురం బోవ
సరిపోదు నాకట్టి - చందంబు వినుము
జగడంబునకు వచ్చి - చాలంగనొచ్చి
తెగిపారి ప్రాణభీ - తినిం బోవువాండు
యీవెంటనే వచ్చి - యెదిరించి నిన్ను
లావుతోంబోరం బి - ల్వంగడంగి నవుడె
యిదియేమియో యను - యెన్నికనాదు
మదిలోనం గడు నను - మానంబు పుట్టె!
అట్టహాసము జేసి - యంబుజ హితుని
పట్టిని పైజల - పట్టి యీవేళం
బిలిచిన చందంబు - బిరుదు పోటరుల
చెలిమిచే ననుచు నేం - జింతం జేసితిని
యోర్పరియును గడు - నుచిత కృత్యముల
నేర్పరియును నైన - నీ సహోదరుండు
తాం బరీక్షించి యిం - తకుం దగువాని
చేం బగదీఱుపం - జింతించి వచ్చె
మన యంగదుండు నేంటి - మాంపటివేళ
నను జేరి తాను వి - న్న తెఱంగుం జెప్పె.
చారులు తనతో బ్రు - సంగించు మాట
యేటుపాటుగ నది - యేవిన్నవింత
వడిగలవారు చె - ల్వముంగలవారు
పుడమియంతయుం ద్రోవ - ద్రోవనేర్పరులు

వారయోధ్యాపుర - వల్లభుండైన
వీరుఁడౌ దశరథ - విభుని నందనులు
రామలక్ష్మణులు ధ - ర్మస్వరూపకులు
తాము సుగ్రీవుని - దండకు వచ్చి
చెలిమి చేసినవా ర - జేయులందులను
బలవంతుఁడగు రామ - భద్రుఁడీపనికిఁ
బూని వచ్చినవాఁడు - పూనినకార్య
మానిది కాదిది - యనరానివాఁడు
వరమతి సాధు ని - వాసవృత్తంబు
కరణి నాపన్నుల - గతియైనవాఁడు
నార్తులకెల్ల స - మాశ్రయుండతఁడు
కీర్తికిఁ దానె సం - కేతస్థలంబు
జ్ఞానసత్వవివేక - సంపన్నుఁడఖిల
దీనబాంధవుఁడు శ - క్తిత్రయాధికుఁడు
తలిదండ్రిమాట యా - దలఁ దాల్చువాఁడు
కలనైన బొంకెఱుం - గని సత్యవాది
కోదండ దీక్షాది - గురుఁడైనవాఁడు
వేదండగమనుండు - విజయశీలుండు
ధాతువులకు పర్వ - తముఁబోలి సుగుణ
జాతంబులకు సమా - శ్రయుఁడైనవాఁడు !
ఆరఘువీరుని - యసమువిరోధ
మేరికిఁగడతేరు ? - నెఱుఁగవయ్యెదవు
హితము నామాట నే - నెఱుఁగుదు నతని
నఖిలలోకధర్మ స - త్యపరాక్రమములు

చూడఁజాలక నిన్ను - సుద్దులచేత
నోడించి పగవాని - యురువెంచలేదు
నీమేలుఁగోరి నే - నిలుపోపలేక
స్వామి! యడ్డమువచ్చి - వలదంటిఁ జలము
ఆ రవితనయుని - యౌవరాజ్యమునఁ
గోరిపట్టముఁ గట్టి - కోపంబుఁదీర్చి
శ్రీరాముతోడుతఁ - జెలిమి గావించి
యూరక సుఖమున - నుండుట మేలు
కడనున్న నేమి యి - క్కడ నున్ననేమి?
కడవాఁడు గాడు భా - స్కరకుమారకుఁడు
లాలనీయుఁడు తమ్ము - లను వేఱుసేయు
పాలసులకు నిత్య - పదవులు గలవె?
ఎవ్వరాతనికన్న - హితులైన బంధు
లెవ్వరున్నారు నీ - కెందుఁ జూచినను?
నీవు రాజ్యము సేయ - నీతోడఁ బుట్టి
యీవగ సుగ్రీవుఁ - డిడుమలఁ బడునె!
ఇలమీఁద యాసయు - నింతులయాస
కలిమిపై యాస యొ - క్కటియె యెల్లరకు!
పిలిపింపు మతనిఁ జె - ప్పినయట్ల నడచు
చలమెఱుఁగడు సర్వ - సముఁడు సౌమ్యుండు
రమ్మనకేమి నే - రము నీకుఁ జేసె?
నమ్మలేనైతి బ్రా - ణము వంటివాని
సోదరుఁగడవ న - న్యులును జుట్టములె?
కాదు సుమయ్య! రా - ఘవమిత్రుఁ జెనక!
హితురాలవని నన్ను - నెంచితివేని

మతినాగ్రహముమాని - మనవి గైకొనుము
ఇంద్రాదులైన జ - యింతురే రామ
చంద్రుఁడు కేల న - స్త్రము వూని యున్న ?
నీవెంత ? జగముల - న్నియు గెల్వఁజాలు
చేవిల్లు గైకొన్న - శ్రీరామ విభుఁడు !"
అని యెన్నివలికిన - నవియెల్లఁ జెవులఁ
జొనుపక కాలవ - శుండైన వాలి
తనువిధి పెడరేఁప - దట్టించి తారఁ
గనుఁగొని పరుషవా - క్యముల నిట్లనియె.
"పగవాఁడు వచ్చి ద - ర్పంబుతో నన్ను
జగడంబునకుఁ బిల్వ - సైరింపఁ గలనె ?
ఇయ్యవమతి కన్న - నెట్లైన నేమి
కయ్యంబు సేయక - కాదింకువదన !
ఏలీల సైరింతు - నెఱుఁగవుగాక
బాల ! తోడను బుట్టు - పగయోర్వఁగలనె ?
సుగ్రీవు నినదంబు - శ్రుతి సోఁకెగాన
నాగ్రహం బణపలే - నట్టులనయ్యె
రాముని యెడ నకా - రణభీతి తనకు
నేమిటికీచింత - యేఁటికి నీకు ?
ధర్మమానసుఁడు కృ - తజ్ఞుఁడు నైన
ధార్మికాగ్రణి కీడుఁ - దలంచునే తనకు !
హితము వల్కితివి నీ - కిది యుచితంబు
ప్రతికూలమని యెంచఁ - బడదు నీమాట
భానుజు నెదిరించి - వట్టిపధించి
వానిగర్వమణంచి - వచ్చెద గాని

బోటులతో నంతి – పురికేఁగుమీవు
పాటలాధర ! విన్నఁ – బాటు నొందకుము
నిలుచునేవాఁడు నా – నిగ్రహంబునకు ?
శిలల వృక్షంబుల – చే బుద్ధిచెప్పి
వచ్చెద నాయాన ! – వనిత ! యేమనిన
నిచ్చట నీయాన – నిఁకఁ దాళఁజాల !"
అనఁ దార కన్నుల – నశ్రులు రాలఁ
దన నాయకుని మోముఁ – దనివోక చూచి
కౌఁగిట నిండారఁ – గదియించు వెతల
వేఁగుచు వలవచ్చి – "విచ్చేయు మనికి
జయమందు" మనుచు సే – స శిరంబు మీఁదఁ
జెయి చాచియునిచి తాఁ – జింతతో మఱల
నావాలి వెడలి మ – హాంధకారమున
నేవగ నున్నాఁడో – యినసూనుఁ డనుచుఁ
గలయ దిక్కులు జూడ – గజపుష్పి పుష్ప
కలికాకలితలతా – గ్రవేయకమున
దిగదిగ వెలిఁగి యా – దిత్యానలేందు
యుగపత్ప్రకాశ స – మున్నతుండైన
తమ్మునిఁ గనుఁగొని – దట్టించియాగ్ర
హమ్మున భయదగ్ర – హమ్ముచందమున
దండపూనికఁ గాల – దండాభబాహు
దండైకముష్టివి – ధాప్రహారమునఁ
బొలియింతునని చేరఁ – బోవు నవ్వాలిఁ
జులకగాఁ గనుఁగొని – సుగ్రీవుఁ డనియె.
"ఎప్పటివలెఁ జూచె – దింక నాకేలు

దప్పుడు నీకుఁబో - దగదింక బ్రతికి
యిదె చూడుమని కేల - నెత్తిన వృక్ష
మదరంట గిరిమీఁద - నశనియుఁ బోల
వాలిపై నేసిన - వాలి వారథినిఁ
జాలభారమునఁ జం - చలమైనయోడ
తీరునఁ జలియించి - ధృతిశాలి వాలి
భోరున పై బ్రాలి - పొడమి చేకొద్ది
యిద్దఱు నభమున - కెగసి సింగముల
యుద్ధులై రవిచంద్రు - లోయన దొరసి
కదిసి ముష్టాముష్టి - గరుడ వేగమున
నెదిరి బాహాబాహి - నెడమీక పెనఁగి
బ్రాలి కచాకచి - వసుధపై బొరలి
వాలిసుగ్రీవుల - వార్యశౌర్యముల
నన్యోన్య జయకాంక్ష - ననిసేయ నలఘు
మన్యువుతో శాంత - మన్యువుం డలగి
బలగర్వముల హెచ్చ - పైపయిఁ బెరిగి
తలనాఁటి పాటెల్లఁ - దలఁచుకోఁ జేయ
సత్త్వవ దఱిగి మో - సమువచ్చె నెందు
చొత్తు నేనని యెంచి - చూచెద నింక
కొంతసేపని కాళ్ల - గోళ్ల చేతులను
దంతంబులను మహా - ద్దతిఁ బోరుచుండ
నిరువురు వృత్రాసు - రేంద్రుల రీతి
సరవోర భయదగ - ర్జలతోడఁ బెనఁగు
మబ్బులవలెఁ దోచు - మర్కటాధిపులు
బొబ్బలు వేటులు - పోటులు నొక్క

రీతిగా మాల్యము - లెంగింపఁ జేతి
ఘాతల నలసి న - ల్గడఁ జూచుచున్న
రవితనయుని గాంచి - రఘువీరుఁడొయ్యఁ
జెవిసోఁక సింజిని - చే యమ్ము దిగిచి
యల్లై మ్రోతను గూళ్ళ - నణఁగిన పులుఁగు
లెల్లఁ దానున్న మ - హీరుహాగ్రమునఁ
జలియింప మెల్లనే - శరము చేవదల
బలువైన పిడుగద్రి - పైఁబడు నటుల
వాలిపేరెద నాటి - వ్రయ్యలు సేయ
కాలువలగుచు ర - క్తంబులు దొరుఁగఁ
వినిమూర్ఛ నొంది కుం - భిని వ్రాలి వాలి
కను దేలఁగిలవైచి - గాజువారుచును
మేనికాంతి యడంగ - మేదినిఁ జంద్ర
హీనమా నభముతో - నెనయంగ మూర్ఛ
వచ్చియుండియుఁ దండ్రి - వరదుఁడై తనకు
నిచ్చినసురభిళ - హేమదామంబు
మహిమఁ బ్రాణంబును - మదిలోని యెఱుక
మహనీయ కాంతియు - మానకయుండె
పూచినమోదుగు - పోలుపున రక్త
రోచుల సంధ్యారు - రుచిమీరి యున్న
వారిదంబన పుణ్య - వాసనల్ దీరి
యారీతిఁబడిన య - యాతి చందమున
జ్వాలలన్నియుఁబోయి - శాంతమైయున్న
కీలికైవడి ధాత్రి - కిని వ్రాలియున్న
విలయ భానునిరీతి - వేదనఁబొంది

తెలివిడితోఁ గన్నుఁ - దెఱచిన యట్టి
వాలిచెంతకు రఘు - వరులు ప్రమోద
శాలులై చేరంగఁ - జని మహామహుని
దుర్జయు నింద్రసు - తో సరివాని
నార్జవాన్వితు నిదే - వాసురాసాహ్య
ముత్తుంగ భుజుని సిం - హోరస్కు నిం బ్ర
మత్తుని గాంచన - మాలి నాజాను
బాహుని హరినేత్రు - భాసురవదను
నాహరినాయకు - నాహా జనింపఁ
గనుఁగొనుచుండ రా - ఘవుని నెమ్మోముఁ
గనివాలి ధర్మయు - క్తంబు సమ్మతము
నుచితంబు నిందాప్ర - యుక్తంబు నైన
వచనంబు దీనభా - వమున నిట్లనియె.
“ ఏమఱిపాటున - యేనుండ నేసి
యేమి లాభముగంటి - విదియుఁ బౌరుషమె ?
పోరికి నేరాఁగఁ - బోవల దనుచుఁ
దార నీ తెఱఁగెల్ల - దనకుఁ దెల్పుటయు
గుణవంతుఁడవు ధార్మి - కుఁడవు ప్రాజ్ఞుఁడవు
బలవంతుఁడవు దయా - పరుఁడవు సత్య
వాదివి సౌమ్య భా - వనుఁడవు శస్త్ర
వేదివి నీతికో - విదుఁడవు సర్వ
సముఁడవు వీత మ - త్సరుఁడవు కీర్తి
రమణీయుఁడవు పరా - క్రమ భూషణుఁడవు
యని విన్నవాఁడనై - యది నిజంబనుచు
మనసులో నమ్మియే - మఱియుంటి నిపుడు

రాజులు ధర్మమా - ర్గంబుఁ జేపట్టి
భూజనంబుల బాధఁ - బొందింపుచున్న
ఖలుల శిక్షింతురు - కలుషభయంబు
దలఁచి వర్తింతురు - తప్పరెవ్వరును
ఏను నాతమ్ముఁడు - నెక్కటిఁ బోర
మౌనివేషము బూని - మాయావి వగుచు
వచ్చి చంపుదురె ? యీ - వసుధను నీకు
నెచ్చోటనైన నే - నెగ్గు చేసితినె ?
మునులకైవడి ఫల - మూలముల్ మెసవి
వనులఁ గ్రుమ్మరు నట్టి - వనచరుఁ బట్టి
పడనేయ నీకేమి - పని ? కలనైనఁ
జెడఁజూడ వెన్నడు - క్షితినెల్లవారిఁ
దను జంపునది రాజ - ధర్మంబె నీకు ?
వినికని యోఁగుదు - వేయిట్టి వారి ?
ఇల వెండిబంగార - మివి మొదలైన
కలుము లాశించి యొ - క్కరునిఁ ద్రుంపుదురు
రాజు లీయాస శ్రీ - రామ ! నీమదిని
యోజింప లేదు ప్ర - యోజనంబేమి ?
విలుకేలఁ బట్టియీ - వేషమైనపుడె
కలుగునే ధర్మార్థ - గరిమముల్ మీకు
కామాతురుండవై - కర్మవాసనల
చేమతి చరియించి - చేసితి కీడు
నిరపరాధుని నన్ను - నీవట్టు లేసి
ధరణీశ ! సఫల ను - త్తర మియ్యగలవె ?
క్రూరాత్మకుఁడు నాస్తి - కుఁడు పతితుండు

చోరుడు శఠుఁడు నీ - చుఁడు మద్యపాయి
రమణుల నావుల - రాజుల ద్విజుల
సమయించువాఁడు పా - షండ వర్తనుఁడు
గురుతల్పగమనుఁడు - కొండీఁడు ద్రోహి
పరివేత్తయన్యాయ - పరుడు హింసకుఁడు
నిరయగాములు గాన - నీకేఁటి కయ్య!
కొఱమాలి యీకోతి - కొలఁగట్టుకొనఁగ?
ఈమాంస మీచర్మ - మీదంత శల్య
రోమాదికంబులు - రోతురుగాని
రోయరెవ్వరు వాన - రుల ధార్మికుండ
వీయపకీర్తి ని - వేల పొందితివి?
పంచనఖంబులఁ - బరఁగిన జంతు
సంచయంబుల నైదు - చనుగాని మీకు
కడమవాటిని దినం - గాదేమి దలఁచి
పడవేసితివి నీకు - భక్ష్యంబె యేను?
అంటుదురే కేల - నైన వానరుల
యొంటి మాంసంబు? ని - న్నొకనిఁ జూచితిమి!
రామచంద్ర! వివేకు - రాలు మాతార
వేమారు నాకు నీ - వృత్తంబుఁ దెలిపె
నది వినియుండియు - నహమిక చేత
విధి పెడరేఁపఁగ - వెడలి వచ్చితిని
నను నేయఁబనియేమి? - నానేర్పునేర
మునకు నెవ్వాఁడవ - మ్మునఁ బడనేయ?
నీవురాజవుగావు - నీవెంటఁ బరమ
పావని యాసీత - పతివైన కతన

మది నమ్మి నిను నధ – ర్మపరుఁడ వనుచు
హృదయంబులోనఁ దా – నెఱుఁగక వచ్చి
యీపాటు బడిపోయె – హీనకర్ముఁడవు
పాపివి యన్యాయ – పరుఁడ వల్పుఁడవు
ద్రోహివి శఠుఁడవు – దుర్బుద్ధి వధమ
సాహసాత్ముఁడవు వం – చకుఁడ వజ్ఞుఁడవు!
అక్కట! దశరథు – నంత రాజునకు
యెక్కటి సుతుఁడవై – యీవు గల్గితివి?
పెక్కేల ధర్మంబు – పేరిటి యొరిజ
చక్కని నీత్యంకు – శంబును లేని
నీవను మదదంతి – నిర్ణిమిత్తముగ
నీ వాలి యను తరు – విలఁగూల్చె నేఁడు!
ఇంతటి సాహస – మేఁజేయు శౌర్య
వంతుఁడనని సభ – వారెల్ల వినఁగ
నేమని యనుకొందు – వే నీకుఁ గీడు
గామింప నొకనాఁడు – గాదు జేసితివి!
నిలిచి నాముందఱ – నే బంటననుచు
నలుకతోఁ గనుపించ – వైతివిగాక
వింటితో నంతకు – పీటికిఁ బనిచి
మంటితోఁ గలపనే – మాటమాత్రమున!
వరుసయే సిద్రించు – వానిఁ గాలాహి
గఱచిన గతి నెఱుఁ – గక యుండు వాని
చెట్టు చాటుననుండి – చిటుకనకుండ
మొట్టకోలను పుడ – మిని ద్రెళ్లనేయ
వీఁడేమి భ్రాంతిని – వెలఁదిఁ జేకూర్చు

వాఁడని వాని బ - వంతముల్ నమ్మి
యెందుకుఁ గొఱగాని - యినకుమారకుని
బొందుచేసుక తన్ను - బొడవడంచితివి!
బుద్ధి చాలక మోస - పోతివి గాక
వద్దికివచ్చి మీ - వార్త నాతోడ
నొకమాటు వినిపింప - నురక రావణుని
సికవట్టితెచ్చి మీ - శ్రీపాదమునకు
నొప్పగింపుదు సీత - నొక నిమేషమున
నిప్పుడే చేకొన్న - నేను సేయుదును!
జలధిలోనున్న ర - సాతలంబునను
జలపట్టి డాఁచిన - జానకీదేవి
నీకిత్తు నాగమ - నికరంబు ఖలులు
దాఁకొని మునుపశ్వ - తరిగానమర్చి
కడలినుండగ శౌరి - కడవఁడై తాను
జడధిలో డాఁగు రా - క్షసుల మర్దించి
చేకొన్నగతి నీతి - సీతతోఁ గూడి
శ్రీకర రాజ్యల - క్ష్మి నెసంగఁ జేతు!
తను బడవైచి యీ - తపననందనుని
తనరాజ్యమేలింపఁ ద - లఁచితిగాక
దీన నీకేమి సి - ద్ధించు? నీబుద్ధి
జానకి వెంటనే - చనియె గానోపు!
రామ నీకీ యధ - ర్మము ప్రాప్తమయ్యె
నేమి సేయఁదలంచి - యేమి చేసితివి?"
అని నోటఁదడిలేక - యాస్యంబువాడ
తను జూచి పల్కి యుం - తట శక్తిలేక

శరమెల్ల నుడివోవు - జలదంబు రీతిఁ
గరిబొగ్గువడిన శి - ఖావంతు కరణిఁ
తేజంబు మాసిన - దినరాజు మాడ్కి
నాజిలోఁ బడిన మ - హాసత్త్వశాలి
వాలి యాడిన యట్టి - వచనముల్ ధర్మ
మూలముల్ నిష్ఠురం - బులునైన కతన
చెవిసోఁక విని రఘు - శ్రేష్ఠుండు చాల
వివరంబుగా వాలి - వినఁగ నిట్లనియె.
"కపివీర ! ధర్మార్థ - కామలౌకికము
లిపుడింతయు నెఱుంగ - కేల పల్కెదవు ?
ఇందుకోఁ గాదని - యెదువారు లేని
యందుచేఁ దోఁచిన - యట్లు వల్కుదురె ?
వనపర్వతద్వీప - వతియైన జగతి
నినవంశమనుజులైన - యిక్ష్వాకు కులులు
పాలింపఁ దమరు పా - ల్పడి మృగపక్షి
జాలంబులను మహీ - జనుల రక్షింపఁ
బాలియింపఁ గర్తలె - ప్పుడుగాన భరతుఁ
డలఘు పుణ్యుఁడు ధార్మి - కాగ్రణి సకల
లోకరక్షకుండు సు - శ్లోకుఁడుత్తముఁడు
చేకొని రక్షింప - శిక్షింపఁ గర్త
గాన యాయన యను - గ్రహముచేఁ బంపు
పూని వచ్చితి మట్టి - పుణ్యశీలుండు
నెలమి నధర్మాత్ముఁ - డేలుచున్నట్టి
యిలమీఁద నెవ్వారి - కేమన వచ్చు ?
కామాంధుఁడును నీతి - గతిలేనివాఁడు

యన్యాయమని నీకు - ననరాదు వాలి!
కలుషపంకములెల్లఁ - గడిగి స్వర్గాది
విలసన శోభనా - న్వితునిఁ జేసితిని!
ఇంక నీకొకమాట - హృదయకళంక
సాంకర్యములు దీఱ - సమ్మతి వినుము
రాజులు లతికావ - రణములు దాల్చి
యోజించి దీమంబు - లుద్దిగా నునిచి
మిట్టుపల్లములైన - మేదినులందు
కట్టలనురులును - గండెలివైచి
వలలొడ్డి పోఁగులు - వారి చాటులను
నిలిచి వంచనల వ - నీమృగంబులను
పరమధార్మికులయ్యు - భయముచేఁ బఱవ
కరుణ యింతయు లేక - కదిసి చంపుదురు
మీరును వనచర - మృగములు గాన
చేరువఁ బొంచి యే - సితి వినోదమున
తెలియక నన్ను నిం - దించిన నేమి?
ఫలము నీకిట మీఁదఁ - బరికించుకొనుము
దేవతల్ రాజుల - తీరున బుట్టి
భావించి పుణ్యపా - పములేర్పరించి
రక్షింపఁ దగు వారి - రక్షింతురెఱిఁగి
శిక్షించు వారల - శిక్ష సేయుదురు
కననేరవైతి వా - గ్రహముచే ధర్మ
మనరాని దుర్భాష - లాడ నేమిటికి?
చాలింపు" మనిన నం - జలి చేసి వడఁకి
వాలి యారఘుకుల - వరునకిట్లనియె.

స్వామి! మీయానతి - సత్యంబు ఖలుఁడ
తామసాత్ముఁడ నీచ - తరుఁడ నీయెదుర
నెదిరించి మాటాడ - నెంతటివాఁడ?
సదయాత్మ! యిది నాదు - జాతి చేష్టితము
ఎఱుఁగని వానరుం - డేమన్న నేమి?
మఱచి యానేరముల్ - మది నోర్చుకొనుఁడు
నేరంబులకునైన - నిష్కృతిఁ జేసి
శ్రీరామ! నన్నుర - క్షించితిరిట్లు!
సర్వభూతహిత ప్ర - చారుండ వఖిల
నిర్వాహకుఁడవు మా - నితపుణ్యనిధివి
పరమధార్మికుండవు - పాపమానసునిఁ
గరుణతో శిక్షించి - గడ తేర్చినావు
నిగ్రహించిదిగాదు - నీయనుగ్రహము
సుగ్రీవుమీఁది యీ - సున ముక్తి గలిగె
నున్నబల్కులను వీ - నులఁ జల్లచేసి
నన్ను రక్షింపుమ - నాథ శరణ్య!"
అని రొంపిలోఁ బడు - హస్తి చందమునఁ
దనమోము కన్నీటఁ - దడిసి సొంపరగఁ
గాయంబువెంట ర - క్తప్రవాహంబు
కాయంబు నిండ గ - ద్గద నిస్వనమున
శ్రీరామచంద్ర! కూ - రిమి చుట్టములకు
తారాదిసతులకుఁ - దన దేహమునకు
మదిలోనఁ జింతించి - మగుగ నాప్రాణ
సదృశుఁడౌ రత్నకాం - చన శుభాంగదుని
యంగదునిఁ దలఁచి - యడలెద బాలుఁ

నీమహిఁ నీవె కా - కెవ్వఁడున్నాఁడు ?
తగున జ్యేష్ఠభ్రాత - తండ్రితోసాటి
యగు విద్యనేర్పిన - యతఁడట్టివాఁడు
తనయుఁడు శిష్యుఁడు - తమ్ముఁడు నొకట
యని యెంతు రాగమాం - తార్థకోవిదులు
ధర్మమర్మ మెఱుంగఁ - దరముగా దాత్మ
నిర్మలు లన్నిఁట - నిండుక యుండి
చూచుచుందురు శుభా - శుభకర్మరతులు!
ఏచోట దగుఫలం - బిచ్చువారలకు
చపలాత్ముఁడవు నీవు - చపలులైనట్టి
కపుల సంగతి నేమి - గని యెఱుఁగుదువు ?
అంధుఁడంధుని గూడి - నట్లు మీజాతి
బాంధవుల్ నీకన్న - బ్రాజ్ఞులన్నిటను
తెలివిడి సేతు నీ - తెఱఁగు మాతెఱఁగు
కల విఱుచుక విని - కడతేరు మీవు
కానక నిందింపఁ - గాదు మమ్ములను
నీనేర మెఱుఁగగ - నేరవు నీవు
తమ్ముని సతి రుమా - తరుణితో నెట్లు
సమ్మతంబునఁ గ్రీడ - సల్పెద వీవు !
పాపాత్ముఁడవధర్మ - పరుఁడవుగాన
తూపుఁగైకొని నిన్ను - ద్రుంగ నేసితిని
యెవ్వఁడు నడవని - యీకాని నడక
త్రొవ్వచే నడచు నీ - కును హాని రాదె ?
చెలియలిఁ దమ్ముని - చెలియఁ గూతురిని
వలచి పట్టిన వాని - వధియింపఁదగవు

భరతుని యాజ్ఞఁ ద – ప్పఁగరాదు మాకు
దౌర సెప్పినటుసేయ – గోసంబురాదు.
ఇలయు విల్లాలి నీ – కిప్పింతు ననుచుఁ
జెలిమివేళఁ బ్రతిజ్ఞఁ – జేసినవాఁడ
నీరవి సుతునితో – నేనాడి తప్ప
నేరఁగానవు నిన్ను – నిగ్రహించితిని !
చెలికానికైన యి – చ్చెము మాన్పలేని
చులకనివాఁడు యశో – నిధి యగునె ?
నమ్మినవాని మా – నంబుఁ గాచుటయె
సమ్మతంబును ధర్మ – సరణియు నగుట
గట్టిగా నిది యెఱుఁ – గని సేఁతగాదు
పట్టి నిన్ను వధింపఁ – బరమధర్మంబె
రాజదండనము కా – రణముగా ధర్మ
రాజదండనము నే – రదు నీకుఁ గలుగ
నమరలోక సుఖంబు – లందెదు వింక
సమబుద్ధిఁ గ్రోధంబుఁ – జాలింపు మీవు
జగతి నాజ్ఞాహరుని – సమయింపకున్నఁ
దగులు రాజునకు పా – తకము వెంబడినె
కావున మారాడ – గా రాదు నీకు
జీవనాపేక్ష దూ – షింపకుమమ్ము.
మావంశకర్తయా – మాంధాతచేత
నీవిధంబుగ ధర్మ – మీడితంబయ్యె
మర్త్యులు పాపక – ర్మంబులు సేయ
నుత్తములగు రాజు – లోర్తురే చూచి ?
అన్యోన్యతారకం – బగుట నాపైది

డంగద కోర్వకే - మనువాఁడో వాఁడు!
ఆతపంబున నింకు - నల తటాకంబు
రీతిఁ గృశించి జీ - ర్ణించు నానాఁట
ననుబాసి నిమిషమై - న సహింపఁ జాలఁ
డనయంబు నారొమ్ము - నందె నిద్రించు
నేనిడ కాహార - మెవ్వరిచేత
నైన నొల్లఁడు తల్లి - యుండకుఁ బోఁడు
పసిబిడ్డ మనసు ని - ల్వఁగ లేదు మాట
రసికుండుగాఁడు తా - రాకుమారకుఁడు
ఆయొంటి కొడుకుల - కై కలంగిడును
నాయాత్మ నీచర - ణంబులే కాని
వాని కాధారమె - వ్వరు లేరు సకల
దీనబాంధవ! కడ - తేర్పు మెల్లైన
నమ్మితిఁ బుత్రదా - నంబు సేయుటకు
నమ్మింపు నీకీలు - నామకాళినుంచి
రక్షింపు నేర్పు నే - రములు సహించి
పక్షీకరింపు మీ - భానుజునట్లు!
ఇరువురు సరి మీకు - నీ లక్ష్మణుండు
భరతసుగ్రీవులు - భావింప మీకు
రామ! యేకై వడి - రక్షింపఁ ద్రోయు
రామిరొమా యటుల తా - రాకుమారుఁడును!
సెలువు పట్టున నొక్క - చెలమైన నిలుపఁ
బఱిగుట దీరని - పని యిది మీకు
హతుఁడైన పగవాని - యాత్మజుఁడగుట
హితశత్రుఁ డితఁడని - యెవ్వారలైన

— వాలి తనకర్తవ్యము రామునకుఁ దెలిపి పరలోకమున కేఁగు స్థితిలోనుండుట —

బట్టించియిది విన్న - పము సేయఁ జెవిని
బెట్టకప్రోవుఁడీ - బిడ్డని మీరు
తనమీఁదఁ బగచేతఁ - దారపైఁ జాల
గినిసి సుగ్రీవుఁ డం - కిలి సేయకుండ
నాయనాథను గావు - మనఘ! మీకరుణ
నీయవనీచక్ర - మెల్లఁ బాలించి
తరువాత స్వర్గంబుఁ - దాఁ జేరఁ గలఁడు
తరణితనూజుఁడెం - త కృతార్థుఁడయ్యె!"
అనిపల్కు వాలి మ - హా శౌర్యశాలిఁ
గనుఁగొని రఘుకులా - గ్రణి యిట్టులనియె
"చేమించి యిటునడ - చిన కార్యమునకు
నేమిదలంచిన - నిఁక నేమి గలదు?
ఇందుచే నీపాప - మెల్లను దీఱె
నందవు నినుద్రుంప - నఘములునాకు
శోకమోహంబుల - సుడిఁ జిక్కువడక
యేకడఁ దత్త్వమూ - హింపు సత్యముగ
దిఁమున కేఁగుము - ధృతిపూని తార
నవమతి యొనరింపఁ - డర్కనందనుఁడు
నాయంబు నీభాను - నందను నందు
నీయందుఁ గలభక్తి - నిలుపు నంగదుఁడు
అతని కేమి కొఱంత - యాత్మఁజుఁ దలఁచి
యతినీచ మగుదుఃఖ - మంద నేమిటికి?"

అని యుచితంబుగా - నాడిన రాముఁ
గనుఁగొని యావాలి - క్రమ్మఱంబలికె
" జానకీరమణ ! ని - శాతసాయకము
చేనేసితివి రొమ్ము - చినిఁగి కూలంగ
నానొవ్వి యదియంత - యనరాని మాట
లేనిన్ను బలికి నా - హృదయంబులోన
మిగులఁ దపించెద - మీరవి మఱచి
పగమాని నన్ను జే - పట్టుఁడుల్లమున
నాపట్టి బాలుఁడై - నను రవితనయు
ప్రాపున మేనడాఁ - పడ సంగరముల
మీపనిపాటల - మెలఁగఁగ నేర్చు
నోపు నెంతటికైన - నోడఁడెవ్వరికి
వాని కేమి గొఱంత - వాఁడు నీవాఁడు
జానకీరమణ ! వి - చారమేమిటికి ?
ఏనెవ్వఁడను విశ్వ - మెల్ల రక్షింపఁ
బూనిన మీతోడఁ - బోసఁగఁ బల్కుటకు ?"
అని శరవేదన - నరగన్ను వెట్టి
తనువు మ్రాన్పడనచే - తనుఁడయి వాలి
యిలమీఁద వ్రాలిన - యెడఁదార తనదు

— రామబాణ హతుఁడైనవాలి యవస్థఁగని తారవిలపించుట —

నిలయంబులో వాలి - నిర్యాణవార్త
విని మూర్ఛనొంది యా - వెంబడిఁ దెలిసి
తనవెంట వృద్ధ బాం - ధవకోటి రాఁగ
నంగదుఁ దోకొని - యావాలి పడిన

సంగరస్థలికి రా - సకలవానరులు
భీతిచేఁ బఱచిన - బెదరక తార
" హేతువెయ్యదిపాఱ - నేమిభయంబు ?
వసుధ యేలఁదలంచి - వాలినింజంపె
బిసరుహాప్తసుతుండు - బెగడ నేమిటికి ?
నిలుఁడన్న వారలా - నెలఁతను జూచి
కలఁగుచు " నోయమ్మ ! కనుమల్లవాఁడె
శరము కీలనమర్చి - శమనునిరీతి
దురుసైన బలువిల్లు - దొనలును బూని
వికట భాగమునందు - నిలిచిన వీరుఁ
డొకఁడెవ్వఁడో చూచి - యోడిపాఱెదము!
ఇటువంటి దొరఁజూచి - యేమేల నిలుతు
మటుపోవ నేల నీ - యాత్మజుఁగూడి
మఱలుము నేఁడె కు - మారునిం దెచ్చి
పురికిఁ బట్టము గట్టి - పోషింపుమమ్మ
వజ్రనిభంబైన - వాలమ్ముచేత
వజ్రిసూనుఁడు రణా - వనిఁగూలినాఁడు
మనమేఁగ జెల్లదు - మాయమ్మ మఱలి
చనుదెమ్మ కాదన్న - చనుమెందునైన
బ్రదుకుపై యాస దె - ప్పరముగ మేము
గదియవత్తుమె వాలిఁ - గన్నులఁజూచి ?"
అనవిని యావాన - రావళిఁగాంచి
తనమదిఁ చింతిల్లు - తార యిట్లనియె
"అవివేకులార ! మ - హాశౌర్యశాలి
ప్రవిమలాత్మకుఁడు నా - ప్రాణ నాయకుఁడు

వాలియిట్లుండ నీ - వనుమతి యేల ?
ఏలయంగదుఁడు ? నా - కేమియు నేల ?
వచ్చినరండు రా - వలదేని పొండు
విచ్చలవిడి" నని - వెలఁది తావచ్చి
పిడుగుగొట్టినయట్టి - పెనుగొండమాఱు
పడు గాత్రమున నుర్విఁ - బడియున్న వాని
నసురనాయకుల బా - హాశక్తి చేతఁ
గసిమసఁగు ప్రతాప - ఘనలీలవాని
కొండలు పొడిచేసి - కుంభినిఁ గూల్చు
చండిభుజాసత్త్వ - సంపదవాని
తనతండ్రి మెచ్చని - ధైర్యశౌర్యములు
గనువాని సజలమే - ఘధ్వని వాని
మృత్యుపాశములు నె - మ్మేయిఁ గట్టువడుట
యత్యంత మూర్ఛితుం - డైనట్టివానిఁ
బతిఁజూచి జానకీ - పతిఁజూచి మఱఁది
నతనిచెంగటి సుమి - త్రాత్మజుఁజూచి
వారల మీఁటి యాఁ - వాలి చెంగటికిఁ
జేరి పైఁ బ్రవాలిమూ - ర్ఛిల్లి యాతార
తానంతఁ దెలిసి సం - తాపంబు నొంది
"హా! నాథ! హా! యంగ - దా యంచు" వగచి
యన్నువ పులుఁగు చా - యను విలపింపఁ
గన్నుల నశ్రువుల్ - గ్రమ్మ నంగదుఁడు
పలవింప వారల - భావించి తాను
కరఁగుచు నన్న చెం - గటఁ జేరవచ్చి
సుగ్రీవుఁడును జాల - శోకింప రాఘ

వాగ్రణి శరముచే - నాహవభూమి
తొడిఁబడ మూలంబు - తోఁ బెల్లగిల్లి
పడిన వృక్షమనంగఁ - బరవశుఁడైన
వీరుని వానర - విభువాలిఁగూర్చి
తారాది పావన - తార యిట్లనియె
" హరిరాజ! యివేల - యరగన్నుమొగిచి
ధరణిపైఁ బొదలి సం - తాపమొందెదవు?
పరపుల మీఁదటఁ - బవళింపకేల
పరపైన రానేలఁ - బవళించనీకు?
కనువిచ్చి చల్లఁగాఁ - గనుఁగొనవేల?
ననుఁజూచి యేలయీ - వనము వాంఛితివి?
అకట! కిష్కింధా మ - హా పట్టణంబు
నకుఁజోడుగా నొక్క - నగరంబునీకు
సంతరించితి రేమొ - స్వర్గవీథికల?
ఇంతటి వానికే - యిటువంటిపాటు!
నందనవనము మి - న్నక పాడుచేసి
నందనోద్యానంబు - నకుఁ బోవనగునె?
నను బాసి దివిజకాం - తలఁగూడఁ దలంచి
తను గొంచపఱుతురె - తరుణులలోన?
ఎటువలె నోర్తుని - న్నెడవాసి నేను!
కటకటా! క్రోధంబె - కడతేర్చెనిటుల!
ఇలయేల? నీవెంట - యేవత్తు దివికి
నిలుతునె యెడవాసి - నిమిషమేనియును!
దేవతాసతులు నీ - తీరుఁ జూచినను
భావజునకు నేల - బందాలు గారు?

తప్పక విధివిహి - తంబైన బుద్ధి
నిప్పుడు సుగ్రీవు - నెదిరించితీవు!
తన కేలమాను వై - ధవ్యాదులైన
యనుపమ దుఃఖము - లవిచుట్టుకొనక ?
అక్కట! సుకుమారుఁ - డైన యంగదుఁడు
దిక్కెవ్వరును లేక - దీనతనొంది
కితవుఁడైనట్టి సు - గ్రీవునిఁ గొలిచి
బ్రతిమాలి యేరీతి - బ్రదుకువాఁడింక ?
వానికెయ్యదిబుద్ధి ? - వచ్చియున్నాఁడు
సూనునిఁ గనువిచ్చి - చూచిమాటాడి
యిదిబుద్ధియనుచు వా - యెత్తవు! నీదు
పదపద్మముల మీఁదఁ - బడియున్నవాఁడు
హా! హరిహయపుత్ర! - హా! వాలి!" యనుచు
నాహిరిఁ బాడిన - యనువుగానేడ్చి
'అంగద' రమ్మని - యంగదతోడ
యంగంబు వట్టి యె - య్యన లేవనెత్తి
"ఏతండ్రి పోషించు - నిఁకనిన్నుఁ దండ్రి ?
మీతండ్రి పోవన - మ్మినవారిఁ జెఱచి
భానునందనునితోఁ - బ్రతినఁ జెల్లించి
జానకీజని సి - జనకునిఁ జంపె
ఏమయ్య! సుగ్రీవ! - యీవాలిఁ జంపి
నీయిచ్ఛరంబెల్ల - నేఁడు దీర్చితివి!
ఆపదల్ గడతేరె - నా రుమంగూడి
యీపురంబేలు మీ - వేక చిత్తమున!
చింతించిచెయిగానిఁ - జేతఁబట్టితివి

పంతంబుతోఁ బగ - పాతరం బడియె"
అనియంగదకుమారు - నావాలిచెంత
నునిచి యాతార వి - యోగ దుఃఖమున
శోకింప నావాలి - సుదతులందఱును
గాకలీరవముతోఁ - గన్నీరు చింద
"హా! యంగదకుమార! - హా! ప్రాణనాథ
హా! యీశ! హా! వాలి! - యనిపలవించి
"అయ్యో! కుమారు నూ - రార్పవదేల?
తొయ్యలి యీతార - తోఁ బల్కవేల?
ఏమేమి నేరంబు - లేము జేసితిమి
మామీఁదఁ గరుణించి - మాటాడవేల?
ఎవ్వరు వాలింతు - రీకపిరాజ్య
మెవ్వరుదిక్కు మా - కేమి సేయుదుము?"
అని వాలిపై వ్రాలి - యందఱు నేడ్వఁ

— హనుమంతుఁడు తారనూరార్చుట - ముందుచేయఁగల కార్యమును తెలుపుట —

గని వాయుతనయుఁడు - గ్రక్కునవచ్చి
తారపాదముల మీఁ - దను వ్రాలి కంట
నిరుంచి తారక - న్నీరు వో దుడిచి
"ఓయమ్మ! నీవింత - యుమ్మలికింప
నాయమే వాలికై - నకొఱంత యేమి?
ఇలయెల్ల నేలె న - నేక దానవులఁ
వాలియించె భుజబలం - బునఁగీర్తి గాంచె
రాముబాణంబుచే - రణములోఁ బడియెఁ

గామింపఁ దగిన స్వ - ర్గముఁ జూఱవట్టె
సంగదు సంతతి - యాత్మజుండుండ
నంగనామణి! యేటి - కమ్మ యీచింత?
విజ్ఞానరాశివి - విమలమానసవు
ప్రాజ్ఞురాలవు భూత - భావికార్యములు
తెలియనేర్తువు నీకుఁ - దెలివిడికాని
నిలనేమియున్నవి? - యీవాలి కొఱకు
సేయంగఁదగు క్రియల్ - చేసి యంగదునిఁ
బాయక కిష్కింధఁ - బట్టంబుఁ గట్టి
యిల యేలుచుండ నీ - వీక్షించి కీశ
కులమెల్ల రక్షించి - కొడుకును నీవు
మమువంటి మంత్రుల - మాన్యుల నెఱిఁగి
సనుబుద్ధిఁబోషించి - చలముఁ జాలించి
మఱఁదినిఁ దగినట్టి - మర్యాదనుంచి
గుఱిచేసి యీ నమ్మి - కొలిచిన వారిఁ
జెదరనీయక వాలి - చేసిన మేర
లదనుతో నడిపింప - నగు గాక నీవు
చింతించి 'గతజల - సేతు బంధనము'
కాంతునిఁ దెచ్చెదే - కడచన్నవాని?
భామిని! బుద్బుద - ప్రాయముల్ మేను
లేమి యెవ్వరికైన - నివియూర్జితములె!
పుట్టినయప్పుడె - పోలియుట నిజము
గట్టిగా దేహికిఁ - గనమె లోకులను
క్షణభంగురంబైన - సంసారమునకు
నణుమధ్య! యెఱుఁగక - యాత్మనమ్ముదురు

వాలి యహంకార - వశతచేఁ గూలె
నేల యీమమకార - మిప్పుడు నీకు ?
సేయు కార్యంబులు - చింతింపవమ్మ !
జాయ లే యిహపర - సౌఖ్యదాయినులు
ఎట్టివారికిఁగాన - యిన్నియు నెఱిఁగి
యిట్టికై వడి నేడ్వ - నీఁకనేమి గలదు ?
చాలింపు " మనిన యం - జనకుమారకుని
వాలి యిల్లాలు పా - వనశీల వలికె.

— హనుమంతునకు తార ప్రత్యుత్తర మిచ్చుట —

"అన్న ! వాయుకుమార ! - యంగదుఁ బోలి
కన్నట్టి కొడుకు లే - కడ నెందఱైనఁ
గలిగిన వారలు - గపిరాజ్యమేల
గలరె ? సింహబలంబు - గాకరక్షింప
నక్కలచేనౌనె ? - నాచేత నగునె ?
ఒక్కని దొరఁజేరి - యనుపరాజ్యమున
వీనికిఁ బినతండ్రి - విభుఁడు సుగ్రీవుఁ
డేనెవ్వతెను ? నాకు - నేమి గార్యంబు !
తల్లియుఁ దండ్రియుఁ - దైవంబు గురువు
నెల్లను రవిసూనుఁ - డీకుమారునకు
వీరశయ్యా సమ - స్వతుఁడైన వాలి
యీరణంబున బడి - యెటకు నేఁగడినో ?
అచ్చోటికే వెంట - నరుగుదు నీవు
సచ్ఛత్రుఁడ విట్లు - జనునె భాషింప ?
వాలియే తనకు దై - వము యేల వట్టి

జోలి మాటలు రాజ - నూనులు వినఁగ ?"
అనుచంతఁ దనకన్ను - లల్లనవిచ్చి
తనయుని హనుమంతుఁ - దారనుఁజూచి
యాచెంతఁ గన్నుల - నశ్రులు రాలఁ
జూచు భానుతనూజుఁ - జూచి చింతించి
శతమఘతనయుఁడు - సాంత్వన వినయ
హితగౌరవములఁ దా - నిట్లని పలికె.

—: మరణోన్ముఖుఁడైనవాలి, తనకుమారుఁడైన యంగదుని తన భార్య తారను, సుగ్రీవున కప్పగించి మృతిఁజెందుట :—

"ఓయి! సుగ్రీవ! నా - యొచ్చంబులెల్ల
నీయాత్మ మఱవక - నిలుపంగరాదు
ఇరువురకును సౌఖ్య - మేడది యొక్క
ధరణియాశించు పా - తకమానసులకు ?
తగినట్టివాఁడవు - ధరణికిఁ దానుఁ
దెగినట్టి తరువాతఁ - దెల్లమెల్లరకు
నిట్టి యవస్థచే - యేనుండి పలికి
నట్టి మాటలు విను - నది నీకుఁదగవు
ఇలమీఁద వ్రాలి ది - క్కెవ్వరు లేక
కలఁగుచు నుడివోని - కన్నీటఁ బొరలి
యున్న యంగదుఁ జూడు - మొక్కఁడే తనకుఁ
కన్నట్టికొడుకు చ - క్కనివాఁడు నీవు
నుపలాలనము సే - యు యోగ్యుఁడు వీత
గపట మానసుఁడెఱుఁ - గఁడు వివేకంబు
నాకుమారుఁడు గాఁడు - నమ్మతి వాఁడు

నీకుఁ బుట్టినవాఁడు - నెగులొందనీకు
నిన్నాళ్లు లాలించి - నేనీకుమారు
నన్నిగారవముల - నేది పెంచితిని
యాతీరు దప్పక - యరయుము ప్రాణ
దాతవు నేతవు - త్రాతవు నీవు
ఋణమున బోఁడు ధా - ర్మికుఁడు చేచూపి
రణములఁ జూడు తా - రాకుమారకుని
నీవంతవాఁడయి - నీవిరోధులను
మాయించుఁ దోడాస - మసలఁడెచ్చోట
నాశక్తి యెంత యం - తటి సత్త్వశాలి
యాశిశువు వెపుడు వ - జ్రాంగి నీకతఁడు!
అల సుషేణుతనూజ - మైన యీతార
యలఘు వివేక కా - ర్యసమర్థురాలు
యేరీతిఁ బలికె నీ - విట్టట్టులనక
యారీతి నడచి మే - లందుమేయెడల
శ్రీరాముతో నేమి - చేసెదనంటి
వా రామచంద్రుఁడే - మనియె నీతోడ?
అటుల కావింపు మీ - వది తప్పితేని *
యటమీఁద నిహపర - హానిఁ జెందుదువు.
ఈ యింద్రదత్తమా - హేమదామకము
మీఁయన్న! తాల్చి నా - మాఱుగామనుము!
అసువులు బాయక - యటమున్న నీకు
నొసగదఁ దగువాత - యోగ్యంబు గాదు
నీవు ధరింప దీ - నికి నియ్యకొమ్ము"
నావుడు శోకదై - న్యముల నీఁదుచును

రాహువుచేఁ జిక్కు - రాజునుఁ బోలి
యా హరిదశ్వుని - యాత్మనందనుఁడు
కలఁక నొందకఁ బిల్చి - కాంచనమాలఁ
దలవంచికొని చేరఁ - దా మెడనైచి
సుగ్రీవు నెమ్మోము - చూచి హర్షించి
యగ్రభాగమునందు - నంగదుఁ గాంచి
"రమ్ము కుమార ! యూ - రకు మేల వగవ ?
ఇమ్మెఁద సుగ్రీవుఁ - డేదిక్కు నీకు
నన్ను జూచినయట్ల - నాసహోదరుని
వెన్నాసరై నిల్చి - వీక్షింపు మెపుడు
వేరుసేయక కాల - విధము దేశంబు
నారసి సుగ్రీవు - నాజ్ఞప్తి వినుము.
అనిచిన పనులందు - నాకలిఁదప్పి
యును దేహసౌఖ్యంబు - నూహింపఁ బోక
మదిలోన నిన్నాళ్లు - మందెమేలంబు
వదలి సేవక వృత్తి - వర్తింపు మీవు
భానుతనూజుని - పగవారి నతని
కాని వారిని వారి - కడవారిఁ జేరి
మాటాడఁ బోకుము - మధ్యమరీతిఁ
బాటించి చొరవలఁ - బైకొనఁ బోక
కడలనుండక యొక్క - క్రమమునఁ గాచి
నడువుము నీవని" - నందను కేలు
తమ్ముని కరములోఁ - దానుంచి రాము
సమ్ముఖంబున ఘోర - శర మహావ్యథను

దయితలందఱు మూఁగి - తనమీఁద వ్రాల
నయశాలి వాలి ప్రా - ణంబులు విడిచె.

— వానరులు తారాసహితముగ వాలిమృతికై శోకించుట —

అపుడు వానరులు మ - హారోదనంబుఁ
గృపణభావమునఁ గి - ష్కింధ చలింపఁ
గావింప గిరివని - కందరావళుల
భావింప మున్నంటి - ప్రభ మాసియుండ
హితబాంధవులు చేరి - "యెవ్వఁడీ వనము
లతిశయంబగు నాజ్ఞ - నరయ శక్తుండు?
ఈవాలియేకాక - యిఁక నేఁటి బ్రదుకు?
పోవుద మెందైన - పుడమిపై వలస!
గోలభుఁడును యక్ష - కుంజరుతోడ
వాలంబుఁ బదియు నే - నబ్దముల్ చేసి
పదియునాఱవయేఁట - బట్టివధించె
నిదుర యాహారంబు - నిరసించి వాలి!
ఇంతటివాఁడింక - నెవ్వఁడు పాప
మెంత చేసితిమొ నేఁ - డితని బాసితిమి!"
అనిపల్కఁ దారాదు - లందఱు తమదు
పెనిమిటిపై వ్రాలి - బిట్టుశోకింప
ఉతలతోఁ గూడి మూ - లంబుతోఁ బెకలి
క్షితి వ్రాలి భూజంబు - చెలువున నున్న
వాలిమొగంబుపై - వ్రాలి యాతార
యాలింగనము చేసి - యడలుచుఁ బలికె,

"ఏను జెప్పిన బుద్ధు - లేఁటికి వినక
యీనేలఁ ? ప్రాణంబు - లీనేల కీవు
విషమభూమిని రాము - విషసాయకమ్ము
విషసర్పమునుఁ బోలి - వెదకి వధించె !
నాయన ! యీభూమి - నాకన్న నీకుఁ
ద్రోయరానిదియె హా - త్రుక కాఁగిలింప ?
తరణినందను పాల - దైవంబు గలిసి
పరిణామమొందించెఁ - బగయణఁగించి
నమ్మిన ఋక్షవా - నర సమూహంబు
కమ్మిక వేళలు - గాచి కొల్వనకు
నిదె వచ్చియున్నవా - రీ యంగదుండు
పదముల చెంగటఁ - బడియున్నవాఁడు
వారికిఁ గొలువిచ్చి - వాని లాలించి
కుఱిమి నెత్తియ - క్కునఁ జేర్చుకొమ్ము
అలిగియున్నావె ? మా - టాడవదేల ?
అలిగిన నీకు నిం - ద్రాదు లడ్డంబె ?
నీచేతఁ దెగినట్టి - నీచులు వడిన
యీచాయఁ బడియుందు - రే నీవునట్ల ?
జగడంబులన్న ని - చ్చలు నుబ్బునీవు
తగునె నన్నిటులనా - థను జేసి వదల
శూరులకును బడు - చుల నియ్యరామి
కారయ నేనేయు - దాహారణంబు
తన తల్లిదండ్రులు - దానును శోక
వనధిలోఁ బడితిమె - వ్వరుదిక్కు మాకు !

ఎందుకు చుట్టంబు ? – లెందుకు తనయు ?
లెందుకు సంపద ? – లెందుకు దేహ ?
మెందుకు ప్రాణంబు ? – లెందుకు మోటు
చందమై పతిలేని – సతినిల్పనేని ?
నెత్తురు కండలు – నీకు కెంజాయ
మెత్తని పరుపులే ? – మేదినిఁబడగ
జగతిపై ధూళి వా – సన గందవొడిమె
నిగనిగమను మేను – నిండఁ దాల్చుటకు ?
మొరపరానేలపై – మొగముఁజేర్పంగఁ
బఱచిన పువ్వుల – పానుపే నీకు ?
గిరిదూరి యిలదూరి – గెడపిసాలములు
మరలి తూణముఁ జేరు – మహిసుతాప్రియుని
శరము నీమేనిలో – సరికట్టెఁగాని
యురము భేదించివె – న్నుచ్చి పోదయ్యె !
వజ్రికుమార ! ప – ర్వతమనరాదు
వజ్రహారంబు నీ – వరగాత్రయష్టి !
కాయమ్ముఁ జించి యా – కడపీపువెడలి
యాయమ్ము కనుపింప – దాయనుగాక !
ఆయమ్ము నాఁట ని – న్నాలింగనంబు
సేయనే యిటుల వం – చింతురే నన్ను ?
గరుడుని రెక్కల – గరులపరంజి
మెఱుంగు పింజయు నీదు – మేనిపై నెంత
సింగారమయ్యె నీ – క్షీంచిన మాకు

—. వాలి తేజము సూర్యమండలముం జొచ్చుట :—

నంగదునకు భయం - బైన నౌఁగాక !"
అని యేడ్చు నెడ నీలుఁ - డచటికి వచ్చి
కనకపుంఖంబు రా - ఘవసాయకంబు
గవిఁ జొరఁబారు నా - గకొమరుఁ దివియు
నవధానమునఁ గేల - నతిశక్తిఁ బట్టి
దిగదిగ వెలుఁగఁగఁ - దిగిచిన తొగల
పగరమయూఖంబు - పగిది వెలుంగ
వాలి గాయము వెంట - వడియు నెత్తురులు
జాలెత్తి జేగురుల్ - చరముక పాఱు
సెలయేరులన నుర - స్సీమ శైలంబు
పొలుపున మించున - ప్పుడు చూడనయ్యె !
అది గనుఁగొని తార - యంగదుఁ జీరి
"యదె కంటె ! మీతండ్రి - యంతిమావస్థ !
కనుఁగొంటివే వాలి - గాత్రంబు వెడలి
దినకర ప్రభ నొక్క - దివ్యతేజంబు
చనుచున్నది నమ - స్కారంబు సేయు"
మన విని యంగదుం - డటుల మ్రొక్కుటయు
తార యాప్రాణేశు - దరసి యోస్వామి !
"ఊరకయుందురే - యొల్లక మమ్ము ?
వీఁడె యంగదుఁడు దీ - వెనలిమ్ము కొడుకు
గాఁడె యిట్టేటికిఁ - గరుణింప విపుడు ?
సింగంబు చేతఁ జ - చ్చిన వృషభంబు
సంగిడి నావు వ - త్సంబుతోఁ గదియు
కైవడి నీచెంతఁ - గాచి కొల్చెదము

దేవ! యుపేక్షింపఁ - దీయునే నీకు?
సమరయాగముచేసి - శరవారిధార
సముబుద్ధి నవభృత - స్నానంబు నీవు
నను వెలిగాఁ జేయు - నాయమే? నీదు
తనువుపై కాంచన - దామమేమయ్యె?
అమరసంగంబుపై - నాతిపలుక్మ
యమరినరీతి నీ - యంగంబునందుఁ
దఱుగదు శోభావి - తానమిందఱిని
జెఱుపగాఁ దలఁచి యీ - చెడుబుద్ధిపుట్టి
నామాట గాదని - నాథ! యిల్వెడలి
సేమంబు రవిసూనుఁ - జేర్చి పోయితివి."
అని విలపింపుచో - నర్కనందనుఁడు
కనుఁగొలుకుల నుబ్బి - కన్నీరు రాఁగ
దాలిమి చాలక - తనవారుఁ దాను
చాల శోకించి భూ - స్థలి మీఁదఁ బొరలు
తార నూరార్చి సీ - తాప్రాణవిభునిఁ
గ్రూరసాయక హేమ - కోదండధరుని
వీరరసావేశు - విమలప్రకాశు
శ్రీరామవిభుఁజేరి - చేమోడ్చి పలికె.
"స్వామి! నాతోమీరు - శపథంబుఁ జేసి
యేమి వల్కితి రది - యీడేర్చినారు
ప్రతినఁ జెల్లించి నీ - పలికిన పలుకు
ప్రతిపాలనము జేసి - ప్రౌఢి మించితిరి

—: తనయన్నవాలి మృతికై సుగ్రీవుఁడు శోకించుచు, తనకు రాజ్య మక్కఱలేదని విరక్తుఁడగుట —

ఇటమీఁద నేనొల్ల - నిలయుఁ బ్రాణములు
కటకట! యెంతటి - కష్టుండనైతి
నన్నరణంబులో - నటువడి యుండఁ
గన్నట్టి తనయుఁడం - గదుఁడు శోకింప
నతని కులాంగన - యైన యీతార
వెతనొంద నిందఱు - వీక్షించువాఁడ!
ఎందుకు రోయుదు - నిటమీఁద? నన్ను
నెందులోఁ జతచేసి - యెంతురందఱును
అవమానరోషదై - న్యాదులచేత
నవశమై నాచిత్త - మప్పుడట్లుండె
యిప్పుడిట్లున్నది - యింతటిపాటి
తప్పునకోర్చు పా - తకుఁడెందుఁ గలఁడు?
ఈకొండపై నొంటి - నే జరియించి
యాకుల నలముల - నాఁకలి దీర్చి
యుందు నింతియెకాని - యొల్ల నీధరణి
యందుపై స్వర్గంబు - నటమున్నె యొల్ల
శ్రీరామ! యెట్లువ - చింపుదు నాదు
క్రూరబుద్ధియు వాలి - గుణగౌరవంబు!
ఎటులన్న! వినుపింతు - నేనునీతండు
పటుశక్తిఁ బోరాడ - బవరంబులోనఁ
గళవళింపుచుఁ బడి - కదలంగలేక
వెలవెలనైనఁ జే - వృథుంబు వాలి
నామీఁద బ్రేసి ప్రా - ణములకుఁ దెగక

యీమేర చెయిగాచి - యర్కకుమార !
పొమ్ము మెల్లఁగ లెమ్ము - పోరికి రాకు
తమ్ముఁడవని నన్నుఁ - దాలితి నిపుడు
నీమాట తారతో - నేనని వచ్చి
నీమీఁదఁ దెగనైతి - నిలువకు మిచట
పనిచెద చంప నీ - పగ ద్రెంపఁ బోల"
దనుమాట లాడియు - నాడక మున్న
పెనుగొండపై బెద్ద - పిడుగును బోలి
ఘనమైన నీసాయ - కము రొమ్మునాఁటి
యాయనం బడనైచె - నతఁడట్టివాఁడు
నేయిట్టి వాఁడని - న్నెన్ని మాటలకు
నతనితోఁ బోరాడి - యని సేయలేక
యతిలోక శౌర్యుని - న్నర్థించి తెచ్చి
చావ నేయించితిఁ - జాలవంచించి
దేవ ! నా కేదిబు - ద్ధి దురాత్మకునికి?
తలఁప చూడను గోరఁ - దగనట్టి ఘోర
కలుషంబుఁ జేసితి - గతియేది తనకు !
కోపించి త్వష్టనుఁ - గూర్చిన యింద్రు
శాపంబు తనకు సం - భావితమ్మయ్యె !
అతని బ్రాహ్మహ - త్యాదోషమెల్ల
భూతలం బతివలు - భూజముల్ నీళ్లు
పంచుకపోయిరి - పాపంబు దాని
మించిన దగుటయే - మిటఁ దీర్చుకొందు !
కులనాశనంబైన - క్రూరకర్మంబుఁ
దలఁచిన దనకు న - ధర్మ భోగంబు

నిలయును ప్రాణంబు - నీబహుమాన
ములునేల ? మిము నెట్లు - మోము జూచెదను ?
దేవ ! క్షుద్రుఁడ నింది - తుఁడ వంచకుండ
మావాఁడవని మీరు - మాటాడఁ దగఁడు !
నీరు పల్లంబున - నిలిచినయట్లు
భూరిపాతకదుఃఖ - ములు తనుఁజేరె !
అన్నఁ జంపించిన - యపకీర్తి తనువు
నన్ని యంగములు మ - హాపాతకములు
కానున్నయట్టి దు - ష్కర్మగజంబు
పోనీక తనుగరిఁ - బొడిచిన యట్లు
హానిఁ బొందింపుచు - న్నది పుటపక్వ
మైన హేమము గూడి - నట్టి లోహములు
తొలఁగినక్రైవడిఁ - దొలుతనాయందుఁ
గలుగు సద్గుణలేశ - గౌరవోన్నతులు
నీపాపమున నశి - యించె నంగదుఁడు
వాపోవ మాజాతి - వారికినెల్ల
సగము ప్రాణములయ్యె - జానకీరమణ !
పొగులుచున్నట్టి యీ - పుత్రునిఁజూచి
తమ్ముని గన్న చం - దంబున నాదు
నెమ్మది కిప్పుడు - నెవరు సంధిల్లె
భువి నంగదునివంటి - పుత్రుఁ డెవ్వరికి
నవనిపై మరిచూతు - మనిన నున్నాఁడె ?
కొడుకుమాత్రమె వీఁడు - కులము రక్షింపఁ
గడుఁ బాలుపడిన ము - క్తాఫలం బితఁడు
వాలినిఁ బాసి యో - ర్వఁగ లేఁడు వీఁడు

చాలదు బ్రతుకఁ త - జ్జనని శోకమున
నంగదతారల - ప్రాణంబులొకటి
యంగభావములై వే - రై యుండు గాని
వీరలిద్దఱిఁ జంపి - వీఱిఁడి ప్రాణ
మేరికిఁ బ్రీతిగా - నేఁదాల్చువాఁడ ?
అనలంబులోఁ జొచ్చి - యన్నను వాలి
తనయుని దారను - దాఁగూడువాఁడ !
నీమాట మదినమ్మి - నిన్నుఁ జేపట్టి
యేమినిమిత్తమై - యావాలిఁ జంపి
యింత చేసితినని - యెంచితిరేని
యంత నేనెఱుఁగని - యల్పుఁడగాను
యేమి మీరానతి - యిచ్చిన నదియె
తామాచరించి నీ - తా నిమిత్తముగ
మేనులు దాఁపక - మీకార్య భరముఁ
బూని యీడేర్పనో - పుదురొక్కఁ డొకఁడె
యానలుఁడీ నీలుఁ - డీ జాంబవంతుఁ
డానయనిధి యైన - యాంజనేయుండు
గలుగ నాపనియెంత ? - కాకుత్థ్సవంశ
తిలక ! యిన్నియుఁ బల్కి - తిని గాకమీకు
నీపవనజుఁ డొక్కఁ - డే చాలునతని
ప్రాపు గల్గినఁ గల్గు - భద్రంబులెల్ల
పరమ పాతకుఁడనై - బ్రదుకంగఁ దగని
కొఱమాలినట్టి నా - కు ననుజ్ఞ యిందు
వాలిఁ జేరఁగ " నన్న - వచనముల్ చెవుల
నాలించి కన్నుల - నశ్రులు రాలఁ

గడుచింతతో రెండు - గడియలేమియును
నుడువక సీతామ - నోనాయకుండు
ప్రాణనాయకు మీఁదఁ - బడి యేడ్చుచున్న
యేణాంకముఖి తార - నీక్షించుటయును

— వానరులు తారను రామునియొద్దకు తీసికొనివచ్చుట :—

నాసన్న యెఱిఁగి మ - హాకపుల్ బలిమి
చేసి యీడ్చినరాక - చిత్తంబు గలఁగ
వాలిఁగౌఁగిటఁ జేర్చి - వదలకయున్న
"ఏలమ్మ! రఘువీరుఁ - డేమి వల్కెడునో!
విని నీదుహృదయంబు - వినిపించియతని
యనుమతి నేమైన - నగుట యుత్తమము"
అని రాఘవుఁడు బిల్వ - ననుమాట యెపుడు
వినియె నప్పుడు లేచి - వేనలిఁ దురిమి
పయ్యెద సవరించి - పట్టిఁ జేపట్టి
యెయ్యారమున నిలు - చున్నట్టి వాని
శరచాప హస్తుని - శతపత్రనయను
హరిమధ్యు నతిలోక - నాజానుబాహు
లక్ష్మణాగ్రజు రాజ - లక్షణపూర్ణ
లక్ష్ముని రవిమండ - లవిభాసమాను
రామునిఁ గరుణాబ్ధి - రాముని సుగుణ
ధాముని ధీరుఁ బ్ర - భాసపూరుషుని
యెన్నఁడు మును జూచి - యెఱుఁగనివాని
యన్నులంతుక యంగ - దాలాపసరణి

సొఱఁగి వేగము చేర - నేతెంచి హృదయ
మెఱఁగింపఁ దెగువతో - నిట్లనిపలికె

—: తార రామునితో సంభాషించుట-తనభర్తతోఁ గూడ తన్నుఁజంపుమని యాతని ప్రార్థించుట :—

"అప్రమేయుఁడవు ద - యావారినిధివి
యప్రతీపప్రతా - పాభిరాముఁడవు
ధృతిమంతుఁడవు యశో - ధికుఁడవు సత్య
రతుఁడ వింద్రియజయ - ప్రౌఢభావుఁడవు
అవనిపై వెలసిన - యమరేంద్రుమాడ్కి
నవతారమందుమ - హానుభావుఁడవు
దేవ! నామనవి చిం - తించి కాదనక
కావింపుడిది యవు - గాదనవలదు 2410
ఏయమ్ముచేఁ వాలి - నేసితిరప్పు
డాయమ్ము చే దన - యాయమ్ము నాఁట
నేసినవాలితో - నెడవాసియున్న
గాసి యంతయుఁ దీఱి - కాంతు సద్గతిని!
ననుఁబాసి వాలియుం - డఁగ లేఁడు క్షణము
కవనొల్లఁడమరలో - క సరోజ ముఖుల
మీరు జానకితో ని - మేషంబుఁ బాయ
నేరనిగతి నర్ధ - నిమిష మాత్రంబు
ననుఁ బాయ లేఁడు వా - నరవజ్రపాణి
యనువుము కూర్చి పు - ణ్యము నీకుఁ గలదు' 2420
స్త్రీవధ దోషంబు - చేకూడ దనుచు
దేవ! నీయాత్మఁ జిం - తించెదవేని

యేనాఁటు దానఁగా - నీమేను వాలి.
లో నర్థభాగ మా - లోకింప వీవు!
వాలిఁ జంపెదనని - వరమిచ్చి ప్రతిన
చాల చేసితి భా - స్కర పుత్రుతోడ
నట్టి ప్రతిజ్ఞకు - హానిరాకుండ
గట్టిగా నేయు మీ - కడమపనంబు
వాలిఁ జంపినకీర్తి - వన్నెకు నెక్క
నీలోన తనుఁబడ - నేసితివేని
జలజాక్ష! యిదివేళ - శాస్త్రసమ్మతము
వాలినేసిన యట్టి - వాఁడవే తారఁ
గూల నేసినఁబతిఁ - గూర్చితివేని
నీకుఁ గన్యాదాన - నియతఫలంబు
చేకూడు నాఁటికిఁ - జేసిన పెండ్లి
కల్ల నీ విప్పుడు - గట్టింపు వాలి
పల్లవారుణ పాణి - పద్మంబు చేత!
నాకంధరను దాలి - నాదు దీవెనను
జేకొందు వటులైన - సీత నీప్రొద్దు
మత్తేభనిభ హేమ - మాలిని వాలి
హత్తించి తనుఁ ద్రుంచు - నదియొధర్మంబు
కాదన్న దనపాప - కంబులోఁజొరఁగ
నో దేవ! యనుమతి - యొసఁగుఁడు మీరు."
అన నూరడించి హి - తానులాపముల
వనితామణికి రఘు - వర్యుఁడిట్లనియె.

— శ్రీరాముఁడు ప్రత్యుత్తరమిచ్చి తారయొక్క
కర్తవ్యముఁ దెలుపుట :—

" వీరభార్యవు నీవు - వీటేఁడి దాని
మేర నీక్రియఁ బల్క - మేరయే నీకు ?
ఎవ్వని తలయందు - నేరీతి వ్రాసె
నవ్వనజాసనుఁ - డది గాకపోదు
దైవయత్నమునకు - తను దూరనేల ?
నేవాలి కహితుండ - నే పడనేయ ?
నను నెన్ననేల ? యీ - నలువకట్టడకు
తనశక్తి నెవ్వఁడు - తలఁగిపో నోవు ?
చింతయేమిటికి ! నేఁ - జేయుదు నీకు
నింతి యింతటికన్న - హెచ్చయిన హితము
అంగదు యౌవరా - జ్యంబున నునిచి
యంగదలేని సౌ - ఖ్యమునొందు మీవు
కొడుకులు లేనట్టి - కొమ్మలు దలఁచు
కడమాటలేల ? భా - గ్యము చేసినావు
పతిలేక యుండి శో - భనవతు లెందు
సుతులను గనినమం - జుల వాణులెల్ల
సుతుఁడన్న మాత్రమె - శూరత వాలి
కత మఱపించు నం - గద కుమారకుఁడు !
వలవదీబుద్ధి నా - వచనంబుఁ జేసి
యలివేణి ! తగినకా - ర్యము చూడు మిపుడు "
అనిన నేడుపుమాని - యశ్రులు దుడిచి
మనసు కొండలపాటు - మట్టుకుఁ దెచ్చి

పదరి కానిమ్మని - పలుకక గుట్టుఁ
చెదరక తలవాంచి - శ్రీరాముఁజూచి
వినయంబు భయము వి - వేకంబు ప్రియముఁ
దనర నూరకయున్న - తారను జూచి
సాత్త్వికజ్ఞానవి - శారదుండగుట
తత్త్వబోధముగ నీ - తాకాంతుఁ డనియె

—. శ్రీరాముఁడు తారకుఁ దత్త్వబోధఁ గావించి వాలి యగ్నిసంస్కారమునకుఁ బ్రోత్సహించుట :—

“ కామిని ! ధర్మార్థ - కామమోక్షములు
నేమించి పొందుట - నియతిచేఁ జుమ్ము !
నియతి కానాధీన - నియమంబుగాన !
నియమింపఁదగు నొక్క - నికి విభుత్వంబు
ఉర్వికి దొరలేక - యున్న నేపనులు
నిర్వాహకములు గా - నేరవు గాన
జలజాక్షి ! చింతించు - సమయంబుఁగాదు
తలఁపుమీ వేళ మీఁ - దటి కార్యచింత
కాలమందఱికిని - కర్తయౌగాని
కాలమునకు నొరుల్ - కర్తలుగారు
పగలును రాత్రులై - పరఁగుచు నదియె
మగువ ! కాలము ; కాల - మయుఁ డీశ్వరుండు
జగతి మిత్రజ్ఞాతి - సంబంధమెల్ల
విగణింపఁ గాలప్ర - వృత్తమైయుండు
కాలధర్మంబునఁ - గడచన్న యట్టి
వాలికి నెందాక - వగలఁ బొందెదరు !

అతఁడు వీరస్వర్గ - మందినవాఁడు
కృతకృత్యుఁడా వాలి - కినిఁ దగినట్టి
భావికార్యముఁ దీర్పఁ - బరగు మీ కనిన"
నా వేళ రాముని - యనుమతి వలన
సౌమిత్రి తారను - సమ్మతపఱచి
తామరిసాప్తనం - దనున కిట్లనియె
"కావింపు ముత్తర - కర్మముల్ వాలి
కావలఁ జెక్కకా - ర్యంబులు గలవు
తడవు సేయఁగరాదు - ధార్మికుండతఁడు
పడియున్నవాఁడుర్వి - పై మృతినొంది
యీ తార నంగదు - నీవు లాలించి
యాతని కొనరింపు - మగ్నికృత్యంబు

— వాలికి నగ్ని సంస్కారము చేయుట —

అర్కనందన! రాజ - వవనికి నీవు
మర్కటేంద్రుల నంపి - మఱి కాష్ఠములను
గంధపుచెక్కలుఁ - గదళికాండములు
గంధపొడియు నూత్న - కనకాంబరంబుఁ
దెప్పింపు మంగదుఁ - దెమ్మని పసుపు
మిప్పుడు, లాజలు - నెఱ్ఱి పువ్వులును
పరిమళప్రసవధూ - పము లక్షతములు
పెరుగు పాలును నెయ్యి - బెల్లంబు తేనె
తామసింపకు" మని - తారునిఁ బలిచి
"యీ మఘవతనూజు - నింటిలోనున్న
కనకవల్లికి నీవు - గ్రక్కునఁ దెమ్ము

చనుము కిష్కింధకు - జతఁగూడియున్న
బోయీలఁ బిలిపింపు - పురముఁగ్రై సేయఁ
జేయుము తగువారి - చేత శీఘ్రమున."
అనిపల్కు విని తారుఁ - డప్పుడేపోయి
యనుపమంబగు చతు - రంతయానంబు
తన పార్శ్వమైన బె - స్తలుఁ దాను దెచ్చి
యనుప రాముఁడు చూచి - యుల్లాసమొంది
" పోయి లక్ష్మణ! కపి - వ్యూహంబుచేత
నీయందలంబులో - నెత్తించి వాలి
నంగదతారార్కు - జాదులచేత
సంగతి నగ్నిసం - స్కార మీడేర్చి
రమ్మన్న నట్లనే - రామాజ్ఞ వాలి
తమ్ముఁడా యస్ననం - దలములో నునిచి
సాగింప రత్నభూ - షణ కాంచనములు
నాగవల్లీదళాం - తరముల నునిచి
ముందఱను వసంత - ములుగాఁగ జల్లి
సందడిగా బంధు - జాలంబు గొలువ
తారాది రమణులు - తనయుఁడుఁ దాను
చేరిక నిరుఁగడ - జేరి శోకమునఁ
జితి సమీపమునకుఁ - జేరి యచ్చోట
శతమఖతనయు భూ - స్థలిని డించుటయుఁ
నన తొడపై వాలి - తలయుంచి తార
కనుఁగొలుకుల నుబ్బ - కన్నీరురాల
శోకింపఁ జెంతల - సుదతులూరార్చి
యాకలభాషిణి - ననలకుఁ దివియఁ

నంగద సుగ్రీవు - లావాలిఁ గాష్ఠ
నంగతుఁ జేసి సం - స్కారంబుఁ జేసి
తిల తర్పణములిచ్చి - తీర్చి కర్మములు
జలములఁ గ్రుంకి ల - క్ష్మణసహితముగ
శ్రీరాము చెంతకుఁ - జేరిన వారి
నారాఘవుఁడు చూచి - యాత్మలోఁ గలఁగి
కరుణారసంబుతోఁ - గన్నీరు నించి
తరణిజముఖుల నం - దఱ నాదరించి
యుపలాప మొనర్చు - చున్న నచ్చటికిఁ
గపివీరులెల్ల మూఁ - కలు గూడి వచ్చి
యినకుమారునిఁ జేర - నెల్ల దేవతలు
వనజసంభవుచుట్టు - వసియించు నట్టు
లందఱు రాముని - కంజలిఁ జేసి
నందిత భక్తితోఁ - నలువంకఁ గొలువ
నాసమయంబున - ననిమేషశైల
భాసురగాత్రంబు - భానుసంకాశ
వదనంబు నుత్తాల - వాలంబుఁ గలుగు
సదయాత్ముఁడైన యం - జనకుమారకుఁడు
కరములు మొగిచి రా - ఘవకులోత్తముని
చరణపద్మములకు - సంప్రీతిఁ బలికె.

—: ఆంజనేయుఁడు శ్రీరామునిఁ గిష్కింధకురమ్మని ప్రార్థించుట :—

" ఈసూర్యసుతుఁడు లో - కేశ్వర ! మీకు
దాసుఁడై తండ్రి తా - తల తరంబునకుఁ

గలిగిన కిష్కింధఁ - గ్రమ్మర నేలి
చెలులఁ జుట్టముల ర - క్షింపఁ జాల్పడియె
వేడుక మీరలు - విచ్చేసి పురముఁ
జూడఁగావలయును - సుగ్రీవుఁ బట్టి
పట్టంబు గట్టి చే - పట్టి మీరనుచు
చెట్టుగా నతనిఁ జూ - చిన వారికెల్ల
సంతోషముగ మాకుఁ - జాలగౌరవము
సంతరించిన పూన్కి - సఫలంబు మీకు
నాకుఁ దోఁచినది వి - న్నపము చేసితిని
మీకెట్లు సరిపోయె - మీరది చేసి
రక్షింపుఁడన నకా - రణ దీనలోక
రక్షకుండగు రఘు - రాముఁ డిట్లనియె.
" వాయుతనూజ ! నీ - వచనముల్ మాకుఁ
జేయుట మిగుల వి - శేషమౌ నైనఁ
దప్పనేరము మేము - తండ్రికట్టడగు
నెప్పుడు పదునాలు - గేండ్లు కానలనుఁ
జరియించువారమై - శపథంబు చేసి
పురములకెట్లు రాఁ - బోలు ? నట్లగుట
మాకు రారాదు మా - మాఱుగా నీవు
చేకొని రాజ్యాభి - షిక్తునిఁ జేసి
భానుజుఁ గట్టుము - పట్టంబు నాదు
పూనిక చెల్లింపు - బొమ్మని" పలికి
శ్రీరామవిభుఁడు సు - గ్రీవునిఁ జూచి
కారుణ్య మిగురొత్త - గా నిట్టులనియె.

—॰ శ్రీరాముఁడందుల కియ్యకొనకుండుట – సుగ్రీవ
పట్టాభిషేకమున కనుజ్ఞయిచ్చుట :—

" ఈ యంగదుఁడు చాల – హితుఁడైనవాఁడు
మీయన్నకొడుకు న – మ్మినవాఁడు నిన్ను
పాలించి యువరాజ – పట్టంబు గట్టి
యేలింపు మతనిచే – నెల్లరాజ్యంబు
శ్రావణప్రథమవా – సర మిది గాన
రావణు మీఁది కా – ర్యము సేయరాదు
కలఁగక యీవాన – కాలంబు నాల్గు
నెలలు నీపురములో – నిశ్చింతముగను
నూరక సుఖమున – నుండుము నీవు
మారాడ వలదది – మాల్యవంతమున
నీలక్ష్మణుఁడు నేను – నీ బిలాంతమున
కాలూఁది దినములు – గడపుచుండెదము
కడివోని వికసిత – కమలముల్ గలుగు
కడపటి నెలఁ గార్తి – కమునందు నీవు
వెదకింపు వానర – వీరులచేత
వదలక మన సీత – వసియించు చోటు
పొమ్మని పలుకన – ప్పుడు పైఁడికట్ల
కొమ్మనుఁ బవడపు – గోళ్లుదంతములు
పలకకాపనలచేఁ – బసిఁడి మెఱుంగు
ములుకుల బలుచీర్ణ – ముల హారువైన
రథగజసుభట తు – రంగ మావళులు
పృథుతరలతికలు – బిసరుహాంబులును
మదవతీకాముక – మహనీయమదన

కదనసానావిధ - కరణవైఖరులు
ముత్తేల కుచ్చును - ముదురబల్కెంపు
కత్తెరలును బూర్త - కాళి మెత్తలును
బురుసామొఖుఁగు షికిల్ - పూవు దస్తులును
పరపైన కుంకుమ - పరవు కురంగి
బటువులు తాపితాఁ - బన్నాగమెచ్చు
దిటమైన యపరంజి - దిండును కెంపు
బోడిగ కోలు - పుత్తడి యునుసు
జోడును గలిగి రా - జులకెందు లేని
పల్లకిఁ గడు జోక - పఱచి తారుండు
బొల్లు మోములు గల్గు - బోయీలతోడ
తెచ్చిన రాముని - దెసఁ జూడనతఁడు
నిచ్చె ననుజ్ఞ యం - దెక్కి పొమ్మనుచు.
ఆపల్లకీ మీఁద - నర్కనందనుఁడు
చూపట్టెఁ దపన తే - జోరాశి యగుచు
భేరీమృదంగాది - బిరుదవాద్యములు
భోరుకలంగ నా - ప్తులు చేరి కొలువ
నావెన్క నంగదుఁ - డందలం బెక్కి
తావాలిహితులు చెం - తలఁ గొల్చి రాఁగ
చెంగట దిడ్డు పై - చిన పల్లకీల
సంగడిఁ దారాది - సతులఁ దోకొనుచు
వానరసైన్య రా - వము నింగి ముట్టఁ

—. సుగ్రీవుని పట్టాభిషేక మహోత్సవము :—

దానొక్క శుభముహూ - ర్తమునఁ గిష్కింధఁ

చేరి వేడుకఁ బ్రవే - శించె, నారతులు
నారు లెత్తఁగ వాలి - నగరిలోపలికి
నటులఁ బ్రవేశించి - యాలివేణి రుమను
గుటిలకుంతలఁ జూచి - గూర్మినటింప
నాసతి వచ్చి గా - ఢాలింగనంబుఁ
జేసి కన్నీటితోఁ - జింతిల్లుచుండ
నూరార్చి వెలువడి - హజారుసావిడికిఁ
జేరిన బాంధవ - శ్రేణి మంత్రులను
నవరత్నసింహాస - నంబున నుంచి
గవరనకాంచన - కలశకోటులను
ద్రిభువనాఖలనదీ - తీర్థముల్ దెచ్చి
నభిషేకమొనరించి - యంబుజాతములు
హేమాక్షతంబులు - నేకాతపత్ర
చామరయుగళముల్ - శాతఖడ్గంబు
పచ్చిబెబ్బులితోలు - పడుచుల జంట
దచ్చియు నిలువుట - ద్దమ్ములు పంది
వాఱు లుద్దములు న - వ్యప్రసూనములు
గౌరవస్త్రంబులు - గంధాక్షతములు
పాలు తేనియ నేయి - ఫలవిశేషములు
పాలు గల్గిన చెట్ల - పల్లవంబులును
గోవజవ్వాది కుం - కుమము కస్తూరి
కావలసిన రత్న - కనకాంబరములు
సకలౌషధులును లా - జలు దెచ్చియిచ్చి
యకలంక హోమశాం - త్యాదులుఁ జేసి
ధారుణీసురలెల్లఁ - దనియ వారలకు

భూరిపదార్థముల్ - భూరిగానొసఁగి
బలియులు జాంబవ - త్పవనజ కుముద
నలనీల శరభమైం - దద్వివిదాది
వానరోత్తము లష్ట - వసువులు మఘవుఁ
బూని స్వర్గమునని - ల్పు విధంబుఁ దోఁప
రాజుగా వానర - రాజధానికిని
రాజీవహిత కుమా - రకుఁ గర్తఁజేసి
యానందముల నొందు - నప్పుడుప్పొంగి
భానుసూనుఁడు - వాలిపట్టిఁ జేపట్టి
పట్టాభిషేక మై - భవమాచరించి
పట్టైన యువరాజ - పట్టంబుఁగట్టి
యా మహోత్సవము స - మస్తలోకులకు
నామోదకరమైన - యప్పుడావార్త
పవమానతనయునిఁ - బనుప రామునకు
నవిరళప్రీతిగా - నటువిన్నవించి
నుతశౌర్యులగు ప్రధా - నులు నీతి చేత
క్షితి యెల్ల బాలింపఁ - గిష్కింధలోనఁ
దాను రుమాసహి - తముగ సుగ్రీవుఁ
డానందకలితాంత - రంగుఁడై యుండె.

—: రామలక్ష్మణులు గుహాయందు నివాసము చేయుట :—

ఆవేళ రఘువీరుఁ - డనుజుఁడు దాను
నావరుషఋతుస - మాగంబునను
వివిధమృగంబుల - వింతపక్షులను
నవనిజముల నంద - మైన ప్రస్రవణ

శైలబిలంబు ల - క్ష్మణునకుఁ జూపి
వాలివిరోధిభా - వమెలర్పఁ బలికె.

—: గుహావర్ణనము - రాముఁడు సీతకై విరహమునొందుట :—

"లక్ష్మణ! వానకా - లమునకు నెంత
లక్ష్మీకరంబీ బి - లంబుఁ జూచితివె?
వలసిన మాత్రంబె - వాయువు లిచటఁ
బొలయు చున్నవి చలి - పుట్టదిచ్చోట
ఈకొండ తెల్లనై - యెఱ్ఱనై నల్ల
నై కనుపట్టె మ - హా శిఖరములు
మూఁడు మూర్తులకును - మొదలింటి మూర్తి
జాడగా నున్నదీ - శైలరాజంబు!
ఇందులోఁ గల తోఁపు - లీసరోవరము
లెందు జూచినవి గా - వీ వసుంధరను.
ఈపడమటఁ జూడు - మిదియొక్క బిలము
చూపట్టె పడమటి - చోటున్నతముగ
నీయుత్తరపు దిశ - నీశాన్యమైన
చాయ పల్లమున వి - శాలమై నీల
నీలమై మణిదీప - నిచయమై నిబిడ
సాలమై మించె న - చ్చటి కందరంబు
అల్లదె నైఋతి - యగు దిక్కునందు
తెల్లని మగఱాల - దిగదిగ వెలుఁగు
గనుల చెంగట నొక్క - కందరాంతరము
కనకమయం బౌచు - కనుపట్టె గనుము

తెలుపును నలుపునై - తిన్నగాఁ బెరిగి
కలసిన రెండు శృం - గములొప్పుఁ జూడు
హరిహరమూర్తియో - యన నెల్లవారి
వెలిఁగించు నర్ధనా - రీశ్వరుఁడనఁగ
నల త్రికూటంబుపై - నమరుజాహ్నవినిఁ
దలపించు నీకొండ - దక్షిణ దిశను
ఉల్లోల జలశీక - రోర్ములఁబొలు
తెల్లని యీయేరు - తేరికఁ గనుము
అయ్యేరు వికచప - ద్మాళిఁ గైసేయు
తొయ్యలిగతి నింపుఁ -దులకించ నెదుర
దవ్వుల మృదుసైక - తముల నీయేరు
నవ్విన రీతిను - న్నవి యంచలిచట
ఇచ్చట మనమున్న - నెప్పుడు వినఁగ
వచ్చుఁ గిష్కింధలో - వాద్యఘోషములు
చెవిసోఁకె వినవన్న ! - సింహనాదములు
రవళి వానరులచే - రవిజు మేలునకు
నెంత వేడుకనుండు - నిపుడు సుగ్రీవుఁ
డంతిపురంబులో - నతివలఁ గూడి !
అతనికి నాకును - నన్యోన్య మతుల
వెతలొక్క చందమై - వేగుచుండంగ
నందులో నొకరికి - నైన దైవంబు
నందిచ్చె దరిఁజేర్చి - సతితోడఁగూర్చి !"
అనుచు లక్ష్మణుఁ గూడి - యాశైల నికట
వనభూములను రఘు - వరుఁడు గ్రుమ్మరుచు
పాదపుగుబ్బలి మీఁదఁ - బొడము చందురుని

పాడవుఁగన్గొని "విరిఁ - బోడి మాసీత
కుంకుమ నలుగిడు - కొనువేళ మిగుల
పొంకమౌ నగుమొగం - బును బోలె" ననుచుఁ
దలఁచి యంతన పరి - తాపంబు నొంది
కలఁగుచు భ్రమసి - కాఁ - క వహించి మిగుల
పండువెన్నెలఁ జిక్కి - "బలువిడిఁ గాదె
నెండలు సౌమిత్రి! - యెటకుఁ బోవుదము?
తపియింపఁ జేసి మా - ర్తాండ మండలము
చపలాక్షి యెటువోను - జానకి యిపుడు"
అనుచు గూర్చుండి - యాయనుజు నూరువులఁ
దనమేను జేర్చి "సీ - తా!" యంచుఁబలికె
కన్నులు మొగిచినఁ - గాంచి సౌమిత్రి
యన్నతో భయవిన - యములనిట్లనియె

—. లక్ష్మణుఁడు శ్రీరామునికిఁ గర్తవ్యముఁ దెలుపుట. —

"దేవ! ధార్మికుఁడ వా - స్తికుఁడవు ధైర్య
భావనుఁడవు కార్య - పరుఁడవా మీఁద
నీమేరఁ జింతింతు - రే? దీనులైన
పామరులకు జయ - ప్రతిభలు గలవె!
మానసోత్సాహంబు - మానకనైరి
దానవహరణ య - త్నము సేయు మీవు
నీవు గావలె నన్న - నిమిషమాత్రమున
నీవసుమతితోడ - నెల్ల లోకములు
శరము సంధించి భ - స్మము సేయఁ గలవు!
పరశౌర్యకేళి రా - వణుఁ ద్రుంచుటెంత!

ఎపుడు శరత్కాల - మేతెంచె నపుడె
నిపుణత బూది నిం - డిన ధనంజయుని
యాజికవర్యుఁడా - జ్యాహుతిచేతఁ
దేజంబు నొందించు - తెఱఁగుగా నిన్ను
నచ్చెరించెద నేల - యీలోన కలఁగి
యిచ్చలోఁ దాల్మివ - హింప వేరెయన
నామాట విని సుమి - త్రాత్మజుఁ జూచి
రాముఁడు సుగుణాభి - రాముఁడిట్లనియె
"హితము పల్కితివి మే - లీవానకాల
మతికరించి శరత్స - మారంభమైన
యప్పుడె తగినట్టి - యత్నంబుఁ జేసి
చొప్పరులగు కపి - శూరులచేత
జానకియున్నట్టి - చందంబుఁ దెలిసి
దానవాన్వయమెల్లఁ - దరిగి వేయుదము
మనకార్యభారంబు - మఱవక పూని
తనకార్యముగ నెంచుఁ - దపనందనుఁడు
భక్తితో నొక రును - పఁగ మనువాఁడు
శక్తికొద్దిని సహా - చరుఁడవుఁ గాక
యేల కృతఘ్నుఁడౌ - నింగితజ్ఞుండు?
మేలెఱింగినవాఁడు - మిహిరాత్మజుండు
అతఁడుండ మనకసా - ధ్యములేల కలుగు
హితము జేసినవారి - నెఱుఁగఁడేవాఁడు?
గడుపుద మీవాన - కాలంబుఁ గలఁక
లుడివోయి సుగ్రీవు - నుల్లంబురీతి
నదులన్నియును బ్రస - న్నతలొందు నొక్కొ!

కదియునొకో శర - త్కాల వాసరము ?
అనవిని సౌమిత్రి - యంజలిఁ జేసి
యనఘాత్మ ! సుగ్రీవుఁ - డటువంటివాఁడు
చాల కృతజ్ఞుఁడు - జానకి వెదకఁ
జాలు నీ కార్యంబు - సమకూర్ప నేర్చు
మనము చెప్పినయట్టి - మాటలో నడచి
మన నేర్చు కడుబుద్ధి - మంతుఁ డుత్తముఁడు
ఈ మాల్యవద్గిరి - నీ మూఁడు నెలలు
రామ ! సోఁకోర్చి యూ - రట నొందు ” మనిన
తమ్ముని మాట హి - తమ్ముగా నెంచి
సమ్మతినని యోఁ గా - సల్యాసుతుండు

— వర్షఋతు వర్ణనము —

“ సౌమిత్రి ! యిపుడు వ - ర్షాకాలమగుట
నీమేర మిన్నెల్ల - నెడమీఁక నిండి
భానుని కిరణముల్ - బలసి వారాసి
నీనవమాసంబు - లేఁకట దీఱ
జలదంబులై షడ్ర - సములకు తామె
నెలవైన యుదకముల్ - నిండారఁ గ్రోలి
ధారుణిపై వర్ష - ధార లేమేర
ఘోరనఁ గురియు న - ద్భుత కరంబులుగ
మేఘ మాలికలను - మెట్టులవెంట
నాఘర్మకరుఁడు దా - నాకాశమంది
యర్జున కుటజ ల - తాంతముల్ చూపి
నిర్జించె నాచిత్త - నీరజమిపుడు

పొలయు నూర్పులుగ న - భోమారుతములు
మలయ సంధ్యామేఘ - మాలికారక్త
వసనుఁడై విటునికై - వడి నాకసంబు
లసమానగతి నొప్పె - లక్ష్మణ ! కనుము.
గ్రీష్మాతపములఁ గ్రాఁ - గినయట్టి వసుధ
యూష్మంబె గావిరు - లుప్పతిల్లంగ
ననుబాసియున్న జా - నకిఁ బోలి తాప
మున నున్న చంద మి - ప్పుడు విలోకింపు
కేతకీ కైరవ - క్రీడాసమీర
పోతముల్ సీతమై - పొలపంబుఁ దెలిపె
ఈయేరుమద్ది కం - టీగిరి మీఁదఁ
బాయక నవసుమ - ప్రచుర సంపదలు
యేవిచారము లేసి - యీరవిసుతుని
కైవడి దృష్టి మం - గళకరంబయ్యె
అలఘు మేఘములు కృ - ష్ణాజినంబులుగ
జలధార లురముల - జన్నిదంబులుగ
యీనగంబులు చూచి - తే తమ మీఁది
మానులు వేషముల్ - మార్పుడఁ దాల్చె
మెఱువు గుంపుల చిరి - మిణే తరుటులను
హారిహాయుఁడను సాది - యదలించివేయ
సకిలించు నుత్తమా - శ్వమురీతి జలద
మకలంక గర్జల - నదె వచ్చెఁ గనుము
నీలమేఘంబులో - నెఱిమించునట్టి
వాలిక మెఱపు రా - వణుని యూరువుల

వసియించు మనసీత - వలె వడంకుచును
దెసలకు వన్నియఁ - దెచ్చెఁ జూచితివె!
పర్జన్యుఁడను నొగ - పరి మావటీఁడు
గర్జితంబనెడి ఘీం - కరణంబు సలుప
మెఱుపు టంకుశముచే - మీఱి కాల్మ్రొటి
పఱువసీక యడంచి - పట్టిన నిలచు
మదసింధురరీతి - మబ్బుసంజోకఁ
జదలు గన్పట్టెల - క్ష్మణ! విలోకింపు
మేదిక్కు చూచిన - నిలయెల్ల నిండి
యీదిక్కనెడిమాట - యేర్పడనీక
యిరులు గొల్పుచునున్న - యీప్రావృషేణ్య
శరదంబు లింతుల - సందిళ్లలోన
పొదువుక సుఖయించు - పుణ్యులకెల్ల
మదికి నానంద మి - న్మడి సేయకున్నె,
నను వంటి పాపాత్ము - నకు దుర్దినంబు
లనిపించు యహితంబు - లైన నోఁగాక
ఈకొండ మల్లియ - లెల్లెడఁ బూచి
నాకు వేదన నెమ్మ - నంబులోఁ జేసె
విడవని వేసవి - వేఁడిమితోడ
నడఁగె మహీరజం - బవని సంతతను
రాజులు దండయా - త్రలు మానిరిపుడు
భూజనుల్ నిజపురం - బులకు నేఁగుదురు
నానానదముల నుం - డక మరాళములు
మానససరము దీ - మముగానఁ జేరె
చక్రవాకద్వంద్వ - సమితిరఘురాంబు

వక్రత లెంచక - వసియించెఁ గనుము
అడుసు ద్రోవలుగాన - నవనిపైఁగానఁ
బడదెందుఁ జతురంగ - బలసమూహంబు
కరుడులు లేనట్టి - కడలియుఁ బోలి
శరదముల్ గప్పిన - చదలు చూచితివె!

ఒకచాయఁ దోఁచక - యొకచాయఁదోఁచి
ప్రకటిత లీల నం - బరభాగ మిపుడు
నమరె వాణియుఁ బోలి - యవనికలోన
నమరు, పాత్రము బోల్ప - నలఘుపాత్రముగ
కడిమి పువ్వులతావిఁ - గమిచి జేగురులు
గడుగుచుఁ బఱచె నే - కడ నిర్ఝరములు
కేళీనటత్కేకి - కేకారవంబు
లాలింపు లక్ష్మణ!! - యా కోనలోన!
గండు తుమ్మెదల పాం - కమున నేరేడు
పండులు చూడు మ - పార మీవేళ.

ఈరసాల ఫలంబు - లిల మోవనీక
ధారగా మధురస - ధారలు చిలుక
ముక్కుగంటులను గ్ర - మ్మకవచ్చు తరుల
పెక్కువ యెంత యొ - ప్పిదమయ్యె నిచట!
మెఱుపు దంతములతో - మెఱయు నీమొగులు
తెర లేనుఁగల బారు - తీరున మించె!
పచ్చని పచ్చిక - పట్టుల లేళ్ళు
రచ్చలై వర్షధా - రలు మీఁదఁ గురియ
నిట్టి సంధ్యావేళ - నీక్షించు పాంథు
లెట్టుగా వేగింతు - రెటుదెల్లవాఱు!

ఓయి సౌమిత్రి! మే - ఘోదయ వేళ
నేయెడ జూచిన - నీనభోవీథిఁ
గదలెడు పుండరీ - క సరంబుఁబోలి
కదలిపోవు బలాకి - కాశ్రేణిఁ గనుము.
ఈనేలఁ బచ్చిక - నెనసి మహీజ
సూనములే రాలియె - చ్చో నింద్రగోప
భాసురంబయి పట్టు - పైని పుష్పాళ్లు
రాసిగా రాలిన - రత్నకంబళ్లు
పఱచినగతి చిత్ర - పట్టాంబరములు
నెఱపినకై వడి - నెయ్యంబు వెనిచె!
నిదురింప తరియయ్యె - నీరజాక్షునకు
నదులకుఁ జెయిచాఁచి - నచ్చి వారాసి
సతులు మానధనంబు - సడలించి తారె
పతులఁ బైకొనునట్టి - పాళంబువచ్చె
నావులఁ గదిసె మ - హావృషభములు,
కావరించెను గీట - కాసరశ్రేణిఁ
బోలిమేర వనగజం - బులు చెలరేఁగె,
కోలగట్టుకొనె వియో - గులనేఁచి మరుఁడు
వానరభల్లుకా - వళి చెలరేఁగె,
నేనుఁగులు నెమళ్లు - నెసకంబు లెనఁగె,
కైతక గంధమా - ఘ్రాణముల్ చేసి
గీతముల్ బాడె భృం - గీనిచయంబు
వానచేఁ బ్రాణంబు - వచ్చిన బొగ్గు
లానుక యున్నవో - యలరు దావులకు,
వ్రాలిన తేఁటులో - వాటియుగ్రముల

వ్రేలు బండ్లోయన - వెలసె జంబువులు
వనభూము లవికల - స్వన ఖగవ్రాత
మునకెల్ల పానభూ - ములరీతిఁ దోఁచె,
పులుగులు తరుపర్ణ - పుటములయందుఁ
దొలఁకని వారి బిం - దువులు గ్రోలెడును
తేఁటుల మ్రోఁత తం - త్రీస్వనంబులుగ
పాటలు కోకిలా - పారనాదముగ
దారుణ గర్జ మ - ర్దళనినాదముగ
తారుచు నాడు పా - త్రలు మెఱుఁగులుగ
భూనభోంతరరంగ - మున దంపతులకు
మానసంబులను బ్రే - మము నించెనిపుడు.
ఒక్కట నదులు న - వోఢలో యనఁగ
జక్కవగుబ్బలు - జతఁగూడి నిక్క
తటనాగవల్లికా - దళములు తరులఁ
జిటులు పోకలు సూన - సీర్యత్పరాగ
పూరంబులను గంధ - వోదులు లతాంత
వారంబు కదళికా - వనదళగళిత
కర్పూర ఫలకముల్ - గైకొని చెలుల
నేర్పున జలపతి - నికరంబు రాఁగఁ
గనుఁగొంటివే వార్ధి - గదియంగఁ జేరె
పెనిమిటులెంతటి - ప్రియులు కాంతలకు
కారుచిచ్చులను ద - గ్ధములైన గిరులఁ
జేరినగతి నీల - జీమూతములను
నల్లనిమబ్బుల - నలుగడఁ గూడి
యల్లుకొన్న తెఱంగు - లందమై మించె.

వానకాలమ్మున జెలు - వము హెచ్చ విరియఁ
బూనియున్న కదంబ - పుష్పగుచ్ఛముల
తమ్ములపై నాడు - తమిమాని కొదమ
తుమ్మెదల్ విపినవీ - థుల వచ్చెవ్రాలె.
రాజులకెల్ల నూ - రటలు గల్పించి
తేజోభివృద్ధి దం - తిశ్రేణి కొసఁగి
సింగంబులను దరి - సీమలనుంచి
పొంగి యాడెడు కలా - పులఁ బ్రోదిచేసి
వనములకెల్ల జీ - వనము గల్పించి
వనజాతములకుఁ జె - ల్వము గలిగించి
యిలకెల్ల నానంద - మిచ్చెనౌరౌర!
జలదాగమము ఋతు - స్వామి గావలయు!
వాహినీతతి పతి - వ్రతలు దారగుట
యూహించి ఘోషించె - నుదధియుఁ బోలి
తెరువరుల్ ప్రాణభీ - తిచెఁ బోవరాక
తెరువులు వెదక న - దీకూలములను
పట్టముల్ గట్టు భూ - పతులకుఁ బోలి
దట్టంబులగు జల - ధర కలశముల
నగములనెల్ల ను - న్నతిఁ దీర్థమార్చె
నగవైరి యనఁగ వా - నలు విలోకింపు!
చెలువేది? దిక్కులు - చీకటుల్ గ్రమ్మ
తలచూపకున్నాఁడు - తపనుఁడు నేఁడు!
రాజులు తమపేరు - రమ్ముల మీఁద
రాజిల్లు ముక్తాగ - రములుంచి నట్లు
సెలయేరు మొత్తముల్ - శిఖరభాగముల

వెలువడి తెల్లనై - విలసిల్లెఁ గనుము!
ఝురములు తటగండ - శైలభాగములఁ
బొరలి యాక్రిందఁ జ - ప్పుడుగాఁగ దుమికి
తరులందుఁ జెదరి ము - త్యపు వసంతములు
మెఱయించు బాగు సౌ - మిత్రి! వీక్షింపు.
వరవిమానములపై - వచ్చునచ్చరుల
సురతావసరముల - సురవిటశ్రేణి
గేలిసేఁతలఁ బెరి - గిన తారహార
మాలికల్ వచ్చు క్ర - మంబు చూపట్టె
తెమలు మేఘముల ను - దీర్ణమై వచ్చె
రమణీయవారి ధా - రా ప్రపంచంబు!
కుటములఁ బక్షులు - గూండ్లు వీడుచును
పటుకలారావమం - బరము నిండింపఁ
జల్లగా వికసించు - సన్నజాజులను
వెల్లుబ్బ వాసనల్ - పృథివినిండింప
నినుఁడ స్తమించుట - యెల్లవారలకుఁ
గనుపించె నిపుడు ల - క్ష్మణ! ప్రొద్దుగుంకె.
ఆమిక నిగమాధ్య - యనపరాయణులు
సామగానముసేయు - సమయంబువచ్చె
గృహమేధులగువారు - గృహపదార్థములు
గ్రహియించి మఱలి ర - గారంబులకును
బలశాలి కోసల - పతి భరతుండు
సొలవక యాషాఢ - శుద్ధపౌర్ణమిని
యుపవాస నియమ వ్ర - తోచితక్రియల
నిపుడుండు మనరాక - కెదుఱులు చూచి

మనలఁజూచి యయోధ్య - మనుజులందఱును
వినతులు సేయఁ బ - ర్వినప్రమోఁత యనఁగ
సలిలవేగంబుచే - సరయూప్రవాహ
ఘుళఘుళధ్వానమా - కర్ణింప దిగియె.
పగదీరి తనరాజ్య - పదవులు జేరి
మగువలఁగూడి నె - మ్మది నున్నవాఁడు
రాజీవహితకుమా - రకుఁడు జేసినవె
పూజలు! వాఁడెంత - పుణ్యమానసుఁడు?
ఇలనొడ్ల పాల్చేసి - యిల్లాలిఁ బాసి
యులమటలను బడి - యధముని రీతి
నిట్టుగా నొచ్చితి - నెంత పాపంపు
పుట్టువుఁ బుట్టితిఁ - బుణ్యహీనతను!
బలవంతమైనట్టి - పగయును నింత
యలజడిగావించు - నలజడివాన
తనమదిలోని ఖే - దము నింక నెట్టి
యనువునఁ దీఱునే - మనువాఁడ నింక?
"కపివీర! కిష్కింధఁ - గదలకయుండు
మిపుడని" యవకాశ - మిచ్చితిఁగాని
"యీవేళఁ బోవుద - మెచ్చటనున్న
రావణాసురునిపై - రమ్ము"న నైతి!
అవదుల నొందినాఁ - డనియు నీవేళ
నవని దండెత్తరా - దనియు నేఁజేయఁ
దలఁచితానిట్టి య - త్నము సమకూర్ప
బలవంతమున గాని - పాటిల్లదనియు
నెంచి "మీనగరిలో - నీవుండు"మనుచు

నుంచితి నదియుఁగా - లోచితంబగుట
నేఁ జేయు నుపకార - మెంచి భానుజుఁడు
కాఁజేయకున్న నా - కామితార్థంబు ?
తలఁతునే ' సుగ్రీవ - తటినీ ప్రసన్న
తలు' మది ధరణిసు - తాప్రాప్తి కొఱకు ?"
అని ఖిన్నుఁడై యున్న - యన్నచందంబుఁ
గనుఁగొని మరల ల - క్ష్మణుఁ డిట్టులనియె.
" అయ్య ! యెప్పుడు శర - దాగమంబయ్యె
నయ్యెడఁ దావచ్చు - నర్కనందనుఁడు
తాలిమిఁగైకొని - తాళుమీ వాన
కాలంబు సత్యసం - కల్పుఁడ వీవు,
యెల్లకార్యంబులు - నీడేరు''ననుచు
చల్లని మాటలు - సంప్రీతిఁజేసి
కొన్నాళ్ళు వసియింపఁ - గువలయశ్రేణి

— రామకార్యము చేయఁదగునని హనుమంతుఁడు సుగ్రీవునితోఁ జెప్పుట .—

చెన్నులుమీఱె ప - చ్చికలింపుదీఱె
మబ్బువెల్వలఁ బాఱె - మంచుదైవాఱె
నబ్బురంబుగ మాఱుఁ - డమ్ములు నూఱె
నావేళ హనుమం- - తుఁ డలఘుధీమంతుఁ
డావానరాధిపు - నల్లనఁ జేరి
కృతమాత్మఁ దలఁచి తా - నింగితం బెఱిఁగి
హితము విచారించి - యిది ధర్మమనుచు
మది నెంచి సమయశ - ర్మము నిశ్చయించి
కదిసి యేమియు నెఱుం - గక మత్తుఁడగుచు

కేవగల్ తారాప - రీరంభ సుఖ స
మావహారాగర - సానందుఁడగుచు
నున్న యేలిక బుద్ధి - యును వివేకంబు
కన్నుఁగానమియును - గాంచి యిట్లనియె.
"నీతియు రాజ్యంబు - నీ సంప్రదాయ
భూతియు ఖ్యాతియుఁ - బొందితి వీవు
చెలిమి యేమరి యుండఁ - జెల్లదు తగిన
చెలికాని నెఱుఁగక - చే వదలుదురె?
చుట్టరికము జేసి - సోఁకోర్చి వారి
పట్టున వలసిన - పనులఁ జేకూడి
యక్కరల్ దీర్ప నీ - యధములకేల
దక్కును? చిరకీర్తి - ధర్మసౌఖ్యములు
హితుని కార్యంబు నీ - వెన్నక కామ
రతుఁడవై యునికి మ - ర్యాదగాదిపుడు
వారలీపని సేయ - వలయు మాకనుచుఁ
బేరు కోనట మున్న - పిలిచి వానరుల
సీతను వెదకింపఁ - జేసిన ప్రతిన
సీతాప్రియుని మాడ్కి - చెల్లించుటొప్పు
రాముఁడు మిక్కిలి - ప్రాజ్ఞుండు శౌర్య
ధాముఁ డాయనమాటఁ - దలఁపకుండుదురె?
ఆయన కరుణచే - నాపదల్ దీరి
శ్రేయోభివృద్ధులు - చేకొన్న నీవు
అతని సీతను గూర్చు - నందాక మదిని
వెతమాలి యునికి వి - వేకంబు గాదు
కర్తవు మాకెల్లఁ - గావున నీకు

కర్తవ్యమైన మా - ర్గముఁ దెల్పవలసె
దేవగంధర్వదై - తేయాది సకల
జీవకోటులతోడ - సృష్టియంతయును
నొక్కతూపునఁ ద్రుంప - నోపు రామునకు
రక్కసు లెదురు వా - రా సంగరమున ?
రావణుఁడన నెంత ? - రఘువీరుఁడెంత !
కావలసిన జేయఁ - గావలెనన్న.
అతని కార్యమునకు - నరమరలేక
హితము సేయుట నీకు - హితమైనతెఱఁగు.
ఇహపరంబుల యతఁ - డీకాక నిన్ను
వహియించుకొని ప్రోచు - వారలుం గలరె ?
కావలెనని నీవు - కట్టడసేయ
లేవుగా కెందఱు - లేరు సాధకులు ?
సీతను దివియందు - క్షితిమీఁద జలధిఁ
బాతాళమున డాఁచి - పదిలంబు జేసి
యుంచిన వెదకి తే - నోపుదు మేము
మించనాడుటగాదు - మీచిత్తమెఱుఁగఁ
బిలిపించి పనుపుము - పృథివిపై వెదకఁ
గలవారి జవశక్తిఁ - గలవారి నెనరు
గలవారి నమ్మిక - గలవారి నేర్పు
గలవారిఁ గీశపుం - గవుల నేర్పఱచి."
అనిన పావని పావ - నాలాపములకు
మనసులో నలరి స - మ్మతమంది మెచ్చ

— సుగ్రీవుఁడు హనుమంతుఁడు చెప్పిన ప్రకారము సీతను వెదకుటకు నీలున కాజ్ఞాపించుట —

నీలునిఁ బిలిపించి - "నీవీక్షణంబ
భూలోకమునఁ గల్గు - భూరిసాహసుల
కపులను దగిన లే - ఖలు వ్రాసి కార్య
నిపుణులౌ వేగు మా - నిసి ముఖంబులను
దమదమ మూఁకలఁ - దమసాధనములఁ
దమచుట్టములతోడఁ - దవిలి రమ్మనుచుఁ
బనిచి దప్పింపుము - పడవాళ్ల విలువ
పనిపూని యిచటికిఁ - బదియేనునాళ్ళ
వచ్చినవారెల్ల - వచ్చిరి రాక
యెచ్చోట నాయాజ్ఞ - యెఱుఁగనివారు
ఒకనాఁడు దప్పిన - నుసురు గాలముల
సకలవానరులు మె - చ్చఁగనైతు వాని
కొండలు వనముల - గొలిపించు కొనక
నిండు పంటలతోడ - నిలువఁ బూజ్యముగఁ
బుట్టాప్తి సంబళం - బుల కెచ్చుగాఁగ
కట్టడ చేసి మా - కార్యాంతరముల
రమ్మన్న వేళకు - రండన్ని నాళ్లు
నెమ్మది మీయిండ్ల - నెలఁతలఁగూడి
యురకపసా పడ - కుండడంచేను
గరిమతో బహుమాన - గతినడిపింప
నీకార్యమునకు రా - కెందుకు వారు
నాకు ? బొమ్మంగదా - నకు వినిపించి

యతని యొప్పవుకమ్మ - లన్నిదిక్కులకు
నతిశయంబుగఁ బంపు" - మని సెలవిచ్చి
యంతిపురంబున - కరిగిన నీలుఁ
డంతయుఁ దెలియుఁ దా - రాత్మజుతోడ
విన్నపం బొనరించి - వేగులవారి
నన్నిదిక్కులకుఁ బొం - డని పంపునంత

—: శరదృతు సమాగమము - రాముఁడు
సీతావియోగమునకై దుఃఖించుట :—

ఆవేళ రాఘవుం - డంబుదాగమము
తావల వంతలు - దరిచేర నిండి
శరదవసరమైన - చదలెల్ల మిగులఁ
బరిశుద్ధముగ మేఘ - పటలంబు విరియఁ
బిండి చల్లినయట్లు - పృథివి దట్టముగఁ
బండువెన్నెలలు ని - బ్బరముగాఁ గాయ
నెడవాయు జనకజ - నింటిలోఁ దనదు
పడఁతులతో నెడ - వాయక యున్న
భానుజుఁ దనవెంటఁ - బడిపోరుచున్న
సూనసాయకుఁ దలం - చుక యోర్వలేక
పరవశుఁడై చాల - భ్రమసి వివేక
పరుఁడయ్యు మదినిల్వఁ - బట్టఁగలేక
తులకించు హేమధా - తు విచిత్ర శిఖర
తలమున వసియించి - తమకంబు వెంచి
సారసపక్షి ఘో - షములఁ జెన్నొందు
శారదాకాశ మి - చ్చఁ గలంగఁజేయ

నాయంచ నడపుల - నవనిజఁ దలఁచి
"హా!" యని పలవించి - యరఁగన్ను మొగిచి
తెలివిడి నొంది " యే - తీరున సీత
మెలఁగునో తనుబాసి "? - మించు సంపెఁగల
కొమరు గాంచిన కొండ - గోఁగులఁ జూచి
"కమలాక్షి నెన్నడు - గందునో యేను ?"
జక్కవల్ రొదసేయు - జానకి వినినఁ
బొక్కవే చెవులు నా - పొంత లేకునికి ?
ఈ సానువులు గిరు - లీ కందరంబు
లీ సరోవరము లే - నే వేళఁ జూచి
యోర్తునే జానకి - యొద్ద లేకున్న !
నేర్తునే నామది - నిలుప ధైర్యంబు ?
మెత్తన జనకజ - మే నంతకన్న
మెత్తన మనసెట్లు - మీనాంకు చేతి
రాయిడి కోర్చునో - ప్రాణముల్ వట్టి ?
ఆ యింతితోడి వే - ప్రాణముల్ తనకు !"
అనుచుఁ జాతకము జ - లాపేక్షచేత
వనదంబుఁ దలఁచుక - వగచిన యట్ల
సీతఁ దలంచుచు - శ్రీరామవిభుఁడు
చేతోభవుని మాయ - చేఁ గట్టువడియె.

—: లక్ష్మణుఁడు శ్రీరామునోదార్చుటకు మాటలాడుట :—

అటమున్న సౌమిత్రి - యా నగోపాంత
విటపంబులను ఫల - వితతియుఁ గంద

మూలముల్ గొనుచు రా - మునుఁ దదుపాంత
శైలాగ్రమున నొంటి - జానకిఁ దలఁచి
కన్నీరు రాల్చుచోఁ - గని చేరఁబోయి
యన్నకు మ్రొక్కి తా - నంజలి చేసి
హితమును వినయంబు - నెఱుకయుఁ దోఁపఁ
జతురవాచా విశే - షమున నిట్లనియె.
" దేవ ! నీయంతటి - ధీరమానసుఁడు
లావున శౌర్యవి - లాసంబు మఱచి
చింతిల్ల నిందేమి - చేకూరె ? నేల
యింతటి యార్తి ? ని - న్నఱిఁగి వర్తిలుము
మది ప్రసన్నతయు నే - మఱక కార్యంబు
వదలకుండుటయు నే - వలన ధైర్యంబుఁ
దలఁచినపని సేయఁ - దగిన కాలంబు
బలములఁ జేకూర్చి - పగఱనోర్చుటయుఁ
దగునట్టియెడ దేవ - తాప్రార్థనములు
దగు గాక యిట్టిచోఁ - దగవౌనె వగవ ?
నిను వరించిన యువ - నిజ నొక్కఁడంటి
తొనియక తనమేని - తో నుండగలఁడె !
పావక జ్వాలిక - వట్టినకేలు
లావెల్లఁ బొలిసి కా - లక నిల్వఁగలదె ?
ధరఁబగ సాధించు - తరిగాని యిపుడు
తరిగాదు మనసు కొం - దలమందఁ జేయు !
ఆనతియగఁ దగు - నది పల్కుఁడనిన
జానకీవిభుఁడు ల - క్ష్మణున కిట్లనియె.

—: శ్రీరాముని ప్రత్యుత్తరము - శరదృతు వర్ణనము .—

"ఇల జీవకోటుల - నెల్లను దృప్తి
వెలయించి సుఖయించె - విబుధనాయకుఁడు
తనయందుఁ గల వారి - ధారలు గురిసి !
వనదముల్ చాలించి - వ్రాలె నూరటను
జలదభీకమయూర - ఘురసామజములు
సలలితారావ మె - చ్చట లేక యుడఁగె,
ధారాళవర్షాంబు - ధౌతంబులగుచు
గౌరగౌరములై న - గంబులు వొలిచె
యేడాకరంటుల - నెనసిన పొరల
గూడు కప్పురపు రే - కులనొకకొంత
కళుకుచుక్కలఁ గొంత - కలువలరాజు
కళలందు నొక కొంత - కమ్మని బొందు
మల్లెల నొకకొంత - మార్తాండు నందు
వెల్ల దమ్ములఁ గొంత - వితరణప్రౌఢిఁ
దనకల్మి పంచి యుం - దటియందు నుంచి
కనిపించుకొనె శర - త్కాలవాసరము !
శరదవసరమున - సారసశ్రేణి
విరిసె భానుని కరా - విర్భూతి వలన !
కపురంపునెత్తావి - కడలందు నుడిసి
రపముతో మకరంద - రసములు గ్రోలి
ఘుమ్మను తుమ్మెద - కొమ్మలచాలు
గమ్మన మొరయు మం - గళ గానములకు
వీనులు చొక్కఁగ - విని మేనులుబ్బ
దానధారలు సము - త్కటముగాఁ గురియఁ

బొలయుచుఁ గరులున్న - పొంకంబుఁ జూడు!
చలద్రులన మీఱె - శారదవేళఁ
దామరపుప్పొడిఁ - దడియు రెక్కలను
సాములు మట్టిని - చల్లు కొన్నట్లు
తనువులపై నంట - దరలహంసములు.
పెనఁగెడు జక్కవ - పిలుకలఁ నరిమి
తొలఁగని హంసికిఁ - దూఁడు లందించి
మెలఁగు చెల్వములెంత - మెచ్చొదవించె!
సెలయేటి కెలని ప - చ్చికల మచ్చికలఁ
దలఁకని యాలమం - దల విలోకింపు
మాకాశమున నిసు - మంతయు మబ్బు
లేకున్న నెడబాసి - లేమ నీవేళ
పురివిచ్చఁబోయినం - బురి విచ్చలేక
తొరగఁగన్నీరు మూ - తులు విరియించి
కుత్తుకల్ పల్లకీ - కొమ్మలఁ బోలి
యుత్తరి మువ్వంక - లై సాగిలంగఁ
గేకల రాక యీ - కేకులు వోవు
పోకలు చూడు మి - ప్పుడు వియోగముల!
కుచభారముల వ్రాలు - కొమ్మలు వోలి
యిచటి భూరుహముల - నెల్ల కొమ్మలును
పూవు గుత్తులభరం - బులనసియాడు
తీవెలు బెనఁగొన్న - తీరుచూచితివె!
కరిణిఁగొనక యల్ల - కరి సరోవరము
దరిఁజేరి సలిలంబుఁ - ద్రావంగ మఱచి
యూరట లేకయే - కున్న చందమున

నారటంబునఁబొందు - నది విలోకింపు!
చికిలి చేసిన కత్తి - చెలువునఁ జూడు
మకలంకమయ్యె నీ - యాకాశమిపుడు.
అలఘునదీప్రవా - హంబులు దరిగి
వెలుతులయ్యెను కూల - విసరంబులకును!
కలువలపై నున్న - కమ్మనెత్తావి
గ్రోలుచాడివచ్చె ద - క్షిణగంధవహుఁడు
అర్కుని వేడిమి - నడుసెల్ల నెండి
కర్కశత్వంబులు - గనియె మార్గములు.
గర్వితాగులగెల్వఁ - గా విచారించు
నుర్వీశ్వరులకు ను - ద్యోగముల్ గలిగె.
నీరంధ్రవృష్టిచే - నెమ్మేని దుమ్ము
వారించి వృషభముల్ - వడి ఱంకెలిడియె.
పెంటి యేనుఁగులపైఁ - బెరిగిన బాళి
వెంటాడి క్రీడించు - విపినవీథులను.
నీరాస వికచాబ్జ - నికరస్రవంతిఁ
జేరి యంచలబారు - చెదరిపోఁద్రోలి
గళగళధ్వనులతోఁ - గరములనిండ
జలములు వట్టి వి - చ్చలవిడిఁ ద్రావి
యురముల శిరముల - నురు ఫూత్కృతులను
విరళాంబువులు జల్లె - వేదండకోటి.
వసివాళ్లు వాడుచు - వాల్మీక గోళ
విసరరంధ్రంబులఁ - వెడలి యన్నియును
వానలచేఁ గరు - వలిఁ గ్రోలరాక
మేనులు డస్సి భూ - మికి వెలువడుచు

విషములు గ్రక్కెడు - వివృతాస్యభీమ
విషధరంబులను భా - వింపు మెల్లెడల.
పరిపూర్ణచంద్ర బిం - బవికాసముఖము
సురుచిర నక్షత్ర - శుభలోచనములు
చంద్రికాధవళ వ - స్త్రంబును మీఱి
చంద్రాస్యగతిని ని - శాలక్ష్మి మెఱసె!
కారుపోతుల బారు - గంటివె క్రోవ
దీరిచినటుల నెం - తే పోతరించి
నీలవర్ణములఁ బం - డిన రాజనంపు
చేలలో మేసి వ - చ్చె వనాంతములకు.
ఒక యంచ నిదురింప - నుత్పలశ్రేణి
వికసింపఁ జూడ్కికి - విందు సేయుచును
హరిణాంకతారాస - మన్వితనభము
కరణిఁ జూపట్టె నీ - కాసారమిపుడు.
అడుగులఁ దొడిగిన - యందెలమ్రోఁత
కడల హంసముల క్రేం - కారములే గాక
కడవోక విరిసిన - కైరవశ్రేణిఁ
దొడవులు గాఁగ ని - ద్దురపోవుచున్న
ముక్కులు విరియని - మొగడ తామరలు
మొక్కచన్నులు గాఁగ - ముందఱనున్న
నడబావిఁ గంటివె - నారీలలామ
వడువున మిగులఁ జె - ల్వము గనుపట్టె.
జీర్ణవైణవరంధ్ర - ఝంకరణంబు
కర్ణామృతరసంబు - గా విని జొక్కి
మేపులు మఱచి యా - మృగసమూహంబు

చూపట్టె సౌమిత్రి! - చూడుమిచ్చోట.
చూచితె కాశప్ర - సూనగుచ్ఛంబు
లీఛాయ వెలిజల్లు - లెత్తించినట్లు
ఆరఁగట్టిన చీర - లన సెలయేటి
యోరలఁ దెల్లనై - యున్న చందంబు
మదిరాస వోన్మత్త - మదవతీ మణులఁ
గదిసి క్రమ్మరు కాము - కశ్రేణిఁ గనుము.
ఎంత తేఁటలు వుట్టె - నీవేళ వాగు
వంతలన్నియు శర - ద్వాసరమహిమ
బెళుకు బేడిసలును - బెరిగిన నాఁచు
జలరుహమ్ములు నక్ర - చయమును గలిగి
నీలైన చూపులు - నెఱివంకకురులు
తేటమోములు నవ్వఁ - దేఱు చెక్కులును
గాఁగ నీనదులు న - ల్గడ తెరచాటు
మూఁగు నప్పుడు మీలి - మునుఁగులతోడి
రమణుల వదనవి - భ్రమవిలాసముల
నమరెను శరదాగ - మారంభవేళ.
కొండగోఁగుల తేనె - గ్రోలి మొగుడ్చు
పుండరీకములకుఁ - బోక దింటెనల
వ్రాలెడు తుమ్మెదల్ - వలరాజు గెలుపు
పాలించవచ్చిన - భాగ్యదేవతలు
ఈపంథ చెంగట - నెఱిఁగించె వినుము.
రేపుమాపులు కుర - రీసమూహంబు
సైకపు చీరలో - జఘనంబు దోఁచు
రాకేందువదన తె - అంగుచూపట్టె

యిసుమంత గనుపట్టు - నిసుముదిన్నెలను
పసమీరెఁ జూడుమీ - పంపాస్రవంతి
జడివాన లుడివోయి - శరదవసరము
పొడచూపె దండెత్తి - పోవురాజులకు.

—: శ్రీరాముఁడు లక్ష్మణునితో సుగ్రీవుఁడు తమకార్యము మఱచినాఁడని తెలిపి, కిష్కింధకుఁబోయి యాతనికి చెప్పవలసిన మాటలను చెప్పుమనుట .—

ఇదివేళయని మది - నెఱిఁగియు రాక
మదిలోన మనల నే - మఱి భానుసుతుఁడు
ఊరక నగరిలో - నున్నాఁడు తనకు
నూఱేండ్లుగానోఁచె - ను నిమిషమైన
వనములలో చక్ర - వాకంబుఁ గూడి
చను జక్కవమిటారి - చాడ్పున సీత 3290
నావెంట రాఁగ ని - న్నాళ్లు నుద్యాన
భావమై యుండె నీ - భయదకాననము!
ఇలయేల నొల్లక - యిల్లాలిఁ బాసి
కలఁగుచున్న నా - గతి విలోకించి
దయఁ జూడఁదగుఁగాక - తనవంటివాఁడు
నియతి యేమఱియుండు - నే నన్నుమఱచి?
తనవంటి యాశ గా - దా వీరిదనుచుఁ
గనలేక యున్నాఁడు - కాముకుండగుచు
వానకాలము దీర్చి - వత్తువుగాక
వానరబలముతో - వలదిప్పుడనుచుఁ 3300

బొమ్మంటి నిపుడైన - భూమిజ వెదకఁ
బొమ్మని కపికోటిఁ - బుత్తేరఁడయ్యె!
కిష్కింధ కేఁగి వా - కిట నీవు నిల్చి
ముష్కరు మూర్ఖుని - మూఢు సుగ్రీవు
నచటికిఁ బిలిపించి - యనఁదగినట్టి
వచనముల్ నేనన్న - వాఁడగాఁబలికి
'యుపకారమునకుఁ బ్ర - త్యుపకార మెవ్వఁ
డుపమించి సేయక - యుండునో వాఁడు
ఎందుకుఁ గొఱకాని - హీనుఁడటంచు'
నందఱు ననుకొందు - రని పల్కుమీవు.
తగినకార్యమునకుఁ - దగినట్టి పనికి
తగవుపల్కిన పల్కు - తప్పరాదనుము.
ఒరులచేఁ దనకు మే - లొదవిన మేలు
మఱచినట్టి కృతఘ్ను - మాంసరక్తములు
నంటక రాక్షసు - లైన రోయుదురు!
కంటగింపుచు నని - కనిపించుకొనుము.
వినవలతువొ రఘు - వీరు కోదండ
ఘనతర జ్యావల్లి - కారవమనము.
తాళభేదనము ఖా - ద్య ముఖ్యైన క్రియల
చాల రాఘవుఁ బరీ - క్షఁగొనంగ నేర్చి
వాలిఁ జంపించిన - వాఁడవు మఱచి
స్త్రీలోలమతినున్నఁ - జెల్లునే యనుము.
ఆడుమన్నటులెల్ల - నాడి నీ సేయు
కోడిగంబులకు లొం - గుచుఁ జెల్మిచేసి
యిచ్చకమ్ములు పల్కు - టెల్లను సీతఁ

దెచ్చెద వనుట గా - దే యంచు ననుము.
కలుద్రావుఁగాని నై - ఖరి మేను మఱచి
సోలఁగ మంత్రుల తోడి - గొర్వతి ననుచు
భోగించెద నటన్న - భోగభాగ్యము లు
సాగనీయదు రాము - సాయకంబనుము
ఏనేమి యంటినో - యిపి దాఁచబోక
వానితో గట్టిగా - వాకొని రమ్ము
వాలి నేఁగన యట్టి - వాలికి త్రోవ
పోవదు సుగ్రీవ - మునసున్నదనుము.
మీయన్నఁ జంపి ప - నత్రోవలోన
వేయు నేఁటికి మా - ట్లు - వేయ లేదనుము.
వాలి నొక్కనిఁ బంపు - పగవాని నిన్ను
కాలుని కడకంపు - బంధు లతోడ
వానరకులమెల్ల - వధియింపకేము
మానక యొక్కని మేను - మార్గణంబో ననుము.
ఆనాటి వోయిన - యట్టిమార్గమునఁ
బోవనేటికి నీవు - బుద్ధిమంతుఁడవు
తగవు ధర్మమ్ము స - త్యము శాశ్వతంబు
లుగ నెంచి సత్యద్ధు - లు గని చనుము.
ఏటికి యమపురి - కేఁగంగ నీకు ?
మాట వాసి ఁడించి - నుటలే లెస్స.
అని హితంబు భయంబు - ననునయంబొప్పఁ
గని ంచి ఎలికి వే - గమె పోడితమ్ము
డెమ్మన్న పలుకు నప్పుడు - రాముఁ జూచి
సమ్మతంబమర ల - క్ష్మణుఁ డిట్లనియె.

— లక్ష్మణుఁడు సుగ్రీవునిఁ జూడఁబోవుట —

"స్వామి! సుగ్రీవుఁడు - సన్మార్గవృత్తి
మేమఱి తనయెడ - మెఱుఁగక క్రొవ్వి
యధికప్రయత్న సా - ధ్యంబైన రాజ్య
మధముఁడై కర్మఫ - లానుభవమునఁ
బోనాడుకొని చెడి - పోవు యత్నంబు
తో నున్నవాఁడు కో - తులకేది బుద్ధి?
మనప్రయోజన మాత్మ - మఱచి తా నున్న
మును నిల్పుమాట వాఁడు - మదిఁ గానలేఁడు!
కాముకుఁడై వీఁడు - గర్వాంధుఁ డగుచు
స్వామికార్యము మాని - సఖులను గూడి
యీరేయిఁ గడు గుఱు - కొనుచుండై యుండెఁ
గావచ్చునె నాకుఁ - గట్టయల్పునికి?
వాలి వెంటనె పంప - వలెఁగాని ప్రీతిఁ
జాలిమి పుట్టకు - తనదృష్టిఁ బడిన!
వానిఁ జంపక రాన - వశ్యంబు నాదు
పూనిక విడువను - బుగ్గి చేసెదను!
కృతఘ్నుఁడు వాఁడు - కపిరాజ్యమునకుఁ
బట్టంబు వానికే - పట్టుకు లేదు!
వానరులను గూర్చి - వాఁడు దిక్కుగాఁడు
జనకసుతను - సాధింపఁగలఁడు
ఇదె పోవుచున్నాఁడ - నేలసి" యిల్లుఁ
గదమును దాల్చి వే - గ్బున బోవువానిఁ
దమ్మునిఁ జూచి శాం - తరసాంబురాశి
యస్సురరాఘవా - గ్రణి దయఁబలికె

"నీవు ధార్మికుఁడవు - నేఁడేమి కీడు
గావించె మనకు భా - స్కరి కుమారకుఁడు?
అతని మీఁదట నేల - యత్యుత్తమైన
యతిశయక్రోధ ము - బ్బాడ నేమిటికి?
నీమదిఁ జూడఁగ - నిట్టులుంటివి
నామాటలకు నీవు - ననుసారి గావె
మనము వెట్టిన చెట్టె - మన పట్టు చేయుపఁ
జను నే వాలితమ్ముఁడు - సాధారణుఁడె?
ఇల మ్రోలఁ బడుపాని - నిలువరింపి
గనవు పెప్పినటంచుఁ - గరుణ దప్పెదవె?
మితము మీఱిన నేమి? - మెల్లనే పిలిచి
హితముగాఁ బలికిన - హెంకెక్కి నట్టి
కార్యంబు తన్నడన - కారణంబున కే
పర్యాయముగ నెంచి - పనివెవదాయు
కాక యిట్లుండునే - కొఱఁతవాఁడు
జేకొని బుద్ధిగాఁ - జెప్పరమ్మనుచుఁ
జను మన్న నప్పుడే - సౌమిత్రి కదలి

— లక్ష్మణుఁడు క్రోధముతో వచ్చినాఁడని యంగదుఁడు సుగ్రీవునకుఁ దెలుపుట —

కినుక మోమునఁగోప - కిష్కింధ కడకుఁ
జనునెడ నె శాఖ - శాలంబు మీఁదఁ
గనుపట్టు నింద్రుని - కార్ముకం బనఁగఁ
దనచేత పేము తో - దండంబు పొంత
వనముల కపరంజి - వన్నెవ నెట్టె

వచ్చినా రిప్పుడు - వాకిట గస్తులు
పచ్చి విల్లి చే [illegible] చెయి [illegible]
[illegible] వచ్చి నని రాగ - లాడిన వా[illegible]
[illegible] - [illegible] ఉరా [illegible]
[illegible] - [illegible]
[illegible] చేసు [illegible] నిలిచి
[illegible] ముడి [illegible] - [illegible]
యు మునికి [illegible] నా [illegible] - [illegible]
[illegible] - [illegible]
[illegible] - యు[illegible] [illegible]ల
[illegible] నిగు నుం [illegible] - [illegible] రము
[illegible] ప ర మనా - [illegible]
కాపవోయు ప నుని - యుస్ని [illegible] గోధ
రస [illegible] - [illegible]
[illegible] - [illegible]
[illegible] - [illegible]
[illegible] - [illegible]
[illegible] - [illegible]
[illegible] - [illegible]
[illegible] - [illegible]
నును [illegible] - [illegible]
నినిపి పం [illegible] - [illegible]
[illegible] వఘా సుదా - ధగమా [illegible]
వా రవశ్యమా [illegible] - [illegible]

నామాట విని మంత్రు - లందఱుఁ గూడి
యేమఱిపాటొక్క - యింతయు లేక
శతసహస్రమదేభ - సత్త్వ వానరుల
శతబలిగజతార - శరభ ముఖ్యులను
మూఁకలతోఁ గూడి - మొనసేయఁ బనుప
నాకసం బగలించు - నట్టహాసముల
వారెల్ల కిష్కింధ - వాకిట నిలిచి
భూరుహంబులు నగం - బులు పెల్లగించి
కరములఁ గీలించి - గవనులు మూసి
మరుగులఁ గోట కొ - మ్మల నిండ బలిసి
వాలమ్ము లార్చుదు - ర్వారవిక్రముల
శైల సన్నిభుల ని - శాత దంష్ట్రులను
నతిఘోరులను వికృ - తాకారయుతుల
జితదానవులఁ గపి - శ్రేష్ఠులఁ జూచి
యాలక్ష్మణుఁడు కోప - మగ్గలింపంగ
వలితమ్ముఁడు తమ్ము - వంచించెనో యను
నతని వారలు తన్ను - నఱికట్టఁ దలఁచి
ప్రతికూలులై కోట - బలిసి యుండుటయు
రాముఁడు విరహాభా - రంబుచే నోర్వ
లేమియుఁ దలఁచి తా - లిమి లేక కనలి
కాలాగ్నికల్పుఁడై - కన్నులయందు
కీలికీలలు గ్రమ్మఁ - గిటకిటఁబండ్లు
గీఁటుచు నార్పులు - గరలఁ గోదండ
కోటితో శింజినిఁ - గూర్చి యమ్మేర్చి
శరజిహ్వకలు శరా - సన శరీరంబు

సరిలేని తేజోవి - షంబును మెఱుగు
సౌమిత్రి పంచాస్య - సదృశుఁడు క్రూర
మొనరించి కిష్కింధ - యగ్రభాగమునఁ
జేతులు మొగిచి ని - ల్చిన వాలిసుతునిఁ
గ్రోధుఁడై కన్గొని - పిలిచి యిట్లనియె
'ఈ నవపురంబునకు ల - క్ష్మణుఁడే వచ్చె
తనరాక మీరాజు నెం - తయుఁ దెల్పుమనియె
ననుచు భావజునితో - "నను నమ్మ" నుచు
బనుప నంగదుఁడును - బరువునఁ జొచ్చి
రవిసూనుతో వార్త - నంతయుఁ దెల్పుటయు
నవివేకమును నిద్ర - యలసభావంబు
మదము మత్తతయును మ - న్మథ వికారంబు
పదవిచే నగుగర్వ - పైఁబడి యుండ
నామాట వినక మా - రాడక యతఁడు
తామసప్రకృతి ని - ద్రవహించి యున్న
వాకిట గావలి - వానరుల్ గూడి
మూఁకలై లక్ష్మణు - మందలఁబిల్చి
కిలకిలాశబ్దాను - కృతులెనుగుల్ సేయ
బలుమ్రోఁత పిడుగులు - వడిన చందమున
నవని యంతయు నిండ - నమ్మహారవము
రవితనూజుని కర్ణ - రంధ్రము సోఁక
దిగ్గన లేచి యు - ద్దీర్ణభావమున
నగ్గలిక "నదేమి - యార్భటి"? యనిన
బరువుతో వచ్చి ప్ర - భావస్వభావు
లిరువురు మంత్రులా - యినసూనుఁ జూచి

"అయ్య! మహారాజ - లైనట్టివారు
నెయ్యం బపేక్షించి - నినుఁ జేరువారు
రాజులత్యున్నతులు వి - క్రమ కళానిధులు
భూమియంతయు నేలు - పోడిమివారు
ఈరాజ్యసుఖము నీ - కిచ్చినవారు
వారిచర్యలు మఱు - వఁగఁ దగునయ్య?
అన్న వంపఁగ సుమి - త్రాత్మజుఁ డిప్పుఁ
డున్నాఁడు! వచ్చి పు - రోపకంఠమున
బాణబాణాసన - పాణియై సితకృ
పాణియై యున్న య - ప్పరమ సాహసునిఁ
గపులందఱును జూచి - గడగడ వణఁకి
యిపుడు సన్నుతి సేయ - సిద్ధని వుట్టె"
ననుచు నింద్రసమానుఁ - డైన సుగ్రీవుఁ
గనుఁగొని పలికె "యో - కపిలోకనాథ!
ఆలాపసారథి - యాత్మీయకార్య
కేళీరథంబు మి - క్కిలి బతచే
యమ్మహారథవర్యుఁ - డంగదుఁ బిలిచి
పొమ్మన్న మీకు దె - ల్పుటకునై వచ్చె
నతఁడు చూపులచేత - నగచరావళిని
హుతవహువలె నేర్చ - నూహించినాఁడు
నీవుబాంధవులతో - నేఁడు రేఁగి
యావీరవరుని స - మర్చనల్ చేసి
వారువచ్చినరాక - వారితో మీరు
మీఁజెపల్కిన మాట - మేకొని తీర్చి
కని కొల్వుఁడన విని - కమలాప్తసుతుఁడు

తనమంత్రివరుల నం - దఱఁ జూచి తగవు
గురులఘుత్వము లన్య - గుణ గౌరవంబుఁ
బరికించి తానున్న - పట్టిపుంచమున
నుండక దిగువఁ గూ - ర్చుండి వివేక
పాండిత్య శాలియై - భానుజుఁడనియె.

— సుగ్రీవుఁడు లక్ష్మణుఁడు వచ్చినకార్య మడుగుట —

"రామున కేను నే - రము సేయలేదు
తామసింపను మితిఁ - దప్పేమఱచి
యేమి నిమిత్తమై - యింతకోపమున
సౌమిత్రి వచ్చె న సహ్యంబుఁ జేగ
నెవ్వారేనియు వాలి - హితులు వంచించి
దవ్వుల నేనున్కి - దనివాఁడనుచుఁ
జెవిసోఁక గొండెముల్ - చెప్పిరో కాక
చెవులె కన్నులుగదా - క్షితిపాలకులకు!
అతఁడు స్వకార్యప - రాయణుఁడగుట
హితమతి మీకార్య - మీడేర్చు ననుచు
నాఁగమాట యొకింత - యు డినఁజాలు
దోసమెంచక యొక్క - తూపు సంధించి
పంతగించిన యట్ల - పడవేసెనేని
చింతించి యామీఁదఁ - జేసెడిదేమి
నామాట వినియొక్క - నారాచమేర్చి
రాముఁడు వాలి నూ - ఱక చంపలేదె?
ఎవ్వఁడెఱుంగు? నా - కీరాజ్యమేల?
దవ్వులఁ బ్రాణముల్ - దాఁచి యుండెదను

చెలిమి చేసిన నది - చెడకుండ నేర్పు
గలిగి మెలంగ దు - ష్కర మెవ్వరికిని !
సంపోదు నాకు ల - క్ష్మణుఁ డాగ్రహించి
శరశరాసము లు - సవరణ సేసి
వచ్చినప్పుడె కదు - వలెఁ దోఁచె మీకు
నిచ్చఁ దోఁచి బుద్ధి - యుడిగింపుడిపుడు
దోషమేమియును లే - దు మదాత్మయందు
నిషధ్భయంబైన - నేఁటికి నాకు ?
వారల యెడనైన - వారొక్కరల
ధారుణి నొరుల చి - త్తము లెవ్వఁ డెఱుఁగు ?
మనసులు నిలుకడ - మానిన వగుట
మనకిట్టిచో నను - మానింప వలసె ''

— హనుమంతుఁడు సుగ్రీవునకు హితము చెప్పుట —

అనుమాట విని చేరి - హనుమంతుఁడపుడు
వినయంబుతోఁ గపి - విభుఁ గల్లనియె.
" ఇది యేమి యరదు ? నీ - వింగితజ్ఞుఁడవు
మది నుపకారంబు - మఱచి యుండుదువె ?
నినిమిత్తము వాలి - నిఁ బ్రతాపశాలి
జానకీ ప్రభుఁడొక్క - శరముచే నేసె
తనవాఁడవని నిన్నుఁ - దలఁచి రాఘవుఁడు
కినిసి లక్ష్మణుఁ బంపెఁ - గిష్కింధ కపుడు
కినుక యేమిటికన్న ! - కృతమాత్మ నెఱిఁగి
యును శరత్కాల మ - భ్యుదయంబు నొందె.

మత్తుఁడవై వారి - మఱచితిగాన
క్రొత్తయే నిమిాఁదఁ - గోపించికొనుట ?
కాలజ్ఞుఁడవు వివే - కము లేనియట్టి
పాలసుఁడవుగావు - బలశౌర్య నిధివి
యరులసాధింపఁగ - సమర్థవైన యట్టి
తరివచ్చియును నీవు - తేఁపకయున్న
నూరక తమరేల - యుందురు ? వారి
నేరమేయిది ? నిదు - నేరమిగాఁక
ఇంతిని గోలుపో - యినవారి మిాఁద
నెంతయు దయవలె - సంతసమె కాక
సరకు సేయక యుపే - క్షాబుద్ధి నున్న
దౌర్భాగ్యైన నైతివి - దోషంబుగాదె
తప్పునకై పోయి - దండమర్పించి
చెప్పిన బుద్ధులు - శిరసావహించి
పనుపు సేయుట మంచి - పని ప్రధానులకు
కనిపించుకొని యంత - గదిమి చెప్పినను
నదిహితం బుచితంబు - నగుగాన యేను
మదిశంక లేక యీ - మాట లాడితిని
వారు గోపించిన - వలదని మాన్పఁ
దీఱుననుచు నెంచి - తే ? నిల్వఁగలమె ?
పాఱిపోనేర్తుమె ! - పఱెదమనిన
వారు వోనిత్తురో ? - వలవ దీభయము
ప్రతికూలుఁడే రఘు - పతి ? మనకతఁడె
గతి ! సదేవాసుర - గంధర్వమైన
జగమెల్ల నొకతూపు - సంధించెనేని

నిగుడ సేయు నతండు - నిమిషంబులోన ।
అదిగాక నీకునా - యన చేసినట్టి
విదితోపకారంబు - వీటి బోనాడి
పారద్రోలను నీవు - పోయిన వారు
విరసింతురంటగాన - వినుము నాబుద్ధి.
రాజశాసనమతి - క్రమము జేసితివో ।
స్వామికార్యముల వం - చన జేసినావొ ?
కల్లలాడితివో ? సం - గరములో విడిచి
యిల్లు చేరితివో ? నీ - కేల యీతలఁపు ?
ఇంటికి వచ్చిన - నెవ్వారినైన
వెంట బెట్టుకరాని - వీటికేడి గలఁడ ?
రప్పింపు పూజింపు - రాఘవునితమ్ముఁ
డప్పుడు మనమీఁద - నలుగఁడేమియును."

— అంగదుఁడు లక్ష్మణుని సుగ్రీవుని యొద్దకు దోడి తెచ్చుట :—

అన విని తారా స - హాయుఁ డంగదునిఁ
గనుఁగొని "నీవు ల - క్ష్మణుఁదోడి తెమ్ము
వేగంబె చను"మన్న - విని వాలితనయుఁ
డాగుణనిధి నూర్మి - ళాధీశుఁ జేరి
ప్రణమిల్లి "నగరిలో - పలికి విచ్చేయుఁ
డణిమాదులైన య - ష్టైశ్వర్యములను
మీరిచ్చినవి వచ్చి - మీరుచూచినను
శ్రీరాము కరుణ నూ - ర్జితములై వెలయు ।
రండు ! మాపినతండ్రి - రమ్మనె మిమ్ము.

ఉండనేమిటికి పు - రోపాంతసరణి ”
అనిన సుగ్రీవుపై - నలుక యంగదునిఁ
గనుఁగొన్న కరుణను - గడలేక యుండ
మాటు మాటాడక - మర్కట సైన్య
వార మంగదుని శ్రీ - నం గొల్చిరాఁగ
వాలి సూనునివెంట - వచ్చి సౌమిత్రి.
నీలమేఘంబులు - నిలిచిన కరణిఁ
గాలు వనంబులు - దాఁటి సుగ్రీవ
పరిపాలిత స్థైర్య - పట్టణంబునకు
మేరుకైలాసో - మేయంబ లగుచు
భూరిరాజిత సౌధ - ములు మిన్నుముట్ట
కరుణనింద్రుఁ డొసంగు - కామితఫలద
తరుకోటి యరికట్ల - తలఁపు పుట్టింప
విపణిమార్గంబుల - వివిధవస్తువులు
నపరిమితంబులై - యబ్బురపఱుపఁ
నిమ్మ కొలంకుల - తావులు దచ్చి
తెమ్మెరల్ బడలికఁ - దీఱంగవీవ

— కిష్కింధ వర్ణనము —

అమరావతియొ కాక - యలకాపురంబొ
హిమవన్నగమొ వేల్పు - టరనైన గిరియొ
యనఁగఁ గొండలు చుట్టు - నమర నన్నగము
ననుపమ భోగ భా - గ్యములఁ జూపట్టు
వానరపురము ద్రో - వనొ రాఁగ వీధి
లోనఁ దారుండు నీ - లుఁడు శతబలియు

విజయసూర్యాంగద - ద్వివిద సుషేణ
గజగవయగవాక్ష - గంధమాదనులు
పనసమైనాక సం - పాతి సూర్యాక్ష
హనుమంతసురగోము - ఖాగ్ని నేత్రులును
నలజాంబవద్వ్యక - ర్ణక మయకుముద
మలయ విద్యున్మాలి - మైందగోకర్ణ
దధిముఖ ఋషభ మం - దారసునేత్ర
దధివక్త్ర వీరహ - స్తసుపాటలులును
మొదలుగాఁగల కపి - ముఖ్యులు జేరి
ముదము మీరఁగఁ గొల్వ - మ్రొక్కులు వేయ 3620
నంగీకరింపుచు - నావలికేఁగి
బంగారమిటికల - ప్రహరిగోడయును
నవరత్నముల రోహ - ణగిరీంద్రమన గ
రవణంబుగలహజా - రము మగరాల
బోరు దల్పులు ద్వార - ముల మరకతపుఁ
దోరణంబులు నింపుఁ - దొలకించు నట్టి
నగరిలో భానుమం - డల మంబరమున
మొగులలోఁ జొచ్చిన - ముగువు చూపట్ట
నావలఁ జని యుఝు - దాఱు మానికపు
సావడుల్ గనుచు న - చ్చట వాహనములు 3630
కగ్గని మణిదీప - కళిక లేకడల
నెగ్గళ్ళ కంచుకుల్ - వృద్ధులాప్తులును
పట్టెమంచంబులు - పఱుపులు వివిధ
పట్టాంశుకములు కం - బళ్లును పరఁగి
పీఁటలు తలగడల్ - బరుదులు టంక

వాటపు కొమ్మెరల్ - వాద్యఘోషములు
గంధోత్తమాపూర్ణ - కుశలముల్ దవ్వ
గంధ ధూపములు న - ల్గడలఁ గ్రమ్మనుచుఁ
జక్కని యుడిగంపు - సతులు మెలంగ
చక్కటఁ జేరి య - ష్టమ కక్ష్య నిల్చి
పిలుగుణధ్వని సేయ - పిని భానుసుతుఁడు

— సుగ్రీవుఁడు తారను లక్ష్మణునితో మాటలాడుటకుఁ బంపుట —

కలఁగి దిగ్గన లేచి - గడగడ వణఁక
వెఱవకుమని తార - వన్నెపైఁ జఱచి
పరిరంభణము జేసె - పడసీక నిలుప
నపుడంగదుఁడు వచ్చి - "యయ్య! సౌమిత్రి
కుపితాత్ముఁడై మన - కోటవాకిటను
వచ్చియున్నాఁడన" - వాలితోఁ బుట్టు
నిచ్చలోఁ 'దనతో' డ - నేకాంతవేళ
హితముగా నంగదుఁ - డేమి యన్నాఁడొ?
సతియయ్యె నది"యని - చాల శంకించి
నోరెండ "బ్రహ్మకు - నూఱును సందెఁ
దారి! యయ్యది బుద్ధి - తనకిట యొందె?
మంచివాఁడనుచు ల - క్ష్మణుని నమ్మితిమి
చంచలేక్షణ? కాల - శమనుఁడై నాఁడు!
ఇతని కప్రియము నే - నేమి చేసితిని?
కతమేమొ యిట్టి యా - గ్రహముతోఁ జేర?
వలదన కీనేల - వాలిఁ జంపించి

కొలగట్టుకొంటి నా – కును వీరికేల
చెలిమి వాటిలె? నింత – చేసిన యట్టి
తులువ వాయుజుఁడు మం – త్రులు ద్రోహులైన
కడతేర వచ్చునే? – కపిరాజ్యములు?
అడియాసఁ గైకొంటి – యతివకై యేను
కనువోవు నిద్దుర – గాదిట్టివారి
చనుమానములు చాలు – సఖ్యంబు చాలు
నిల యేలుటయుఁ జాలు – నేమియు నొల్లఁ
దొలఁగించి తనకొక్క – ద్రోవఁ గల్పింపు
నారీలలామ! ప్ర – ణామంబు సేతుఁ
జేరి నీచరణ రా – జీవముల్ పోఁక
కాదన్న మునుమున్న – గా నివు వోయి
నాదు మాఱుఁ లక్ష్మ – ణపదాంబుజముల
వ్రాలిన నాఁటి – వచ్చె నే డనుచుఁ
జాలించు గనుక ప్ర – శాంతాత్ముఁడైన
నతనితో నీ నేర్చి – నట్లు భాషించి
హితముఁ జేసితివేని – యే వచ్చి వెనుకఁ
బొడగంది నతని ని – ప్పుడు రమ్మటన్న
పడఁతి రానొల్ల నా – ప్రాణంబు గాచి
బ్రదికించుకొను”మన్న – భర్తమాటలకు
మదిరాయతేక్షణ – మదన సంగ్రామ
కేళీరసాల స – కిన్నరకంఠి
లాలితభూషణా – లంకారకలిత
మంజీరమేఖలా – మాలికాకటక
శింజితఝణఝణ – శ్రీభాసమాన

యలినీలకచ కించి - దవనతగాత్రి
కలవాణి తార రా - ఘవసహోదరునిఁ
జేరవచ్చినఁ జూచి - స్త్రీ సన్నిధాన
మేరకి మదినాగ్ర - హింపరాకునికి
తేటి చూపక పర - స్త్రీ పరాఙ్ముఖుఁడు
శ్రీరాముఁ దలఁచి వం - చినమౌళితోడ
నూరకయున్న హా - లోద్రేకమదవి
కారంబుతో సిగ్గు - కడకోసరించి
దిట్టతనంబునఁ - దియ్యఁ పల్కులను
గట్టువాచిలుక వ - ర్ణించి నట్లు
నీతియు వినయంబు - నెనరును గలుగఁ
జాతుర్యవతి తార - సౌమిత్రి కనియె

— తార లక్ష్మణునితో సంభాషించుట —

"స్వామి! నీకేల రో - షము నాగ్రహంబు?
ఏమి నేరముచేసి - రెవ్వారలైన?
మేదిని నీయట్లు - మీఱినవారు
మీఁదు బుద్ధి యశ్రీక - మించినవారు
యెందైనఁ గలుగుదు - రే? కల్గిరేని
పొందుదురే వారు - భూరిసౌఖ్యములు?
శాంతమూర్తివి సర్వ - సముఁడవు నీవ
నంతకల్యాణగు - ణారాముఁడవు
తగునయ్య? యింతక్రో - ధము నీకు? దాసు
లగు వారిపై 'నన్న - యంగదుతల్లి
మాట చెప్పలను నె - మ్మది విస్మయంబు

గాటంబుగాఁ గ ల - క్ష్మణుఁ డిట్టులనియె.
"కిన్నరకంఠి! సు - గ్రీవుఁడు నీతి
నెన్నక ధర్మార్థ - సత్కర్మముల్ మఱచి
కామోపభోగ సం - గతి నార్తుఁడైన
రాముని కార్యభా - రము నేఁడు విడిచి
మంత్రులతోఁ బాన - మత్తుఁడై యస్వ
తంత్రుఁడై స్త్రీ పర - తంత్రుఁడై యిట్లు
పొడతెలియక యున్న - యునికి వీక్షించి
శోకమగ్నుం డైన శ్రీరా - ము యతీంద్రులకును?
దాసు నేగ్ర్యమా - తంబుఁ బిలిచియును
మనసున నేమఱి - మత్తుఁడై వాఁడు
రేమఱి వచ్చితి - వేవచ్చు రాక
కామిని! యుచితంబో - కాదో భావింపు
పానంబు ధర్మార్థ - పటువులఁ జెఱచుఁ
గాన నీ మగని కే - గడిది సత్యంబు?
ధర్మంబుఁ దలఁచి యిం - తటనైన నీవు
దుర్మానశీలుని - తో హితాదేశ
పద్ధతిగాఁ బోయి - భాషించి వాని
బుద్ధిమంతునిఁ జేసి - పూనిన ప్రతిన
నడిపింపఁ జేయు"మ - న్న సుమిత్రపట్టి
నుడువుల కలరి య - న్నుల మిన్న పలికె
"కోపకాలము గాదు - కొలిచిన వారిఁ
జేపట్టి నేరముల్ - చేసిరేనియును
సహియింపఁ దగు కార్య - సంగతులందు
విహితమె యాగ్రహ - వృత్తి రాజులకు

రాజులలోఁదమో - రాజసగుణము
లేఁబాడ విముఁజేర - నీక సాత్త్వికమె
పూని యుండిన మీకుఁ - బొసఁగునె యలుగ
వానరప్రభుఁడైన - వాలి సోదరుఁడు
కామాంధుఁడై కన్ను - గానకుండుటయు
స్వామికార్యముఁ దీర్పఁ - సమయమాటయును
మీరు చేసిన యట్టి - మేలుఁ దలంప
నేక వీఁడుండు - నే యని తలఁచి
మాగ్రహంబున రాకఁ - డనుపుట యితని
నిగ్రహించెదనని - నీవు వచ్చుటయు
నన్నియు నెఱుఁగుదు - నైన నామనవి
చిన్నబుచ్చక వీఁడు - చేతిలోవాఁడు
మాలోన నొకఁడని - మన్నించి కరుణఁ
దాలి ప్రోచుట మీకు - ధర్మమైయుండు
తెలివిచాలక జితేం - ద్రియులైన యతులు
నలివేణులకు లొంగ - రై యున్నచోట
నితఁడు వానరుఁడౌట - నెన్న నేమిటికి?
అతివలఁ దగిలి రా - గాంధుఁడై యునికి
చపలస్వభావుని - శరణంబు వేడి
కృప మీరు తెచ్చి కి - ష్కింధలో నునుప
నున్నవాఁ డే ప్రియ - నోర్చు నీవింత
కన్నెఱ్ఱఁ జేసినఁ - గాకుత్స్థతిలక?
నెఱచి యిందాక నే - విన్నవించుటకు
మఱుఁగు చేసితి నా - రుమానాయకుండు
నీవు రాఁకట మున్న - నిఖిల వానరుల

రావించి రామకా - ర్యభరంబుఁ దెలిపి
యందుకుఁ దగిన కా - ర్యాలోచనంబుఁ
గందువ నెమ్మదిఁ - గనియున్నవాఁడు
నెయ్యుని పట్టున - నెనరుంచి మీర
యత్యంతపరమున - కగు దేరవలయు
“గాదకు మీకు - రాదు మీ ప్రోవు
వారెల్ల తనయుల - వలెఁ గాదె మీకు ?
విచ్చేయుఁ ”డని యాత్మ - విభు హితం బెంచి
యచ్చపలాక్షి ప్రి - యంబులు వలుకఁ
దారవెంబడి సుమి - త్రాకుమారకుఁడు
పోరామిచే నంతి - పురముఁ జొచ్చుటయు
కట్టిదరుఁ బైడి - గద్దియనిండఁ
జట్టును వలకారి - సుదతులు గొలువఁ
రుమతోడఁ గూడి మె - యిమ్ముఁగడియముల
నమరు కీలాయింతి - యంసంబుఁ జేర్చి
యొకయింతి తొడలపై - నొకపాదమునిచి
సకలమణీభూషణ - చయములు వెలుఁగ
హాలారసారుణి - తాలోకుఁడైన
వాలిసోదరుని భా - వముఁ దేటి చూడ
నతఁడును రామకా - ర్యార్థియై మోల
నతిశయక్రోధకా - లాంతకు రీతిఁ
గుపిత వృత్తినధిజ్య - కోదండుఁడైన
తపనతేజుని సుమి - త్రాపుత్రుఁ జూచి
బగ్గున గుండియ - వగులఁ బీరంబు
దిగ్గన డిగ్గ భ - క్తి స్నేహములను

నొకయింతి కొడుకుపై - నొకపాద మూనిచి
సకలమణీ విభూ - షణములు వెలుఁగ
హారసారుచి - తాలోకుఁడైన
వాలిసోదరునిభా - వముఁ దేటచూడ
నతఁడును రామకా - ర్యార్థియై క్రమ్మ
నతిశయ క్రోధకా - లాంతకునిరీతిఁ
గుపిత వృత్రవధేచ్ఛ - గోపించుఁడైన
తపనతేజుని సుమి - త్రాపుత్రుఁ జూచి
యవని పాలకుఁడు రా - జ్యము సేసె నేని
యవినింద్యుఁడై నుతు - లంది వర్ధిల్లు
క్రూరకర్ముఁడు కృత - ఘ్నుఁడసత్యపరుఁడు
దారాభిగతుఁడు పా - తకియుతుఁడైన నేని
నందఱును నృశంసుఁ - డండురు వానిఁ
బొందును బాతకం - బులపారములుగ
నుపకార మొకరికి - నొనరించి తాను
నపుడాడి తనకార్య - మొనరిచ్చి వెనుక
నామాట నిలుపని - యన్యాయపరుని
భూమిఁ బాపము లెల్లఁ - బొందునేకముగ
నందుపై శ్రీరాము - నంతటివాని
బొందు నీవంటి య - ల్పుఁడు సేయునపుడు
నాడిన మాటలు - యుందాఁక నొంత్తైనఁ
నోడు చూపకయున్న - దోషంబు గాదె?
తనకుపకార మొం - తయుఁ జేయువాని
మనసురాఁ జేనైన - మాత్రమేనియును
ప్రత్యుపకార సం - పన్నుఁడు గాని

యత్నాధము నృశంసుఁ – డని బ్రహ్మవలికె
భ్రష్టుని గోఘ్నుని – పానాభిరతుని
కృష్ణుని చోరునిఁ – గెడతేర్పఁ దలఁచి
యిటు సేయుఁడని విధి – యుంచిరి గాని
కట కట ! మేలెఱుఁ – గని దుష్టమతికి
నెందుఁ బ్రాయశ్చిత్త – మిదియని లేదు !
నిందకోరిచి రాము – నికి రెండు దలఁచి
కల్లలాడిననీకుఁ – గమల సంభవుఁడు
చెల్లరె ! యెట్లు ని – ష్కృతి విధియించు
సీతను వెదకింపఁ – జెప్పితిగాక
నీతోడు శ్రీరాము – నికి నేమిపనికి
కప్ప వల్కినయట్ల – కాలాహి వల్కి
కప్ప నమ్మికఁ జేరఁ – గని మ్రింగినట్లు
ఏకార్యమునకునె – నెయ్యంబుఁ జేసి
వాకొంటి వప్పుడు – వలసిన యట్ల
వాలినిఁ జంపి నీ – వారమై రాజ్య
మేలించి నిను దెచ్చి – యింటిలోనునిచి
యిన్ని పాటులఁబడు – టెల్లను నీవుఁ
గన్నులు నేవేళఁ – గలుద్రావి చొక్కి
కామాతురుండవై – కడపట మమ్ము
నేమియుఁ దలఁపక – యిట్లుండు కొఱకె ?
ఓరి ! రామద్రోహి ! – యొకతూపుఁ దొడిగి
నిరొమ్ము నాటించి – నేఁడె కూల్చెదను !
వాలి చన్నట్టి త్రో – వను నిన్నుఁ బనిచి
కాలుని వీటిలోఁ – గాపురంబుంతు !

అన్నదమ్ములము మే - మగుటచేమి ద
నన్నదమ్ములు గాన - నదియెయుక్తంబు
శ్రీరాము నానతి - సేయక తలకు
మీఱరాదటు గాక - మెలఁతలలోఁ
నున్నవాఁడవు గాన - నోర్చి చేకాచి
నిన్ను మన్నించితి - నీకింకనైన
సీతను వెదకించి - చేసిన ప్రతిన
యేతెఱఁ జెల్లించి - హితుఁడవై మాకు
రామకార్యముల పో - రామి వాటించి
సేమంబు గనుమేల - చెడు ద్రోవ నీకు ?
నీమాట వినికాని - నేఁడాళ" యనిన
నామాటలోఁదార - యడ్డంబు వచ్చి
"నట్టింటి కీతని - నమ్మి నేఁదెచ్చి
చెట్టనైతి" నటంచుఁ - జేరి యిట్లనియె

— లక్ష్మణుని మాటలకుఁ దార ప్రత్యుత్తరముఁ జెప్పుట —

అనరాని మాటలి - ట్లపరాధఁ బాలి
యనఁజెల్లునయ్య ? యి - యర్కనందనుని
కానివాఁడనరాదు - కల్లయు లేదు
హీనుఁడు గాఁడు మే - లెఱిఁగిన వాఁడు
కపిరాజ్యమును రుమా - కాంతయు నన్ను
నపరిమితములైన - యైశ్వర్యములును
నవనిజాతా సహా - యానుగ్రహమున
రవితనయుఁడు గాంచి - రాజయినాఁడు
బహుకాల మాపదఁ - బడినవాఁడగుట

మహిళలతోఁ గూడి - మఱచె మితంబు
ఇంతలోఁ దప్పిన - దేమి? కౌశికుని
యంతవాఁడును దొల్లి - యచ్చరఁ గూడి
కాలంబు మఱవఁడే? - కపినాథుఁ డిట్టి
పాలార్పనగునె ని - ర్భరలీల ననుచు?
కరుణింపఁ దగవు రా - ఘవునకు నీకు
వెఱపు దీర్పుట యొప్పు - విశ్వాసపరు !
ఇంతటివారు మీ - రితరుల మనసు
లెంతయు నెఱుఁగ లే - కిటులాడఁ దగునె?
ఏమివల్కిన నేమి - యిదిమీకు కొదవ?
సామాన్యులే మీరు - సద్ధర్మపరులు
ప్రాకృతరీతిఁ గా - ర్యజ్ఞుఁడ వయ్యు
వాకొందురె యిచ్చ - వచ్చినయట్లు?
తగ నెఱుఁగుదువు పే - కను దెచ్చి కాక
నగరికి రం బిల్చ - నా భానుసుతుఁడు?
చెల్లమాంకని కాఁడఁ - జెల్లునే? యిట్లు
బల్లిదులకు మీఁదు - పరికింప వలదె?
చులకఁ జేసెదరె? భాను - జుఁడు క్రొంచగాఁడె?
తొలుతను నెఱుఁగక - తోడు వేఁడితిరె?
కార్యాంతరంబుచేఁ - గనియెద రితని
మర్యాద నాయూడు - మాట లిప్పటికి
సరిపోదు మీకు రా - జ్యముఁ గొను సతిని
యొరులు చేకొని యార్తి - నొందించు కతన
మేలు గీడుల నొక్క - మేర నే నగువఁ
బోలునె యెంతటి - బుద్ధిశాలులకు

గొబ్బగా నేరము - గలదు సుగ్రీవు
పట్టున నైనఁ జే - పట్టు నాకొఱకు
రక్షింపు మితని నే - రాచక్రమైన
పక్షంబుగల యమా - భామినినైన
ననునైన సమానుమా - నఁడు ప్రాపినట్ట
పని సీతఁ జేకొర్చు - భారకుండితఁడు
రావణుఁ గొనిచు శౌ - ర్యముచేత రాము
దేవేరి రోహిణీ - దేవియుఁ జంద్రుఁ
గలసిన కైవడిఁ - గలసియుండంగఁ
దలఁపించు నీకు నిం - తయుఁ దరువాత
శతకోటులు సహ - సంఖ్యయు నయుత
శతలక్షలంబు ల - క్షసహస్రములును
కడపట నన్నాహు - గా రాక్షసాళి
మడపినగాని సా - మాన్య యుద్ధమునఁ
జావఁడు సుమ్మిద - శగ్రీవుఁడట్టి
లావరి సీతఁడా - లమునందు నెదిరి
యసహాయుఁడై చంపు - నని వాలి చేత
వెసఁ బలుమారు నే - సినట్టిదాన
నంతేనివాఁడైన - యర్కతనూజు
నింతయుఁ గైకొను - యిది నేర్పు కొంగఁ
ఈతఁడు మీకార్య - మూడేర్పఁ దలఁచి
ఖ్యాతిఁ బనిచిన - దూతల వినుఁడు
ఎలుగులు వెయికోటు - లిన్నూటుగోట
బలిముఖుల్ వేగున - పనులు మానసులు
వారలు పిలుచునా - వచ్చువానరుల

వార లెవ్వరు గణిం - పఁగ నోపువారు ?
ఆబలంబెల్ల స - హాయంబు గాక
చేబారలిడిఁగ దె - చ్చెదరె జానకిని ?
వానరప్రభురాశి - వారంబులెల్ల
దీనత భయము నొం - దిరి నిన్నుఁజూచి
శాంతమూర్తివి గమ్ము - సభయుఁడౌ నంశు
మంతుకుమారుని - మన్నింపు" మనిన
గౌరవంబు హితంబు - ఘనమును గార్య
కారియు ధర్మయు - క్తంబునై నట్టి
తారానులాపంబు - తనకోపవహ్ని
నారించు జలధార - యైమట్టు పఱుపఁ
దాలిమితో నున్న - తనుజూచి మైని
చేల యూడిచి చల్వ - చేకొన్నయట్లు
వెఱవు దొరంగించి - వేడుకఁగాంచి
దొరతనమున కెల్ల - తోడనైన యట్టి
కాంచనమాలిక - కడనున్న పట్టె
మంచముపై వైచి - యుందహాసమున
మగువలు దాను ల - క్ష్మణుఁ జేరవచ్చి
మొగమెత్తి నయయుక్తి - ముగ నిట్టులనియె

— సుగ్రీవుఁడు లక్ష్మణునితోఁ బ్రసంగించుట —

" తనకు నీకపిరాజ - ధానియుఁ గీర్తి
యును గామినులు గల్మి - యొసఁగినవాఁడు
మీ యన్నగాఁడె ? సౌ - మిత్రి ! యే నట్టి
కార్యంబు మఱచిన - కల్ల సేయుదునె ?

రాముని చిత్తంబు - రా మెఱంగకయె
భూమి నొక్కఁడు సౌఖ్య - మున నుండఁగలఁడె?
ఎల్లి రావణుఁ ద్రుంచి - యింతిఁ జేపట్ట
చల్లఁగా శ్రీరామ - చంద్రుఁడుం డును.
తాళంబులు నగంబు - ధరణియు నొక్క
కోల నాటఁగ నేయు - కోదండపతికి
రావణుఁ డెంత శ - రంబొక్క టేర్చి
కావలసినఁ ద్రుంప - గలఁడు విశ్వంబు!
అట్టివానికి నాస - హాయత యెంత?
చుట్టఱికము చేసి - సులభుఁగాఁ జేయ
రాదని నన్ను గా - రవము సేయుటకుఁ
గాదె వచ్చితి వెఱుఁ - గక వెఱచితిమి
మానసేల నిమిత్త - మాత్రుని నన్నుఁ
బూనింపఁ డెయ్యది - బుద్ధి చేసెదను
విల్లుమోపట్టిన - విశ్వమంతయును
తల్లడింపఁగఁ జేయు - దశరథాత్మజుఁడు
ఒకరితో డాస సే - యునె? నీదు రాక
నకలంక కీర్తులే - నందితి నిపుడు
వెంట వచ్చెదను మీ - విక్రమావళులు
కంటికి మెచ్చుగాఁ - గనుఁగొనవలసి
మందెమేలమున నే - మఱి నీవురాక
ముందుగా నేను రా - ముని సన్నిధికిని
రాకయున్నట్టి నే - రము సహియించి
చేకొని నన్ను ర - క్షింపుమీ యెడల"

అనిపల్కు సౌమిత్రి - యర్కనందనునిఁ
గనుఁగొని కరుణించి - క్రమ్మఱం బలికె

— లక్ష్మణుండు సుగ్రీవుని ననునయించుట. —

"నినువంటి దొర రాము - నికిఁ గల్గుకతన
దనుజుల గెల్చుటెం - తటిపని యింక
ఇంతకార్యంబు మే - మెంచుట నీతి
మంతుఁడవగు నిన్ను - మది నమ్మికాదె?
ఇటునటు బెదరించి - యేరీతినైన
దిటముగ నినుఁ దోడి - తేక మావలన
నేకార్య మీడేఱు? - నెందులో వార
మ కడమాచేత - నయ్యెడిదేమి?
రావణుఁడెక్కడ - రాముని దేవి
చావును బ్రదుకు నె - చ్చట మాకుఁ దెలుసు?
నీబల్మిఁబట్టక - నేము రాక్షసుల
చేబల్మితోడ గె - ల్చెదమటుగాక
యీమాటఁ దలఁపగ - నెయ్యది శక్తి
నీమిత్రుఁగనను బూ - నితి మిట్టిపనికి?
సందేహమేల దు - ర్జయ శౌర్యనిధివి
యెందు నమ్మినవారి - సిడేర్పఁగలవు!
సత్యసంధుఁడవు ప్ర - జారంజకుఁడవు
మత్యుపాయ బలాభి - మానదక్షుఁడవు
యెంతయెంచిన నీకు - నే తగుగాన
నింతటివాఁడని - యెంచి చేరితిమి
యేనన్నమాట నీ - హృదయంబు లోనఁ

బూని నిల్వక యోర్చి - పోషింపుమమ్ము
నీకు రాఘవునకు - నేనొక్కరూప
నాకుఁ దప్పేది ? మ - న్ననకుఁ బాత్రుఁడవు
రాముఁడన్నది మాట - రామునితోడ
నామీఁద మీరొక్క - రన్నది మాట
మీమాటలును జెల్లె - మీ నిలుకడలు
మీమనంబు లెఱుంగు - మిగిలిన వేల ?
కార్యాంతరుఁడ నౌటఁ - గన నేరనైతి
మర్యాద రాముఁడీ - మాటలు విన్న
నేమి పల్కునొ ? తన - కేమి యొగ్గైన ?
నీమీఁద భార మ - న్నియు నీకె తెలుసు
శ్రీరామవిభుఁడు చే - సిన సుకృతంబు
కారణంబుగ దైవ - గతిచేతఁ గాక
యాపద వేళకు - నడ్డమై నిలుచు
నీపాటి చుట్టమె - న్నిన వేఱె కలఁడె ?
మాకుఁ జుట్టము వను - మాట మాత్రంబె
యొకడ భుజబల - ధృతి విక్రమముల
సరివత్తు వెంచినఁ - జాలుదు వీవు
నిరుపమ వానరా - నీక సంగతిని
తామసింపఁగ నేల - తన వెంటరమ్ము
రాముని కడకుఁ గా - ర్యంబులు గలవు.
ఆలిఁ గోల్పోయి యా - యవధుల కెల్లఁ
బాలైన రాముని - పై దయఁ దలఁచి
నాతప్పులెన్నక - నన్ను మన్నించి
ప్రీతుండవగు నీదు - పెంపుఁ దలంచి."

అనుమాట లాలించి - యనిలకుమారుఁ
గనుఁగొని వానరా - గ్రణి యిట్టులనియె.

— సుగ్రీవుఁడు తిరిగి సౌమిత్రితో సంభాషించుట - సీతను వెదకుటకు - వానరసైన్యము బంపుట —

" సేవకావళిని ర - క్షింప శిక్షింపఁ
దావిభుఁడౌట నీ - తౌనాయకుండు
పనిచినఁ దనుకార్య - భరము హేతువుగ
ననవలసినమాట - లనియె లక్ష్మణుఁడు.
అది నాకు భూషణం - బగుఁగాని యేమి
కొదవ యిట్లాడుటల్ - కొదవ యిర్వురకు ?
నాకుఁ బ్రియోక్తు లా - నతి యియ్యఁ దగునె ?
వాకొందు రే కడ - వానికిఁ బోలి ?
స్త్రీలోలుఁడగు నన్నుఁ - జెక్కిలిఁ గొట్టి
పాలుఁ ద్రావించె ద - బ్బరరాక యుండ !
దొరల చిత్తంబు లెం - దునకైన వచ్చుఁ
దరికొద్ది ఖేదమో - దము లేల మనకు ?
ఏమఱియుండరా - దిఁకనైన నీవు
తామసింపక మహేం - ద్ర నగంబునందు
కైలాసహిమ వింధ్య - కనకాచలేంద్ర
కీల పూర్వాస్తకు - త్కీలంబులందు
ఫలభారవినమిత - పాదపగహన
ములయందు మత్తేభ - ముల వోలియున్న
హరిణారుణాసితో - దారగాత్రులను
హరివీరులను మహో - హావజయోన్నతులఁ

గామసంచారులఁ – గామరూపులను
భీమబాహాబలో – పేతుల నెల్లఁ
బిలిపింపుమే మున్న – పిలువనంపితిని
బలశాలులైనట్టి – పడవాళ్ళచేతఁ
గామినీమణులందుఁ – గామభోగములఁ
దామసవృత్తిచే – దంగు వొమ్మనినఁ
దప్పించుకొందు రం – దఱు నిండ్లుమఱిగి
చెప్పించనగు మాట – చెవిసోఁక పలికి
పోయిరా పదిదినం – బులు మీఱఁ జేసి
నాయాజ్ఞ వలికి వా – నరుల రప్పింపు.
ఆ గడువుకు రాని – యట్టివారలను
వేగంబె తల తెగ – వ్రేయుము నీవు
గొబ్బున నొకలక్ష – కోట్ల వానరుల
నిబ్బరంబుగఁ బోవ – నేర్చినవారి
నిందఱి గుఱుతులు – నెఱిఁగినవారి
నెందుఁ బూనిన పను – లీడేర్చు వారి
నంపుమీవన నట్ల – యనుపు వాయుజుని
పంపున బిలదీ – పర్వతగహన
వననిధి ద్వీపది – వ్యవనంబులందు
వనచరావళినెల్ల – వరుసతో వెదకి
వేగుల వారలుఁ – బిలిచిన నలఘు
వేగంబుతోఁ గపి – వీరులందఱును
గాలమృత్యువసంగఁ – గనఁబడి కీలి
కీలయుఁబోలు సు – గ్రీవాజ్ఞచేత
నొకరైన యనుమతి – నుండకవచ్చి

రౌకముహూర్తమున సై - న్యోపేతులగుచు.
అంజనాచలవాసు - లై మూఁడు కోటు
లంజనాసిత వర్ణు - లైన వానరులు
హస్తాచలంబుఁ బా - యక పదికోట్లు
హస్తిలోమాన పచ్చ - నైన వానరులు
కైలాసముననుండి - కదలి నైకోట్లు
వేలంబు తెల్లగా - వియు వానరులు
వేయికోటుల మీఁద - వేఱుగాఁ గెంపు
చాయల వలిగొండ - చక్క వానరులు
కపిశవర్ణంబులు - గనివేయి కోటు
లపుడు వింధ్యాద్రిపై - నమరు వానరులు
క్షీరాబ్ధి కడనుండి - చేరినవారు
నారికేళాశనుల్ - నవ్యతమాల
పల్లవవర్ణులు - పదివేలకోటు
లల్లుక విడిసిరి - యట్టివానరులు
నానానదీగిరి - నదవనాటవుల
నేనాఁడు నుండు న - నేకవానరులు
చేరిన హేమాద్రి - చెంతనున్నట్టి
వీరవానరులను - వేగంబె పిలిచి
యచ్చోట హనుమంతుఁ - డంపినఁ బిలువ
వచ్చిన వేగుల - వానరోత్తములు
హరుఁడు మున్నచ్చోట - యాగంబుఁ జేసి
హరికిఁ దానర్పించు - హవిరన్నరాశి
చెదరు నన్నంబెల్లఁ - జెట్టులై మొలిచి
యదునుగాకయుఁ బండు - నమృతోపమాన

ఫలములం దొక్కటి - భక్షించి రేని
నెలకు నాఁకలి దప్పి - నిద్ర లేదనుచు
విన్నవారగుట న - వ్విపినంబులోన
నున్న ఫలావళు - లూర్చి కైకొనుచు
వెనుక సేనలు రాఁగ - వేగంబె వచ్చి
యినకుమారునితోడ - నివి యిట్టివనుచుఁ
గానుక చేసి యే - కడ నున్న యట్టి
వానరవీరుల - వచ్చెద రనుచు
విన్నపం బొనరింప - విని రవిసుతుఁడు
మన్ననతో బహు - మానంబుఁ జేసి
వారలఁ బనిచిన - వాలిసోదరుని
తో రఘువంశ చం - ద్రుని తమ్ముఁ డనియె
"సంతోషమాయె నీ - సైన్యంబు రాక
యింతటి సామర్థ్య - మేరికిఁ గలదు?
నెమ్మది సరిపోయె - నేనిర్వురమును
రమ్ము పోవుదము శ్రీ - రాముని కడకుఁ
గాక యీమాట - రాఘవునితోఁ బలుకు
మాఁకడ నేపత్తు - నని యంటివేని
యిది బుద్ధి యనుము" న్న - యిక్ష్వాకు కులుని
వదనంబుఁ జూచి వై - వస్వతుఁ డనియె.
"నాకొక యిచ్చయే? - నన్ను రమ్మనిన
రాక యుండుదునె శ్రీ - రాము సన్నిధికి?"

—సౌమిత్రితో సుగ్రీవుఁడు శ్రీరామునిఁ జూడ నేఁగుట :—

అటులె పోవుదమని - యప్పుడు తారు
నటు జూచి 'చతురంత - యానంబుఁ దెమ్ము

వేగ నిచ్చుటకని - వెలఁదుల నెల్ల
నేగతి నేయింట - నెవ్వారలుండ
నియమింప వలయు న - న్నింటికిఁ దగిన
నియతి మనోవర్తి - నిత్యకృత్యములు
నడిపింపఁదగు వారి - నగరి వాకిటను
బడగరంబులకును - బ్రహరిచుట్టుటకుఁ
బట్టణరక్షకా - ర్థత గలవారిఁ
గట్టడ చేసి యే - కార్యంబులకును
తార చెప్పినయట్ల - తనయాజ్ఞ నడవ
నేరు పాటుగఁ జేసి - యిచ్చె నుంగరము
ఆముద్రఁ గైకొని - యలివేణితార
రాముని కార్య ని - ర్వాహంబులకును
దగిన యాలోచనల్ - తనతోడ నడుప
నగునని యన్నియు - సంగీకరించి
యమ్మానవతి వెంట - నతివల నాద
రమ్మున సంతః పు - రమ్మున కనిచి
పయనమై తనమ్రోలఁ - బల్లకి నునుప
జయభేరి వేయించి - శాకునికులను
రప్పించి శుభముహూ - ర్తమున నిల్వెడలి
యప్పుడుప్పొంగు రా - మానుజుఁ జూచి
"యీ పల్లకీమీఁద - నెక్కుఁడు నన్నుఁ
జేపట్టి యేను మీ - సేవ సేయుచును
వెంటవచ్చెద" నన్న - విని లక్ష్మణుండు
దంటగా నతని హ - స్తము కేలఁ బట్టి

యిరువురు నందుపై - నెక్కి యుత్సాహ
భరితులై యన్యోన్య - భాషణంబులను
బ్రమదంబు లందుచుఁ - బణవమృదంగ
ధిమిధిమి ధ్వానంబు - దిక్కులనిండ
కపుల కోలాహల - గంభీరరవము
లపుడు బ్రహ్మాండ మ - ల్లాడంగఁ జేయఁ
గాంచనచ్ఛత్ర ము - క్తాచామరంబు
లంచల లక్ష్మీ స - హాయతఁ దెల్పఁ
గిలకిలారభటిఁ గి - ష్కింధాపురంబు
జలరాశి ఘూర్ణిల్లు - చందమై తోఁప
బురము వెల్వడి రయం - బున రాముఁడున్న
ధరణీధరంబు చెం - త వనంబులోన
బల్లకి డిగి రఘు - పతిఁ జేర నేఁగి
యల్లనఁ గేల్మోడ్చి - యడుగుల వ్రాలు
వానరపతిఁ జూచి - వైదేహిమగఁడు
మానసంభానంద - మగ్నంబు గాఁగ
బదముల వ్రాలు నా - ప్త సహోదరులను
గదిసి లేవఁగనెత్తి - కౌఁగిటఁ జేర్చి
యగ్రభాగమున వా - స్త్రాభినయమున
"సుగ్రీవ! యిచటఁ గూ - ర్చుండు" మటంచు
నానతి యిచ్చిన - నటు సేయు నతని
జానకీజాని ప్ర - జ్ఞాశక్తి పలికె

— రామ సుగ్రీవ సంభాషణము —

"ధర్మార్థములు మదిఁ - దలఁపక యాత్మ
శర్మంబె కోరి యి - చ్ఛాప్రవృత్తి వలనఁ

గామోపభోగ సం - గతి నున్నవాని
నేమిటఁ గొఱగాని - హీనుఁగా నెంచి
యార్యులు నిందింతు - రటుగాన తగవు
మర్యాద నుచిత క - ర్మములాచరించి
మొఱఁగుట ధర్మంబు - మేదినీరుహము
బలుసైన కొమ్మపైఁ - బవళించి యొకఁడు
యేమఱి నిదురించి - యిలఁ బడి వెనకఁ
దా మేను దెలియు చం - దంబగు గాన
కేవలకామంబు - కీడు శాత్రవు
నేవేళఁ గెలువ నూ - హింపఁగవలయు
నట్టిచో దండెత్తి - యసురుల జయింపఁ
బట్టుగుగాన యీ - పట్టున నీవు
నుద్యోగ మేమఱి - యుందురే? యనిన
ఖద్యోతనిభురాముఁ - గని యిట్లనియె.
'పోయిన రాజ్యంబు - పొలఁతియుఁ గలిమి
యోరామయ్య! నీవు నా - కొసఁగితి మొదలఁ
దరువాత నీ సుమి - త్రా కుమారకుఁడు
పరిపాలనము చేసి - పాలించె నిపుడు!
ఉపకారమునకుఁ బ్ర - త్యుపకార మెవ్వఁ
డుపమించి సేయక - యుండునో వాఁడు
నీచుఁడు గాన వ - నేచరావళిని
యేచాయఁ గలవారి - నెల్లను గూర్చి
స్వామి కార్యమునకు - సవదరించితిని.
తామసించిరి నను - తప్పులో గొనుము
కామరూపులు దేవ - గంధర్వపుత్రు

లీమర్కటోత్తము - లీ యెలుఁగులును
దగిన గోలాంగూల - తతులును జాల
మగఁటిమి గలవారు - మహిమ గలారు
మేరువింధ్యాది భూ - మీరుహశ్రేణి
వీరేలుదురు చుట్టు - విడిసియున్నారు.
అందఱు రణశూరు - లందఱు మేరు
మందరశైలోప - మానాపఘనులు.
అందులో శతకోటు - లధిపతుల్ వారి
యందొక్కఁ డొకఁడు - కోట్యర్బుదశంఖ
పద్మమహాపద్మ - బలసమన్వితులు !
పద్మబాంధవునైనఁ - బట్టి తేఁగలరు
రావణుఁ బుత్రమి - త్ర కళత్రయుతము
గా వధియింప నొ - క్కఁడె చాలువాఁడు
'సీతను దెచ్చెద - సెలవిమ్ము తనకు
సీతటి' సనియుత్స - హించినవారు
'ఏమెఱుఁగని యట్ట - యిరవులు గలవె ?
భూమిజ నిపుడె చూ - పుదు' మనువారు
'ఈపాటి పనికైన - నేను రానేల ?
నాపంపునకుఁ జాలు - నా ?' యనువారు
రావణుఁ దెచ్చెదా - రాముని యెదుర
నీవేళ నేనుంతు - నే !' యనువారు
నయ్యున్న యీవాన - రావళిఁ జూడు
మయ్యా ! నీమదిలోని - యలమటల్ దీఱు '?
ననియిట్లు సుగ్రీవుఁ - డాడిన మాట
విని యుత్పలశ్యామ - విమలగాత్రుండు

శ్రీరామచంద్రుండు - చిత్తంబు పొదల
సూరతనూభవుఁ - జూచి యిట్లనియె
" వాన లింద్రుఁడు మహి - వర్షించుటయును
భానుమండల మాత - పంబుఁ గాయుటయు
నిందు చందురుఁడు వె - న్నెలలు గాయుటయు
నండజస్వామి వి - హాయసంబునను
జరియించుటయు నీని - జ స్వభావములు
హరినాథ! యిట్టిమ - హాను భావములు
నొరులకునుపకార - మొనరింప నీకుఁ
బరమ ధర్మంబైన - ప్రకృతి గుణంబు!
ఇదినీకు నెచ్చని - యెన్న నేమిటికి?
మదినీవు దలఁచిన - మాత్ర నే మాకు
సీతయుఁ జేకూడుఁ - జింతితార్థములు
చేతిలో నున్నవి - సిద్ధమింతయును
నిన్నుఁ బోలిన యట్టి - నెయ్యుఁడు గలుగ
నన్నిక యేల? మా - కే కార్యములకు
శచి ననుహ్లాద రా - క్షస నాథుచేత
నచలవృత్తిపులోముఁ - డాది కాలమునఁ
జెఱపట్టి తెప్పించి - చేసి యింద్రుచేత
మరణంబు నొందిన - మాడ్కి రావణుఁడు
నీదండి గలుగ నా - నిశితాస్త్రములను
మేదినిపై గూలు - మిత్రులతోడ "
అనుమాట లాడుచో - నర్క మండలము
పెనుధూళి నడ్డపు - బిల్ల చందమునఁ
గనిపించి యేమియుఁ - గనిపించరాక

పెను చీకటులు దిశా - బృందంబుఁ గప్పె
ఏడు వారాసులు - నేకమై పొరలు
జాడ భోరున మహా - శబ్దంబు మింట
నిండె! సంతతిలోన - నిలిచెఁ గట్టెదురఁ

— సీతను వెదకుటకు వానరనాయకులు తమ తమ బలములతో వచ్చుట —

గొండలీనిన యట్ల - కోఁతుల బారు
నదులఁ గాననముల - నలినాకరముల
నదములయందు న - నంతంబులైన
కమల కేసర శశాం - కరవిప్రకాశు
లమరాంశజుల పౌజు - లటు గనుపింప
జతఁగూడు మూఁకతో - శార్దూలసింహ
శతబలియైనట్టి - శతబలి యపుడు
కోటాను కోటులా - కోఁతులు మింట
దాఁటుచు రాఁగ ముం - దఱఁ బొడగనియెఁ
దరువాత నీలాంబు - దంబులంబోలు
హరులతో వానరా - ధ్యక్షుని సూను
తారాగరుండు ప్ర - తాపపావకుల
వీరవానరుల వే - వేలఁ గోటులను
గూరుచుకొని వచ్చి - కోదండపాణిఁ
జేరి యొక్కసలాము - జేసితాఁ జనియె
రుమ తండ్రియును నట్ల - రోహితవర్ణ
సమధిక గాత్రుల - సంఖ్యాభిరతులఁ

గొందలు వానర – కోటులఁ గూర్చి
పొందికగాఁ వచ్చి – పొడఁగని పోయె
పద్మకేసర విభా – పటలాంగుఁ డగుచుఁ
బద్మంబుపై లక్ష – బలము సేవింప
సామీరితండ్రి కే – సరియనువాఁడు
స్వామికి వచ్చి మ – స్తము వాంచి మ్రొక్కె
కపివరుల్ కోట్ల సం – ఖ్యలుగాఁగఁ గొలువ
నపుడు వేవేగ గ – వాక్షుఁడు వచ్చి
కండెముల్ దిరిగిన – కరములు మొగిచి
దండదానపు నడఁ – దావచ్చి మ్రొక్కె
వేత తానొక రెండు – వేలుఁ గోటులకు
వీరులౌ భల్లూక – విభులతోఁ గూడి
తామ్రాననము ప్రభా – తదిశను బోల
ధూమ్రుండు చుట్టల – తో వచ్చి కనియె
పర్వతాకారుఁడై – పద మూఁడు కోట్ల
పర్వతచరవీర – బలముతో వచ్చి
పనసుఁడు తనపేరు – భట్లు పద్యముల
వినుతింపఁ జేమోడ్చి – వెనుకకుఁ బోయెఁ
గాటుక కటికప్పుఁ – గలమేనితోడ
నాటియా నంజనా – చలము పీనికిని
ననఁ బదికోట్ల మ – హాకపిశ్రేణి
తనుఁగొల్వ నీలుఁడౌ – దల మ్రొక్కి చనియె
ఐదుకోటుల వాన – రాధిపు ల్గొల్వఁ
గై దండతో సము – ఖము దాఁకవచ్చి
కోఁతి కట్టికలు సాం – గు భళా! యనంగ

నేత్రాము వలెఁ జేతు - లెత్తి తా మ్రొక్కి
గవయుఁడు తనమూఁకఁ - గడకోసరించి
యవనిజావిభుని డా - యఁగవచ్చి నిలిచె
వేయికోటుల కపి - వీరులతోడఁ
జేయి మొగిడ్చి ని - ల్చెను దధిముఖుఁడు
నిండు వేడుక నాశ్వి - నేయనందనులు
వెండియు మైందవి - ద్వివిదులఁ వారు
వేయేసి కోటుల - వీర వానరులు
పాయక కొల్వ వెం - బడిఁబొడగనిరి
మూఁడు కోటుల కపి - ముఖ్యులతోడఁ
గూడి గజుండు తాఁ - గొల్వులో నిలిచె
పదికోట్లు భల్లూక - పతులు సేవింప
వదలని ధృతి జాంబ - వంతుండు వచ్చె
నారుమణ్వంతుఁడు - నప్పుడు వచ్చె
నూరుకోటుల కపీం - ద్రులు చేరికొల్వ
వేయికోటుల కపి - విభులతో వజ్ర
కాయులతో వచ్చె - గంధమాదనుఁడు.
నమ్మిన పదికోట్లు - నగచరుల్ గొల్వ
ముమ్మరమ్ముగ దధి - ముఖుఁడు కేల్మోగిచె
జంభారి విభవులై - శరభుఁడు వహ్ని
రంభుఁడు కుముదుఁడు - ప్రబల విక్రములు
కీశుల లెక్క మి - క్కిలిగాఁగ రాఘ
వేశునిఁ బొడఁగని - యేఁగిరవ్వలికి
శతశంఖ బలము ని - జంబుగాఁ గొల్వ
క్షితిసుతావిభుని ద - ర్శించె నంగదుఁడు

కోరితారుఁడు దుర్ము - ఖుం డింద్రభానుఁ
డేరుపాటుగ వార - నేక కోటులగు
వానరావళిఁ గూడి - వచ్చి రాఘవునిఁ
గానక లిడుపోడఁ - గని పోయిరపుడు
లాఁతివారలుగాక - లావరులైన
కోఁతులు తనువేయి - కోటులు గొల్వఁ
జాఁగిలి మ్రొక్కి యం - జలి చేసెనంత
నాగరికుం డంజ - నా నందనుండు!
నుతబలుల్ లక్షయు - నూఱు కోటులును
జితిపడినట్టికై - జీతంబువారు
వానరుల్ సేవింప - వచ్చి నలుండు
జానకీవిభున కం - జలి చేసి నిలిచె
ఈరీతి వానరు - లిలయు నింగియును
నీరంధ్రముగ దిశల్ - నిండ గర్జలను
నుప్పరం బెగయుచు - నుర్వి చలింపఁ
గుప్పించుచును మీఁటి - కొప్పరింపుచును
వాలంబు లార్చుచు - వచ్చి భాస్కరుని
నీలమేఘంబులు - నిండుకొన్నట్లు
సుగ్రీవు నెదుట పౌ - జులుదీర రాఘ
వాగ్రణి మదికి న - త్యానందమయ్యె
అందఱ నందందు - నమరించి భాను
నందనుఁడా రఘు - నాయకుఁ జేరి
"దేవ! యీవనుల న - ద్రిప్రదేశముల
నావారి విడియించి - నాఁడఁ బాళెముల
కపులెల్ల వచ్చిరి - గాన రావణుని

కపుడె సూరును నిండె! - నపనిజ చేరె!
సందియంబేల? ని - జమ్ముగా నమ్ము
మందఱ సేనల - యలవి యేర్పఱుప
నెంతవారును నేర - రిందఱు శౌర్య
వంతులు సురదాన - వజయాభిరతులు!
ఈవానరుల కన్న - నినుమడి నాడు
సేవకులయి కై - జీతంపు మూఁక
కడలతోఁకల గోచి - కడలి నీరెల్ల
కడలను జల్లి యిం - కఁగఁ జేయఁగలరు
మేని సోఁకుల చేత - మేదినీధరవి
తానంబుఁ దూఱు పి - త్తఁగఁ జేయఁగలరు
ధరణీతలంబు పా - తాళంబు మోవ
నురగేంద్రుతోఁ ద్రొక్కి - యునుపంగఁ గలరు
అటునిటు గాలియు - ల్లాడంగనక
ఘటికలో దెసకట్టు - కట్టంగఁ గలరు
నింగిపైఁ జరియింప - నీటిలో మెలఁగఁ
జంగున ద్వీపముల్ - చౌకళింపంగ
దొడ్డకొండలు దెచ్చి - దొంతరల్ వెట్ట
నడ్డి యేడది! చేత - నగు వీరికెల్ల!
నీదుకార్యమునకు - నేఁడెల్లవారు
నో దేవ! పనివూని - యున్నారు వచ్చి
కామసంచారులుఁ - గామరూపకులుఁ
గామితార్థప్రదుల్ - కామవర్జితులు
పనిఁగొమ్ము వీరలఁ - బనిచి" నావుఁడును
విని భానుతనయుని - వీక్షించి యాతఁ

డాలింగిన మొనర్చి - "యాప్తులతోడ
నాలోచనము చేసి - యపనిజం దెచ్చు
పని నీకుం దీరని - భారంబు! మాకుం
బనియేమి? సేయని - పలుకం నేరుతుము
నీకెట్లు సరిపోయె - నీవది చేసి
కైకొను మాకల్ప - కమనీయకీర్తి"
అనవిని సుగ్రీవుం - డట్లకాకనుచు
వినతుని వానర - వీరునిం బిలిచి

— సుగ్రీవుండు వానరనాయకులను నాల్గు దిక్కులకు సీతను వెదకుటకు నాజ్ఞాపించుట —

"శూరుల భాస్కర - సోమసంతతుల
ధీరుల వానరా - ధిపులం గూడి
తూర్పుగాం బొమ్ము - తొలుత జాహ్నవిని
మీటి యాసరయువు - మించి కౌశికియు
యమునయుం గనుంగొని - యామున నగముం
గ్రమియించి సింధువుం - గని సరస్వతినిం
జూచి సరావతి - శోణనదంబు
నాచాయ బ్రహ్మమా - లాపగల్ వెదకి
మాళవకోసల - మగధ విదేహ
గౌళకాశీపుండ్ర - కౌశికముఖ్య
దేశంబులందు వై - దేహిని వెదకి
కోశగారంబు గ - న్గొని వెండిగనులు
గనుంగొని మందరా - గమున వసించు
వంచరవిభుల న - వ్వలిదిశ కనిచి

యాయసముఖపురు - షాదకిరాత
కాయాద హేమాంగ - కర్ణ చూలులను
బరికించి పచ్చిచేఁ - పలు దినువారి
నరయుచు జలవాసు - లైన వారలను
ద్వీపవాసులను న - దీప్రాంతభూమిఁ
జూపట్టు పురములు - చూచి శోధించి
సాఁగి యవద్వీప - సౌవర్ణకుడ్య
భాగముల్ నీహార - పర్వతంబరసి
రత్నవంతము సాగ - రంబు వేలయును
యత్నంబుతోఁ జట్టి - యచటి ద్వీపములు
మరు దేశముల దధి - మత్పర్వతంబు
నరసి యచ్చటనుండి - యతిశోణమైన
శరనిధి దాఁటి య - చ్చట బ్రహ్మచేత
వరమంది తమచాయ - వచ్చినవారి
యిరుగడ మింటిపై - నేఁగఁగ నీళ
తరిమి నీడలుపట్టి - తమరు గ్రింగుచును
ఛాయాపహారిదు - ష్కృతులనుఁ బోలు
ఛాయాగ్రహములపైఁ - జనక కేడించి
యా వారినిధి దాఁటి - యవలఁ బ్లక్షాఖ్య
చే వెలసిన దీవిఁ - జేరి శోధించి
ముందఱనిక్షు స - ముద్రంబుఁ జూచి,
యందులో ద్వీపంబు - లన్నియు వెదకి,
గుల్మలతావృతు - కోటి భాసురము
శాల్మలీ ద్వీపంబు - సరణిగా నరసి,
మధురసవార్ధి నే - మఱక శోధించి,

మధువాని యలయుక - మాని యచ్చోట
గరిడి మాడ్కిని విశ్వ - కర్మనిర్మించు
గరుడని యింటి న - ల్గడ విచారించి
యందు భాస్కరునితో - ననిఁ జేసి పాలియు
మందేహులుండు ధా - మము విచారించి,
యవల గుశద్వీప - మారసి, నేతి
రవణంబు గల సము - ద్రంబున వెదకి,
క్రౌంచంబనెడి దీవిఁ - గాంచి శోధించి,
మించి పై దధివార్ధి - మీఱి యాకెలన
మొనయు శాకద్వీప - మునకేఁగి యవలఁ
దనరెడు పాలసం - ద్రము విచారించి,
యానడుమను వృష - భాచలంబరసి,
పైనున్న కాంచన - పద్మసరంబు
తెరవుగాఁ బుష్కర - ద్వీపంబుఁ జేరి
సరణి సుదర్శన - సరసి శోధించి,
యందుఁ గ్రీడించు వి - ద్యాధరయక్ష
బృందారకులఁ జూచి - పేర్కొని మ్రొక్కి
యాకడ శుద్ధోద - కాంబుధిఁ జూచి,
వ్యాకీర్ణమైన యా - ర్వక్రోధజనిత
బాడబానల శిఖా - పటలంబు నిగుడు
జాడగాఁ జనక యె - చ్చరికతోఁ దొలఁగి
యాతరి వివిధభూ - తారావములకు
భీతినొందక హేమ - పృథివీధరంబు
చేరి యానగముపై - శేషుని ధరణి
భారనిర్వాహు నీల - పరిధాను వేయి

తలలొప్ప వానిఁ జం - ద్రప్రభాగాత్రు
నలఘునిఁ ద్రిపటి స - మన్వితకనక
తాళధ్వజునిఁజూచి - దండనే యుదయ
శైలంబుఁ జేరి యో - జనమాత్రమునకుఁ
దగినట్టి వెడలుపు - దశయోజనములు
తెగయును గలుగు వే - దిక దానఁజూచి,
సౌమనసంబనఁ - జనినట్టి దిన్నె
హేమమయంబయి - యెసఁగుచో నచట
నాదిఁ ద్రివిక్రముఁ - డందుపై నొక్క
పాదంబు మేరువు - పై నొక్కయడుగు
నిలిపినాఁ డక్కొండ - నెళవు తూరుపున
బిలమా రసాతలా - భీలమై యుండు
నాజాడగావచ్చు - నర్కుఁడా గట్టు
పైజంబు వొక్కటి - ప్రబలి మిన్నందు
నుదయవేళలయందు - నుష్ణమయూఖుఁ
డది చుట్టివచ్చు న - య్యావనీరుహంబు
శాఖలఁ దపములు - సలుపుచుండుదురు
వైఖానసుల్ ముని - వాలఖిల్యులును
నాయుదయాద్రిపై - నరసి, యవ్వలికిఁ
బోయి సుదర్శన - పుణ్యనామంబు
మిక్కిలి యగు దీవి - మీరు వీక్షించి
యక్కడ నరుణాసం - ధ్యాప్రకాశమునఁ
గనుపించు చోటులఁ - గని రండు మీఁటి
చనకుఁ డవ్వలఁ దమి - స్రమునిండి యుండు
పొమ్ము మాఁకలఁగూడి - పోయి శోధించి

క్రమ్మరు మొకనెల - గడువు చేసితిని.
ఆ మితికిని రాక - యాజ్ఞ గైకొనక
తామసించినవాఁడు - దండనీయుండు

—. వినతుఁడు తూర్పుదిశకు వెడలుట —

వేగఁ బొమ్మని'' పల్క - వినతుఁడు తూర్పు
సాఁగిపోయెను దన - సైన్యంబుతోడ. 4440
తరువాత నీలమైం - దద్వివిదులను
గరువలి పట్టిని - గజుని గవాక్షు
శరభసుహోత్రుల - జాంబవద్గజుల
శరగుల్మ విజయకే - సరిపుంగవులను
గంధమాదనుని యం - గదుని సుషేణు
గంధేభసత్త్వను - ల్కాముఖు నలుని
రమ్మని తగినకా - ర్యంబది గాన
సమ్మతపడఁ బల్కి - జతకట్టుచేసి
" దక్షులు మీరు సీ - తను వెదకుటకు
దక్షిణదిశకు నిం - దఱుఁగూడి పొండు 4450

—: అంగదాదులు దక్షిణ దిశకు వెడలుట :—

వానరోత్తములార! - నైశిఖరములు
నానర్మదయును విం - ధ్యము భోగవతియు
వరదమేఖల శరా - వతి కృష్ణవేణిఁ
బరికింపుచును మహా - భాగయు దాఁటి
కదలి దశార్ణన - గరములు చూచి
కదిసి కౌశిక కళిం - గ ఋషీకములును

దరసి మాహిషికా వి - దర్భదేశములు
నరసి యవ్వల దండ - కారణ్యమునకుఁ
బోయి గోదావరిఁ - బొడగని యవలి
చాయగా నంధ్ర దే - శంబెల్లఁ జూచి
చోళకేరళపాండ్య - శూరసేనములు
గౌళదేశమహోము - ఖమహీధరంబుఁ
గ్రమియించి యవ్వలఁ - గావేరి దాఁటి,
యమరు గంధపు కొండ - యండకుఁ జేరి,
యామలయాద్రిఁ బా - యని యగస్త్యునకుఁ
జేమోడ్చి యాయన - చేఁ జూపినట్టి
నెలవునఁ దామ్ర ప - ర్ణీనది దాఁటి
యిల నెన్నఁదగిన మ - హేంద్ర పర్వతము
భావింపుఁ డచ్చటి - పర్వకాలముల
దేవతానాథుఁ డెం - తే వేడ్క వచ్చు
కనుఁగొనుఁ డలపాండ్య - కనకకవాట
మన మీఱునది దక్షి - ణాంబుధి చెంతఁ
గాలూఁది నిలువ నే - కడ నాసలేక
యాలంక శతయోజ - నావధియైన
నడిమి వారాశిలో - నఁ ద్రికూటమనెడు
పొడవైన గట్టుపైఁ - బొలుపు వహించు
నదె రావణస్థాన - మచ్చోటఁ గలయ
వెదకుఁడు రాముదే - వేరి నేమఱక
అంగారక యనంగ - నాసురి లంక
సంగడి నది యుండు - ఛాయాగ్రహంబు

అచ్ఛోట నుండునో - యని మీకుఁ దెలియ
నిచ్చలోఁ గడు సంశ - యించి పల్కెదను
గట్టిగా శోధించి - కడలికి నవలి
గట్టునఁ బుష్పిత - కనకంబుఁ జేరి
యందొక్క రాజతా - యత శృంగ మొప్పు
నింద్రుఁ డయ్యెడఁ జరి - యించు నెల్లపుడు
నొక శిఖరము కన - కోజ్జ్వలంబగుచు
నకళంక మహిమ సూ - ర్యనివాసమయ్యెఁ
బాపాత్ములకుఁ గానఁ - బడదా నగంబు
చూపట్టునెడ మ్రొక్కి - చూడుఁడా నెలవు,
దాని యవ్వలఁ జతు - ర్దశ యోజనములఁ
దానొప్పు సూర్యవం - తము పేరి నగము
వైద్యుతంబను కొండ - వరలు నాదండ
హృద్యమై తగు సెల - యేరులచేత
స్థిరముగా నాదిమ - శిల్పి నిర్మితినిఁ
గర మొప్పు నచట న - గస్త్యుని నగము.
అది కాంచనమయంబు - నామడ వెళపు
పది యోజనముల నే - ర్పడు పొడవగుచుఁ
దొరెఁ గొప్పు భోగవ - తీ సౌజ్ఞచేతఁ
పురము రంజిలు నది - భుజగులకెల్ల
వాసమై తనరు నే - వల నది యేలు
వాసుకి యను మహా - వ్యాళవల్లభుఁడు
ఆచెంత వృషభాద్రి - యను నొప్పు నందు
నేచాయఁ బరిమళా - నేక వస్తువులు
గోరోచనాగరు - కుంకుమమృగమ

దారూఢ రాసుల - యగ్రభాగములు
పదివేలు రోహితుఁ - డనెడి గంధర్వుఁ
డెదురెందు లేనియు - హీన శౌర్యమున
దక్షుఁడు వాని ప్ర - ధానులు శుకుఁడు
చక్షువుగ్రామణి - శైలూషు లనఁగ
నలువురు గాతురు - న్నతబలు లట్టి
పొలిమేర చెంగటఁ - బోక వర్తిలుఁడు
ఆవలఁ బితృలోక - మట యమపురము
పోవరాఁదగుట గొ - బ్బున మీరు మరలి
రండొక్క మాస ప - ర్యంతంబులోనఁ!
బొండెవ్వఁడైన భూ - పుత్రినిఁ జూచి
వచ్చిన వానికి - వలసిన విచ్చి
యిచ్చెద సగము నే - యేలు రాజ్యమున
నాదు ప్రాణములక - న్న హితుండు వాఁడు
వైదేహి యున్నట్టి - వార్తఁ దెచ్చినను,
నెలకు రానట్టి వా - ని వధింతు నేను
గెలుఁడు పొండ''నుచుఁ బ - ల్కి యనంతరమున

—: సుషేణుఁడు పడమటి దిక్కునకు వెడలుట —

ఘనుని సుషేణునిఁ - గాంచి " రా ! మామ !"
యనుచు నల్లుఁడు గాన - నడుగుల వ్రాలి,
" ఈమరీచి కుమారు - లెల్ల నత్యంత
భీమపరాక్రమో - పేతులౌవారు !
అంతటికన్న నీ - యర్యముల్ శౌర్య
వంతులు నీవెంట - వత్తు రీ రెండు

లక్షలతో నీవు - లక్ష్మణాగ్రజునిఁ
బక్షీకరించి యీ - పడమటి దిశకుఁ
జనుము సీతను గాంచి - చనుదెమ్ము మఱల
వినుము మార్గంబు నే - విన్నవించెదను.
ఎలమి సురాష్ట్ర బా - హ్లీకశూరదేశ
ములు పురంబులు వనం - బులు వెదకుచును
బడమరఁ బ్రవహించు - పావన నదులు
పొడగని యచటి త - పోవనావళుల
జాడగా పడమటి - జలరాశి నారి
కేడవుఁ దోఁపులఁ - గ్రీడించి చెంతఁ
జీకటి తోఁపులు - జేరి యచ్చోట
నాఁకలిదప్పులు - నలమటల్ దీఱి
మురజ జటీపట్ట - ములు సంగలోహ
పుర మవంతియుఁ గాంచి - భూమిజ వెదకి
శతశిఖరముల కాం - చనపర్వతంబు
జతనంబుతోఁ జేరి - శరభవరాహ
వేదండసింహాది - వివిధ జంతువుల
యాదండఁ జేరక - యణఁకువ నేఁగి
పడమటిదిశ వజ్ర - పర్వతంబునకు
నడచుచో నిరువది - నాలుఁగుకోట్ల
గంధర్వులుండుర - క్కడ వారి మీరు
సంధింపఁ బోవక - సాధారణముగ
వీరు వానరులన - వెదకుఁ డాకొండ
నూఱు యోజనము లం - దును జనకజను.
అవలఁ జని సహ - స్రారచక్రంబు

గావించె మును విశ్వ - కర్మ యచ్చోట
నది చక్రవన్నామ - కావనీధరము
వెదకుఁ డచ్చట దైత్య - విభుఁడొక్కరుండు
సాహసాఢ్యుఁడు పంచ - జనుఁడు వసింప
నాహరి గరుడవా - హనుఁడౌచు వచ్చి
యాచక్రమున వాని - యాదలఁ ద్రుంచి
భూచక్రమున నైచి - బొందుగలోన
శల్యమై తగు పాంచ - జన్యంబు భువన
కల్యాణకరము దాఁ - గైకొని యవియె
తనకుఁ గైదువులుగా - దామోదరుండు
చనియె మీరాచక్ర - శైలంబు వెదకి
యాజాడఁ జనుచోట - నరువదినాల్గు
యోజనంబులమేర - నొప్పువరాహ
శైలంబునందుఁ గాం - చనరత్న శిఖర
జాలంబు ప్రాగ్జ్యోతి - షపురంబుఁ జుట్టి
యెసఁగు నాగిరి దుర్గ - మెలెడు నట్టి
యసురవల్లభు నర - కాసురుఁడుండ్రు.
అది మీఱి మేఘవ - దాఖ్యపర్వతము
చదలు మోచిన శృంగ - చయములచేతఁ
బరగు మున్నది యింద్రుఁ - బట్టంబు గట్టు
పరమోత్సవము వేళ - భద్రాసనంబు!
అండగా నది చుట్టి - యరువదివేలు
కొండలు సౌవర్ణ - కూటముల్ గలిగి
మెఱయు నాచెంత నే - మేరువు దాని
యఱుతఁ బ్రకాశించు - నస్తాచలంబు.

అచటికి రవి చేర - నఖిల దేవతలు
నచలితప్రీతి సా - యంసంధ్య యనుచు
నియమముల్ దీర్తురు - నిర్జరనగము
పటుయోజనంబులు - పదివేల మేరఁ
గ్రుంకుడు గొండయె - క్కుఁడు వడితోడి
పంకజాప్తుని తేరు - పఱచు నింతయును
గడియలో మును విశ్వ - కర్మ యక్కొంగ
పొడవున నిర్మించెఁ - బురవరం బొకటి!
అల మేరు భూధరా - స్తాచలమధ్య
తలమున బంగారు - తాఁటి మ్రానొకటి
పది కొమ్మలను హేమ - ఫలములచేతఁ
జదలు మోచును మేరు - సావర్ణి యనెడు
నొకఋషి యచ్చోట - నున్నాఁడు మీర
లకలంక భక్తితో - నతనికి మ్రొక్కి
యావల నంధకా - రావృతంబగుట
పోవక మఱలుఁడు - భూపుత్రి వెదకి
మితముఁ దప్పక రండు - మీ పుత్రి తార
హితమని తనమది - నెంచు నిత్తెఱఁగు!”
అని సుషేణుని బంచి - యపుడుత్తరముగ
జనకజ నీక్షింప - శతబలి ముఖులు
సేవించు శతబలిఁ - జేరంగఁ బిలిచి
కేవల ప్రీతి సు - గ్రీవుఁ డిట్లనియె.

— సుగ్రీవుఁడు శతబలి నుత్తరదిశకు సీతను వెదుకఁబంపుట —

“లక్షవానరులు గొ - ల్వఁగ సీతవెదక
యక్షేశు దిక్కుగా - నరుగుము నీవు

నీచేత శ్రీరాము - ని ఋణంబుఁ దీర్చి
యాచంద్రతారక - ఖ్యాతిఁ గాంచెదను!
సెలవిచ్చితిని శూర - సేనపుళింద
ములు జూచి ప్రస్థలం - బును భరతమును
కురుమద్ర కాంభోజ - కోసల యవన
కరహాటశక బాహ్లి - కంబులు జనక
పారసీకావంతి - భాగంబులెల్ల
నారసి తుహినాద్రి - కరిగి యవ్వలను
గాలపర్వత హేమ - గర్భసుదర్శ
నాలోకనమునఁ గృ - తార్థులై వెదకి
దేవసగముఁ జేరి - ధీయుతులై మీఁద
లావల శతయోజ - నాయత ధరణి
మరుభూమిగాన యే - మఱక యవ్వలను
హారనివాసము రజ - తాద్రి శోధించి
యలకాపురంబు య - క్షాధీశుఁడున్న
నెలవందుఁ గనుసీయ - నీరంబుచేత
నమరు విశాలస - రోంబు పానమున
శ్రమమెల్లఁ దీరి క్రౌంచ - బిలంబుఁజూచి
మఱికామశైలంబు - మానససరము
దరిసి మైనాక భూ - ధరమును మయుని
యిరవు విచారించి - యేఁగి యచ్చోటఁ
దిరుగు గుఱ్ఱపుమోము - తెఱవలఁ జూచి
వారి చెంగటనున్న - వాలఖిల్యులనుఁ
జేరి ప్రణామంబుఁ - జేసిజానకినిఁ

గనిపింపఁ డనుచు వై - ఖానస నగముఁ
గని సార్వభౌము ది - గ్గజము నీక్షించి
కరణీశతంబుతోఁ - గలసి యాకరటి
చరియించుఁ జేరఁగఁ - జనక యాకెలన
వెదురు గుంపులు నట - వీ ప్రదేశములు
నదులను బసిఁడి కొం - డలు విచారించి
పోయి యుత్తరకురు - భూములయందుఁ
బాయక యిష్టార్థ - ఫలదంబు లగుచుఁ
గలధౌతమయములై - కనుపట్టువృక్ష
ములను నిత్యానంద - ములఁ గూడియున్న
పుణ్యదంపతులనుఁ - బొడగని యత్య
గణ్యమా సోమన - గంబు చెంగటను
నావాస మొనరించు - నఖిల దేవతల
సేవించి యుత్తర - సింధువుఁ గాంచి
యంతట మఱలి రం - డవలికి నరుగ
నెంతవారికిఁ దీర - దిప్పుడే కదలి
పొందు ముప్పది దినం - బులకును మరలి
రండు రాకున్న నే - రము వచ్చు మీకు
హితము సేయుదు నేను - నీరాఘవులకు
సతతంబు" నని పల్కి - శతబలిఁ బనిచి
యందఱిలోపల - హనుమంతుఁ జూచి
యిందు రమ్మని పిల్చి - యేకాంతమునను
కార్యసాధకుఁడని - కడు నిశ్చయించి
యర్యమ తనయుఁ డి - ట్లని పల్కె నపుడు

— హనుమంతుని సుగ్రీవుఁడు దక్షిణదిశకుఁబంపుట :—

"జగతిని దిక్కుల - జలధులయందు
గగనభాగమున స్వ - ర్గరసాతలముల
నీగమనంబెందు - నిర్నిరోధంబు
వేగంబు వాక్చిత్త - వృత్త్యాధికంబు
నప్రతిహతము నీ - యతులిత శౌర్య
మప్రమేయము నీమ - హాబాహుశక్తి
వనపర్వతద్వీప - వసుధాంబునిధులఁ
గని మున్ను నీవెఱుఁ - గనియవి లేవు
యక్ష గంధర్వ వి - ద్యాధర సిద్ధ
రాక్షసులకు నిల్వ - రాదు నీయెదుర
లలిత తేజోవేగ - లాఘవ సత్త్వ
ముల నీకు సరిలేరు - ముల్లోకములను!
అనిలుఁడు గాఁడు నీ - యంతటివాఁడు
జనకునికీ శక్తి - శతగుణాధికము!
అతిబుద్ధిచే నుపా - య బలంబుచేతఁ
బ్రతిలేని వాఁడవ - భంగ శీలుఁడవు
మృతిలేని వాఁడవు - మేనికి నస్త్ర
హతిలేని వాఁడవ - పాయ దూరుఁడవు
లక్షిత దేశకా - లజ్ఞాన నీతి
దక్షుఁడ వతివ్రజ - తరశరీరుఁడవు!
అన్న! నీవెట్లైన - నవనిజఁ జూచి
నన్ను రాఘవునిఁ బ్రా - ణములతో నునుపు
మిందఱ బ్రతుకుల - కీవె కారణము
ముందఱ నీమనం - బునఁ దోఁచినట్లు

శోధించి వైదేహిఁ - జూచి వచ్చినను
సాధింప నేర్తువ - క్షయము పుణ్యంబు
కదిలి స్వామికార్య - కర్తవు నీవు
పదువురు నీమాట - పలుకులోవారు
నిన్నె నమ్మితి రాము - ని పదమ్ములాన
వన్నె వాసియుఁ దెమ్ము - వానరావళికి ! ”
అనిపల్కి యాదొర - యందఱు వినఁగఁ
గనిపించి మఱియు నీ - క్రమముగాఁ బలికి

—. శ్రీరాముఁడు హనుమంతునకుఁ దనముద్దు
టుంగరమిచ్చుట —

పొమ్మన్న రాముఁ - డప్పుడు విచారించి
యిమ్మారుతాత్మజుఁ - డిట్టివాఁడనుచు
మొదినుంచి యపుడను - మానంబు లేక
యిది కార్యమనుచు నా - మాంకితంబైన
యనుమతి రాముఁడూ - హించి లక్ష్మణుని
తన కడవ్రేలి కుం - దనపు టుంగరము
‘ పట్టము తరువాత - బ్రహ్మ పట్టంబు
గట్టెదని ’ కని - కట్టడ సేయు
రీతిగా నంజనా - ప్రియ కుమారకుని
చేతికి నిచ్చి “ మా - సీతను నీవు
పొడగన్న యప్పుడా - భూపుత్రి నిన్నుఁ
గడునమ్మ నేరదు - గావున నీవు
యీ ముద్దుటుంగర - మిచ్చి యిచ్చోటి
సేమంబులెల్ల వ - చింపుదు వెనుక

నిన్ను సుగ్రీవుఁడు - నియమించినట్టి
యెన్నికయును నాదు - హృదయ వర్తనము
వదన వికాస భా - సము నిగీతంబు
చెదర నీయక కార్య - సిద్ధిఁ దెల్పెడును
చను'' మన్నఁ గరములు - సాఁచి యుంగరము
వినయంబుతో నంది - వినతుఁడై లేచి
చేనున్న ముద్రిక - శిరసుపై నుంచి
వానరప్రభులుకై - వారము ల్సేయ
వలుద చుక్కలలోని - వనజారి యనఁగ
వెలయుచు నుత్సాహ - విశదాత్ముఁడగుచు
'నీవానరాధీశు - లీవును గూడి
రావణు నగరి ధ - రాపుత్రిఁ జూచి
గెలిచి రండను' చు సు - గ్రీవుఁడు మఱియుఁ
బలికి పొమ్మనవుఁడు - ప్లవగ నాయకులు
ఎందెందు సుగ్రీవుఁ - డెవ్వారిఁ బనిచె
నందందు పయనమై - యప్పుడే కదలి
ధరయు నింగియు నిండి - దాఁటుచు మిడుత
పరివోలి దిశలు కం - పము నంద నడచి
పోయిన' నెప్పుడె - ప్పుడు నెలవచ్చు
నీయెడ వేగింతు - వేనింక' ననుచు
సౌమిత్రి గూడి ప్ర - స్రవణ శైలమున
రాముఁడు దినములు - క్రమియింపుచుండె.
సాగె నుత్తరముగా - శతబలి మునుపు
వేగఁ దూఱుపునకు - వినతుఁడు చనియె.

అంగదాదులును బా - యక దక్షిణమునఁ
బొంగుచుఁ బవమాన - పుత్త్రుఁడు చనియె
మనసురంజిలఁ బడ - మటి దిక్కు గాఁగ
ఘనుఁడు సుషేణుఁడు - గదలె నాక్షణము
నలు దిక్కులందు వా - నర వీరు లట్లు
చలము బలంబు న - చ్చలమై చెలంగ
" నేనె రావణుఁ గాంతు - నేనె వధింతు
నేనె జానకిఁ దెచ్చి - యిత్తురామునకు "
ననుచు నందఱుచాల - కగ్గలికలను
జనుచు గర్జింపుచుఁ - జప్పరింపుచును
దాఁటుచు సింహనా - దములు సేయుచును
పేటెత్తి నగములు - పెకలఁ దన్నుచును
వాలంబు లార్చుచు - ఎడినొక్కరొకరు
గేలి సేయుచుఁ బంత - గించి పాఱుచును
మొరములు వేయుచు - మేని సోఁకులను
తరువులు గూల్చుచు - దఱుము లాడుచును
' నేల మీఱిందఱు - నీకార్యమునకు ?
జాలుదు నేన ' ని - జగడించుకొనుచు
' నను జూడుఁ డ ' నుచు పం - తంబు లాడుచును
' చనుఁడు మీయూళ్ళకు - సైన్యంబు ' లనుచు
' పాతాళమున నున్నఁ - బగవానిఁ ద్రుంచి
సీతను గానక - సేతు నేన ' నుచు
' నిల ప్రక్కలింతునో - యీ విశ్వమెల్లఁ
దల క్రిందు సేతునో - తను జూడుఁ ' డనుచు
' నామడ రెండు మూఁ - డామడలైన

నేమి ? దాఁటుదము ర - మ్మో' వను వారు
'రావణుఁ దోఁక నూ - రకఁ గట్టి రాము
దేవి మూఁపున నుంచి - తెత్త'ను వారు
'యెందున్న జానకి - నేఁడెత్తు నొకఁడు
పందెమాడునె!' యంచుఁ - బచరించువారు
'అందఱు నుండఁగ - హనుమంతుఁ బిలిచి
యింద యంచును జేతి - కిచ్చెనుంగరము
తానేమి యెఱుఁగు ? నిం - దఱు వానికన్న
హీనులే ? కనుఁగొంద - మిఁక' ననువారు
అతఁడేమి సేయు ? రా - జైనట్టివాఁడు
మితిలేని పొగడికల్ - మిక్కిలి పొగడ
కాఁబోలు ననుచు నుం - గరము చేతికిని
తాఁబిల్చి యిచ్చె సీ - తానాయకుండు !
కనుపించుకొను వేళ - గాదని తాళు
కొని యుంటినపుడు నా - కోపంబణంచి
చేరి చెక్కిలిఁ గొట్టి - చేతి యుంగరము
తేరోరి యని పల్కె - దినకరాత్మజుఁడు
తానేమి సేయునో ? - దశరథాత్మజుఁడు
తానేమి సేయునో ? - తెప్పె గార్యంబు !'
అనువారు 'హోరోరి ! - యది యేటిమాట ?
మనమెల్ల నాహను - మంతుని వాల
రోమ మాత్రము లేమె - ఱుంగమే యతని
సామర్థ్య మటుసేయఁ - జను' ననువారు
నగుచు వానరు లట్ట - హాసంబుచేత
గగనంబు పుడమియుఁ - గంపింపఁ గదలి

చనినఁ బ్రభాకర - సంతతిం జూచి
అనఘాత్మకుఁడు లక్ష్మ - ణాగ్రజుఁ డనియె
" ఏరీతి నెఱిఁగితి - వీ విశ్వ మెల్లఁ ?
దీనినే యొరులకుఁ - దెలుపు లేర్పఱుప ?
ఎన్నఁడు చూచితి ? - వెవ్వారిచేత
విన్నావు ? దివ్యవి - వేకమునఁ గాక !
పూసగ్రుచ్చిన యట్లు - భుజపత్రికలను
వ్రాసి పారము సేయు - నైఖరిఁ జిత్ర
పటము చెప్పిన యట్లు - పటుబుద్ధి చేత
నెటువలె వాకొంటి ? - విన్నదిక్కులను !
చూచి రేనియు నవి - సులభమే మదికి
గోచరించి వచింపఁ - గూడునే యట్లు ?
ఇంతప్రజ్ఞాశక్తి - యేరీతిఁ గలిగె ?
నంతయు వివరింపు" - మన రాముఁ జూచి
కరములు ముకుళించి - కలయట్టిరీతి
తరణితనూజుఁ డం - తయు విన్నవించె.

— సుగ్రీవుఁడు రామునకు సీతను వానరులు వెదకిన విశేషములను చెప్పుట —

" అయ్యా ! దుందుభికి మా - యన్నకు మొదట
కయ్యంబు నడచిన - కార్యమంతయును
విన్నవించితి గద - విబుధుఁడై యున్న
నన్ను మావాలి మి - న్నక యాగ్రహించి
తఱిమిన నతనిచేఁ - దాడికిఁ గాక
కొఱవి ద్రిప్పిన యట్లు - కుంభిని యెల్ల

దిక్కులు సాగర - ద్వీపముల్ దాఁటి
యక్కడక్కడ తమం - బవధిగా మఱలి
చేరఁ జోటెచ్చటఁ - జింతింపలేక
పాఱెడు తను జూచి - పవమానసుతుఁడు
మును మతంగుని శాప - మున ఋశ్యమూక
మను కొండచుట్టు మీ - యన్న రావెఱచు
నాయద్రిపై నున్న - నన్ని ఖేదములు
వాయుదమని పల్కె - పావని మాటఁ
జేసితి నటుగాన - చిత్తంబులోన
నేసర్వమును జూచి - యెఱిఁగి యుండుదును."
అనుచుఁ బల్కిన యంత - నన్ని దిక్కులకుఁ
జనిన వానరులు మా - సమితంబునకును
బాయక సీతను - బగలెల్ల వెదకి
రేయు సద్రించి కో - రిన ఫలావళులు
మెసవుచు నెందు భూ - మిజఁ గానలేక
యసురసుర్లై వచ్చి - నట్టమార్గమున
నందఱు వచ్చిరి - యా వినతుండు
'ముందుగాఁ బూర్వాభి - ముఖమునఁబోయి
తాఁగాన'నియె నం - తట శతబలియుఁ
'దాఁగానననియె ను - త్తరపు దిక్కునను.'
వారివెంబడిఁ దాను - వచ్చి సుషేణుఁ
డారీతి వచియించె - నర్కజుతోడ.
తమరు వోయిన పోక - తమవచ్చురాక
తమ యగచాటులు - తడవిరిగాని
యుండొక్కఁడైన నే - నవనిజఁ గంటి

నిందునన్నట్టి వాఁ - డెవ్వఁడు లేక
యాస దీఱఁగఁ బల్కు - నది విని మిగుల
గాసిచే రఘుపతి - కన్నీరు రాల్ప
నందఱు బ్రాణముల్ - హనుమంతు మాట
యందుఁ గీల్కొనఁజేసి - యడియాస చేత
"యెప్పుడు వచ్చునో - యీనెల గడుపు
తప్పె నాయనరాక - తామస బయ్యె
సీతను జూచి వ - చ్చినమేలు కాక
యేతరి వెదకితి - నెచ్చోటఁ గాన
నను నంతకన్న రా - నట్టిదేమేలు
తనచేనిలోని విం - దతి బ్రదుకులును"
అనుచు విచారింప - హనుమంతుఁడచటఁ
దన వెంట దారాంగ - దకుమారముఖులు
కూడి రాదన నది - కోటలు గిరులు
జాడల వెదకుచు - చవులైనయట్టి
ఫలములు మెసవుచుఁ - బతిచెప్పినట్టి
నెళవులఁ గాలూఁది - నిలువక తిరిగి
జనకిజఁ గానక - చనిచని కండుఁ
డను మునీశ్వరుని మ - హాశ్రమంబునకు
నందఱు గుమిగూడి - యరుదేర నచట
నెందెందుఁ జూచిన - నేమియు లేక
యతిఘోరతపము సే - యఁగఁ దొల్లి యతని
సుతుఁడీల్గుటయుఁ బుత్ర - శోకంబుచేత
నావనంబెల్ల మృ - గాంబు భూమీరు
హావళి యుడివోయి - యూవళినొంది

పాడఱుగాకని – పదరి శపింప
నాఁడాదిగా నిర్జ – నస్థలం బగుచు
నున్నది గాన వా – రొండక సీత
నన్నెలవుల నెల్ల – నారసి చూచి
కానక యొక్క రా – క్షసుని వీక్షించి
వానరవీరుల – వాఁడును జూచి
" ఎక్కటివారు ? మీ – రేఁటికి వచ్చి
చిక్కితి రిపుడు నా – చేతిలోపలికి ?
పోనిత్తునే ?" యని – పోడవుగా భయద
మైనట్టి తనదు బా – హాయుగళంబుఁ
జాఁచుక వచ్చు రా – క్షసుని వీక్షించి
కొంచవారక వాలి – కొడు కాగ్రహించి
చెకొద్ది రొమ్ము వ్రే – సిన సొమ్మసిల్లి
మోకరించుక ప్రాణ – ములు వోయి పడియె.
దానవుఁ బొరిఁగొన్న – తమ యువరాజు
వానరులెల్ల గై – వారముల్ చేసి
యాచుట్టు నెళవుల – నవనిజ వెదకి
యేచోటఁ గానక – యెల్లరు గూడి
యలసి యాకెలని మ – హామహీరుహము
చలువ నీడను వరు – సను గూరుచుండి
తనవారితో నంగ – దకుమారకుండు
తనువెల్ల నలసి కొం – దలముతోఁ బలికె.
" మనచేత నైన క్ర – మంబున రాజు
చనుమన్న చోటికిఁ – జని చూడుమన్న
చోటులు కలియఁగఁ – జూచి వేసరక

దాఁటుమన్న నగాళి - దాఁటి వాహినులు
చూడుచున్నవి యెల్ల - చూచి యేరీతి
నాడించె నటులెల్ల - నాడి యింతయును
రిత్త వోవంగ ధ - రిత్రీతనూజ
నిత్తరిఁ గనమైతి - మిఁక నేఁటి బ్రదుకు ?
కానలేమని పోయి - గడువునకైన
భానుజుఁ జేరిన - బ్రదికించు నతఁడు
మితమును మీరి భూ - మిజఁ గానకున్న
నతఁడుగ్రశాసనుఁ - డగుట యెఱింగి
జీవనాపేక్షలు - చెల్లునే యింకఁ
గావున నిదురయూఁ - కలి దప్పులుడిగి
వెదకుఁడు సీతను - విశ్వంబులోన !
పదరక చేతనా - పాటులఁ బడినఁ
గార్యమొక్కట దైవ - గతిని సిద్ధించు
మర్యాదమాని యే - మఱియున్నవారు
రామసుగ్రీవుల - క్రమము నాజ్ఞయును
మీనునంబులుకుందె - మేనులువాడె !
అలసితి మాకొంటి - మని ప్రాలుమాలి
చలువ నీడను సుఖ - శయనులై నారు.
వచియించితి" నటన్న - వాలినందనుని
వచనంబు విని మాల్యవ - వంతునిఁ జూచి
గంధమాదనుఁ "డిది - కార్యమాఁ బ్రాణ
బంధులైనను బట్టి - భానునందనుఁడు
తప్పిన దండించుఁ - దగదు రం"డనుచు
నప్పు డండఱు లేచి - యలయిక లేక

సీతను వెదకి ద – క్షిణముగా వచ్చి
ధౌతప్రభాధగ – ద్ధగితమై తమకుఁ
గనుపట్టెనో వచ్చి – కైలాసమనఁగఁ
దనరు రాజిత మహీ – ధరము నీక్షించి
యావెండికొండ డా – యఁగఁబోయి యెల్ల
తావులఁ జల్లని – తావులు చల్లు
కపురంపుటనఁటులు – ఖర్జూరములును
దపనీయ కమలశ్రీ – తళసరోజినుల
గనుఁగొని తమపని – గట్టెక్కెనని
యనువున నాకొండ – నందఱు నెక్కి
యాచాయ నుండునో – యవనిజ యనుచుఁ
జూచియుఁ గానక – చూతముగాక
చూతమున్నట్టి యా – చోటని డిగ్గి
శీతలంబైన యా – చెట్టుక్రిందటను
వెదకియుఁ గానక – వింధ్యాద్రిఁ జేరి
యదియును జూచి తా – రాంగదాదులఁ
దాఁగూడి పవమాన – తనయుఁడు గుహలు
వాఁగులుఁ గోనలు – వనములు చరులు
దక్షుఁడై వెదకి యా – ధరణీధరమున
రాక్షసు మాల ఘో – రద్వారమైన
బిలముఁ గన్గొని చేరఁ – బిలుచుచుఁ దార
నలనీలకుముదమైం – దద్వివిదులును
వాయుజుండును జాంబ – వంతుఁ డంగదుఁడు
నాయెడ గజగవ – యగవాక్షముఖులు
నందఱు గుమిగూడి – యాఁకట నొగిలి

యందుఁ బ్రవేశింప - ననువుగాకున్నఁ
జింతిల్లునెడ దడి - సినఱెక్కలను శ
కుంతముల్ బకహంస - కోయష్టికములు
మొదలైన యవిరాగ - ముదితులై బిలముఁ
గదియంగరాక యా - కడనున్న యొక్క
దనుజుని గేహముం - దటుఁ జూచుచుండ
హనుమంతుఁడా వాన - రావళిఁ జూచి,
"ఇదె వచ్చె జలపక్షు - లీగుహనుండి
నదియైన దోనయైన - నడబావియైనఁ
జెఱువైనఁ గొలనైన - సిద్ధమిచ్చోట
నిరవుకొన్నది చూడుఁ - డీ భూరుహములు
చెంగలించిన బాగు - చీకటుల్గదిసి
చెంగట మనకిది - చేరంగరాదు.
ఐన నేమాయె ? రం - డని" యాబిలంబుఁ
దాను మున్నుగఁ జొచ్చి - తనవారలెల్ల
వెనుకొని రాఁబోవ - విపులతేజములు
పనికిరావయ్యె నా - పాటివారలకు
మఱి పోవఁ బోవ ము - మ్మరముగా నెదురఁ
దెరవుఁ గానంగని - దివ్యతేజంబు
దిగదిగ వెలుఁగఁ జో - దృష్టింపలేక
మొగిడించి కన్నులు - ముందఱవెనక
కానక యొక్కఁడొ - క్కనిఁ గౌఁగలించి
మేనులు మఱచి యే - మియుఁ దెల్విలేక
యొకయోజనముమేర - యూరకపోయి
యొకరైన వాయెత్త - నోపక భ్రమసి

దగదొట్టి నాల్కలఁ - దడి లేక చాల
దిగులుతో దప్పివా - తెఱలెండఁ బాఱ
బ్రదుకుల యాస స్వ - ప్నములందు లేక
చదికలఁ బడువానిఁ - జదియఁ ద్రొక్కుచును
బడుచు లేచుచు గాలి - పట్టియే తక్క
కడమవారెల్ల న - గ్గలికలే కరిగి
యావలఁ జనుచోట - నరజామునకును
కావిరి విఱిఁగిన - క్రమముతోఁ దమకు
నలమట లెడవాసి - యజ్ఞానముడిగి
తెలివిడి వచ్చిన - దృష్టించునపుడు
కనుఁ బ్రోలఁ గాంచన - కలధౌతభూజ
వనములు చూచి యా - వలఁ బోవ హేమ
కమలముల్ నవరత్న - కర్ణికావళులు
విమలముక్తాఫల - వీచికా గణము
కలహంస చక్రవా - క క్రౌంచ మిథున
విలసనంబులు గల్గు - విపులదీర్ఘికలు
కాంచి ముందఱఁ జూడఁ - గనగన వెలుఁగు
కాంచన వప్రంబుఁ - గనక సౌధములు
మగరాల గోడలు - మణికుట్టిమములు
పగడాల కొణిగలు - పసిఁడి తల్పులును
బచ్చతోరణములు - బరువుముత్తియపుఁ
గుచ్చులు జల్లులు - గోమేధికముల
జాలకంబులు పారి - జాతప్రసూన
మాలికలును నీల - మయవేదికలును
పట్టుపటుధ్వజ - పాళిక ల్మణుల

మెట్టికలును హేము - మృగ చిత్రచయము
నవరత్నరథము లు - న్నత గోపురములు
భవనముల్ సావళ్లు - పడకిండ్లు తెరలు
పట్టెమంచంబులు - పఱపులు మేల్మి
పట్టు తలాడలు - బటువు బిల్లలును
మణిదీప కణికలు - మర్దలవేణు
పణవమృదంగాది - బహుసాధనము లు
రత్నకంబళ్లు ప - రంగి పీటలును
రత్నపాత్రికలు నా - రతి పళ్లెరములు
కాళికాగరు ధూప - గంధసంవాసి
తాళాంతరాళర - మ్య ప్రదేశములు
వివిధవస్తు సమృద్ధి - విపణివీథికలు
పువ్వులు కస్తురిగంధ - పొడికదంబములు
మదిరాఘటంబులు - మాంసరాసులును
పోదిగొన్న దధ్యాజ్య - పూర్ణకుంభములు
కాంచనరాసులు - గలిగిన యట్టి
కాంచనపురము చెం - గట విలోకించి
మందునకైనను - మానిసి కులము
పొందిక లేనట్టి - పురములోఁ జొచ్చి
హరివరుల్ కనకల - తావళితోడ
బెరస కెంపుల తేనె - పెరలు ముమ్మనుచు
నపరంజి తుమ్మెద - లాడ వైడూర్య
విపుల ప్రసవగుచ్ఛ - విశదమై కనక
కేసరామృతరసా - కీర్ణమై హేమ
భాసి రజోబృంద - భరితమై శాత

కుంభ నానాపక్షి - కోటియై కవక
సంభార ఫలనమ్ర - శాఖయై పొలుచు
నాక్కబీజమునీడ - నాసపరి చన్ను
జక్కవల్ చీరవ - స్త్రము మాటుపఱుప
మాయఁ గన్నులతోడ - మువ్వన్నె మెకము
మేయొల్పు జఘనంబు - మీఁద రాణింపఁ
జిగురు చేతులు కల్వ - చెలికాని లోఁ
సగమైన నుదుట నం - జలితోడఁ గూడ
కాఁక దీరుకడాని - కమ్మిరో యనఁగ
వ్రేఁకమౌ తనముచే - వెలుఁగు నంగమున
జాళువా పావల - చరణ పద్మములు
వాలిచి వ్రాల్పక - వనభూమి నెగయు
నుదిరి దుమ్మునఁ గప్పి - యున్నట్టి తపసి
ముదితను జూచి క - మ్మక వారలెల్ల
బెన్నిధిఁ గనుఁగొన్న - పేదయుఁబోలి
సన్నుతింపుచు నమ - స్కారముల్ చేసి
యందఱు గడనుండ - హనుమంతుఁడపుడు
ముందఱ నిల్చి కే - ల్మోగిచి యిట్లనియె

—· స్వయంప్రభా వృత్తాంతము ·—

"అమ్మ ! నీపేరెద్ది ? - యసహాయవగుచు
నిమ్మెనఁ దపమూన - నేమి గారణము ?
ఈపురం బెయ్యది ? - యెందు నెవ్వరును
జూపట్ట రదియేమి ? - చోద్యమేర్పఱుపు
దీనుల మముఁ గృపా - దృష్టివీక్షించి

మానుపు మొకమాట - మావిచారములు !
దేవతారమణివో ! - తెలుపు మావిపిన
దేవతవో ? నీవ - దిక్కుగా నిలుచు
నీపురలక్ష్మివో ! - యిపుడు మాపాలఁ
జూపట్టు పుణ్యమె - చ్చునఁ దీటినదియొ ?
ఆనతి యీవమ్మ ! - యవనిజ వెదకఁ
బూని సుగ్రీవు పం - పున వచ్చినాము
ఆఁకలి దప్పుల - నలసిన మేము
చీకటి బిలముఁ జొ - చ్చితిమి నిరాశ
నీరత్నరాసులు - నీహేమరాసు
లీరమణీయ మ - హీరుహంబులును
నీపట్టణమపార - హేమమాణిక్య
దీపప్రకాశ సం - దీప సౌధములు
నెవ్వరి సొమ్ము నీ - వింతియొ కాని
యెవ్వరు లేరిందు - నెందుఁ జూచినను
అనినఁ దపస్విని - హనుమంతుమోముఁ
గనుఁగొని యుచితవా - క్యముల నిట్లనియె.
"మాయావియైనట్టి - మయుఁడు పూర్వమున
నాయబ్జసంభవు - న త్మగుఱించి
తపము గావించి ధా - తవరంబుచేతఁ
జపలాక్షి హేమన - చ్చర జాతిదాని
దివినిఁ బట్టుకవచ్చి - తెరువెందు లేని
వివరంబుఁ గల్పించి - విపులాంతరమున
శైలంబుక్రింద కాం - చన రత్నమయవి
శాలమౌ నగరమీ - చాయఁగావించి

యాకొమ్మయును దాను - నరసుర లేని
యేకాంత సుఖముల - నెల్ల భోగముల
నొంటి కాపురము సే - యుచునుండ నతని
వెంటాడి తనచేఁబ - వి ప్రహారమున
గిరియును దొలిచి వా - కిలిచేసి మయునిఁ
బొరిఁగొని హేమను - బూఁదేరుమీఁద
నెక్కించుకొని యింద్రుఁ - డేఁగెడువేళ
నక్కొమ్మ నిచ్చెలి - నైనట్టి కతన
నను నుండుమనుచు నీ - నగరంబులోన
నునిచి తాఁబోయె నే - నున్నట్టి దాన!
మేరుసావర్ణి కూ - ర్మితనూజ నేను
పేరు స్వయంప్రభ - పెక్కేండ్లనుండి
మహనీయ యోగస - మాధిచే నిచట
విహరింతు వలసిన - వేళ నెందైన
నరుగుదు వేలుపు - లర్థించి చేరఁ
బరిచర్య సేతు సం - భావించి వారి.
ఎవ్వరివారు? మీ - రేనిమిత్తముగ
నివ్విపినమునకు - నేతెంచినారు?
బిలముఁ జొచ్చితిరే య - పేక్షచే? నేమి
వలసిన నిత్తు భా - వముల నున్నట్టి
పలుకులు మీకు దె - ల్పఁగ నాకు వినఁగ
నలవగునేని యే - నడిగితిఁ గాన
యన విని హనుమంతుఁ - డంజలిచేసి
వినుమని జడదారి - వెలఁదికిట్లనియె
"దశరథసుతుఁడు సీ - తానాయకుండు

శశివదనుఁడు రామ - చంద్రుండు తాను
తమ్ముఁడు బాగువయుఁ - దండ్రి వాక్యంబు
నెమ్మది నుంచి వ - నీభాగములకు
వచ్చి వసింప రా - వణుఁడు జానకిని
ముచ్చిలి కొనిపోయి - మోసపుచ్చుటయు
నారాఘవుండు సూ - ర్యతనూజుతోడ
పోరామి చేసి యి - ప్పుడుమమ్ము బిలిచి
'ధరణిజ వెదకుఁడు - దక్షిణ దిశను
సరగున రండు మా - సములోన మరలి'
అని మమ్ము బనిచి మా - యట్టివానరుల
నవిచిరి వెదుకంగ - నన్నిదిక్కులకు
నేము వచ్చిన వార - మెల్లచోటులను
భూమిజ వెదకి యి - ప్పుడు చాలనలసి
యీయెడఁ దడిసిన - యెఱకలతోడ
నేయిముద్దలవంటి - నీడజశ్రేణి
బిలము వాకిట తమ - పెంటులతోడ
వెలువడఁ జూచి మీ - వివరంబులోన
నీరము ల్గలవని - యేమిందుఁ జేరి
నీరంధ్రమగు తమో - నివహంబుఁజొచ్చి
వెలుఁగు లోపలఁ జిక్క - విధమునఁ బెద్ద
వెలుఁగులో నుడివడి - వెదకంగ లేక
ప్రాణముల్ పిడికిటఁ - బట్టుకకొంత
త్రాణఁ దెచ్చుకొని యం - దఱము నీవలికి
పాగి వచ్చితిమి కాం - చనపురిఁ జూచి
యోగిని! యొకకొంత - యూరడిల్లితిమి?

జలములానితిమి ర - సాలాది పక్వ
ఫలములు మెసవి తు - ద్బాధ వాసితిమి
ఎన్ని నాళ్లాయె మే - మిచటికి వచ్చి?
కన్నియ! మఱలిపోఁ - గానము తెరువు
దరిఁజేర్పు మమ్ము నిం - దఱి నీవు సేయు
పరమోపకారంబు - భావంబు లందు
నిలుపుటింతియె కాక - నేర్తుమే నీకు
కలకంఠి! ప్రత్యుప - కారంబు సేయ
వనచరులము గాన - వరకృపాదృష్టిఁ
గను" మన్న సావర్ణి - కన్నె యిట్లనియె.
శ్రీరాము కార్యంబుఁ - జేసెదమనుచుఁ
జేరిన మిమ్ముఁ జూ - చినయంతె చాలు
మీకేమి వలయు నీ - మేరఁ గల్గినవి
వాకొని కైకొని - స్వాదునీరంబు
నానాఫలంబులిం - దఱు దృష్టిఁ దీఱ
నాని పొందనవుఁడు - హనుమంతుఁడనియె.
"కమలాక్షి! మమువంటి - కపులకీ త్రోవ
నమరించితి వయాచి - తాతిథ్య మీవు!
అన్నిటఁ దృప్తుల - మైతిమిమమ్ము
మన్నించి దరిఁ జేర్చు - మార్గంబు గనుము
అర్కనందనుపి యా - జ్ఞాప్తుల మేము
కర్కశుఁడా రాజు - గడువును మీఱె
వెడలనంపుట పది - వేలు మాక" నుచు
నుడివినయట్టి హ - నూమంతుఁ జూచి
"ఏరికిఁ బోవరా - దిచటికి వచ్చి

మీరెల్ల నొక్కని - మేష మాత్రంబు
కన్నులు మూసుక - కదలకయుండుఁ"
డన్న వానరులెల్ల - నటుల సేయుటయుఁ
గరములఁ గన్నులు - గప్పుక యున్న
వారివీరవరుల మ - హాయోగశక్తి
బిలము వెల్వలఁదెచ్చి - పెట్టియూరార్చి
చలవ మాటలు వల్కి - "జలరాశి యిదియె!
ఇదె ప్రస్రవణశైల - మిదియె వింధ్యాద్రి
యిది యుదయాచలం - బిదియ స్తనగము
తెలిసికొండ" ని నాల్గు - దిక్కు లేర్పఱచి
వలసిన యెడకేఁగి - వత్తురు గాక
మేలు గావలయును - మీకెల్ల" ననుచు
చాలదీవించి కాం - చనగాత్రి చనిన
బయలుదేరిన యంత - భ్రమయును దీఱి
పయనమై జనకజఁ - బరికింప మనుచుఁ
జూచుచో వికచప్ర - సూనగుచ్ఛములు
కాఁచినకాయలు - కమ్మని పండ్లు
చల్లగాడ్పులును వ - సంతా గమమున
నుల్లసిల్లిన భీతి - నొంది వారెల్ల
మనముల "నాశ్వీన - మాసంబునందు
నినసూనుఁడనిచె నిం - కేమి చేయుదము?
పుష్యమాసము వచ్చెఁ - బోలు మరంద
నిష్యంద సూనముల్ - నిండె నీవనుల
మార్గశీర్షమొ యిది - మనకింక నేది
మార్గ?" మంచును దీన - మానసులగుచు

నందఱుఁ జింతింప - నంగదుఁడప్పుడు
తుందుడుకున వారి - తో నిట్టులనియె

—: సీతను వెదకి కనుఁగొనలేనందులకుఁ జింతిల్లి అంగదుఁడు
ప్రాయోపవేశము చేయనిశ్చయించుట —

"ఎంచనేమున్నది - యిఁకమీఁద ? కావ
రించి మించితిమి సు - గ్రీవాజ్ఞ మనము !
గడువు దప్పితిమి రా - ఘవు దేవినైనఁ
బొడగానమైతిమి - పొసఁగ బొంకుటయు
బుద్ధిమంతులు కార్య - బోధకుల్వంశ
వృద్ధులు నీతికో - విదులు ధార్మికులు
నుత్తమ గుణశాలు - లు సుకీర్తి నిధులు
మత్తారి వీరదు - ర్మానభంజనుల
కాలోచితంబైన - గతివివరింతు !
తేలనాడకుఁడు ప - దింబదిగాఁగ
నాలోచనము సేయుఁ - డర్కనందనుని
పాలికిఁ జని యాజ్ఞఁ - బడిపోవు కన్న
నిచట జచ్చుటయ మే - లింత లేదనుచు
నచటి కేఁగినఁ దాళఁ - డల్పదోషంబు !
సీతను వెదకి చూ - చినయది లేదు
మీ తెఱంగడుగ నే - మిటికింక నాకు ?
ఆతరువాత మీ - రైనట్లు కనుఁడు
ఏ తెరవునఁ బోతి - రేమి ? యామీఁద
ప్రాయోపవేశన - పరుఁడనై యిపుడె
కాయంబుఁ దొరఁగ ని - క్కడ శయనింతు !

ఇదియె మీకును బుద్ధి – యిండ్లు సంపదలు
మదవతుల్ తనయులు – మనలరాకలకు
నాసించి యుండుదు – రని వారి మీఁద
నాసలు సేయక – యవి తెగఁ గోసి
మఱలిపోవుద మను – మాట చిత్తముల
మఱవుఁడు రఘువంశ – మణి నన్నుఁ దెచ్చి
కరుణించి యువరాజు – గావించెఁ గాక
ఖరకరాత్మజుఁడు తాఁ – గావలెననుచుఁ
బట్టంబుఁ గట్టెనె – పట్టిగా యనుచు?
అట్టిచో నేమియు – ననలేక తాళి
కాదనఁగా లేక – కడకుఁ బొమ్మనియె
నేదైన నొకనేర – మెన్నెదననుచు
నందుపై నిదివచ్చె – నట్టె పొమ్మనుచు
నందురుగాని యా – యర్క వంశజులు
సీతఁగానఁగలేక – చేరిననన్నుఁ
జేతులఁబట్టక – చెదఱఁ ద్రోలుదురు!
అపుడు సుగ్రీవుచే – నగపడి మొదట
కపటంబుచే లేని – కల్ల పైమోపి
వాలికిఁ బుట్టినఁ – వాఁడని తన్ను
కాలుఁగేలునుఁ గని – గలుగఁ గొట్టించు
నేనేల పోవుదు ? – నీపుణ్యభూమి
మేను దొరంగుటె – మేలం" చు ననిన
నందఱు నంగదుఁ – డాడిన మాట
యందమౌ నిదియని – యతనికిట్లనిరి.
"ఉగ్రశాసనుఁడౌట – నోర్వఁడు తప్పు

సుగ్రీవుఁడపుడు రా - జులకిచ్చకముగ
నాజ్ఞసేయక మానఁ - డతివను బాసి
యజ్ఞుఁడై కామాంధుఁ - డైనరాఘవుఁడు
తనకేల యనుగాక - తగదుపొమ్మనుచుఁ
గనిపించుకొనఁడిల్లు - గానేల మనకు ?
చపలాత్ములై చేరఁ - జనుట కాదందు.
అపరాధులగువార - లధిపుల కడకుఁ
బోవుదమందని - పోరాదు మఱలి
చావ నేమిటికి ? మో - సమువచ్చె "ననుచు
ననిన తారాగ్రజుఁ - డైనతారుండు
తనకుఁ దోఁచియట్టి - దారి నిట్లనియె.

— తారుఁడు బిలములోనే యుండిపోవుదమని వానరులకు బోధించుట - వానరు లందుల కంగీకరించుట —

" ఎందును బోనేల ? - యీఋక్షబిలము
నందులో నుండుద - మందఱుఁ గూడి
ఇచ్చోట మనకు నె - య్యేవి లేవు ? మనసు
వచ్చినగతి నుండ - వచ్చు నెన్నటికి !
ఈరామసుగ్రీవు - లేల యింద్రునకుఁ
జేరవచ్చునె యిట్టి - చీకటి బిలము ?
కాదని వేఱొక్క - కడ కేఁగి యుండ
రాదు క్రమ్మరఁబోవ - రాదెఱింగియును ! "
అన విని యిదిబుద్ధి - యవునని మెచ్చి
వనచరు "లిదియె యె - వ్వరికి సమ్మతము

తనహాని కెవ్వాఁడు - తా సమ్మతించు ?
చనుద మచ్చటి కను - సమయంబునందుఁ
దప్పెఁగార్యంబని - తారుని మాట
కొప్పిన వానర - యూథంబుఁజూచి
యష్టాంగవజ్రమా - యనతనబుద్ధి
యష్టాంగములతోడ - నమరినవానిఁ
జతురుఁ జతుర్బల - సంపన్ను రాజ
చతురుపాయ సమర్థు - సాహసనిధిని
బలవంతుఁ బ్రాజ్ఞునిఁ - బాడ్యమిచంద్రు
వలె దినదిన వృద్ధి - వరలెడి వాని
మతి బృహస్పతిని కౌ - మారవయస్కు
నతిధీరు నంగదు - నమర నాయకుఁడు
మున్ను శుక్రుని బుద్ధి - మోసంబుఁదెచ్చు
కొన్నకై వడి నియ్య - కొని తారుమాటఁ
జెవినాని తానట్ల - సేయుదు ననెడి
యవివేకమునకుఁ దా - నసహిష్ణుఁడగుచు
సకలాగమాంతార్థ - శాస్త్రకోవిదుఁడు
సకలసద్గుణశాలి - స్వామికార్యైక
పరతుఁ డాశ్రితకల్ప - భద్రసంధాత
కరువలిపట్టి చెం - గటఁ జేర నేఁగి
యొకఁడెఱుంగకయుండ - నొకని బోధించి
వెకలి యాలోచన - విఱుఁగంగనాడి
భేదపుట్టించి తాఁ - బినతండ్రిఁ జేరఁ
గాదని యున్నయం - గద కుమారకుని

మాము చెప్పినబుద్ధి - మనసొగ్గి యున్న
యామహోమహునితో - హనుమంతుఁడనియె.

—. హనుమంతుఁ డంగదునికి తారునిమాటలు వినవలదని
హితోపదేశ మొనర్చుట :—

' ఏలయ్య ! తారేయ ! - యీబుద్ధినీకు ?
వాలితో సరియైన - వాఁడవు నీవు
యీరాజ్యమంతయు - నేలఁగఁజాలు
నేరుపు శౌర్యంబు - నీయందుఁ గలదు !
నీమాటలోపల - నిలుతురేవీరు ?
సామాన్యులే ? సత్త్వ - శాలులిందఱును. 5240
ఈగజుఁడీ నీలుఁ - డీ జాంబవంతుఁ
డీగంధమాదనుఁ - డీ సుహోత్రుండు
నీనలుఁడీమైందుఁ - డీ ద్వివిదుండు
నేనును గైకోము - నిన్నుఁ జేరికిని !
నీయాజ్ఞలోపల - నిలుతుమే మాకు
రాయలైనట్ట యా - రవిసూనుఁడుండ ?
స్వామికార్యహితంబు - సడలనేరుతుమె ?
ఏమని వింటివి - యీ తారుబుద్ధి ?
వీఁడిపుడిటులాడి - వెనకఁ దామంచి
వాఁడగు సుగ్రీవు - వద్దికిఁజేరి ! 5250
తిరుగఁబాటునకు నా - దినకరు సుతుని
సరిబల మున్నదే - జగడింతమనిన ?
నెవ్వరి సత్తువ - నీవు పోరెదవు ?
దవ్వు చేసెను బిన - తండ్రికి నిన్ను

వీనిఁ బట్టుక లోక - విశ్రుతకీర్తి
యైనట్టి సుగ్రీవు - నాజ్ఞ మీఱెదవు.
వలదన్న ! బుద్ధులు - వయసులరావు
తలఁచుకొమ్మిప్పుడు సీ - తానాయకుండు
సేయుమేలునకునై - సీమతోఁ బాటు
చేయాసగాక వం - చింప ధర్మంబె ?
పావనాత్ముఁడ వీవు - భగినీముఖోప
జీవి మాటలు వినఁ - జెల్లునే నీకు ?"
అని "యోరి ! తార ! యే - మంటి వీబిలము
మనకు నాధారమై - మనఁగఁ జోటగునె ?
మంచి మాటాడితి - మార్తాండ సుతుని
నెంచి రాఘవు నెంచి - యింద్రుని నెంచి !
వారికసాధ్యమీ - వసుధాబిలంబు
చేరరాదంటివి - చెల్లునామాట ?
అంతటికున్నదె - యలిగి పై వచ్చు
నంతకురీతి రా - మానుజుఁడొకఁడు
కుప్పికోలను దమో - గుహాయు నీయురము
దొప్పకై వడిఁ జించి - తునియలు సేయు !
మాయావియైనట్టి - మయుఁడు ద్వారంబు
సేయక యిచట వ - సించి యుండంగఁ
గులిశంబుతో వచ్చి - గుహ చేసి మయునిఁ
బొలియించి నటువలెఁ - బోవదు సుమ్ము
రాముసోదర మహా - స్త్రప్రయోగమున
నీమహాశైలంబు - నీఱిక్క బిలము

మణిమయ పురము నీ - మర్కటప్రభుల
క్షణములోపలను భ - స్మము సేయుఁగాని!
చెడుబుద్ధి యీరీతిఁ - జెప్పిన నిన్ను
విడిచి కాచితిఁ దార - విలపించుననుచు"
నని తాల్మివహియించి - యంగదుఁ జూచి
"వినవన్న! యువరాజ! - వీనిమాటలను
నీవిందు నిలిచిన - నిను బాసి కపులు
పోవుదు రిండ్లను - పొలఁతులఁ దలఁచి
యపు డొంటిగాఁ జిక్కి - యనదవై యున్నఁ
జపచపగాఁ జూచి - చౌకసేయుచును
నెట్టివారును నిన్ను - నెంచరుగాన
గట్టిగా నాబుద్ధిఁ - గైకొను మీవు
మావెంట వచ్చిన - మహికెల్లఁ గర్తఁ
గావించి పట్టంబు - గట్టి నిల్పుదుము
కపటము మది నెఱుం - గఁడు సత్యసంధుఁ
డెపుడు తారాదేవి - యెడఁ బ్రీతిఁగలఁడు.
ఆయమ్మఁ జూచిన - యందు హితంబె
సేయు సుగ్రీవుఁడు - క్షితియెల్ల నొసఁగి
యతఁడపుత్రకుఁడు నీ - వతనికి మాకు
గతిగాక యెవ్వరు - గలరిట మీఁద
తరతరమ్ముల వచ్చు - తగిన సంస్థాన
మొరుల మాటలు విని - యూడదన్నదవు!
ఏనున్నవాఁడ ని - న్నేమన్న నతఁడు
నానిలుకడనమ్మి - నావెంటరమ్ము!"
అని స్వామిహితము న - య్యంగదహితము

జనకజారామ ల - క్ష్మణహితంబునుగఁ
బవనజుఁ డాడిన - భాషణావళులు
చెవిసోఁక విని మదిఁ - జేపట్టి యలరి
చెంగటఁ దిగిచి మ - చ్చికఁ గౌఁగలించి
యంగదుఁడప్పుడా - హనుమంతుకనియె.

—: అంగదుఁడు తనకార్యము నిర్వర్తింపలేదని సుగ్రీవుఁడు కోపించునని కిష్కింధకు వెడలకుండ ప్రాయోపవేశము చేయఁ బూనుట —

" నీమాట కెదురాడ - నేరముగాని
నామీఁద నేరమె - న్నక పోఁడతండు
ఒరుల నిల్కడలు హి - తోక్తులు శౌర్య
నిరతులు మదినెన్న - నే భానుసుతుఁడు ?
ఎట్టివాఁడైన నీ - యిలమీఁదఁ దోడ
బుట్టిన జ్యేష్ఠుని - పొలఁతిని జూచి
తల్లిగానెన్నక - తానాస సేయు
క్షుల్లకు నొక్కనిఁ - జూచుటల్ గలదె ?
అట్టి యధర్మాత్ముఁ - డన్నకుఁబుట్టి
నట్టి కుమారు దా - యాది వీఁడనుచుఁ
జంపక మానునే ? - చచ్చిసాధిందు
సంపదలున్నవె ? - నాకులు గారె
నీవును వహ్నిము ? - నిలిపిన వంశ
పావనుఁడగు రామ - భద్రునితోడ
మొదటనాడినమాట - ములుచ వీఁడనుచు
బెదరించి సౌమిత్రి - పెడతల వేయ

వచ్చినప్పుడుగదా - వచ్చెనాపాలి
కెచ్చైన యుపకార - మెఱుఁగనివాఁడు
కడమవారల మీఁదఁ - గనికరంబుంచి
నడపునే యదికృత - ఘ్నతయౌనొ కాదొ ?
వెఱచికదా మీరు - వెదకఁ బొండనుచు
పరువులువారె నా - పదవచ్చినపుడు
పాపంబునకు నోడి - పనిచెనే మనల ?
నాపాటి దొరకు మ - ర్యాద యొక్కడిది ?
ఆరీతి నోఁగాము - లరయని వానిఁ
జేరునే బ్రదుకాసఁ - జేసినవాఁడు ?
అపరాధినగువాఁడ - నబలుఁడనెట్లు
కపినాయకుని సము - ఖమునకు వత్తు ?
పోయినఁ జంపక - పోనీఁడతండు
చేయిగాంచిన నుంచుఁ - జెఱసాలనైన
వేయేల ? ప్రాయోప - వేశంబె చాలు
నీయాన నమ్మరా - నేర నచ్చటికి
నిందునకు ననుజ్ఞ - యిందుమీరెల్ల
నందఱు పురమున - కరుగుఁడు మఱలి.
మ్రొక్కితి ననుచు రా - మునితోడ ననుఁడు
మక్కువసేయు ల - క్ష్మణునితో మీరు
తనమీఁదఁ గలిగిన - దయయెల్లనాఁడు
పనివింటి మనసులో - పల నిల్పుమనుఁడు
•తండ్రిని మఱపించి - దయఁ జూచినీవె
తండ్రివై మనుపుచోఁ - దప్పు చేసితిని

యటువంటి ద్రోహినే - మని వత్తుననుచు
నిటులైనయప్పుడు ని - న్నెంతయుఁ దలఁచి
తలవాంచి సాష్టాంగ - దండంబుఁ జేసి
తలఁచితి ననుఁడు మం - దఱ రమాపతికి
నేమని యనుముందు - నీమాట వినినఁ
దామున్నె మృతినొందుఁ - దార నాజనని
యాయమ నూరార్చి - యర్కజుచేతఁ
జేయించి యోర్చి ర - క్షించు కొమ్మనుఁడు
నామీఁదఁ గలుగు మ - న్ననయెంచి మీర
లేమర కాతార - యింటికిఁ బోయి
గ్రక్కునఁ దెలుపక - క్రమముగాఁ బలికి
పాకంగనీక నే - ర్పునఁ గాచికొనుఁడు.
అక్కడి పెద్దల - కందఱికేను
మ్రొక్కితి ననుఁడ’’ని - మున్నె తాఁ దెచ్చి
పఱచిన దర్భల - పై బవళించి
తొరిగెడు కన్నీరు - తో మోము తడియఁ
దారకుఁ దానొంటి - తనయుఁడఁగాన
నేరీతి బ్రదుకునో - యిటమీఁద ననుచు
మాటికిఁ జింతించి - మదిచిక్కఁ బట్టి
మాటలాడక హను - మంతుని యెదురఁ
గన్నులు మొగిడించి - కదలక యార్తి
నున్నయంగదుని ప్రా - యోపవేశంబు
కపులకుఁ బ్రాణాశ - కడకొసరింప
నపుడందఱును వాలి - నందనుఁ బొగడి
“ యింతవాఁడిటులైన - నీతనికన్న

నంత తీపయ్యెనె - ప్రాణము ల్మనకు ?
నితని వెంబడివచ్చి - యెడశాయనేల ?
నితఁడు వోయిన త్రోవ - నేపోద" మనుచు
దక్షిణాగ్రములుగా - దర్భలు పఱిచి
దీక్షించి వార్చి త - దీయపార్శ్వముల
వేర్వేరఁ బ్రాయోప - వేశముల్ చేసి
యుర్విపైఁ బవళించి - యూరుపులాని
తడపు నిగుడ్చుచు - దశరథతనయు
లడగక వచ్చుట - యవనిజఁ దోడి
తెచ్చుట రాముని - దేవి రావణుఁడు
ముచ్చిలించుట కపి - ముఖ్యులతోడ
సీతకై రాఘవుల్ - చెలిమి సేయుటయు
దూతల నలుగడఁ - ద్రోలి వానరులఁ
బిలిపించుటయుఁ దమ్ము - బిలిచి దక్షిణము
వెలువరించుటయు దే - వీ నిమిత్తముగ
నిందఱి బ్రదుకుల - కెసరులు వెట్టి
యిందుకునై విధి - యెన్నాళ్లుగాచె ?
అనిఁ జచ్చినదిగాదు - హా! యని మున్ను
జనకజఁ జెఱవోవ - శౌర్యంబు మెఱసి
యాజటాయువు రీతి - నడ్డంబు దూరి
యాజిలోఁ బడుటగా - దన్యాయములుగ
రాజభయంబుచేఁ - బ్రాణముల్ విడువ
యోజించితిమి దైవ - యోగంబుచేత"
ననుచు శోకాతురు - లై రోదసేయ

— అంగదునితో ప్రాయోపవేశము చేయుటకు సిద్ధముగనున్న వానరులను సంపాతి చూచుట —

వనచరధ్వని ఘన - ధ్వనిఁ బోలి నిండ
నాలించి వింధ్యగ - హ్వారములోఁ బెక్కు
కాలంబు మనిన వి - ఖ్యాతబలుండు
ఆజటాయువునకు - నన్న పక్షులకు
రాజు సంపాతి "యే - రావమో ?" యనుచుఁ
దానున్న యాబిల - ద్వారంబు వెడలి
వానరులను గాంచి - వారలీ రీతిఁ
బ్రాయోపవేశన - పరులగాఁ దలఁచి
" ఏయెడఁ జనరాక - యేనిన్నినాళ్లు
బిలములో నాఁకటి - బీదనై యుండఁ
దలఁచని తలఁపు రి - త్తకు రిత్త వీరు
నాచెంతఁ జేరి ప్రా - ణమ్ములు విడువఁ
గాచుక యుండ నా - కక్కఱిఁ బోవనీక
యందఱిఁ బ్రింగి నా - యాఁకలిఁ దీర్త
విందుచేసె విధాత - వీరిచేఁ దనకు !"
అను మాట లాలించి - హనుమంతుఁ జూచి
తన భీతిచే నంగ - దకుమారుఁడనియె.
"తప్పెఁ గార్యంబు సీ - తానిమిత్తముగ
నిప్పుడు మనమెల్ల - నెంచిన యట్టి
తలఁపును దైవయు - త్నము జతగూడి
పొలియక యటమున్నె - పొలియంగవలసె.
తినుమని వీని వా - తికి నగ్గమైతి
మినసూతి పూనిక - యీడేరదయ్యె

రాముని కార్యమా - రసిఁ బోయె మొదట
భూమిజకై పక్షి - పుంగవుఁడైన
యల జటాయువురీతి - నన్యోపకార
ములకునై యీదేహ - ము లొసంగలేదు,
ఊరక ప్రాణంబు - లొల్లక పోలియుఁ
గారణంబయ్యె నే - కైవడినైన
రామకార్యార్థమై - ప్రాణముల్ విడువఁ
గావింప నుత్తమ - గతులు చేకూడు."
అని "తండ్రిపనుపున - నడవికి రాక,
మునుకొని సుగ్రీవు - మొగము చూడంగఁ
దమకుఁ బోరానియుం - తయుఁ" గథాసరణిఁ
గ్రమముతో వినఁబల్కి - 'కైకేయి వలన
వానరప్రభులకు - వచ్చెగా! యిట్ట
హాని" యంచును "జన - కాత్మజ కొఱకుఁ
గనిపించుకొని పుణ్య - గతులకు నేఁగె
ననఘుఁడైన జటాయు" - వనుచు నీరీతిఁ
బలుమాఱు నార్తుఁడై - పలుకు నంగదుని
పలుకు లాలించి సం - పాతి యిట్లనియె.

— సంపాతి వానరులతో సంభాషించుట —

"మీ రెవ్వరయ్య? యే - మి నిమిత్తముగను
శ్రీరాము దేవేరిఁ - జెఱపట్టుకొనియె
దనుజనాయకుఁడు? నా - తమ్ముఁడైనట్టి
ఘనుఁడు జటాయు వే - క్రమమునఁ బడియె?
రాముని తెఱఁగు స - ర్వము వినవలతు

భూమీధరంబుపైఁ - బొడవున నుండి
శ్రీరామదాసులు - క్షితిక్రింద నుండఁ
గారాదు మీదువా - క్యంబులే వినఁగ.
కావున నన్నెఱ - కలు లేనివాని
లావునఁ బట్టి మె - ల్లనె డింపుఁ డిపుడు."
అనిన వానర వీరు - లాపక్షిమాట
విని తమ్ము మ్రింగునో - వీఁ డని యెంచి
యొప్పక తెంపుతో - నున్నవా రగుట
నప్పుడూహించి 'యై - నట్టులయ్యెడును
డింపుద'మని పట్టి - డింప నంగదుఁడు
సంపాతిఁ జూచి కెం - చక యిట్టులనియె.

—. అంగదుఁడు తన వృత్తాంతము సంపాతికిఁ జెప్పుట :—

"పక్షీంద్ర! మీతాత - బలసత్త్వశాలి
ఋక్షరజుండతం - డిరువురఁ గనియె.
వాలిసుగ్రీవుల - వైరంబు వుట్టి
వాలి సుగ్రీవుచే - వదలిపోఁదరమె ?
దశరథుఁడన నయో - ధ్యానాయకుండు
శశిముఖయగు కైక - చనవు చెల్లించి
యడవుల కనిచిన - నవనిజఁ గూడి
వెడలి రాముఁడు ఘోర - విపినంబులందుఁ
జరియించునపుడు ద - శగ్రీవుఁ డతని
తరుణి నెత్తుకపోవఁ - దా విలోకించి
యరికట్టి యొకఁడు జ - టాయువు వాని
విరథునిగాఁ జేసి - విల్లు ఖండించి

పెద్దవాఁడగుట ద - ర్పించి రావణుఁడు
గద్దించి రెక్కలొ - క్కటఁ ద్రుంచుటయును
ధరణిపైఁ బడియుండఁ - దమ్ముఁడుఁ దానుఁ
దరుణిపోయిన జాడ - తెలియ కేఁబడక
వచ్చి జటాయువు - వార్తచే నసుర
ద్రుచ్చిలికొనిపోవు - మూలంబెఱింగి
తమ తండ్రికాఁతఁడెం - తయు నాప్తుఁడతఁడు
తమకార్యమునకునై - తనువుఁ బాయుటయు
నరలేక పుణ్యలో - కావాప్తి కొఱకు
కరుణించి యగ్ని సం - స్కారంబుఁ జేసి
ముందుగానక ఋశ్య - మూకంబుఁ జేరి
యందుఁ జింతిలుచున్న - యర్కనందనుని
చెలిమి కార్యార్థియై - చేసి రాఘవుఁడు
బలిమిచే నొకకోలఁ - బడ వాలినేసి
భానుజుఁ గిష్కింధఁ - బట్టంబుఁ గట్టి
తానిల్వ నతనిపైఁ - దమకార్యభరము.
ఆ రవినందనుఁ - డన్నిదిక్కులకు
వీరవానరులను - వెదకంగఁ బనిచి
తము పొండనుచుఁ బంపె - దక్షిణంబునకు
సమరేంద్రతనయుఁడౌ - నావాలిసుతుఁడ
సంగదుఁడనువాఁడ - నర్కజుమాట
నంగీకరించి మే - మన్ని దిక్కులును
జనకజ వెదకి యె - చ్చటఁ గానలేక
పెనుదప్పిఁ జీకటి - బిలముఁ జొచ్చితిమి

మఱలి రాలేక క్రు - మ్మరు వారిఁ జూచి
కరుణించి ముని బాలి - కామణి యొకతె
దఱిఁ జేర్పఁ దత్ప్రసా - దమున నీకొండ
దఱి జేరితిమి మితిఁ - దప్పిన కతన
నుగ్రశాసనుఁడని - యూహించి మేము
సుగ్రీవుఁ జేరి యు - చ్చో నాజ్ఞ పడక
వెతఁదీఱఁ బ్రాయోప - వేశంబు సేయు
మతి నున్నవారము - మ్మలికతో" ననిన
నామాట వీనుల - నాని సంపాతి
యామర్కటేంద్రుల - కప్పు డిట్లనియె.

— సంపాతి తన వృత్తాంతమును చెప్పుట. —

“ ఎన్నినాళ్లాయె మే - మెడవాసి ! వింటి
నిన్నాళ్ళకు జటాయు - విటులయ్యెననుచు
నేనిది వినియు స - హించితి నిపుడె
దానవాధమునిఁ జే - తడియారకుండఁ
జంపి యీనూడు దీ - ర్చకయున్న నన్ను
సంపాతి యనుచు నెం - చఁగ నేమిఫలము ?
మాన్యవర్తనలచే - మదిమద నుండి
యన్యోన్యగమనజ - యాభిలాషలను
నన్నదమ్ములము వి - హాయస వీధి
నున్నత పథమున - నురువడి నెగసి
యిన మండలముఁ జేర - నేగఁ దపించు
తన సహోదరునిపై - దయయుంచి యేను
చాటు చేసితి విప - క్షములందు కతన

గాటంపు కొండలఁ - గమి లేని క్రియలు
యీవింధ్య బిలములో - హీనసత్త్వమునఁ
దావచ్చి పడితి నా - తమ్ముఁడెచ్చటికిఁ
బోయెనో యెఱుఁగ మి - ప్పుడువాని హాని
నో యయ్యలార ! మీ - యుక్తులవింటి
ననిన వాలితనూజుఁ - డావిహగేంద్రుఁ
గనుఁగొని పేరాసఁ - గ్రమ్మఱం బలికె.
"సీతకునై పొలి - సిన పక్షిరాజు
నీతోడఁబుట్టుట - నిజమయ్యె నేని
మాటవాసిగ నీవు - మహిసుత యిట్టి
చోట నున్నదియని - చూపి చెప్పినను
మమ్ము రక్షించుట - మము నంపి చాల
నమ్మిన సుగ్రీవు - నకుఁ గీర్తి యగుట
శ్రీరామునకు సీత - చేకూడుటయును
కారణమ్ములుగాఁగఁ - గల సుకృతంబు
నిన్నుఁజేరునటన్న - నీడజస్వామి
మన్నించి వారితో - మఱియు నిట్లనియె.
"క్షితిమీఁదఁ గన్నులు - చెఱచు దైవంబు
మతి యిచ్చినట్లు నా - మదిలోన నిపుడు
బుద్ధి చలింపదు - పోయెఁ గాలంబు
వద్ధుఁడనైతి నో - ర్వీర్యంబు లేదు
చేదోడు గావింపఁ - జేతఁగాకున్న
వాదోడుచేసి మీ - వాఁడ నేనగుదు.
బలిఁజేరి తా దార - వట్టి వామనుఁడు
యిలఁ గొల్చినది చూచి - యేనెఱుంగుదును.

అమృతవార్ధి మథించి - హరిదివిజులకు
నమృతంబుఁ బంచిచ్చి - నదియెఱుంగుదును
భావజారాతి తాఁ - బార్వతీదేవి
రివితోఁ బెండ్లియా - డిన దెఱుంగుదును
చేరి దిక్పాలక - శ్రేణి యందందుఁ
గోరి పట్టములుఁ గై - కొను టెఱుంగుదును
రావణు నెఱుఁగు ట - బ్రమె ? సీతయున్న
తావును మీకు ని - త్తరి వివరింతు
"హా ! రామ ! హా ! లక్ష్మ - ణా !" యనిపలుకు
నారీశిరోమణి - నల్లనివాఁడు
తొడలపై నిడుకొని - తొలుకారు మెఱుపు
వెడద మేఘంబులో - వెలుఁగు నట్లమరఁ
గొనిపోవఁ గంటి నీ - గుహలోన నుండి
తనకది యిప్పుడు - తలఁపులోఁ దోఁచె
శతయోజనము మేర - జలరాశిలోన
నతఁడుండు లంక యా - యన రాజధాని
యపరంజి కోటలు - నట్టి తల్పులునుఁ
విపులమాణిక్యన - వీన సౌధములు
లెక్కగాఁ గొనక ని - లింపులఁ బట్టి
మక్కుమారుచు దైత్య - మండలి గలిగి
యా లంక యొప్పు ది - వ్యజ్ఞాన శక్తి
చాలియుండును నాకు - సకలంబుఁ దెలియు
నిలమీఁది ధాన్యంబు - లేరుకో తినెడు
పులుగులు యోజనం - బునకు పైనెగయు.
నందుపైఁ బోవలే - వామీఁద నైదు

కందువల్ పక్షిమా - ర్గంబులు వినుఁడు
ఇది కుళింగములను - నెల్ల పక్షులును
వదలక చరియించు - వలదటుమీఁద
బలి భోజనంబుల - ఫలభక్షణముల
నలరు పక్షులకు రెం - డవ మార్గమొప్పు
క్రౌంచంబులును భాస - గణమును కురర
సంచయంబును నేఁగు - జాడ యామీఁద
పావురంబులు డేగ - పదుపునమ్మీఁదఁ
దేరినాలవజాడఁ - ద్రిమ్మరుచుండు
దానిపై త్రోవ గృ - ధ్రము లేఁగ నేర్చు
నా నెలవున మీరి - హంసముల్దిరుగు
ఆపైన గారుడం - బైన మార్గంబు
చూపట్టుఁ బక్షులీ - చొప్పున మెలఁగు
సప్తవాతస్కంధ - సంచారమార్గ
సప్తమస్థలములఁ - జరియింతు మేము
పక్షులు దివి నూట - పది యోజనముల
లక్షించుఁ దనుమేపు - లకు నుర్విమీఁదఁ
గలుగు నామిష మట్టి - ఖగజాతిఁ గలుగు
బలముచే జ్ఞానసం - పదచేత మాకు
గరుడండు పినతండ్రి - గావున నెల్ల
ధరణిపై మాకసా - ధ్యము లేదు చూడ!
అదె లంక! యదె సీత! - యసురభామినులు
బెదరింపుచును గాసి - పెట్టుచున్నారు
వాఁడె రావణుఁడు ది - వ్యవిరోధి తనదు
వేఁడిమిఁ గొలువులో - వెలుఁగుచున్నాఁడు!

అతఁడు కుబేరుని - యనుజన్ముఁ డతఁడు
క్షితియెల్ల మనుపనుఁ - జెఱుపశక్తుండు !
ఆరావణునిఁ గూల్చి - యవనిజఁ దెచ్చు
మీరాఘవుండు నా - మేటి దీవనను
జలధిఁ దాఁటునుపాయ - శక్తియే మీకుఁ
గలిగినఁజాలు లం - కానాథుఁ డెంత !
తమ్మునికిని వారి - దానంబుసేయ
నెమ్మదిఁ గోరితి - నేడబ్ధియందు
నాకోర్కి యీడేర్పఁ" - డనవారలతనిఁ
జేకొని జలరాశి - చెంగట నుంచి
కృతకృత్యుఁడైన ప - క్షివరేణ్యుఁ దెచ్చి
క్షితిధరాగ్రమునకుఁ - జేర్చియుంచుటయు
వాడిన చేలపై - వానయుఁ బోలి
నీడజోత్తము మాట - నిండు ప్రాణములు
పోకుండ మరల ని - ల్పుటయుఁ గూర్పుండ
వాకొని యాజాంబ - వంతుఁడిట్లనియె
"అయ్య! సుగ్రీవుని - యాజ్ఞకు వెఱచి
యియ్యెడఁ గపులెల్ల - నీ దర్భలందుఁ
బ్రాయోపవిష్టులై - పడియుండఁ జూచి
సేయ నేమియు లేక - చింతాపయోధి
మునిఁగి తెల్విడిఁ దప్పి - ముదుసలిఁగాన
వినసైతిఁ దెలియ నీ - వృత్తాంతమెల్ల
ఏమంటి ? వసురేంద్రుఁ - డెచట నున్నాఁడు !
భూమిజ నెందు ని - ప్పుడు గనుఁగొంటి ?
మాకేదిబుద్ధి ! యీ - మారువేసరక

వాకొను" మన జాంబ - వంతునిఁ జూచి
యుండఱు వినుచుండ - నపుడు వీనులకు
విందుగా సాంపాతి - వెండియుఁ బలికె
"జైవాతృకుఁడను ప - క్షంబులు కమలె
లావును లేదు చా - లదు జవశక్తి
కావున నీశైల - గహ్వరాంతరము
తావలంబుగ నుందుఁ - దన తనయుండు
నాహారమిడి నీర - మందిచ్చి యిట్టి
దేహంబుఁ బోషించు - దినము వేసరక
నతనిపేరు సుపార్శ్వుఁ - డందురు వాఁడు
హితబుద్ధి నాహార - మెద్ది యేతేర
వనములందుఁ జరించు - వాఁడొక్కనాఁడు
తనచేతి కేమియుఁ - దగలక ప్రొద్దు
పోటుకున గ్రుంకు న - ప్పుడు వచ్చి నిలువ
కటకటఁ బడి వానిఁ - గనుఁగొని యేను
నాఁకటి కోర్వక - యలిగి నేఁడేల
చీకటివేళ వ - చ్చితివి మైమఱచి?
ఏమిషంబున నుంటి - విందాక? నేల
యామిషం బిడవైతి - వాఁకలి మెఱిఁగి?
నీప్రాపుచాలు మే - నికి నేల వగవ?
ఓప నిట్లుండఁ బ్రా - యోపవేశమునఁ
దనువుపాతు నటన్నఁ - దనయుఁడు చాల
వినయంబుతోఁ దను - వీక్షించి పలికె

— సంపాతి సీతవృత్తాంతమును జాంబవంతునికిఁ జెప్పుట :—

"అయ్య! ప్రమత్తుఁడ - నై యేను గ్రొవ్వి
నెయ్యంబు మఱచి యుం - డి వాఁడ గాను
ఏను నింటియును మ - హేంద్రాద్రి గడచి
యీ నెలవుల మొత్త - నైనమాంసంబు
వెదకి కానక వార్ధి - వేలకుఁ జేరి
సుదతియు నేను వీ - చులవెంట దిరిగి
యొకయెడఁ గాలూది - యుండియు మీన
మొకటియు దొరకక - యున్నట్టి వేళఁ
దపనప్రభాగాత్రిఁ - దరుణి నొక్కతెను
నిపుణత నల్లని - నెమ్మోను వాఁడు
కొనిపోవ నార్తిచేఁ - గుంది 'హా! రామ!'
యనియు 'హా! లక్ష్మణా!' - యనియుఁ గూయిడుచుఁ
బోవుచో వాఁడు నా - పొంతకుఁ జేరి
యోవిహగేంద్ర! నూ - యూరికిఁ ద్రోవ
యెయ్యది? యని వేడ - నేనిట్టులనుచు
జెయ్యిచూపుటయు ద - క్షిణముగాఁ జనియె
కలన నోడినవాఁడు - కామినీమణులఁ
దొలగించు వాఁడును - ద్రోహంబు చేసి
చనువాఁడు దొఁగిలి - చనువాఁడు చంపి
చనువాఁడు త్రోవనే - చనుచుండిరేని
నెఱుఁగక భ్రమనొంది - యిట్టట్టు మఱల
దిరుగుచుందురుగాన - తెరవు నన్నడిగి
నప్పుడు దివినున్న - యమరులు వచ్చి
తప్పె నేటికి పురా - తన సుకృతమున

పరమసాధ్విని రామ - భార్యను వాఁడు
చెఱవట్టుకొని భీతి - చేఁ బోవు కతన
నూరక చనియెఁగా - కూరకచనునె ?
నీరామఁ గొనిపోవు - నే రావణుండు ?
ఇంతకు దీని వాఁ - డెత్తుకపోవు
నింతలో మఱలునో - యెఱుఁగరాదతని
పొలఁతిఁ జేకూర్చుక - పొమ్మందు నేల
నిలిచెద వనిపల్కె - నిర్జరశ్రేణి
మాటలు వినియేను - మగువయు నెగసి
యీలంకఁ జేరితి - మిదినిమిత్తముగ
నీకు నాహారంబు - నేఁడబ్బదయ్యె
కాకయుండిన నిట్టి - కల్ల సేయుదునె ?
అనుసుపార్శ్వుఁడు వల్కె - నప్పుడామీఁద
వినియుండి జానకి - వృత్తాంతమెల్ల
నసమర్థుఁడను వాక్స - హాయత గాని
యిసుమంత పనికైన - నేమిటివాఁడ ?
రామకార్యంబు పో - రానిది యైన
సామాన్యమతి నుంటి - శక్తి చాలమిని
శ్రీరామచంద్రుండు - చేత విల్లంది
నారాచ మొకటి సం - ధానంబు సేయ
దొల్లును దొంతుల - తోఁ జూర్ణమగుచు
నెల్లలోకములు మీ - రెఱుఁగరు గాక
యొకరి తోడాసించు - నో ? రాఘవునకు
నొకఁడసాధ్యము గల్గు - నో జగత్త్రయిని
యందుపై బుద్ధి బ - లాతి శౌర్యముల

కండంబులై మించు - కపివరుల్ మీరు
చేకూడి యున్నారు - సీత రామునకుఁ
జేకూర్పఁ గలరైనఁ - జెప్పెదమీకు
కొంచగాఁడని యెంచ - కుఁడు దశాననుని
ముంచి మీకీఁతలు - మోఁతలు చేయు
నతని ప్రతాప మిం - ద్రాదులకైన
నతి దుర్జయం బని - ద్రాహార కరగు
తామసం బేల ? య - త్నము చేసి మీర
లీమీఁది కార్యమూ - హించి కొండిపుడు
అని పల్కి యువరాజు - నంగదుఁ జూచి
" జనకతనూజాప్ర - చారమంతయును
నాకు నేర్పడఁ గార - ణము వినిపింతు
నీక " ని ఖగవంశ - నేత యిట్లనియె
" ఇనుని వేడిమిచేత - నెఱకలుగాలి
పొనుఁగుడువడి మూర్ఛఁ - బుడమిపైఁ ద్రెళ్ళి
యీవింధ్య బిలములో - నేడువారములు
చావుతో సరియైన - జాడ మేమఱచి
తెలిసితి నెనిమిదో - దినమున మేను
కలయఁ జూచితి విం - ధ్య గహ్వారంబగుట
నపుడు మెల్లనె నడ - యాడుచుఁ జెంతఁ
దపమొనరించు ను - త్తము నిశాకరునిఁ
జూచి యయ్యాశ్రమ - క్షోణి నెమ్మోను
వైచి యెన్మిదివేల - వత్సరంబులకు
నిట్టట్టు మెదలక - నెఱుఁగక పడిన
పట్టున నగజర - భావంబులోన

నున్నాడ నెప్పుడి - ట్లుంటి నాప్రొద్దె
యన్నిశాకరుఁడు సు - రాలయంబునకుఁ
జని యెనిమిదివేలు - సంవత్సరంబు
లనిమిషపురి నుండి - యట తరువాత
మఱలి యావింధ్యాఖ్య - మాధరంబునకు
నరుదేర నిచట సిం - హాదులై నట్టి
వనమృగ చయము పూ - ర్వాంబునఁ దమ్ము
మనిచి రక్షించిన - మచ్చికఁ జేసి
యాశ్రమమహిమచే - నన్నియు నచట
నశ్రాంతచిరజీవు - లై యున్నఁ దన
గని యెదురొ్కని నిశా - కరమానిఁ గొలిచి
చనుదేర దేవతా - సభలోన నున్న
యా విరించి యనంగ - నాశ్రమంబునకుఁ
దావచ్చి సకలబాం - ధవ జనకోటి
తనుజేరిరా మేరు - ధరణీశుఁ డనఁగ
మునివరుఁడచ్చోట - ముచ్చమునింగి
దరిదాపు లేక ప - త్రంబులు గమలి
ధరణిపైఁ బడియున్నఁ - దను దేఱిచూచి
తనగృహంబున కేఁగి - తడవుగా నచట
మనసొగ్గి నిలువక - మఱలంగ వచ్చి
నాచెంత నిలిచి పూ - ర్ణకృపా విభూతి
వాచంయమీంద్రుఁడో - ర్వీశ యిట్టులనియె
'అమరావతికి నేఁగు - నప్పుడు నీదు
క్రమము చూచియును శీ - ఘ్రమునఁ బోవలసి
యిచ్చోట నెటులున్న - మృతినీకు లేమి

యిచ్చలోఁ దెలిసి నే - నిచటికి మఱల
నేతేరఁ బనిగల్గి - యేమియు ననక
యాతరి మాటాడ - నైతి నీతోడ
నెచ్చటనుండుదు ? - వెవ్వఁడ ? వేల
యిచ్చోటఁ బడితివి - ఱూఁకియల్ గమలి
యగ్నిచేఁ గమలెనో ? - యనిల సంపాతిని
భగ్నమయ్యెనో నీదు - పక్షవ్రజంబు
తెలియఁబల్కు ' మటన్న - దీనతనతని
పలుకులు విని ప్ర - భావంబుచేత
మాటాడశక్తియు - మదిలోని యెఱుక
పాటునఁ బడిన యేఁ - బలికెదననుచు
మదినెంచు నప్పుడా - మౌని నాయకుఁడు
మది నెఱింగిన మాట - మాటక పలికె
' ఏమోయి ! సంపాతి ! - యెఱుఁగనే నిన్న ?
ఈమాడ్కి దురవస్థ - నేల పొందితివి ?
అనుజుఁ డైనట్టి జ - టాయువు నీవు
మును పొక్కనాఁడు నా - ముందఱ నిలిచి
రాజవేషములఁ దే - రఁగ వచ్చి మ్రొక్కి
పూజించితిరి నన్ను - పొందామరలను
దీవించి పనిచితిఁ - దిఱిగి రారైతి
రేవలనికిఁ బోతి ? - రిక్తైతివేల ?
ఎఱిఁగింపు ' మనిమౌని - నీక్షించి యేను
శరణంబు వేఁడి దాఁ - చక యిట్టులంటి
మునినాథ ! యన్నద - మ్ములము మాచేత
ననిపించుకొని విహం - గాధి రాజ్యంబు

పాలింపుచును వయో - బల గర్వములను
కైలాసమున కేఁగి - కాలానుగతిని
మాలోన మేము సు - మాళించి వాని
జాలంబు వినఁగ న - చ్చట నిరువురము
నినునిరథంబు వో - యిన జాడ నతని
వెనుక నస్తాద్రిఁ బ్ర - వేశించు దనుకఁ
బఱచుటకై యేము - పన్నిదంబాడి
యెఱకలు జాడించి - యెగసిన యపుడు
భోరను రవమొందు - బొదువ సపక్ష
మేరు మందరముల - మేరఁ జూపట్టి
మఱి పోవఁబోవ నై - మానికశ్రేణి
తెరువిచ్చి యొదుగుచు - దిగులుతోఁ జూడ
నాకాశమున నేఁగు - నప్పుడీ యవని
మాకంటి కొకబంతి - మాత్రమై తోఁచెఁ
బొడవునఁ జూడ నీ - భూమీధరములు
చిడిపిరాలనఁగ మిం - చెను జూపులకును
సైకపు నూలి పోఁ - చలువైచినట్ల
మాకుఁ గన్పట్టె సమ - స్త వాహినులు.
ఎచ్చట నెడలేని - యీవనశ్రేణి
పచ్చ బొట్లనఁగ నే - ర్పఱపరాదయ్యె!
ఆరీతి మిన్నుల - నరిగి భాస్కరుని
తేరు వెంబడిఁ బోవు - దివిజకామినుల
గ్రహముల ఋషుల వె - న్కను నైచి యుగ్ర
మహముఁగైన నడుమింటి - మార్తాండుఁ జేర
నెంతటి వెడలుపో - యీ మహీచక్ర

మంత్రమై కనుపట్టె - నతని మండలము
భానుబింబముఁ జేర - భానుతాపమునఁ
దానోరు దేఱచి సం - తప్తుఁడై సొరిగి
యలసిన యట్టి జ - టాయువుఁ జూచి
యిలమీఁదఁ బడకుండ - యేఁ జాటునిలిచి
యదరక మద్గరుఁ - డాతపత్రములఁ
బొదువుక మఱిలు న - ప్పుడు పద్మబంధు
కిరణాగ్నిచేత నీఁ - కియ లెల్లఁ గమలఁ
గొరలి వ్రాలితి వింధ్య - గిరి గహ్వరమున
నా జనస్థాన మ - హావనచ్ఛాయ
నా జటాయువు వ్రాలి - నటువలెఁ దోఁచ
నతఁ డేమియయ్యెనో ? - యటమీఁద నిందు
కతమున నాదు ఱె - క్కలు మాఁడిఁబోయెఁ
" కరుణింపవే ! నిశా - కరమానిచంద్ర !
శరణార్థి " ననుచు బా - ష్పములు నించుటయు
మానియంతముహూర్త - మాత్రంబు మదిని
ధ్యానంబు చేసి ' నీ - తనువున మఱల
బలమును వేగంబు - పక్షముల్ తోలుతఁ
గలిగిన క్రైవడిఁ - గలుగఁ జేసితిని !
అటులైన రామకా - ర్యార్థమై శైల
కటకంబునం దీవు - గాఁచియుండంగ
వలయుఁ గావున నేఁడు - వలదు నావరము
ఫలియించు మీఁద నా - పలుకేల తప్పు ?
రాముఁడు దశరథ - రాజనందనుఁడు
భూమిజతో వనం - బులకుఁ దావచ్చి

యున్నచో రావణుఁ - డోడక యతని
కన్నుఁగొని జానకిఁ - గైకొని పోయి
తన లంకయందు ను - ద్యానంబులోన
నునిచినచో సీత - యున్నకీలెఱిఁగి
యమరనాథుఁడు పాయ - సాన్నంబు దివ్య
మమృతపర్యాయ మ - హంబులయందు
నొరు లెఱుఁగకయుండ - నుర్వీతనూజ
కరమున కిచ్చి యాఁ - కలి నీరువట్టు
నలయికలును బాపి - యరుగు నాసాధ్వి
తలఁచని తలఁపుచే - తను నిల్చినట్టి
పాయసాన్నంబు వి - భాగించి రాముఁ
డాయెడ నుండిన - యందుచేఁ దృప్తి
గనుఁగాక యనుచు స - గం బుర్వినునిచి
తనపాలు నిత్యంబుఁ - దా నారగించు
నపుడు సీతాన్వేష - ణార్థులైవచ్చి
కపులు నీతోడ రా - ఘవ చరితంబు
వినిపించు నప్పుడు - విలసిల్లునీదు
తనువునఁ బక్షస - త్త్వజవాదికములు !
అందాఁక లోకహి - తార్థమై యుండు
మిందు 'నంచు ననుగ్ర - హించినాఁడతఁడు.
అతఁడు నాతోడ ని - ట్లానతియిచ్చి
యతిశయించెను కాల - మైదునూతేండ్లు.
ఎదు రెదురులు చూచి - యేనుమీరాక
మదిఁగోరియుంటి నే - మముఁ జేరఁగంటి.''
అనుమాటలాడియు - నాడకమున్న

తనువునిండఁగఁ బత - త్రంబులు మొలిచె!
లావుల వెంటనే - లావునువచ్చె
నావిహగేంద్రుఁడు - హనుమంతుఁజూచి
"యనుమానములు మాని యవనిజవెదకు
పనికి మీరుద్యోగ - పరులుఁ గావలయుఁ
బక్షముల్ మొలిచె నా - పైనది మీకు
సాక్షి మీకార్యంబు - సఫలమౌటకును
అనుచు టెక్కలతోడి - యద్రియుఁబోలి
పెనుమ్రోఁత రివ్వని - పృథివిపై నిండ
సంపాతి యెగసి కీ - శశ్రేణిఁజూచి
సంపూర్ణకాముఁడై - చదలఁ బోవుచును
"అదె! లంక! వాఁడె! ద - శాననుఁ డల్ల
యదె సీత! చనుఁడు మీ - రని వినఁబల్కి
పోయినఁ గపులెల్ల - పుటముగానెగసి
యాయద్రిపైనుండి - యవనికిదాఁటి
"సంపాతి మాటలు - చాల నమ్మితిమి
చంపఁజూచె నతండు - జలధి పాల్జేసి.
ఎక్కడి పని? మన - మెక్కడ? లంక
యెక్కడ? రావణుఁ - డెక్కడ? సీత
యెక్కడ? వానరు - లెక్కడ? పోవు
టెక్కడ?" యని కపు - లెల్ల వాకొనఁగ
నందఱుఁగనుఁగొని - యందుకుఁ దగిన
యందంబు మదినెంచి - యంగదుండనియె.

— అంగదుఁడు సంపాతిచెప్పిన రీతిని సముద్రమును దాఁటుటకుఁ దగినవారెవ్వరో యని విచారించుట —

"ఏల చింతించెద - రీ విచారమున?
జాలకు లెఱుఁగక - పాములఁ బట్టి
నాశమొందినగతి - నశియింతు రింత
ధీశక్తి వదలంగఁ - దీఱునే మనకు?
చాలశౌర్యము జూపు - సమయంబుగాని
జాలిఁబొందెడు నట్టి - సమయంబుగాదు.
ఇక్కమలాకరం - బెంత దాఁటుటకు?
ఱెక్కలు వచ్చును - గ్రీవాజ్ఞఁ దలఁప!
మనమెంత జడిసిన - మాపినతండ్రి
కిని దయవచ్చునే? - కినుకయే గాక."
అని మాటలాడుచో - నర్కమండలము
కనరాక యస్తాద్రి - కడకుఁ జేరుటయు
నా రేయి వా రని - ద్రాహారు లగుచుఁ
దూఱుపు తెల్లనై - తొలుసంజ వొడమఁ
గపులెల్లఁ దనుచుట్టుఁ - గదిసి యుండంగ
నపుడు వెండియునుఁ దా - రాత్మజుం డనియె.
"సభయులమైన కీ - శశ్రేణికెవ్వఁ
డభయ ప్రదాన మి - య్యఁగ సమర్థుండు?
ఇందఱి ప్రాణంబు - లిచ్చి వానరుల
బొందులతో నుంచు - పుణ్యమెవ్వరిది?
అక్కట! శతయోజ - నాయతంబైన
యిక్కమలధి దాఁట - నెవ్వఁడున్నాఁడు?

ఇనకుమారు ప్రతిజ్ఞ - యీడేర్చి యతఁడు
తనవాఁడుగా నుండు - ధన్యుఁ డెవ్వాఁడు ?
ఎవ్వాఁడు జానకి - నీక్షించి మఱల
నవ్వుమోమున వచ్చి - నన్నురక్షించు ?
సీతఁ జూచితి నని - శ్రీరాముతోడ
నితఱి నను ధన్యుఁ - డెవ్వఁడున్నాఁడు ?
రామసుగ్రీవుల - రక్షించు పాట
స్వామికార్యహితుండు - జగతి నెవ్వండు ?
ఓయయ్యలార ! యిం - దొకఁడేఱుపడినఁ
జేయెత్తి మ్రొక్కి కొ - ల్చెద నమ్మహాత్ము
నొక రేఱుపడరయ్య ! - యూరకయున్న
సుకరంబుగాఁగఁ దోఁ - చునె కార్యసరణి?”
అని యెంత వలికిన - నమ్మహాకపులు
మొనయక యొండొరు - మోములఁ గనుచు
నురకున్న వానర - యోధులఁ జూచి
మఱలఁగ వాలికు - మారుఁ డిట్లనియె.
“ మీరు కులీనులు - మీరసహాయ
శూరులు మీరు తే - జోబలాధికులు
స్వామికార్యహిత ప్ర - చారులు మీర
లేమియు వాకొన - కిటులూరకున్నఁ
బడుచువాఁడను మీదు - ప్రాపున వచ్చి
యొడలోముకొని మీర - లున్నచో నుండి
యందఱు మీరు న - న్నరయుచుఁ బిలిచి
ముందఱ నిడుకొని - ముద్దుగా నడుప
నున్నట్టివాఁడఁ బ - యోరాశిఁ జూచి

మిన్నక ననుఁ జాటి - మీరుంటిరేని
యేమగు నాచేత ? - నిది శక్తియనుచు
మీమీ తలంపుల - మితిగన్నయట్టి
జవసత్త్వములు వల్క - జలరాశి యొకఁడు
చవుకళింపంగ యో - జనసేయుఁ"డనిన
నామాట లాలించి - యంగదుఁ జూచి
తామొక్క రొకరెస - త్త్వంబుల కొలఁది
గట్టిగాఁ జూచుక - కలశక్తి మఱుఁగు
వెట్టక యొకపి - వీరులిట్లనిరి.

— వానరులు తమతమ బలమును నంగదునకుఁ దెలుపుట —

"పది యోజనంబుల - పాటికి జలధి
యదరక దాఁటుదు" - ననియె గజుండు
"వారాశి యే నిరు - వది యోజనముల
దారి"గవాక్షుఁడు - "దాఁటుదు"ననియె.
'పగ్గ లేమిటికి ? ము - ప్పది యోజనములు
తగ్గక"గవయుండు - "దాఁటుదు" ననియె.
"బరవసంబున నలు - వదియోజనములు
శరధి దాఁటుదు"వని - శరభుఁడు పలికె.
"బంధురశక్తి నేఁ - బది యోజనములు
కంధి దాఁటుదు"ననె - గంధమాదనుఁడు.
"నాకు నర్వది యోజ - నంబులుగాని
యాకడ మఱికూడ - దనియె"మైందుండు
"యోజింప డెబ్బది - యోజనంబులకు
నాజవంబనియె" ను - న్నతి ద్వివిదుండు.

నలుఁ "డెనుబదియోజ - నంబులుగాని
కలుగదా మీఁద-లా - ఘవమని" పలికె.
"నేను వృద్ధుఁడ సత్త్వ - హీనుఁడఁ జేత
నైన మాత్రంబు నే - నబ్ధిదాఁటెదను
నందుఁ దీఱెడిదేమి ? - యాదికాలంబు
నందు శౌరి త్రివిక్ర - మావతారమునఁ
జెలఁగుచో యేఁబ్రద - క్షిణము చేసితిని
తొలుత భానుఁడు తేరు - తోలుకపోవ
నదిమీఁటిపోవుదు - నని పోవఁబోయి
కదియు మేరువు నిర - కటమునఁ జనఁగ
మోఁకాలు నొచ్చె నా - మొదలింటి శక్తి
చేకూడ దిప్పుడీ - సింధువుదాఁట
ఇదిమేర యనవల - నేకాకయున్న
నుదధి యంతయు దాఁట - నోపుదుమొదటఁ
బాటుగాదిపుడు తొం - బది యోజనముల
పాటి దాఁటుదు మరి - పాఱదు శక్తి"
అని జాంబవంతుఁ డి - ట్లాడిన మాట
విని తనశక్తి భా - వించి యంగదుఁడు,
"చాలదు నూఱు యో - జనములు దాఁట
రాలేదు మఱలి వా - రాశి మీఁదటను.
అందునకై సంశ - యంబుతో మదినిఁ
గొందలపడుచు మీ - కొనక యున్నాఁడఁ
జనుదునే ?" యని పల్క - జాంబవంతుండు
మనములోఁ గలఁగి క్ర - మ్మఱ నిట్టులనియె.
"అంగద ! యీమాట - లాడుదురయ్య !

అంగద నిను నంప - నగునయ్య! మాకు?
ఏమెల్ల నటు మీఁద - నేమిటివార
మేము కొల్చినవార - మినుఁడవు నీవు
స్వామి భృత్యన్యాయ - సరణియూహింప
నీమాట వినవగు - నే మాకు నెల్ల?
బలిమిఁ గూఁకటివేరు - పదిలమైయున్న
ఫలవృక్షములను జొ - ప్పడు భూరుహంబు
దొర లెన్నయున్న హి - తుల్బాంధవులను
పరివారమును జేరి - బ్రదుకుచుండుదురు
నిన్నొక్కనిం బంపి - నిలుతుమే యిట్టి
చెన్నటి మేను లూ - ర్జితము లే మాకు?
రాజులఁ బనిఁగొను - బ్రజలు తుఁ గలరె!
పూజనీయుఁడవు మా - బోఁటివారెల్ల
నినుఁ జూచుకొని యుందు - నీదు సేమమునఁ
గనుగల్గి రక్షించ - గా నీతిగాక
యేము నెమ్మది నుందు - మీవు బొమ్మనుచు
నేమింతు మే యిట్లు - నీతిఁ బోవిడిచి
చాలింపు మిట్టి వి - చారంబు''లనిన
నాలించి మఱలంగ - నంగదుఁడనియె.
"ఏనూరకున్నచో - నెవ్వాఁడు వోవు
వానరప్రభుల స - త్త్వంబులు వినమె?
చేతగాదనువానిఁ - జెవిమెలివెట్టి
త్రోతమె యీయెడఁ - దోయధిఁ బడఁగ
దొరచేత నగుపనుల్ - దొరలు సేయుదురు
పరిజనుల్ చేసైన - పాటి తీర్పుదురు

మనకెల్లఁ గర్త యా - మార్తాండసుతుఁడు
పనిపూని వచ్చిన - భటులమిందఱము.
అతని యానతి మీఱ - నగునె యెవ్వరికిఁ
గతమిచ్చెనే నన్నుఁ - గడనుండు మనుచు ?
నీపని యితనిచే - నీడేఱు ననుచుఁ
జూపుము పనిగొమ్ము - చూచెదమతని ''
అనిన నందఱి మాట - నాలకింపుచును
దనకేమి పనియని - తలఁచిన కరణిఁ
గడనున్న వీరశే - ఖరు నాంజనేయు
వడిఁజూచి యాజాంబ - వంతుఁడిట్లనియె.

— సీతను వెదకుటకై జాంబవంతుఁడు హనుమంతునిఁ ప్రోత్సహించుట —

" ఏమయ్య ! హనుమంత ! - యేమియుననక
స్వామి కార్యహితంబు - సడలి యున్నావు
సామజోత్తమము దీ - ర్చఁగనైనపనికి
దోమలు పూని పొం - దునె కార్యసిద్ధి ?
నీచేతనగుపని - నీచేతఁగాక
నీచవానరులెల్ల - నిర్వహింపుదురె ?
మాదృశులకుఁ దర - మా ? వార్ధి దాఁటి
యీదృశకార్యంబు - లీడేర్తుమనఁగ ?
రామలక్ష్మణులకు - రవితనూజునకు
నీమేర సరివత్తు - వీ వెల్లయెడల
ధరణిభరంబెల్లఁ - దాఁబూనఁ జాలు
గరుఁడుఁ డొక్కఁడు విహం - గమ జాతిలోన

వానరజాతి స - ర్వరు నీడులేని
భూనుతశక్తి - సంపూర్ణుఁడ వీవు
వానరులేల దే - వమనుష్యదైత్య
దానవుల్ గూడి యం - దఱు నీకు సరియె?
వైనతేయుని యంత - వాఁడవు హెచ్చు
గాని మాయందు నొ - క్కరుఁడవే నీవు?
నీశక్తి యెఱుఁగక - నేఁడూరకున్న
కీశకోటికి నెల్లఁ - గీడావహిల్లు.

—: హనుమంతుని జన్మవృత్తాంతము :—

పుంజకస్థలియను - పూఁబోఁడిగాదె
యంజనాదేవి? యా - య్యలినీలవేణి
చక్కదనంబుఁ గే - సరిచూచి మెచ్చి
యక్కరతోఁ బెండ్లి - యాడె నవ్వేలఁది
మొదట నచ్చరనొక - ముని శపియింప
నదివచ్చి కుంజరుం - డను కపీంద్రునకు
మానవ తరుణియై - మహిఁ జనియించె
నానీరజేక్షణ - యపు డొక్కనాఁడు
గిరికందరంబులఁ - గేలీవిలాస
పరతచేఁ జరియింపఁ - బవమానవశతఁ
జేల తొలంగిన - శిబ్బెపు గుబ్బ
పాలిండ్లు నరఁటికం - బముల క్రొమ్మెఱుఁగు
వెదఁజల్లు తొడలు నీ - వీ బంధమూడి
ప్రిదిలినఁ దోఁచునా - భీవివరంబుఁ
బటువైన కటితటీ - భారంబు నడుము

గిటగిటయును జూచి - క్రేఁగన్నువైచి
యాలింగనము చేయు - ననిలునిఁ గాంచి
బాల పాతివ్రత్య - భంగభయమున
నోడఁబాటు చాలక - యొదుగుచోఁ బట్టి
విడువక "యోకొమ్మ! - వెఱవ నేమిటికి?
పవనుఁడ నేను దో - ర్బల శౌర్యశాలి
నువిద నీకొక పుత్రు - నొసఁగ వచ్చితిని
యహితంబు గాదు నీ - కని" యొడంబఱచి
బహుమాన మొనరించి - పవనుండు చనియె.
తరుణి యాప్రొద్దె మం - దర కందరమునఁ
గరువలి కృపనిన్నుఁ - గాంచె మోదమునఁ
బుట్టినప్పుడె నీవు - పొడుపు గుబ్బలిని
కట్టెఱవేఁ దోఁచు - ఖరకరుఁ జూచి
ఫలబుద్ధిచేఁ జేరి - పట్టెదననుచు
నులకగా మున్నూఱు - యోజనంబులకు
నెగసి భానుని వేశి - నెంతయు నీవు
బెగడంగఁ జేరఁగో - పించి యింద్రుండు
భిదురంబుచే వ్రేయ - భీమమైనింగి
నది వచ్చి నీవాము - హనువుఁ గొట్టటయు
తొడనొచ్చి యొకకొంక - తోడుతఁ గొట్టు
వడి పడియున్నచోఁ - బవమానుఁ డలిగి
యుర్విపైఁ దనమూర్తి - యుపసంహరించి
సర్వ జీవుల గతి - ప్రాణులఁ జేయు

దడ కట్టువడి జగ - త్త్రయమున నూర్పు
వెడలక ప్రతిమల - విధమున నున్న
జీవకోటులను జూ - చి విరించి వచ్చి
దీవించి నిన్ను నె - త్తి కవుంగిలించి
హనువు నొప్పియుఁ దీర్చి - యాదరించుటను
హనుమంతుఁడనెడి వి - ఖ్యాతి గాంచితివి.
అదిగాక దివ్యశ - స్త్రాస్త్రముల్ నిన్ను
బొదివి నాఁటకయుండఁ - బుడమి నెవ్వరును
నిను గెల్వకుండ మ - న్నింప నింద్రుండు
తన వరంబుగ నమృ - తత్వం బొసంగె
వాయువు తనయంత - వానిగా నిన్ను
నీయెడలఁ జరింప - నిచ్చె వరంబు
జీవకోటులను ర - క్షించి చైతన్య
భావము గ్గలిగించెఁ - బ్రాణంబు లిచ్చి
యట్టి యువధ్యుండ - వతి సత్త్వనిధివి
పట్టిన పనులు దీ - ర్పఁగ సమర్థుఁడవు
బుద్ధిమంతుఁడవు నే - ర్పును నీకె కలదు
యుద్ధకోవిదుఁడ వ - త్యుత్సాహనిధివి
క్షేత్రజుఁడవు నీవు - కేసరి కపికి
పుత్త్రుఁడవైతి గా - వున నౌరసుఁడవు
గావున నీసరి - గాము నేమెల్ల
లావున జవసత్త్వ - లాఘవంబులను
మును త్రివిక్రమునకు - ముయ్యేడు మారు
లొనరఁ బ్రదక్షిణం - బొనరించుకొఁజకు

నేకముహూర్తంబులో - నుర్విఁ బుట్టితిమి
సకలౌషధులును ప్ర - సన్నంబు లగుట
వయసు సత్తువయేల - వచ్చునెప్పటికి ?
రయమున పెద్దవా - రము గాన లేదు.
అన్న ! త్రివిక్రముఁ - డై మేను పెంచు
వెన్నుని గతి నీవు - విశ్వరూపంబుఁ
జూపి యావారిధిఁ - జులకఁగా దాఁటి
నీపౌరుషము లంక - నిండంగ డాసి
సీతను జూచి వ - చ్చినఁ గాక యొరుని
చేతఁ దీరునె యీయ - జేయు పౌరుషము ?
వానరులకును జీ - వములిచ్చి యభయ
దానంబొసంగుము - తడయ నేమిటికి ?”
అనుమాట లాలించి - యంజనాతనయుఁ

— జాంబవంతుని మాటలకు హనుమంతుఁడుప్పొంగి సముద్రము దాఁటుటకు నంగదుననుజ్ఞ వేఁడుట —

డనుపమోత్సాహ శౌ - ర్యవిజృంభణముల
వాలంబు మహి యద్రు - వంగ దాఁటించి
తాలేచి మితిలేని - తనమేను పెంచి
చెంత వానరులెల్ల - సింహనాదములు
గంతులు వినుతులుఁ - గావింపుచుండ
నట్టహాసముచేసి - యనిల నందనుఁడు
చుట్టును జెలరేఁగు - చుట్టాలఁ జూచి

"వాయునందనుఁడను - వాయువుంగాఁడు
నాయంతవాఁడ నం - తబలంబుచేత
సరిగాఁడు నాకు ఖే - చరగమనమున
గరుడఁ డన్యులుసాటి - గారననేల ?
దాఁటుదునే మేరు - ధరణీ ధరంబు
మాఁటమాత్రనె నభో - మండలి నెగసి
జలజంతువులతోడ - జలరాశియెల్ల
నిలఁ జేతులను జల్లి - యింకఁ జేయుదునె !
ధరణీతలంబు హ - స్తమునఁ బెకల్చి
శరనిధిలోవైచి - జలగడుగుదునె !
ఒకయడుగిచ్చోట - నొకకాలు లంక
నొకటనుండగఁ జిందు - లురకఁ ద్రొక్కుదునె !
త్రొక్కిన యడుగుల - తో నివి రెండుఁ
ద్రొక్కి నిల్పుదునె య - థో లోకములను !
ఉదయించు రవియుండె - యుండ నందుండి
కదిసి యస్తాద్రి క - క్కడికిఁ జేరుదునె !
దీవులు జలధులు - దిరిగి నల్దిక్కు
లీవలావల దాఁటి - యిపుడె చేరుదునె !
ఎగయుచో నామేన - నెసఁగు వాయువుల
నొగ డాకులన రాల్తు - నోవిమానములు !
ఇలప్రక్కలించి భో - గీంద్రునిఁ బట్టి
యెలఁ దమ్మితూఁడుగా - నెగరవేయుదునో !
ఎందున్న రవిచంద్రు - లిట్టట్టురాక
యుండె నిల్వఁగఁజేతు - లాని నిల్పుదునో !
అమ్మనంబులుగా కు - లాచల శ్రేణి

రెమ్మ పైపై నెగ - రించి యాడుదునొ!
ఇంకుండి యీలంక - కెగయుచో నిచటి
చందనాచల మహీ - జశ్రేణి వెంట
విడువకరాఁ దాని - వెంబడిచేత
నుడుమండలంబెల్ల - నొక్క మొత్తముగ
నిప్పుపువ్వులజాడ - నీమహిమీఁదఁ
గుప్పలుగా రాల - గుప్పగింపుదునొ!
ఎగయుచో ననుఁ జూచి - యీభూతకోటి
పొగడి వెంటనె పెడ - బొబ్బలు వెట్టి
దిని భువి నిండింప - దిగులుచే భ్రమసి
చెవులు మూసుకొనఁగఁ - జేతునోమిమ్ము!
మేరువుగతి నాక్ర - మించి మిన్నెల్ల
నీరంధ్రముగ నిండ - నేను జేయుదునొ!
గరుడవాయువు లొక్క - కడనైననాకు
సరియనవచ్చును - జవసత్త్వములను
మెఱపు తళుక్కున్న - మెఱచిన కరణిఁ
దిరిగివచ్చెదను నై - దేహినిఁ జూచి
మున్నుజూచెఁ ద్రివిక్ర - ముని జాంబవంతుఁ
డెన్నఁడు ననుజూచి - యిటమీఁద నతని
నాబుద్ధిజవబలా - న్నత్యముల్ మిగులఁ
బ్రాబల్యగతి కొనల్ - వారేని యెడల
గరుసు మీరెను భుజా - కండూతి తనకుఁ
దరణిసూనుండు కృ - తార్థతఁగాంచె నిపుడు
శ్రీరామలక్ష్మణుల్ - చింతలుదీఱి
యూరడిల్లుదు రింక - నుల్లంబులందు

లక్షయోజనములు - లంఘింతు మీరు
లక్షింపుఁ డల్లది - లంకాపురంబు
శతయోజనము లెంత ? - చంగున దాఁటి
హితముఁ జేసెద మీకు - నీక్షింపుఁ డిపుడు !
ఎదిరింపఁ గలదె బ్ర - హ్మేంద్రాదులైన
నిది యసాధ్యంబన - నెయ్యది నాకు ?
అమరావతికి నేఁగి - యమృతంబుఁ దెత్తు
నిమిషంబులో రాము - నికి వలెనన్న !
లంకాధిపతితో ని - లాసుత తోడ
లంక నా చేత న - లంకారముగను
పెకలించి తెత్తునో - పీఁచమణంచి
యొకరాక్షసుఁడు లేక - యుండఁగఁ జేసి !
రావణు నావాల - రజ్జువల్లరులఁ
జావకుండఁగఁ గట్టి - జానకీదేవి
నామూఁపుల నమర్చి - నమ్మించి సగము
జాములోఁ దెచ్చియీ - చాయ నిల్పుదునా !
ఊరకే రావణు - నూరెల్లఁ జూచి
శ్రీరాము దేవేరిఁ - జేరి యూరార్చి
వత్తునా యొకమాట - వాలినందనుని
చిత్తంబునందుఁ దో - చిన బుద్ధి యడిగి
వాకొనుఁ" డన జాంబ - వంతుండు భీక
రాకారుఁడైనట్టి - హనుమంతుఁ బలికె
"శరణు చొచ్చిన నీదు - చరణ పద్మముల
మఱఁగున నని యున్న - మర్కటోత్తముల

కంగదునకు నాకు - నానందమయ్యె !
మంగళంబగు గాక - మాయన్న ! నీకు
నినుఁ జేర్చెఁగాక మా - నిత జయలక్ష్మి !
కనుచాటు దాఁకక - క్రమ్మరుమయ్య
మమువంటి పెద్దల - మంచి దీవెనలు !
సమబుద్ధి వజ్రాంగి - సాధ్వున నీవు
చేకొని సంకల్ప - సిద్ధుఁడ వగుచు
నాకల్పమైన వి - ఖ్యాతిఁ గైకొనుము.
వానరులకు రఘు - వరులకుఁ బ్రాణ
దానముల్ చేసి కీ - ర్తనములు గనుము.
నీవాని నన్ను మ - న్నించి నామాట
నీవననిధి దాఁటు - మిచ్చటనుండి
జలధి దాఁటిన భూమి - చలియించుక్రుంగు
నిలువనేరరు కపుల్ - నీజవంబునకు
నీ మహేంద్రాచలం - బెక్కి యీకొండ
భూమిక్రుంగక యుండఁ - బుటముగా నెగసి
పోయిరమ్మన వాయు - పుత్రుఁడుప్పొంగి
యాయద్రిఁ జేరి శృం - గాగ్ర వీథులకు
నడుచుచో గులగుల - నగము గొంతాము
వడువున పట్టులు - వదలి ఘూర్ణిల్ల
బిలములు సందీక - పిచ్చుకగూళ్ళ
పొలుపునఁ గనరాక - పొడివొడి గాఁగ
గజసింహ గవయ సూ - కరలులాయములు

వజగజ వడఁకి న - ల్గడలను బఱవఁ
జఱలఁ గ్రీడించు ని - ర్జర మిథునములు
పఱవుతోడ విమాన - పంక్తులనేఁగ
వడిగల గతిఁగొప్పు - పడగలువిచ్చి
లెడనెడఁ గాలాహు - లెరమానిచూడ
నిజ బిరుదాంక వం - దిగణంబు రీతి
ద్విజకోటి మొగసి నల్ - దిక్కులఁ గెలయఁ
దపము సేయుచునున్న - తాపసశ్రేణి
యపుడు నిల్వఁగ రామి - నవ్వలికరుగఁ
జిత్తంబు వదలంగ - శిఖరంబు లెక్కి
యుత్తాలమగువాల - ముడుపీథి నార్చి
లంకపైఁ జూపుల - ల్లననిగుడించి
శంకింప కామ్రూల - జలరాశిఁ గాంచి
దాఁటెదనని వియ - త్తలము వీక్షించి
హాటకాచల నిభం - బైనగాత్రంబు
గిరిమీఁద మెఱయ న - గ్గింప వేలుపులు
కరువలిపట్టి య - గ్గలికతో నుండె
విలసిల్లె ననివేద - వేద్యునిపేర
నలమేలు మంగాంగ - నాధీశుపేర
నంచిత కరుణాక - టాక్షుని పేరఁ
గాంచనమణిమయా - కల్పుని పేర
వేదవేదాంతార్థ - విదితునిపేరఁ
నాదిత్యకోటి ప్ర - భాంగుని పేరఁ

గంకణాంగదరత్న - కటకాఢ్యపేర
వెంకటేశుని పేర - విశ్వాత్ముపేర
నంకితంబుగ వెంక - టాధీశచరణ
పంకజసేవాను - భావమానసుఁడు
హరిదాసమణి కట్ట - హరిదాసరాజు
వరదరాజు నితాంత - వరదానశాలి
రచియించు వాల్మీకి - రామాయణంబు
ప్రచురభక్తిని మదిఁ - బాటించివినినఁ
జదివిన వ్రాసిన - సభలఁ బేర్కొనిన
మదిఁ దలఁచిన నెట్టి - మనుజులకైన
ధారుణిమీఁద సీ - తారామచంద్ర
పారిజాతదయాప్ర - భావంబు వలన
హయమేధరాజసూ - యాదిమయాగ
నియతఫలంబులు - నిరతాన్నదాన
సుకృతంబు నిత్యయ - శోవైభవములు
సకలంక తీర్థయా - త్రాది పుణ్యములు
సత్యవ్రత పదంబు - సకల సౌఖ్యములు
నిత్యమహాదాన - నిరుపమశ్రీలు
కలికాల సంప్రాప్త - కలుష నాశనము
కలుములు హరిభక్తి - గౌరవోన్నతులు
శత్రుజయంబును - స్వామిహితంబు
పుత్రలాభంబును - భోగభాగ్యములు
ననుకూలదాంపత్య - మంగనాప్రియము
ధనధాన్యపశువస్తు - దాసీసమృద్ధి
మానసహితము ధ - ర్మప్రవర్తనము

నానందములు ఖేద - మందకుండుటయు
నలఘు వివేకంబు - నతుల గౌరవము
వలయు కార్యములు కై - వశము లౌటయునుఁ
భావనత్వము దీర్ఘ - పరమాయువులునుఁ
గైవల్యసుఖము ని - క్కముగాఁగఁ గలుగు.
ఎన్నాళ్లు ధారుణి - యెన్నాళ్లు జలధు
లెన్నాళ్లు రవిచంద్రు - లెన్నాళ్లు గిరులు
నెన్నాళ్లు నిగమంబు - లెన్నాళ్లు విశ్వ
మన్నాళ్లు నీకథ - యలరు నార్ద్రంబు.
ఆదికావ్యంబు సమ - స్తపూజ్యంబు
వేదసమానంబు - విశ్వసన్నుతము
నైన కిష్కింధా మ - హాకాండ మిపుడు
మానిత శ్రీలచే - మహినొప్పుగాఁత!

కట్టా వరదరాజకృతమగు
వాల్మీకిరామాయణమునందు
కిష్కింధాకాండము
సంపూర్ణము